

భారతి

సాహిత్య మాస పత్రిక

వ్యవస్థాపకులు
ోద్ధారక కాశీనాథుని
ేశ్వరరావు పంతులు

1962 జనవరి

సంపుటి: **39**
సంచిక: **1**

వెల ఒక రూపాయి

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జనవరి 1962

సంపుటము 39 : : సంచిక 1

విడిప్రతి వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జనవరి 1962

గమనిక

ప్రచురింపబడని రచనలు తిరిగి పంపగోరువారు తగినన్ని తపాలాబిళ్ళలు జతపరచవలెను. రచయితలు తమ చిరునామా మార్పులు వెంటనే తెలియజేయ ప్రార్థితులు.

స్వవిషయము

భారతికి ఇది ముప్పది తొమ్మిదవ యేడు. ముప్పది ఎనిమిదేండ్లుగా ఆంధ్ర భాషకు, సాహిత్యమునకు, చరిత్ర పరిశోధనకు భారతి యథాశక్తిని సేవచేయుచూ వచ్చినది. ఈ సేవలో పరిపాకమును చెంది భారతి ఒక పత్రికామాత్రముగా కాక ఒక సంస్థగా రూపుపొందినది. తెనుగు జాతి సాహిత్య జీవనమునకు దర్పణమైనది. ఆ జీవనపు హెచ్చు తగ్గులే భారతి యందును ప్రతిఫలనము చెందినవి.

మరి సాహిత్యకృషిలో దేశస్వాతంత్ర్యమునకుముందు తెలుగు దేశముననెట్టి ప్రతిభోత్సాహములున్నవో, అవి ఇప్పుడు అంతగా కానవచ్చుట లేదు. భాషమీద గాని, భావముమీద గాని, అభివ్యక్తియందు గాని, అధికారులు ఇప్పుడు సన్నగిల్లినారు.

ముఖ్యముగా కవులు, కథకులు, నాటకకర్తలు, వ్యాస రచయితలు, విమర్శకులు కూడ ఎంత చూచినను ప్రాతపుంతలనే బట్టి నడచుచున్నారు. క్రొత్త యేమైన నున్నచో నది తెచ్చిపెట్టుకున్నట్లుండి, నైసర్గికతను వెలార్చుటలేదు.

ఇతర దేశములను చూచినచో నచ్చట బహువిధ నూతనసాహిత్యప్రక్రియలుత్పన్నము లగుచున్నవి. నూత్నవిజ్ఞానము సాహిత్యమునకు దోహదకారియగుటయే కాక, విషయము కూడ నగుచున్నది.

మన దేశమున అట్లు జరుగుటలేదు. అంతయును అవ్యవస్థకు భాజనమగుచున్నది. ప్రాతలో లోతులకు పోవుటలేదు. క్రొత్త వచ్చినదో దానికి బాధ్యత లేదు. ఇందునను అందునను సర్వాంకషమగు పరిచయము లేమివలన సర్వమును దుర్విషయముగ పరిణమించుచున్నది.

రచింపబడు గ్రంథములలో తెలుగు జీవితముయొక్క సమగ్ర స్వరూపముగాని, సమాజాంతర్గత పరిణామములు గాని ప్రతిబింబించుట లేదు. రచయిత ద్రష్టయై, ప్రతిభను పండించుట శక్తివిహీనమగుచున్నది. ప్రతిదియు ఎక్కడనుండియో ఏదియో ఎరువు తెచ్చుకొన్న పద్ధతిగా జరుగుచున్నది. దేశమును చూచి, దానిని సాహిత్యములో రసస్ఫూర్తముగ వర్ణించుశక్తి ఎచ్చటను కనపడుటలేదు.

అసలు ఈ వర్ణనాత్మక రచనా పాటవమే ఇప్పటి రచయితలకు అలవడలేదు. జీవితమును తరచిచూచి, దానికి సాహిత్యములో రూపమును దిద్దుశక్తి, ఆశక్తిగల రచనలు అల్పములై పోవుచున్నవి.

భారతీయమైన పురాశాస్త్రముల యందుగాని, అధునాతనమైన విజ్ఞానాదిక శాస్త్రములయందు కాని నికషమగు పరిచయము కలవారు అరుదైపోవుచున్నారు. ఈ రెండు జ్ఞానములును ఒక్కచో తారసిల్లుటయే లేదు. ఏ విషయమును గురించి కాని ప్రత్యేకమైన కృషి అధ్యయనము జరుగుచున్న పద్ధతియే గోచరము కావుటలేదు. వీరు ఇందులో పండితులని చెప్పతగినవారు ఇప్పుడు ఎందరున్నారు? అందువలన మన సాహిత్యము పొందతగిన స్థాయిని పొంద

లేక పోవుచున్నది. విస్తరణము చెందలేకను పోవుచున్నది.

ఈ స్థితిలో తెలుగు సాహిత్యజగత్తు జడతను భజించినదన్నచో, అది అతిశయోక్తి కాదు. ఇందుకు కారణము సాహిత్యములోనను, జీవితములోనను, రాజకీయములకు, రాజకీయ నాయకులకు ఇప్పుడు ఏర్పడిన ప్రాధాన్యమే కారణమేమో నని పించుచున్నది. మన దేశముననే కాక రాష్ట్రములో కూడ రాజకీయనాయకులు సాహిత్యవేత్తలైనట్లు మాట్లాడుట, సాహిత్యమును శాసింపబూనుట ఈ స్థితికి కారణమన్నచో దోషము కాదు.

అంతియుగాక, సాహితీపరులు కూడ రాజకీయవేత్తల చుట్టును ప్రదక్షిణములుగా తిరుగుచు నదియొక గౌరవమని భావించుచుండుటను కూడ చూచుచున్నాము. ఇది మరియొక కారణము కావచ్చును.

ఇచ్చట రాజకీయవేత్తలను గాని, మరియొక్కరిని గాని అనుచున్నది లేదు. రాజకీయవేత్తలు, సాహితీవేత్తలు కావచ్చును. కాని ఆ శక్తి ఎందరికున్నది? ప్రపంచములోననే ఇది అరుదు. ఈ విషయమును రాజకీయ వేత్తలు గ్రహించకపోవుట సరే? సాహితీపరులును గుర్తించుటలేదు.

మరి ఈ రాజకీయవేత్తలు రాజకీయముగా తమకు దక్కిన అధికారముచేత ఒక్క సాహిత్య జీవనమునే కాక, సర్వమగు జీవితమును శాసింపగలమను భ్రమలో పడుచున్నారు. ఆ భ్రమవలన జనించిన విపరీత తత్త్వమువలన సాహిత్యజగత్తు స్తబ్ధతను భజించుటగా పరిణమించుచున్నది.

ఈ స్థితిని సాహిత్యమునుండి తొలగజేయగలుగుచో, భారతికి కావలసిన లేదు. అందుకు భారతి ఎప్పటివలెనే యథాశక్తిని కృషి చేయగలదు. భారతి ఒకసంస్థ గనుక దానికి రాగవిరాగములుగాని, ఈర్ష్యాద్వేషములుగాని లేవు. తెలుగు భాషకు, సాహిత్యమునకు, సంస్కృతికి, సర్వతోముఖముగ సేవ చేయుటయే భారతి లక్ష్యము. ఇందుకు తెలుగువారి ఆదరాభిమానములను భారతి ఆకాంక్షించుచున్నది. జరిగిన ముప్పది ఎనిమిది సంవత్సరములలో వలెనే, ఇప్పుడును, ఇకముందును కూడ, ఇవి పుష్కలముగ లభించగలవనియే ఆశలు పెంచుకొనుచున్నది.

లిపిసంస్కరణము

"ఆంగీరస్"

తెలుగు లిపిని సంస్కరించుటకు ఆంధ్ర ప్రభుత్వమువారు 1958 లో శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు అధ్యక్షులుగా ఒక సంఘమును ఏర్పాటు చేసినారు. ఆ సంఘములో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, విద్వాన్ శ్రీ కె. సుబ్బరామప్పగారు, డా॥ జి. వి. కృష్ణారావుగారు, శ్రీ పెద్దింటి రామస్వామినాయుడుగారు, శ్రీ పప్పూరి రామాచార్లుగారు, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు సభ్యులు. వీరు రెండుమూడు సంవత్సరములు గట్టి కృషి చేసి ఒక నివేదికను ప్రభుత్వము వారికి సమర్పించినారు. ప్రభుత్వమువారు దానిని 1961 డిశంబరు 11 వ తేదీ గెజెట్ లో ప్రకటించినారు.

స్వవిషయము

ఈ రెండు మూడు సంవత్సరాల నిడివి కాలంలోను ఈ సంఘము పరిశీలించిన అంశాలు ఇవి: (1) ప్రింటింగు, లినో ప్రింటింగు, టైప్ రైటింగులు సమర్థనీయం గాను, శీఘ్రంగాను, చవుకగాను జరుపుకొనేందుకై తెలుగు భాషలో ప్రస్తుతం వున్న అక్షరాలను సంస్కరించడం అవసరమా? అవసరమైతే, ప్రస్తుత అక్షరాల-లిపి సొంపు, శాస్త్రీయ రూపం చెడకుండ అది ఏలా సాధ్యమౌతుంది? (2) సంస్కరింపబడిన తెలుగు లిపి-అక్షరాలు ప్రజలకు-ప్రభుత్వానికి ఆమోదయోగ్యమైతే, దానిని దశలవారీగా అమలుపరచటానికి కార్యక్రమం ఏమిటి? (3) నూతన తెలుగు లిపిని-అక్షరాలనూ, తీవ్రంగానూ, వీలైనంత స్వల్పకాలంలో ప్రజారంజకం చేయడానికి ఏమి చర్యలు తీసుకోవడం అవసరం? (4) కన్నడ, తెలుగు భాషలకు రెండింటికి ఒకే లిపిని రూపొందించడానికి తీసుకోవలసిన చర్యలు-ఈ అంశాలను పరిశీలించి సంఘంవారు గెజెట్ లో 43 పుటలు వచ్చిన నివేదికను తయారు చేసినారు.

అయితే, ఈ సంఘమువారు లిపిని సంస్కరించి నిర్మించిన అక్షరములు పరమ అందవికారముగా నున్నవి.

ఈ లిపి తెలుగు, కన్నడములకుకూడ ఉపయోగపడునని వీరి అభిప్రాయము. కాని ఇంతవరకును మైసూరు ప్రభుత్వము తమ అభిప్రాయమును ప్రకటించి యుండకపోవుట ఇక్కడ గమనించదగిన విషయము.

ఈ సంస్కరణములవలన తెలుగు వర్ణములలో దాదాపు డెబ్బది అక్షరములు తగ్గునని అంచనా వేయుచున్నారు. ఆ తరిగిన వానికి వేరే గుర్తులను ఏర్పాటు చేయుట జరిగినది. ఆ గుర్తులను చేర్చిన అక్షరముల తోడి వర్ణమాల అరణ్యమువలె నున్నది.

ఇప్పుడు వాడుకలోనున్న మోనో టైపును చూచినచో, అందులో 'ఓ' 'ఠ' మొదలైన కొన్ని అక్షరములు తప్ప అన్నియు సాధ్యముగానున్నవి. అట్లు చూచినచో ఈ సంస్కరణమే అనవసరమగు చున్నది.

ఇన్ని అక్షరములున్నచో అచ్చు కూర్పుట ఆలస్యము కాదా అన్నచో, డెబ్బది అక్షరముల తగ్గినంతమాత్రమున ఒరిగినవచ్చుచున్న దేమియన్న ప్రశ్న యుండనేయున్నది.

అందువలననే ఇట్టి సంస్కరణములు ఎవ్వరికిని రుచించుటలేదు. లిపి దానియంతట యది సంస్కరణము చెందుట ఒక విషయము; దానిని కొందరు కూరుచుండి తమ ఇష్టము వచ్చినట్లు సంస్కరించుట మరియొక విషయము. ఒకటి సహజము. మరి యొక్కటి కృత్రిమము. కృత్రిమమైన దేవుడును సజీవముగా నిల్వదు.

మరియు కన్నడమునకును, తెలుగునకును ఒకే లిపి యేల యుండవలయునో అర్థమగుటలేదు.

ఇదిగూడ జాతీయముగా నేకతను సాధించుటకు మార్గమన్నచో, అంతకన్న హాస్యాస్పదమైన దింకొక్కటి యుండదు.

ఇట్టి సంస్కరణములవలన జాతీయముగా ఏకత కుదిరివచ్చుననుట, మన్నిత

ములకు చింతకాయలు రాలునన్నట్లుగా నుండును.

ఇట్టి కృత్రిమ సంస్కారణములును, వానిని అనుసరించి జరుగు ప్రయత్నములును వ్యర్థములని, నిరూపయోగములని వేరుగా చెప్పవలసినది లేదు. అనుభూతి దఘ్నముగాని రచన ఎట్లు వ్యర్థమో, అక్షర రమ్యత లేని లిపియునట్టులే నిరర్థకము. భాషా శరీరము సుష్ఠుగా లేని రచనవలె, రమ్యమైన అక్షరములులేని లిపియు వెగటునే కల్గించును. ఇట్టి సంస్కారణములను తెల్గువారు ఎన్నడూ ఆమోదించరు. వానివలన జరుగు మేలుగూడ లేదు. తిరిగి అందరు ఈ అకవి అక్షరములను నేర్చుకోవలసి వుండుటయును బాధతప్ప ఇందులో సుఖములేదు.

ఏ భాషకు ఆ భాష అక్షరములు ఒక ప్రత్యేకతను చేకూర్చుచున్నవి. షార్ట్ హేండు మొదలైన సాంకేతిక లిపులకు వేరు అక్షరములుండవచ్చును. కాని అనూచానముగా వచ్చుచున్న అక్షరములను కృత్రిమముగ మార్చుటలో అర్థములేదు. మరి ఏక లిపి సంగతియందురా, అది దేశమున ఏ ఒక్క రాష్ట్రమునకో, రెండు రాష్ట్రములకో సంబంధించినదిగాక, దేశమునకంతటికిని సంబంధించినదిగా నుండుటలో సౌలభ్యము, సుఖము, వీలు, ఇన్ని వున్నవి. అప్పుడు అందరును తమతమ లిపులతో పాటు, ఆ ఏకలిపినిగూడ వాడుకొనవచ్చును. అంతియేగాని, ఈ నడమంత్రపు సంస్కారణములవలన జరుగునది ఏమియు లేదు. పనిలేనివారు చేయు పనులవలె, ఇట్టి ప్రయత్నాలు అపహాస్యముగాగూడ కన్పించును.

జీవుని వేదన

శ్రీమతి నాయని కృష్ణకుమారి

కన్నులున్నఫలము కనులు నిన్నని యెంచి
వెదకె నీ కొఱకుగా వేసరిల్లి
భావనాశక్తి నీకై భావించు కొఱకని
యెట్లు భావించుటో యెఱుకపడక

మాటల మమతల మన్నింతు నిన్నని
మారుపలుకు లేని తీరుచూచి
చేవ కలుగు తనువు సేవించుటకెయని
యేసేవ హితమొ నీకెఱుగ రాక

నశ్వర శరీరమును తాల్చు నాల్గునాళ్ళ
యందె నినుచూచి తలపోసి యరుగదలచి
జీవి గుడుసుళ్లు పడి యేమి చేయుటకును
దారి గానక లోలోనె తపన చెందు

మాట మనసు చేత మమతల బరువులు
తనువు కలిగినట్టి తరుణమందె
జీవుడనుభవింప చేకూరు నివియెల్ల
తనువు లేని జీవమునకు లేవు

నిన్ను చూడవలెను నీ కంటి కొనలందు
నిలచు కరుణ నన్నె యలమవలయు
నంచు వెదకి కొంచు నద్రులేకును నెక్కి
చూడ గంటి నిన్ను సుందరాంగ

అన్నువైన మేని నున్నదనంబున
పట్టు దొరకరాక పాటుపడుచు
నుదురు, వెడదయురము, పెదవి చివళ్ళలో
కమ్మ మెరుగనట్లు కలయదిరుగ

చూపులను నిల్పి జంకించి తూపులట్లు
కాంతి రేఖల విరజిమ్ము కమల నిలయ
నీదు వక్షస్థలాకాశనిత్యమంగ
ళానుసంధాత్రి నను చూచి యగడుపడునొ?

భార్యగలాడ వీవు మరి భర్తయు నాకు గలండు కీర్తితౌ
దార్య గుణోజ్జ్వలుండు శతధా నిను పోలెడి దేహకాంతి సౌం
దర్యము వాడు కంటికొన తళ్కులలో సిరులొల్కు వాడునై
భార్యయ పూర్వ జన్మకృత భవ్యఫలమ్ముగ నెంచు వాడునున్.

సర్వసూన వికాస సామర్థ్య సంశోభి
మధుమాసమును బోలి మృదుత నెఱపు
గ్రీష్మకాలోదగ్ర కిరణార్చి కుమిలిన
యట్లుగా మానసమలవరించు
కాలమేఘావృత గగనమ్ముగా ముఖ
మండలం బలతిమై మనక కొలుపు
నీహారజాలికానికృతాంశువుల యట్లు
హృదయ రహస్యము లదిమిపట్టు
ఎట్టి భావము చలపట్టి చుట్టుకొనునో
అట్టి భావానుగుణ వికారాళి కులికి
మనసు సర్వమ్ము చుఱయిచ్చి మథనపడును
అతడు నాస్వామి నా నయనాబ్జ తరణి

ఆతడు తోడుగా నిహసుఖానుభవమ్ములుపొంది యంతతో
ప్రీతిని చెందదీ తనువు బెగ్గడిలున్ మరణానుసారియై
యే తలపట్టునో యెచటి కేగునో యాత్మయటంచు భావసం
ఘాతములోన చిక్కువడి గాలము మింగిన మీనుకై వడిన్

తోటి జీవియన్న తొణికిసలాడెడి
వింత మమత కూర్మి వెల్లువలును
పుట్టి పెరిగినట్టి మట్టియందెల్లెడ
పరిమళించు ప్రాత పరిచయములు

జీవుని వేదన

అగ్నిపాలౌనో దేహమ్ము ననుసరించి
కాక తన్మాత్ర పడసిన క్షణమునంద
వాయువలయు విలీనమై వ్యాప్తిచెంది
జీవతతిగుండెలను వడి చేరుకొనునో?

మజ్జాస్థికా చర్మమాంస మేదో యుత
మ్మగు శరీరము రూపమణగి చనగ
వ్యక్తమనంత మవ్యయమునౌ తత్త్వమ్ము
వెలుగుగా రూపొంది విస్తరిల్లి
విశ్వాత్మ సంస్థిత విస్ఫురద్రమణీయ
శివమూర్తివగు నిన్ను చేరుకొనుచు
నిస్తరంగ స్తబ్ధ నిర్మల కాసార
గర్భలీనము నీటికణమునట్లు
కలసి యస్తిత్వతా చిహ్న కలన లేక
నీవె తానుగ తనలోన నిన్నె చూచు
కొను సమైక్యము తలపున కూడు వేళ
తనువు సర్వమ్ము పులకల తనిసిపోవు

నేను వచ్చితయ్య నీపాద జలజాత
నిష్ఠితాగ్రమతిని నిన్నె కోరి
మొఱ్ఱనైన కన్ను లెన్నని కననిమ్ము
నీవె నాథనమ్ము! నేను నీకు!

క్రీడాభిరామ పద్యములలో చరిత్రాంశము లున్నవా?

శ్రీ బండారు తమ్మయ్య

భారతి అక్టోబరు 1961 సంచికలో శ్రీ కె. హెచ్. వి. శర్మగారు ప్రకటించిన "క్రీడాభిరామపద్యంలో చరిత్రాంశాలు" అను వ్యాసము కొన్ని వింత వింత విషయములకుఁ దావలముగా నున్నది. ఓరుగంటియందలి మధుమావతి యను వేశ్యను సందర్శించిన సమయమునఁ గ్రీడాభిరామ వీథి నాటక నాయకుఁడు గోవిందమంచనశర్మ యా వేశ్యతో మున్నొక జోగి భైరవ తంత్రము నెఱపి సఖరాక్షరభంగి నామె సౌధాట్టమున నొక తెలుఁగు పద్యమును గూర్చి యం దామె పూర్వ ప్రస్తుత భావి జన్మ వృత్తాంతముల వివరించెనని, తన వయస్యుఁడు టిట్టిభసెట్టితోఁ బలుకుట కథా సందర్భము. కథాకాలమునాఁటి యా మధుమావతి పూర్వజన్మమున నలకా పట్టణమునం దంగారవర్ముఁడను గంధర్వపతి కూఁతురయి యుండెనని, యిఁకముందు జన్మలలో నామెయే దక్షారామమునఁ జిన్నపోతియను వేశ్యగా నవతరించి చిరకాలము సదాశివునితో విహరించి, యా పిమ్మటఁ దమిళేటి పరిసరముల గోవులను పేరి చెంచుకులమునఁ గడిమికత్తులమ్మియను పేరితోఁ బుట్టఁ బోవునని యా పద్య విషయము. అట్లు ముందెప్పుడో పుట్టఁబోయెడి యా కడిమి కత్తులమ్మి సౌందర్యమును వర్ణించుచు మంచనశర్మ టిట్టిభునితో "కడిమి కత్తులమ్మి నిడువాలు గన్నులఁ గండుమీల నడఁచు మిండగీఁడ దాని చన్నుదోయి ధారాసురత్రాణ కటక కుంభి కుంభ కలహకారి" అను పద్యమును జెప్పెను. ఈ పద్యము కూడ నా జోగి సౌధాట్టమున లిఖించినదే యని యందు వ్యక్తము కాదు. ఈ వర్ణనము మంచనశర్మ గావించినదే యని గోచరించును. కథాపాత్రమయిన మధుమావతికాలమునకు నామె భావ్యవతారమగు కడిమికత్తులమ్మి కాలమునకు నడుమ నెంత వ్యవధి యుండునో యెప్పు డామె యవతరింపఁగలదో దైవమున కెరుక. ఇట్లు ముందెప్పుడో పుట్టబోయెడి యా చెంచులమ్మి వర్ణనములోఁ గ్రీడాభిరామ రచనమునకు మున్నెన్నడో ధారాసురత్రాణునకు నోఢ్ర రాజధానియగు కటకమును బరిపాలించిన కపిలేశ్వర గజపతికి ఘటిల్లిన యుద్ధ వార్తను గవి గర్భిత మొనర్చినాఁడని, యిట్టి తెలివితేటలలో వల్లభరాయుని కన్న శ్రీనాథుఁడు నేర్పరి యగుటచేఁ గ్రీడాభిరామమును, మరియు నీ పద్యమును గూర్చినది శ్రీనాథుఁడే యై యుండవలెనని, తా ముద్దేశించిన యా ధారాసురత్రాణ గజపతుల కలహ మానాఁటి పరిస్థితులనుబట్టి క్రీ. శ. 1455 ప్రాంతముననే గాని యంతకుముందు జరిగియుండుట కవకాశములు లేవు గాన క్రీడాభిరామ రచనా కాలము క్రీ. శ. 1455 పిమ్మటనే యని తలంపనగునని, శ్రీనాథుఁడు క్రీ. శ. 1385 ప్రాంతమున జనించి ఎనుబది, తొంబది సంవత్సరముల సుదీర్ఘకాలము క్రీ. శ. 1465, 1475 వఱకు జీవించి యుండునని, క్రీ. శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శృంగార శ్రీనాథమున లిఖించిన వాక్యము లిందుకు సహాయకము లగునని శ్రీ శర్మగారు తమ వ్యాసమునఁ దమ యూహల కుపబలముగా నుల్లేఖించియున్నారు.

అసలు క్రీడాభిరామ కర్తృత్వ విషయ మిప్పటికి వివాదగ్రస్తముగనే యున్నది. గ్రంథమంతయు వల్లభరాయ కృతమే యని కొందరు, శ్రీనాథ కృతమే యని మరికొందరు. గౌడ డిండిమభట్టు నోడించుటకయి శ్రీనాథుఁడు ప్రౌఢదేవరాయల (క్రీ. శ. 1422—1446) యాస్థానమున కేఁగునపుడు మార్గ మధ్యమున విజయనగరరాజుల యుద్యోగి వినుకొండ వల్లభరాయుని వినుకొండయందో, మోపూరునందో సందర్శించి క్రీడాభిరామ రచనమునఁ గొంతవఱ కాతనికి సహకరించి యుండునని యింకఁ గొందరు తలంచుచున్నారు. ఈ కడపటి యభిప్రాయమే చాలవఱకు సంగతము సత్యసమ్మతమునై యుండునని పలువురు సహృదయుల నిర్ణయము. ఏది ఎట్లున్నను శర్మగారు పేర్కొనిన పద్యమును గూర్చినది వల్లభరాయుఁ డయినను, శ్రీనాథుఁ డయినను నందు వా రూహించిన గజపతి యుద్ధ వార్త మాత్రము కవ్యభిప్రేతము కానేరదని నా యభిప్రాయము. ధారాసురత్రాణునకు గజపతికి అసలు యుద్ధ మెప్పు డెచ్చటఁ బొసఁగె ననెడి విషయమున శ్రీ శర్మగారికే దృఢవిశ్వాసమున్నట్లు లేదు. ఆ విషయమును సప్రమాణముగ వారే నిర్ణయింపఁజాల రయిరి. ఆనాఁటి దేశపరిస్థితులలో నట్టి యుద్ధము జరిగియుండుట కవకాశము లేకపోలేదని, పయి క్రీడాభిరామ పద్య మందుకు సూచకమని వారి యభిప్రాయము. కాని "కటక కుంభి కుంభ కలహకారి" యను పద్యము నాలవ పాదమునఁ దృతీయ గణస్థానమున నున్న "కుంభ" శబ్దము

క్రీడాభిరామపద్యములలో జరిత్రాంశము లున్నవా ?

నకుఁ దమ యభిప్రాయ సరణిలో సమన్వయ మెట్లు కుదురునన్న సంగతియే శర్మగారు తలంచినట్లు కానరాదు. కుంభి (కుంభముకలది) యనఁగా గజమని యర్థ మున్నది. గనుక దానికే గజపతి యని కూడ నర్థము చెప్పికొనవచ్చునని, కటక కుంభి యనఁగా నానాఁడు కటకమును బరిపాలించిన కపిలేశ్వర గజపతి యని వా రూహించిరి. కాని కవిదృష్టిలో నిట్టి యూహ యేమాత్రము లేదని సహృదయులు తలంపకపోరని నా విశ్వాసము. క్రీడాభిరామ రచనాకాలము క్రీ. శ. 1430, 1435 మధ్యకని యస్మదాదుల మింతకుమున్నే నిస్సందేహముగ నిర్ణయించి యున్నాము. కపిలేశ్వర గజపతి తూర్పు గాంగరాజు నోడించి కటకమునఁ బ్రతిష్ఠితుఁ డయినది క్రీ. శ. 1435 సంవత్సరముననే యని, రాజమహేంద్రవర రెడ్డి రాజ్యముపయి నాతఁడు దాడి వెడలి యాక్రమించినది క్రీ. శ. 1435, 1448 సంవత్సరముల మధ్య నయి యుండునని, ధారాధీశునితో నాతనికిఁ గలహమే పొసఁగి యుండ సురత్రాణు నాతఁడు నిర్జించియే యున్నచో నది క్రీ. శ. 1455 ప్రాంతముననే యై యుండునని కూడ శ్రీ శర్మగారు రుగ్గడించినారు. కళింగ దేశాంతర్గతమయిన విశాఖపట్టణ మండలములోని సింహాచల క్షేత్రమందలి శాసనము శా. శ. 1356 (క్రీ. శ. 1434) నాఁటిది రాజమహేంద్రవరము రెడ్డిరాజు అల్లయ వేమారెడ్డిది కానవచ్చుటచే నప్పటి కాప్రాంతము రాజమహేంద్రవరము రెడ్ల యేలుబడిలోనే యున్నట్లు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు **History of the Reddi Kingdoms** అను గ్రంథమున నిర్ణయించి యున్నారు. ఆ మఱుచటి సంవత్సరముననే గాని కపిలేశ్వర గజపతి కటకమునఁ బ్రతిష్ఠితుఁడు కాలేదు. ఆ కాలమున ధారాపట్టణము నేలిన సులతాను మహమ్మదుషా యఁట. బహమనీ తురకరాజులతోను, నీతనితోను విజయనగర రాజులకు, రెడ్డి రాజులకు, రాచకొండ వెలమ రాజులకు, మధ్య మధ్యఁ బోరాటములు జరుగుచునే యుండెడివి. శ్రీనాథుని కాశీఖండము గృతినందిన వీరభద్రారెడ్డి తమ్ముఁడు దొడ్డారెడ్డి కంకితముగా నిశ్శంకుల కొమ్మనామాత్యుఁడు శివలీలా విలాసము రచించినాఁడు. అందాతఁడీ రెడ్డిరాజుల తండ్రి యల్లాడరెడ్డి పరాక్రమాదికముల వర్ణించుచు "ధారాసురత్రాణుఁ బోర నిర్జితుఁజేసి కొల్లఁ బట్టించె ద ద్ఘోటకముల" అని చెప్పినాఁడు. కావునఁ గటకగజపతి ధారాసురత్రాణుని నోడించినది నిశ్చయమయి నను గాకున్నను గాశీఖండ రచనమునకుమున్నే రెడ్డిరాజులా సులతానును నిర్జించియుండుట నిక్కమని తలంపనగును.

స్త్రీ కుచములకుఁ బీవరత్వవిషయమున గజకుంభములతో సాదృశ్యమును గూర్చుట కవి సమయమనుట సర్వవిశ్రుతము. కటకశబ్దమునకుఁ గల నైఘంటికార్థములలో "రాజధాని" యనునది ప్రధాన మయినది. కాఁగా "ధారాసురత్రాణ కటకకుంభి" యనుటలో ధారాసురత్రాణుని రాజధాని యందలి పట్టపుటేనుఁగు అను నర్థమును దక్క మఱెట్టి యర్థమును గవి పయిపద్యమున వ్యంగ్యముగఁ గాని వాచ్యముగఁ గాని చెప్పలేదనియే నా నిశ్చితాభిప్రాయము. "ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండఁ గాశికాఖండ మను మహాగ్రంథమేను, తెనుఁగుఁ గావింతుఁ గర్ణాట దేశ కటక పద్మ వన హేళి శ్రీనాథవాళి" అను శ్రీనాథుని కాశీఖండ పద్యమందలి కటక శబ్దమున కేమి యర్థమో యిప్పుడుఁ గూడ నంతియే యర్థము. క్రీడాభిరామమందలి తత్పూర్వ పద్యములలో మాచలదేవిని (రెండవ ప్రతాపరుద్రుని వేశ్య) గోవింద మంచన శర్మ వర్ణించు పట్టునఁ గూడ "అంకుశాఘాత రేఖల నందమొంది గంధ గజకుంభములతోడఁ గలహమాడు క్రొత్త నఖములతోడి నీ కుచ భరమున కలిగె యభ్యుదయ పరంపరాభివృద్ధి" అని యాశీర్వదించి "కల్ల చెప్పము నీకుఁ గల ప్రసిద్ధి ఢిల్లి సురతాణికిని లేదు పల్లవోష్ఠి" అని పొగడినాఁడు. ఇట్టి వర్ణనమే మధుమావతి విషయమునఁ గాని యామె భావ్యవతారమగు కడిమికత్తెలమ్మి విషయమునఁ గాని కవ్యుద్దిష్టమగును గాని, మ రెట్టి భావము నందున్నట్లు తలంచుట యసంగతము. కథాకాలమునాఁటి కున్న మధుమావతి, మఱికొన్ని జన్మములలోఁ గడిమికత్తెలమ్మిగా నవతరించెడి వర్ణనములో నంతకు మున్నెన్నఁడో జరిగిన ధారాసురత్రాణ గజపతుల పోరాటము గర్భితమయినదని తలంచుటలో సామంజస్యము శూన్యము. అట్టిది కవి యప్రౌఢతకు నవివేకమునకుఁ దార్కాణమగును గాని ప్రౌఢతకుఁ గాఁజాలదు. ఇట్టి రచనము శ్రీనాథున కారోపించుట మరింత యసంభావ్యము. సవిమర్శముగ విచారింపఁ గ్రీడాభిరామము చాలవఱకు వల్లభరాయ కృతమే గాని శ్రీనాథకృతము గాదని శ్రీనాథ కవితలోని ప్రౌఢతా సౌభాగ్యములందుఁ జెక్కు పద్యములలోఁ గానరావని మిత్రులు శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు..."శ్రీనాథ కవితా సమీక్ష ప్రథమ భాగము (శ్రీనాథుఁడు శృంగారియా!)" అను గ్రంథమున సహేతుకముగ నిర్ణయించి యున్నారు. నిక్కమాలోచింప వల్లభరాయ వంశ వర్ణనాత్మకముగను, స్తుతిపూర్వకముగను 32 పద్యము చివర వరకు నున్న యవతారికా భాగము, గ్రంథాంతమున వల్లభరాయాశీర్వాదపూర్వకముగ రచితమయిన "ముదమున ముల్కినాఁటిపుర మోహనశైల ...." అను 295 పద్యము గ్రంథ మధ్యమున శ్రీనాథుని భీమేశ్వర పురాణ, శాలివాహన సప్తశతులనుండి గ్రహింపఁబడిన కొలఁది పద్యములు పద్యపాదములు తప్ప మిగిలిన గ్రంథమంతయు వల్లభరాయ కృతమని తలంచుటయే సత్యసమ్మతముగఁ దోఁప గలదు. మాచలదేవి వర్ణనములో నలెఁ గేవల గంధగజకుంభ సాదృశ్యమే యుదాహృతముగాక, ధారాసురత్రాణుని గజమునే యేల పేర్కొనె ననెడి యాక్షేపము రావచ్చును. అనాఁడు ధారాసురత్రాణుని పట్టపుటేనుఁగు బలిష్ఠతకుఁ బేర్వడి యుండవచ్చును. లేదా యతిభిక్షకయి యాదృచ్ఛికముగనే కవి "ధారాసురత్రాణ" పదమును బ్రయోగించి యుండవచ్చును.

ఇఁక శ్రీ శర్మగారి నిర్ణయము క్రీడాభిరామ రచనాకాలమును బట్టి, శ్రీనాథుని జీవితావధిని బట్టి కూడ నెట్టి

అసంభావ్య మగునో యాలోచింతము. శ్రీనాథుని భీమఖండము రాజమహేంద్రవర రెడ్డిరాజుల మంత్రి బెండపూడి యన్నామాత్యుని కంకితముగా రచింపఁబడినది. ఈ యన్నామాత్యుఁడు తన కులదైవతమయిన దక్షారామ భీమేశ్వరుని యాలయమున శా. శ. 1350 (క్రీ. శ. 1428) లో గోపుర మంటపాదికములు నిర్మించినట్లు లా యాలయ స్తంభముల పయి శిలా శాసన మున్నది. (S. I. I. Vol. IV No. 1381). ఈ ధర్మకార్యములను శ్రీనాథుఁడు భీమఖండావతారికలో "దక్ష వాటికయందుఁ దరుణేందు మౌళికి మొగలి వాకిట ధామమును రచించెఁ బ్రాగ్దిశా వప్రగోపుర ప్రాంగణమున సప్తముని సింధు సోపాన సరణి కెలనఁ దీర్చె భవనంబు భీమయదేవు నగర మంత్రి దేవయ యన్నయామాత్యవరుఁడు" (ఆ 1 ప 75) అను పద్య పాదములలోఁ బ్రశంసించి యున్నాఁడు. ఇందుచే భీమఖండరచనము క్రీ. శ. 1428 తరువాత రెండు మూఁడు సంవత్సరములలోఁ గ్రీ. శ. 1430 ప్రాంతమున జరిగియుండునని నిస్సందేహముగ నిర్ణయింపఁదగును. కాశీక్షేత్రమును శపింపఁ బూనిన కారణమున విశ్వనాథుని యాగ్రహమునకు గుఱియై వ్యాసుఁడు కాశిని విడనాడి దక్షారాము భీమేశ్వరుని సేవించుటకయి దక్షారామమునకుఁ బ్రయాణమయి వచ్చునపుడు మార్గమునఁ దారసిలిన యగస్త్య మహర్షితో దక్షారామ పురప్రవేశమునకయి శుభముహూర్తమును విచారించు సందర్భమున నగస్త్యుఁడు వ్యాసునితోఁ బల్కినట్లుగా నీ క్రింది శ్లోకములు సంస్కృత భీమ ఖండమున నున్నవి.

"ఉషస్స్యాద్గార్గి సిద్ధాంతః; శకునంతు బృహస్పతేః; త్వన్మతం చిత్త నైర్మల్యం; విప్రవాక్యం హరేర్మతం; కీర్తసీ యోభిజిత్కాలః; సర్వ సిద్ధాంత సమ్మతః"

వీని ననువదించుటలో శ్రీనాథుఁడుచితజ్ఞుఁ డగుటచేఁ దక్కిన పాదములు ప్రథమ పురుషములో నుండఁగా, మూఁడవ పాదమున మధ్యమ పురుషములో నున్న వ్యాస మతమును గూర్చి "నీదు మత మెన్నఁగ మనః ప్రసాదగరిమ" అను రీతి నేదో విధమునఁ జేర్కొనుట యుచితము గాదను తలంపుతో దానిని బూర్తిగా విడిచి తక్కిన పాదముల నిట్లనువదించినాఁడు.

"గార్గ్య సిద్ధాంత మత ముషఃకాలకలన; శకున మూనుట యది బృహస్పతి మతంబు; విప్ర జనవాక్య మరయంగ విష్ణు మతము; సర్వ సిద్ధాంత మభిజిత్తు సమ్మత మగు."

భీమఖండ మందలి యీ పద్యమే యందు విడిచిన వ్యాస మతమును మూఁడవ పాదమునఁ జేర్కొనుచు నందలి నాల్గవ పాదమును విడిచి దాని స్థానమున మూఁడవ పాదమును నిలుపుచుఁ గ్రీడాభిరామమునఁ గథానాయకులు మంచనశర్మ టిట్టిభసెట్టుల యేకశిలానగర ప్రవేశమున కుషఃకాల ముహూర్తము సమ్మతముగా నుండునని సంప్రదించుకొను సందర్భములో నీ క్రింది విధమునఁ గూర్పఁబడినది.

"గార్గ్య సిద్ధాంత మత ముషఃకాల కలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
వ్యాస మతము మనః ప్రసాదాతిశయము
విప్ర జనవాక్య మరయంగ విష్ణు మతము."

వ్యాసుని దక్షపుర ప్రవేశమున కగస్త్యుఁ డేర్పరచినది యభిజిన్ముహూర్తము. ఆంధ్ర నగర ప్రవేశమునకు మంచన శర్మ నిర్ణయించినది యుషఃకాల ముహూర్తము. కావున నిచ్చట నౌచిత్యమును బాటించి భీమఖండమునఁ దా ననువదించిన పద్యమునే యుచితమయిన మార్పుతో సందర్భశుద్ధి కనుగుణముగఁ గ్రీడాభిరామమున నిట్లు సవరించుట శ్రీనాథుని పనియే యని సహృదయులకుఁ జెప్ప నవసరము లేదు. ఇప్పట్టున సంస్కృత భీమఖండ శ్లోకములలోనే మరొక శ్లోకమును రావిపాటి త్రిపురాంతకుఁడు ప్రేమాభిరామమునఁ గూర్చియుండునని, క్రీడాభిరామ పద్యము దానికి సరియైన యనువాదమని విజ్ఞులు తలంపఁజాలరు. శ్రీనాథునికి వల్లభరాయనితో సమాగమము డిండిమభట్టు నోడించుటకయి ప్రౌఢదేవరాయల కర్ణాటాస్థానమున కేఁగునపుడు మార్గమధ్యమున వినుకొండలోఁ గాని, మోపూరునందుఁ గాని పొసఁగి యుండుట సర్వ విధముల సంగతము. విజయానంతరము విజయనగరమునుండి మరలి రాజమహేంద్రవరమునకుఁ దిరిగి వచ్చునప్పుడే, శ్రీనాథుఁడు మార్గ మధ్యమున రాచకొండలో సర్వజ్ఞసింగమనీని దర్శించినపుడు "దీనార టంకాలఁ దీర్థ మాడించితివి దక్షిణాధీశు ముత్యాలశాల; పగులఁ గొట్టించితి నుద్భట వివాద ప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క; చంద్రభూషక్రియాశక్తిరాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమ బిరుదు" అను చాటుపద్యమును జెప్పి యుండెను. రాజమహేంద్రవరమునకు దిరిగివచ్చిన యనంతరము స్వల్పకాలముననే యాతఁడు కాశీఖండము రచించి వీరభద్రారెడ్డి కంకిత మొనరించెను. దీనిలోనే యాతఁడు తాను కర్ణాటాస్థానమునఁ గావించిన విబుధరంజనము, గౌడడిండిమభట్టు డిండిమ విభంజనము, ప్రౌఢదేవరాయ ప్రదత్త కనకాభిషేక సత్కారము, కవిసార్వభౌమ బిరుద సమార్జనము నుద్ఘాటించుకొనినాఁడు. ఈ గ్రంథముననే యవతారికయందు నాశ్వాసాంత పద్యములందు వేమ వీరభద్రారెడ్డు లొనరించిన కళింగదేశ యాత్రా విజయము లుదాహృతము లయినవి. నిశ్శంకుల కొమ్మనామాత్యుఁడు శివలీలా విలాసములోఁ దానుగూడ వీనిని జేర్కొనినాఁడు. కపిలేశ్వర గజపతి కటకము నాక్రమించి పట్టాభిషిక్తుఁ డయినది క్రీ. శ. 1435 సంవత్సరమునఁ గావున నీ రెడ్డిరాజుల కళింగదేశ విజయము లన్నియు నంతకుఁ బూర్వమే జరిగియుండవలె ననుట నిస్సంశయము. రాజమహేంద్రవర రెడ్డిరాజ్యము పయిఁ గ్రీ. శ. 1435 తరు

క్రీడాభిరామపద్యములలో జరిత్రాంశము లున్నవా?

వాతనే దండెత్తి కపిలేశ్వర గజపతి వేమ వీరభద్రారెడ్ల విహత మొనర్చెనని శ్రీ శర్మగారే యంగీకరించి యున్నారు. కావునఁ గాశీఖండ శివలీలా విలాసములు రచితమయినది క్రీ. శ. 1435 సంవత్సరమునకు ముందే యని తలంచుట సర్వ విధముల సంగతమని చెప్పనక్కఱలేదు. శ్రీనాథుని భీమఖండ రచనము క్రీ. శ. 1428—1430 మధ్యనని ముందే నిరూపించి యుంటిని. కావునఁ గ్రీడాభిరామ రచనమున వల్లభ రాయనికి శ్రీనాథుఁడు తోడ్పడినది భీమఖండ కాశీఖండ రచనముల మధ్యకాలములో ననగా క్రీ. శ. 1430—1435 మధ్యనని పలు కారణములవలన నిస్సందేహముగ నేర్పడఁ గలదు. శర్మగారు గజపతి ధారాసురత్రాణు నిర్మించినట్లు తలంచు క్రీ. శ. 1455 నాఁటికి శ్రీనాథుఁడు కైలాసమునఁ బ్రాంతకాపయి యుండును. తన యాశ్రయు లయిన వేమ వీరభద్రారెడ్ల యనంతర మనతి కాలముననే గజపతి యొక్క పెనుగొండ శాసనకాలమగు క్రీ. శ. 1448 సంవత్సరమునకు మునుముందే యాతఁడు శివలోకమున కేఁగి యుండును. వల్లభరాయఁడు కూడ క్రీ. శ. 1455 నాఁటికి జీవించి యుండెనో లేదో చెప్పఁజాలము.

శ్రీనాథుని జీవిత పరిమితిని గూర్చి కూడ నిఁకఁ బరామర్శింతము. తనతాత కమలనాథుఁడు వినమత్కాకతిసార్వభౌముఁడని శ్రీనాథుఁడు భీమఖండావతారికలో బ్రశంసించినాఁడు.

> "కనకక్ష్మాధరధీరు వారిధితటీకల్పట్టణాధీశ్వరున్
> ఘనునిన్ బద్మపురాణ సంగ్రహ కళాకావ్య ప్రబంధాధిపున్
> వినమత్కాకతి సార్వభౌముఁ గవితా విద్యాధరుం గొల్తు నా
> యనుగుందాతఁ బ్రదాత శ్రీ కమలనాథామాత్య చూడా
> మణిన్."

దీనినిఁబట్టి కమలనాథుఁడు కాకతీయుల కడ దండనాథపదవియందో మఱొక గౌరవపదమునందో యుండి వారి సత్కృతుల నందియుండినట్లు తలంపనగును. ఈ పద్యమునఁ బేర్కొనఁబడిన కాకతి సార్వభౌముఁడు కాకతి చక్రవర్తులలోఁ గడపటివాఁడగు రెండవ ప్రతాపరుద్రుఁడే యని తలంచినను వాతని రాజ్యావసానకాలము క్రీ. శ. 1323 నాఁటికి గమలనాథుఁ డధమపక్షము 40 యేండ్ల వయస్సు గలవాఁడయి యుండుననుట కభ్యంతర ముండరాదు. శ్రీనాథుని తండ్రి మారయ కమలనాథునికి నలువది యేండ్ల వయస్సుననే జనించియుండునని, యాతనికి శ్రీనాథుఁడు గూడ నట్టి వయస్సుననే యుదయించి యుండునని తలంచినను, శ్రీనాథుని జన్మకాలము క్రీ. శ. 1365 కన్నఁ గ్రిందికిఁ రాఁజాలదు. అనవేమారెడ్డిని (క్రీ. శ. 1365—1385) జిన్నతనమున సందర్శించి "అనవేమ మహీపాల! స్వస్త్యస్తు తవ బాహవే" అను చాటు శ్లోకమును జెప్పి సత్కార మందిన యార్వేల నియోగి శ్రీనాథుడే యని యనుశ్రుతముగఁ దెలియుచున్నది. శ్రీనాథుని యనపావచాటువు నందలి "భాస్కరుఁడు మున్నె దేవుని పాలి కరిగె" అను పాదమునుబట్టి ఆ దాతయగు రాయని భాస్కరుని యాశ్రయము కూడ శ్రీనాథునికి జిన్నతనమున నుండెనని తోఁపఁ గలదు. రాయని భాస్కరుఁడు అనవేమారెడ్డి వలన న్యగ్రోధాదికముల నందినట్లు లాతని వంశ్యుఁడు చింతగుంట కోదండరామకవి రచించిన సునందాపరిణయము వలనఁ దెలియుచున్నది. పెదకోమటి వేమన కొండవీటి రాజ్యము నాక్రమించినతరువాత నాతని యాస్థానమునఁ గ్రీ. శ. 1404 నాఁటికే శ్రీనాథుఁడు విద్యాధికారి పదవి నలంకరించినట్లాతని శాసనములవలననే వ్యక్తమగుచున్నది. అట్టి మహాస్నతపదవి నలంకరించు నప్పటి కాతఁ డధమపక్షము 40 సంవత్సరముల వయస్సు కలవాఁడయి యుండవలెను. ప్రభాకర శాస్త్రిగా రూహించినట్లు శ్రీనాథుని జన్మ వత్సరము క్రీ. శ. 1385 అయినచో 1404 నాఁటి కాతఁడు 19 యేండ్ల చిఱుతప్రాయమువాఁ డగును. అట్టి లేఁబ్రాయములో నాతఁడు విద్యాధికారిపదము నందెననుట సహృదయ సమ్మతము గాదు. ఇత్యాది కారణములచే శ్రీనాథుని జీవిత పరిమితి క్రీ. శ. 1365—1445 అయి యుండునని తలంచుటయే సంగతముగా నుండును. నా శృంగార శ్రీనాథ విమర్శనములో 1925 ప్రాంతముననే ఈ నిర్ణయము గావించియున్నాను. 'ప్రాయమింతకు మిగులఁ గైప్రాలకుండఁ గాశీఖండము'ను 1435 ప్రాంతమున రచించునప్పటి కాతఁడు 70 ఏండ్లు, భీమఖండ రచనము నాఁటికి 65 యేండ్ల ప్రాయమువాఁ డయి యుండును. శర్మగా రుదాహరించిన క్రీ. శ. 1455 నాఁటి కాతఁడు 90 యేండ్లవాఁ డగును. అప్పు డాతఁడు వల్లభ రాయని దర్శించి క్రీడాభిరామ రచనమున నాతనికిఁ దోడ్పడి యుండెనని తలంచుట యన్ని విధముల నసంభావ్యమని చెప్ప నవసరములేదు.

శర్మగారు తాము వృథా భ్రమించి పాఠకులకుఁ దిగ్భ్రమ గలిగించిరే కాని వారు పేర్కొనిన క్రీడాభిరామ పద్యమునఁ జరిత్రాంశ మేదియు గర్భితము కాలేదని యట్టిది కష్యభిప్రేతము గాదని సవినయముగ మనవి చేయుచున్నాము. విజ్ఞులు సమాలోచింతురుగాక.

సాయంతపస్సు

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి

సాంధ్య రక్తిమనార్యా కషాయ వసన
దీధితులు పోల్చె, సుప్త పద్మినుల బోలి
ముకుళితము లాయె నయనముల్--ప్రకృతిమూర్తి
గిరిసుతానియమవ్రతాకృతి వహించె.

సదమలంబైన సాయం ప్రశాంతసమయ సన్నిధిని బోల్చెవదన వర్చస్సునంటి
పరమ సాత్త్విక భావంబు--పార్వతీ తపోగభీర ముద్రల బోల్చె భూధ్రపంక్తి.

గ్రీష్మకాలతాపము సన్నగిలఁగ, ప్రకృతి పరిణమించిన రమ్యభావంబు పోల్కి—
హిమగిరి కుమారికా హృద యేప్సితంబు దివ్యగతిమారె తత్తపో దీక్షలోన.

సురభిళ మారుతము దిశాంతరవీథుల ముంచివైచు తరుణమున మనో
హరమాయె పురాసుకృతపు పరిపాక పరిమళములు పైకొన నచటన్.

కలరుతముల్ ముడుంగ, విహగంబులు పాదపరమ్య శాఖికా
వళి నెలకొన్న లీల నిజభావము లౌకిక వృత్త వాసనల్
దోలచి సమాధి నిష మెయి ధూర్జటిరాగరసానుభూతిలో
పొలుపు వహింప హైమవతి పోల్చె సమంచిత కార్యసాధనన్.

అలపెల్లో తమసాంకురంబు లటు లంపాకీర్ణముల్ తజ్జటా
విలసత్కుంజ పరంపరల్ పోలిచె, పరోక్ష భక్తి తాత్పర్యమం
జులసంస్కారము భూధరాగ్ర విచలత్స్రోతస్వినీ వేగమున్
దలపింపన్, గిరికన్యకామధుర సంధ్యాధ్యాన వేళావిధిన్.

పరమశివతాండవోచిత
పరిస్ఫుట విలాస దివ్యభంగిమలో త
త్పరమగుచు గౌరి హృదయాం
తరమున్ నటియించె సురచనా ప్రవణంబై.

సంధ్య ననుకరించె సర్వతోముఖశోభ
మహితమగుచు గిరికుమారి తపము,
సంధ్య--స్వీయజన్మసాఫల్య మొనరించె
పార్వతీ తపోఽనుభావకలన!

అఖండయతి పరిశీలనము: అందులో నా పొరపాటు

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

1961 ఆగస్టు, 'భారతి' లో, "పాఠగ్రంథి పర్యాలోచనము" అను వ్యాసములో, భారతములోని అఖండ యతులనుగూర్చి చర్చిస్తూ, నేను,—

"నల్లనై తోఁ తెంచు నట్టి తనువు" (ఆది. 6. 214) అను వ్రాతప్రతిపాఠము, అచ్చులో — నల్లనై .... నల్ల గృహము" గా పరిష్కరింప బడినది. ఆ పరిష్కరణము సరియైనది కాదు—అని వ్రాసినాను.

ఆ నా వ్రాతనుఖండిస్తూ శ్రీ మంగిపూడి కృష్ణమూర్తిగారు, అక్టోబరు—'భారతి' లో ఒక వ్యాసము ప్రచురించినారు. అందు వారు, భారతములోని అఖండయతులను గూర్చియు కొంత చర్చచేసినారు. వారి ఖండనమునూ— చర్చనూ గూర్చిన నా యభిప్రాయములను నే నీ వ్యాసమున తెలుపుచున్నాను.

శ్రీ కృష్ణమూర్తిగారు, "అట్టి తనువు" అను పాఠము సందర్భోచితము కాదనీ, "నల్ల గృహము" అనునదే సరియైన పాఠమనీ—మూలము నుదాహరించి, సందేహమున కెడము లేకుండా—చక్కగా నిర్ణయించినారు. వారి నిర్ణయమే ఒప్పు, నా వ్రాతయే తప్పు. నా పరిశీలనములోని పొరపాటు, వారు వివరించువరకును నాకు తెలియలేదు. ఈవిధముగా నాకు కనువిప్పు గలిగించినందుకు శ్రీకృష్ణమూర్తిగారికి నే నెంతయును కృతజ్ఞుడను.

వారి విమర్శ చదివిన పిమ్మట, నాకు మరియొక విషయము కూడా మనసుకు వచ్చినది. మూలమును బట్టియే గాక, ఆ సీస పద్యపు లక్షణమునుబట్టియు, అందుండదగినది "నల్లగృహము" అను పాఠమే. "అట్టి తనువు" అను పాఠ ముండుటకు వీలులేదు. ఎందువల్ల ననగా : అది అవకలి ప్రాస సీసము. అనగా, అన్నిచోట్లను ప్రాసయతియే ఉండవలె నను నియమము కలది. కనుక, "నల్లనై తోఁ తెంచునట్టి తనువు" అంటే, ఆ నియమము చెడిపోవును. "నల్ల గృహము" అంటేనే గాని, ఆ నియమము సురక్షితము కాదు. అందువల్ల, కృష్ణమూర్తిగారి నిర్ణయమే సరియైనది.

నేను మూలమును సరిగా పరికింపకపోవుటయు, నన్నయ సీసములతత్త్వము నెరిగి యుండియు, ఆనాడింతగా విచారింపకపోవుటయు నా విమర్శలో జరిగిన పొరపాటు. ఇప్పుడైనను, మంగిపూడివారు మందలించియుండక పోతే, ఆ పొరపా టట్లే నిలవరమై యుండెడిదే. వారి ధర్మాన తొలగిపోయినది. విమర్శలవలని ప్రయోజనము లిట్టివే గదా!

ఇక్కడ ఒక్కమాట : వారి పాఠపరిశీలనము సమంజసముగానే యున్నది గాని, నేను చూపిన పాఠమును గూర్చియు, అఖండయతినిగురించియు వారు వ్రాసిన వ్రాతలు సమంజసములుగా లేవు. వరుసగా వివరిస్తాను.

(1)

వారు "అట్టి తనువు" అను పాఠము ఎక్కడా లేని దన్నారు. నే నూహించి కల్పించిన దన్నారు. వ్రాతప్రతులలో ఉండి ఉంటుం దను భావముతో ఉదాహరింపబడిన దన్నారు. ఇది యంతయు అపోహము. ఆ పాఠము తప్పేగాని, నేను కల్పించినది మాత్రము కాదు. 'గిడుగు' పండితులు ఆ పాఠమును అప్పకవీయము పీఠికలో ప్రస్తావించి,—"వ్రాత ప్రతులలో 'అట్టి తనువు' అని ఉంటే, అట్టి తనువుకు బదులుగా 'నల్లగృహము' అని అచ్చు వేయించినారు. దీనికి అర్థమేమి ?" అని వ్రాసియున్నారు. (మా. పుట. XIVI)

కాబట్టి అది కల్పితపాఠము గాదు. వ్రాతప్రతులలో నున్నదే. అయినను తప్పే. గిడుగువారు సునిశితముగా చూచియే అట్లు వ్రాసియుందురన్న నమ్మకముతో, నేను వారి వాక్యమునే అనుసరించినాను. అదియే నా పొరపాటు. ప్రాజ్ఞుల వ్రాతలనైనను పరిశీలించియే పరిగ్రహింపవలెనన్న గుణపాఠమును నా కీ విమర్శ గట్టిగా నేర్పినది. "గతం నశోచామి కృతం స్మరామి."

(2)

"భారతకవులు ముగ్గురును అఖండయతిని వాడినారు. అట్టి పాఠములు వ్రాతప్రతులలో ఉన్నవి. అవి అచ్చు ప్రతులలో మారిపోయినవి అన్నారు శాస్త్రిగారు. కానీ, ఆంధ్ర మహా భారతాన్ని పరిశీలించి చూస్తే, నేడున్న అచ్చు ప్రతులలో కూడా అఖండయతి ప్రయోగాలు చాలా కనబడుతున్నవి" అని చెప్పి, శ్రీ కృష్ణమూర్తిగారు ఈ క్రింది ప్రయోగాలు చూపించినారు.

"ఉ, క్కతి	అర్చుచు"	(అరణ్య. 6. 345)
"ఉ, క్కతి	కాదనక"	(,, 6. 320)
"ఉ, క్కతి	కవ్వడి"	(విరాట 5. 143)
"క్ర, వృతి	అంత"	(అరణ్య 7. 367)

"ఎత్తినార్యుండు   లో—క్కైక" (అరణ్య 7. 469)
"ఒ, ప్పారెడు   నిఖి—శ్శైక" („ 7. 244)
"ప్రస్తుత్మమంమ్మైన యస్మదాదుల కెల్లన్"(ఆది.2· 219)

ఇవి యన్నీ అప్పకవీయములో, నిత్య సమాస—దేశ్య నిత్య సమాస విశ్రాంతుల క్రింద ఉదాహృతములై యున్నవే. వాటినే కృష్ణమూర్తిగారు ఎత్తి వ్రాసినారు. అంతేగాని, వారు భారతము స్వయముగా పరిశీలించి సంతరించినవి కావు. కాక పోయిన నేను గాని, ఆపలీ ప్రయోగములకును, నా 'పాఠ్యగ్రంధి పర్యాలోచనము' న చర్చింపబడిన అఖండయతికిని సంబంధము లేదు. అందువలన వారి యీ ప్రయోగ ప్రదర్శనము నిరర్థకము.

ఈ సంగతి తెలియక, వారు—"భారతం అచ్చు ప్రతులలో గూడా ఉన్న పై ఉదాహరణలు పేర్కొనడం మాని శాస్త్రిగారు, ఎక్కడా లేని ప్రయోగ మొకటి చూపించినా" రని నన్నధిక్షేపించినారు.

(3)

వారు, ఈ క్రింది ప్రయోగములను అఖండయతులకు ఉదాహరణ లన్నారు. ఎట్లన్నారో నా కర్థముకాలేదు. నాకు గలిగిన సందేహములు తెలుపుతున్నాను.

1. "ఉఱక తదీయబాణరయ మోర్వ నశంబి"
(అరణ్య 6. 320)

ఇందు, ఉకార—ఓకారములకు మైత్రి. ఇది అప్పకవి లక్షణమునుబట్టి స్వరప్రధానవళి. వారు 'అఖండయతి' యని, 'ఉఱ' క్రింద గీటు గీచి సూచించినారు. 'ఉఱ' లోని 'ఉ' అఖండయతి అయితే, హల్లునకును చెల్లవలె. ఏ హల్లుకు చెల్లును ?

2. "ఎఱిగితి నేను నిన్ను విబుధేంద్రుండ వీవు"
(అరణ్య 7. 367)

ఇందున్నదియు స్వరప్రధానవళియే. వారు 'ఎఱి' క్రింద గీటు గీచి,అఖండయతి అన్నారు. 'ఎఱి' లోని 'ఎ', ఎట్లు అఖండయతి య్యైనది ?

3. "అ, త్తఱి దరుమంగ నస్త్రములు దండడి మాన్కొని"
(విరాట 5. 143)

ఇక్కడ తకార దకారములకు మైత్రి. ఇది వ్యంజనాక్షర విరతి. వారు 'తఱి' క్రింది గీటుంచి, ఇదియును అఖండయతియే నన్నారు. 'తఱి' లోని 'త', ఎట్లు అఖండయతి యైనదో నాకు బోధపడలేదు.

ఈవిధముగా వారు, స్వరయతులును—వ్యంజన విరతులును గల ప్రయోగములను, అఖండయతుల కుదాహరణలుగా చూపుటను బట్టియు, ఉఱక, ఎఱిగి, తఱి—అను పదములలోని ఉ, ఎ, త—అను వర్ణములను అఖండయతులుగా సూచించుటను బట్టియును వారికి అఖండయతి తత్త్వము అపరిచితమని నాకు తోచినది. అందువలన, వారికి తెలియుటకుగాను, ఆ యతి స్వరూపమును, సంగ్రహముగా వివరిస్తున్నాను.

రెండుపదములు కలిసినపుడు, సంధిలో, పూర్వ పదము తుది హల్లును, ఉత్తర పదము మొదటి అచ్చును కూడి, ఒక వర్ణముగా రూపొందును. అట్లేర్పడిన వర్ణములే అఖండయతి సంజ్ఞకములు. అంతేగాని, వర్ణమాలలోని అచ్చులు—హల్లులు అన్నీ అఖండయతులు కావు.

ఉదా-ఉక్కు+అఱు-ఉక్కఱు. ఇందలి 'క' అఖండయతి
'కఱవు'—ఈ పదములోని 'క' అఖండయతి కాదు.

ఇంకను ఉదాహరణ లెందుకు ! స్వర సంధి ఘటిత వర్ణములేగాని, సహజవర్ణములు అఖండయతులు కావు.

ఇది శ్రీ కృష్ణమూర్తిగారు ముఖ్యముగా గమనింపవలసిన విషయము.

ఉభయావళి, అఖండయతి

ఉభయవళి, అఖండయతి—రెండూ—ఒకటే. ఉభయవళికి నామాంతరమే అఖండయతి.

అచ్చుకూ, హల్లుకూ, ఉభయమునకును—చెల్లునన్న అర్థముతో 'ఉభయవళి' అన్నారు. అచ్చు, హల్లూ కలిసి, అఖండ రూపమును పొందుటను బట్టి 'అఖండయతి' అన్నారు. పేరులు రెండు గాని ప్రయోజన మొకటే.

ఈ యర్థమును, అప్పకవి,—

"ఒక్క సమసనమున శబ్దయుగము గూడి
పదము లేర్పాటుగాఁ గానఁబడని ప్రాణ
సంధులకు నిత్యసమసన (శ్రాంతులును న
ఖండ విశ్రమములు నన రెండుఁ జెల్లు" (3—135)

అని వివరముగా చెప్పినాడు. కాని, అతడు ఉభయవళి లక్షణములను చెప్పుటలో, ఎక్కువ చిక్కులు కల్పించినాడు. ఆ వళిని పన్నెండు విధములుగా విభాగించి, పన్నెండు పేరులు పెట్టి, పన్నెండు సూత్రాలు వ్రాసి, పన్నెండు వివరాలు చెప్పినాడు. అందువల్ల గ్రంథము పెరిగి, అభ్యాసకునికి క్లేశము హెచ్చినదే గాని, వేరే ప్రయోజన మేమీ కనబడ లేదు. ఆ యుభయవళులు పన్నెండును స్వరసంధులే. కనుక పన్నెండు వివరాలు చెప్పనక్కరలేదు.—"శబ్దసంధిలో, హల్లుతో గూడిన అచ్చు, హల్లుతోను మైత్రిని పొందును" అని చెప్పిన చాలును. కాని, అప్పకవి అట్లు చెప్పుటకు వీలులేదు. ఎందువల్ల ననగా :

సంధిలో కలిసిన పదములు, ఏర్పాటుగా కనబడక సమాసముగా నుండవలెననీ, అట్లుండిననే గాని, ఉభయవళి కాదనీ—ఆయన ఒక నియమము చేసికొన్నాడు. 'స్వరసంధులన్నీ ఉభయవళులే' నంటే, ఆ నియమమునకు భంగము వచ్చును. ఎట్లంటారా ? ఒకటి రెండు ఉదాహరణ లిస్తాము.

(1) ఉక్కు + అఱ—ఉక్కఱ. ఇది దేశ్య నిత్య సమాసము. కనుక ఉభయవళి.

ఉక్కు అడఁగు—ఉక్కడఁగు. ఇది సమాసము కాదు. కనుక ఉభయవళి కాదు.

(2) చిన్న + అన్న—చిన్నన్న. ఇది నామము. 'చిన్న—అన్న' అని విభజింపరాని సమస్త పదము. కనుక ఉభయవళి. దీనినే అప్పకవి 'నామాఖండవడి' అన్నాడు.

చిన్నవాడైన అన్నకూడా 'చిన్నన్న' యే. అయినను, 'అన్న' అను పదము, నామమును సూచించు పదముతో సమసింపలేదు. విశేషణమైన—'చిన్న' అను పదముతో సమసించినది. అందువల్ల ఉభయవళి కాదు—ఇదీ అప్పకవి మతము.

'ఉక్కడఁగు' సమాసము కాకపోయినను, 'చిన్నన్న' లోని 'చిన్న' నామసూచకము కాకపోయినను—ఆ రెంటను ఉన్నది స్వరసంధియే. కాబట్టి, అవియును ఉభయవళు లగుటలో, ఎట్టి విప్రతిపత్తియు లేదు.

అవియే కాదు. రాము డతడు, వారపుడు, నాతో వనియె—వంటి యెల్లసంధులును—ఉభయవళులు (—అఖండయతులు) కావచ్చును. కాని, అట్లగుట అప్పకవి కిష్టము కాదు. ఆయన నిషేధించినది ఇట్టి అఖండయతులనే. వీటి వరికట్టుటకే, నిత్య సమాసములకు, నామ సంధులకు మాత్రమే అఖండయతిత్వమును పరిమితము చేసినాడు. కాని ఈ నియమము యుక్తియుక్తముగా లేదు. ప్రాచీన కవుల రచనలకు అనుగుణమును కాదు.

అఖండయతిని కట్టుబాటులో పెట్టకపోతే, స్వరసంధులన్నీ అఖండయతులై, 'స్వర ప్రధానవళి' యనునది నిష్ప్రయోజన మైపోదా ? అను ప్రశ్న యొకటి యిక్కడ రావచ్చును. కాని, అది పాటింపదగిన ప్రశ్న కాదు.

స్వరప్రధానవళి యెక్కడికిని పోదు. అఖండయతిలో స్వరప్రధానత ఉండనే యున్నది. కవి తన అవసరమును బట్టి ఒకచోట స్వరప్రధానముగాను, దానినే ఇంకొకచోట వ్యంజన ప్రధానముగాను ఉపయోగించుకొంటాడు. స్వరమునకు యతి చెల్లించిన చోట స్వరప్రధానవళి, వ్యంజనమునకు చెల్లించిన చోట అఖండయతి. ఈవిధముగా అఖండయతి, రచనా మార్గమును విశాలముచేసి, రచయిత కెంతో సహకారి యగుచున్నది. అఖండయతిని వాడిన కవు లెవ్వరును స్వర ప్రధానవళిని వాడ మానలేదు. విరివిగా వాడియున్నారు. కాబట్టి అఖండయతికి బాధకమగు ననుకొనుట పొరపాటు.

భారతకవులు స్వరయతులతోపాటు, అఖండయతిని గూడా వాడియున్నారు. ఆ వాడినవిధమెట్టిదో తెలియుటకు, తిక్కన పద్యముల నుదాహరిస్తాను.

(1) "మీ, కొనరిన సైన్యముల్ పదు నొకొంటికి"
(ఉద్యో 4. 140)

'ఒక + ఒంటికి=ఒకొంటికి' — అని సంధి. ఇక్కడ స్వరము ప్రధానముగా గ్రహింపబడినది. కావున స్వరయతి.

ఈ విషయమును అప్పకవియే చెప్పినాడు—

"దీని మూఁడవ పాదంబునందు "పదునొకొంటికి" నని యున్నచోట సంధి గూర్చి స్వరప్రధాన వడిగాను సోమయాజులు ప్రయోగించినారు. ఇది తెలియక కొందరు మూఢులు దేశ్య నిత్య సమాసవడి యని యనుకొందురు." (అప్ప 3. 212)

(2) "పాండవుల వలనఁ గీడొ
క్కొండును లే దధిప ! నీదు కొడుకులు"
(ద్రో 1. 83)

ఇక్కడ, 'ఒక్కండు' లోని 'క' వ్యంజనముగా గ్రహింపబడినది. అందువలన అఖండయతి.

అప్పకవి 'ఒకొండు' లో సంధి యున్న దన్నాడు గనుక, తిక్కన యీ పద్యమున వాడినది అఖండయతి యగుచున్నది. 'ఆయన అఖండయతిగా వాడలేదు, దే. ని. సమాసయతిగా వాడినా'—డను పక్షమున ఆ కవిబ్రహ్మ "మూఢుఁడు" కావలసి వచ్చుచున్నది. అఖండయతి విముఖులు, ఇక్కడ ఏ పక్షము నంగీకరింతురో !

అప్పకవి, ఈ రెండవపద్యమును చూచినట్లు లేదు. చూచియే యున్నచో, అఖండయతిని తొలగించుటకు "కొడుకులు" అను పాఠమును మార్చివేసి యుండెడివాడే. ఎన్నో చోట్ల మార్చియున్నాడు. తాను పూర్వ పాఠములను మార్చినట్లు చెప్పికొనియు నున్నాడు. చూడండి :

"నన్నయ ముఖ్య సత్కవి జనంబుల కావ్యములందు లేఖకుల్
గొన్నియుఁ బాఠకాధములు గొన్నియుఁ దోకడఁ బెట్టి తక్కునై
యున్నెడఁ గాంచి జానపదు లోడక దిద్దిన తప్పు త్రోవ లె
ల్లన్నిజమంచుఁ గైకొనిన లక్షణవేత్తలు నమ్మరింతురే.
(3—202)

"అది యెట్లనిన సులక్షణసారంబునందు లింగముగుంట తిమ్మన వ్రాసిన యప్రశస్తంబులగు లక్ష్యంబులకు నాశ్చర్యంబు నొంది బహుపుస్తకంబులు నిరీక్షించి వాని నెల్లను ప్రక్షిప్తంబులుగా నెఱింగిన వాఁడనై లక్షణవంతంబులగు పురాతన కవి ప్రోక్తంబులు వివరించెద." (3—203)

ఇక, తిమ్మనాదు లిచ్చిన లక్ష్యము లెట్టివో, అవి యెట్లు అప్రశస్తములో, అప్పకవి పాఠము లెట్టివో, అవి యెంత లక్షణవంతములో కొంచెము విచారింతాము.

(పూర్వపాఠము)

(1) "చూచె మనంబునఁ దలంచుచుండుదు నేనున్"
(ఆది 5. 131)

ఈ పాఠమున నున్నది అఖండయతి. అందువలన అప్రశస్తము.

(అప్పకవి పాఠము)

"నూనె .... దలంతు సుందరి యెపుడున్"

అఖండయతిని తొలగించి, అప్పకవి, వ్యంజనవిరతిని చేర్చినాడు. అదే పాఠమును లక్షణవంతముచేయుట. అతడు తిక్కన పాఠములను గూడా లక్షణవంతములు చేసిన విధ మిదే. "సుందరి" అప్పకవి యతికోసము వచ్చినదే గాని, పద్యమున పని యుండి వచ్చినది గాదు.

(పూ. పా.)

(2) "ఘన్మరుఁ డగుచున్నయట్టి దివిజారిఁ గబంధునిఁ గాంచి రచ్చటన్." (అరణ్య. 6. 357)

ఈ పాఠమును, ముద్దరాజు రామభద్రకవి, తన 'కవిజన సంజీవని' లో అఖండయతికి లక్ష్యముగా నిచ్చియున్నాడు.

(అ. పా.)

"సం, హారుఁడుగు చున్నవాని దివిజారిఁ గబంధుని."

(3. 210)

ఈ దిద్దుబాటులో అప్పకవి చేసిన అనుచిత కృత్యములు రెండు. మొదటిది—ఎఱ్ఱన రచనను మార్చుట; రెండవది—తనకు పూర్వుడగు లక్షణకర్త అఖండయతికి లక్ష్యముగా నిచ్చిన పాఠమున యతిని మార్చుట.

(పూ. పా.)

(3) "అతిథి నినుఁ గోరె నేనియు
మఱిఁ గింకిరి పడక యోలమానఁగొనక."

(అను. 1. 68)

1917 వావిళ్ల ప్రతిలోను, 'హోలమానఁగొను' అను పదము క్రింద శ. ర. లోను, సూ. ని. లోను ఈ పాఠమే యున్నది.

(అ. పా.)

"అతిథి నినుఁగోరె నేనియు
వతిఁగింకిరి పడక యోలమానపడక." (3. 206)

"అతిఁగింకిరి" అని అచ్చు ప్రతిలో నున్నది. అది అచ్చు తప్పను కొని, 'అతికింకిరి' గా గ్రహించినను, సమాసము దుష్టము. "అతి కింకిరి పడక" అనుటలో 'మితకింకిరి పడి' అన్న అనుచితార్థము గూడా స్ఫురించుచున్నది. కనుక ఈ మార్పు గర్హ్యము.

(ఓలము+ఆన=) 'ఓలమాన' ఉభయవళులలో చేరినది. కనుక, అందలి 'ఆ', మకారముతోను మైత్రి నెనయును. అప్పకవి, అకార మకారములకు యతి చెల్లదన్న సామాన్య దృష్టితో, 'అ' కు యతి సరిపడునట్లు, 'మఱిఁ గింకిరి' ని, 'అతికింకిరి' గా మార్చినాడు. పొరపాటు. అది అఖండ యతి మీది 'అతికింకిరి' తో చేసిన పని. మతిమంతులు చేయ రాని పని. తిక్కన పాఠమును దిద్దుటయే తప్పు. తప్పుగా దిద్ది, 'అతికింకిరి' యను సంకర సమాసమును తిక్కన ప్రయోగించినట్లు, లోకమున వెల్లడించుట అంతకంటెను తప్పు.

'ఓలమాన' ఉభయవళి (—అఖండయతి) యనుటకు—

"కళికరి కల్లడంబు కడుఁ గట్టెడి దెమ్మెర లోలమాన గ్రవ్వర యెనలారు .... క్రిక్కిరియుట నా దెనుంగునకు నీ యుభయంబు వళి ప్రకారమై మెఱయు." (కావ్యా. చూడామణి 7. 69).

"అక్కఱ తెమ్మెర రూపఱ
గ్రక్కదలఁగ నోలమాన క్రవ్వర యను నీ
పెక్కు పదము లిరుదెఱఁగుల
నిక్కముగ నఖండవళి గణింతురు సుకవుల్."

(స. పా. సంగ్రహము. 2. 12)

అప్పకవి పాఠములు, అఖండయతి లేదనిపించుటకు కల్పింపబడినవే గాని, అసలు కవుల పాఠములు కావు. అందుకు సాక్ష్యము ఈ "అతికింకిరి" పాఠమొక్కటే చాలును. చర్చావిస్తర మెందుకు?

ఈ తీరున అప్పకవి ప్రాచీన పాఠముల నెన్నింటినో మార్చివేసినాడు. తరువాత, ఆయన మతము ననుసరించిన పరిష్కర్తలును, అదేపనిగా అఖండయతులను దిద్దసాగినారు. ఆ దిద్దుబాటులో మారిన పాఠములు కొన్ని చూపిస్తాను.

(ప్రాచీన పాఠము)

1. "తేరుల యొప్పు ప్రమోదువడఁ, దేకువలేని పదాతికోటి ను
గ్గై రుధిరమ్ములో మునుఁగఁ, గ్రమ్మిన యేనుఁగు పిండు"

(ద్రోణ. 1. 273)

(మార్పు)

"నుగ్గై ...... మునుఁగ నానిన యేనికపిండు."

(ప్రా. పా.)

2. "అని మఱియుఁ బెక్కు పేర్లన్
వినుతించుచు శరణు వేఁడి వినత శిరస్కుం
డను, ముకుళీకృత హస్తుం
డను నై యే నుండ దేవుఁ డతిశయ కరుణన్."

(అను. 1. 374)

(మార్పు)

"వినత శిరస్కుం
డును ముకుళీకృత హస్తుం
డును నై యేనుండ దేవుఁడు ప్రసాదమునన్."

(ప్రా. పా.)

3. "నీవును దల్లులు బంధుజ
నావళి పురజనులు హస్తినా పురమునకున్."

(అశ్వమేధ. 4. 93)

(మార్పు)

"జ, నావలియుం బరిజనములు హస్తి నగరికిన్."

(ప్ర. పా.)

4. "చెప్పు, వయ్య పుణ్యసతీ ప్రభావంబు నాకు."

(అరణ్య. 5. 3)

(మార్పు)

"వయ్య ...... ప్రభావాతిశయము."

(ప్ర. పా.)

5. "నిర్ణనుండై నను నింద్రుఁ బోలు." (భాగ.10.పూ.1699)

(మార్పు)

"నిర్ణ ...... నిద్రవోవు."

(ప్ర. పా.)

6. "నముచిదమనుండు పుత్తెంచినాఁడు నీకు"

(శృం. నైష. 3—120)

(మార్పు)

"నముచి ...... పుత్తెంచె—నాతి నీకు."

ఈ మార్పు 'వేదం' వారు చేసినది. వారీ నైషధము లోను, ఆముక్తమాల్యదలోను పెక్కుపాఠములు మార్చి యున్నారు. అప్పకవి లక్షణమును ప్రమాణముగా గొని, 'ఆముక్త' లోని ప్రస్వరాయతులను గూడా మార్చినారు. (చూ. సాహిత్య సమీక్ష. పుట. 349).

ఈరీతిగా పరిష్కర్తలు, పూర్వరచనలలోని అఖండ యతులను మార్చివేసినారు. కొంద రిప్పటికిని మార్చు చున్నారు. అట్టి వారిలో శ్రీ వి. రామకృష్ణరావుగా రొకరు.

వా రిటీవలనే, ఎఱ్ఱన హరివంశములోని,—

"వాణి న, త్తను నీతం డొకరుండవాఁ జను మహాత్మ్య స్థితిన్." (1—9).

అను మత్తేభ పాదములోని అఖండయతిని దిద్దుట కుద్యమించి నారు. (చూ. 1961. జూన్. 'భారతి'.)

వారి దిద్దుబాటువలన, యతి సరిపడకపోగా—పద్యా ర్థము గూడా పాడగుచున్నది. నే నీ విషయమును వివరించి, ఆ యతిని సవరింప యత్నించుట సమంజసకృత్యము కాదని హెచ్చ రించినాను.

ఇదే శ్రీ మంగిపూడి కృష్ణమూర్తిగారి విమర్శకు మూల మైన అఖండయతి చర్చ. వారు నా చర్చలోని యతితత్త్వమును గుర్తింపక, అప్పకవీయములోని ప్రయోగముల నెత్తి చూపి నారు. నేను వాటిని చూపకపోవుట, అజ్ఞతగా ప్రకటించి, న న్నొత్తిపొడుపుమాట లన్నారు. వా రిపుడైనను, అసలు విషయము నవగతము చేసికొని, తమ విమర్శలోని ప్రమాదమును మన ముకు తెచ్చుకొందురు గాక. నేటి అచ్చుప్రతులలో కనబడు చున్న అఖండయతులను కొన్నిటి నుదాహరించుచున్నాను. తిల కింతురుగాక.

1. "కాని నాగపురమున కొనరంగఁ జని రమ్య."

(ఆది. 1—24)

పురమునకు + ఒనరంగ—అని సంధి.

(ఈ పాఠమునుగురించి చెప్పవలసిన విశేషములు కొన్ని గలవు. కాని, ఇది చోటుకాదు.)

2. "దర్భరో, త్కరరవముల్ మహీరుహ శిఖాంతము లందు." (అరణ్య. 4—137).

శిఖా + అంతము—అని సంధి.

3. "దా, నము లొనరింతు రని నాచు నా దురితములన్"

(అను. 3—100)

పాచున్ + ఆ దురితములన్—అని సంధి.

"పురమున కొనరంగ" అని నన్నయయు, "పాచునా దురితము లను" అని తిక్కనయు అఖండయతులుగా వాడియుండగా, అప్ప కవి అఖండయతిని అప్రశస్తమని నిరసించుట భావ్య మగునా? ఆయన నిరసించుగాక; మనకు నన్నయ, తిక్కనల ప్రయోగ ములు ప్రమాణమా ? అప్పకవి మాట ప్రమాణమా ?

4. "శ్రమవేగంబునఁ దూఁగ నందఱు విహారాపేక్షులై"

(హరి. పూ. 6—97)

విహార + ఆపేక్షులు—అని సంధి.

5. "కల్పతరు శీ, లా కల్పదయావిలాస లాలిత సుజనా"

(హరి. ఉ. 6—44)

శీల + ఆకల్ప—అని సంధి.

6. "కాంచనో, న్నత రథమెక్కి భూరి పృతనావృతుఁడై"

(హరి. ఉ. 10—30)

పృతనా + ఆవృతుఁడై—అని సంధి.

ఈ తుది మూడు ప్రయోగములును, ఎఱ్ఱనవి. శ్రీ కృష్ణారావుగారు, ఈ మూడు అఖండయతులను గూడా మార్చి వేయవలె నందురో ! వీటినిబట్టి "మహాత్మ్యస్థితిన్" అను అఖండయతి పాఠము నంగీకరింతురో !

కవిత్రయమువారి యీ ప్రయోగముల ననుసరించి, పిమ్మట మహాకవులు వాడిన అఖండయతుల కిక లెక్కయే లేదు. వ్యాస విస్తర భీతిచేత, రెండు మూడు మాత్రమే— ఇచ్చుచున్నాను.

"ఆ, లోకన మాత్రమున ముక్తు లల్లసినలంగన్."

(కాశీ. 3—60)

"దనుజాధీశుఁడు మేడ డిగ్గి యతి చింతాక్రాంతచిత్తంబు నన్." (రామాభ్యు. 7—207)

"క్ష్మావలయు తుళువ కూపా
రావారమృగాంక యీశ్వర ప్రభు వరసా." (వరాహ 3 ఆ)
కూపార + అవార—అని సంధి.

అప్పకవికి ముందటి—వెనుకటి లక్షణ కర్తలు అఖండయతిని అంగీకరించి యున్నారు. ప్రయోగించియు నున్నారు.

లక్షణసార సంగ్రహము

"ఒక్క వర్ణంబు పూర్ణమూఁద నొకట స్వరము
గలయకుండంగఁ గూర్త రఖండయతులు
రాను పదపద్మలోల వరాళి యనుచు." (1—16)

వ. పా. సంగ్రహము

"హల్లునకు హల్లు వడి యిడు నపుడు దాని
తుదిని స్వరము ఘటిల్లిన నది యఖండ
వడి యనఁగఁ బొల్చుఁ గృతుల దేవాది దేవ
యనుచుఁ జెప్పిన శ్రీలకవ్యాధినాథ." (2—7)

ప్రయోగములు

"నాకౌకసుల నేలు నముచి సూదను పూజ
నతఁడు దాఁ గైకొన్న నందగోపాత్మజుఁడు."
(అనంతుని ఛందము. 3—57)

"మానుగ లెక్కింపఁ దుర్య మందురు పేర్మిన్."
(రంగరాట్ ఛందము)

ఇంకను ఎందుకు ప్రయోగాలూ—ప్రమాణాలూ. అఖండయతి నన్నయనాటినుండియు నున్నదే గాని, నడుమ వచ్చినది గాదు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుఁడు మొదలైన కవు లందరును, ఆయతిని ప్రయోగించి యున్నారు. ఆ ప్రయోగములను బట్టి, లక్షణకర్తలు—అనంతుడు, చిత్రకవి పెద్దన, ముద్దరాజు రామన, విన్నకోట పెద్దన, లింగంగుంట తిమ్మన—అఖండయతిని చెప్పియున్నారు. వారిలో కొందరు లక్ష్యము లిచ్చియున్నారు. కొందరు తమపద్యములలో ప్రయోగించియున్నారు. వా రందరును అప్పకవికి పూర్వులు. పూర్వులు చెప్పిన లక్షణము ననుసరింపవలసిన అప్పకవి, ఆ లక్షణకర్త లందరును ఏకగ్రీవముగా చెప్పిన—అఖండయతిని, అప్రశస్తమని యీసడించి, బహిష్కరించినాడు. వారు చూపిన లక్ష్యములను మార్చివేసినాడు. అది లక్షణకర్త చేయదగిన పని కాదు. లక్ష్యముల ననుసరించి లక్షణము చెప్పవలె గాని, ముందుగా తానొక నియమము చేసికొని, ఆ నియమమునకు సరిపడని లక్ష్యములను దిద్దివేయకూడదు. అది పద్ధతికాదు.

అప్పకవి భారతపాఠములను మార్చి, భారతములో అఖండయతులు లేవను భ్రాంతిని పుట్టించినాడు. ప్రాజ్ఞులును కొంద రా భ్రాంతికి లోనై, అప్పకవివలెనే, కంటబడు ప్రతి అఖండయతి ప్రయోగమును దిద్దగడగినారు. ఈ దురాచారము అప్పకవి తెచ్చిపెట్టినదే. భాషాక్షేమమును గోరు పెద్దలు ఆ యాచారమును తొలగించుట మంచిది. ప్రాచీన ప్రయోగములను బట్టి అప్పకవిలక్షణమును సవరించుట శ్రేయము. అప్పకవి సిద్ధాంతమునే ప్రమాణముగా గొని భారతప్రయోగములను మార్చివేయ బూనుకొన్నచో, ఆ ప్రయోగము లాధారముగా పుట్టిన ప్రయోగ ప్రపంచమంతా మార్చివేయవలసి వచ్చును. అది బ్రహ్మకైనను తరము గాని పని. బుద్ధిమంతులు తలపెట్టరాని పని.

ఈ యంశము లింతకుముందు, పలువురు విజ్ఞులు పలుమారు వెల్లడించినవే గాని, నేను క్రొత్తగా కనిపెట్టినవి కావు. కాకపోయినను, ఆ విజ్ఞుల విమర్శలు చదువక, అనవసర చర్చలకును, అనుచితసంస్కరణలకును దిగుచున్న తోడి విమర్శకసోదరులకు హెచ్చరికగా నుండునన్న భావముతో ప్రసక్తానుప్రసక్తముగా చెప్పినాను. నా యభిప్రాయములలోను, వ్రాతలోను పొరపాటు లుండవచ్చును. పండితులు పరీక్షించి తెల్పుదురేని సవరించుకొందును.

పరిహాయని వేలుపు

శ్రీ శ్రీపతి

వేసవికాల రోదన—ఆ కన్నీటిలో వర్షం. పశ్చిమ దిఙ్మండలంలో అరుణిమలు—రక్తం చిమ్ముతున్నట్టు. ఘోర రణ సూచన. కత్తుల క్రూరచలనంలా మెరుపులు. భీతావహంగావుంది. శూన్యంలో వంటరిగా చిక్కుకుంది. పెద్ద గాలి. క్రమంగా దుర్భరమవుతోంది. అంతవరకూ అక్కడ కన్పించిన వంశవృక్షం కన్పించడంలేదు. ఆ కలతో రత్నాలమ్మ కలవరపడింది. భయం వేసింది. పోలేరమ్మను తలంచుకొని కనులు తెరిచేసరికి ఉషోదయసంచలనంతో ప్రకృతి ఉషారుగా వుంది. కల జ్ఞాపకం తెచ్చుకోబోయింది. ఎంతకీ అందలేదు జ్ఞాపకం.

పెరట్లోకి రత్నాలమ్మ దృష్టి పోయింది. జామిచెట్టు, మల్లె పాద, దొండపాదు—తర్వాత కొంతదూరాన ఎండి మోడవుతోన్న మామిడి చెట్టు. ఇంకా దూరంగా దృష్టిపోతే నీలందిగంతాలు. ఆ మామిడిచెట్టు ఎండిపోతోన్నకొద్దీ మామయ్య ఆఖరోజుల్లో అనే మాటలన్నీ స్మృతిలో తటిల్లనడం, కళ్ళు చెమర్చడం, గుండె నీరసంతో బరువెక్కడం, ఆరోజు రోజంతా బందీలా బాధపడడం, గతమంతా కళ్ళముందు బలవంతంగా నాట్యమాడడం, భయం నిండిపోవడం, పోలేరమ్మని తలంచుకొని లేచి పనుల్లోకి దూరడం పరిపాటి అయింది.

ఆ చెట్టు వంశవృక్షం అనేవాడు మామ. ఆవృక్షం కళకళలాడిన్నాడు, యింట్లో కదురూ కవ్వం కిలకిల్లాడాయి. ఆ వృక్షం మూడు పూవు లారు కాయ లయింది. ఇల్లు నిత్య కళ్యాణం పచ్చ తోరణమయింది. ఆ వృక్షం మోడయిపోతోంది. సరి. ఆ పక్కనే ఆ చెట్టుకి వారసత్వంలా ఓ మొక్క వుంది. అయితే రత్నాలమ్మ ఆ మొక్కని నమ్మలేకపోతోంది. ఎన్ని మొక్కలు పుట్టలేదని! ఒక్క మొక్కనన్నా రక్షించుకోగలిగిందా? ఎన్ని లాలిత్యాలు పదులుగా తెచ్చుకొని ఎంతటి సౌందర్యంలో వాని వచ్చేవని—కొన్ని-రోజులు,—కొన్ని-వారాలు,—కొన్ని—నెలలు—వుండి, ఎన్నెన్నో ఆశలు రేకెత్తించి, ఊహ తీయనచేసి, చివరికి విషం చేసేసాయిగదా! ఒక్క మొక్కనన్నా లోకం నింద కడుక్కోవడం కోసమన్నా, నిలుపుకోలేకపోయిన తన శక్తిని శంకించిన ప్రతిసారీ ఆమె పోలేరమ్మని స్మరించుకొని—

కలువరేకుల నుంచి జలబిందువులు రాలాయి!

ఈ మొక్కని కూడా తను రక్షించుకోలేదా! పుట్టి రెండేళ్ళయిందేమో! ఎన్ని గండాలు! ఎన్ని బాలారిష్టాలు! పురుగుపట్టి ఆ లేత ఆకులు రాలిపోతున్నప్పుడు, నిర్జీవంగా బలహీనమై వాడిపోతున్నప్పుడు, ఆమె కూచొని తలబద్దలు కొట్టుకొనేది పోలేరమ్మ ముందు. అమ్మా! యీ ఒక్క మొక్కని బలికించు. గంపెడు గులకరాళ్లెందుకు? యీ ఒక్క రత్నమూ నీ వరప్రసాద మనుకొంటాం. నిన్నేకొలుచుకొంటాం. ఏటేటా మొక్కులు తీర్చుకొంటాం తల్లీ! ఇంక మాటలు పెగిలేవికావు. కన్నీరు తప్ప.

ఆ మొక్క పోయిందంటే రత్నాలమ్మగుండెలోని గాలి పంచ భూతాల్లో లీనమైపోతుంది. సందేహంలేదు. ఆ ఒక్క మొక్కని దినమో గండంగా పెంచుతోన్నది—కన్నీటితో. అది వాడిపోతూండడం, ఆకులు నాలుగయిదు రాలడం. భయం వేసింది. మొరపెట్టుకొంది.

"అప్పన్నా! ఓ రెణ్ణెల్లు మేకపాలు సంపాదించగలవంటే చెప్పు. మందిస్తాను" అన్నాడు ఆ వూరి వైద్యుడు, కన్నీటికి కరిగి ఆమె భర్తతో.

మేకపాలు సంపాదించడం కూడ కష్టమనిపించే పేదరికంలో ఆ సంసారం కొట్టుకుపోతోంది. ఎక్కడన్నా యింత ఆధారం దొరక్కపోతుందా, ఈ ప్రవాహంలోంచి బయటపడక పోతానా అనే ఆశతో అప్పన్న కళ్ళు మిగిలాయి. ఓతరం నాగరికతను తప్పించుకొన్న సనాతనుడు అప్పన్న అనుకోడానికి, జుత్తు ముడి, చెవుల్లో కందిగింజలంత కన్నాలు సాక్ష్యం.

రత్నాలమ్మ వీథిలోకి చూపులు తిప్పింది.

ఎదురింటి నాయుడిగారమ్మాయి తన పాపని వూయల్లోంచి యెత్తి, ముద్దిడుకొని, గుండెల్లో దాచుకొంది. అబ్బ! తన జీవాలు అమృతంతో నిండి, పొంగి కన్నీరులా అప్రయత్నంగా జారినపుడు—ఎదురింటి నాయుడిగారి భార్య ఏడు దినాల పాపని విడిచి చనిపోతే, తను తల్లి అయింది. కాని ఒక్కరోజు 'అమ్మా' అని—ఇప్పుడా పాప—ఓ తల్లి!

బరువుగా చూపులు కిందికి దిగేసరికి పాకలోని నెమరు వేసుకొంటున్న మేక కనిపించింది. ఆ మేకని చూస్తే ఆమెకి

జాలి. గత జన్మలో ఏ మహాతల్లో, ఈ జన్మలో ఈ మేకయిందని ఆమె నమ్మకం. పోలేరమ్మ తనకోసం ఈ అవతార మెత్తిందని అనుకొన్న రోజులు కూడా వున్నాయి. ఆ మేక—లోకం మిథ్యని స్పష్టమయినపుడు—సత్యమైన జ్ఞానంవేపు మనసు తిప్పుకొనే అంతరేక్షణలో వున్నట్టు—పడుకొని చూస్తోంది. పాలకోసం చిన్నారి మేకపిల్ల విరహంతో రోదిస్తోంది. పట్టించుకోవడం లేదు తల్లి. తనకి యజమాని అనబడ్డ ఓ వ్యక్తి వున్నాడని వాడే అన్ని అవసరాలు చూసుకొంటాడని మేక పరధ్యానం.

ఆమెకి సిగ్గేసింది. అబ్బో! ఆ మేక తనింటికివచ్చి రెండో ఈత యీనింది. మొదటి యీత మొగది. అది యిపుడు యెగువీధిలో తన తమ్ముడింట వుంది. అది మిగిల్చిన పాలతో తన మొక్క పెరిగింది. నవ నవ లాడింది. ఆ మేకపోతు ఈ మొక్కకి తమ్ముడు. మొక్క 'అమ్మా' అని మేకని పిలవదు. పిలిచినా మేక సంబరపడిపోదు—భ్రమున్నట్టు, కల్పన ఐనట్టు. తన కక్కుర్తిని సర్వ సంఘ పరిత్యాగిలా చూస్తుంది. తన ఆ చిన్నారి మొక్కని చూస్తోంటే గర్వంగా వుండేది. భయం పోయేది. ఆ వృక్షం యెండిపోయినా పోనీ. యిది మిగుల్తుంది. యిది చాలు. పూస్తుంది. ఎన్నో కాయలు కాస్తుంది. అన్నీ కాయలూ పళ్ళు కాకపోయినా కొన్నన్నా అవుతాయి. ఇదంతా ఆ మేక చలవ. ఆ పోలేరమ్మ చల్లని చూపు. మరోసారి వందనం చేసింది తల్లికి—రత్నాలమ్మ—భయంతో, భక్తితో.

తన పక్కలోని బాబు కదిలాడు. రత్నాలమ్మ వేయి కళ్ళతో వెదికింది. మళ్ళీ సర్దుకొని నిద్రలో ముకుళించుకు పోయాడు. మేకపిల్ల ఆకలి రోదన వినిపించింది. అంత అరుస్తోంది ఆపిల్ల. ఆ తల్లికి పాలిద్దామనే బుద్ధి లేకపోయినా, లేచన్నా చూడదేం? పశువులూ అంటారు. అందుకే. అయినా బిడ్డతీపి దానికేం తెలుసు? ఆ మామిడిచెట్టూ, ఈ మేక ఒక్కలాంటివే. అది తన మొక్కలు గతించినపుడు కన్నీరు కార్చ లేదు. తనకు తెలీనట్టు, బాధ లేనట్టు, తన ఆధీనం కానట్టు వూరుకొంది. ఈ మేక కూడా అంతే యిపుడు. 'అమ్మా! ఇదేమి లీల!"

ఒక్క మొక్కనన్నా నిలబెట్టుకోలేకపోయింది. పాడు ముండచెట్టు. దరిద్రం. అరిష్టం. ఎన్ని మొక్కలు పుట్టా యని! అన్నిటినీ తిన్నది. పాపిష్టిముండ. పిల్లలని తినేస్తోంది. రాక్షసి అని లోకం నిందించింది చెట్టుని. ఆ మొక్కలని తెంచే యటానికి ఆ భగవంతునికి యెలా వచ్చాయో చేతులు! ఆమె తోట మొక్క దగ్గర కూచొని, నే నీ మొక్కని తీసేసినట్టే, నా మొక్కనీ భగవంతుడు తీసేస్తే. . . .' అనుకొనేది. ఆమె చేతులు వణికేవి. కళ్ళు చీకట్లుకమ్మి భూమి గిర్రున తిరిగేది. అక్కణ్ణించి లేచిపోయేది. అపుడు. ఆ మొక్కలన్నీ వుంటే—ఎంత కళకళ్ళాడేదో తోట! ఎన్ని పూవులు! ఎన్ని పండేవో! ఎంత సింగారంగా వుండేదో!

నాలుగేళ్ళ మొక్కయిందని, నవనవలాడుతోందని సంబరమేగాని, యిది మాత్రం బ్రతుకు అరణ్యరోదన చేయదని నమ్మకమేమిటి? సంవత్సరంక్రితం మేకపోతు విరిచేయలేదూ—ఓసారి.

రత్నాలమ్మ పెరటిలోని మొక్కని చూసింది. ఆమె శరీరం జలదరించింది. భయం వేసింది. మనస్సులో చీకటి కమ్ముకొంది. చీకటిలో దీపంలా కన్పించింది పోలేరమ్మ. ఆ దీపం చూపిస్తుంది దారి అని ఆమె ఆశ. అది మరో దీపంగా వెలిగింది. దీపాలు వెలుగుతున్నాయి. అంతే. చీకటి వుండనే వుంది. ఆ చీకటి వుండకూడదని, ఈ దీపాల వెలుగుతో దారి స్పష్టమవాలని ఆమె ఆశ. కాని ఆ దీపాలు వెలుగులో వుంటే వాటికి మాత్రం విలువేమిటి? లోకం ఈ దీపాలని తృణప్రాయంగా చూడదా ? అలాంటి ప్రశ్నలవేపు ఆమె యెపుడూ మనసు తిప్పలేదు. ఇంకా భయం వేస్తూనేవుంది. అందుకే గద—ఆ మేకపోతుని యెగువీధిలో తమ్మునింట విడిచినది. అబ్బో! ఆ మొక్కని తన పొట్టలో పెట్టుకొనేదే. పోలేరమ్మ రక్షించింది.

* * *

రత్నాలమ్మ పొరుగింట్లోకివెళ్ళింది గాబోలు. అమ్మ వంటింట్లో వుంటుందని, అంతవరకూ బయట పిల్లలతో ఆడుకొన్న బాబు, వంటింట్లోకి దూరాడు—'అమ్మా' అని పిలుస్తూ. నల్లగా కన్పించింది. గదిలో చీకటి. కుండలు శబ్దం చేస్తోంది. సన్నని ద్వారం. ద్వారం దగ్గర బాబు. భయంవేసింది బాబుకి. భయంతో జడిసి కేకేసాడు. కేకకి ఉలికిపడింది మేకపోతు. అప్పటికి సంవత్సరంది. నడుమెత్తుంది. బయటికి వచ్చే ప్రయత్నంలో పడిచేసింది. బాబు యింకో గావుకేక వేసాడు. పడిపోయిన బాబు మీంచి మేకపోతు చెంగున యెగిరిపోయింది. తనమీంచి యెగిరిపోతున్న మేకపోతునిచూసి, బాబు, భయోత్పాతంగా అరిచాడు. ఇంతలో రత్నాలమ్మ వచ్చింది. తెగిన కొమ్మలా పడిపోయి, లబో దిబోమంటూ బాబుని గుండెకు హత్తుకుంది.

రెండు దినాల జ్వరం క్రమంగా వారానికి పెరిగింది. పక్షమయింది. వైద్యులు పెదవి విరిచారు. కలవరించేవాడు బాబు. పెద్ద పెద్ద కేకలు భయంకరంగా వుండేవి. కళ్ళు మూయకుండా చూసేవాడు. పళ్ళు బిగపట్టి పటపటలాడించేవాడు.

రత్నాలమ్మ కళ్ళల్లో దీపాలు పెట్టుకొని చూసింది. చిక్కి శల్యమైపోయింది. ఆ పక్షం దినాలు ఆ కుటుంబంలో

విద్రాహారాల్లేవు. మేకలని కూడా మరచిపోయారు. మేకపోతు అరచేది. ఇంక దాని బాధ పడలేక తమ్ముని ంటికి పంపించేసింది.

భూతవైద్యుని తెచ్చి చూపించమన్నారు వూళ్లో పెద్దలు. వాడో అపరసంధ్యవేళ అయినింటిలో, ఓ చదరంలో రంగుల ముగ్గు వేసాడు. కోడి కావాలన్నాడు బలికి. పారా కావాలన్నాడు మత్తుకి. మందారవూలూ, నవధాన్యాలూ, మొక్కుబడులూ అన్నీ చెల్లించుకొని వికారంగా, భీతిజనకంగా ధ్వనులుచేసి కులదేవత అని చెప్పి వెళ్ళిపోయాడు.

రత్నాలమ్మ తన ప్రాణాన్ని బాబులో దాచుకొని చూసేది. విషాదాంతమౌతోన్న మాతృత్వంలో బహిర్గతమయ్యే అంతిమయత్నమూ, సాహసమూ ఆమెలో కన్పించేవి.

రెండోరోజు దాసుణ్ణి తెచ్చారు.

అయినింటిలో తూర్పున ఓ చదరపు గజం భాగం ఆవు పేడతో అలికాడు. పద్మంలా ముగ్గు వేసాడు. ముగ్గుమీద ముంత పెట్టాడు. ఆముంతమీద పది వత్తులతో దీపాలు వెలిగించాడు. ఒక్కో వత్తికి ఒక్కో దేవత—పేరు. ఏ వత్తి వూలు రాలిస్తే ఆ దేవత పలికినట్టు. ఆ దేవతని కొలవాలి. అప్పుడే మొక్కుబడులేవిటో చెబుతుంది దాసుడి వాణిగా—ఆ దేవత.

చుట్టూ పదిమంది అమ్మలక్కలు మూగారు—ఏ దేవతో చూడాలని. నిలదీసి అడగాలని.

జ్యోతులు వెలుగుతున్నాయి.

ముఖం నిర్మలంగా, కళ్ళు కాంతివంతంగా, శివి గంభీరంగా వుండి, ఆకర్షణీయంగా వున్నాడు దాసుడు. నుదుట కుంకుమ నిలువబొట్టు కొత్త తేజస్సుని ప్రసాదిస్తోన్నది. జుత్తు ముడి విప్పారి వీపుమీద వ్రేలాడుతోంది. బొద్దు మీసాలు, నెరసీ నెరవని గడ్డమూ, పసుపు పచ్చ పంచె, శాంత స్వరూపం అనాది మునీశ్వరులని స్మృతిలో నిలుపుతున్నాయి.

కనులు మూసికొని అవధాన ఆవాహనంకోసం ఆలాపన చేసాడు. అది క్రమంగా ఆ చుట్టూవున్న జనంలో మానసికాతీతమయిన పారవశ్యతని కలిగించే రాగంగా మారింది. జ్యోతి వువ్వులు రాల్చింది. కులదేవత! పోలేరమ్మ!

ముంత, వెలుగుతున్న వత్తులతో, తలమీదుంది. దాసుడు కంఠం హెచ్చించాడు. "ఓరి నరుడా. . . .నరుడా..... నీవు కంటికి కింపయినవి కనిపిస్తే నను మరచిపోతావురా! నరుడా—ఓరి నరుడా....' నీకునీవే శత్రువ్వర.... నన్నిడవురు నరుడా.... దూతలు నన్నిడవురా' అంటూ తన్నెప్పుడో మరచారని, ఎన్నో కష్టాల్లో ఆ కుటుంబాన్ని ఆదుకొంటోందని, 'నీ పువ్వానికి నీడనై కాపాడుతున్నామిక నరుడా. . . .దూతలు తినేస్తున్నార్ర. . . . నా యాగభోగాలు మరచినావురా. . . .నా గుడిలో ధూప దీపాల్లేవుర. . . .నాకు పూజా పున్నమూ లేదుర. . . .అని కోరిక చెప్పింది.

'తల్లి పిల్లమీద కోప్పడితే అవుతుందా?' 'ఆ పసికందుని అలా నలిమేయడం నీకు ధర్మమా తల్లీ' 'నీ కంటే మా కింకో దిక్కెవరున్నారమ్మా' అని అక్కడున్న అమ్మలక్కలు తలో ప్రశ్నవేసి, నిలదీసి అడిగారు.

రత్నాలమ్మ మొక్కుబడి చేసింది. కొడుకు పది దినాలకి లేచి కూచొంటే, వచ్చే భాద్రపదమాసంలో, మొక్కుబడి తీరుస్తానంది.

* * *

చాల రోజులనించి తొందరపడుతున్న ఆ రోజే యిది. గుర్తు రావడంతో రత్నాలమ్మ బద్ధకంగా లేచి నిలుచొంది. తేనెరంగు శరీరం, ఆమె హృదయంలోని మాతృత్వం అనయువాల్లోనూ, చూపుల్లోనూ స్పష్టమౌతోంది. వన్నెందనంవలన పాడవరిలా ఐ పూలతో బరువెక్కిన లతలావుంది.

* * *

గ్రామానికి పశ్చిమాన కొండలమీది సూర్యునికి మేఘాలు నీలం మణులతో గుడికట్టాయి. దూరంనించి భక్తజనంలా రంగు రంగుల మేఘాలు, వేడుకలతో, మొక్కుబడులతో బాజా భజంత్రీలతో వస్తున్నాయి. పైరుగాలి పల్లవి పాడుతోంది. హృదయంలో అమరగానం దివ్య సందేశాల నీనుతోంది.

కొత్త ప్రవాహంలా జనం. నవ వధువుని చూస్తున్నట్టున్నాయి చెట్లు. గట్లు దాటితే యిరుప్రక్కలా తీయని ఊహలు మోస్తున్న సస్యలక్ష్మి. రత్నాలమ్మ పూజ మోస్తోంది. దాసుడు ధూప దీపాలు అర్పిస్తున్నాడు. ఉపవాసంలో వుండడం వలన భక్తి గాఢమూ, నిర్మలమూ అవటంవలన ఆమె లావణ్యరూపానికి దైవ వర్చస్సు తోడయింది. పువ్వు చుట్టూ నాట్యమాడే భ్రమరంలా, సామాన్యుడు సహితమూ ఆమె కాంతితో ఆకర్షింపబడుతున్నాడు. కళ్ళు పవిత్రతని కురుస్తోన్నాయి. ఆమె యే పరవశతతో నడుస్తోందో అగోచరం.

అప్పన్న మిగతా అవసరాలని తీర్చే హడావిడిలో దాసుడి దగ్గరే వడుస్తున్నాడు. భార్యను చూస్తోంటే భక్తిభావం పొంగుకొస్తోంది. భార్య కాదామె అప్పుడు. పోలేరమ్మ. అమ్మలకి అమ్మ.

రత్నాలమ్మ భర్తని చూడడంలేదు. బాబునీ వెతకడం లేదు. ఈ జనమూ, ఈ కోలాహలమూ ఆమెకి తెలుస్తున్నట్లు

లేదు. వేణుగానంవేపు పరవశంగా పరుగెత్తే గోమాతలా పోతోంది.

గుడి చేరారు. వేపచెట్టుకింద పన్నెండడుగులకంటె యెత్తుండని చిన్న గుడి—చుట్టూ మొగలి పొదలు. జనం గాలికివూగే పూల తోటలా కన్పిస్తున్నారు. చెదిరిపోయిన పాదరసంలా సౌందర్యం కదులుతోన్నట్టుంది.

దాసుడు, గుడిలో పోలేరమ్మ పూజలుచేస్తున్నాడు. హృదయాలని క్షణం సత్యంతో వత్తెక్కించే వాసన లక్కడ మళ్ళు తిరుగుతున్నాయి. శ్రవణేంద్రియాలకు పనిపెట్టే కోలాహలం. రత్నాలమ్మ యేం చేస్తోందో ఆమెకి తెలీడంలేదు. దేవి తన సజీవతకి ఆమె నుపయోగించుకొన్నట్టయింది. దాసుడు చేయమన్నదంతా చేస్తోంది. ఓ పది హేను నిమిషాలు హడావిడితో పూజ పూర్తయింది.

అంతా పక్కకి తప్పుకొన్నారు. దేవి చూపులకు ఎదురుగా, పది గజాలదూరంలో మేకపోతును నిలబెట్టారు. మచ్చలేని నల్లని మేక. బలంగా పెరిగింది. దాన్ని సరిగ్గా నిలబెట్టడానికి నలుగురి ప్రయత్నం అవసరం అవుతోంది. కొమ్ములకు కర్ర నేసి కట్టిపట్టుకొన్నా దొకదు. సరిగా నిలబడడంలేదు. వెనుక కాళ్ళతో గెంతు లేస్తోంది. ఓ దృఢకాయుడు వెనుక కాళ్ళు గట్టిగా పట్టుకోవాల్సి వచ్చింది.

దేవి చూస్తోంది—గుడిలోంచి. జగన్నాథస్వామి దగ్గర సుభద్రాదేవిలా గుండ్రని కళ్ళు. పసుపుపచ్చని ఛాయ. నల్లని చీర. అభయహస్తం. సృష్టిలోని ప్రేమతో మత్తెక్కిన చూపులు. అంతటి హృదయం ఈ మేకపోతు బలి కోరిందంటే—అందరూ నమ్ముతున్నారు. నిరోధించే యత్న మొక్కరిలోనూ కన్పించలేదు. చిన్న పిల్లలని దూరంలో వుంచుతున్నారు పెద్దవాళ్ళు. కాని బాబు నెత్తుకొన్న తమ్ముడు మాత్రం ఆమేకపోతుని చూస్తూ, దగ్గరే నిలబడ్డాడు.

మెరుపూ మెరుస్తున్న కత్తి, బలంగా, పిడుగులా కిందికి పడేసరికి మేఘాలు ఆఖరిగా ఉరిమి, రక్తంలో మునిగితేలాయి. తమ్ముడిచేతవున్న బాబు, మేకపోతు గిజ గిజ తన్నుకోవడం, రక్తం దేవి యెదురుగా చిమ్మడం చూసాడు. అలా తన్నుకోంటుంటే బాబుకి తనమీంచి యెగురుతోన్నట్టు అయింది. తన గుండెమీద నిలబడ్డట్టయింది. కళ్ళుమూసికొని గావు కేక వేసాడు. ఆ కోలాహలంలో ఆ కేక రత్నాలమ్మకి వినిపించిందో లేదో!

సూర్యుడు లేడు. వెలుగు చీకటవుతోంది. జనం యిళ్ళకి తిరిగి పోతోన్నారు. అంతా కార్యం జయప్రదంగా ముగిసినందుకు సంతోషంగా వున్నారు. రత్నాలమ్మకి దినమంతా వ్రతపాలన—నీరసం—దేవి మొక్కుబడి తీర్చాలనే పట్టుదల — తీర్చామనే సంతోషం—సంతృప్తి మొదలయినవి కలిపి, యింకో యోచనకు దారే లేకపోయింది. ఆ జనం వెనుకగా నలుగురు మనుషులు ఆ మేకపోతు కళేబరం మోసుకొస్తున్నారు.

మేఘాలన్నీ చెదిరిపోయాయి. జనంలో స్తబ్దత పెరిగింది—ప్రకృతి మౌనంగా వున్నట్టు.

నవమి వెన్నెల. పలచని తెలిక మేఘాలు పాప తళ్కిలా వున్నాయి. శీతలం అనుకోడానికి వీల్లేని గాలి వీథుల్లో కుంటిగా తిరుగుతోంది.

రత్నాలమ్మ ఇల్లు చేరుకొని, కొంత విశ్రాంతి తీసుకొని యింత ప్రసాదం తిని, వాస్తవజీవితంలోకి కోలుకొంది. అప్పటికి వూర్లో, భోజనాల వేళయిందేమో, మాటు మణిగినట్టు నిశ్శబ్దంగా వుంది.

పెరటికి వెళ్ళింది. దూరాన మోడవుతోన్న వృక్షం కింద చిన్న సందడి వెన్నెల్లో కన్పించింది. ఓ కొమ్మకి మేకపోతుని వ్రేలాడగట్టి చర్మం వొలిచి మాంసం తీస్తున్నారు. ఆ చూపులు దగ్గరకు తీసుకొపేసరికి మొక్క మొదలంటా నరకబడి విరిగిపడివుంది. ఎవరు??! ఎవరు?!! బయట తమ్ముని చుట్టూ జనం మూగివున్నారు. వైద్యుని గొంతులో వైరాగ్యం విన్పిస్తోంది. ఆమె పాదాలకింద భూమి గిర్రున..... గిర్రున తిరుగుతోంది. "నే నీ మొక్కని తీసేసినట్టే—నా మొక్కని భగవంతుడుతీసేస్తాడు'. అనేస్తాడు. తన పాలతో మేక తన మొక్కని రక్షించింది. తన బిడ్డని మేక—తన బిడ్డ కోసం బలి యిచ్చింది. తన బిడ్డని తనే తినేసింది. తను రాక్షసి. పిల్లలని తినేస్తోంది. పాడుముండ. అబ్బ! కళ్ళు చీకట్లు...... గిర్రున......గిర్రున భూమి.

మేక అరుపు......బాబు గావు కేకలు.....విరిగిపోయిన చిన్నారి మొక్క......మోడయిపోతున్న వంశవృక్షం.....దేవి మొక్కుబడి బలి......అన్నీ.....బ్రహ్మాండంలా పెరిగి, పెరిగి ఆమెని శూన్యంలోకి విసిరేస్తున్నట్టయింది. శూన్యంలోకి. శూన్యం......లోకి!

ఎప్పుడో, ఎక్కడో యిలాంటిదే, చూసినట్టో, విని నట్టో అనుభవంలా, కలలా, స్మృతి. అప్పటి కామె భూత మావేశించినట్టు పాము నోటిలోని కప్పలా, 'వొద్దూ...వొద్దూ' అని అరచి వీథిలోకి దుమికి పడిపోయింది.

ఆ పడిపోయిన శబ్దంతో మేక తుళ్ళిపడి లేచింది. పడుకొన్న, పక్కనున్న మేకపిల్ల కూడ లేచింది భయంతో.

శబ్దం లిప్తలో నిశ్శబ్దంలో లీనమైపోయింది.

ఆమె చుట్టూ కంటనీరుపెట్టే జనం పోగయారు.

అప్పన్న హృదయవిదారకంగా రోదిస్తున్నాడు విహ్వలుడై.

ఆ వీథి మధ్య జనం రొదగానీ, రోదనగానీ, మేక లక్ష్య పెట్టలేదు. "ఎప్పుడూ వుండేదే" అనే సత్యం తనకు తెలిసినట్టు, తనకు సంబంధించనట్టు పడుకొని నెమరువేసుకొంటోంది—నిర్విచారంగా, సుఖ దుఃఖాలకు అతీతంగా. మేకపిల్ల కూడ.

ద్రావిడభాషాసామ్య పదకోశము

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

ద్రావిడభాషా కుటుంబమునకుఁజెందిన తమిళము, తెలుఁగు, కన్నడము, మలయాళము, తులు భాషలలోని సామ్యపదముల సంకలన మీ యుద్గ్రంథము. మదరాసు విశ్వవిద్యాలయములోని తమిళ, తెలుఁగు, కన్నడ, మలయాళ శాఖలకుఁ జెందిన పరిశోధక విద్వాంసులు కలసి యించుమించుగా నిరువది సంవత్సరముల కాలము పరిశ్రమించి చేసిన సమష్టి కృషిఫలిత మిది. ద్రవిడ భాషలకు సంబంధించి భాషాశాస్త్ర పరిశ్రమ చేయనెంచినవారి కిట్టిపదపట్టిక లెంతేని నుపకరించుననుట కెట్టి సందియమును లేదు. ద్రవిడ భాషా పదముల పరిణామమును కనుఁగొనుట కును, నదే కుటుంబములోని యితర భాషలలోని పదజాలమే మాత్రముల ననుసరించి మార్పుల నందుచున్నదో తెలిసికొనుట కును, నివి మిక్కిలి సహాయకారులు కాఁగలవు. ఆయా భాషల లోని నిఘంటువులు ముఖ్యముగా కన్నడమున కిట్టెలు నిఘంటువు, మలయాళమున డాక్టరు గుండర్టు సంపాదించిన నిఘంటువు, తెలుగున సూర్యరాయ వారి నిఘంటువు లితర భాషల లోని సామ్యపదముల నచట నచటఁ బ్రసక్తవశమున నిచ్చి యున్నను భాషాశాస్త్ర పరిశ్రమ కనువగునట్లుగా నవి యొక్కచో సంకలితము కాలేదు. గ్రియర్సను మహాశయుండు రచించిన 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' అను గ్రంథములో భాషల పరస్పర సంబంధమును స్థాపించుటకై కొన్ని పట్టికల నిచ్చి యున్నను, సమగ్రములు కాకపోవుటచే నవి శాస్త్రపరిశ్రమకు జాలియుండ లేదు. తమిళమునను, తెలుఁగునను షడ్భాషామంజరి వంటి కొన్నికోశములు ప్రచురింపఁబడియున్నను నవి ఇతర భాషలలో నొకపాటి పరిజ్ఞానమును గలిగింప జాలినవై వ్యాపారాదుల నిర్వహణమున సహాయకారులగుచున్నవి కాని భాషా శాస్త్రరీతిని నేవిధముగాను దోడ్పడఁదగిన స్థితిలో లేవు. బ్రాహూయీ భాషకు సంబంధించి సర్ డేన్స్‌బ్రే యనునతఁడు కూర్చిన నిఘంటువు భాషా శాస్త్ర దృష్టితో జూచినపుడు చక్కని సంకలనమే యయినను నది ద్రావిడభాషా కుటుంబమునకు జెందిన యొక వర్గమునకు మాత్రమే సంబంధించినది యగుటచేత నదియు నాశించినంత ఫలిత మందీయఁజాలకున్నది. కాల్డ్వెలు మహాశయుఁడు తన 'Comparative Grammar of the Dravidian Languages' అను గ్రంథమున నొక యధ్యాయములో 'ధ్వని'ను గూర్చి చర్చించుచు ఒక భాషలోని పదములు మరొక భాషలోని కెట్లు సాగునో తెలిపి యున్నాఁడు. కొన్ని సందర్భములలో నా యా పదముల మూల స్వరూపములను గూడ గుర్తించుట కాతడు ప్రయత్నించియుండుట యథార్థము. అందాకఁ డేవో యొక కొన్ని పదములలోఁ గానవగు సామ్యముల నాధారపఱచుకొని భాషా పరిణామ మాత్రముల గర్పించుటకు యత్నించెను. కాని యా సామాన్య మాత్రముల నంగీకరించుటకుముందు మనకు లభించిన సమస్త వస్తుసామగ్రి సహాయమున జక్కఁగా బరిశీలించి యందు మార్పులు చేర్పులు చేసికొనవలసిన యవసర మెంతేని యున్నది. ఇట్టి విధమయిన భాషాపరిశ్రమకు 'సామ్యపదకోశ' మొకటి మిక్కిలి యావశ్యకమగుట నిర్వివాదము. పూజ్యులు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారీ యుద్దేశములోనే 1944 సంవత్సరంలో 'Dravidian Cognates' అను పేర నొక గ్రంథమును మదరాసువిశ్వవిద్యాలయముయాజమాన్యమునఁ బ్రచురించి యాంధ్రుల కృతజ్ఞతకు శాశ్వతముగాఁ బాత్రులయిరి. కాని యా గ్రంథమునకు వారు వెలయించిన పీఠికయందుఁ దెలిపినట్లుగా నా పదముల సంకలన మా యా భాషలలోని నిఘంటువుల సాయమున జేయఁబడియున్నది. వానికలోని రూపములన్నియు నిఘంటువుల కెక్కియుండుట సంభావ్యము కాకపోవుటచేతను, ఒక భాషలోని రూప మదే యర్థమునఁగాక వేఱొక యర్థములో, నితర భాషలో, మఱొక పదమున భాగముగానో, భిన్నముగానో యడఁగియుండుటకూడ సంభావ్యమే యగుట చేతను, నది నిఘంటువులవలెనే అకారాదిగా కూర్పబడి యుండుటచేతను—విషయ విభాగములుగాఁగాక—యా గ్రంథ మీ విషయమునఁ దొలిప్రయత్నమే యయ్యును భాషాశాస్త్రవేత్తలకు మిక్కిలిగా నుపకరించినది. మదరాసువిశ్వవిద్యాలయమువారిచే నేఁడు ప్రకటితమయిన యీ గ్రంథ మకారాదిగాఁగాక విషయ విభాగముల ననుసరించి కూర్పబడినది. ఇందు

1. Heavenly Bodies (దేవవర్గము)
2. Cardinal Points (దిక్కులు)
3. Five Elements (పంచ భూతములు)
4. Mountain (పర్వతము)
5. Forest (అరణ్యము)
6. Field (చేను)
7. Sea (సముద్రము)
8. Flora and Fauna (వృక్షములు, జంతువులు)
9. Aquatic Animals (జల చరములు)
10. Insects etc (కీటకాదులు)
11. Human body (మానవ శరీరము)
12. Agriculture (సాగుబడి)
13. Agricultural Products (పంటలు)
14. Food Products (ఆహార పదార్థములు)
15. Life (జీవితము)
16. Diseases (రోగములు)

17. Dress (ఉడుపులు)
18. Instruments (పనిముట్లు)
19. Buildings (కట్టడములు)
20. Household articles (గృహ పరికరములు)
21. Worship (పూజ)
22. Culture (సంస్కృతి)

అను ఇరువదిరెండు విభాగముల క్రింద రెండువేల పదములు తమిళము, తెలుగు, కన్నడము, మలయాళము, తులు అను ద్రావిడ భాషలలోని సామ్యపదములతోఁ గూర్పఁబడినవి. మదరాసు విశ్వవిద్యాలయోపాధ్యక్షులు తమ తొలి పలుకున,

'This represents the co-operative effort of the Departments of South Indian Languages namely Tamil, Telugu, Kannada and Malayalam and although it has taken 20 years to complete the work in view of the exceedingly difficult nature of the task, and the fact that many references had to be made at joint consultations, it would be clear that the work was both arduous and difficult.'

అనుట ప్రత్యక్షర సత్యము. సాహిత్యమునందు ప్రగాఢమయిన పరిచయముఁ, వాడుకలోని భాషాపదముల తీరు, ఇతర భాషా సామ్యముల సాయమున స్వభాషలోని సామ్యపదమును గుర్తింపఁగల యనుభవము, ఇతర ద్రావిడ భాషలతోఁ గొద్దిపాటియేని పరిచయము అనునవి సాధారణముగా నిట్టి పదకోశముల సంపాదకుల కుండవలసిన ముఖ్యయోగ్యతలు. ఈ కోశమునఁ దెలుఁగునకు సంబంధించినంతవఱకు సామ్యపద నిర్ణయమునందు బనిఁగొనిన పరిశోధక విద్వాంసులు శ్రీ నిడుదవోలు వెంకటరావుగారీకార్య భారము వహించుటకు వలసిన యోగ్యత లన్నియుఁ గలవారనుటకు సందియములేదు. ఇందనేక పదముల విషయమున ముఖ్యముగా నే సమాసరూపములోనో యడఁగియున్న సామ్యపదములను గుర్తించుటలో వారు ప్రదర్శించిన ప్రజ్ఞ వారి సాహిత్యానుభవమునకు, భాషా పరిచయమునకుఁ జక్కని తార్కాణ మగుచున్నది. ఇతర భాషలలోని సామ్య పదముల మంచి చెడ్డలు విమర్శించుటకుఁ దగిన యధికార మీ రచయిత కా యా భాషల యందు లేదు. కాని తెలుగు సామ్యములకు సంబంధించినంత వఱకుఁ గొన్ని పదముల విషయమున శ్రీ వెంకటరావుగారు సామ్య రూపములను దప్పుగా నిచ్చిరనియు, మఱికొన్ని పదముల సామ్యములను వారు గుర్తింపనే లేకపోయిరనియుఁ జెప్పవలసి యున్నది. ఈ మాట యనుట యీ విషయమున వారియొక్క గొప్ప కృషిని కొంచె పఱచుటకాదు. దానికే మఱొకచేయి కలిపి ముందడుగు వేయుటకు ప్రయత్నించుట. ప్రతి విషయ విభాగము క్రిందనుఁ గల పదసామ్యము లీ దిగువఁ బరిశీలింపఁ బడుచున్నవి. సూచితసంఖ్య పదసంఖ్యను దెలియఁజేయును.

Heavenly Bodies (దేవ వర్గము)

9. అంబులి యనుటకు 'జాబిలి' యని యిచ్చి యుండఁ దగును.
12. పిరై—పిఱ.

Cardinal Points (దిక్కులు)

20. వడక్కు—వడ (వడగాలి, వడగాడ్పు) చూ. (37) లో వాడయ్ అనుటకు వడ in వడగాలి అని యిచ్చియున్నారు.
21. తెర్కు—తెన్ (తెమ్మెరలో తెన్, టెంకాయలో తెన్, టెంకణములో తెన్)

Five Elements (పంచభూతములు)

30. మూటమ్ — మోడము అని రాయలసీమలో వ్యవహారము.
48. కీచ్చు—కీత్తు అనుటకంటె 'చిచ్చు' అనుట మేలు.
50. ఉరుప్పు—ఉరియు (మండు అని యర్థము)
51. వెప్పు—వేపుకొనితిను లో వేపు; వేపుడు కూరలో వేపు.
54. కుమ్ము—కుములు అనుట సరికాదు. కుమ్ము (పొట్టు నిప్పు) అనియే కలదు.
64. పళపళప్పు—పెళపెళ (పళపళ యని యుండఁదగును)
69. వెళ్ళం—వెల్లి (వెల్లిఁ గలిపిన చింతపండు) వెల్లువ రెండురూపములు నీయఁదగును.
70. పుణల్—పొనలు
71. అలన్‌కట్టి—(వడ) కల్లు
74. పొలిల్—ప్రోలు అని కూడ నీఁదగును.
78. వాలం—వేల.

Mountain (పర్వతము)

83. కున్ఱు—కుంద్ర—కొండ్ర, గుట్ట

Sea (సముద్రము)

103. ఆళి—అడుగు?
105. పరప్పై—పరపు (వ్యాప్తి యను నర్థములో)
106. తుఱై— తోరువు

Flora and Fauna

(వృక్షములు, జంతువులు)

117. కొడి—కొడి (దీపశిఖయను నర్థములో చూ. కొడిగట్టు)
125. కవళై—కవిలెకట్టలో కవిలె?
130. పణై—పన
139. కుత్తి—గుత్తి
140. కణై—కణుపు—గణుపు
147. చిల్లి—చిల్లి గవ్వలో చిల్లి.
154. కాఴ్ప్పు—కఱకు అనుటకు ఇతర భాషాసామ్యముల ననుసరించి 'గరుకు' అనుట భావ్యము.
156. పొక్కు—పుచ్చు (పొట్టు అని యుండవలెను)
178. పచలై—పసరిక

200. పూనైక్కాలి—పిల్లడుగు
203. వంజి—వంజుళం
210. కట్టాశై—కత్తళి అవి రాయలసీమలో వ్యవహారము.
235. మణం—కమ్మనిలో మన? తులు భాషలోని కమ్మణ తెలుగు 'కమ్మని'తో సామ్యము కలది.
237. నాట్టం—చూపు
240. మరు—మరువములో 'మరు' అని యుచ్చియుండదగును.
242 వాడయ్—వాళ్ (కడి పోయినవాళ్ అని ప్రయోగము)
245. తొడయ్— తొడవు (భూషణార్థము తరువాత వచ్చి యుండ దగును.)
247. తొంగల్— తొంగలి—తోమాల
261. అలర్—అలరు
266. కువళై—కలువ—నల్లగలువ
268. మా—మామిడి, మామిడి పదములలోని మా; మాగాయలో మా.
మావు తెలుగు రూపమనుట సరికాదు.
269. కొక్కు—కోకిలలోని 'కోకు'—మామిడిని నివాసస్థానముగాఁగల దనునర్థమున 'కోకిల' పద మేర్పడియుండదగును.
277. అరునెల్లి—అరనెల్లి అని రాయలసీమలో వ్యవహారము. చిలునెల్లి, కిర్నెల్లి అని కూడ రూపములు.
279. పులి—పులిహోరలో, పులికాపు (దేవతా విగ్రహము లను శుద్ధి పఱచుట)లో పులి అని యూఁదగును.
285. కామ్బు—కామ (తోటకూర కామ, గోడుగుకామ)
293. ఏడగం—ఈడిగలో ఈడ
306. అవురి—అవిరి
312. అల్ / అలం } 'అలమరం'లో అలు ఎగిరిపోయి 'మరం' మఱ్ఱి ఆయినది.
317. అళ్ళై కళ్ళాశై - కళ్ళాశి (రామలసీమలో 'కలబంద'కు పేరు.)
319. ఇళన్కు—ఇనుకద్రామా, ఇనుక జేలు.
325. ఇరుళ్—ఇరుగుడు
330. ఇలైక్కళ్ళి—ఆకుకళ్ళి
336. ఎట్టి—ముష్టి, ముట్టి (?)
339. ఏలిలైప్పాలై — ఏడాకుల పాల (తెలుఁగు దేశమంతట నీ పదము వాడుకలో నున్నది)
352. కల్లత్తి—కల్లత్తి
359. కాశ్ జీరం—కాంచనం?
367. కాట్టుపేరాన్—అడవి జీడి.
398. కటాప్పు—సదాప
399. కురుంతుంబై—నల్లతుమ్మ
400. చవుక్కు—చవుకు—సరుగుడు
479. పూమరుదు—మరువం
494. మరమఞ్జల్—మానుపసుపు
495. మరుదం—మద్ది
501. మలైవేమ్బు—అడవి వేప (తురక వేప)
503. మావిళంగాయ్—మావెలగ
507. ముల్వేంగై—ముల వెలగ
524. వెంతేక్కు—వెంతేకు
561. ఇలైక్కళి—ఆకుకూర
571. ఇలై—తమ్మలము—తమ్మెలర + ఆకులో ఎల.
572. పాక్కు—బాగాలు (తులులోని బజ్జెయికి సమీపముగా నున్న పదము)
573. కొట్టై పాక్కు—గొంటువక్క—(గుంటుపోక కాదు)
585. ముంకు—(తాటి) ముంగు అనియే రాయలసీమలో వ్యవహారము————ముంజ అదే యర్థమున నున్నను సామ్యపదము కాదు.
590. కుప్పైమేణి—కుప్పెంటి
594. మరవళ్ళిక్కిళఙ్గు—కర్రపెండలము, కర్రగెణుసు.
596. వళ్ళిక్కిళఙ్గు—తెల్లగెణుసు
599. కాల్నడై—'కాల్నడలు' అని రాయలసీమలో వ్యవహారము. ఆటవీశాఖకు గ్రామీణులు పెట్టుకొను మహజరులలో పశువు లనుటకు 'కాల్నడ' లనియే వ్రాయుదురు. నడుగడలో నడ యనుట సరికాదు.
614. కురుశై—కుఱ్ఱ
615. కుట్టై—కొదమ
616. మళి—మఱుగుజ్జులో మఱు
623. వళ్ళియుం—వులియుడు
624. వఱ్పులి—చాఱల పులి ?
635. తుండిక్కై—తుండము
640. పారి—పాఱువేట, పాఱేటలో పాఱు, పాఱే—పారు వేటి మండపము లని తిరుపతి సమీపములో మండపములు కలవు.
644. కుళై—కుచ్చు
647. కోవేరు కళుదై—కంచరగాడిద
648. అ—అ (తెలుఁగులోఁగూడ అ అనునదే మూలరూపము. ప్రథమలో నుచ్చారణసౌలభ్యమునకై 'వు' చేరినది. 'అ దూడ' అనుటలో 'అ' కలదు.
649. పెట్టం—పడ్డ.
650. కఱవై—తెలుఁగున 'పాడి' యను నర్థమున 'కరవ' అనుట రాయలసీమలో వ్యవహారము.
663. కాశై—కాడి (కాడెద్దులు—ఎద్దుకు ప్రాచీన రూపమయిన 'కాడి' తరువాత మరొక యర్థములో స్థిరపడినది.
665. మూరి—ముర్రుపాలులో ముఱ్ఱు — ముఱ్ఱుపాలు వదలించెద నని బెదరించుట రాయలసీమలో వ్యవహారము.
666. ఏరు—ఏరువాకలో ఏరు నేటికిని నిలచియే యున్నది.
671. పోత్తు—దున్నపోతులో పోతు.
672. కాట్టా—కారెనుము.

678. శెమ్మరీ—చమరీమృగములో 'చమరి'—దేశ్యమయిన 'చమరి' సంస్కృతములోని కెక్కినది. సవరము—వెండ్రుకల సవరము దీనికి దగ్గఱి పదమే.
682. కిడై—కడుపు
683. పట్టి—పదువు
685. పిఱుక్కై—పెంటిక (పిడక యనుట సరికాదు)
688. ఎయ్—ఏదులో 'ఏ'
691. కరడి—కరడి అనియే రాయలసీమలో వ్యవహారము.
700. పుల్‌వాయ్—పుల్లు?
701. పిణై—పిడి
703. నరి—నరియుడు
710. కూరన్—కూళ (నేడు దుష్టుఁడు అను నర్థమున రూఢమై యున్నది)
724. మంతి—మంగ?
744. కుంజు—కూన (గున్న కాదు. ఇతర భాషలలో కుఞ్ఞు, కున్ని, కిన్ని అనియే కలదు.)
746. సే—సెగ (సేదారములో 'సే' కూడా నిదే)
752. చిఱకు—చెఱగు (ఱెక్క యర్థమును గోల్పోయి నేఁడు భిన్నార్థమునఁ గలదు)
758. మయిల్—నెమలి యను నర్థమున 'మెయిలు' అని తెలుఁగున లేదు. మేఘము అను నర్థము దీనినిబట్టి యేర్పడినదేమో!
771. కూగై—గూబ (కూగై + ఉమన్ అను పదములు కలసి యేర్పడి యుండఁ దగును)
778. మరంకొట్టి—వ్రడంగిపిట్ట
782. కొక్కు—కొక్కెర (కొంగ యనుట సరికాదు)
787. కురువి—గువ్వ (కూకి యనుట సరికాదు)
794. శెంపోత్తు—చింబోతు?
797. వానంపాటి—వానకోయిల
809. మిన్‌మిని—మిణుగురు (మిఱుఁగుడు అనుట సరికాదు. ఇతర భాషలలో మినుంబులు, మినుంబురు అనుట దీనికి సమీపములో నున్నది)
821. నల్లపామ్బు—నల్లత్రాచు

Aquatic animals (జలచరములు)

835. సెమ్మీన్—చెంబడి వానిలో 'చెంబ'
842. వాళై—వాలుగ (వాలుమీనులో వాలు అనుట సరికాదు.)
857. నణ్డు—నండ్రకాయలో నండ్ర. ఎండ్రకాయకు నండ్రకాయ యనుట కూడ వ్యవహారమున గలదు.
860. చిప్పి—ఆలి చిప్పలో చిప్ప
861. కిళిన్‌జిల్—గుల్ల (నున్నపుగుల్లలలో గుల్ల)

Insects etc (కీటకాదులు

874. కట్టెఱుమ్బు—కండచీమ, గండ్రచీమ
879. spider—సాలీడు (చెలగము అనుట సరికాదు. ఇతర భాషలలో సాలిగ (కన్న) జేడ (తులు) కలదు.
881. వాన్‌కుళ్ళి—నలికిరి (నలికండ్లకాదు)
882. ఉణ్ణి—ఉద్ది?
890. ఉకు—నుసి (నుసుముతో బాటు)

Human body (మానవ శరీరము)

901. శట్టై—చట్ట
911. ఇఱైచ్చి—ఎఱచి (ఎఱచికాదు)
921. ఉరుప్పు—ఉదువులులో ఉదువు
939. కొండై—కొండె
952. మోఱై—మోర
953. మెణ్డై—మెడ
965. పిళి-పులుకు పులుకునఁ జూచులో పులుకు—కన్నడము లోని 'పిళి' దీనికి దగ్గరగా నున్నది.
967. మాఱుకన్—మ్రాగన్ను (మాఱుకన్నుకాదు)
969. కణ్‌పూ—కంటిపూవు (పూకంటివాడు అని ప్రయోగము)
971. పేళ్ళైకణ్—పారగన్ను, పారగన్ను (పాలసముతో పాల అనుట సరికాదు)
972. కన్నీరు—కన్నీళ్ళు (తెలుఁగున భిన్నార్థము కల దైనది)
981. తోట్టం—తోచు (తెలుఁగున క్రియారూపముగానే కలదు)
986. కాక్షి (Sight) —కనుకట్టు అనుట సరికాదు.
991. కడైవాయ్—కడవాయి
996. కోఱైప్పల్—కోర (కూరు అనుట సరికాదు. కోఱైప్పల్‌లోని కోర మాత్రమే తెలుఁగున మిగిలినది)
1003. శొళై—జొల్లు (చొళ్లుకాదు)
1008. మూచ్చు—మూచూచులో మూచు (మూచులని వ్యస్తముగా లేదు)
1019. తాడై—దవడ
1022 snout —ముసర, ముసంగి?
1027. అక్కుళ్—అక్కు
1029. కణైక్కై—కడచేయి
1038. పురన్‌కై—పుఱిచేయి (తెలుఁగున ఎడమచేయి అను నర్థమున నున్నది)
1046. తొప్పై— తొంబ (తుంబకాదు)
1057. నెంజు—నెంజిలి
1059. మార్పు-మార్కొనులో మారు;మాఱొడ్డులో మాఱు.
1060. ముదుకు—మూడి, ముడ్డి
1064. పిరకు—పిఱుపికులో పిఱు.
1066. మురుంకుల్—మక్కిళ్ళు (ఇతరభాషలలో మగ్గల్ (కన్న) మగ్గిల్ (తులు) దీనికి దగ్గఱిగానున్నది. మక్కిళ్ళు విఱిగగొడతాను అన్నది రాయలసీమలో వ్యవహారము.
1067. ఇడై (waist) — ఎడమచేయిలోని ఎడములో నీ రూపము నిలిచి యున్నది.
1079. కుంటి—తుంటి (తుండికాదు)
1081. నెట్టి—నెట్టికసేలలో నెట్టి
1089. కణైక్కాల్—కడగాలు?

1090. చప్పై ప్పాక్కళ్—చెప్పకాళ్ళు?
1128. వెల్లం—వెలువము (వెలువు అనుట సరికాదు)
1131. పొక్కం—పొకడలో పొక
1133. వాకు—వాగ (ఎలవాగలో వాగ)
1135. కుఱవి—కోడాలులో కొడ—కొడము కూడ—
1148. వరల్ (Strength) —వ్రేసు అనుట సరికాదు.
1149. తిరు—దిటము, తిరము (దిట్టముకాదు)
1166. కుఱ్ఱై—గుట్ట (కుట్ట యూ యర్థమునఁ దెలుఁగున లేదు) shortness
1177. అర్రై—అఱు (ముక్కఱలోని అఱ అనుట సరికాదు)
1181. కొక్కరై—కొక్కిరి టిక్కిరిలో కొక్కిరి
1187. పుంకావ్—బుక్కా (బుక్కా పకీరులో బుక్కా)
1192. ముఱుంటుస్—మునవ, మునంగి (?)
1195. తుంటుస్—తుంటరి (తూటరి సరికాదు)
1200. ఏక్కై—ఠేపిటిలో 'ఠే'
1206. ఏక్కై—ఏక్కె
1211. కురుంబన్—కురబ (మేకల కాచువాడు. రాయలసీమలో వ్యవహారము)
1222. మేయ్ప్పన్—మేపరి (?)
1234. కుయువన్—కుమ్మరి
1238. కన్నన్—కంచరి
1246. పిడారి—పిడ మాత్రమే నిలచినది

Agriculture (వ్యవసాయము)

1270. కాణక్కై—కరణములోను, కరిణములోను దీని సామ్యము నిలచినది.
1275. వళై—వనిలో నీ పదసామ్యము కలదు.
1289. మేడు—అంటిమేడు—ఇత్యాది (గ్రామనామములలో నేటికిని ఈ రూపము కలదు.
1291. పూ (Crop)—పూపు, పూతలో నీ రూప మున్నది.
1294. తడి (Wet land)—తరి (?)
1298. వరై—వెరజల్లు—వెదవెట్టులో వెద.
1302. తన్నై—తేవ తలవడఁ బండులో తెవె—కన్నడములోని 'తెవె'తో తెలుఁగు 'తేవె'కు సామ్యము.
1307. అరిసి—'అరిసె'లో అరి; అక్కుళ్ళు—కన్నడములోని అక్కికి దగ్గఱది.
1309. కోళం—కోళము— (తొప్పకాదు)
1322. కొల్లు—కన్నడములోని హురుళి పదమునకు సరియైన పదము ఉంది!
1326. నోట్ (Minute Particle) నూక (తన్నులనుట సరికాదు)
1343. వాల్ మిళగు—తోకమిరియాలు (తోగమిరియాలు కాదు)
1347. ఓమం—ఓమము (వాముకాదు)
1356. తిటి—తిను
1371. అవల్—అడుకు
1383. తాటి, తాలు—తేలు (గంజితేలు)
1386. పొండై—పింగ (1385 పేర్‌కు తెలుఁగు సామ్యము పేర్ అనునో పేర్+అర్రై=పింగద అయిన దేమో!
1403. తేరల్—ఎ తెలలో తెలి అనుట సరికాదు.
1404. మట్టు (Honey)—మద్దు (?)
1422. ఎరిప్పకుతి—నేపుడు (?)
1430. మురుక్కు—మురుకులు అని జంతికలకు రాయలసీమలో వ్యవహారము—ముక్క అనుట సరికాదు.
1433. కలి—కులము (కన్నడములో కలుఁపు దీనికి దగ్గఱది)
1437. కుకియున్—ముకియుము (ముకియు రూపాంతరము)
1448. వడై—తెలుఁగున పిండివంటకు పేరు. వడి అనుట సరికాదు.
1449. అడై—అప్పడము, పప్పడములో అడ.
1452. తేన్కుళల్—తేఁగొళ్ళు అని వైష్ణవుల పరిభాష.
1458. ఉవర్—ఒగరు (ఇతర భాషలలో ఒగర్ (కప్పు) ఒగర్ (తుల) అనియే కలదు
1461. కళప్పు—కసిగాయలో కసి.
1467. వాళైప్పూ—'బాదురల పెట్టు'లో బాదు (కన్నడములోని బాళె, తులు భాషలోని బాళె దీని కతి సన్నిహితములు. వాళకము అనుట సరికాదు.)
1470. తోట్టం—తోట (కనబడు అను వర్ణమున తెలుఁగులో)
1473. మా—మావి
1482. కూళ—కుడు (గాలి)
1487. పేఱు (Delivery) పెఱుగులోని పెఱు (తెలుఁగున భిన్నార్థము కలదయినది)

Diseases (రోగములు)

1501. వలిప్పు (Fatigue) —వలుపు
1505. వెఱిప్పు—వెఱికలో వెఱి
1509. వయుక్కం—వమంకు (వయుమ వమంకి అని ప్రయోగము)
1511. చళి (Mucus) —జలుబు
1512. తలప్పు—తంపు అని రాయలసీమలో వ్యవహారము.
1519. కండై—కణుపు
1520. వెప్పం—త్రేమ్పు
1521. సిక్కం—సిగు (భిన్నార్థమున)
1523. వడువర్—మడిమ (పుండుకాదు)
1525. కొప్పుళం—కొప్పళము (రాయలసీమ)
1530. తొలుపోడ్—తొప్ప (?)
1532. పుఱై—పొర
1535. కోతి—గోకు (క్రియానామముగా తెలుఁగున నిలచినది. గజ్జి అనుట సరికాదు)
1536. వమ్మై—వవ (రాయలసీమ)
1538. శీ—చీము (తరువాతిపదమైన 'శీల్'కు సామ్యము కాదు.

1540. మూలముళై—మొలలు, మొలకలు (మూల వ్యాధి కాదు)
1541. తిమిర్—తిమ్మిరి (తిమురు కాదు)
1544. కోళై—గీఱు (కన్నడ, తులు భాషలలో గూడ గీఱు అనియే రూపము. గోకు అనుట సరికాదు)
1556. మురి, మురిప్పు—విరుగుడు
1558. చక్కాడు (Death)—చక్కాడు (క్రియగా నున్నది. చక్కాట అనురూపము లేదు)

Dress (ఉడుపులు)

1570. కండై-కండ (పచ్చడపుగండ అని శ్రీనాథుని ప్రయోగము. చినుగు అనుట సరికాదు.)
1579. తారు—టక్కు అనుట సరికాదు.
1593. తుండు—తుండు గుడ్డలో తుండు. తునియకాదు.
1595. అడై—పావడలో అడ
1612. వేర్ట్టి—నేత తీరు
1613. సురుంగు—సురుగు (Shrink) చెఱగు అనుట సరికాదు.
1616. మెట్టు—మట్టు (భిన్నార్థమునఁ గలదు)

Instruments (పనిముట్లు)

1620. తరి—తరి (తెలుఁగునకూడ తరి యనియే రూపము. తడికాదు)
1623. కణ్ణక్కోల్—కనగోల (?)
1625. చెక్కు—చెక్కు (?)
1635. ఉలై—కొలిమి (Furnace)
1640. తుర్వాల్—తుంపము అనుట సరికాదు.
1646. కడైయాణి—కడాణి (కడచీలకు రాయలసీమలో వ్యవహారము)
1662. కామ్బు (Handle)—కామ.
1663. కొఱడు—కొలికి (కన్నడ తులు భాషలలో 'కొళికె' అని రూపములు)

Buildings కట్టడములు)

1667. తళి (Temple) —తళియలో తళి.
1668. అంబలం—'తంబళ్ల' పదములో అంబల.
1672. మడైప్పళ్లి—మటప్పళ్లి యనుట వైష్ణవపరిభాష
1676. మణై—మండువా, మనికిపట్టులో మనికి.
1681. పూక్కాల్—ముంగిలి.
1687. అరన్మనై (Palace) —అరవ (రాజవీధి యను నర్థమున ఆణ్డోకలఁ బెట్టేదా వరవ నామెత బాలికకై వెటాపలిన్)
1691. పళ్లి—పల్లె
1695. మాడి (Terrace)—మహాడి (మేడకు రాయలసీమలో వ్యవహారము)
1702. ఉంపర్—ఉప్పరం

1704. తట్టు (Flat)—తెలుఁగునఁ గూడ అతట్టు, ఈ తట్టు అని ప్రక్కప్రదేశము అను నర్థములలో గలదు.
1706. శాయ్పు—చావడి
1707. పట్టకశాలై—పడసాల (రాయలసీమలో వ్యవహారము)
1708. కళంజియం—కళంజం.
1709. అట్టిల్, అడుక్కళై—అడపాల, అడబాలలో అడ
1712. కిళివాటల్ (Window) —కిటికీ
1717. పడి—పడికట్టు (పాదికట్టు అనుట సరికాదు)
1722. నిలై—నిలవు.
1723. ఇరప్పు—ఇడువు (చెక్కతలుపులో చెక్క అనుట సరికాదు)
1725. తాళ్ (Bolt)—తాళము (తలుపుకాదు)
1728. కాలవాయ్—కాలువ.
1741. కట్టళై—కట్టడి.
1751. మాడం (Elevation)—మాడవీథిలో మాడ.
1768. కాల్ (Stick, Post) 'కడగాలు వేయు'లో కాల్. దక్షిణాంధ్రములో శుభకార్యములందు తొలుత పందిరి కూచము నాటుటను కడగాలు వేయుట యందురు.
1775. మూదల్ (Base)—మూదం.
1776. అడిప్పడై-అస్తిపారం (రాయలసీమ) Foundation

House hold articles(గృహోపకరణములు)

1790. అట్టుక్కల్ (Grinding store)—సన్నికల్లు
1809. పాణ—బాన, వాడ (మానెవాడ వ్యవహారము)
1819. తవలై—తపల రూపాంతరము
1828. కుతుక్కై (Earthern bin)—కుడుక.
1851. విళక్కు—తిరువిళక్కులో విళక్కు.
1889. తడుక్కు (Palmleaf seat)—తడక.
1900. కూళల్—క్రోవి (కోవి యనుట సరికాదు.)
1903. తాళ్క్కోల్—తాళపుచెవి.
1904. తాళ్పాల్—తాళము.
1909. ముళై—మళ (రాయలసీమ)
1919. కల్నార్—రాతినార.
1924. మడ్డిప్పాల్—పాలమడ్డి

Worship (పూజ)

1927. ముదల్, ముదల్వన్—మూదం, మొదలి.
1933. వాన్ (Heaven)—వాన (భిన్నార్థమున)
1954. కైకూప్పు—కైమోడ్పు (కైకోపు అనుట సరికాదు)

Culture (సంస్కృతి)

1962. కళ్పి—కళిపులు, కలుచు
1963. పళ్లి—పల్లెకూటం (రాయలసీమలో మ్యాలుపకు పేరు)

1967. కర్పు (Education)—కఱవులు
1969. పుదిర్ (Riddle)—పొడుపు
1970. తాళ్ —తాను (కన్నడ, తులు భాషలలో తాను అనియే రూపము)
1984. పాటి (A musical song)—పాట.
1994. కుమ్మి—గొబ్బి (గుమ్మి అనుట సరికాదు)
1996. వర్ై—వరియ.
1999. శేగంటి—జేగంట-(Gong)

అనుబంధము

49. వేనిల్—వేడి, వేండ్రము
51. వెప్పు—వేంవు, వేంవుడు—వేవుకొని తినులో వేవు
52. వెట్టయ్—బెట్ట
56. కాయ్చల్—గాసిలి, గాసిచెండులో గాసి
60. వెళిచ్చం—వెలుగు
84. పొట్టై—బోడు
102. అళక్కర్ (సముద్రము)—అలి (తెలుగున తరంగార్థమున నిలిచినది)
125. కవర్ై (Branch)—కవిలె (తెలుగున కవిలె—కట్ట అను నర్థమున నిలిచినది. కవిలె తమలపాకులు ఇత్యాది)
153. ఆప్పు (Wedge)—ఆవు.
160. ఓలై (తాటాకు)—ఓలి (కట్టు మను నర్థమున తెలుగుననున్న యీ పదము దాని సామ్యమే)
170. చిరట్టై (Coconut shell)—గరిటె, గంటె (కన్నడములోని 'గెరటె' రూపము తెలుగునకు సన్నిహితముగా నున్నది)
196. ముళ్ళి—ముల్లు
209. కళ్లైక్కళ్ళి—ఆకుకళ్ల
218. ఇరువేరి, ఇరువేలి—వట్టివేరు
221. ఓక్కై—వడిశె
245. తొడై—దండ ? (Garland)
251. ఇరువాచ్చి—విరజాజి
257. కాందళ్ (Malabar lily)—కందిగం
264. ఆంపల్—ఆంబాలము (Water lily)
270. తేమా—తియ్యమామిడి
272. వరుక్కై—వేరుపనస
278. విళా—ఎలక
283. ముళై (Common bamboo) — ముదును వెదురు, ముండ్లవెదురు
297. అకిల్ (Indian Mahogan)—గాలి
305. ఆవలి—వెనిలి, వెమలి, పెద వెవిలి
307. అఞ్జిల్—ఆంకోలము
315. అల్లి పూవరము—నీరు పాపాకు(Riven portia)
317. ఆణ్టైక్కాత్తై—కిత్తనార అని వ్యవహారము.
327. ఇలఞ్జి—ఏలకి (Ilanjy)
332. ఉది—ఒద్ది
357. కణ్ణీర్ై—కన్నీరు, కన్నీలు
419. తణక్కు—తణుకు
420. తమరత్తై (Carambola apple) తమర్త
431. తేనత్తి—తేనెయత్తి
433. తొడరి—తొడుసింద (Kites claw)
437. నారత్తై—మల్లికనారంజి (నారణ్ణ, నారంగ, నారంగాయ్ అను నితర భాషా సామ్యములతో సరిపోలును)
441. నిలవాకై—నేలపొన్న, నేలతంగేడు
461. పిలింపి—బిలిబిలి, బిలుంబి
464. పీచ్చిల్—పీకెతుమ్మ (Sponge tree)
479. పూమరుదు—పూలమద్ది
496. మరు తాణ్రి—మైద (మదరంగి, మద్రంగి అవి కన్నడ, తులు భాషా రూపములు)
506. ముళ్ మురుక్కు—ములుమోదుగ
515. వక్కునార్—పొణకు, నారపొణకు
517. వణ్ణి—జమ్మి, వన్ని సంద్ర
518. వాకై—బాగి (Sirissa దిరసనము)
540. కల్పాశై—అడవి యురటి
562. కీరత్తండు—దంటుకూర (Green stalk)
630. తుంపి—తుంబి, తొండి (Elephant)
663. కాళై (Bull)—కోడె
846. కొఱ్ఱమీన్ (Salt water fish)—కొరమీను, పారవేప?
872. ఎఱుమ్బు—చీమ (చీముకాదు)
925. శెన్ని (Top, head) —కణత (Temple అను నర్థములో కన్నె, కన్ని అని కన్నడ, తులు రూపములు)
954. కఴుత్తు—గొంతు (Neck) — కుత్తుకతోబాటు మఱొక రూపము
1091. కాండి (Foot print)—కాలడుగు
1150. కిర్పు (Strength) — కైవు, గెల్పు (కెల్పు (మళ) కెచ్చు (కన్న) రూపములు)
1274. పాట్టం—బాడుగ (Rent) పట్టా యను సామ్యము సరికాదు.
1295. శేరు (Mud)—జేడు
1313. తినై—దినుము
1314. వరకు—బొరుగులు (Common millet)
1406. సఱవు (Toddy Honey)—నీరా.
1469. పిరప్పు—ప్రాపు (తెలుగున భిన్నార్థమున నిలిచినది)
1500. ఇళైప్పు (Weariness)—అలసట.
1589. తూకిల్—దుప్పటి, దుప్పటి (Fine cloth)
1611. ఈడు (Durability)— ఈడు, ఈడుములో ఈడు కూడ నిదే.

1663. కొలువు—గొలుసుతోబాటు కొలికి కూడ (Link)
1721. పుదవు—పడికావలిలో పడి (Door, gate)
మలయాళ, కన్నడ, తులు రూపములు 'పడి' అనియే కలదు.
1726. కేప్పు—చప్పు?
1727. టాకై—(ఇటుక) చూళ.
1766. తడ్డై—దడి (తడకయను నర్థములోనే)
1771. కోల్—కోం, కొలమానములోకోల (Measuring Rod)
1773. తొండు (Breach)—దొండి (తొండికాదు)
1848. కరిశై (A grain measure)—ఇరస.
1952. వరిపాటు (Worship)—బరి (పాటు)

వృక్షములకు, జంతువులకు సంబంధించిన సామ్యపదము లను గుర్తించుటలో నాకు మిక్కిలిగాఁ దోడ్పడిన యటవీ శాఖోద్యోగి, నాకు సోదరుఁడునగు చిరంజీవి తిమ్మావఝ్ఝల కృష్ణ మూర్తికిఁ గృతజ్ఞుఁడను.

ఇంచుమించుగా నిరువది యేండ్ల ప్రగాఢ పరిశ్రమము ఫలముగా వెలువడిన యీ యుద్గ్రంథము భాషా తత్త్వ శోధకులకుఁ బరమోపాదేయమనుటకు సందియములేదు. అయినను పదసామ్యనిర్ణయ విషయమున మఱికొంత ప్రామాణికత నిది యలవఱచుకొని యుండవలసినది. ఇతర భాషా సామ్యములతో సాళ్ప్రతి తయారుచేసికొనిన పిదప తెలుఁగునకు సంబంధించి నంతవఱకు నిట్టి భాషా పరిశ్రమ చేసిన యొకరిద్దఱు పండితుల సహాయము కూడఁ బడసి, చర్చాసమావేశము లేర్పాటు చేసికొని యందుఁ దుదినిర్ణయములు చేసికొనియుండిన గ్రంథ ప్రామాణ్యము మఱింత పెరిగియుండుననుట నిశ్చయము. ఒక్కరే యాలోచించి తమకు స్ఫురించిన సామ్యముల నిచ్చుట కంటె ఇద్దఱు ముగ్గురు కలసి కూడఁ బలుకుకొనుట లాభ కరముకదా! విశ్వవిద్యాలయ స్థాయిలో నిట్టిది జరుగుటకు వీలున్నదేమో తెలియదు. ఇట్టి మహాప్రయత్నమునకు సంకల్పించి ద్రవిడభాషల కెనలేని మహోపకారము గావించిన మదరాసు విశ్వవిద్యాలయమువారు మిక్కిలి ప్రశంసార్హులు.

శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు తమ Dravidian cognates అను గ్రంథములోని పీఠికలో నిట్టి సామ్య పద కోశముల యావశ్యకతను బేర్కొనుచు వానివలన ప్రయోజనముల నిట్లు తెలిపియున్నారు.

"A study of the cognate words in the various languages of the group will be of help to us in various ways-namely, in tracing the history of form and meaning of the words in individual languages, in fixing the etymology of words and determining whether a particular word is of indegenous origin or a borrowing from another group of languages, in tracing the history and development of individual languages as well as the characteristic features of the of the original la guage from which all others have been derived and lastly in tracing the history and civilization of the people who spoke those languages."

పయిని పేర్కొనఁబడిన చతుర్విధ ప్రయోజనములను సాధించుటకుఁ దోడ్పడగల యీ యుద్గ్రంథము భాషావైషమ్యములు విలయతాండవము చేయుచున్న నేటి కాలమున పెక్కు ప్రధాన ధర్మములం దీ ద్రవిడ భాషలకుఁ గల సామ్యమును స్థాపించుచు జాతియైక్య సిద్ధాంతాచరణమునకుఁ దోడ్పడుచున్నది. మున్నడిలో శ్రీ లక్ష్మణస్వామి మొదలియారుగారు రాశించినట్లిది ద్రవిడభాషలకు సంబంధించిన భావిపరిశోధనకుఁ బ్రోత్సహించి భాషా తత్త్వ విమర్శనమునకు, విజ్ఞానమునకు మూదల కాఁగలదనుట యథార్థము. ఇట్టి సామ్యపదకోశములు వెలయవలెనని యాశించిన కాల్డ్వెలు మహాశయుఁడు కనిన కలను నిక్కల గావించిన మదరాసు విశ్వ విద్యాలయమువారిని నీ మహా కార్యమునఁ బనిగొనిన విద్వద్వరేణ్యులను నభినందింపక తీరదు.

అనుగ్రహము

శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి

వ్యాఘాతములు కడుపారఁ బడయుచుండి
షడ్రసోపేతమైన భోజనము నిమ్ము!
స్వామి! యని ప్రార్థన మ్మింత సల్పినంతఁ
పవనపర్ణాంబువులె లభ్యపడె గ్రహింప.

నారచీరల దేహముఁ గప్పుకొనుచుఁ
జీనిచీనాంబరము దయ సేయరమ్మ!
స్వామి! యని ప్రార్థన మ్మింత సల్పినంత
వలువయే లేని యొక దిగంబరుఁడ నైతి.

చిన్న పూరింటియందు వసించుచుండి
మణిమయ స్తంభ మహిత హర్మ్యమ్ము నిమ్ము!
స్వామి! యని ప్రార్థన మ్మింత సల్పినంత
నాశ్రయమె లేని పక్షినై యడలనైతి.

ఒక్క యీఁతాకు చాపపై నొత్తిగిలుచు
హంసతూలికాతల్పమ్ము నమరనిమ్ము!
స్వామి! యని ప్రార్థన మ్మింత సల్పినంత
సంఘటిల్లెను గఠిన పాషాణశయ్య.

కోరినది యేదియును సమకూర్చకుండఁ
గలిగినది కూడ హరియించి కనికరించె
నీశ్వరానుగ్రహ మ్మిట్టిదే! యటంచుఁ
గంట దుఃఖాశ్రువులు నింపియుంటి నాఁడు.

కోరినది యేదియో సమకూర్పఁ జోక
కలిగినది యెల్ల హరియించి కనికరించె
నీశ్వరానుగ్రహ మ్మిట్టిదే! యటంచుఁ
గంట హర్షాశ్రువులు రాల్చుచుంటి నేఁడు.

ప్రాచీన భారతీయ వాహనాలు

శ్రీ పసుపులేటి ప్రభాకరరావు

రాజకీయచరిత్రకు ఇచ్చినంత ప్రాముఖ్యం, ప్రజల సాంఘిక, సాంస్కృతిక చరిత్రకు మనము ఇవ్వలేదేమోనని అనిపిస్తుంది. సామాన్యమానవుని జీవనవిధానం గురించి మనకు తెలియవలసినంతగా తెలియలేదనుకోటానికి ఆస్కారం ఉంది. ప్రాచీన భారతీయుని దైనందినజీవిత మెలావుండో, ఏ యే వస్తువుల్ని వాడేవాడో, ఏ పరిసరాల్లో జీవిస్తూవుండేవాడో తెలుసుకోడానికి మరింత పరిశోధన జరగటం అవసరం. నిత్య జీవితంలోను, వర్తకవాణిజ్యాల్లోను, సైనిక వ్యవస్థలోను, వాహనాలకుగల స్థానం అతిముఖ్యమైనదనటం అతిశయోక్తి కాబోదు. మన ప్రాచీన గ్రంథాలనుండి ప్రజలు దూరప్రదేశాలకు ప్రయాణించటాన్నిగురించి, వర్తకులు బిడారుల్లో తమ వ్యాపారసామగ్రిని చేరవేయటాన్నిగురించి ఎన్నో వివరాలు లభిస్తాని. పాళీ గ్రంథాల్లో విదేహనుండి గాంధారమునకు[1] మగధనుండి సౌవీరమునకు [2] చంపనుండి బర్మాకు [3] వెళ్లే వర్తకులు ఉదహరింపబడ్డారు. ప్రతిష్ఠానమునుండి శ్రావస్తికిగల వాణిజ్యమార్గంలో ముఖ్య విరామస్థలాలు "సుత్తనిపాత" [4] ములో చెప్పబడ్డాయి. బోయవారు, మాంసము, చర్మము, కూరగాయలు మొదలైనవి బండ్లలో నగరానికి తెచ్చేవారు.[5] ఇవన్నీ పురాతనభారతీయుని జీవనంలో వాహనాలకుగల ప్రాముఖ్యాన్ని సూచిస్తాని.

అమరకోశ టీకాకారుడు 'యానము'ను, "ఒక స్థలము నుండి మరొక స్థలమునకు సామగ్రులను తీసుకొనిపోవుటకు, రవాణాచేయుటకు ఉపయోగించునది"గా తెల్పుతున్నాడు. బుద్ధఘోషుడు [6] మార్గాలను, వంతెనలను, నావలను కూడ 'యానము'లలో చేర్చాడు.

'యుక్తికల్పతరువు' ఐదువిధాలుగా వాహనాలను విభజిస్తుంది. (1) చతుష్పదము—జంతువులచే లాగబడేది. 2) ద్విపదము—భుజాలపై మోయబడేది. (3) విపదము—నావలు, బల్లకట్టులు మొదలైనవి. (4) బహుపాదకము—అనగా అనేకచక్రాలున్న రథాల్లాంటివి. (5) వ్యోమయానము—ఆకాశగమనాని కుపయోగింపబడునది. చతుష్పదవిభాగంక్రింద రాజవల్లభుడు బండ్లనులాగే జంతువుల వారింటివి చెప్తున్నాడు. గజ, వృషభ, ఉష్ట్ర, గార్దభ, అశ్వాల్నే కాకుండా మేకను కూడ ఇందులో చేర్చాడు. అయితే వృషభాశ్వాల్నే ముఖ్యంగా శకట, రథాలకు పూన్చేవారు.

వేదగ్రంథాల్లో రథాలను గురించిన సమాచారం చాల లభిస్తుంది. ఋగ్వేదంలో 'రథ'[7] 'స్యందన'[8] 'యాను' అనే పదాలు వివస్తాని. ఇందులో రథవిభాగాల పేర్లు ఈవిధంగా వున్నాయి. ఇంష (Pole), యుగ (Yoke), ప్రధి (Felly), అక్ష (Axle), పవి (Rim), నాభి (Nave), ఖ (Hole). పవి, ప్రధి కలసినదానికి "నేమి" అని పేరు. [9] మిగిలినభాగాలకు, రశ్మి లేక రశన (Reins), కాశ (Whip), అరా (Spokes), వంధుర లేక గర్త (Seat), అని (Lynch pin), చక్ర (Wheel), ప్రౌగ (Pole end), సమ్యా (Peg), యోక్త్ర (Lashing), వాని (Swingletree), రథప్రస్థ (Chariot front)[10] రథవస్థ (Chariot floor) అనే పేర్లు, రథిక సారథులకు "సవ్యస్థ", 'సీహోతృ' అనే పేర్లుగలవు. రథాన్ని, 'ఖదిర', 'శిశప' కొయ్యతోను, ఇరుసును 'అరాతి'? కొయ్యతోను నిర్మించేవారు. దీనికి 'అనుశుత్' అనబడే రెండెడ్లను పూన్చేవారు.

సామాన్యంగా రెండు లేక అంతకు ఎక్కువ [11] "చక్రాలు కలిగివున్న ఈ వేదకాలపు రథానికి రెండు, నాల్గు, ఐదు[12] లేక ఏడు అశ్వాల్ని పూన్చేవారు. కాని అప్పుడప్పుడు, వృషభాలు, గార్దభాలు, ఆఖరికి కంచరగాడిద (అశ్వతరి)[13]లు కూడ అశ్వాల స్థానాన్ని ఆక్రమించేవి. అయితే రెండు చక్రాలు కలిగి, రెండుఅశ్వాలు పూన్చిన రథమే ఎక్కువ వ్యాప్తిలో ఉండేది. 'ప్రథి' (Felly లేక పూటీలు) నేటికివలె విడివిడిభాగాలతో కూడినది కాకుండా, ఒకటే వలయాకారంలో మలచబడి వుండేదని తెలుస్తుంది [14]. ఇంష (మేడి), అక్ష (ఇరుసు), యుగ (కాడి) కొలతలు వరుసగా 188 అంగుళులు, 104 అంగు

---

1. జాతక III 365
2. వినయవత్థు అర్థ కథ—370
3. జాతక—6
4. 1011—1013
5. జాతక—873
6. పారాత్థ పకాసినీ—పే 100—101
7. ఋగ్వేద—III 53, 19
8. ఋ. వే. X 85, 20
9. ఋ. వే. III 53, 17—20.
10. పిగ్గాట్ "ప్రీ హిస్టారిక్ ఇండియా"
11. ఋ. వే. I 130, 9, 155, 6, 164, 2, 11 13 IV. 1, 3
12. కాఠక సంహిత (XV. 2)
13. ఐతరేయబ్రాహ్మణ IV 9, 1
14. ఋ. వే. VIII 32

కులు, 86 అంగుళులు.[15] ఋగ్వేదంలో ముక్కోణాకారపు మూడు చక్రాల రథం[16] కింశుక, శాల్మలి కొయ్యలతో చేయబడి, వివిధ రూపాలు కలిగిన రథం [17] కూడా తెలియజేయబడినది.

కౌటిల్యుడు రథాలను, దేవరథ, పుష్యరథ, సాంగ్రామిక రథ, పార్యంకికరథ (ప్రయాణానికి) పరపురభియానిక (శత్రు స్థలనిర్మూలనానికి) వైనయిక (శిక్షణకు) అనే ఆరు విధాలుగా విభజించాడు [18] ఇతిహాసాలను పరిశీలిస్తే, రెండు [19] లేక అంతకు ఎక్కువ చక్రాలు కలిగి, బాగా అలంకరించబడి, నాల్గు గుర్రాలను పూన్చిన రథాలు కానవస్తవి. దేవాలయోపరిభాగాన్ని పోలిన దాని కప్పుపై ఒక ధ్వజాన్ని ఎగురవేసేవారు. రథ చలనం తోపాటు ధ్వని పుట్టించటానికి, రథంలో ఒకటి లేక రెండు మృదంగాల్ని ఏర్పాటుచేసేవారు. బౌద్ధ సాహిత్యంలో నాల్గ శ్వాలుకల ఉత్సవరథమే [20] కాకుండ, 'పుస్సరథ' పేరుగా రాజరథంగా చెప్పబడింది. [21] రథచట్రానికి (Frame) 'రథ పంజరము [22], మేడికి రథ దండకము', [23] కొరడాకు 'పతడో లద్ది', పై కప్పుకు 'అత్తరణ' అనే పేర్లే కాకుండ, రథశాల[24] రథకారులు [25], రథికులు [26] అనే పదాలు కూడ వినవస్తవి.

అమరసింహుడు కర్ణిరథాన్ని తెరలుకల్గి ప్రయాణాలకు ఉపయోగించే రథాన్నిగాను, హేమచంద్రుడు, 'స్యందన'మును యుద్ధరథంగాను, 'మరుద్రథము'ను దేవతలకు, 'యోగ రథ' మును పై అధికారులకు, 'పరిఘూతిక' రథాన్ని ప్రయాణాలకు గాను నిర్ణయించారు. రథికుని ధ్వజం పైకప్పుమీదవుండి, [27] మూడు ప్రక్కలా రక్షణ ఏర్పాట్లు చేయబడి, గంటలు, చమరాలతో [28] ఆ కాలపు రథం మహా అట్టహాసంగా వర్ణించబడింది.

కాని సాంచీ శిల్పాల్లో [29] కనుపించే రథం అమరకోశ ఇతిహాసాల వర్ణనను పోలినట్లుండదు. ఈ శిల్పాల్లో చెక్కబడ్డ రథాలన్నీ దాదాపు రెండు చక్రాలు, రెండు గుర్రాలు, కప్పు లేకుండ ముందుభాగం కొంచెం ఎత్తుగా, ప్రక్కలు తక్కువగా వంపులుతిరిగిన రక్షణతో వుంటవి. వెనుకభాగం రథికుడు ఎక్కటానికి వీలుగా తెరచివుంటుంది. అయితే రథసారధి కళ్లాలు పట్టుకొని నిలబడినప్పుడు, ముందు రక్షణ కటిభాగం వరకే వస్తుంది. చక్రాలకుగల ఆకుల (Spokes) సంఖ్యలో కొంచెం తేడా కనిపిస్తుంది. దక్షిణద్వార తోరణంమీద చెక్కబడ్డ రెండు రథాల చక్రాలకు ఆకులు ఒక్కొక్క చక్రానికి 16 మాత్రమే. ఉత్తర ద్వార తోరణంమీద, రాజపుత్రుడు, బ్రాహ్మణ భిక్షకునికి దానం చేసే రథం, అదే ద్వారంమీద మరొక చోట చూపించబడిన నాల్గశ్వాలు పూన్చిన రథం, 32 ఆకులు గల చక్రాలు కలిగివుంటవి. పూర్వోత్తర ద్వార తోరణ స్తంభాలపైఉన్న రథాల చక్రాలకు ఆకులు 20. ఈ విభేదానికి కారణం, వివిధ స్థలాల్నుంచి వచ్చిన శిల్పులు తమ తమ ప్రాంతాల్లోఉన్న రథచక్రాల్ని చిత్రించి ఉండవచ్చు. లేదా ఈ ద్వారతోరణాలన్నీ ఒకే కాలంలో నిర్మించబడలేదు కనుక కాలభేదం కూడా ఒక కారణం కావచ్చు. మరొక చిత్రమేమంటే, సాంచీ శిల్పాల్లోని [30] రథాలకు కట్టిన అశ్వాల తోకలు—దాదాపు అన్నీ—శరీరంమీదకు లాగి కట్టివేయబడినట్లు చూపించబడ్డాయి. దీనికి కారణం ఊహాగానానికి వదలవలసినదే. అమరావతీ శిల్పాల్లో యుద్ధరథం [31], బార్హుత్ శిల్పాల్లో, ప్రసేనజిత్తు బుద్ధునితో ఆఖరి సమావేశంకోసం వెళ్లుచున్నప్పుడు ఎక్కిన రథం[32] కుమారుని శ్మశానవాటికలో వదలి రమ్మని పంపించే రాజుయొక్క రథం, [33] నాల్గశ్వాలు పూన్చినవిగా చెక్కబడ్డవి. బో గయ, భాజాలవద్ద సూర్యరథ శిల్పాని కూడా నాల్గశ్వాలే చూపించబడినవి. ఈ సూర్య రథానికి రెండుచోట్లా 16 ఆకులు గల చక్రాలే కనుపిస్తవి.

తక్షశిల [34] త్రవ్వకాల్లో సిర్కాప్‌వద్ద ఒక క్రొత్త రకమైన బొమ్మరథం కనుపించింది (Toy cart). దీనికిముందు వెనుక భాగాలు ఖాళీగావుండి, ప్రక్కలు వలయాకారంగా లేకుండా నిటారుగా, చదరంగా వున్నవి. మేడిని (Pole) రథానికి రెండు

15. ఆపస్తంబ శుల్బసూత్ర VI, 75; బోధాయనశుల్బ సూత్ర I 10—12, కాత్యాయనశుల్బసూత్ర II. 1—4
16. ఋ. వే. I. 118, 2
17. ఋ. వే. X, 85, 20
18. అర్థశాస్త్ర (విల్సన్‌గారి ఎడిషను)
19. మహాభారతం ద్రోణపర్వం 165, 38, 173, 13 రామాయణం, లంక—44, 27
20. జాతక VI 39
21. జాతక III 238, III 30
22. మిలిందపన్హ V; వత్థు 83; జాతక II. 172; IV 60; ధమ్మపథ కామెంటరీ I. 28.
23. మిలిందపన్హ
24. ధమ్మపథ కామెంటరీ III. 121
25. విమానవత్థు IV, 9
26. మజ్ఝిమనికాయ I, 397
27. గాథాసప్తశతి— I, 34 వేణీసంహార 4-వ అంకము పే 96
28. వేణీ సంహార. 2 వ అంకము
29. మార్షల్ "మాన్యుమెంట్స్ ఆవ్‌సాంచి"
30. ,,
31. సి. శివరామమూర్తి — మద్రాసు గవర్నమెంటు మ్యూజియంలోని అమరావతీశిల్పములు
32. బారువా, బార్హుత్ శిల్పములు
33. ,,
34. మార్షల్—తక్షశిల సంపుటం I

ప్రక్కలనుండి వంపుతిరిగిన బద్దీలు ఆధారంగా వచ్చి కలుస్తవి. పార్థియనుల ప్రభావంవల్ల ప్రవేశించిన ఈ రథాన్ని పరుగు పందెముల కుపయోగించి వుండవచ్చునని మార్షల్ 35 భావించాడు. కాని, రథికుడు రథ వేగాన్ని తట్టుకొని పడకుండా ఉండ గలందులకై రథముయొక్క ముందు భాగంలో రక్షణ ఏమీలేదు కనుక ఇది పరుగు పందెములకుగా నిర్ణయించబడింది కాదేమో ననే అనుమానం కలుగుతుంది. రాయిడ్ (Rairh) 36 వద్ద జరిపిన త్రవ్వకాల్లో రెండు కంచురథ ప్రతిరూపాలు, 11 ఆకులుగల కంచుచక్రాలు రెండు కనుపించినవి. వీటికి కూడా కప్పులు లేవు. ఇందులో ఒకటి వంపులు తిరిగినప్రక్కలు కలిగి, వెనుకభాగం తెరచి వుంటుంది. రెండవదానికి ప్రక్కలే కాకుండ, వెనుకభాగాన 11 కమ్మీలుగల వలయాకారపు చట్రం బిగించబడి వుంది. ఇది లోపలగల సామాను రక్షణకై ఉద్దేశించబడిం దనుకోవచ్చు.

శకటాలు :—మొహెంజోదారో త్రవ్వకాల్లో రాగిబండ్లు (Copper Toycarts) దొరికినవి. ఇవి "మనకు తెలిసిన అతి ప్రాచీన వాహనాల ప్రతి రూపాల్లోనివి" అని మార్షల్ పేర్కొన్నాడు. 37 ముందు, వెనుకలు ఖాళీగా వుండి ప్రక్కలు క్రాస్ డిజైన్‌తో అలంకరించబడి, గూడువంటి కప్పుపై అడ్డ పట్టీలు కల్గిన చిన్న రాగి ప్రతిరూపం శిథిలావస్థలో కనుపించింది. హరప్పాలో నేటి "టక్కు"ను పోలినది ఒకటి, నేటి గడ్డి బండ్లను పోలి, అంచుచుట్టూ నిడుపాటి కర్రలను వుంచ టాని కేర్పరచిన రంధ్రాలుగల చట్రం (Frame) దొరికినవి. ఇవే కాక, హరప్పా, చన్హుదారోలలో నేటి ఉత్తర హిందూస్థానపు "ఇక్కా"ను పోలిన ప్రతిరూపాలు కూడ లభించినవి. 38 చన్హుదారోలో వంపులుతిరిగిన ఎత్తు ప్రక్కలు కలిగి, రెండు చివరలా రెండు జతల రంధ్రాలున్న మట్టి బండి చట్రాలు దొరికినవి. 39 నాల్గు చక్రాల వాహనాలు మొహెంజోదారోలోకాని, హరప్పాలోకాని కన్పట్టనప్పటికీ, సమకాలిక సుమేరియన్ ప్రాంతాలలో లభించినవి. ఈ చన్హుదారో నాల్గు చక్రాల బండి చట్రము, సాంచీ, బార్హుత్ శిల్పాల్లో కనుపించే రథ చట్రాలకు మూలంగా ఉపకరించిందనుకోవటానికి ఆస్కారం వుంది.

హరప్పాలో దొరికిన మట్టిబండి చక్రాలు ఆకులు లేనివే (Solid wheels). సామాన్యంగా కుండ (Hub) బయటకే ఉబ్బెత్తుగావచ్చి, లోపలివైపు చదరంగాఉన్న చక్రాలే ఎక్కువ. అప్పుడప్పుడు లోపలిభాగం పల్లంగా ఉండటం కూడ కద్దు. చన్హుదారోలో 40 లభించిన ఒక చక్రానికి కుండమీదుగా మధ్యభాగానికి రంగు పూయబడివుంది. సమకాలిక సుమేరియన్ స్థలముల త్రవ్వకాల్లో లభించిన ఆధారాన్నిబట్టి ఈ చక్రం కూడా మూడు వేర్వేరు పలకలు కలిపి తయారుచేయబడిందని సులభంగా ఊహించవచ్చు.

వేదాల తరువాత సంస్కృతసాహిత్యంలో శకట41 శకటసార్థ, శకటి, శకటిన్, శకటి బంధు 42 అనే పదాలు విన వస్తవి. ఛాందోగ్యోపనిషత్తులో 'శకటాన్ని' తెలియజేసే చిత్ర మైన వాక్యం ఒకటుంది. ("సో ఆధస్తాత్ శకటస్య పాభానం కషమాణమ్" 6. IV, 1, 8. P. 184 Arandisjan Series. No. 14 of 1890) ముఖ్యంగా శకటాలు వర్తక సామగ్రిని కొనిపోగలందులకై చాలా దృఢంగా నిర్మించబడేవి. 43 నగరాల్లో ప్రయాణాని కుపయోగించే బండ్లు, చక్కగా అలంక రింపబడి 'ప్రవహణ' అనే పేరుతో పిలువబడేవి. 44 అదే బండి తెరతో కప్పబడివుంటే 45 'అపవారిత' అనేవారు. ఈ బండ్లు విహారయాత్రలకు వెళ్ళడాని క్కూడా ఉపయోగపడేవి కాని, అవి చేసే కిర్రు కిర్రు శబ్దం మాత్రం ముసలి వరాహం మూలుగును గుర్తుకుతెచ్చేదట. 46 ఈ కుదుపుల్ని భరించ లేక 'యానాస్తరణ'ము 47 బండిలో పరుచుకొనేవారు. అమరకోశంలో 48 'గంత్రి' ("గంత్రీకంబలివాహ్యకమ్") అనేది చెప్పబడిందిగాని, దానినిగురించిన పూర్తివివరాలు మన కంతగా తెలియవు.

అమరావతి, సాంచి, బార్హుత్ శిల్పాల్ని గమనిస్తే ఆకాలంలో బండ్లు ఎలా వుండేవో ప్రత్యక్షంగా చూడవచ్చు. బ్రిటిష్ మ్యూజియంలో వున్న ఒక అమరావతీ శిల్పంలో త్రపుష, భల్ల అనే వర్తకుల ఎడ్లబండ్లు చెక్కబడ్డవి. ఈ వర్తకులే ఉరువేలవనంలోనుంచి ప్రయాణిస్తున్నట్లు సాంచీ దక్షిణ ద్వార తోరణంమీద కనుపిస్తారు. వారి బండ్లప్రక్కలపై నిడుపాటి కర్రలు బిగించివుండి, వాటిమీద ఒక కప్పు పరచ బడివుంటుంది. ఈ రెండెడ్లబండి చక్రానికి 24 ఆకులు వున్నవి. 'వేస్సంతర జాతక' ఘట్టాన్ని చూపించే మరొక అమరా

35. „ „ II
36. కె. ఎస్. పూరి. రాయిడ్ త్రవ్వకములు
37. మార్షల్—మహెంజదారో సంపుటం I
38. వాట్స్—హరప్పా త్రవ్వకములు; మేక్కే—చాన్‌హు దారో
39. మేక్కే—చాన్ హుదారో
40. „
41. ఛాందోగ్యం
42. పతంజలి మహాభాష్యము; మహా భాష్యమునకు ఇండెక్సు B. O. R. G. పునా పు. 1004
43. జాతక I. పు. 4
44. మృచ్ఛకటిక, అంకము 4
45. „
46. „ అంకము 8
47. „ అంకము 6
48. అమరకోశం 238, 52

వతిశిల్పంతో రెండెడ్ల బండి [49] కనిపిస్తుంది. దాని కప్పు పైదానివలెకాక, పూర్తిగా రెండు ప్రక్కలను కప్పబడి వుంది. ఇదే రకమైన బండిని గోలీ శిల్పాల్లో చూడవచ్చు. [50] వీటన్నిటికీ ఆకులుగల చక్రాలే వున్నవి. కాని ఒక అమరావతీ శిల్పంలో ఆకులులేని చక్రాలుగల బండిని కూడ గమనించవచ్చు.[51] నాగార్జున కొండ శిల్పాల్లో, ఆకులు కలవి, లేనివి రెండు రకాల బండి చక్రాలు చెక్కబడ్డవి.[52] మరొక రకమైన బండిని బార్హుత్ శిల్పాల్లో చూడవచ్చు. [53] ఎడారిలో ప్రయాణించే సార్థవాహుల్ని చూపించే ఈ ఘట్టంలో ఎద్దులు, బండినుండి విడదీయబడి విశ్రాంతి తీసుకుంటున్నట్లుంటవి. కాడికి రెండు వైపులా రెండు పట్టీలు వ్రేలాడదీయబడి వుంటవి. ఈ బండిలో ప్రత్యేకత ఏమంటే, చట్రం నాల్గు ప్రక్కలా మూసివేయబడి పై భాగం తెరచి వుంటుంది. ఇది సామగ్రిని తీసుకుపోవటానికి మాత్రమే ప్రత్యేకించబడిన బండి అని సులభంగా తెలుస్తుంది.

శాతవాహనకాలంనాటి బండియొక్క ప్రతిరూపాలు కొల్హాపూరు త్రవ్వకాల్లో దొరికినవి. [54] వాటితోపాటు మూడు చక్రాలు కూడా వేరుగా దొరికినవి. ఈ రెండు బండ్లు కూడా చాలా దృఢంగా నిర్మించబడ్డవే. ప్రతిష్ఠానము, టగరలనుండి బరుకచ్ఛానికి వర్తకసామగ్రులను కొని రావటానికి దుర్గమమైన మార్గాలగుండా ప్రయాణించవలసివచ్చేదని, 'పెరిప్లస్' (Sec. 51) వల్ల మనకు తెలుస్తుంది. ఈ కొండ మార్గాలలో ప్రయాణించాలంటే ఎంతో గట్టి బండ్లు కాని తట్టుకోలేవు. పైన దొరికిన బండ్ల ప్రతిరూపాల్లో ఒకటి వర్తకసామగ్రులను చేరవేసే ఆకాలపు బండ్లని పోలివుంది. ఇదేరకమైన బండి సాంచీ శిల్పాల్లోను [55] (త్రపుస, భల్లుకుల ఎడ్లబండి) అమరావతీ శిల్పాల్లోను [56] కనిపిస్తుంది. ఈ అన్ని బండ్లలోను, పైకప్పును నిలిపివుంచే కొయ్యలు ఒకే రకంగా మలచబడి కనుపిస్తవి. కౌశాంబి త్రవ్వకాల్లో దొరికిన మట్టిబండ్లు, బండ్ల చక్రాలు, వివిధ రకమైన పుష్ప జాతులతో అలంకరింపబడివుంటవి.[57] ఒక బండి విహారయాత్రకు వెళ్లే బృందం, తినుబండారాలు, వేణువు, మృదంగాలతోసహా కనుపిస్తుంది. ఇవే కాక, అలహాబాదు మ్యూజియంలోవున్న కౌశాంబీ మట్టిచక్రాలు కూడా పుష్పాలతో అలంకరించబడి వున్నవి. ఇవి క్రీస్తుశకారంభ శతాబ్దాల్లో ఉత్సవ, విహార యాత్రల కుపయోగించే బండ్ల ప్రతి రూపాలేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఇక యుద్ధరథాల్ని పర్యాలోకిస్తే, నేటి యుద్ధతంత్రంలో టాంకు లెంత ప్రముఖ స్థానాన్నాక్రమిస్తున్నవో, నాడవి అంత ముఖ్య పాత్ర వహించేవి. వీటికి సాంగ్రామిక రథ [58] జైత్ర రథ [59], పాండుకంబలి [60], వైయాఘ్ర అనే పేర్లుండేవి. వేద సాహిత్యాన్ని [61], ఇతిహాసాల్ని పరిశీలిస్తే, ఉన్నత వంశ యోధులు మాత్రమే రథాల్ని యుద్ధాల్లో ఉపయోగించేవారని తెలుస్తుంది. ఇతి హాసాల్లో చెప్పబడిన రథం, రెండు [62] లేక నాలుగు[63] చక్రాలు, సామాన్యంగా నాల్గశ్వాలు పూన్చబడిఉండి, యుద్ధవ్యూహాల్లో అత్యంతప్రముఖ స్థాన మాక్రమించేది. రుద్రదామన్[64], ఖారవేలుల[65] శాసనాల్లో ఈ రథాల ప్రసక్తి కనుపిస్తుంది. భారతంలో అర్ధరథులు, అతిరథులు, మహారథులు అనే బిరుదులు వారి వారి శౌర్యాన్నిబట్టి నిర్ణయించబడినవిగా గమనించవచ్చు. ఆ రథికుడు, చర్మ లేక వస్త్రాలంకార భూషితుడై, పులిచర్మపు త్రాణముతో మహా వీరోచితంగా కనుపించేవాడు. [67]

సైన్యంలో అతి చిన్న విభాగమైన 'పట్టీ'లో ఒక రథం ఒక గజం, 3 అశ్వాలు, 5 గురు పదాతులుండేవారు. [68] 405 గురు పదాతులుగల ప్రతి ''వాహిని''లో 81 రథాలు, 243

---

49. సి. శివరామమూర్తి గోలిస్తూప శిల్పములు
50. టి. ఎన్. రామచంద్రన్
51. బర్జెస్
52. లాంగ్‌హర్ట్స్
53. బారువా
54. లలితకళ (ఏప్రిల్ 1961)
55. మార్షల్—మాన్యుమెంట్స్ ఎట్ సాంచీ
56. ఫెర్గూసన్
57. కాల—కౌశాంబి త్రవ్వకములు
58. మహావీరచరిత్ర, అంకము 4
59. వేణీసంహారము, అంకము 2
60. కాశిక—IV; పాండుకంబళము ఎర్రని ఎరుపుగా వుండేదని, దానిని గాంధారములో వేసేవారని వేస్సాంతర జాతకములో వున్నది
61. ఋ.వే. I. 20, 3. III 15, 5 IV. 4, 10, 16, 20 X. 103, 10.
 అధ వే. VI. 125.
62. మహాభారత ద్రోణపర్వము : 8, 83, 15
63. ,, 165, 38, 173
 రామాయణ—లంక—44, 27
64. ఎపిగ్రాఫికా ఇండికా VIII. 48
65. ,, X
66. జాతక V. 523
67. జాతక II. 529
68. అమరకోశ II, VIII. 48, 49

అశ్వాలు ఉండేవి. మూడు వాహినులు ఒక 'పృతన'గాను, మూడు "పృతనలు" ఒక "చమువు"గాను, మూడు "చమువులు" ఒక "అంకిణి"గాను, మూడు "అంకిణులు" ఒక "అక్షౌహిణి"గాను ఏర్పడేవి. కనుక ఒక అక్షౌహిణిలో 21,870 రథా లుండేవి. "నీతి ప్రకాశము" యొక్క సైన్యవిభాగంలో అశ్వ గజ పదాతుల సంఖ్య వేరైనా, ఒక రథం మాత్రం ఒక 'పట్టి'లో ఉండాలనే విషయంలో 'అమరకోశము'తో భేదాభిప్రాయంలేదు.

కౌటిల్యుడు రథాల్ని సైన్యంలో ప్రత్యేక విభాగంగా పేర్కొన్నాడు. మెగాస్తనీసుకూడా, నాల్గశ్వాల్ని పూన్చిన రథాన్ని వలయాకారపుగిరిలో పరుగెత్తించటం అనుభవజ్ఞులకే ఒక పరీక్ష అని ఒప్పుకున్నాడు. 69 అయితే ఇతడే మరో సందర్భంలో 70 రాజసైన్యంలో ముఖ్యమైన భాగాలుగా, గజాశ్విక పదాతుల్నే సూచించి రథాలను వదలివేశాడు. పైగా పురుషోత్తముడు (Poras) అలగ్జాండరును గజాధిరూఢుడై ఎదుర్కొన్నాడుకాని రథంమీద ఉండి యుద్ధం చేయలేదు. అయితే మగధచక్రవర్తి ధననందునికి 2,000 రథాలున్నవని గ్రీకుల లెక్క ప్రకారం తెలుస్తున్నది.(Diod XVII, 92, Curtius IX, 2; Plutarch Alex. 62) హ్యుయాన్‌త్సాంగ్ భారతసైన్యంలో రథాల్ని చేర్చినా, 71 ఆకాలపు గొప్ప చక్రవర్తి అయిన హర్షుడే వాటిని ఉపయోగించలేదని, మధుబన్ రాగి శాసనంవల్ల, బాణ, హ్యుయాన్‌త్సాంగ్‌ల వర్ణనలవల్ల తెలుస్తుంది. బహుశా, రథప్రయోగానికి, మైదానప్రదేశాలే అనుకూలంగావటంవల్ల, కొండ ప్రాంతాల్లోను, వర్షాకాలంలోను ఉపయోగించటానికి వీల్లేనందువల్లను 72, వీటి ప్రాముఖ్యత దాదాపు 7 వ శతాబ్దంనాటికల్లా తగ్గిపోయిందని చెప్పవచ్చు.

పైన చర్చించిన అంశాల్ని గమనిస్తే నేటికాలపు బండ్లు అంతగా మార్పుచెందలేదని తెలుస్తుంది. అమరావతీ శిల్పాల్లో బండి నేటి 'ఒంటెద్దుబండి'లోను, ఆకుల్లేని చక్రాలు ఎంత తక్కువైనా, ఈనాటి కొన్ని బండ్లకు, చన్హుదారోలో కనుపించిన మూడు పలకలతో చేసిన చక్రం ఈనాడు సిర్సారు (చత్తీస్‌ఘడ్), అందాపూర్ (విదర్భ)లోను, ప్రత్యక్షమవుతుంటాయి. కొన్నివేల సంవత్సరాలు గడచినా, రాజకీయ, సాంఘిక వ్యవస్థలో ఎంత మార్పు వచ్చినా, సామాన్య ప్రజల జీవన విధానంలోనూ, వా రుపయోగించే వస్తుసామగ్రులలోనూ, పురాతన ఛాయలు నేటికీ కనుపిస్తూనే వున్నాయి.

---

69. మేక్రిండిల్, ఏన్షెంట్ ఇండియా పు. 89
70. ,, పు. 160—161
71. వాటర్స్ 'యువాన్‌చాంగ్ యాత్రలు,
72. అర్థశాస్త్ర X అ. 4; మహాభారత—శాంతిపర్వ; అగ్నిపురాణ; యుక్తి కల్పతరువు.

నాగరికులు

శ్రీ అంగర సూర్యారావు

పాత్రలు :

సుబ్బారాయుడు	గణపతి
చంద్రశేఖరం	వరసయ్య
సింహాచలం	ఎల్లయ్య
అప్పడు	సన్యాసిరావు

ఇన్‌స్పెక్టరు

(స్థలం :—ఒక గది. సమయం :—ఉదయం 8 గంటలు. గదికి మధ్య ఒక ద్వారం ఉంది. తలుపులు మూసిఉన్నాయి. గదిలో పొడవుగా ఉన్న బెంచీలు రెండు ఉన్నాయి. యితర సామాను లేమీ లేవు. కుడి వైపు నుంచి వరసయ్య, చంద్రశేఖరం మాట్లాడు కుంటూ ప్రవేశిస్తారు. వరసయ్య పంచె కట్టుకున్నాడు. కంటిగెడచొక్కా వేసుకున్నాడు. వయస్సు 40 సంవత్సరాలు. చంద్రశేఖరం లాంగ్‌పాంటు, కోటు, ఖరీదైన బూటు వేసుకున్నాడు. వేషభాషల్ని బట్టి నాగరికుడని తెలుస్తూ ఉంటుంది. వయస్సు 26 సంవత్సరాలు. డబ్బు అంటే ఖాతరు లేనట్లు మాట్లాడ తాడు.)

వరసయ్య : ఒక్కొక్క బాబు ఉన్నాడంటే—మూణ్ణెల్ల అద్దె అడ్వాన్సుగా మీద పారేస్తాడు. వద్దన్నా యివడంటే నమ్మండి.

చంద్రశేఖరం : యస్. యు ఆర్ కరెక్ట్ ! డబ్బుకు విలువేముం దండీ ఆఫ్టరాల్, మాటకు విలువివ్వాలి.

వర : చిత్తం. మీలాంటి తెలుసున్న మహారాజు లంతే. అలాగే అంటారు.

చంద్ర : మీరు అద్దెకు యివ్వబోయే గది అదేనా ?

(మధ్యద్వారంకేసి చూపిస్తాడు.)

వర : అబ్బెబ్బే, కాదండి. అది మా తమ్ముడి గది. మీరు ఉండ వలసిన గది యిదే.

చంద్ర : (ఆశ్చర్యా న్వితుడయినట్లు) హా ! యీ గదేనా ? యిలా ఉందేమిటి ?

వర : మనం యెన్ని మరామత్తులు చెయ్యనివ్వండి. అద్దెకొంపలు యెప్పుడూ యిలాగే కనబడతాయి.

చంద్ర : నాకు అంతగా నచ్చలేదు.

వర : ఆదేమిటండి ? అలా గంటారు? ఈ గది చూసినవాళ్ళు అసలు వదిలిపెట్టలేరంటే నమ్మండి. ఈ యిల్లు మార్కెట్టుకు దగ్గిర. రైలుస్టేషనుకు, ఆఫీసులకి అన్నిటికీ దగ్గిరే. సాయంత్రంవేళ ఖులాసాగా చల్లగాలికి అమ్మ గారూ, మీరూ కలిసి సముద్రపు ఒడ్డుకు కూడ షికా రెళ్ళొచ్చు. (సంశయిస్తూ) యింతకూ తమకు పెళ్ళయిందా ?

చంద్ర : అయింది కానీ కొంతకాలంవరకూ నేను ఒంటరి గానే ఉంటాను.

వర : యిలాంటి పట్నాల్లో ఒంటరిగా ఉన్నవాళ్ళకి మరీ సుఖంగా ఉంటాదిలెండి.

చంద్ర : యీ గదికి అద్దె యెంతో—చెప్పారుకాదు. ముందు రెంట్ ఫిక్స్ చేసుకోవడం మంచిది.

వర : తమరికి యిక్కడ దేన్లైనా ఉద్యోగమా ?

చంద్ర : (తేలిగ్గా) ఆఁ ! ఇంచుమించుగా అలాంటిదే.

వర : అదేదో సెలవియ్యండి.

చంద్ర : నాది ఒక పే .... ద్ద .... కంపెనీ.

వర : అంటే సర్కస్ కంపెనీయా ?

చంద్ర : నో ! నో!—లాటరీ కంపెనీ !

వర : హోహా ! అలాగటండి !

చంద్ర : ఆ కంపెనీకి ప్రొప్రయిటర్ని నేనే. నా క్రింద ఐదు వందల మంది యేజంట్లు ఉన్నారు. ఏ పట్నంలో చూసినా, ఏ పల్లెటూళ్ళో చూసినా నా యేజంటు కనిపిస్తాడు.

వర : (ఆశ్చర్యంతో) అబ్బో ! అయితే చాలా పెద్ద కంపెనీయే !—తమరి పేరు ?

చంద్ర : చంద్రశేఖరం.

వర : తమరు యీ గదిలో దిగారంటే దీనికి ఎక్కడలేని అందమూ వస్తాది. అసలు మనిషినిబట్టే గదికి కళ వస్తాదంటే తమరు నమ్మాలి.

చంద్ర : నా చేతిలోకి వచ్చిన తరువాత గదిని యిలా ఉంచుతానా ? తాజమహలులా తయారు చెయ్యనూ !

వర : మేకులు దిగగొట్టకుండా, గోతులు తియ్యకుండా తమరేం మరామత్తు చేసుకున్నా నాకు యిష్టమే.

చంద్ర : మరి అద్దెమాట ?

వర : అబ్బే ! అద్దెకేముందండి ! ముప్పై రూపాయలేనండి.

చంద్ర : (ముందు ఆశ్చర్యపోయి తరవాత తేరుకొని) ముప్ఫయి రూపాయలా ?

వర : తమబోటి మహారాజులకు యీ అద్దె ఒక లెక్కా ?

చంద్ర : యస్! యు ఆర్ రైట్ ! ఒక గంటలో వచ్చి దిగుతాను. నా సామాన్లన్నీ యీ రాత్రి గూడ్సు డ్రైవ్‌లో వస్తాయి. (వెళ్లిపోబోతాడు.)

నర : అయ్యా ! చంద్రశేఖరంగారూ ! నా అడ్వాన్సు మాట సెలవివ్వారు కారు.

చంద్ర : (ఆగి) అడ్వాన్సా ? ఏమాత్రం కావాలి ?

నర : కనీసం మూణ్ణెల్ల అద్దయినా యిప్పించండి.

చంద్ర : అంటే, తొంభై రూపాయలన్నమాట! ఆఫ్టరాల్ మరో పది రూపాయల దగ్గర వెనకాడడ మెందుకు ? వంద రూపాయలకు చెక్కు రాసి యిస్తాను. మార్చుకోండి. (జేబులోంచి పెన్ తీసి) మీ పేరు ?

నర : నరసయ్య అండి.

చంద్ర : (పాంట్ జేబులో చెయ్యిపెట్టి చెక్కు పుస్తకానికి బదులు సిగరెట్ పెట్టె పైకితీసి) చెక్కుబుక్ నా ట్రంకులో విడిచిపెట్టి వచ్చాను. (పెన్ తిరిగి జేబులో పెట్టి—నిర్లక్ష్యంగా సిగరెట్ వెలిగించి—మరొక సిగరెట్ తీసి నరసయ్యకు యిస్తూ) టేక్ ఇట్.

నర : (మొహమాట పడుతూ) అహహ! దానికేంలెండి. (సిగరెట్ తీసుకొని వెలిగిస్తాడు) మరి అడ్వాన్సు మాట ....

చంద్ర : ఇప్పుడే పది నిముషాలలో—తిరిగి వస్తాను. రాగానే యిస్తాను. మీకు అంతగా అనుమానంగా ఉంటే (జేబులోంచి మూడు ఐదు రూపాయల నోట్లు తీసి) యీ పదిహేను రూపాయలూ దగ్గర ఉంచుకోండి.

నర : (డబ్బు తీసుకుంటూ) అమ్మమ్మ ! తమ మీద అనుమానమా ? ఎంతమాట !—మీరు యింక ఆలస్యం చెయ్యకుండా దిగిపోయి గదికి తాళం వేసుకోండి.

చంద్ర : ఇప్పుడే ఐదు నిముషాలలో వస్తాను.

(వెళుతూ ఉంటాడు.)

నర : తమకి మరో చిన్న విషయంకూడా చెప్పాలి.

చంద్ర : (ఆగి) ఏమిటది ?

నర : (మధ్యద్వారంకేసి చూపిస్తూ) యీ గుమ్మందగ్గర ఎవరినీ అల్లరి చెయ్యనివ్వకండి. అది మా తమ్ముడు ఉండే గది. ఆడు అసలే పేచీకోరు మనిషి. మా తమ్ముడు సింహాచలం పేరు చెబితే యీ వీధిలో అందరికీ భయమే. (సగర్వంగా) అయినా వాడి పప్పులు మన దగ్గర ఉడకవులెండి.

చంద్ర : (తేలికగా) ఫరవాలేదు. ఆసంగతి నాకు విడిచిపెట్టెయ్యండి.

నర : ఆడు యెప్పుడైనా మిమ్మల్ని అద్దె అడిగితే యిచ్చారు గనక సుమండీ!

చంద్ర : ఎంతమాత్రం యివ్వను.

(ఇద్దరూ కుడివైపు నడుస్తూ ఉంటారు.)

నర : ఆడికీ నాకూ చాలా పేచీ లున్నాయిలెండి.

చంద్ర : ఉండొచ్చు. దానికేముంది ?

నర : ఇంటికి పెద్దవాణ్ణి నేను. పూచీ అంతా నాది.

చంద్ర : యస్ ! యు ఆర్ సెంట్ పెర్సెంట్ కరెక్ట్ !

(ఇద్దరూ వెళుతూవుండగా—కుడివైపునుంచి పెట్టె భుజంమీద పెట్టుకొని సుబ్బారాయుడు, పరుపు చుట్ట చంకను పెట్టుకొని గణపతి—వాళ్లకు యెదురు వస్తారు. గణపతి వయస్సు 20 ఏళ్లు. లాల్చీ, షరాయి వేసుకున్నాడు. సుబ్బారాయుడు వయస్సు 50 సంవత్సరాలు. నుదుట విభూతిరేఖలు. తలపాగా, చొక్కా, పంచె వేసుకున్నాడు. వేషాన్నిబట్టి పూర్వాచార పరాయణుడని తెలుస్తుంది.)

గణపతి : (నరసయ్యతో) సింహాచలంగారు ఉన్నారా ?

నర : (కోపంతో) ఆ యెదవ సంగతి నాదగ్గిర యెత్తొద్దు.

(నరసయ్య సీరియస్‌గా—చంద్రశేఖరం వెనక నిష్క్రమిస్తాడు.)

సుబ్బారాయుడు : (ఆశ్చర్యంతో నరసయ్య పోతున్నవైపు చూస్తూ) యితగాడికి యిదేం పోయేకాలం చెప్మా ! (పెట్టె క్రింద పెడతాడు.)

గణ : (బెడ్డింగు బల్లమీద పెట్టి) చూడు మావయ్యా గది యెలా ఉందో !

సుబ్బా : (చుట్టూ చూసి) ఎలాగ ఉందా ? ఎలకలబోనులాగా ఉంది. దీనికి గాలి రావడానికి దారీ తెన్నూ ఏడిసిందా ? (చుట్టూ చూస్తాడు.) అసలు యీ పట్నాలవాళ్లను చూస్తే నాకు ఎక్కళ్లేని వొళ్లు మంటొస్తుంది! చెప్పొద్దూ ?—అంగుళం స్థలం ఉంటే చాలు. దాన్ని అణా పైసలతో కొలిచేస్తారు. గదిమీద గది కట్టిపారేస్తారు. గాలి వస్తుందా, ఛస్తుందా అన్న మాట వాళ్లకి అక్కర్లేదు. గదిలో అద్దెకున్నవాడు ఏ క్షయవ్యాధో సోకి ఆసుపత్రికి పోతాడు. ఆ ఉత్తర క్షణంలోనే ఐదు రూపాయలెక్కువవేసి ఆ గదిని మరొకడికి అద్దె కిచ్చేస్తారు.

గణ : (నవ్వుతూ) పట్నంవాళ్లను చూస్తే నీకెందు కంత కోపం మావయ్యా ?

సుబ్బా : ఉట్టినే కోపం ఎందుకొస్తుందిరా ? చూస్తున్నావు కాదూ ? అన్నీ యిరుకు సందులే. అంతస్థులమీద అంతస్థులు మేడలుకట్టి పారేశారు. సూర్యుడూ కనపడడు. చంద్రుడూ కనపడడు. మన పల్లెటూళ్లలో పుణ్యస్త్రీలైనా, పూర్వ సువాసినులైనా పొద్దు చూడందే మంచినీళ్లుకూడా తాగరు. అటువంటి వాళ్లు యీ పట్నం వస్తే మిట్టమధ్యాహ్నం వరకూ పస్తుండి చావవలసిందే !

గణ : సరే ! దానికేం ! ముందు నీకీ గది నచ్చిందో లేదో చూడు.

సుబ్బా : నాకు ఒక కొంప కూడా నచ్చలేదు. ఒక్క యింటికీ—రామరామ—అరుగైనా లేదే ! ఒక్క ఆలయం కూడా కనపడదు కదా ! పట్నాలలోంచి దేవుణ్ణి తరిమేసి నట్లున్నారు. వీధివీధినీ, సందుసందునా కాఫీ దేవాలయాలు ! ప్రొద్దు పొడవకుండానే తండోపతండాలుగా జనం కాఫీ హోటళ్లలో దూరడం—ముగ్గురు కూర్చోవలసిన బల్ల

చుట్టూ పదిమంది క్రిక్కిరిసిపోయి కూర్చోడం—ఒకడు తింటున్న పదార్థం మరొకడి మీదికి తుళ్ళుతున్నా లెక్కచెయ్యకుండా తినెయ్యడం.—ఆతరవాత ఏ కడుపునొప్పో, అజీర్తో పట్టుకుంటే—ఆ పక్కనే ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో కెళ్లి అర్ధరూపాయ డబ్బిచ్చి నాలుగు మందు చుక్కలు నోట్లో పోయించుకోవడం—యిదేం నాగరికత తెచ్చిపెట్టావురా దేవుడా అవి మాలాంటివాళ్ళు మొత్తుకోవడం.

గణ : ఈ యిల్లు ఆఫీసుకు దగ్గర. ఇంతకంటే సౌకర్య మయినది యిక మనకు దొరకదు. అందుకే యిది కుదిర్చేశాను.

సుబ్బా : ఈ యింటి యజమాని యెవరు ?

గణ : పిలుస్తాను. ఆయనకు యిప్పుడు అడ్వాన్సు యిచ్చుకోవాలి. (మధ్య ద్వారం దగ్గరకు వెళ్లి) సింహాచలం గారూ ! సింహాచలంగారూ !

నేపథ్యంలో : (బిగ్గరగా) యెవరు ?

(మధ్య గది తలుపులు తెరుచుకొని సింహాచలం వస్తాడు. దృఢమైన శరీరం. గిరజాల తల. కోర మీసం, బనీను, పంచెకట్టు—వయస్సు 35 సంవత్సరాలు).

సింహాచలం : (వస్తూనే) యేమయ్యోయ్. ఈ తలుపు దగ్గర ఎప్పుడూ కేకలెయ్యకు. ఇక్కడ ఆడోళ్ళు మసలుతూ ఉంటారు. నీ కేమైనా పనుంటే అవతలకేసి పిలు.

గణ : అలాగేనండి.

సింహ : అడ్వాన్సు పట్టుకొచ్చారా ?

గణ : ప్రస్తుతం ఒక్క అయిదు రూపాయలు అడ్వాన్సుగా పుచ్చుకోండి. వారంరోజులలో మిగిలిన పదిహేను రూపాయలూ యిచ్చేస్తాను.

సింహ : భలే మనిషివయ్యా ! అందరూ మూడేసి నాలుగేసి నెలల అద్దె అడ్వాన్సుగా పుచ్చుకుంటారు. నేను పోనీలే కదా అని ఒక నెల అద్దె అడిగాను. అదికూడా అరువు పెడతన్నావా ?

గణ : లేదండి. మేం తెచ్చిన డబ్బంతా ఖర్చయిపోయింది. మీకు వారంరోజులలో యివ్వకపోతే నిలదీసి అడగండి.

సింహ : ఇదిగో చూడబ్బాయి ! నాకు డబ్బుకాదు కావలసింది. మనిషి మంచీ, మాట మంచీ కావాలి.

గణ : (సుబ్బారాయుడుతో) మావయ్యా ! వీరికి ఐదు రూపాయలిచ్చేయ్.

సుబ్బా : (జేబులోంచి ఐదు రూపాయలు క్వాయిన్సు తీసి—ఒకదానిమీద ఒకటి సింహాచలం చేతిలో వేస్తూ) ఒకటీ, రెండూ, మూడూ, న్నాలుగూ, ఐదూ.

సింహ : ఐదు రూపాయల్నీ ఐదు వందలలాగ లెక్కపెడుతున్నా రేమిటి పంతులుగారూ ?

సుబ్బా : నువ్వూ అలాగే అన్నావు నాయనా ! ఈ మహాపట్నంలో ఎవరికీ డబ్బంటే ఖాతరు ఉన్నట్లు కనపడదే !

సింహ : (బనీను జేబులో రూపాయలు వేసుకొని) మా యింటి ఆడోళ్ళు ఒక్క రాత్రి సినిమాకి యెళ్ళారంటే పది రూపాయలు ఖర్చయిపోతాయి.

సుబ్బా : బాగుంది నాయనా ! బాగుంది. ఇప్పుడు మా పల్లెటూళ్ళు కూడా పాడయిపోయినయ్. వెనక మావూళ్ళల్లో తోలుబొమ్మలాటలు, చెంచు నాటకాలు, భాగవతాలూ ఆడించేవారు. డబ్బున్న ఆసామీలు పదిమందీ వాళ్ల ఖర్చులు సమస్తం భరించేవారు. వున్నవాళ్ళు, లేనివాళ్ళు గ్రామస్థులు యావన్మందీ సరిసమానంగా చూసి ఆనందించేవారు. ఇప్పుడో—చేతిడబ్బు క్షవరమైతే కాని కాలక్షేపం జరగదు.

సింహ : (గణపతితో) పెద్దవారు ! ఆయనమాటలకేం ? అబ్బాయ్ ! ఇంటిని జాగ్రత్తగా చూసుకో.

సుబ్బా : మొత్తం ఎన్ని గదులు ?

గణ : ఈ ఒక్క గదే.

సుబ్బా : (ఆశ్చర్యంతో) యిదెక్కడి ఘోరకలిరా ! యీ ఒక్క గదికే ఇరవై రూపాయలు అద్దా ?

సింహ : మీకు యిష్టం లేకపోతే యిప్పుడైనా యిడిచిపెట్టెయ్యొచ్చు.

గణ : (ఆత్రుతతో) లేదు. లేదండి. మా మావకు తెలియదు. (సుబ్బారాయుడుతో) యిక్కడ అంతకంటే తక్కువకు చిన్నగది కూడా దొరకదు.

సుబ్బా : సరే ! కానియ్. మరేం చేస్తాం.

సింహ : మీరు యిక్కడ వంట చేసుకుంటారా ? హోటల్లోంచి భోజనం తెచ్చుకుంటారా ?

సుబ్బా : మావాడు అలాంటి అప్రాచ్యపుపని ఎప్పుడూ చెయ్యడు. లక్షణంగా వండుకు తింటాడు.

సింహ : అలాగయితే బొగ్గులపొయ్యే వాడాలి.

సుబ్బా : (కోపంతో) బాగుందయ్యోయ్ ! మేం ఏ పొయ్యిమీద వండుకోవాలో, ఏ గిన్నెలో వంట చేసుకోవాలో, ఏ విస్తరిలో తినాలో, ఏ గ్లాసులో మంచినీళ్ళ తాగాలో—అన్నీ నువ్వే చెప్పేసేలాగున్నావే !!

గణ : అబ్బబ్బ ! వూరుకో మావయ్యా ! నిన్ను యెరక్కపోయి తీసుకొచ్చాను. అన్నిటికీ పేచీ అయితే ఎలాగ?—గది పొగచూరిపోతుందని కర్రలపొయ్యి వాడొద్దంటారు. పట్నంలో అద్దె యిళ్లన్నిటికీ యీ షరతు ఉంటుంది.

సుబ్బా : ఒరే గణపతీ ! నీ ఖర్మంకాలి గాని—లేకపోతే నీ కీ ఉద్యోగం యెందుకు చెప్పు ? పెద్దలి యిచ్చిపోయిన మడిచెక్క కాస్త దున్నుకొని 'కృష్ణా రామా' అంటూ మన వూళ్ళోనే బతకకూడదూ ? ఉన్నదానితో తృప్తి పడక యీ దిక్కుమాలిన ఉద్యోగం ఎందుకూ అంట?

సింహ : (గణపతితో) అబ్బాయ్ ! అద్దె నాకు తప్ప ఎవ్వరికీ యివ్వకూడదు.

సుబ్బా : నీకుకాక యింకెవరికిస్తార్లే !

సింహా : అదికాదు. ఇక్కడ మా అన్నయ్య ఒకడున్నాడు. ఆడికీ నాకూ పడదు. నే విమ్మన్నానని వంకపెట్టి అద్దె వసూలు చేసుకుపోతుంటాడు.

సుబ్బా : మాదగ్గర అలాంటి వేషాలేమీ సాగవ్.

సింహా : ఒకవేళ వా డెప్పుడైనా వస్తే నన్ను పిలవండి. వాడి సంగతి తేల్చేస్తాను.

సుబ్బా : (సింహాచలంతో) చూడు నాయనా ! వీడు నాకు స్వయంగా మేనల్లుడు. ఉద్యోగంచేస్తూ వీడు ఒక్కడే ఉంటాడు. నేను ఉదయంబండిలో మా గ్రామం వెళ్లిపోతాను. ఈ కుర్రాణ్ణి కొంచెం జాగ్రత్తగా కని పెట్టి చూస్తూవుండు.

సింహా : మీ అల్లుడికేం బయంలేదండి. ఈ వీధి మొత్తంమీద నే నెంత చెబ్తే అంత. ఈ పట్నంలో శ్రీరామనవమి కాని, గణపతి నవరాత్రులు కాని అయితే బాణాకర్ర పట్టుకొని నేను ముందు నిలబడవలసిందే. కొంచెం పనుంది. వూళ్లోకెళ్లి వస్తాను. (మధ్య ద్వారంలేపి చూస్తూ) లక్ష్మీ, నే వూళ్లోకి పోతన్నాను. తలుపేసు కోవే.

(తలుపులు పెద్ద చప్పుడుతో మూసుకు పోతాయి. సింహాచలం కుడివైపు వెళ్లిపోతాడు.)

గణ : (ఒక బెంచి ఎడమ చివరకు లాగి కూర్చుని) హమ్మయ్య, ఇప్పటికి మనసు స్థిమితపడింది.

సుబ్బా : (గదిలో తిరుగుతూ పరిశీలనగా చూస్తూ) ఘోరకలి! ఈ గదికి ఇరవై రూపాయలు అద్దె అట! గాలీ రాదు. వెలుగూ రాదు. వాన వస్తేమాత్రం లోపలికి కురవవచ్చు.

గణ : నువ్వు యిక యేది పట్టుకుంటే అదే. కూర్చో మావయ్యా !—నువ్వు మరో రెండు రోజులు ఉండి వెళ్లకూడదూ ?

సుబ్బా : చాలుచాలు ! ఇప్పటివరకూ ఉన్నదే చాలు. మొహం మొత్తింది. యిళ్ల చుట్టూ దుర్వాసన వచ్చే మురికి కాలవలు: యిళ్లలో మాత్రం సెంటు సీసాలు, పౌడరు డబ్బాలూను. ఏం నాగరికత తెచ్చిపెట్టావురా దేవుడా ! వూరినిండా దోమలు. —అవి రాకుండా ఉండే ఉపాయం ఎవళ్లూ ఆలోచించరు. కోట్లకొద్దీ పుట్టుకొస్తున్న దోమల్ని, ఈగల్నీ చంపడానికి బోల్డుమంది ఉద్యోగస్థులు. వాళ్లకు వందలకొద్దీ జీతాలు. నెత్తిమీద టోపీలు, కాళ్లకు బూట్లు, తిరగడానికి కార్లు—ప్రజల సొమ్మంతా వృధాగా ఖర్చుపెట్టెయ్యడం. మాటాడితే పన్ను, కూర్చుంటే పన్ను, నుంచుంటే పన్ను—ఈ ప్రపంచంలో అనుభ విస్తున్నది చాలక పైగా చంద్రమండలంలోకి కూడా వెళతారట !

గణ : (నవ్వుతూ) యేమిటి మావయ్యా ! యివ్వాళ అలా వెం రేగి పోతున్నావ్ ?

సుబ్బా: అవున్రా. ఈ ప్రపంచాన్ని కాస్త పరిశుభ్రం చేసుకొని— ఒకరిని కష్టపెట్టకుండా తను కష్టపడకుండా 'కృష్ణా రామా' అంటూ కాలక్షేపం చేస్తే ఎంత బాగుంటుంది?

గణ : ఈ పూట భోజనంమాట ఏమిటి ? హోటలుకు వెడ దామా ?

సుబ్బా : రామరామ ! హోటలుమాట నాదగ్గర ఎత్తకు.

(కుడివైపు నుంచి చంద్రశేఖరం దర్జాగా లెదర్ సూట్‌కేస్ చేతో పట్టుకొని వస్తూవుంటాడు.)

సుబ్బా : (చంద్రశేఖరాన్ని చూడగానే తొందరగా) ఏమయ్యోయ్! ఏమయ్యోయ్ ! ఆగు ఆగు ! మాటా మంతీ లేకుండా యింట్లో జొరబడి పోతున్నావ్ ఎవరవు నువ్వు ?

చంద్ర : (ఠీవిగా ముందుకు వచ్చి) విలేజ్ బ్రూట్‌లా ఉన్నావే!

సుబ్బా : (గణపతితో) ఏమిట్రా యితగాడు అనేమాట ?

గణ : (చంద్రశేఖరాన్ని సమీపించి) ఏమండోయ్ ! కొంచెం మర్యాదగా మాట్లాడండి.

సుబ్బా : (వెంటనే గణపతితో) కొంపతీసి అప్రాచ్యపు తిట్టు యేదీ తిట్టలేదుకదా ?

గణ : అసలు మీరు లోపలి కెందుకొచ్చారు ?

సుబ్బా : (వెంటనే) మా యింట్లో చొరబడిపోయింది చాలక పైగా మమ్మల్నే గదమాయిస్తున్నావ్ ?

చంద్ర : (కోపంతో) యు ఆర్ టాకింగ్ నాన్సెన్స్! ఇది మీ యిల్లా ?

గణ : (కోపంతో) లేకపోతే మీ యిల్లా !

సుబ్బా : (చంద్రశేఖరంతో) ఏమయ్యా? ఇంతకీ నువ్వు తెలుగు వాడివేనా ?

చంద్ర : నేను తెలుగువాణ్ణే కాని అది మీకు అనవసరం.

సుబ్బా : అయ్యయ్యో ! మాతృభాషను ఎందుకురా నాయనా అలా చంపేస్తావ్? కల్తీలేకుండా ఆడే మూడు మాటలూ తెలుగులోనే ఆడకూడదూ ?

చంద్ర : మీరు యిక్కడ ఎందుకు ఉన్నట్లు ?

సుబ్బా : ఓహో ! మమ్మల్నే ఎదురుతిరిగి అడుగుతున్నావ్ ? అసలు నువ్వు యిక్కడికి ఎందుకు వచ్చినట్లు ?

గణ : ఎవరికోసం వచ్చారో చెప్పండి ?

చంద్ర : మీకు ఇంకా బోధపడినట్లు లేదు. ప్రస్తుతం ఈ యింటికి యజమానిని నేను.

సుబ్బా : (బిగ్గరగా నవ్వుతూ) అహ్హాహ్హా ! (గణపతితో) ఒరే అబ్బీ ! ఇతగాడు నాలేత్తరు అప్పట్నుంచి తప్పించుకు రాలేదుగదా !

చంద్ర : (కోపంతో) పైగా నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నావ్ ?

గణ : అవునండీ. మరి మేం యిల్లు కుదుర్చుకున్నాం. అడ్వాన్సు యిచ్చుకున్నాం. ఇంట్లో దిగిపోయాం కూడాను. ఇప్పుడు మీరు వచ్చి ఇంటి యజమానిని నేనే అంటున్నారు.

చంద్ర : అయితే మీరు మోసపోయారు. మీ పల్లెటూరి వేషాలు చూసి—మిమ్మల్ని ఎవరో తేలిగ్గా దగా చేశారు.

సుబ్బా : ఏమిటోయ్ ! అసలు నీ ఉద్దేశం యేమిటీ అంట ?

చంద్ర : ఈ ఇంటిని నేను యిదివరకే అద్దెకు కుదుర్చు కున్నాను. అడ్వాన్సు కూడా యిచ్చేశాను.

గణ : అయితే మీరే మోసపోయారు. ఇంటి యజమాని సింహా చలంగారికి మేం మా స్వహస్తాలతో అడ్వాన్సు యిచ్చాం.

సుబ్బా : (చంద్రశేఖరంతో) వెళ్లిపోనాయునా! వెళ్లిపో ! మేం యింకా వంటచేసుకోవాలి.

చంద్ర : (కోపంతో) మీరు వెంటనే గది ఖాళీ చెయ్యాలి. లేక పోతే పోలీసుల్ని పిలవవలసి ఉంటుంది.

సుబ్బా : ఓహో ! బెదిరిస్తున్నావ్! ఇలాంటి బెదిరింపులు మనదగ్గర సాగవ్ !

గణ : మీరు ఎవరికి అడ్వాన్సు యిచ్చారు ?

చంద్ర : అతడి పేరు .... (ఆలోచించి) .... నరసయ్య.

గణ : అద్దె ఎంత ?

చంద్ర : ముప్ఫై రూపాయలు.

గణ : శుద్ధ దగా ! ముప్ఫయి రూపాయలట!

సుబ్బా : మేం ఇరవై రూపాయలకే కుదిర్చేసుకున్నామోయ్ ! వెర్రివాడా !

గణ : ఇప్పటికైనా మించిపోయింది లేదు. నరసయ్య ఎవరో వెతికి పట్టుకొని మీ డబ్బు మీరు తీసుకోండి.

చంద్ర : నో ! నో ! నే నెందుకు తీసుకోవాలి ? మీరే యిల్లు ఖాళీచేసి మీ డబ్బు వాపస్ తీసుకోండి.

గణ : 'ఇంటి యజమానికే మేం డబ్బు యిచ్చామయ్యా' అని చెప్పడంలేదూ ?

చంద్ర : నేనూ హౌస్ వోనర్‌కే డబ్బిచ్చానోయ్.

సుబ్బా : (గణపతితో) వానరానికి డబ్బిచ్చానంటాడేమిట్రా ? (చంద్రశేఖరంతో) వానరం అంటే కోతిరా నాయునా! మాతృభాష మళ్లీ చదువుకో !

గణ : నువ్వూరుకో మావయ్యా! హౌస్‌వోనర్ అంటే యింటి యజమాని.

చంద్ర : ఏదో మోసం జరిగినట్లే తోస్తుంది.

గణ : మేం చెప్పేదీ అదేనండి.

చంద్ర : మీ దగ్గర డబ్బు తీసుకున్న దెవరు ?

గణ : సింహాచలం.

చంద్ర : వాడగ్గర అడ్వాన్సు పుచ్చుకున్నవాడు నరసయ్య—ఈ సింహాచలం, నరసయ్యలు యిద్దరూ ఎవరో ? ఇలా దగా చెయ్యడానికి కారణం ఏమిటో ఆరా తియ్యాలి.

సుబ్బా : నువ్వు ఊరంతా తిరిగి ఆరా తీసుకొని మధ్యాహ్నానికి రా నాయునా ! ఈలోగా మేం వంట చేసుకొని భోజనం చేసి స్థిమితంగా కూర్చుంటాం.

చంద్ర : (కోపంతో) నేనేం వెర్రివా ణ్ణనుకుంటున్నారా ? ముందు గది ఖాళీ చెయ్యాలి మీరు.

సుబ్బా : ఒరే గణపతీ ! యిదెక్కడి గొడవ వచ్చిపడిందిరా మన ప్రాణానికి.

గణ : (చంద్రశేఖరంతో) ఒకసారి మీరు అలా పైకి వెళ్లిరండి. అప్పటికి సింహాచలంగారు వస్తారు.

చంద్ర : వ్యవహారం సెటిల్ అయ్యేవరకూ యిక్కడినుంచి అడుగు కదపను. (రెండవ బెంచీ కుడి చివరకు లాగి కూర్చుంటాడు.)

సుబ్బా : సారి దేవుడా ! యివ్వాళ కూడా పస్తుండవలసిందేనా ! (ఎడమ చివరవున్న బెంచీమీద కూలబడతాడు. కుడివైపునుంచి బిగ్గరగా కేకలు వేసుకుంటూ ఎల్లయ్య ప్రవేశిస్తాడు. కాకీపాంట్, షర్టు వేసుకున్నాడు. పొడవు పాటి మీసాలు. ముఖం రుసరుసలాడుతూవుంది. చేతిలో చిన్న నోట్‌బుక్ వుంది.)

ఎల్లయ్య :—(వస్తూనే) ఆ వెధవని యీ దెబ్బతో సఫాచేసే స్తాను. ఈ సందులో కెడితే ఆ సందులో వున్నానంటాడు. ఆ సందు కెడితే ఈ సందులో వున్నానంటాడు. ఎంత చెప్పినా రోడ్లు తుడవడు. పైగా యెవరైనా కంప్లైంట్‌చేస్తే వాళ్ళయింటిమీదపడి నానా తిట్లూ తిడతాడు. వాడి నోటికి జడిసి కంప్లయింటు చెయ్యడం కూడా మానుకున్నారు. ఈ దెబ్బతో వెధవని సస్పెన్షన్‌లో పెట్టించేస్తాను. పొగరుబోతు వెధవ.

సుబ్బా :—(లేచి ఎదురు వెడుతూ) యే వెధవ? యేమిటి సంగతి? అసలు నువ్వెవరవ్? ఈ లోపలికి నిన్నెవరు రమ్మన్నారు?

ఎల్ల :— వాడేనండి! అప్పడు. మన రోడ్లు తుడుస్తాడు చూశా రూ? ఆ అప్పడే! ఏనికి వాడంత దొంగలేడంటే నమ్మండి.

సుబ్బా : (కోపంతో) ను వ్వెవరివయ్యాఅంటే చెప్ప వేమిటి?

ఎల్ల : నేను యీవార్డు మునిసిపల్ సార్జంటు నండి.

సుబ్బా : (గణపతితో) మునిసిపల్ సారిజంటుయేమిటి? సారి జంటు అంటే సిపాయి కాదట్రా?

గణ : యీ పట్నంలో శానిటరీ మేస్త్రీని అలాగ పిలుస్తారు.

సుబ్బా : (ఎల్లయ్యతో) వెళ్ళిపోవయ్యా వెళ్ళిపో. అసలు మాగొడవలతోనే మేం కొట్టుకు ఛస్తుంటే నీ గొడవ కూడా మాకెందుకు?

ఎల్ల : వెళ్ళిపోతాను సార్, 'అప్పడు' యీ వీధికి వచ్చాడో లేదో మీరు చెబితేచాలు వెళ్ళిపోతాను.

సుబ్బా : మేం చూళ్ళేదు. యిక దయచెయ్.

ఎల్ల : (సంతోషంతో వెంటనే అందుకొని) అద్దదీ! ఆ మాట మీద మీరు నిలబడండి చాలు! ఆవెధవని ముందు సస్పెండ్ చేయించేస్తాను. తరువాత డిస్మిస్ చేయిం చేస్తాను. — చిన్నంతరం, పెద్దంతరం లేకుండా మాటకి మాట అనేస్తాడా? యీ దెబ్బతో వాడిపొగరు అణిచేశాననుకోండి. "ఓరివెధవా! వీధంతా తుడిచా నంటావ్. తుడిస్తే యీ చెత్త తుక్కూ యేమిట్రా?" అంటే, "అలా! యిలా తుడుస్తుంటే అలాపోసేస్తుంటారు బాబూ," అంటాడు. అసలు వాడు పనిచేస్తేకదూ ? ఆ సందుచివర్ని సరిపితో సరసమాడుతూ కూర్చుంటాడు. వాడు చెడింది కాక దాని పని చెడగొడతున్నాడు .... చెత్తా! చెత్తా! వీడి సంగతి .... (అంటూ ఎంత ధూకుడుగా వచ్చాడో అంత ధూకుడుగానూ నిష్క్రమిస్తాడు.)

సుబ్బా : (ఎల్లయ్య పోతున్న వైపు చూస్తూ) బాగుంది అఘోరం! ఎంత మునిసిపల్లి ఉద్యోగం అయితే మాత్రం యింట్లోకి చొరబడి పోతాడా?

గణ : నాకు ఆఫీసుకు టైము అయిపో వస్తోంది.

సుబ్బా : వంటాలేదు. వల్లకాడూ లేదు. (చంద్రశేఖరం కేసి చురచుర చూస్తూ) యింకా ఎంతసేపు యీ కంచి గరుడ సేవ !!

చంద్ర : అంత తొందరగావుంటే మీరే వెళ్ళి హౌస్ఓనర్‌ను పట్టుకోండి. (సూట్ కేస్ తెరిచి ఎకౌంట్ పుస్తకాలు చూస్తూ వుంటాడు.)

సుబ్బా : యిల్లు చూస్తే బందెల దొడ్డిలాగా వుంది. దీనికి మళ్ళా పోటీ ఒకటి. ఒరే గణపతీ! నాకు తెలియక అడుగుతాను. యిలాంటి దిక్కుమాలిన గొడవల్లో యీ పట్నంలో యెంత కాలం ఉద్యోగం చేస్తావురా?

గణ : యిక్కడ ఉండే సౌకర్యాలు యిక్కడా వుంటాయి.

చంద్ర : (సుబ్బారాయుడుతో) మీరు యిదివర కెప్పుడైనా పట్నం వచ్చారా?

సుబ్బా : యేదో కోర్టు పనుల మీద వచ్చినా ఆరాత్రికి రాత్రే యిల్లు చేరుకునే వాణ్ణి. యీ సారే యిక్కడ చిక్కుకున్నాను.

చంద్ర : మీ పేరు ?

గణ : మా మావయ్య పేరు సుబ్బారాయుడు గారు.

చంద్ర : మీవూరి జనాభా ఎంతండీ?

సుబ్బా : సుమారు ఎనిమిది వేలుంటుంది. — (సంశయిస్తూ) అసలు యీ భోగట్టా యెందుకు? నువ్వు పన్నులు వేసే ఉద్యోగస్థుడవు కావుకదా?

చంద్ర : అబ్బే! యేం లేదు లెండి. మీ వూళ్ళో మాకంపెనీకి ఒక బ్రాంచి ఓపెన్ చేద్దామని ఆలోచిస్తున్నాను.

సుబ్బా : యేం కంపెనీ అయ్యోయ్? కొంపతీసి జూదాల కంపెనీ కాదుకదా?

చంద్ర : నో! నో! లాటరీ కంపెనీ.

(యీ సమయంలో కుడివైపు సన్యాసిరావు కనిపిస్తాడు. వయస్సు 18 సంవత్సరాలు. అమెరికన్ జాకెట్, ఫుల్‌పాంట్ వేశాడు. తల ముందుకు పెట్టి నెమ్మదిగా యీల వేస్తాడు.)

సుబ్బా : (అమాంతంగా లేచి ముందుకు వెళ్ళి) ఎవడవోయ్ నువ్వు? యీలేస్తున్నావ్, యిదేం సంసారి కొంప అనుకున్నావా? భోగం కొంప అనుకున్నావా?

సన్యాసిరావు : (పాంట్ జేబులో చేతులు పెట్టుకొని ఠీవిగా ముందుకు వస్తూ) మీరెవరు? యిక్కడ ఎందుకు వున్నారు?

సుబ్బా : (ఆత్రుతగా) అరెరే! లోపలికొచ్చేస్తావేమిటి? నీకేం కావాలో అక్కడే నిలబడి చెప్పు. (సందేహిస్తూ) నువ్వు పగటి వేషగాడివి కాదుకదా?

సన్యా: నాపేరు! (ఎవరినో వెతుకుతున్నట్టు ముందుకు చూస్తూ) మిస్. రాధా కుమారి కనిపించదేం?

సుబ్బా: (కోపంతో) ఆవేశం యేమిటి? ఆ చూపులు రేమిటి? నీకేమైనా కామినీ భూతం పట్టుకుందా? అసలు సంగతేమి టంట?

సన్యా : (ఠీవిగా) నా పేరు సన్యాసిరావు.

సుబ్బా : నీ మొహంచూడగానే తెలిసిందా విషయం.

సన్యా : నేను అరడజను నాటకాలలో సైడ్ హీరో వేశాను. మూడు నాటకాల్లో హీరో వేశాను.

గణ : మీరెందుకు వచ్చారో చెప్పరేం?

సన్యా : చెప్పక పోవడానికి కారణం వుంది. న న్నెరుగనివాళ్ళు యీ పట్నంలో మొత్తంమీద యెవరూ వుండరు. ఎందుకంటారా? నేను రంగ స్థలం మీద, రోడ్డు మీదా ఒకే వేషంతో కనిపిస్తాను. — యిక నన్ను నేను మీకు అందరికీ పరిచయం చేసుకోవలసిన అవసరం యేముంది చెప్పండి?

సుబ్బా : అసలు నీ మొహం చూడవలసిన అవసరంకూడా మాకు లేదు. దయ చెయ్.

సన్యా : బహుశా మీరు రాధాకుమారిని బుక్ చెయ్యడానికి వచ్చి వుంటారు. (చంద్రశేఖరాన్నిసమీపించి) చూడండి సార్, నన్ను మరచిపోకండి. నన్నుకూడా హీరోగా బుక్ చెయ్యండి.

చంద్ర : నో! నో! ఎవర్నీ బుక్ చెయ్యడం లేదు.

సన్యా : (ప్రాధేయ పూర్వకంగా) ఆవిడతో పాటు నన్నొక్కణ్ణీ మాత్రం బుక్ చెయ్యండి చాలు!

చంద్ర : (కోపంతో) అరే! అది కాదయ్యా అంటే!

సన్యా : (ఆత్రుతగా) మీరు అనుమానిస్తున్నట్టున్నారు. కావాలంటే పదిమందిని సాక్ష్యం తీసుకొస్తాను. — రాధాకుమారి ప్రక్కని నేను హీరో వేసితీరవలసిందే! అన్నట్టు మరచి పోయాను. సాక్ష్యం కోసం యెక్కడికో వెళ్ళడం యెందుకు? (జేబులోంచి కాగితాలు తీసి) వచ్చే ఆదివారంనాడు టౌన్‌హాల్లో మేం నాటకంవేస్తున్నాము. యిదిగో! నా పోర్షన్! నాలుగు వాక్యాలు చదివి వినిపిస్తాను.

సుబ్బా : (కోపంతో) ఆ చాటభారతం వినడానికి యిక్కడ తీరికేవడి కేడ్చిందోయ్. వెళ్ళు వెళ్ళు!

సన్యా : (తన ధోరణిలో) ఆగండిసార్! ఒక్కరెండు నిముషాలు— నాయిక నాయకుణ్ణి తిరస్కరిస్తుంది. ఆ సమయంలో నాయకుడి హృదయావేదన ఘట్టం యిది. (చదువుతూ) 'రాధా! యిది నా హృదయబాధ. మన అగాధ ప్రణయ గాధకు యింతలోనే విఘాతమా! నీ వాలు చూపులలో నా మనసు ఉయ్యాలలూగే మధుర క్షణాలను మరువ గలనా? లోలాక్షీ! నీ బుద్ధి యింత చపలమా.'

సుబ్బా : (అమాంతంగా లేచి కోపంతో) నీకేం బుద్ధీ, జ్ఞానం లేదూ ? మా కొంపలో అలాంటి పరువుతక్కువ కూత లేమిటంట!

సన్యా : (తెల్లబోయి) ఇది నాటకం పోర్షనండి.

సుబ్బా : నీ శ్రాద్ధం ఏమీ కాదూ?యిక్క డెవళ్ళూ ఆడవాళ్ళు లేకపోబట్టి సరిపోయింది.—పిదప కాలం ! పిదప బుద్ధులూను ! వేళెడు లేవు. నీకు ప్రేయసి ? అడ్డమైన సినిమాలు చూసి వెకిలివేషాలు వేస్తూ తిరగడం. అయ్యయ్యో! ఈపట్టణాల్లో పద్నాలుగేళ్ళ కుర్రాడికికూడా ప్రేమకలాపమే ! ఆడవాళ్ళు రోడ్లమీద నడవడానికి

భయం. వాళ్ళ వెనకాల పడి 'కుయ్యో మొఱ్ఱో' అని ఒకటే గోల! వీళ్ల కిదేం పోయేకాలమో తెలియదు. ఇలాంటి వెధవ వేషాలు వేసేవాళ్లని బడిలోనే కోదండం వేయించేవారు మా చిన్నతనంలో. పంతుళ్లను చూస్తే పిల్లలు గజగజా ఒణికిపోయేవారు.. ఇప్పుడో? చదువుకొనే కుర్రవాణ్ని చూస్తే పాఠం చెప్పే గురువుగారికే భయం! ఏ పెద్దమనిషయినా నా దగ్గరికి వచ్చి "ఏమయ్యా! సుబ్బారాయుడూ! నువ్వేం చెబుతావ్?" అని నన్నడిగితే—యీ కుర్రవాళ్ల నందర్నీ పట్టుకొని స్కూళ్ల లోను, కాలేజీల్లోను పూర్తిగా లాంగదీసెయ్యమని చెబుతాను. మొక్కయి వంగనిదీ మాను అయి వంగుతుందా అంట!!

గణ : ఊరుకో మావయ్యా! అతని గొడవ మన కెందుకు?

సుబ్బా : మన కొంపలో దూరి అడ్డమైన కూతలూ కూస్తుంటే మనకి కాకపోతే యింకెవరికిరా?

చంద్ర : (కోపంతో) యిది మీ కొంపా?

సుబ్బా : లేకపోతే మీ కొంపా?

సన్యా : (అమాంతంగా మధ్యకు వెళ్లి) అయ్యా! ఇది మీ ఇద్దరి కొంపా కాదు. మిస్. రాధాకుమారి తీసుకున్న రెంటెడ్ హౌస్!

సుబ్బా : అదికాదురా సన్యాసి నాయనా! ఈ యిల్లు నిన్న ఖాళీ అయింది. మేం డబ్బు ధరావత్తు కట్టి అద్దెకు తీసుకున్నాం.

సన్యా : (ఆశ్చర్యా న్నభినయిస్తూ) ఇల్లు ఖాళీ అయిందా? అయితే రాధాకుమారి ఏమయింది? ఎక్కడికి పోయింది? ఏ వీధిలో ఉంది?

సుబ్బా : ఆ భోగట్టా అంతా నీకు కావాలంటే పది రూపాయలు యిచ్చి దండోరా వేయించు. దయచెయ్.

సన్యా : (చంద్రశేఖరంతో) మరి మీ రెవరు సార్! ఇక్కడి కెందుకు వచ్చినట్లు?

చంద్ర : నా పేరు చంద్రశేఖరం. లాటరీ కంపెనీ ప్రొప్రయిటర్ని నేను.

సన్యా : ఈ మధ్య పేపర్లలో ప్రకటించారు—ఆ కంపెనీయేనా?

చంద్ర : అవును.

సన్యా : ఏజెంట్లు కావాలని కూడా మీరు ప్రకటన చేశారు.

చంద్ర : నిజమే.

సన్యా : మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉందండి. నేను ఏజెంటు ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టానండి.

చంద్ర : (చేతిలోని కాగితాలు చూస్తూ) మీ పేరు?

సన్యా : నా పేరు స్కూలు రికార్డులలో సన్యాసిరావు. రంగస్థలంమీద కుమార్!

సుబ్బా : ఏం కాలంరా దేవుడా! తల్లిదండ్రులు పెట్టుకున్న పేరును కూడా ఈ కుర్రకుంకలు మార్చి పారేస్తున్నారు. పెద్దవాళ్లమీద రవంత గౌరవంకూడా లేదు కదా!

చంద్ర : (ఒక కాగితం పైకి తీసి) ఇదేనా మీ అప్లికేషన్?

సన్యా : (ఉత్సాహంతో) ఇదే సార్! ఇదే సార్!

చంద్ర : (లేచి) చూడు. మిస్టర్ కుమార్!

సుబ్బా : (మధ్యలో కలగజేసుకొని) కుమ్మార్ ఏమిటండీ? దిక్కుమాలిన కుమ్మార్!

గణ : ఊరుకో మావయ్యా! నీ కెందుకు?

చంద్ర : (సన్యాసిరావుతో) ఏజెంట్ ఉద్యోగానికి ముఖ్యంగా కావలసిన లక్షణాలు కేవలం మూడే!

సన్యా : ఏమిటండీ అవి?

చంద్ర : ఒకటి పర్సనాల్టీ!

సన్యా : (కాలర్ సవరించుకొని) నా పర్సనాల్టీ సరిపోతుందా సార్?

చంద్ర : రెండు. మంచి వాగ్ధోరణి.

సన్యా : (సంతోషంతో) ఫరవాలేదండి. నాది కంచు కంఠం!

చంద్ర : మూడు—ఎంతటి మొండి ఘటాన్నయినా మాటలతో బోల్తా కొట్టించే నేర్పు.

సన్యా : (ఆనందంతో) హాయ్ హాయ్! అన్నీ చక్కగా అతికినట్టు సరిపోయాయ్. మరి ఉద్యోగంలో ఎప్పుడు చేరమంటారు సార్?

చంద్ర : తక్షణం!

సన్యా : జీతం ఎంతండి?

చంద్ర : ఈ ఉద్యోగానికి అసలు జీతమే లేదు.

సన్యా : (నిరుత్సాహంతో) జీతంలేని ఉద్యోగం ఏమిటండోయ్?

సుబ్బా : (కలగజేసుకొని) రోడ్లమీద తిరగడానికి జీతం ఎందుకోయ్ సన్యాసి కుమారా?

చంద్ర : నిరుత్సాహపడకు మిస్టర్ కుమార్! జీతం అంటూ వేరే లేదు. నువ్వు ఊళ్లో తిరిగి లాటరీ టిక్కెట్లు అమ్మాలి. నీకు నూటికి ఇరవై అయిదు రూపాయలు కమీషన్ యిస్తాను. అంటే వంద రూపాయల టిక్కెట్లు నువ్వు అమ్మితే—డెబ్భయి అయిదు రూపాయలు నేను తీసుకొని—ఇరవై అయిదు రూపాయలు నీకు యిస్తాను.

సన్యా : (సంతోషంతో) హాయ్ హాయ్! యికనేం? నాకు ఉద్యోగం సద్యోగం లేదని రాధాకుమారి అస్తమానూ వేళాకోళం చేస్తూ ఉంటుంది. ఆమె ఎక్కడ దిగిందో వెతికి పట్టుకొని—యీ శుభవార్త ఆమెకు చెప్పి—యిప్పుడే వస్తాను.

(సన్యాసిరావు కుడివైపు తొందరగా నిష్క్రమిస్తాడు. సరసయ్య కుడివైపు నుంచి వస్తాడు.)

సర : (వస్తూనే చంద్రశేఖరంతో) ఎవరండోయ్. ఆ కుర్రోడు అలాగ పారిపోతున్నాడు? ఏమీ ఎత్తుకుపోవడంలేదు కదా?

చంద్ర : లేదు. అతను నా ఏజెంట్! మీరు సరిగా సమయానికి వచ్చారు. రండి. మీరు యీ గదిని నాకా అద్దెకిచ్చింది? వీరికా?

సర : అమ్మమ్మ! ఎంతమాట! మీకే యిచ్చాను.

చంద్ర : అయితే (సుబ్బారాయుణ్ణి, గణపతినీ చూపిస్తూ) వీ రిద్దర్నీ వెంటనే బయటకు పంపండి.

సుబ్బా : మమ్మల్ని బయటకు పంపేవాళ్ళెవరోయ్ ! (నర సయ్యను చూపిస్తూ) అసలు యితగా డెవరు ?

నర : (సుబ్బారాయుడుతో) ఏమండోయ్ ! లోపలికొచ్చి కూర్చు న్నారు. ఇదేం ధర్మసత్రం అనుకున్నారేంటి ?

సుబ్బా : లేదురా నాయనా ! సొమ్ము ధరావత్తు కట్టి మరీ అద్దెకు పుచ్చుకున్నాం.

నర : (ఆశ్చర్యంతో) అద్దెకు పుచ్చుకున్నారా? (కోపంతో) మీకు అద్దెకిచ్చిన గాడిదకొడు కెవడు?

సింహాచలం : (కుడి వైపునుంచి ఒక్కదూకు దూకి ప్రవేశించి) ఒరేయ్, నేన్రా అద్దెకిచ్చి వోణ్ణి,

(సింహాచలం వెనుక సుబ్బారాయుడు, గణపతి నిలబడ తారు. నరసయ్య వెనుక చంద్రశేఖరం నిలబడతాడు.)

నర : నీ కేం హక్కుందిరా యివ్వడానికి?

సింహా : నీకున్న హక్కేమిట్రా?

నర : (కోపంతో) ఒరేయ్! సింహాచలం!

సింహా : (కోపంతో) ఒరేయ్, నరసయ్యా!

నర : నువ్వు నాకు తమ్ముడవు కాదురా.

సింహా : నువ్వు నాకు అన్నవు కాదురా.

నర : నావంతుగది అద్దెకివ్వడానికి నువ్వెవడవురా?

సింహా : యిది నీ వంతు అని యెక్కడ రాసి వుందిరా?

నర : పెద్ద మనుషు లేం చెప్పార్రా?

సింహా : పెద్దమని షెవడ్రా?

నర : ఒరేయ్! నీ పొగరణిచేస్తాను.

సింహా : నీ వీపు చిదగ్గొట్టేస్తాను.

(యిద్దరూ మీదమీదకి వెడుతుంటారు. సింహాచలాన్ని సుబ్బారాయుడు, నరసయ్యను చంద్రశేఖరం పట్టుకొని ఆపుచేస్తూ వుంటారు. ఆపుచేస్తున్న కొద్దీ అన్న దమ్ములు యిద్దరూ రెచ్చిపోతూ వుంటారు.)

నర : ఒరేయ్, నిన్ను కప్పెట్టేస్తాన్రా!

సింహా : ఒరేయ్ నిన్ను పాతేస్తాన్రా.

సుబ్బా : వూరుకోండ్రా నాయనా! వూరుకోండి.

సింహా : వది లేయండి నన్ను. వాణ్ణి పట్టుకొని పాతేస్తాను.

నర : ఒరేయ్, యీ దెబ్బతో నువ్వో నేనో తేలిపోవాల్రా! (మీదికి వెడతాడు.)

చంద్ర: (నరసయ్యను ఆపుచేస్తూ) కొట్టుకు చావడమెందుకయ్యా కోర్టులో కేసువేస్తే అదే తేలుతుంది.

నర : దీనిమీద హక్కులన్నీ నావేనండీ. వీడు జబర్దస్తీ చేస్తున్నాడు.

సింహా : సొమ్మంతా నువ్వు తినేసి నాకు చిప్ప చేతికిద్దామను కుంటున్నావట్రా? ఖబడ్దార్!

నర : అమ్మమ్మ చచ్చిపోయినప్పుడు కాసులపేరు నువ్వెత్తుకు పోలేదట్రా?

సింహా : యెత్తుకుపోడానికి నేను దొంగ ననుకున్నావంట్రా ? అమ్మమ్మ కాసుల పేరు నా చేతిలో పెట్టిమరీ చచ్చి పోయిందిరా.

నర : అందులో సగం వాటా యిక్కడ పెట్టి మాట్లాడరా ముందు.

సింహా : చిల్లి గవ్వకూడా నేను పెట్టనురా.

సుబ్బా : (మధ్యకువచ్చి) ఆగండిరా! నాయనా ఆగండి! దిక్కు మాలిన కలికాలం. యింత అన్యాయ మట్రా! అన్న దమ్ములమధ్య ఎంత ప్రేమ ఉండాలిరా! మన పురాణాలు యితిహాసాలు యేం చెబుతున్నాయిరా! ఉదాహరణకు అంతా శ్రీరామచంద్రుణ్ణే చూడండ్రా! తన రాజ్యంఅంతా తమ్ముడికి యిచ్చేసి అడవికి పోలేదట్రా! లక్ష్మణుడు రాజ్యభోగాలన్నీ విడిచిపెట్టి అన్నగారి వెనకాలే అడవికి పోలేదట్రా! ఆరోజులు, ఆ అనురాగాలూ, ఆ త్యాగాలు పోయాయి. అంగుళం స్థలం కోసం అన్నదమ్ములు నరుక్కుచచ్చే రోజులు వచ్చాయి.

నర : పెద్దోళ్ళమీద యీ ఎదవకి కొంచెం గౌరవం లేదంటే నమ్మండి.

సింహా: యిల్లంతా దోచేస్తావుంటే చూస్తూవూరుకుంటానట్రా ?

నర : నా హద్దులోకి వచ్చి కేక లేయడానికి నువ్వెవడవురా ?

సింహా : యిది నాగదిరా! నా హక్కురా!

సుబ్బా : ఒరేయ్ గణపతీ! యిలాంటి పేచీ కొంపలో దింపే వేమిట్రా నాయనా!

సింహా : మీకేం భయం లేదు. ఆగండి.

సుబ్బా : ఒరే బాబూ! మా ధరావత్తు సొమ్మేదో మా మొహాన్ని పారెయ్యి. పోయి మరో కొంప చూసు కుంటాము.

సింహా : యీ యెదవకి జడిసి మనం ఖాళీ చేస్తామంటండీ, మీరు కదలకుండా యిక్కడే కూర్చోండి. యిల్లు మీకు అప్ప చెప్పే పూచీ నాది.

నర : వూరికునీ కొద్దీ చెలరేగి పోతున్నాడు యెదవ! యీ దెబ్బతో రోగం కుదిర్చేస్తాను.

సింహా : ఒరేయ్! యివేళతో నువ్వో నేనో తేలిపోవాలి.

సుబ్బా : వూరుకోండ్రా నాయనా! రాజీపడండిరా!

నర : కాసుల పేరు తాలూకు డబ్బు అక్కడ పెట్టమనండి. అప్పుడు రాజీ బేరం మాట్లాడతాను.

సింహా : కాసుల పేరు పూపెత్తితే కా లిరగ్గొడతాను.

నర : పెద్దమనుషులు నాకు వంతు యిమ్మని చెప్పలేదంట్రా ?

సింహా : యెవళ్రా చెప్పినోళ్ళు?

నర : పదరా! రుజువు యిప్పిస్తాను.

సింహా : తిరిగి పోతాననుకున్నా వేంట్రా? పద!

నర : పదరా పద!

సింహా : నడరావదు! అటోయిటో తేలగొట్టేస్తాను.

నర : వస్తాదువు బయలు దేరేవని!

సింహా : అన్నిటికీ సిద్ధంరా మనం!

నర : అదే చూద్దాం పదు.

సింహా : మందగ్గరంట్రా వీయేషాలు?

(కేకలు వేసుకుంటూ నరసయ్య, సింహాచలం కుడివైపు నిష్క్రమిస్తారు.)

సుబ్బా : వీళ్ళపేచీ తేలే వరకూ మనం యిక్కడ ఆఘోరించవలసిందే నట్రా గణపతీ?

గణ : యీ వూళ్ళో యిళ్ళుదొరకడం కష్టం. కాస్త ఆగి చూడ్డమే మంచిది.

సుబ్బా : (చంద్రశేఖరం కేసి చూస్తూ) యీ కంపెనీ ఆయన లేకపోతే మనకింత పేచీ వుండేది కాదు.

చంద్ర : (కోపంతో) వ్వాటార్ యు టాకింగ్?

సుబ్బా : టాకీలు టూకీలు నాకేం తెలియవు. అదేదో తెలుగులో చెప్పు.

గణ : మీ కంపెనీకి యింత చిన్న గది యేం సరిపోతుందండీ?

చంద్ర : చాలనిమాట నిజమే. యెక్కడా పెద్ద యిల్లు దొరక లేదు. అందుకని టెంపరరీగా యిక్కడ దిగాను. అద్దెమైనా తక్కువా అంటే అదీకాదు. నెలకు ముప్ఫయి రూపాయలు!

సుబ్బా : నరసయ్య దేవాంతకుడిలా వున్నాడే. యితగాడివేషం, వాలకం చూసి అద్దె పెంచేశాడన్న మాట! నాకు చూడగా చూడగా చిన్నవాడే పెద్దమనిషిలా కనిపిస్తున్నాడు. అట్టే యిబ్బంది లేకుండా యిరవై రూపాయలకే ఒప్పుకున్నాడు.

చంద్ర : తన యిల్లు అయితే కాదూ? వచ్చిందే చాలని ఐదు రూపాయలకు కూడా ఒప్పు కుంటాడు.

సుబ్బా : యీ యిల్లు సింహాచలానిది కాదంఃరావా?

చంద్ర : మీరు సింహాచలాని దంటారా?

గణ : మనం యెందుకు తగూపడడం? వాళ్ళిద్దరూ యేదో ఒకటి తేల్చుకొచ్చేవరకూ ఆగుదాం.

సుబ్బా : యెంత సేపని కూర్చుంటాంరా? యిదెక్కడి గొడవ వచ్చిపడిందిరా!

(కుడివైపు నుంచి ముందుగా ఎల్లయ్య కేకలు వేసుకుంటూ ప్రవేశిస్తాడు.)

ఎల్లయ్య : (వెనక్కి చూస్తూ) వీధంతా చెత్త. అసలు నువ్వు తుడిస్తే కదట్రా! కమీషనర్ గారు చూశా రంటే నాకు జర్మానా వెయ్యరట్రా? నిన్ను కనికరిస్తే నా ఉద్యోగానికి ముప్పు వస్తుంది. దీన్తో పైనలా చేసేస్తాను. (అప్పడు అమాతంగా ప్రవేశిస్తాడు. నీలంరంగు చొక్కా,పొట్టి పట్లాం వేసుకున్నాడు. చేతిలో చిన్న చీపురు వుంది. దీర్ఘాలు తీసి మాట్లాడతాడు. — అప్పడిని చూడగానే సుబ్బారాయుడు అమాంతంగా లేచి నిలబడతాడు.)

అప్పడు : (వస్తూనే) అఁ అఁ! యేవచ్చినోడు సెప్పినాడంట? నేను పొద్దు పొడక ముందే యీ సందుకు రానేదా? రోడ్డంతా తుడిసి పోనేదా?

సుబ్బా : (అమాంతంగా యెదురు వెళ్ళి) ఒరే ఒరే! నీ యిల్లు బంగారంగాను! లోపలికి వచ్చేనున్నావేమిట్రా?

అప్ప : అఁ అఁ ! అయన్నీ మా సిన్నప్ప ట్రోజులు! ఇప్పుడు పెద్దపెద్ద మారాజులే మా యిళ్ళమట్టూ తిరుగుతున్నారు. మా అన్నయ్య కూతురు అప్పల్నరిసినేదూ? అది కూలుపైను పదివింది. దానికూడా బోల్డు మంది పిల్లలు మా యింటి కొచ్చి యింట్లో కూకుంటారు కూడాను. (చేతులు తిప్పుతూ) నే నొస్తే అంటొచ్చి పడిపోనాదా నీకు?

సుబ్బా : అయ్యయ్యో! యిదెక్కడి ఖర్మ వచ్చి పడిందిరా గణపతీ!

ఎల్ల : ఒరేయ్ ! అప్పుడూ! నీ పని నువ్వు బుద్ధిగా చేసుకుంటే పేచీ లెందుకొస్తాయ్ చెప్పరా?

అప్ప : (చేతులు తిప్పుతూ) నా పని నేను సేసుకోక పోతే నువ్వొచ్చి సేస్తున్నావా? అఁ అఁ! నా నాయనే!

ఎల్ల : నీ మీద యిప్పటికి ఎన్ని కంప్లయింట్లు వచ్చినియ్! ఎక్కడి కక్కడ నేను సర్దేస్తూంటే నీకు పొగరుగా వుందా? యిది ఆఖరు కంప్లయింట్! యీ దెబ్బతో నీ ఉద్యోగం తీయించేస్తాను.

అప్ప : అబ్బోసి! యిలాంటి బెదరింపులు సేంగా సూసినాం నా నౌకరి తీయించెయ్యడం పైపైనుందా? నాకు నోటీసియ్య, సూస్తాను. నిన్నేకాదు. మీ మునిసిపల్లోళ్ళ నందర్నీ మూడు సెరువుల్నీళ్ళు తాగించెయ్యనా?

ఎల్ల : నువ్వు చేసే దేమిట్రా? మర్యాదగా మాట్లాడు.

అప్ప : నేను సేసే దేంటో, నా సంగతేంటో అప్పుడే మరిసి పోనావా నాయనా? నాకు నోటీసిచ్చి సూడు.

ఎల్ల : మధ్యాహ్నం తిరక్కుండా నీకు కాగితం వస్తాదిచూడు.

అప్ప : కాయితం రానియ్య. యీ అప్పడంటే యేంటో నీకు తెలుస్తాది. మావోళ్ళందరితోమా సమ్మె కట్టించేస్తాను. ఎక్కడి మురికి అక్కడే! ఎక్కడి గలీజు అక్కడే! మూడు రోజుల్లోవూరంతా గగ్గోలెట్టించేస్తాను. (మీసం మెలేస్తూ) నీతో సెత్త బండి తోలించక పోతే నాపేరు అప్పడే కాదు! అఁ అఁ! సూస్కో మజాకా!

ఎల్ల : (కోపంతో) ఒరేయ్! యేమిట్రా అంటున్నావ్?

అప్ప : అఁ అఁ! జడిసి పోతాననుకున్నావ్! యేది రుజు యిప్పించవేం? నేన్రానేదని నీతో సెప్పినో డెవడంట?

ఎల్ల : ఒరేయ్, మర్యాదగా మాట్లాడరా! అంతపొగరు కూడదురా, వీరంతా మర్యాదస్తులు, గొప్పవారూ ప్రా!

అప్ప : (హేళనగా) గొప్పంట! గొప్పే! యెవల్ల గొప్ప ఆళ్ళది. యెక్కేను మూ ద్రోజులా మేం గొప్ప, ఆ యెనుక మీరు గొప్ప.

సుబ్బా : ఒరేయ్ నాయనా! ఆ పేచీ యేదో రోడ్డుమీదికెళ్ళి తెల్చు కోండ్రా!

అప్ప : నేను యీ యీది తుళ్ళేదని సెప్పినోడెవడో తేల్చు కోవాలి.

ఎల్ల : మర్యాదగా మాట్లాడరా అంటే వినపడదూ?(సుబ్బారాయుణ్ణి చూపిస్తూ) వీరిని చూడు. యీవూరా? యీ వాడా? నీ మీద అబద్ధం చెప్పేవరకూ వీరికేం కావాలి?

అప్ప : (సుబ్బారాయుణ్ణి ఎగా దిగా చూస్తూ) అఁ అఁ! నువ్వా నా నాయనా! సెప్పినావ్?(మీదిమీదికి వెడుతూ) సీకటితోనే నే నీ యీదికి రానేదా? బరబరా యీదంతా గరుకు సీపురుతో తుళ్ళేదా? సందంతా అద్దంలా

తుడిచి పోయివాను గందా? అబద్దం చెప్పడానికి నీ కేంవచ్చి పడి పోనాది?

సుబ్బా : ఒరే ! ఒరే ! కొంచెం దూరంగా వుండి మాట్లాడరా! నువ్వు తుడవలేదని చెప్పలేదురా నాయనా! నేను చూడలేదని చెప్పాను. — అసలు యీ వీధిలోకి నేను రావడమే ఎనిమిది గంటల తరువాత వచ్చాను.

అప్ప : (మెచ్చుకుంటూ) నా మారాజా తండ్రే ! అలాగా చెప్పు. నీ మొగం సూడగానే అనుకున్నాను. (ఎల్లయ్యతో) అబద్దాలాడు తన్నావ్? అఁ అఁ! నాతోనా నీపరేసకాలు? సూస్కో! మజాకా!

ఎల్ల : వీధి వీధంతా చెబుతున్నారురా నువ్వు తుడవలేదని.

అప్ప : సడు! ఒక్క రుజా యిప్పించు. నేను సెప్పు తెగ్గొయించు కుంటాను.

ఎల్ల : నువ్వు పే .. ద్ద పోతురాజులా మీద పడిపోతుంటే ఎవరు సాక్ష్యం యిస్తారు!

అప్ప : అఁ అఁ! నేను పోతురాజులాగున్నానా? నువ్వు కోతి రాజులాగా నేవూ?

ఎల్ల : ఒరేయ్! అయిపోయిందనుకోకురా! కాగితం మీద రాసిచ్చిన కంప్లయింట్లు వున్నాయిరా నాదగ్గర!

అప్ప : ఆ రాసిచ్చినోళ్ళు ఎవరో సెప్పు.

ఎల్ల : చెప్పే సమయం వచ్చినప్పుడు చెబ్తాను. రా! నాతో !

అప్ప : అఁ అఁ ! పెళ్ళికూతుర్లాగా నీ యెనకాలా రావాలా నేనూ? నా డూటీ నాది. నీ డూటీ నీది.

ఎల్ల : (గద్దించి) వస్తావా? రావా?

సుబ్బా : (కంగ చేసుకొని) పోరా బాబూ! వేగం పో!

అప్ప : (సుబ్బరాయుడుకేసి తిరిగి) వూరుకోవయ్యా, మద్దిని నీ కెందుకు?

ఎల్ల : (కోపంతో) ఒరే! ఒరే! నేను కనికరిస్తుంటే నీకు పొగరుగా వుంది కదూ? వుండువుండు. చెబ్తాను.

అప్ప : అఁ అఁ! పొగరేంటి! యెవడి సగురోసం ఆడిది. నువ్వు మీసం పైకెత్తితే నేను దించేసుకుంటా సమకోమోకు! నీకు పెత్తనం వుంటే పెత్తనంలా సూస్కో.

ఎల్ల : వెంకయ్యగారి సందెందుకు తుడ్చేదూ?

అప్ప : అఁ అఁ! నీ కేమన్నా మతిపోనాదా యేమన్నానా? తుడిసినానయ్యా అంటుంటే!

ఎల్ల : నువ్వు తుడలేదురా. ఎందుకురా అలా బూకరించేస్తావ్! రా నాతో! చూపిస్తాను.

అప్ప : ఒక్క మనిసితో రుజా యిప్పించు. నే నొప్పుకుంటాను.

ఎల్ల : తుడిచింది తుడవంది కళ్ళతో చూస్తే తెలియదట్రా?

అప్ప : అఁ అఁ! నల్ల కోవయ్యా! అదే అంటావు. యిలాగ యీది వూడుస్తూ వుంటానా — అటేవునుంచి సెత్తపోసేస్తారు. దానికి నువ్వు అడ్డం పడతావా? నే నడ్డం పడతానా?

ఎల్ల : అవతల వీధిలోకిరా నాతో! అక్కడ నీ సంగతి తేల్చేస్తాను.

అప్ప : అబ్బోసి, ... నువ్వూ తేల్చేవోడవు! నువ్వునన్ను తేలిస్తే—నిన్ను నేను ముంచవా? అఁ అఁ! నా నాయనే!

ఎల్ల : నీకు ఒకసారి చురక పడాలి.

అప్ప : మువ్వొక మాటు సెత్త బండెక్కాలి.

ఎల్ల : సరే! తొందరపడకు.

అప్ప : (చేతులు తిప్పుతూ) అఁ అఁ! నీ అందం సూసి నేను తొందర పడుతున్నాను ! !

(ముందు ఎల్లయ్య, వెనుక అప్పడు కేకలు వేసుకుంటూ కుడివైపు వెళ్ళిపోతారు.)

సుబ్బా : హరి! వీళ్ళ మొగమీద్దా! యిక్కడటరా వీళ్ళ కుప్పి గంతులు! మనగాడవతో మనం గింజాకు ఛస్తుంటే— వీళ్ళకొట్లాట మధ్యని—తోలుబొమ్మలాటలో కేతిగాడు బంగారక్కలాగ!

గణ : యీ సింహాచలం యింకా యెప్పటికి దిగుతాడో! నాకు పిచ్చెక్కి పోతోంది.

సుబ్బా : యీ పట్నాలలో ప్రతి చిన్న విషయానికీ పేచీయే! పుండే కొంపదగ్గర పేచీ, కారెక్కడానికీ పేచీ, సినిమాహాలు దగ్గర తోపుడూ తొడితొక్కిడీ—చిన్న జరిగినకథ నాకు మరీ ఆశ్చర్యంగా వుంది. జనం పూరికే మూకాలమ్మ తీర్థానికి పోతున్నట్టు 'హలో' మని పోతున్నారు. 'ఎందుకు చెప్మా వీళ్ళిలా పోతున్నారు!' అని నేను వాళ్ళ వెనకాం వెళ్ళాను. — యింతాచేస్తే ఎవరో సినిమాలో వేషంవేసే ఆవిడ వచ్చిందట. ఆ మాట వినగానే నేను అక్కడే ఆగిపోయాను. ఆవిడ్ని చూడ్డానికి అంతకంతకూ జనం మరీ ఎగబడి పోతున్నారు.— హాలు ముందు జనం పేరుకు పోయారు. — యింతలో వాళ్ళ కే మొచ్చిందో యేమో 'హలో' అంటే 'హలో' మని కేకలు. — దభీదభా మని గుద్దులు—పోలీసుల లాఠీ కర్రల టకటకలు—హో! రణగోల !—ఆ దరిమిలాని పాతిక మందిని ఆస్పత్రికి తీసుకు పోయారు. యాభై మందిని పోలీసు స్టేషనుకు తీసుకుపోయారు.

చంద్ర : (తేలిగ్గా) అష్మరాల్, అది చిన్న విషయం, అలాంటివి రోజుకు యెన్నో జరుగుతూ వుంటాయి.

సుబ్బా : అరే! మనుష్యులు అలా—ఉత్త పుణ్యానికి కొట్టుకు ఛస్తుంటే మీకు చీమకుట్టినట్టయినా వుండదట్రా!

(కుడివైపునుంచి తొందరగా సన్యాసిరావు ప్రవేశిస్తాడు)

సన్యా : (పట్టరాని ఉత్సాహంతో) దొరికిపోయింది. దొరికిపోయింది.

సుబ్బా : (సన్యాసిరావు కేసి చూస్తూ) యేమిట్రా నాయనా! నీ కేం వంట్లో సుస్తీగాలేదు గదా?

సన్యా : సుస్తీకాదు. సంతోషం జాస్తీగా వుంది.

సుబ్బా : అయితే అదేదో జబ్బే!

సన్యా : (తన ధోరణిలో) మిస్. రాధాకుమారి డ్రస్‌దొరికిపోయింది. (చంద్రశేఖరంతో) చూడండి సార్, నేను రాత్రులు రిహార్సల్సుకు పోవాలి. రేపటినుంచి నేను పగలు ఏడెంటుము, రాత్రి యాక్టర్ను!

చంద్ర : (కాగితాల్లోంచి తలపైకెత్తి) నువ్వేం చేసినా మాకేం అభ్యంతరం లేదు. మాకు కావలసింది లివివెస్.

సన్యా : (చేతులువూపుతూ) వెరీగ్లాడ్, వెరీగ్లాడ్!

సుబ్బా : మామూలుగా మాట్లాడదా నాయనా, మాట్లాడే ప్పుడు అలాంటి విరావు చేష్టలు చేస్తే— పెద్దయ్యాక కూడా అదే అలవాటై పోతుంది.

సన్యా : అయ్యో! సుబ్బా రాయుడు గారూ! రంగస్థలంమీద అంగికాభినయం చాలా ముఖ్యం. అనగా చేతులూ కాళ్ళూ మొదలైన అంగాలు, కళ్ళు వేళ్ళు మొదలైన ఉపాంగాలు అన్నిటినీ ఉపయోగించుకోవాలి. లేక పోతే దూరాన్న వున్న ప్రేక్షకుడికి కథ అర్థంకాదు.

చంద్ర : మిస్టర్ కుమార్‌కి నీకు వాగ్ధోరణియితే చక్కగానే వుంది. కాని నువ్వు వృథాగా టైం వేస్టు చెయ్యకూడదు. నీ మాటల నైపుణ్యాన్ని వ్యాపారానికి ఉపయోగించాలి.

సన్యా : ఓయస్! తప్పకుండా వుపయోగిస్తాము. ఏమేం చెయ్యమంటారో వెంటనే చెప్పండి.

చంద్ర : మొదట మనం ఒక మోటారు సైకిలు, ఒక రేడియో పెట్టి—లాటరీ వేస్తాం. టిక్కెట్టు రెండు రూపాయలు మాత్రమే.

సన్యా : బ్యూటిఫుల్, యికనేం, రెండు టిక్కెట్ల పుస్తకాలు యిలా యివ్వండి. వూరంతా తిరిగి అమ్మేస్తాము.

చంద్ర : (టిక్కెట్ల పుస్తకాలు యిచ్చి) యివి అయిపోయిన తరువాత—ఒక పెద్ద రెండు అంతస్థుల మేడను లాటరీ వేస్తాం.

సన్యా : (సంతోషంతో) వండర్‌ఫుల్, వండర్‌ఫుల్,

సుబ్బా : (కోపంతో) వుండడానికి ఒక కొంపలేదు. పెద్ద మేడను లాటరీ వేస్తాడట! ఎవరి మేడను లాటరీ వేస్తావు బాబూ?

చంద్ర : నాన్నెన్నూ! మా బిజినెస్ వ్యవహారాల్లో మీ రెందుకు కలగ చేసుకుంటారు?

గణ : మనకెందుకు కూర్చో మావయ్యా!

సన్యా : (ఉత్సాహంతో) ఊఁ! — మేడను లాటరీ వేసిన తర్వాత?

సుబ్బా : (వెంటనే అందుకొని) ఆ తర్వాత యింకేముంది? మనిషినే లాటరీ వేసేస్తాడు!

చంద్ర : (కోపంతో) మమ్మల్ని మాట్లాడకోనివ్వరా?

గణ : ప్రతివిషయంలో మీరెందుకు కలుగజేసుకుంటావు మావయ్యా! చంపేస్తున్నావ్!

సుబ్బా : మనకళ్ళముందు ఘోరం జరుగుతూవుంటే చూస్తూ యెలా వూరుకుంటావ్ చెప్పరా! (సన్యాసిరావుతో) బాబూ! సన్యాసి కుమారా! నువ్వింకా చిన్నవాడివిరా! యిటువంటి లాటరీల్లోకి జూదాల్లోకి వెళ్ళకురా. యింటికే మంచిది కాదు. వంటికే మంచిది కాదు.

(కుడి వైపు నుంచి సింహాచలం, వరదయ్య కేకలు వేసుకుంటూ ప్రవేశిస్తారు.)

వర : నలుగురూ నీ నోట్లో గడ్డి పెట్టారా!

సింహా : పదిమంది నిన్ను 'ఛీ ఛీ' అనలేదట్రా?

వర : కాముడేరు యిక్కడపెట్టు.

సింహా : నా గతి నాకు అప్పగించు.

వర : (మీదికి వెళ్ళి) నీ తలకాయ తీసేస్తాను.

సింహా : (మీదికెళ్ళి) నీగుండెలు తీసేస్తాను.

సుబ్బా : (యిద్దరి మధ్యకూ వెళ్ళి) ఆగండ్రా నాయనా! ఆగండి! యిక్కడ మీరు కొట్టుకున్నారంటే మేం కోర్టుల చుట్టూ తిరగలేక ఛావాలి.

గణ : సింహాచలం గారూ! మా అడ్వాన్సు మాకు పారెయ్యండి పోతాం.

సింహా : బాబ్బాబు! నా పరువు నిలబెట్టండి. మీ రెక్కడికీ యెళ్ళొద్దు. కూచోండి. గతి మీకు అప్పగించే పూచీ నాది. (గణపతిని బలవంతంగా బల్లమీద కూర్చో బెడతాడు.)

వర : యీ వస్తాదు అప్పగిస్తాడంట!

సింహా : (మీసంమెలేస్తూ) ఆడదానిమీద కేకలెయ్యడం అనుకున్నావంట్రా?

వర : ఆడది గుండా అని తిట్టిన తిట్లల్లా పడమంటావట్రా?

సింహా : నీది తప్పుంటుప్పుడు ఎవడికోసం పడతావురా?

చంద్ర : (బిగ్గరగా) యేమండోయ్ వరదయ్యగారూ! మేం మా బిజినెస్ మానుకోమా? యీ పేచీలే మాను కోమా? మా డబ్బు మాకు వాపస్ చెయ్యండి పోతాం.

వర : (అమాంతంగా చంద్రశేఖరాన్ని సమీపించి) బాబ్బాబు, నా పరువు తీసెయ్యకండి. మీ రెళ్ళిపోతే అంతా చెడి పోతాది. కూర్చోండి. (చంద్రశేఖరాన్ని బలవంతంగా బెంచి మీద కూర్చోబెడతాడు)

సింహా : అరువుసొమ్ము తినే యెదవకి పరువొకటి!

వర : (కోపంతో బిగ్గరగా) ఒరేయ్ సింహాచలం!

సింహా : (అంతకంటే బిగ్గరగా) ఒరేయ్ వరదయ్యా!

వర : నా సొమ్ముతిని నా కొంపకు యెసరు పెడతావురా! మాస్కా! (చెయ్యి పైకెత్తుతాడు.)

సింహా : (కోపంతో) నువ్వురా—దగా చేస్తే—మాడు ముద్దైపోతావ్! (చెయ్యి పైకెత్తుతాడు. సుబ్బా రాయుడు గణపతి—సింహాచలాన్ని పట్టుకుంటారు. చంద్రశేఖరం, సన్యాసిరావు—వరదయ్యను పట్టు కుంటారు.)

వర : (విడిపించు కుంటూ) వదిలెయ్యండి. యెదవని. అంతు తేల్చేస్తాను.

సింహా : (విడి పించు కుంటూ) యిడిచి పెట్టండి. యెదవని యెగరేసి నరికేస్తాను.

వర : ఒరేయ్! యీ యేళతో నువ్వు ఆఖరువురా!

సింహా : ఒరేయ్! ఒక్క పోటుకు పెద్దల్లో కలుసు కుంటావురా! (సరిగా యీ సమయంలో ఖాకీ యూనిఫారం లో ఒక ఇన్స్పెక్టర్ ప్రవేశిస్తాడు.)

ఇన్స్పెక్టర్ : (బిగ్గరగా) ఆగండి. (అందరూ ఎక్కడివా ళ్ళక్కడే భయంతో నిలబడి పోయారు.) ఓహో! అంతా ఒక చోటే వున్నారే! మాకు కొంచెం శ్రమ తప్పించారు. మీ రంతా ఒకచోటే దొరికినందుకు

నాకు చాలా సంతోషంగా వుంది. దయచేసి మీ రంతా ఒక వరసలో కూర్చోండి.

చంద్ర : (తీవిగా ఇనస్పెక్టర్ని సమీపించి) చూడండి ఇనస్పెక్టర్ గారూ! నాకు అర్జంటు పనివుంది. (సన్యాసిరావును చూపిస్తూ) యితను నా స్నేహితుడు. నా తరఫున యితను మీకు కావలసిన ఇన్ఫర్మేషన్ అంతా యిస్తాడు. నేను ఐదు నిముషాల్లో తిరిగివస్తాను. (వెళ్ళి పోబోతాడు.)

ఇన :—(సీరియస్‌గా) మిస్టర్, యు డోంట్ గో. మీరు వెళ్ళిపోతే వ్యవహారం పెరిగిపోతుంది జాగ్రత్త.

చంద్ర :—(తొందరపడుతూ) మరో రకంగా అనుకోవద్దు ఇనస్పెక్టర్‌గారూ! తరవాత నేను మిమ్మల్ని తీరిగ్గా కలుసుకుని మాట్లాడతాను. ఎక్స్యూజమి! (సన్యాసిరావుతో) మిస్టర్ కుమార్ నేను వచ్చేవరకూ యిక్కడేవుండు. (లెదర్ సూట్‌కేసు తీసుకొని కుడివైపు చరచరావెళ్ళిపోతాడు)

వర :—(బిగ్గరగా చంద్రశేఖరంతో) యేమండోయ్ బాబూ! యెళ్ళకండి. మీ రెళ్ళిపోతే నాకు సాక్ష్యం యెవరూ దొరకరు. బాబ్బాబు, రండి, రండి (అంటూ అతని వెనుక వెళ్ళిపోతాడు)

సింహ :—(బిగ్గరగ) ఒరేయ్ వరిసిగా! నేరం అంతా నా మీద తోసేసి నువ్వు పోదామనుకుంటున్నావ్రా! రా రా! నా దగ్గరా నీ యేషం? ఇనస్పెక్టరుగారూ! ఆ యెదవని యిప్పుడే యీడ్చుకొస్తానుండండి. (తొందరగా కుడివైపు వెళ్ళిపోతాడు.)

ఇన :—(ఆశ్చర్యంతో) అరె! అరె! సగానికి సగం చూస్తుండగా తరిగిపోయారు. (పుస్తకం, కలం తీసి) ఆఁ! యిక మీ ముగ్గురూ వరసగా పేర్లు చెప్పండి.

సుబ్బా :—(కోపంతో) చాలు చల్లేవయ్యా! వూరుకో! పారిపోయినవాళ్ళనందర్నీ వదిలేసి-కూర్చున్న మా ముగ్గురి పేనా పేర్లడుగుతావు?

ఇన :—పారిపోయిన వాళ్ళపేర్లు మీకు తెలుసా?

సన్యా :—(ఉత్సాహంతో) ఆఁ! నాకు తెలుసండి.

సుబ్బా :—ఊరుకోరా సన్యాసి కుమారా! మధ్యని మనకెందుకు? అసలువాళ్ళు బాగానే వుంటారు. మధ్యని మనం కోర్టుల చుట్టూ తిరగాలి—చివరకు అనుమానించినంతా జరిగిందిరా దేవుడా! (ఇనస్పెక్టర్‌తో) అయ్యా! మీరు పోలీసువారు కదా! అసలు ముద్దాయిలు పోతూవుంటే మీరు గుడ్లప్పగించి చూస్తూ వూరుకోవడం యేమన్నా బాగుందీ? మీరూ మీరూ లాలూచీఅయి మధ్యని మాలాంటి అమాయకుల్ని యిరికిస్తారా? యిదేమన్నా మీకు ధర్మంగా వుందా అంట?

ఇన :—మీరు పొరబాటు పడుతున్నారు. నేను పోలీసు ఇనస్పెక్టర్ని కాను. శానిటరీ ఇనస్పెక్టర్ని. ఈ వీధిలో మశూచికం యిప్పుడిప్పుడే ఎక్కువవుతోంది. మీరు మీ మీ పేర్లు చెప్పండి. టీకాలు వేయించుకోండి. (కుడివైపు చూస్తూ గట్టిగా) ఎల్లయ్యా!

ఎల్ల :—(నేపథ్యంలో బిగ్గరగా) వస్తున్నాను సార్, (ప్రవేశించి వెనక్కి తిరిగి చూస్తూ) ఒరేయ్, నీకు వళ్ళు వంగడం లేదురా, చురుగ్గా నడు.

అప్పడు :—(ఒక పెట్టె చేత్తో పట్టుకొనివస్తూ) ఆఁ! ఆఁ! నీకు వళ్ళు వంగిపోనాది. నాకు వంగనేదు.

ఎల్ల :—కళ్ళప్పగించి నాకేసి అలా చూస్తావేరా?

అప్ప :—(చేతులు తిప్పుతూ) ఆఁ! ఆఁ! నీ యిందంసూసి—నీ కోర మీసం సూసీ—నీ వంకర మూతి సూసీ—మూర్ఛపోతన్నాను.

ఇన :—(కోపంతో) ముందు పని కానియ్.

ఎల్ల :— పెట్టె కిందికి దించరా.

అప్ప :—(పెట్టె క్రిందపెట్టి) అద్దమాని సాకిరీ నాసేత సేయించుకోడమూను—నీ నెత్తిమీద కాయితం పెడతాను. గుడ్డనుడతాను అనడమూను!—ఆఁ! ఆఁ! అదే పోనాదని వూరుకుంటున్నాను. (ఎల్లయ్య స్పిరిట్ లాంప్ వెలిగిస్తాడు. ఎల్లయ్యకు ఎదురుగా అప్పడు కూర్చుంటాడు. ఇనస్పెక్టర్ పుస్తకం చూస్తూవుంటాడు)

సుబ్బా :—(తేరుకొని) యిదెక్కడి గొడవరా గణపతీ! చిన్నపిల్లల లా మనం టీకాలు వేయించుకోవాల్రా!

గణ :—తప్పదు మావఁయ్యా!

సుబ్బా :—ఎందుకు తప్పదురా? పోయినవాళ్ళ నందర్నీ యేం చెయ్యగలిగారురా?

ఇన :—గాభరా పడకండి. రెండు నిముషాలు కళ్ళు మూసుకుంటే అంతా అయిపోతుంది.

సన్యా :—సార్! ఇనస్పెక్టర్‌గారూ! టీకాలు వేయించుకోడానికి నాకేమీ అభ్యంతరంలేదు. నాకు అందరికంటే ముందు వెయ్యండి. కాని మీరు నాకో చిన్న ఉపకారం చెయ్యాలి.

ఇన :—ఏమిటది?

సన్యా :—చూడండి. మీరు ఎక్కువగా వూరిమీద తిరుగుతూ వుంటారు. మీకు చాలా అవసరమైన సంగతి చెబుతున్నాను. మేం మోటారు సైకిల్ లాటరీ వేస్తున్నాం. మోటారు సైకిల్ ఉపయోగం మీకు యెక్కువ! కనక దయచేసి—ఒక లాటరీ టికెట్టు కొని—బోణీ చెయ్యమని ప్రార్థన.

ఇన :—తరవాత చూద్దాం. ముందు పని కానివ్వండి.

ఎల్ల :—యిక తీసెయ్యరా.

అప్ప :—(లాంప్‌మీద వున్న పెట్టె తీసి) హబ్బా! పెయ్యి కాల్చేసినావు.

ఎల్ల :—ప్రొద్దుటినుంచీ నీతోనే సరిపోయిందిరా!

సుబ్బా :—ఓరి దేవుడా! యిదెక్కడి గొడవ వచ్చిపడిపోయిందిరా! అద్దెకు పుచ్చుకున్న యింటికా పేచీ వచ్చింది. సుఖంగా కూర్చోవచ్చుకదా అని యిక్కడికివస్తే చుట్టూ కాకిగోల!

చుట్టంచూపుగా పట్నంవస్తే చురక వేస్తున్నారు వీళ్ళు!—సగం పరువు సంతలో పోతే వున్న పరువు పూళ్లో పోయిందట—అలాగ్గావుంది నా పని! ఒరేయ్ గణపతీ, నీ పట్నానికో నమస్కారం. నన్ను రైలుబండి యెక్కించెయ్‌రా నాయనా! పద!

(సుబ్బారాయుడు పరువుచుట్ట చేత్తో పట్టుకొని వెళ్ళబోతూ వుంటాడు)

ఇన :—ఏమండోయ్, ఆగాలి.మీరు.

సుబ్బా :—బాబ్బాబు! మా పూళ్లో వేయించుకుంటాన్లే!

ఇన :—ఎల్లయ్యా! ఆయన్ని యిలా పట్టుకు తీసుకురా.

అప్ప :—(ఎల్లయ్యకేసి చూస్తూ, హేళనగా) ఆ! ఆ! యితగాడికి నేనే లోకువ!!

ఎల్ల :—(అప్పుడు కేసి కోపంగా చూస్తూ) యేరా, వళ్ళు పొగరుగా వుందేమిటి?

అప్ప :—యెవడి వగురోషం ఆడిది! ఆ! ఆ! నామీదా కళ్లెఱ్ఱ జేస్తావ్?—మూస్కో! మజాకా!

(యీలోగా సుబ్బారాయుడు కుడివైపు వెళ్ళిపోతాడు)

గణ :—(పెట్టె చేత్తో పట్టుకొని) మావయ్యా! ఫరవాలేదులే. యేమీ అవ్వదు. రా! (ఇనస్పెక్టర్‌తో) యిప్పుడే మా మావయ్యని తీసుకువస్తానండి. (వెళ్ళబోతాడు.)

ఎల్ల :—ఆ పెట్టె యిక్కడ పెట్టి వెళ్ళండి.

గణ :—ఓహో! బాగుందయ్యోయ్! పెట్టె ఎవరైనా ఎత్తుకుపోతే? (ముందుకు చూస్తూ) ఆగు, ఆగు మావయ్యా. (తొందరగా కుడివైపు నిష్క్రమిస్తాడు)

ఇన :—(నిస్పృహతో) చివరకు అందరూ జారిపోయారు. (ఎల్లయ్యనీ, అప్పడినీ చూస్తూ) మీ యిద్దరినీ ఎక్కడికి తీసుకు వెళ్ళినా సర్వనాశనం.

సన్యా :—(వెంటనే) నేను వున్నాను సార్ (జేబులోంచి టిక్కెట్ల పుస్తకం తీసి) మీరు ఒక టిక్కెట్ కొనండి. చాలు. ఒకే ఒక టికెట్! మీ అదృష్టం బాగుంటే మీరు రేపటి నుంచే మోటార్ సైకిల్‌మీద తిరగొచ్చు.

ఎల్ల :—మేం వీధిలో మనుష్యుల నందర్నీ పోగు చేసుకొని తీసుకువస్తాం సార్ (అప్పడుతో) రారా!

ఇన :—ఊ! వేగం తీసుకురండి.

అప్ప :—ఆ! ఆ! నేను లేకపోతే ఒక్కసెణం బతకలేడు. మీసం తిప్పి రోసం సూపిస్తాడు. ఆ! ఆ! వాదగ్గరా యేసకాలు! (ముందు ఎల్లయ్య, వెనక అప్పడు వెళ్ళిపోతారు. ఇనస్పెక్టర్ పుస్తకం చూస్తూ వుంటాడు)

సన్యా :—సార్! టిక్కెట్!

ఇన :—ఉష్! కూర్చో!

(సన్యాసిరావు ఇనస్పెక్టర్ని విడిచిపెట్టకుండా అక్కడే కూర్చుంటాడు. ఇనస్పెక్టర్ పుస్తకంలోకి చూస్తూవుంటాడు. — తెర.)

నిర్ఘృణ శిశిరము

శ్రీ టి. బి. యం. అయ్యవారు

ప్రతిశిశిరమ్ము - త్వచ్చరణవారిజకాంచనకింకిణీచ్ఛటా
వితత రవమ్ములన్ వినెడు వేడుక - వీనులు వేగిరింప - ఆ
యత హిమవారి పాత గళితాఖిల పత్రరసాలశాఖ - ఊ
ర్జిత పిక గీతికారటము చెందెడి రీతి తపించి పోయెదన్.

అనునిమేష మాయనపాదహతిని - ప్రకృతి
త్రొక్కి-వేయ నిర్దయమతి క్రుంగిపోయి
నేను ఓడ్చిన యట్టి కన్నీళ్ళు - శైశి
రాంబరము కూడ - ఓడ్చ లే దనుట నిజము.

నాయెద నంతటన్ విలయ నాట్యము లూరక చేయు శార్వర
చ్ఛాయల నీ నిశీథములు సాగవు పెన్ శిలలై - మరేడకున్-
కోయని యార్చుచున్ - క్రకచఘోరరదాననవన్ని కాటులై
పాయక సాధ్వసాంబునిధి భంగముల న్నను ముంచివేయుచున్.

చలిత సర్వాశలగుచు - కశాహతుల భ
యంకరమ్ముగ హిమవృష్టు లడలఁ జేయు-
వెలికి మాత్ర మీ పృథివి కంపించె - భగ్న
హృదయుడను - నా యవస్థ వచింపలేను.

సాంద్ర నీహారయవనిక జారి - ఈ మ
హీస్థలి కవల - వేరు లే దేమి యన్న
భ్రాంతి పెంచెను - గాఢనిరాశ తుహిన
దృషదచలపాత మగుచు మాయింపనన్ను.

నేనను పదార్థమే హిమానీకటువయి
ఈ ముహూర్తమ్మునందు బాధించు బిట్టు
తరుణభానురోచిర్మనోహరము-నీ ప
దద్వయమ్మునుఁగని దాని తలపఁ జనను.

మహత్తర పరివర్తనము

శ్రీ జాన్ స్ట్రాచీ

[1961 సం॥ వసంతఋతువులో సింగపూరు వయోజనవిద్యాసంఘంవారి అధ్వర్యాన ఏర్పాటయిన సభలో శ్రీ జాన్ స్ట్రాచీ GREAT AWAKENING అనేపేరున అయిదు ఉపన్యాసాలిచ్చారు. వాటిని ఎన్‌కౌంటరు పత్రికవారు చిన్న పుస్తకంగా ప్రకటించారు. ఆ పత్రిక సౌజన్యంతో భారతి ఆ ఉపన్యాసాలను వరుసగా ప్రకటించగలదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. సం. భా.]

ఈ ఉపన్యాసములు నిర్దేశించిన విషయపరిశీలనలో పడక ముందే ఉపన్యాసకుని గురించి (నన్ను గురించి) కొంత తెలిసికొనే హక్కు మీకు ఉన్నదనుకుంటాను. ఉపన్యాసకుని దృక్పథం మీకు తెలిసి ఉంటేకాని, అతని ఉపన్యాసాన్ని గురించి వెంటనే ఒక నిర్ణీత అభిప్రాయానికి రావటం కష్టం. రాజకీయ ఉపన్యాసకళావిధానమునుగురించి, పూర్తిగా ఎరిగిన సర్ విన్‌స్టన్ చర్చిల్ అభిప్రాయం కూడా ఇదే. ఆయన ఇలా అంటూ ఉంటారు. కామన్సుసభ్యులు (Members of House Of Commons) కనుక ఎవరి ఉపన్యాసాన్ని గురించి అయినా ఒక నిర్ణీత అభిప్రాయానికి రావాలంటే తమకు తామే మూడు ప్రశ్నలు వేసుకుంటారు. అందులో మొదటి ప్రశ్న "మాట్లాడిన దెవరు?". రెండవది "మాట్లాడిన తీరు ఎలా ఉన్నది?". "ఏమి చెప్పారు?" అనేది మూడవది.

నా రాజకీయజీవితము చాలా సుదీర్ఘమైనది. వివిధ గతులలో నడచినది. కాని ఒకటి మాత్రం అప్పటికీ, ఇప్పటికీ చెదరకుండా స్థిరంగా నిలిచి ఉన్నది.

అది ఇది : నాకు వ్యక్తత వచ్చినప్పటినుంచీ ఇప్పటి వరకు సోషలిస్టుగా ఉన్నాను. సోషలిస్టు అని అంటే మీ భావం ఏమిటని మీరు అడుగుతారు. నేటి పరిస్థితులలో (1960 సం.) ముఖ్యంగా డెమొక్రాటిక్ సోషలిజము అంటే ఏమిటి? వెనుకబడిన, అభివృద్ధి చెందని దేశాల విషయంలో దీని వైఖరి, ప్రయోజనం ఏమిటి? నేను 1920 సం. లో రాజకీయాలలో ప్రవేశించాను. అప్పటికి, ఇప్పటికి మారుతూ వచ్చిన ప్రపంచాన్ని గురించి ఈ సోషలిజం ఏమంటుంది? డెమొక్రాటిక్ సోషలిజమ్‌కు కమ్యూనిజానికి గల సంబంధమేమిటి? ఈ రెంటికీ గల భేదమేమిటి? పార్లమెంటరీప్రభుత్వ విధానమున్నదేనా? ఒకవేళ అదే కనుక అయినట్లయితే అది అంత ప్రధానంగా పాటించ వలసినవిషయమా? అని మీరు అడుగుతారు. ఈ ప్రశ్నలకు సమాధానములను మొత్తము ఈ ఉపన్యాసములలో క్రమ క్రమంగా ఇస్తాను. అయితే ముందుగా 1960 నాటి ప్రపంచానికి, 1930 నాటి ప్రపంచానికి నాకు కనబడే భేదాన్ని గురించి చెప్పనివ్వండి. అధ్యక్షా! 1930 లో నేను వ్రాసిన The Coming Struggle For Power అనే గ్రంథాన్ని గురించి మీరు సభికులకు జ్ఞాపకంచేశారు. ఆ పదిసంవత్సరాలు నేను మార్క్స్ పంథాను ఆమోదించి, ఆ రీత్యా ప్రపంచ సమస్యలను పరిశీలించాలన్న సోషలిస్టునని ఆ పుస్తకాన్ని చదివినవారు గ్రహించి ఉంటారు. అంతేకాకుండా కమ్యూనిస్టులతో ఏకీభవించి వారితో చేరి బ్రిటనులో United Popular Fronts అనే సంస్థలలో పని చేశాను. అయితే ఇప్పుడు నాకు ఆ దృక్పథంలేదని 1950 సం. లో, 1960 సం. లో నేను వ్రాసిన పుస్తకాలను చదివిన వారికి ద్యోతకమవుతుంది. నేను ఇప్పుడు మార్క్సిస్టును అవునో కాదో నాకు తెలియదు. మార్క్స్ మత వ్యతిరేకులు, నేను మార్క్స్ మతస్థుడ నంటారు. మార్క్సీయులు మాత్రము, ప్రతికూలుడనంటారు. కాబట్టి నే నెవరినని చెప్పను? ఒకటిమట్టుకు నిజము. 1960 సం. లో, 1930 సం. లో చూచిన దృష్టితో చూడటములేదు. వేరు విధంగా చూస్తున్నాను. నేడు నా దృష్టి మారినదేమో? ఎవరు చెప్పగలరు! కనుక నిష్పాక్షికంగా చూస్తే నేటి ప్రపంచం పాతికేళ్ళనాటి ప్రపంచానికి ఎంతో భిన్నంగా కనబడుతున్నదని మాత్రమే చెప్పగలను.

1930 సం. ప్రపంచంకంటె 1960 సం. ప్రపంచం సంపూర్ణంగా భిన్నమైనదిగా కన్పించటానికి మూడు కారణాలున్నాయి. ఆ మూడిటిని వివరిస్తాను.

సామ్రాజ్యము, దాని నిర్మాణవిధాన మనేవి శీఘ్రగతిని అంతరించిపోవటం. 1930 సం. లో వలస దేశాలు ప్రాముఖ్యంగా కనుబడేవి. అవి మన మెవరము అనుకోనంత త్వరగా వలస ప్రతిపత్తిపోయి, స్వతంత్ర దేశాలుగా పరివర్తనం చెందటం. ఇది మొదటి కారణము.

తమ సామ్రాజ్యాలు అంతరించినా బ్రిటను, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికా దేశాలు 1930 సం॥ నాటికన్నా ఎక్కువ సంపదతో తులతూగుతున్నాయి. ఇది రెండవ కారణము. ఇది చాలా విచిత్రమైన విషయం. ఎందువల్లనంటే, రెండు కక్షలవారు (సామ్రాజ్యవాదులు, మార్క్సీయులు) ఇది ఫలానివిధంగా జరుగుతున్నదని చెప్పగా, దానికి పూర్తిగా వ్యతిరేకమైనదిగా జరిగినది. బ్రిటనుకు కనుక సామ్రాజ్యం పోతే, బ్రిటీషు ప్రజలు తిండిలేక, మాడిపోతారని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెట్టే గోల వినబడుతూ ఉండేది. ఆ విషయం వారు నిజంగా మనస్ఫూర్తిగా నమ్మే ఈ ఆక్రందనం చేసేవారు. బ్రిటనుకు సామ్రాజ్యం పోయింది. కాని బ్రిటిష్ ప్రజల కడుపులు మాడక పోగా 1930 సం. లో వారికి సామ్రాజ్యం ఉన్నప్పటికంటె మంచి స్థితిలో ఉన్నారు.

ఈ సందర్భంలో సామ్రాజ్యవాదుల జోస్యము మాత్రమే తప్పలేదు. సామ్రాజ్యాలు లేనిదే బాగా పెరిగిన Capitalism లు కూలిపోతాయని లెనిన్ చేసిన సిద్ధాంతాన్ని పురస్కరించుకొని కమ్యూనిస్టులు వాదించినంత గట్టిగా మరెవరూ వాదించలేదు. కాని చరిత్ర మరొక విధంగా నడిచింది. వారిద్దరిని మోసం చేసింది. లెనిన్ ప్రసక్తి తెచ్చాను కాబట్టి ఆయన చెప్పిన గొప్ప సూక్తి ఒకటి జ్ఞాపకము వచ్చినది. చరిత్ర మనం అనుకున్న దానికంటె ఎక్కువ టక్కరిది అని ఆయన అన్నారు. అయితే ఈ సందర్భంలో చరిత్ర లెనిన్ కన్న కూడా టక్కరి అని తేలినది. ఇలా అని నేను ఆయనను వెక్కిరిస్తున్నానని అనుకోవద్దని మనవి. వాస్తవానికి చరిత్ర ఏ గతిని అనుసరిస్తుందో ముందుగా ఎవ్వరూ చెప్పలేరు. సామ్రాజ్యం పోయినా, 1960 సం. లో బ్రిటను ఆర్థిక సంపద సామ్రాజ్యం ఉన్నప్పటికంటే ఎక్కువగా ఉన్నది. పాతిక సంవత్సరముల నాటి కన్నా నేడు బ్రిటీషు ప్రజల జీవనప్రమాణము ఎక్కువగా ఉన్నది. ఈ పరిణామము డెమక్రాటిక్ సోషలిస్టుల వైఖరిలో గొప్ప మార్పును తీసుకొనివచ్చినది. 1930 సం. లో ఉచితమనిపించినవీ, బోధించినవీ, ఇప్పుడు హాస్యాస్పదంగా కనబడుతున్నవి.

ఇహ నేటి ప్రపంచము వేరుగా కనుపడటానికిగల మూడవ కారణము చెబుతున్నాను. అది ఇతరుల అనేక మంది దృక్పథంలో మార్పు తీసికొనివచ్చినట్లే, వాటిలోనూ మార్పు తీసికొనివచ్చినది. కమ్యూనిస్టుసిద్ధాంతానికి ఈ దేశంలోనేగాక, మొత్తం పశ్చిమరాజ్యాలన్నిటిలోనూ వెనుకటి పలుకుబడి, వ్యాప్తి చాలావరకు పోయినదని చెప్పాలి. ఇది విరుద్ధము, విచిత్రము. కాని ఒక విధంగా కమ్యూనిజము భగ్నము కాలేదనే చెప్పాలి. పైగా అది రష్యావంటి పెద్ద దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందటానికి తోడ్పడింది. దీన్ని ఎవరూ కాదనలేరు. కాని కమ్యూనిజము సాధనముల స్వభావమే, పశ్చిమ రాజ్యాలలో దానిపైగల మోజును సన్నగిల చేసింది. ఇదేవిధంగా అభివృద్ధి చెందని దేశాలలో కూడా ఇదివరకే జరగకపోయియున్నట్లయితే, ఇప్పుడు సన్నగిలుతుంది. కమ్యూనిజము సాధించిన దాని స్వభావమే దానిలో ఇమిడిఉన్న ఉత్తేజనశక్తిని హరిస్తుంది.

నేను రష్యానే ఉదాహరణగా తీసికొంటాను.బహుశ మీరు మరో పెద్ద కమ్యూనిస్టు దేశమైన చైనాను గురించి అనుకుంటూ వుండవచ్చు. కాని నేను రష్యాను గురించి మాట్లాడుతాను. ఎందుకనంటే, ఆ దేశంలో, చైనాలోకంటే కమ్యూనిజము ఎక్కువ కాలంగా అమలులో ఉన్నది. అక్కడ కమ్యూనిజం 40 సం. ల పైగా అధికారంలో ఉన్నది. దాని ఫలితములు స్పష్టంగా కనుపడుతున్నవి. రష్యా గొప్పదేశమైనది. అందుకు సందేహములేదు. ఆర్థికరంగంలో గమనించదగినది సాధించినది. జాతీయ ఆర్థిక ఉత్పత్తి శక్తి అతివేగంగా పెరిగింది. అయితే అభివృద్ధి చెందుతున్న కొన్ని ఇతర దేశాలతో పోలిస్తే మాత్రము వారి ప్రత్యేక ఔన్నత్యము కనుపడకపోవచ్చును. అయినా శీఘ్రగతిని నిలదొక్కుకున్నదని చెప్పవచ్చును. సైన్సులోనూ, ఇంజనీరింగ్‌లోనూ, అంతరిక్షయానంలోనూ వారు సాధించినవి గొప్పవి. అందుకని రష్యాను అసాధారణ అభివృద్ధిని సాధిస్తున్న దేశముగా పేర్కొనక తప్పదు.

అయితే రష్యాకు కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయని మీకు తెలుసు. ఆ దేశపు పరిపాలనావిధానము ఆదికాలం నాటిది. దానిలో ప్రజాప్రభుత్వ యంత్రాంగము ఇంత వరకూలేదు. ఆ కారణంగా పశ్చిమ దేశాలలోని ప్రజలు రష్యాను గురించి ఇలా అంటారు: "అవును. రష్యా కూడా పారిశ్రామికంగా అభివృద్ధిచెంది, స్వజాతీయాభిమానంతోవున్న మరొక దేశం. అంతకన్నా దాని ప్రత్యేకత ఏమిటి?". తరువాత రష్యా తూర్పు యూరపుదేశాలను ఏ విధంగా చూస్తున్నదీ చెబుతారు. ఆ దేశాలను నేను ఏమని పిలవాలి! రష్యా ఉపగ్రహా లనాలి. రష్యా మీద ఆధారపడే దేశా లనాలి. నిజం చెప్పాలంటే రష్యా వలస దేశాలనాలి. నేనూ, నా భార్యా ఆ దేశాలకు చాలాసార్లు వెళ్లాము. అక్కడ చూచిన దానినిబట్టి పశ్చిమ రాజ్యాలు వెనుక తమ వలస

రాజ్యాలను చూచిన దాని కన్న న్యూనంగా చూడటంలేదనవచ్చు కాని అంతకన్న బాగా చూస్తున్నారని చెప్పటం కష్టం. కాబట్టి స్వప్రయోజనాన్ని మాత్రమే ఆశించి, వ్యవహరించే మరొక రాజ్యం గానే రష్యను కూడా చెప్పాలి. అలాంటి దేశాలకన్న కొన్ని విషయాలలో మంచిగా ఉండవచ్చు. చాలా విషయాలలో అలాకాదు. అని చెప్పాలి.

కమ్యూనిజము ప్రతిపాదించిన మహదాశయాలకు, ఆదర్శాలకు దీనికి సంబంధమేమిటి?. "అవి చాలా ఉన్నతమైన ఆశయాలు కాబట్టి మేము 1930 సం. లో కమ్యూనిస్టులతో కలిసి పని చేశాము. మానవుడు తోటి మానవుని స్వప్రయోజనం నిమిత్తం పీడించే స్థితికి స్వస్తి చెప్పాలన్న మహదాశయ సిద్ధికి ఎంత బాధనైనా భరించటమే కాకుండా, ఇతరులను ఎంత బాధనైనా పెట్టవచ్చునని కూడా ఉద్బోధించాము. కాని, నలభయిసంవత్సరాలు గడచిన తరువాత కూడా, బోరిస్ పాస్టర్నెక్ మాటలలో చెప్పాలంటే, — భయానకమైన, భయంకరమైన 40 సం. లు రషియాలో జరిగినవి చూస్తే లభించింది, జాతీయాభిమానముగల మరో రాజ్యమును రూపొందిచటం తప్ప మరేమీ జరుగలేదు. ఇదంతా నే నీ మధ్య Encounter మాస పత్రికలో Strangled Cry అనే వ్యాసంలో వివరించాను. ఆ వ్యాసంలో ఇలా వ్రాశాను. The communist means have been terrible but their result- common place. కమ్యూనిస్టులు అవలంబించిన పద్ధతులు భయంకరములు. వారు సాధించినవి సామాన్యములు.

నా దృక్పధమును మీకు తెలియజేశాను. దానివల్ల నా ధోరణి, వైఖరి మీకు సుబోధకమవుతవి. అయితే ఒక విషయం. నేనేదో సత్యాన్ని నిరూపించాలన్న భావంలో ఉన్నట్టు మీరను కోవద్దు. నేను ఇప్పుడు నిర్వచించ ప్రయత్నించిన నా సిద్ధాంతాన్ని విస్తరించి చెప్పాలంటే ఈ ఉపన్యాసాలన్నీ దానికే సరిపోతాయి.

నే నివ్వబోతున్న ఈ అయిదు ఉపన్యాసములలో ఏవిధంగా విషయ విచారణ చేయబోయేదీ ముందు చెబుతాను. ప్రఖ్యాత పురుషుడు, సుప్రసిద్ధ సోషలిస్టు ఆచార్యుడు, నా దేశస్థుడు కీ. శే. జి. డి. హెచ్. కోలు ఈవిధంగా సూచించారు. "తన పని తెలిసిన ఉపన్యాసకుడు మూడు విషయాలను పాటించాలి. తాను చెప్పబోయేది ఏమిటో మొదట చెప్పాలి. తరువాత దానిని చెప్పి వేయాలి. ఆ తరువాత తాను చెప్పిందేమిటో చెప్పాలి."

కాబట్టి ఇప్పుడు నేను చెప్పబోయేది ఏమిటో చెబుతాను. మొదటి ఉపన్యాసములో సామ్రాజ్య వాదమంటే నేను అనుకొనేదేమిటో, అది ఎలావచ్చిందో చెబుతాను.

రెండవ ఉపన్యాసములో ఆధునిక సామ్రాజ్యవాదాన్ని గురించి (ఇది 1870 నుంచి వచ్చినదని చాలామంది అంటారు), దాని విషయమై లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలను గురించి మాట్లాడుతాను. సామ్రాజ్య విధానము, తద్వారా పరులకు జరిగే అన్యాయము, రాజ్యాధికారము దత్తము చేసిన తరువాత, వలస దేశములు రాజకీయ స్వాతంత్ర్యమును పొందిన తరువాత, సాగుతూ ఉండగలవా? అనే ముఖ్య విషయాన్ని గురించి తర్కిస్తాను.

మూడవ ఉపన్యాసంలో కొత్తగా వచ్చిన సామ్రాజ్యాలు అన్న ప్రశ్నను గురించి మాట్లాడుతాను. వీటిని గురించి చాలామంది భయాన్ని వెల్ళబోశారు. అంటే కొత్తగా, అమెరికా, సామ్రాజ్యం కాబోయే ప్రమాదం ఉన్నదా? కమ్యూనిస్టు సామ్రాజ్యంగాని, రషియా సామ్రాజ్యంగాని, చైనా సామ్రాజ్యం గాని ఏర్పడే ప్రమాదం ఉన్నదా, లేదా? అన్న ప్రశ్నను పరిశీలిస్తాను. అది వివాదగ్రస్తమైన ఉపన్యాసమవుతుంది!

నాల్గవ దానిలో కొత్తగా స్వతంత్రాలైన దేశాలు ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందగలవో అనే విషయంపై మాట్లాడుతాను. ఈ ఉపన్యాసానికి తాంబేలు, కుందేలు అని పేరు పెట్టా అనుకుంటున్నాను. ఫ్రెంచి భాషలో లా ఫాంటెయిన్ వ్రాసిన నీతి కథ ఒకటి ఈ పేరుతో ఉన్నదని మీకు తెలుసుననుకుంటాను. ఈ ఉపన్యాసంలో ప్రధానంగా ఇండియా, చైనాలు సాధించిన ఆర్థిక అభివృద్ధిని ఒకదానితో ఒకటిని పోలుస్తూ మాట్లాడుతాను. బ్రిటనులో అనుకున్నట్లే ఇక్కడ కూడా చాలామంది చైనా కుందేలనీ, ఇండియా తాబేలనీ, చైనా అతి శ్రీఘ్రగతిని ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని అనుకుంటున్నట్లు నాకు తోచినది. కాని ఫ్రెంచి కథలో పందెమును గెలిచినది తాంబేలు.

చివరిఉపన్యాసంలో ప్రజాప్రభుత్వాన్నిగురించి మాట్లాడుతాను. మాట్లాడేది దైనందినరాజకీయాలలో పాల్గొనే వైయక్తిక దృక్పధంతో, అంటే, ఆచరణ యోగ్యమూ, వాస్తవికమూ అయిన దృక్పధముతో, ఉపన్యసించ ప్రయత్నించి ప్రజా ప్రభుత్వ అవసర ప్రాముఖ్యతలనుగురించి చెబుతాను.

"మంచి" "చెడ్డ" ల్లో ఏ కథ?

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

రావణుడా? రామచంద్రుడా?

హిట్లరా? చర్చిలా?

ఎవరంటే మీ కిష్టం?

అనే ప్రశ్నకి మీరిచ్చే సమాధానంలో మీ స్వభావం కొంత వెల్లడవుతుందని నా నమ్మకం.

నాకు చిన్నప్పట్నుంచీ ఆ వెర్రి నమ్మకం ఒకటి అలా ఉండిపోయింది. ఆ విషయం గురించి ఈ తరవాత వివరంగా చెప్తాను.

ఇంకా అర్ధరాత్రి కాలేదు. పదకొండవుతుందేమో. అంతే. నేను నా మామూలు ఇరానీ హొటేల్లో కూర్చొని టీ తాగుతున్నాను. ప్రొప్రయిటరు కాష్‌కవుంటర్ దగ్గర కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు. పదిహేను పాలరాతి బల్లలమీద విద్యుద్దీపాల కాంతి ఇంకినంత ఇంకి, జారినంత జారి, చాలా మట్టుకు చెల్లా చెదరవుతోంది. మీదనున్న పంకా, చాలా తీరుబాటుగా అలవాటు తప్పిపోకుండా మాత్రం తిరుగుతోంది. రెండు రోజులు వరసగా వర్షం పడింది. ఆవేళ కూడా కొద్దిగా పడుతోంది. వీధిలోని చలిగాలి ఒక్కొక్కసారి గప్పున లోనికి రాబోయి లాభంలేక గుమ్మం దగ్గరే ఉండిపోతోంది. పాలూ బిస్కెట్లూ, రొట్టె వాసనలతో హొటేల్లో, వెచ్చగా, అంతా బావుంది.

అంతలో "ఆఁ! ఉన్నాడు గురుడు!" అంటూ రావూ, మూర్తి లోనికివచ్చి, దగ్గిరకొచ్చి చెరో కుర్చీ సరిగా సర్దుక్కూర్చొని,

"ఎప్పుడొచ్చేవు? ఏమిటి కథ? మధ్యాహ్నం కాలేజీ అంతా నీ కోసం గాలించేం. లైబ్రరీలోనూ లేవు. క్లాసులోనూ లేవు. ఎక్కడికి పోయేవు?" అని అడిగేరు.

"రూమ్‌లో ఉండిపోయేను"

"సరేకాని, నీ కోసమే ఒచ్చేం"

"ఏమిటి సంగతి?"

"ఇదీ సంగతి!"

అంటూ రెండు కాయితాల కట్టలు—పెద్ద దస్తరాలేం కావు—తెలుగున టైపు చేసినవి నా ఎదర పడేసేరు.

"అదా సంగతి!"

ఆ కాయితాలు చూసేక నాకంతా జ్ఞాపకం వచ్చింది.

"చెప్పుకోగలనని ఛాలెంజిచేసి మరీ చెప్పేవు. చెప్పుకో చూదాం" అన్నారు వాళ్లు.

"నేనేం ఛాలెంజీ చెయ్యలేదు. చెప్పుకోగలనని అన్నాను మాత్రం"

"అన్నావుకదు! మరైతే చెప్పుకో చూదాం"

వాళ్లిద్దరికీ కూడా టీ ఆర్డర్ చేసి, కాయితాలుతీసి, నెమ్మదిగా పేజీలు తిరగేసేను.

రామారావు, రామమూర్తి నాకు ఏడాదినుంచీ తెలుసు. ఇద్దరూ ఆనర్స్ పాసయి, రిసెర్చ్ చేస్తున్నారు. కిందటేడు నేను థర్డ్ ఆనర్స్‌లో జాయిన్ అయినప్పుడు వాళ్లు ఫైనల్ ఇయర్లో ఉన్నారు. నేను థర్డ్ ఫాంలో ఏడాదీ, మెట్రిక్కులో మూడేళ్లూ, ఇంటర్‌లో రెండేళ్లూ హైజాయించి లేచి, ఆనర్స్‌లోకి చాలా తీరుబాటుగా ప్రవేశించేను. నేను, క్లాసుకి చిన్నే అయినా, వయసులో వాళ్లకంటె కొంచెం పెద్దవాణ్నే.

వాళ్ళతో నాకు స్నేహం కలియడానికి కారణం వాళ్ళ, సాహిత్యపిపాసులవడం.

మారుపేరుతో కథలు రాస్తూ, ఆ ఫలానా మారుపేరు నాదేనని, చిరునవ్వు నవ్వుతూ, చెప్పుకొనే అలవాటుండేది నాకు. అదొక దురభ్యాసం. మారుపేరుతో రాయడం ఎందుకు? మళ్ళీ చెప్పుకోడం ఎందుకు? మూర్తీ, రావులతో స్నేహం కలిసినప్పుడు ఆ దురలవాటు నాకు పోయింది. సాహిత్య పిపాసుల్ని నేను పట్టుకు వదలను. వాళ్లు ఆ రకం మనుషులని తెలియగానే తిన్నగావెళ్ళి వాళ్ళకి ఎటాక్ ఇచ్చేసేను. నా చిరునవ్వు చూపి నా మారుపేరుచెప్పి, వాళ్ళు నన్నో చిన్న వెర్రి వెధవలా చూసి, ముఖ ముఖాలు చూసుకున్నారు. వాళ్లు కథలు రాయకపోయినా, నాకంటె హైక్లాసులో ఉన్నారన్నమాట. సంత పాలెంలో కుట్టించుకున్న సూటు వేసుకొని, ఢిల్లీలో డాబు చెయ్యబోయిన వాణ్ని అయింది నా పని. దాన్తో నాకు ఉడుకుమోత్తనంపుట్టుకొచ్చి, "ఏమిటి వాళ్ల సుపీరియారిటీ?" అన్చెప్పి, వాళ్లని బాగా స్టడీ చెయ్యడం మొదలుపెట్టేను. వాళ్ళమాటల్లో దొర్లించిన పుస్తకాలపేర్లు గుర్తుంచుకొని, రహస్యంగా ఆ పుస్తకా

లన్నీ చదవడం అలవాటు చేసుకున్నాను. నెమ్మదిగా వాళ్ళని బోల్తా కొట్టించాలనే దురుద్దేశం నాలో కలక్కపోలేదు. కలిగింది.

నిజం చెప్పవలసొస్తే, ఎందుకు కథలు రాయాలో, కథ లేవి రాయాలో, ఎలా రాయాలో, ఇటువంటి పేచీ సంగతు లున్నాయని నాకంతకుముందు తెలియనే తెలియదు. కథ రాయాలనుకోడం కూర్చోడం కాయితం కలం సిగరెట్టూ పట్టుకోడం, ఒక అందమైన ఆడపిల్లనీ, తగుమాత్రం బూతునీ, ఓ మోతాదు నాటు హాస్యాన్నీ కలిపి గుచ్చేడం! అంతే! దాన్తో హాయిగా కథ తయారైపోయేది. అది పత్రిక్కి పంపితే, వాళ్ళు వేసుకోపోతే, 'మెచ్చుకుంటే మించిపోయెను' అనేసుకొని గుప్‌చుప్‌గా వూరుకునేవాణ్ణి. పంపినట్టెవడికీ తెలీదు కదా! లేదూ, ఆ పత్రికవాళ్ళు వేసుకున్నారా!—వెంటనే కాలరెత్తేసి నేనూ నా మారుపేరూ నా చిరునవ్వూ అందరి దగ్గరా హాజరు! రోజూ అలా హాయిగా వెళ్ళకుండా మూర్తీ, రావులు ముళ్ళకంపల్లా నాకు అడ్డొచ్చేరు.

వాళ్ళు కొత్త ప్లాట్‌ఫాంమీంచి కొత్త మాటలు మాట్లాడ్డంచేత వాళ్ళ అంచనా నాకు మొదట్లో సరిగ్గా దొరికిందికాదు. ఎన్ని తొడుగులు తొడిగినా, అసలు సరుకు ఆట్టే మారదని నాకెందుకో చిన్న నమ్మకం ఉంది. సాహిత్యం గురించి వాళ్ళ భావాలు నాకు కొంచెంగా అర్థం కాగానే, దాన్తో కొంచెం కొంచెంగా వాళ్ళు కూడా అర్థం కాబొచ్చారు.

పైకి ఎలా కనిపించినప్పటికీ—డాబుగా దర్పంగా అణకువగా, అతి నెమ్మదిగా, అతి షోగ్గా, ఎంతో సింపుల్‌గా ఎలా కనిపించినప్పటికీ—వీళ్ళసలు లోలోపల ఎటువంటివాళ్ళు? మంచివాళ్లా? చెడ్డవాళ్లా? వీరిలో మంచితనం ఎక్కువా? చెడ్డతనం ఎక్కువా?

అని చాలామంది గురించి నేను ప్రశ్నించుకొంటూ ఉంటాను.

నేను చాలా చిన్నగా ఉన్నప్పుడు, చీకటి పడేసరికల్లా మత్తుగా భోజనం చేసేసి, పురాణకాలక్షేపానికి పోతూండేవాణ్ణి. అలా పోడానికి కారణాలు రెండు. మొదటి కారణం : కథలంటే నేను చెవికోసుకుంటాను. గీతా రహస్యాలైనాసరే కథలుగా చెప్పేస్తే (!) నేను చక్కగా వినేస్తాను. మరి, పురాణ కథలు వినడానికి చాలా ఇంపుగా ఉండేవి. అక్కడికి పోడానికి రెండో కారణం ఏమిటంటే, "ఆహా! ఇంత చిన్నపిల్లవానికి పురాణముల యందెంత ఆసక్తి! భగవంతునియం దెంతటి భక్తి!" అని కొంతమంది నన్ను మెచ్చుకున్నారు. దాన్తో నాకూ మన పురాణాలకీ అంటే పడిపోయింది.

పురాణకథలన్నీ వింటూండగా వింటూండగా నాకు పురాణపురుషుల్లో (దేవుళ్ళలో) కొంత మందంటే ఇష్టం, కొంతమందిని చూస్తే అయిష్టం ఏర్పడ్డాయి. అప్పటి నా 'అభిమాన హీరో' శ్రీరామచంద్రుడు. కాని నా వయసు కుర్రవాళ్ళు చాలామంది శ్రీ కృష్ణుడంటే మోజు పడిపోయేవారు. నాక్కూడా కొన్నాళ్ళు మనసు అటువైపే లాగింది. కాని—

శాస్త్రులుగారు ఓనాడు పురాణం చెప్తూ చెప్తూ ఏం చెప్పేరంటే : "అప్పుడా అర్జునుడితో శ్రీకృష్ణ పరమాత్మ ఏమన్నారంటే: 'ఒరే బావా! అర్జునా! వెర్రివాడా! నువ్వు చంపేవాడివీ, వాళ్ళు చచ్చేవాళ్లూనా? కాదు కాదు. ఎంత మాత్రంకాదు. చంపేవాడులేడు. చంపునదీలేదు. చంపబడే వాడూలేడు. చంపడమూలేదు. అన్న దమ్ములు, పెదబాబులు, చినబాబులు, మేనమామలు, మేనల్లుళ్ళు, అల్లుళ్ళు, గురువులు, గురుతుల్యులు—ఇంతమందినీ చంపేడమేనా, అమ్మో! అన్నేస్సి నీకు కాళ్ళల్లో కంపంపుట్టి, గుండెల్లో దడ పుట్టుకొచ్చి మతి పోతోందా? అలా అయితే, నన్నడుగు. నువ్వు ఏమి చెయ్యాలో ఏమి చెయ్యకూడదో, చేసేవాడివీ చెయ్యనివాడివీ నువ్వసలవునో కాదో అంతా నన్నడుగు నే చెప్తాను! అన్నాట్ట. అప్పుడా అర్జునుడు. . . ." అని శాస్త్రులుగారు చెప్పుకుపోయేరు. అప్పుడు నేను విన్నది సరిగా ఉన్నదనిగాని, అది నాకు సరిగా అర్థమయిం దనిగాని నే ననడంలేదు. కాని నాకు అప్పట్లో బోధపడనంత మట్టుకు—

అమ్మో! ఈ శ్రీ కృష్ణుడు మన శ్రీరాముళ్ళా అమాయకుడు కాద్రా అని నాకు గట్టి అభిప్రాయం కలిగిపోయింది. మంచివాళ్ళంతా అమాయకప్పక్షులేననీ, గడుసువాళ్లంతా కూడా "అమ్మో! అలా ఉన్నారనా?! చెడ్డ గడుసు వెధవలు!" అని మా ఇంట్లో అంతా అనుకోడంచేత నేనూ అలానే అనుకునే వాణ్ణి ఆ రోజుల్లో.

మర్నాడు క్లాసులో "ఒరే ఒరే! మీ కెవర్రా ఇష్టం? శ్రీరాముడా? శ్రీకృష్ణుడా?" అని వెళ్తూనే అందర్నీ అడిగేను. దాన్తో రాముడి పార్టీ కొంతమందిమీ కృష్ణుడిపార్టీ కొంత మందిమీ అయిపోయి కూర్చున్నాం.

అప్పట్నించీ నా కా వెర్రి పట్టుకొంది. పురాణ పురుషుల గురించేకాదు, ప్రతి చిన్న విషయంలో కూడా ప్రతి వారికీ ఇష్టాయిష్టాలుంటాయి. ఇష్టాయిష్టాలనుబట్టే మనిషి తత్వం తెలుస్తుందనేది కొంత స్పష్టపడిన విషయమేకదా. ఫుట్‌బాల్ ఆటకంటె క్రికెట్ అంటేనే ఇష్టంవున్నవారికీ, రెండింట్లోనూ ఫుట్‌బాల్ ఆటంటేనే ఇష్టంవున్నవారికీ చాలా తేడా లుంటాయి. (గొప్పా బీదా భేదం లేకుండా) క్రికెట్‌వారు పెట్రీషియన్లు, ఫుట్‌బాల్‌వారు ప్లీబియన్లు. వారి వారి స్వభావాల్లో చాలా తేడాలుంటాయి. ఇష్టాయిష్టాలనుబట్టే మనుషుల స్వభావం తెలుసుకోవాలనే సరదా నాకు చిన్నప్పట్నించీ ఉండిపోయింది.

శ్రీరాముడా—శ్రీకృష్ణుడా? భీముడా—అర్జునుడా? కర్ణుడా—ధర్మరాజా? రావణుడా—విభీషణుడా? కర్ణుడా—కృష్ణుడా? కృష్ణుడా—బలరాముడా? ఈశ్వరుడా—విష్ణుమూర్తా? లండనా? పారిసా? క్లైవా — డూప్లేవా? కారమ్సా—చదరంగమా? మద్రాసా—కలకత్తావా? శ్రీనాథుడా—పోతనా? ఉత్తరాది సంగీతమా—దక్షిణాది సంగీతమా? క్రికెటా—ఫుట్‌బాలా? నెహ్రూవా—సుభాష్‌బోసా? పట్టాభా—ప్రకాశమా? గాంధీవా—భగత్ సింగా? టెన్నిసా—చెడుగుడా? రష్యావా—జర్మనీవా? చర్చిలా—

రూజ్వెల్టా? లండనా—న్యూయార్కా? హాకీనా—టెన్నిసా? చీనా వాళ్లా—జపానువాళ్లా? రిచర్డ్ ది లయన్ హార్టా—రాణా ప్రతాప సింహానా? హామర్స్కెల్డా — లుముంబానా? పద్యాలా—జానపద గేయాలా? గురజాడ అప్పారావా—రవీంద్రనాథఠాకూరా? విశ్వనాథ సత్యనారాయణా—కృష్ణశాస్త్రా? హౌడ్ హావుసా — ఓ హెన్రీనా? 'షా' నా—చెకోవా?

ఇలా ఎవర్నయినా అడిగిచూడండి. వారికి డైరెక్ట్‌గా సంబంధించక పోయినప్పటికీ చాలా విషయాలగురించి వాళ్లకి ఇష్టాయిష్ట లుంటాయి. ఇష్టాయిష్టాల వెనక వాటికి కారణా లుంటాయి. ఇష్టాయిష్టాలు తెలుస్తాయి. కారణాలు అంత స్పష్టంగా కనిపించవు. అవి మనం ఊహించుకోవాలి. కాని, ఈ ట్రిక్కు ప్రతి విషయంలోనూ పని చెయ్యదు. చాలా మందికి ఇద్దరూ (లేక రెండూ) అంటే ఇష్టం ఉండొచ్చు. లేకపోతే అయిష్టం ఉండొచ్చు. లేకపోతే రూజ్వెల్టు వాళ్లల్లోనే లండనువాళ్లూ, పారిసువాళ్లూ ఉండొచ్చు. కాని అలా తెలుసుకొంటూ వెళ్తే మొత్తంమీద నిజానికి కొంచెం దగ్గరగా, మనుషుల స్వభావాల చిత్రాలు మనకి ఏర్పడతాయి.

ఈవిధంగా మనుషుల ఇష్టా యిష్టాలు తెలుసుకొని వాళ్లని గిడికి ఇవతలో, అవతలో మార్కు చేసుకు వస్తూండగా దార్లో నాకు మూర్తీ, రావులు తగిలేరు.

పల్చగా ఎర్రగా నాజూగ్గా పాలబుగ్గలూ, సోగకళ్లూ, కోలముఖాలూ ఉన్న నవయువకుల్లో కొంతమందికి చిన్నపాలు ఆడ మాట ఉంటుంది. ఎందు గుండెల ఆడవారన్నా, ఆడ మాటల మగవారన్నా నాకు పడదు. వాళ్ళంటే చిన్న పక్క బెదురుమీద ఎప్పుడూ ఉంటాను నేను.

మూర్తి రావులకి, వాళ్ల ధర్మమా అని, ఆడారిమాట మాత్రంలేదు. వాళ్లమానసికంగా కూడా ఆరోగ్యంగానే ఉన్నారని పించింది. పిసినారిగా లేకపోడం మంచివాళ్ళ లక్షణం అని నా నమ్మకం. వాళ్లిద్దర్లో ఎవరికీకూడా పిసినారితనం లేదు. ఖర్చు పెడతారు. ఎందుకు, ఎవరికి ఖర్చు పెడతారనే విషయాల్లో తేడాలున్నాయి. ఆడపిల్లల్ని అల్లరి పెట్టడం, చెడ్డ వాళ్ళ లక్షణం అని నాఅభిప్రాయం. ఆ చెడ్డపని మూర్తి చెయ్యడు, రావూ చెయ్యడు. ఎందుకు అల్లరి చెయ్యకూడదంటే వారిచ్చే కారణాలు వేరుగా ఉంటాయి. పిలక్కి తాడుకట్టుకు చదవడం మంచివారి లక్షణంకాదని నాకో నమ్మకం ఉండిపోయింది. వాళ్లిద్దరూ బాగా చదువుతారే కాని, ఆ విధంగా చదవరు. చాలామంది స్టూడెంట్సుకంటె వాళ్లకి చాలా సంగతులు తెలుసు. "శాస్త్రీయ దృక్పథం" అంటూ ఒక దృక్పథం ఉన్న దంటారు. అది వాళ్లిద్దరికీ కూడా ఉన్నట్టుగా నాకు తోచింది. మూఢనమ్మకాలేవీ వారి కున్నట్టుగా నా కెప్పుడూ కన్పించలేదు. దారిద్ర్యం పోవాలి. సంపద పెరగాలి. అందరు చదువుకోవాలి. అందరూ కూడా పని చెయ్యాలి. విశ్వశాంతికోసం లోకకల్యాణం కోసం అందరూ పాటుపడాలి. అందరూ బాగుండాలి—ఇటువంటి విషయాల్లో వారికి అభిప్రాయ భేదాలున్నట్టు నాకేంతోచలేదు.

నా పెట్టుకి వాళ్లు ఒకంతట లొంగలేదు. ఓనాడు హొటేల్లో టీ తాగుతూ నా తూణీరం లోంచి శ్రీరాముణ్ణీ, శ్రీ కృష్ణుణ్ణీ బైటకితీసి విడిచిపెట్టేను. విడిచిపెడితే వాళ్లు విరగబడి నవ్వారు.

"నీకు ఈ కప్పు ఇష్టమా? ఆ కప్పు ఇష్టమా? ఇందులో 'టీ' ఇష్టమా? అందులో 'టీ' ఇష్టమా? ఉల్లిదోసె ఇష్టమా—ఉల్లి పెసరట్టా?" అంటూ వాళ్లు నన్ను వెక్కిరించి వేళాకోళం చేసేరు. దాంతో నేను రంగంలోకి నా సరుకు దించడం మానేసి పక్కకిపోయి వాళ్లని పరిశీలించడం మొదలు పెట్టేను.

కొద్దిరోజులు, కొన్ని రోజులు పోయేక కొంతమట్టుకు వాళ్ల సంగతి కనుక్కొగలిగేననే అనుకున్నాను. వాళ్లకంటె నేను అధికుణ్నని చెప్పుకోడంలేదు. వాళ్లు నా గురించి ఏదో ఒక అభిప్రాయానికి వచ్చినట్టే, వాళ్ల గురించి నేను కూడా వచ్చేను. కాని వాళ్లమీద నాకో అడ్వాన్టేజి వాళ్లే ఇచ్చేరు. నేను చాలా వెర్రివాణ్ణనుకున్నారు వాళ్లు. నప్పులో కాలువేసేరు.

వాళ్లూ నేనూ ప్రతిరోజూ ఇరానీ హొటేల్లో కలుస్తూ ఉండేవాళ్లం. ఓరోజు రాత్రి యథాప్రకారం సుమారు పదకొండు గంటలకి అక్కడకి వెళ్లేను నేను. వాళ్లు ఆపాటికి రావలసిందే కాని రాలేదు. పన్నెండుదాకా చూసేను, వస్తారేమో నని. అప్పటికీ రాకపోతే నా 'రూం'కి పోయేను.

మర్నాడు వాళ్లే నాకంటె ముందుగావచ్చి హొటేల్లో కూర్చున్నారు. మంచి దుస్తులు తొడుక్కొని ఇద్దరూ చాలా నీటుగా ఉన్నారు. ఒకరిది మల్లెపువ్వులాటి తెల్లషర్టు. రెండో అతన్ది బ్యూటిఫుల్ బ్లూ షర్టు.

కుర్చీలో కూర్చొంటూ, "ఏం రాలేదు నిన్న?" అనడిగేను.

"నిన్న కొంపలంటుకున్నాయి" అన్నారు వాళ్లు.

"ఎవరితో తెచ్చేరు తగువు?" అన్నాను. కొంపలంటుకున్నాయంటే ఏదో దెబ్బలాట జరిగిందనుకున్నాను.

"చూసేవా! నీకు తెలుక్కూడా రాదు" అన్నారు వాళ్లు.

కొంపలంటుకోడం అంటే కొంపలు అంటుకున్నాయనే వాళ్ల అభిప్రాయం ట. ఆ ముందురోజు రాత్రి వాళ్ల లాడ్జి వెనక, బయలు ప్రదేశంలో, కూలివాళ్ల ఇళ్లన్నీ కాలిపోయేయిట. "అక్కడ ఉండిపోయేం" అన్నారు వాళ్లు.

నేను నాకో 'టీ' చెప్పుకొని, పత్తేదార్ అరవిందుళ్లా ముఖంపెట్టి, "ఇళ్లార్పడానికి మీ రిద్దరూ నడుం కట్టి రంగంలోకి దిగేరు. అవునా?" అని అడిగేను.

"ఓహో! ఓహో!" అని వాళ్లిద్దరూ విరగబడి నవ్వేరు. "నువ్వు షెర్లాక్‌హోమ్సువా? లేక పిల్లిఫూల్‌వా? ఇద్దర్లోనూ ఎవరంటే నీకిష్టం? పిల్లిఫూలా? షెర్లాక్‌హోమ్సా?" అంటూ నన్ను ఎగతాళీ చేసేరు.

"చూడ్డానికని మొదటవెళ్లి, తీరా అక్కడకి వెళ్లేక మంట లలా మండుతూంటే చూళ్లేకపోయేరు. ఆర్పడానికి వాళ్ళు సాయానికి దిగేరు. అవునా? కాదా?"

"అవును" అని ఒక రన్నారు.

"గొప్ప దివ్యదృష్టి" అని రెండో అతనన్నాడు.

"మీ ఇద్దర్లోనూ ఈ తెల్లచొక్కా ఎలా ఉన్నదలా నన్నోకి దిగిపోయింది. అవునా?"

"చెప్పు. చెప్పు" అన్నారు వాళ్ళు.

"ఈ నీలంచొక్కా (నీ బ్లూషర్టు చాలా బావుం దయ్యా) పర్సూ, షర్టూ లాడ్జిలో వదేసి వచ్చి, అప్పుడు పని ప్రారంభించింది. కాదా?" అన్నాను.

వాళ్ళేమీ అనలేదు.

"నువ్వు డేంజరూ గీంజరూ చూసుకోకుండా కాలుతున్న ఇళ్ళల్లోంచి సామాన్లు బైటకి తియ్యడానికి వెనకా ముందూ చూసుకోకుండా చొరబడ్డావు!" అన్నాను తెల్లచొక్కాతో.

"నన్ను నీకు తెలుసు. చెప్పడం గొప్పేంకాదు." అన్నా డతను.

"తెలుసు కాబట్టే చెప్పగలుగుతున్నాను. అంత తెగువగా అలా చొరబడ్డందుకు నిన్ను ఈ బ్లూషర్టు ఏమన్నాడో చెప్పనా?"

"చెప్పు"

"వెధవా! అంత సాహసం చూపించడం మంచిదే. కాని తెలివితక్కువతనంవల్లనైనా నువ్వలా చేసుండాలి. లేదా గొప్ప కోసమైనా చేసుండాలి. నువ్వు తెలివితక్కువ్వాడివి కావు' అని ఈ బ్లూషర్టు నిన్ను వెక్కిరించింది. అవునా?"

తెల్లచొక్కా అతను బ్లూషర్టు ముఖంలోకి చూసేడు.

"అదెలా చెప్పగలిగేవు?" అని నీలం చొక్కా అతను నన్ను అడిగేడు.

"మీ ఇష్టాయిష్టాలు నాకు తెలుసు కాబట్టి" అన్నాను.

"బాష్" అన్నా డతను.

"ఇంకా చెప్తాను. మీ ఇద్దరూ కూడా నిన్న రాత్రి ఇళ్ళార్పడం అయ్యేక టీ కోసం మీ లాడ్జిపక్క కాకా హొటేల్కి వెళ్ళేరా?"

"వెళ్ళేం"

"ఆ మురికి బట్టల్తోటే వెళ్ళేరు. అవునా?"

"అవును"

తెల్లచొక్కాని చూపించి, "మనవాడి బట్టలన్నీ అతి మురిగ్గానో చిరిగిపోయో ఉండుండాలి. మరి" అంటూ బ్లూచొక్కాని చూపిస్తూ, నీ బట్టలు మాసినా, అంతగా మాసి ఉండవు. అవునా?"

"కారీ ఆన్" అన్నారు వాళ్ళు.

"అక్కడ కాకా హొటేల్లో మిమ్మల్ని అందరూ చాలా ఆనర్ చేసుంటారు. కాని, వాళ్ళంతా తెల్లచొక్కా మాత్రం ఇళ్ళార్పిందనుకొని, ప్రశ్నలన్నీ ఇతన్నే వేసిఉంటారు. జవాబులన్నీ, బ్లూషర్టూ! నువ్వు చెప్పుంటావు!" అన్నాను.

"ఎలా గ్రహించేవు?" అని ఒక రన్నారు.

"బ్రదర్సూ! మీతో తిరుగుతున్నానుకదా. మీ గురించి ఆ పాటి గెస్ కొట్టలేనా? కథల బట్టి రచయితనీ, రచయిత బట్టి కథలనీ పోల్చవచ్చని మీరు చెప్పిన పుస్తకాల్లోనే ఎక్కడో చదివేను. అలాగే, మీ మాటలూ, మీ ప్రవర్తనా బట్టి మీ గురించి గెస్ కొట్టే నంతే!" అని అంటూండగానే నాకో అయిడియాతట్టి, "కావలిస్తే, మీరే ఏదైనా కథ వేరొకటి రాయండి. పోల్చుకోవచ్చు" అన్నాను.

"ఎలా పోల్చగలవు?"

"మీరు రాస్తే, అందులో దేన్నిబట్టి పోల్చేనో చెప్తాను"

"మా పాత రచనలు నువ్వు చదివుండాలి" అన్నారు వాళ్ళు.

"మీరు కథలు రాసినట్టుగా నాతో ఎప్పుడైనా చెప్పేరా?" అని, వారు ఆ విషయం నా దగ్గర అంతవరకూ దాచినందుకు చాలా చివాట్లు పెట్టేను వాళ్ళని.

"మీలా పేర్లు చెప్పుకు తిరగడం అలవాటులేదు మాకు" అన్నారు వాళ్ళు.

"చెప్పడం మానేయండి. కాని, చెరో కథా రాసి ఇవ్వండి. ఏ దెవరిదో చెప్తాను. ఉదాహరణకి మీ లాడ్జి వెనకాల ఇళ్ళు కాలేయి. కాలడం మీరు కళ్ళారా చూసేరు. దగ్గరుండి ఆర్పేరు. అదే ఇతివృత్తంగా తీసుకోండి. ఒకే 'థీమ్' మీద రెండు రకాల కథలొస్తాయి. రెండు కథల్లోనూ ఏ తేడా ఎందుకొచ్చిందో చెప్తాను."

వాళ్ళు నా మాటలు విని నవ్వేరు. అంతా ఎగతాళిలోకి దించేరు.

ఆ తరవాత అలా హస్కుకొట్టుకొంటూ ఎవరి లాడ్జికి వాళ్ళం పోయేం.

నాకో మేనత్తగా రుండేవారు. అవిడకో కొడుకూ, ఓ కూతురూను. ఇద్దర్లోనూ ఆవిడకి కూతురంటేనే పంచ ప్రాణాలూ అని ఆవిణ్ని తెలిసినవాళ్ళంతా అనుకొనేవారు. ఎవరైనా ఆవిణ్ణి ఎదర అలా అనేస్తేమాత్రం ఆవిడ సర్రున లేచి తెయ్యిమని ఎగిరి, "రెండు నేత్రాలున్నాయి నాకు. అందులో నాకు కుడికన్నెంతో ఎడమకన్నూ అంతే. ఏ కన్ను ఎక్కువ ఇష్టం అంటే అందులో అర్థం ఉందా? రెండు కళ్ళూ సమానమే నాకు" అని గట్టిగా కేకలేసి చెప్పేదావిడ. చిట్ట చివరకు ఆవిడ తన కొడుకూ కోడళ్ళకి ప్రేమాభిమానాలూ, కూతురికీ అల్లుడికీ వెండి బంగారాలూ, విడిచేసి కన్నుమూసింది. "చూసేవురా! మా అత్త ఎలాటిపని చేసిందో!" అని నే నొకతన్తో చెప్తే అతను "ఏం? వెండి బంగారాలు, ప్రేమాభిమానాలకంటె ఎక్కువకాదుకదా!" అని చమత్కరించేడు. మా మేనత్తని సమర్థించేడు.

మూర్తీ, రావుల గురించీ మా మేనత్త గురించీ ఆలోచిస్తూ, నేను లాడ్జికి వెళ్ళిపోయేను. ఆ తరవాత, వాళ్ళు పరీక్షల హడావిళ్ళో పడిపోయేరు. సెలవులకి నేను ఇంటికి వెళ్ళిపోయేను. ఆ రాత్రి మేం మాటాడుకున్న విషయాన్ని వాళ్ళు సీరియస్‌గా తీసుకొంటారనుకోలేదు నేను.

ఇంతలో సడెన్‌గా అలా ఆ రెండు కథలూ తీసుకొచ్చి నా యెదర పడేస్తే సంతోషమూ, సరదా పుట్టుకొచ్చేయి నాలో.

కాయితాలు నా ఎదర బల్లమీద పడేసి, "ఏ దెవ్రాసేరో పోల్చుకుంటావన్నావు?" అన్నారు వాళ్ళు, మళ్ళా.

"అవును. అన్నాను."

"పోల్చుకోగలవా?"

"ప్రయత్నం చేస్తాను."

"చేసి, ఎప్పుడు చెప్తావు?"

"ఇప్పుడే చెప్తాను. చదవనీయండి" అన్నాను. చదవాలని నిజంగా నాకు చాలా ఉత్సాహంగా ఉంది.

"అప్పుడు మీ లాడ్జి వెనకాల ఇళ్ళు. . . ."

"అవునదే ఆధారంగా తీసుకున్నాం."

"అయితే మీరు నెమ్మదిగా 'టీ' తాగుతూ ఉండండి. ఇప్పుడే చదువుతాను" అన్నాను.

"వేగిరం చదువు!" అన్నారు వాళ్ళు.

నేను ఆ కాయితాలు తీసి చూసేను. కథలు అట్టే పెద్దవిగా లేవు.

రచయితల్నీ, వారిలో భేదాల్నీ నాకు బాగా తెలిసి ఉండడం చేతా, నేననుకున్నట్టుగా వాళ్ళు రాస్తారా, రాయరా అని తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉండడంచేతా, ఆ రెండు కథలూ చాలా వేగంగా చదివేసేను.

రెండు కథలూ చాలా బావున్నాయా అంటే నేను చెప్పలేను. కాని, వాటిలో నాకొక కథ చాలా బాగా నచ్చింది. నచ్చడానికి కారణాలేమిటని ప్రశ్నించుకున్నాను. కారణాలు చాలా ఉన్నాయి. ఇదంతా రాయడం నాకేది నచ్చిందో చెప్పడానికి కాదు. ఆ కథలు మీకు చదవాలనుంటే చదవచ్చు. వాటిని యథాతథంగా రచయితల పర్మిషన్ మీద ఇందులో జత పరుస్తున్నాను.

వాటిలో ఒక కథ ఏమిటంటే, అది—

మంచి

ఈ చెడ్డలో ఆ మంచి ఎందు కుండకూడదు ? చెడ్డనే చూసేరు కాని మంచి నెందుకు చూడరు ?

అందుకే—

మొదటిభాగం (లోని)

—ఆ—

"కారుమబ్బుకి"

పెరట్లో దభీమని చప్పుడయింది.

అర్ధరాత్రి.

కామయ్య గుభీమని నిద్రలేచి, గడ గడ వణుకుతూ కూర్చున్నాడు.

"ఏదో చప్పుడయిందే ! చూడవే భ్రష్టుదానా !" అన్నాడు.

"భ్రష్టుదానికి" ఈ తీపి తీపి మాటలూ, ఈ పీచు పీచు గుండెలూ ఇవేం కొత్త కాదు. పాతికేళ్లయి కాపరం చేస్తోంది; తన మగడి సంగతి తనకి ఇంకా అపాటి తెలియక పోవాలా ? !

"అబ్బబ్బబ్బబ్బబ్బబ్బ ! మీరూ మీ భయాలూ కావు గాని ఇలా కాల్చుకు తినేస్తున్నారు ! మీకు నిద్ర రక్కర్లేక పోతే ఇతరులవాళ్ల కక్కర్లేదా ? పడుకుంటే పడుకోండి ! లేక పోతే పొండి !" అంటూ కామయ్యని కాలితో పొడిచిం దావిడ. కొమ్ముళ్లేవు, మరింతకంటే ఏం చేస్తుంది ?

నలుగురు భార్యలు ఎనిమిది కాళ్లతో తన్ని పొడిచినా పొడిచి తన్నినా కామయ్య భయం మాత్రం పోదు పోదు.

కామయ్యని చంపేస్తే కామయ్యే చస్తాడు; అతని భయం ఉండిపోతుంది.

పెళ్లాం కదలకపోడం కనిపెట్టి "డేయిపో మీదకి పిల్లి దుమికుంటుంది. అదే చప్పుడు ! నాకు తెలుసు !" అని పెరట్లో శబ్దం గురించి కారణం కనిపెట్టేసేడు కామయ్య.

అంతలో అతని చెవిని—ఒక చెవిని—(రెండో చెవి సరిగా పనిచెయ్యదు, చెప్పిన మాట వినదు) మరో శబ్దం పడింది. ఆ చెవిలో శబ్దం చిటపట మంది.

పెరట్లో చప్పుడు పిల్లిదైతే, ఈ చిటపట శబ్దం ఎవరిది ?

చిటపట చిటపట చినుకులుకావు. చిటుకూ చిటుకూ చీమలు కావు. మరైతే సీమ టపాకీలా ? అవంతకంటే కాదు.

ఈ చిటపటకి కారణం ఏమిటి చెప్మా అని కామయ్య తన ఒంటి చెవితో ఆలోచిస్తూ ఉండగా,

అంతలో ఊరంతా ఒక్కసారి గొల్లుమంది.

"ఇళ్లంటుకున్నాయే లంజకానా ! లేవే లేవే !!" అన్నాడు కామయ్య.

"ఇళ్లంటుకున్నాయే" అన్న ముక్క ఇంట్లో అన్నాడు, "లంజకానా ! లేవే లేవే !!" అనే మాటలు వీధిలోంచి పేల్చేడు కామయ్య. ఇంట్లోంచి బైటికి శబ్దాలంత వేగంగా వెళ్లేయా అంటే,

మరి ఇది, నిప్పుతో సరసమా ? పెళ్లాంతో సరసమా ? కామయ్య, ఛస్తే, నిప్పు ముట్టుకోడు. పాతిపెట్టా లంటే కాని, ముట్టుకోడు.

"ఇళ్లంటుకున్నాయ్" అని మళ్లీ కేక వేసేడు కామయ్య.

అవును. ఇళ్లంటుకున్నాయి.

ఒకదాని మీదొకటీ ఒకదానిమీద మరొకటీ వూరంతా ఇళ్లన్నీ అంటంటుకొనే ఉన్నాయి. మనుష్యులకుందేమోగాని ఆవూరి ఇళ్లకి మాత్రం అంటరానితనం లేదు.

అంటరానితనం జాతికి మచ్చ.

అది నిప్పుకి లేదు.

అంచేత,

"మాల కొంపల్రో మాలకొంపలు!" మాల కొంపలే ముందుగా అంటుకున్నాయి. జారిక రాముడి ఇల్లే ముందుగా అంటుకుంది. తరవాత గోదారి కన్నయ్యగాడిల్లు అంటుకుంది. తరువాత దాసరి సత్తిగాడిల్లు అంటుకుంది. వెంటనే చాకలి సూరిగాడి ల్లంటుకుంది. వెనకనే తెలకలి చిట్టెమ్మ (దాని కూతురు బావుంటుంది) దానిల్లు అంటుకుంది. ఆ తరవాత అలా వరసగా కొంపలన్నీ అంటుకున్నాయి.

ఎడ్లు కట్లు తెంపుకున్నాయి. ఆవులు కన్నెలు తెంపు కొంటున్నాయి. ఎరకలాళ్ల పందులూ చాకలాళ్ల గాడిదలూ గొల్లల గొర్రెలు, మేకలూ ఊరిమీద తిరగబడిపోతున్నాయి. (ఇందులోని నీతి : గాడిదలూ, పశువులూ, పిల్లా మేకా, పందీ పాపా ఊరిమీ తిరగబడకుండా ఉండాలంటే ఎక్కడున్న గుడి సెల్లో వాటిని అక్కణ్ణే ఉణ్ణివ్వండి. విప్పెట్టి బెదరగొట్ట కండి). (ఎన్. బి : వాటికి ఎసరు పెట్టచ్చు. విప్పెట్టకండి.)

మొత్తంమీద ఊరంతా కొంప లంటుకున్నట్టు, హాహా కారాలు పెట్టేస్తోంది. చాలా గందరగోళంగా ఉంది.

నులక మంచాలు, చింకి బొంతలు, చిన్నచిన్న పిల్లలు, పెద్ద పెద్ద రోకళ్లు, ఇత్తడి బిందెలు, అంబలి దాకలు, కంచు గళాసులు, కుండలు, ముండలు, రాచ్చిప్పలు, రాగి డేయిసాలు, ముగ్గురు గుడ్డివాడి కూతుళ్లు—(కాదు, అయామ్ వెరీ సారీ— గుడ్డివాడి ముగ్గురు కూతుళ్లు ("ముగ్గురూ గుడ్డి ముండలే") ఓ లమ్మో ఓ లమ్మోలు, ఎక్కడున్నావురోరయ్యోలు, ముండ చచ్చినోళ్లు, రవికెలు పిగిలిన పడుచు పిల్లలు, పైటలు జారిన వృద్ధ వనితలు జందేలు తెంపుకున్న జంగాలు, ముగ్గురు జడ్డి వెధవలు, పాతిక బెల్లపు దిమ్మలు, కొన్ని చింకి చాపలు, మరికొన్ని మలక మంచాలు, గుండెలు బాదుకోడాలు, ఇళ్లమీదికి ఇసక చిమ్మడాలు, నెత్తి మొత్తుకోడాలు, ధాన్యపు కుండల్రేపేలుళ్లు, పేలాల మాడుళ్లు, నూతిలోంచి ఇళ్లమీదికి వెళ్లే నీళ్ల కుండలు, నడికొప్పులమీంచి కింద పడే కమ్మలు, కాళ్లులేని కుంటిముండాకొడుకులు, అత్తిళ్లులేని విధవముండ కూతుళ్లు, వారాయినా, బగమంతుడా రచ్చించు తండ్రీలు, పొగలు, పొగలు, సెగలు సెగలు, మంటలు మంటలు, హా! హా!

"కారప్పుగుండ కుండ ఉండిపోయిందే ముండా!" అన్నాడు కామయ్య తన ఇంటికి ఎడంగా, మంచంమీద శుభ్రంగా కూర్చొని.

"ఒచ్చి తెచ్చుకోండి. తెచ్చుకు అందులో బుర్ర పెట్టు కూర్కోండి" అంది అతని భార్య, రుబ్బురోటి పాత్రాలు రెండు రెండు చేతులోత్తనూ పట్టుకువొస్తూ వొస్తూ.

ఆ సమయంలో కామయ్యకి తనకొడుకూ తన కూతురూ గుర్తు కొచ్చేరు.

అప్పులాళ్లు కనిపిస్తే యముళ్లు, పోలీసులు కనిపిస్తే జెయిళ్లు, అయ్యర్లు కనిపిస్తే ఇడ్లైవ్‌లు, విధవలూ వంటి బ్రాహ్మలూ కనిపిస్తే అపశకునాలు, సుబ్బారాయుళ్లు కనిపిస్తే డబ్బా రాయూలవేవాళ్లు ఏ న్యాయాన్నయితే జ్ఞప్తికి వస్తాయో (రో) అదే న్యాయాన్ని, ఆ పాత్రాలు చూసేసరికి కామయ్యకి తన పుత్ర పుత్రికా రత్నాలు ('జ్ఞప్తికి వచ్చేరు' అనాలా? 'జ్ఞప్తికి వచ్చేయి' అనాలా?—ఎందుకీ గొడవ? ....) జ్ఞప్తికి రావడం జరిగింది.

పుత్రికొచ్చిన భయమేమీ లేదు. ఆవిడ నిప్పుకి దూరంగా అత్తకి దగ్గరగా అత్తవారింట్లో భద్రంగా ఉంది. అత్తల దగ్గర నిప్పులు భయపడాలి కదా మరి!

మరింక పుత్రుడు సత్యం?

"సత్తిగా డేడే? ఇక్కడే వీధిలో ఇందాటా పడు కున్నాడు కామోలు?! ఎక్కడ చచ్చేడే వెధవా!?" అని కామయ్య అరిచేడు, తల్లికీ,కొడుక్కీ ఒకే 'వెధవ' నుపయోగించి.

కామయ్య భార్య చేతుల్లోని రెండు పాత్రాలూ కామయ్య పక్కనే ఎత్తి పడేసింది. రెండంగుళాలు అటు పడేస్తే కామయ్య గుండు పిలకతో సహా బద్దలవును. మాంగల్యానికీ, వైధవ్యానికీ అంతే కదా దూరం!

"రుబ్బురోలు చూరుకిం దుండిపోయిందే! సగితే చస్తాం! సత్తిగాడేడే?" అని నెత్తికొట్టుకు నరిచేడు కామయ్య.

"చస్తే చస్తాం. మీ రొచ్చి మోసుకురండి. వాడు పెళ్లి కెళ్లేడు గామోసు!" అని ఆవిడ గావుకేకలు వేసింది, కారప్పుగుండ కుండకోసం వెళ్లబోతూ.

"ఎవడి పెళ్లే? ఘస్తుంటేనూ!"

"ఎవరిపెళ్లా? నా తమ్ముడి కూతురి పెళ్లి! నా కోడలి పెళ్లి! నా కోడలిముండ పెళ్లికి కొడుకువెధవ వెళ్లొద్దా??! మీ కొడుకేనా వాడు! మీకు లేని సిగ్గు వాడి కెక్కణ్ణుం చొస్తుంది" అంది కామయ్యభార్య కారాల మిరియాల మంటలు కక్కి కక్కి.

"ఆ రంకుముండ పెళ్లికి ఈ వెధవ చచ్చినవెధవ వెళ్లడమా?? .... అయినా—పెళ్లి పెళ్లి!! ఇంకేం పెళ్లిలే! నా శ్రార్ధం పెళ్లి! వెధవలంతా ఈపాటికి కొంపకాలి చచ్చుం టారు .... " (థాట్ ప్రాసెస్ : కొంపకాలి వెధవలంతా చచ్చి నప్పుడు, అందులో ముండలంతా చావరా మరి?) .... "ముండలంతాకూడా చచ్చుంటారు!" అని కసిగా అన్నాడు కామయ్య.

చిటపట శబ్దం ఎలా ఉంది? ఊరికి నష్టంగా ఉంది. రాత్రిపూట పడమట గాలి మందహాసంచేసి ఏ రీతిగా వీచింది? మందంగా మంటలతోపాటు ఊరంతా వీచింది. మంట ఎలా ఉంది? భోగిలా ఉంది. ఊరంతా ఎలా ఉంది? దగ్గర్నుంచి చూస్తే మాడిన ఇళ్లతో, మనుషుల ఏడ్పులతో వికృతంగా ఉంది. దూరంనుంచి చూస్తే అందంగా వెలుగుచీకట్ల ఎరుపుచీకట్ల చిత్రంలా ఉంది. జనం గోల ఎలా ఉంది? దగ్గర్నించి వింటే సొమ్ముల సంతలా ఉంది. దూరంనించి వింటే శ్రీరామనవమి సంబరంలా ఉంది. ఇళ్లన్నీ ఎలా ఉన్నాయి? చల్లారిపోతూ ఇంకా పోకుండా ఉన్నాయి. పొగ లన్నీ ఎలా ఉన్నాయి? కారుమబ్బుల్లో కలిసిపోయున్నాయి. కారుమబ్బు లెలా ఉన్నాయి? చిన్నమెత్తు కాంతిరేఖయినా లేకుండా డాస్టవిస్కీ నావెల్సులా ఉన్నాయి. అందుకే—

రెండో భాగం(లో)

—ఈ—

"....వెండిచివురు!"

"సత్యం సత్యం" అంది సత్యవతి కూతుర్ని కొట్లోకి నెట్టేసి, పైన గొళ్లెం వేసేస్తూ.

ఎన్ని మనువులు చెప్పినా మేనబావ తప్ప మరో దక్కర్లేదంటుంది సత్యవతి.

"ఆ వెధవ గుండువెధవ, ఆ నీ వెధవ బావ్వెధవ రుబ్బురోటిపాత్రంలా ఉన్నాడుతప్ప వాడికి సరైన చదువా? సంధ్యా? పెంటుభూమా? శేరుగింజలా? ఏవీ లేవు! పాత్రానికి పిండైనా ఉంటుంది, వాడి కదీ లేదు. వాడి కసలు బుర్రమీద వెంట్రుకలైనా లేవు. పట్నంలో అచ్చేసిన ఆబోతులా తిరగడం తప్ప వాడికి మరింకేంలేదు!"

అని మేనల్లుణ్ణి తూలనాడి, కావలసిన సంబంధాన్ని కాళ్లదన్ని, వేటపాలెం వెళ్ళి విక్షేపంలాంటి పై సమ్మంధం రైటుచేసుకొచ్చి,

"తాంబూలా లిచ్చేశాను. ఇహ తన్నుకు చావండి" అంటూ ఉద్గ్రంథంలోంచి 'కోట్' చేసేడు తిరపతి.

శాస్త్రాలెన్ని చేస్తేనేమి, గ్రంథాలెన్ని చదివి వినిపిస్తేనేమి? ఏవీకూడా మేనబావకి సాటిరావు కదా! అందుచేత, తెల్లారుఝామున మూడుగంటలకి ముహూర్తం ఉందనగా, రాత్రి పదకొండుగంటలకి, తల్లి పైట చెరగున తలదాచుకొని, ఆ పైటకి ముక్కు రాసుకొంటూ, ఇంకా సత్యప్పలుకే పలుకుతోంది వంటింట్లో రామచిలక,

దాన్తో తిరపతయ్యకి చిర్రెత్తుకొచ్చి, "చంపేస్తానే, ఇంగ్లీషుచదువులముండా!" అని కూతుర్ని తిట్టి, అలా చూస్తూండగా నిప్పులా కాలిపోయి మంచుగడ్డగా మారిపోయేడు. నిప్పులోంచి మంచులోకి దిగిపోడానికి కారణం ఏమిటంటే :

పట్నంవెళ్ళి (థర్డుఫారం) చదువూ, సినిమాలూ, వెధవలూ, షోకులూ హొయలూ అన్ని లబ్బులూ, అన్ని నాజూకులూ చూసి, అన్నీ నేర్చుకున్న "ధడవాముండ" భగ్నప్రేమ భగ్నప్రేమంటూ, ఏ నూతిలోకి దూకేసినా దూకేయొచ్చు! ఏ కిరసనాయిలైనా పోసుకొని, ఏ అగ్గిపుల్లయినా గీసుకోవచ్చు. ఎంత సాహసాన్ని చేసినా చెయ్యొచ్చు. అనే ఆలోచన కలగడమే కారణం, నిప్పు మంచుగా మారుటకు.

ఈ అతిశీతలమైన ఆలోచన కలగ్గానే కన్నతండ్రికి కాళ్లూ, చేతులూ చల్లబడిపోయేయి. వెంటనే అరనిమిషం జాగుచేయకుండా కూతురి చేతులు విరిచికట్టి ధాన్యపు కొట్లోకి నెట్టేసి మూడు గంటల్దాకా, "చావు ముండా" అని అందుకే కేక వేసేడు తిరపతి.

ధాన్యపుకొట్లో ధాన్యం లేదు. ఎలకలైనా సరియైనవి లేవు. బూజాలున్నాయి. ఖాళీ కుండలున్నాయి. గదంతా మాత్రం ఏమీ కనిపించకుండా చీకటిగా, భయంకరంగా ఉంది. అయితే ఆ చీకటిమాసి సత్యవతికి భయమే లేకపోయింది. ఆ కన్నెపిల్ల మనసునిండా సత్యమే ఉండడంచేత భయానికి సిగ్గువేసి బైటనే ఉండిపోయింది.

అక్కడ కరణంగారి పెరట్లో కమ్మలపాకలో పశువులూ, వీధివైపు పాకలో పెళ్ళివారూ ఉన్నారు. పెళ్ళివారున్న పాకలో పెట్రోమేక్సులైటు భగ్గున వెలుగుతోంది. వెలుగులో పెళ్ళికొడుకు అలిగి పడుక్కున్నాడు. అలిగిన పెళ్ళికొడుకు అలిగిన ట్యూబరుకోక, ఎందుకలా దొంగ గొడ్డులా పడుక్కున్నాడో ఎవరికీ తెలియడంలేదు. అలిగినందువల్ల అందరికీ మాత్రం హడావిడిగా ఉంది. అతను అలిగేడనిచెప్పి, ఇవతల కొంతమంది అభోజనం ఉండిపోయేరు. కొంతమంది అభోజనం ఉన్నారు కాబట్టి మిగతావారంతాకూడా పస్తులు పడుక్కున్నారు. "ఆళ్ల తినేదాకా మా డొక్కలు మాడ్చేస్తే ఎలా?" అని పాలికాపులు పొలికేకలు వేస్తున్నారు. మంగలివారికీ, మగపెళ్ళివారికీ పేచీ రావడంవల్ల, బాజాల అల్లరి లేకుండా పెళ్ళి జరిగిపోతుందేమోనని ఆడపిల్లలంతా బెంగపెట్టుకుంటున్నారు.

అంతా తీన్‌తారుగా ఉంది.

ఇంతలో సుబ్బలి కూతురూ, జగదాంబ మేనగోడలూ, కొత్తనాయుడి చిన్నకోడలూ చిత్రంగా సింగారించుకువచ్చి "మా సచ్చా లేదండీ! ఒదినా!" అంటూ ఇంట్లోకొచ్చేరు.

విడిదినించి పదమూడోసారి ఇంటికొచ్చిన తిరపతి ఆ మాటవిని సత్యాలుమీది కోపంతో "చచ్చింది మీ సత్యాలు" అన్నాడు. పెరట్లో పెళ్ళాందగ్గరకి పోతూ. ఆమాటకి ముగ్గురు ఆబలలూ అలా నిలబడే మూర్ఛపోయేరు. జగదాంబ మేనగోడలు ఇంటికెళ్లక ఉష్ణం తెచ్చేసుకుంది కూడా.

"చస్తే చావనీ! చచ్చినాకూడా వాడిచేత పుస్తె కట్టించి అప్పుడుకాని శవాన్ని దహనంచెయ్యను" అన్నాడు తిరపతి పెరట్లో పెళ్ళాంతో. (అతనికి ఇంట్లో పెళ్ళాం ఒకరూ పెరట్లో పెళ్ళాం మరొకరూ లేరు. అక్కడా ఇక్కడా ఒక్కతే భార్య)

"అనలింతకంటె మంచి సమ్మంధం ఈ భూప్రపంచంలో ఎక్కడ దొరుకుతుంది?" అని కూడా అన్నాడు తిరుపతి పెరట్లోఉన్న తన పెళ్ళాంతో.

పెళ్ళికొడుక్కి ఏ అవలక్షణంలో ఏ లవలేశమైనా ఉందా? వాడికి బూరగాలా, బట్టతలా, బ్రహ్మచెవుడా, బ్లడ్ ప్రెషరా? ఏదీ లేదుకద! వాడికి కుంటీలేదు, గుడ్డీలేదు, గూనీ లేదు. మరింతకంటె చక్కని చుక్క దెక్కడ దొరుకుతాడు? మగవెధవలే దొరకడం (లేక, మగవెధవలు దొరకడమే) మహా కష్టంగా ఉన్నప్పుడు ఇంతకంటె మంచి సంబంధం ఎక్కడ దొరుకుతుంది?

అని ఇంట్లో తన పెళ్ళాన్ని గద్దించినసమయం లోనే తిరపతయ్యకి (కామా) కామయ్యకి వినిపించిన శబ్దం (కామా) వినిపించింది.

సత్యవతికి సత్యంతో లేచిపోయి (బంగారంతో సహా) బతకాలనుందేకాని చచ్చిపోవాలని లేదు. కొట్టంతా మాత్రం చీకటిగా ఉంది. మరి, చీకటికీ, చావుకీ లంకె కదా! అందుచేత సత్యవతికి చావాలనుంది. పెళ్ళికొడుకుసీట్లో సత్యంతప్ప మరెవడున్నాసరే, "అమాంతం అక్కడే చచ్చిపోతాను"—ఇది ఘోర ప్రతిజ్ఞ. అప్పుడు తన తల నతనొళ్ళో పెట్టుకొని సత్యం విలవిల్లాడుతాడు. "అయ్యో! నే చచ్చిపోతానా?"—అంటూ వలవల ఏడ్చేసింది సత్యవతి. ధాన్యపుకొట్టు జీవితమంతా ఆమెకి అంధకారబంధురంగా తోచింది. ఆవిడకి చావు తప్ప మరేదీ, చావడం తప్ప మరోదారేదీ కనిపించడం లేదు.

కాని భయపడకు సత్యవతీ, భయపడకు.

కన్నీటి కెరటాల వెన్నెలుంది. నిట్టూర్పు గాడ్పులో వెత్తావుంది. పాషాణ ఏదోపై మరేదోఉంది. మరింక, వికృత క్రూర క్షుధాక్షుభితమృత్యుకఠోర ఏదోఏదోలో వస్తుంది కదా! నీకు కళ్ళనిండా నీరూ చీకటీ తప్ప ఇంకేం లేకపోవడంచేత ఇంకేం కనిపించలేదు. నీ ఇంటి నడికొప్పు వెలుగులరవ్వలు చిమ్ముతోందన్న సంగతి నీకు తెలీదు. ఎలా తెలుస్తుంది? మట్టి మిద్దె అడ్డుందికదా. సత్యంధ్యాసలోనే ఉండడంచేత కమ్మల సురసుర నీ చెవికి వినిపించడంలేదు.

పెద్దసైజు పాత్రంలా నిల్చున్నాడు సత్యం. అతని హాలీవుడుగుండు ర్యక్‌రాకెట్లో మెరిసిపోతోంది. అతని (నకిలీ) పంట్లానికి అసలేదో వెతకాలంటే టెక్సాస్ పోయి చూడాలి. ఎందరో నవ యువతీ మణులు చూసిన అన్ని హాలీవుడ్ చిత్రాల్లోని అందరు హీరోల హీరోయిజమూ ఆ సమయంలో అతన్లో మూర్తీభవించింది.

పెళ్ళివారి విడిదికి ఆమడదూరంలో ఒక చిన్న అరయిల్లు అంటుకోగానే ఇక్కడ పెళ్ళికొడుకు అలక మటుమాయమైపోయింది. (అలకలు తీరాలంటే ఇళ్లంటుకోవాలి?) అవబోతూన్న పెళ్ళిని దృష్టిలో ఉంచుకొని, కాలే కొంపల్ని కూడా దృష్టిలో ఉంచుకొని, "అపశకునం, అపశకునం" అంటూ గోలపెట్టేసే డతను.

తిరపతి భార్య పెళ్ళి సామాన్లూ వెండి బంగారాలు ఏరుతోంది. భోషాణప్పెట్టెని సాయంపట్టించి బైటకి తెప్పించేడు తిరపతి. పెట్టె బైటకొచ్చేసరికి తాతలు దిగొచ్చేరు, నడికొప్పుకి నిప్పంటుకుంది.

"వచ్చేరా భగవంతుడా!" అంటూన్న తిరపతిని,

"మాఁవాఁ! సత్యా లేదీ?" అని అడిగేడు సత్యం.

"కొట్లో ఉంది. అమ్మో!! ధాన్యం కొట్లో ఉండిపోయిం దర్రా పిల్ల!!" అని గావుకేకలు వేసేడు తిరపతి.

"నాకు చావు తప్పదుకాబోలు. నే చచ్చిపోతాను కాబోలు. ఈ బోక్కిమొగుడు నాకు తప్పదుకాబోలు దైవమా! లాభం లేదు, నే చచ్చిపోతాను. అయ్యో అయ్యో నే చచ్చిపోతాను. పోతాను పోతాను నే చచ్చిపోతాను" అని మట్టిగోడకి నెత్తి కొట్టుకోబోయింది సత్యవతి.

అంతట అంతలు పిడుగులు పడ్డాయి, ఇంతలు మెరుపులు మెరిసేయి, గుమ్మానివి తలుపులు విడ్డాయి.

పూలబాణాల్లా సత్యంచేతులు సత్యాల్ని ఎత్తుకున్నాయి.

"బంగారు బావ! తీసుకుపో బావా!" అంది సత్యాలు.

"బంగారం, బంగారంలా తీసుకుపోతాను!" అన్నాడు సత్యం.

"బృందావనానికి, మల్లెపూపొదలచాటుకి, అక్కణ్ణించి కొత్తకొత్త సినిమాలకి, తీసుకుపో బావా!" అంది సత్యాలు.

"కలసిఉంటే కలదు సుఖం—'ప్రభాత్'లో తెలుగు. బ్యాటల్‌ఫీల్ 'పిలోటాక్'—అది 'లీలా'లో ఇంగ్లీషు" అన్నాడు సత్యం.

"సెలెక్ట్‌లో హిందీ పిక్చరేముంది?" అని అడిగింది సత్యాలు.

"ముహాబ్బత్! ముహాబ్బత్" అన్నాడు సత్యం సత్యాల్ని ఎత్తుకు నడుస్తూ.

మరో అరగంటకి పట్నంవైపోక జట్కా పరిగెడుతోంది.

జట్కాలోంచి, దూరంనుంచి, చీకట్లోంచి బావ వళ్ళోంచి స్వర్గానికి వెళ్తూ వెళ్తూ ఆటొకసారి, కాలిన ఊరివైపు చూసింది సత్యాలు.

కాలిన ఊరంతా కెంపులతోటలా ఉంది. వీచే పడమట గాలి (ప్రణయ) కోపించిన పడుచుపిల్ల ఊపిర్లా ఉంది. సుడులుతిరిగిన పొగలు, చక్కని రాకన్యల ముడులువిడిన కురుల్లా ఉన్నాయి. రేగిన నిప్పు రవ్వలు ఆ నీలి కురుల్లోని బంగారు పువ్వుల్లా ఉన్నాయి.

సత్యాలు ఆటువైపోసారి చూసి, "భోగిమంటలా లేదు బావా?" అంది కమ్మగా.

"ఉంది" అన్నాడు సత్యం వెచ్చగా.

"ఊరు కాలడమే మంచిదయింది కదు బావా?" అంది సత్యాలు ముద్దుగా.

సత్యం మంచిమంచి ముద్దులిచ్చేడు జవాబుగా.

* * *

ఆ ఇళ్లే కాలకపోతే ఈ కథే లేదుకదా మరి!

* * *

అదొక కథ

చదివేను, కాన, వాళ్ళవైపు చూశ్శేదు. చూస్తే ఎవర్రా పేరోతెలిసిపోవచ్చు. ఆ కథచదివేక, వెంటనే, రెండోకథ తీసేను. అది—

చెడ్డ

కాలినప్పుడు తప్ప అక్కడ కమ్మగుడిసెల వాడొక టుందని పట్నంలో పెద్ద లెవరికీ జ్ఞాపకంరాదు. జ్ఞాపకం చెయ్యడానికే కాబోలు అది మాటిమాటికీ కాల్తూ ఉంటుంది.

ముడిమీద ముడి వేస్తేనే కాని డబ్బు ఉండదనే విషయాన్ని అనుభవంమీద తెలుసుకున్నాడు లోవరాజు.

కూలివాళ్ళకి ప్రతిరోజూ మస్టరు వేస్తూనే ఉంటాడు సూపర్వైజరు. నెలాఖర్న లెఖ్ఖలు కూడి లెక్కప్రకారం కూలీలందరికీ డబ్బిచ్చేస్తూనే ఉంటాడుకూడాను. మస్టరు ప్రకారం డబ్బులు సరిగానే ముడుతున్నాయి, కాని, మనం పడ్డ కష్టంప్రకారం మస్టరు సరిగానే ఉంటోందా అని ఓరోజున లోవరాజుకి అనుమానం కలిగింది. ఆ నెల్లో "నోరం రోజులే వాగా ఎక్కేనుగదా! పదిరోజులికి కోత గోయిస్తి వాడేం జెప్మ ?!" అనుకున్నాడు.

ఒక సున్నానీ తొమ్మిది అంకెల్నీ భారతీయు లేవాడో సృష్టించి ప్రపంచం అంతటికీ తెలియజెప్పేరని చరిత్ర చెప్తోంది. ఆ సృష్టితో లోవరాజుకి అట్టే సంబంధంలేదు. వందలచొప్పున వెయ్యిదాకా లెక్కెట్టగలడు కాని, పది దాకా రాయలేడు. సున్నాకూడా సరిగా చుట్టలేడు. ఒక గీతైతే మాత్రం గియ్యగలడు.

రోజు కో గీత చొప్పున, పనికెళ్లిన ప్రతిరోజూ బొగ్గుతో గోడమీద గీతగీద్దామంటే, ఇంటికి కమ్మలదడే కాని మట్టిగోడైనా లేదు. ఎలారా దేముడా అని ఆలోచించగా ఆలోచించగా లోవరాజు కో అయిడియా తట్టింది. వెంటనే ఇంట్లో మంచాన్ది మలకతాడు తెంపి, ఓరోజు పనికొక ముడిచొప్పున వేసుకొంటూ సరిచూసుకోడం మొదలు పెట్టేడు. నెలాఖర్న మేస్త్రీనీ సూపర్వైజర్నీ తాడుతో టకాయించేసరికి అప్పట్నుంచీ మస్టరు సరిగా పడ్డం, డబ్బులు సరిగా కిట్టటం జరుగుతోంది.

ముడులేసి డబ్బు నిలవెయ్యాల్సిన అవసరం లోవరాజుకి చాలా ఉంది. ఆప్పెల్లక్సారి అతని తండ్రి నాటు నుంచి పట్నం వచ్చి,

"అయ్యోరే ! నువ్వు డబ్బు జేగరత్తజేస్తేగాని బగమంతుడు మన్ని రచ్చించడు. పైన తక్కువసెయ్యకండా అన లొస్తిలు కక్కితెగాని పెద్దోడిగారి సిన్నయ్య మన మడిపెక్కొగ్గడు. ఒగ్గడంటే ఒగ్గడు. పెద్దోడు ఈ మద్దెలే సచ్చినాడు. ఆడున్నా అంత పరవా నేకపోను. ఆడి కొడుకు—ఈ సిన్నయ్యగోడు—తక్కువోడు గాడు. జెరుమనీ వోళ్లాటోడు ! రావుణాసురుడి తమ్ముడు ! నామ్మాస్తే మునిలాణ్ణాయిపోన్ను. మడిపెక్క నువ్వు దున్నాల, నీ కొడుకు దున్నాల. మరి నా పనైపోనాది. మరింక, అయ్యోరే, బారవంతా నీ మీదరే ఉంది !"

అని కొడుకు చెవిలో ఇల్లుకట్టుక్కూర్చొని చెప్పి పోతూంటాడు.

అందుచేత—

"కుటుంబంలో పట్టం పారొచ్చిన" లోవరాజు రోడ్డు కూలి చేస్తున్నాడు. అతని భార్య, సూకాలు, కొండకటింగు దగ్గర మెట్లంగి కొడుతోంది. వాళ్ల పెద్దకూతురు, గంగాలు, నాపల డిపోకి అన్నం కారేజీలు మోసుకు వెళ్తోంది. చిన్న కూతురు, డాక్టరమ్మగా రింట్లో, పిల్లల్ని ఆడిస్తోంది. మూడోది "ఆడపిల్లల అవుస్టల్లో, వాస్టల్లో, ఏటో అంటారు, ఆ పేరే సరీ తెల్దు" అందులో జీతానికి ఉడుస్తునీ జీతంలేకుండా తోటపనీ చేస్తోంది. నాలుగోపిల్ల అయిదునీ, ఆరునీ ఇంటిపద్ద ఆడిస్తూ వంటపనికూడా కొంతమట్టుకు చూస్తోంది. అయిదోవాడు మగపిల్లడు. ఇంకా, గొట్టికాయలు సరిగ్గా ఆళ్ళేడు. (తరవాత, రెండు కాన్పులు పోయేయి.) ఆఖరిది (మళ్లీ ఆడపిల్ల) పాలు తాగడం, పాకరడం, మన్ను తినడం, గుడ్డఉయ్యాల్లో పడుక్కోడం, జబ్బుతో ఏడవడంతప్ప మరో పనేదీ (డబ్బుక్కాని, మరెందుక్కాని) చెయ్యలేకుండా ఉంది.

మగపిల్లడు 'కడుపుల పడ్డప్పుడు' లోవరాజు సంసారం పట్నానికి మారింది. వాడి కిప్పుడు ఆరేళ్ళు. అప్పటికి గంగాలు పొడవుగా 'పతలాగ్గ' ఉంది కాని ఇంకా చిన్నపిల్లకిందే లెక్క. ఇక్కడికి పట్నం వచ్చేకే, "రాండేళ్ళగ్గాలోలు" బాగా పొగింది, బిగిసింది, కలకల్లాడుతూ విడింది.

గుర్రంలా పెళ్లాం ఎదగ్గానే, పట్టుకుపోదామని దాని మొగుడు "పెట్రాడా మరి." పారొచ్చేడు. "పారొచ్చి" పెళ్లాన్ని రమ్మన్నాడు. వెళ్తాననే గంగాలూ అంది. కాని, తల్లి అడ్డొచ్చి "వార్రోజులు ఆగరా నాయనా !" అంది అల్లుణ్ణి.

నాలుగు రోజులు వెళ్లిపోయి చాలా రోజులయింది.

"పెద్దమనిసయి సిప్పటి కెన్నేయేడు ? నాలుగోయేడు! అవునా గాదా ? అవునుగద ! మరి నానింక పెళ్లెందుకు సేసుకున్నట్టు ? పెళ్లాన్ని సాకడానికి సేసుకున్నానా ? నేకపోతే, పట్నంవంట అబ్బడ్డోళ్లకీ అన్నంగేరేజీలు తిప్పించి తిప్పించి అయ్యపేతులో డబ్బులొయ్యించడానికి సేసుకున్నానా ?"

అని అయిదు రోజుల కిందట అల్లుడు మళ్లీ వచ్చి నానాఅల్లరీ చేసి వెళ్లిపోయేడు.

లోవరాజుకి పౌరుష మొచ్చింది.

"సెస్ ! ఏటీ సంత ?! కొత్తామాస ఎల్లనిచ్చి ఆడి పెళ్లాన్ని ఆడికాడికి తోలేయాల !" అనుకున్నాడు. అల్లుడి అల్లరిలో అన్యాయం ఎంతమాత్రం లేదుకదా ! అటువంటప్పుడు కూతురు తెచ్చే పది కాయితాలకీ "లెమునడ్డం తప్పు తప్పు కానా తప్పు !" అనుకున్నాడు లోవరాజు.

అయ్యకి చెప్పలేదు, ఆలికి చెప్పలేదు, కాని, కలిగిపోడం మాత్రం లోవరాజుకి విరక్తి కలిగిపోయింది. ఎండలంట రోడ్లకి మన్ను మోసి, కొండలంట ఎండావానల్లో రాళ్ళ

మోసి "ట్రిప్పుకి మూడు కోసుల్ప్పున రోజుకీ రొండు ట్రిప్పులు, మద్దేనపేళ" అన్నపు గిన్నెలు మోసి, "డాట్రమ్మ ఇంటికాడ పొద్దల్లా ముగ్గురు పిల్లల్ని" మోసి మోసి, పూటకి "యాభై గదులు నాలు గొరాండాలూ తుడ్వనికి" రోటిల్లా చీపుళ్ళు మోసి మోసి, ఇలా ఇంటిల్లిపాదీ "ఓ పొద్దు గాదు, రొండు పొద్దులు గాదు—ఆరేళ్ళు—ఈ కొత్తమాసొస్తె సరా సరిగ వేడోయేదు సొరబడ్డది"—ఆరేళ్లపాటు అన్ని బరువు పొద్దుల్ని నెత్తిని మోసుకు 'ఈడ్చుకొస్తే' సరిగ్గా మిగిలి నవి పది పదులూ పద్దైదుల్లాను.

ఈ లెక్కని చూస్తే ఎనిమిదివందలు కూడ్డం ఎప్పుడు ? మడిచెక్క విడ్డం ఎప్పుడు ? 'పెక్రాలు తిరగడమే అవుపిస్తుంది గాని బండి నడ్డం అవుపించదు!' మరింక, ఎంత యినా ఇంతేలా ఉంది. 'దురాసె తప్పు మరేట్నేదు. మనిసి నస్తే ఆసె మాత్తరం ఉండిపోద్దా యేటి ? అదీ నస్సి !"

అందుకే—

ఆరోజు రాత్రి ఏడున్నరగంటల నమయంలో—ఎన భయ్యారు పాకల మధ్యలోంచి, ముప్పైమూడు వంకీలు తిరిగి —ఇంటికొచ్చి అలా చతికిలబడిపోయేడు లోవరాజు. కళ్ళు పీకుతున్నాయి; నరాలు తోడేస్తున్నాయి; చెమటతో దుమ్ముతో వళ్లంతా ఆంబల్లా ఉంది. కాస్పేపు అలా కూర్చొని నెమ్మ దిగా లేచి, ఇంటిముందు గోలెం దగ్గరికి వెళ్ళి, అందులో నీరు తబుకుతో గోకితీసి నీళ్ళు పుక్కిలించి ఉమ్మి,

"నూకాలూ ! ఇయాల నీరు తేలేదేటే ?" అని అడి గేడు లోవరాజు.

ఎనిమిది కాన్పులతో ఎండెండిపోయున్న నూకాలు, మగడు వేసిన ప్రశ్నకి ఏడుస్తూ లోనుంచి బైట కొచ్చింది.

"పంపులు పాడైపోనాయంట. నీళ్లబండికాడ కెళ్తే ఇంటికో కుండణ్నేరే ఇచ్చినారు. నుయ్యి జూస్తే శానాదూరం. పిల్లెల్లి తేనేకపోనాది." అంటూ ఏడుస్తూ చెప్పింది నూకాలు.

"ఆపాటిదానికి ఏడాలటే ఎర్రిదానా !"

"అది కాదరా .... వాయినా !"

"మరైతే, ఇంకేటి ?"

"ఇదిరా దేవుడా ! ఇందుకురా ! సూద్రా !" అంటూ పిడికిలి విప్పింది నూకాలు.

ఆకాశంనిండా చింకిమబ్బులు పేలికలై ఈదురు గాలికి చెల్లాచెదరై పరిగెడుతున్నాయి. గుమ్మంలో ఉన్న గుడ్డి దీపపు కాంతి ఇంటిముందున్న గోలెం దగ్గరికి అనడంలేదు. ఆమెచేతిలో ఉన్న ఆవేవో అవి, పాలిపోయి గడ్డకట్టిపోయిన పాపాలు నాలుగులా ఉన్నాయి.

"ఆమేటో మాపినావురా ?!" అని నూకాలు ఏడుస్తూ అడిగింది.

"రూపాయలు కదటే ? నేక, అర్దలా ?"

"రూపాయిలేట్రా రూపాయిలే !" అంటూ వాటిని నూకాలు జారవిడిచేస్తే, అక్కడే ఉన్న కుళ్లిన పేడలో పడ్డా యవి.

లోవరాజు కేమీ అర్థం కాలేదు.

గట్టిగా, "ఏటిదంతా ?" అన్నాడు.

"రైకలోంచి రాల్నాయిరా ! బాబూ, బగమంతుడా !" అంటూ ఏడుపు హెచ్చించింది నూకాలు.

"రైకలోంచి రాల్డమేటే ?"

జరిగిన విషయమంతా నెమ్మదిమీద అర్థమయింది లోవరాజుకి.

చీకటిపడ్డాక ఇంటికొచ్చిందట గంగాలు. ఇంటి కొచ్చి, చీకట్లో, కోక మార్చుకుందట. "ఆ యెనక గవ్వున రైక మార్చబోయేతలికి" నాలుగు తెల్లరాళ్లూ కిందకి రాలే యట. ఎక్కడవివి ? ఎందు కిలా దాచేవు ? అంటే ఏడ్చిం దట. చెప్పలేదట. 'ఏడ్చమేగాని చెప్పనేద' ట. 'ఆ యెనక, చెప్పను చెప్పనంది' ట. ఆకరువున దానికండా నిజెం చెప్పే సిందిట.

"ఏటా నిజెం ?"

హోటేలువాడు ఇచ్చేట్ట !

ఎందు కిచ్చేట్ట ??

అందుకే ఇచ్చేట్ట !!

"ఇవ్వడమే కాదరా !"

అర్థమయింది.

"పీకలమీదకొచ్చిందిరా."

అర్థమయింది లోవరాజుకి.

"మూడో నెల్రా !"

అర్థమయింది ! చెప్పక్కర్లేదు !!

అర్థమయిం దంతా లోవరాజుకి. అర్థంకాగానే కప కుక్కన కడుపులో ఎవరో కత్తితో పొడిచినట్టయిం దతనికి.

ఇంట్లో ఉయ్యాల్లో ఉన్న పిల్ల వెక్కివెక్కి ఏడవలేక పడుకొంది. చూరుకింద కూర్చున్న ముగ్గురు పిల్లలూ పైకేమీ వినబడకుండా ఏడుస్తున్నారు. నూకాలు, ఇంటి ముందు కూర్చొని, నెత్తి, నోరూ కొట్టుకు నేడుస్తోంది. ఎండుతూన్న పిల్ల లెందరో వాడనిండా ఎందుకో అలా ఏడు స్తూనే ఉన్నారు. కమ్మల గుడిసెలన్నీ రొజ్జు గాలికి గోలగోల పెట్టి గొల్లున ఏడుస్తున్నాయి. పులి అరుపుకి భయపడ్డ మేకల్లా పరిగెట్టే మేఘాల పేలికలు ఆ దూరంలో ఏడు స్తున్నట్టే కనిపిస్తున్నాయి. ఆగలేని ఈదురుగాలి, ఊరి నిండా ఉన్న టెలిగ్రాఫ్‌తీగెలకి, దీపాల తీగెలకి తెగిపోయి తెగిపోయి, చుట్టుకుచుట్టుకుపోయి ఆ బాధకి భయంకరంగా ఏడుస్తోంది. పౌరుషాని కలా నిలబడిపోయిన మొండి తాటి

చెట్లుమాత్రం ఏడుపు నాపుకొని అలా నిశ్శబ్దంగా నిలబడి పోయున్నాయి.

"ఎక్కడుంది ?? ఏదీ ?? ఏదీ .... ఆ .... ఏదీ ఆ .... లంజ ?" అన్నాడు లోవరాజు. ఆమాట, కూతు ర్నామాట అనే సరికి అతనికి ఎవరో నోట్లో నిప్పులు కుక్కినట్టనిపించింది. నిప్పుల్ని అలానే మింగేసే డతను.

'వేద్పుకుంటూ ఎల్లిపోయిన' గంగాల్ని వెతకడానికి వెళ్ళిన చిన్నది అప్పుడే వచ్చి, "ఒలే అమ్మా! అప్ప. . . .అప్ప.... అప్పెక్కడా అవుపించనేదే!" అని తల్లితో చెప్పి, అక్కడే అలా బిక్కచచ్చిపోయి నిలబడిపోయింది.

"గోరం సేసిందేటోరా!! ఎదిగిన పిల్లని ఇంటికా డెట్టుకున్నాను. తప్పంతా నాదిరా! తప్పంతా నాదిరా!" అంటూ గోలచేస్తోంది నూకాలు.

పేడలోపడ్డ రూపాయలు పేడనికూడా పాడుచేస్తున్న ట్టనిపించింది లోవరాజుకి.

ఆ యేడుపులూ, అగాలీ, ఆ చీకటీ, ఆ మురికీ, ఆ బతుకూ, ఆ డబ్బూ చూస్తూ వాటిమధ్య నిల్చొని నిప్పులు మింగిన లోవరాజుకి, ఆకస్మాత్తుగా ఒక్కసారిగా చెప్పలే నంతగా ఇంతలోకంలోనూ, తనూ తన సంసారం అతి వంటరిగా అయిపోయినట్టనిపించింది. మురికిమహా సముద్రంలో చుక్కాని లేని బొక్కిపడవలో ఉక్కిరిబిక్కిరయిపోయి చస్తున్నట్టని పించింది.

డబ్బు డబ్బు డబ్బు డబ్బేకదా! ఛీ ఈ బతుకంతా డబ్బే కదా! ఏటీ బతుకు? డబ్బేకదా! ఛీ, ఎందుకీ బతుకు? డబ్బుకే కదా!

డబ్బుకి నీ రక్తం, డబ్బుకే నీ ఎండిన మాంసం, డబ్బుకి నీ కూతురి మానం, డబ్బుకేకదా నీ చిల్లర ప్రాణం!!

"గోరం జేసేసినావురా బగవంతుడా!" అని ఏడుస్తూన్న నూకాలు, "మళ్ళీ యెల్లి నూదారి రాయే!" అని చిన్నదాన్ని తీసుకొని స్వయంగా బయల్దేరింది. అ కెక్కడకో పోయింది.

ఇదే ఘోరమా?!

ఇంకెన్నో పాపాలు పండాలి, ఇంకెన్నో ఘోరాలు జర గాలి, ఇంకెన్నో బతుకులు కాలాలి, ఈ జీవితం అప్పుడు తెల్లా రాలి.

ఎంతసేపు, లోవరాజు ఇంటిముందు అలా కూర్చు న్నాడో తెలీదుకాని,

అంతలో—

జనం గొల్లుమన్నారు.

చూస్తూండగా అరనిమిషంలో అంటుకుంది సుసే నమ్మ ఇల్లు. ఇల్లంటుకున్న పావునిమిషంలో ఇంటోవున్న సారా ట్యూబులు అంటుకున్నాయి. ఆర్పడం ఇంకెవడి తరం?!

కత్తులు కటార్లతో, బాణాలు బల్లాలతో, ఈటెలు వేట కుక్కలతో, వేటాడి వెంటాడి తరిమితే పరిగెట్టినట్టు పరుగు తీస్తే తప్ప ప్రాణాలు మరింక దక్కవు దక్కవన్నట్టు పరి గెట్టుకొస్తోంది ఈదురుగాలి. చీమలపుట్టమీద కాలేకొరకంచు పడేస్తే భయపడి హడలిపోయి, వాటి చిన్న చిన్న ప్రాణా కోసం అటూ ఇటూ కంగారైపోయి పరిగెట్టే చలిచీమల్లా జనమంతా పరిగెడుతున్నారు. ఇదినుమా ఈ బతుకులోని బాధ, వొచ్చొక్కసారి చూడమని భగవంతుణ్ణీ పిలవడానికా అన్నట్టు హడావిడిగా పరిగెడుతున్నాయి చెలరేగిన పొగలు.

ఎక్కడా చుక్క నీరులేదు. గాలి చూస్తే గట్లు తెంచుకు ప్రవహిస్తోంది. ఇళ్ళు చూస్తే గడ్డిబుంగలు నయం అని పిస్తున్నాయి.

ఇల్లంతా భస్మం అయిపోయి అంతా సర్వనాశనం అయిపోయినా,

"ఏ దెలా పోతే పోనీ!" అనేసుకొని అలా నిల్చుండి పోయేడు లోవరాజు.

చూరుకింద ఉన్న పిల్లలు బైటకొచ్చే లోపున ఇంటి నడికొప్పు అంటుకున్నా దప్పుడే.

బతుక్కంటె డబ్బే ఘనమైపోయినప్పుడు, సంచ ప్రాణాలకంటె చిల్లరడబ్బులే ఎక్కువైపోయినప్పుడు ఎందుకు మనకీ బతుకు? మనకి బతుకే అక్కర్లేనప్పుడు ఈ యిల్లెం దుకు? ఈ సంసారం ఎందుకు?

అనిపించింది లోవరాజుకి. వాడ వాడంతా పెనుకేకలతో ప్రళయుంగోలావుంది. అమ్మా చెల్లీ, అయ్యా చెల్లీ అంటూ పక్కన పిల్లలేదో గోల చేస్తున్నారు. గోలలో ఏమీ వినిపిం చడంలేదు లోవరాజుకి.

కాని, ఆ సమయంలో టక్కున నెత్తిమీ దెవరో కొట్టి నట్టనిపించిం దతనికి. ఆరేళ్ళ తన కష్టంపోతే పోయింది. కాని తన భార్యది, తన చిన్న చిన్న పిల్లల్ది వాళ్ళ కష్టాన్ని నిప్పుల పాలు చెయ్యడానికి తనకి హక్కులేదు, హక్కులేదు హక్కు లేదంటే లేదు. ఆ కష్టమంతా కజ్జీ పెట్టెలో మూతలేని కుండ పిడతలో పది పదుల పదైదుల కాయితాల రూపంలో ఉండి పోయింది.

ఇల్లంతా కమ్మల గొడుగు కాలినట్టు కాల్తోంది.

ఆరేళ్ళపాటు కాలి ఆరి కాయితాలుగా మారిన కష్టం కోసం అతను పరిగెట్టినప్పుడు, "చచ్చేవురా లోవరాజా!" అని ఎవరో గావుకేక వేసేరు. పిల్లలు కళ్ళు మూసేసుకున్నారు.

పిల్లలు మళ్ళీ కళ్ళు తెరిచేసరికి, చేత్తో కుండపిడత పట్టుకొని వాళ్ళపక్కనే నిల్చున్నాడు లోవరాజు.

"హమ్మయ్య!" అనుకున్నాడే కాని, అంతలో అతని చెవుల్లో పిడుగులు పడ్డాయి.

"అయ్యో అయ్యో! పెళ్ళిరా అయ్యో! పెళ్ళేది రయ్యో?"

ఏ పెళ్ళి??

"పెళ్ళిరా! మా పెళ్ళిరా! మన పెళ్ళిరా! అయ్యోరే అయ్యోరే పెళ్ళేదిరయ్యో?"

లోపల గుడ్డ ఉయ్యాల్లో ఉండిపోయిన కూతురికోసం లోవరాజు వెనుకేకవేసి పరుగుగీపెలోపున, కర్రలోంచి గొడుగు కిందకి జారిపోయినట్టుగా, ఇంటి కప్పు మంటలతో సహా కిందకి కూలబడిపోయింది. మెరుపు మెరిసినట్టయిపోయింది, పిడుగు పడ్డట్టయిపోయింది.

"తొలిచూలిది నూతిలో తేల్తోంది, మరి నా కడసారి దేది మావయ్యో?"

అని ప్రశ్నించింది మాకాలు.

ఏడుపుకంటె నవ్వే ఒకప్పుడు భయంకరంగా ఉంటుంది.

"డబ్బుకి బలయింది. అదిగో, చూడు అక్కడ కాల్తోంది!" అని నవ్వేడు లోవరాజు.

కాలిన వాడవాడంతా చితకలకోసంవేసిన చితిలా ఉంది. మండే మంటంతా స్వర్గంకోసం చేసుకొనే యజ్ఞంలోని హోమజ్వాలలా ఉంది.

అంతలో, ఈదురుగాలంతా నిర్ఘాంత పోయినట్టుగా నిలబడిపోయింది. చంటి పిల్లతోసహా కాలి మండి మాడి బొగ్గయిన ఇంటిమట్టూ చేరి, రెక్కలు మాత్రం కాలిన మిగతా చిలకలన్నీ తలలొంచుకు నిల్చున్నాయి. కాలి చల్లారుతూన్న ఇళ్ళల్లోంచి బాధలు చిమ్మినట్టుగా చిమ్ముతూన్న పొగలన్నీ బరువుగా తిన్నగా పైకిపోయి మరింక కనిపించకుండా ఏమీకాకుండా పోతున్నాయి.

అన్నదాతా! నీ చేతి పిడికెడు మెతుకులు మాకు మరింక వద్దు వద్దు. ఆర్తత్రాణ పరాయణా! మా గోల నువ్వింక వినవు వినవు. దయార్ద్రహృదయా! నీ జాలి నీ కన్నీరు మాకింక ఎందుకెందుకు? జగద్రక్షకా! నీ రక్షణ మా కెప్పుడూ లేదు లేదు. సర్వలోకపాలకా! నీ పరిపాలన మాకు మరింక చాలు చాలు!

కథ జరక్కూడదు. జరిగినది మరింక పెరక్కూడదు.

* * *

రెండు కథలూ చదివేసి, కాయితాలు బల్లమీద పడేసి మరో మూడు కప్పుల 'టీ' తెమ్మన్నాను.

"ఏ దెవరం రాసేమో పోల్చుకుంటానన్నావు?" అన్నారు వాళ్ళు.

"పోల్చుకున్నానే" అన్నాను.

"మరైతే చెప్పు! ఈ నవ్వెన్నెందుకు?"

నా మారుపేరు చెప్పుకున్నప్పుడు ఎలా నవ్వేవాణ్ణో అలా నవ్వుతూ ఎవరి కథ వారి చేతి కిచ్చేసేను.

ఎలా పోల్చేవని వాళ్ళు నన్నడిగేరు.

వాళ్ళని నాకు తెలిసినంత బాగా తెలిసినప్పుడు, వారిలో ఎవరేది రాసేరో పోల్చుకోడం ఏమంత కష్టమైన పని?! కాని—

పాఠకమహాశయులారా!

పై రెండు కథలూ మీరు చదివేరా?

చదివేరు కద.

వాటిలో "ఏది మూర్తి రాసేడు? ఏది రావు రాసేడు?" అని నేను మిమ్మల్ని అడగను. మీకు వారిని తెలీదు. వాళ్ళ గురించి ఏ భోగట్టా అయినా సరిగా నేను చెప్పలేదు. అందుచేత మిమ్మల్ని అదేం అడగను.

కాని, ఒక్కటడుగుతాను.

ఆ రెండు కథల్లోనూ—

ఏది మీకు ఇష్టం ?

రెండూ ఇష్టమేనా! అయితే. . . .ఏ దెక్కువ ఇష్టం?

అబ్బే! అలాకాదు; రెండూ ఇష్టం లే దంటున్నారా! అలా అయితే. . . .రెండింట్లోనూ. . . .కనీసం ఏదంటే తక్కువ అయిష్టం?

ఇష్టం. ఎక్కువ ఇష్టం. తక్కువ అయిష్టం—ఏదైనా సరే, ఎందువలన ఎందువలన?

సమాధానం మీకు మీరు చెప్పుకొంటే మీ మీ స్వభావాల గురించి మీకే కొంతగా సరిగా తెలియొచ్చు.

1961 - సాహిత్య సింహావలోకనము

శ్రీ శ్రీ వాత్సవ

1962 జనవరిలో 39 వ జన్మదినోత్సవం చేసుకొంటున్న తెలుగు సాహిత్య మాస పత్రిక భారతి చరిత్రయే ఆధునిక తెనుగు సాహిత్య చరిత్ర. ఈ సంవత్సరము ప్రకటించిన రచనల అకారాది విషయ సూచిక పరిశీలిస్తే, అందు వెలువడిన పద్యములు ప్రకీర్ణకములు, నవలలు నాటకములు, కథలు కావ్యములు, విమర్శలు వివాదములు, సమీక్షలు చర్చలూ, వర్తమానాంధ్ర సాహిత్యముపైన వెలుగులై ప్రసరించగలవు. ప్రత్యక్షముగా "భారతి" ప్రకటించినవేకాక, పరోక్షముగా పరిశీలించిన రచనలు, సోదర పత్రికలతోపాటు, సుపరిచితము చేసిన కృతులు ఈ సింహావలోకనములోనికి తేవచ్చును. వీనిని నిష్పక్షపాతదృష్టితో సమీక్షచేసినచో ఈనాటి సాహిత్య ధోరణి గ్రహించినట్లే. ఒక పత్రిక స్థాయి, దాని యందు ప్రకటించే రచనలనుబట్టి నిలుచునుగాని, వాటిని పరామర్శ చేసే రాగద్వేషపూరితుల స్వాభిమానాలనుబట్టికాదు. కడచిన పన్నెండు మాసాల ప్రతులు తిరుగవేస్తే "భారతి" వర్తమానాంధ్రసాహిత్యరీతుల ప్రతిబింబముగా ప్రవర్తిల్లినట్లు విరోధులకయినను తోచక మానదు. 1961 లో వచ్చినన్ని నూతన రచనలుకాని, కథలుకాని, కావ్యములుకాని సాహిత్య చర్చలు కాని, వాదప్రతివాదములుకాని ఇంతవరకు ఎన్నడు రాలేదేమో!

1961 అనేక విధాలుగా సాహిత్యపిపాసులదృష్టి నాకర్షించినది. కారణము ఈ సంవత్సరములో కనీసము ఆరుగురు మహాపురుషుల శత వార్షికజయంతులు జరిగినవి. రవీంద్రుడు, మోతీలాల్ నెహ్రూ, ప్రఫుల్ల చంద్రరాయ్, గణేశ్ శంకర్ దత్త, గురజాడ, మదనమోహనమాలవీయ. మేడమ్ కామా మొదలయినవారు. వీరిలో రవీంద్రుని ప్రతిభ మిగిలిన వారినందరినీ క్రీనీడలోనికి తోసివేసినది. ఈ నవీనయుగంలో రేడియో, సినిమా, పత్రికలు వంటి ప్రచారసాధనలున్న 1961 లో రవీంద్ర శత వార్షిక జయంతి రావడం ఒక విశేషం. ఒక్క భారత దేశంలోనేకాక, ప్రపంచదేశాలు అన్నింటిలోను రవీంద్రుని జయంతి 1961 ఏడాది పొడుగునా ఎక్కడో ఒకచోట జరుగుచున్నది. రవీంద్రుని రచనావళి వంగ భాషలో ముద్రించి, పశ్చిమ వంగ ప్రభుత్వము చౌకగా రు. 75 లకు అందజేస్తున్నది. భారతీయ భాషలన్నింటిలోను రవీంద్రుని రచనలు వెలువడ్డాయి. విదేశాలలో కూడ రష్యన్, జపాను, జర్మను, ఫ్రెంచి భాషలలో సైతము రవీంద్ర రచనావళి వచ్చినది. అద్భుత నైపుణ్యముతో రవీంద్రుని నాటకములు దేశవిదేశాలలో ప్రదర్శించారు. న్యూయార్కులో "అరూపరత్న" (కింగ్ అఫ్ ది డార్క్ ఛాంబర్) నాటక ప్రదర్శనలో రాణిగా తెనుగుతార టి. సూర్యకుమారి పాత్ర ధారణచేసినది. బెంగాలీలో వంగేతర భాషా ప్రతినిధుల రచనలతో "మహామానవేర్ సాగర్ తీరే" అనే గ్రంథము వెలువడినది. దానిలో తెలుగుప్రతినిధి బెజవాడ గోపాలరెడ్డిగారు. రవీంద్ర సాహిత్యముమీద కృషి చేసిన వారిలో ఉత్తమ రచయితలకు కేంద్రసాహిత్యఅకాడమీ బహుమతు లిచ్చింది. వారిలో చిరకాలంనుండి రవీంద్రసాహిత్యం అధ్యయనం చేస్తున్న ఆకురాతి చలమయ్యగారికి ఈ బహుమతి లభించింది.

ఈ జయంతి పురస్కరించుకొని—కేంద్ర సాహిత్య అకాడమీ ఆంధ్ర సాహిత్యఅకాడమీవంటి సంస్థలేకాక, ఇతర ప్రకాశకులు కూడ ఎన్నో గ్రంథములు రవీంద్ర సాహిత్యముని ప్రకటిస్తున్నారు. చెట్టుపేరుచెప్పి కాయలమ్మినట్లు, లాభసాటి వ్యాపారం చేసికోవడానికి ఈ పుస్తకాలు తోడ్పడ్డాయేమో కాని రవీంద్రుని భావ సరళికాని, కవితాభివ్యక్తికాని తీలగా నయినా చెప్పడానికి ఈ గ్రంథావళి ఉపకరించలేకపోయింది. ఇవి చదువుతూఉంటే "పాపం! రవీంద్రుడు!" అనిపిస్తుంది. కొన్ని అనువాదాలు చేసినవే క్రొత్తగాచేసి మరింత అయోమయంచేశారు. శీర్షికలలో సైతము మూలంలోని తాత్పర్యం అర్థం కాలేదనడానికి తార్కాణంగా "రాజాతిమిరగృహం", "విసర్జన", "యోగాయోగాలు" వంటివి చూపవచ్చును. "గీతాంజలి" అనువాదం సంగతి చెప్పనక్కరలేదు. ఇప్పటికి వెలువడిన అనువాదాల సంఖ్య దశమానందాటినప్పటికీ మూలాన్ని అపేక్షించకుండా అర్థమయ్యేది ఒక్కటికూడా లేదు. బెంగాలీలోని పదలాలిత్యము, శయ్యా, రీతి—ఇవి రాకపోయినా, కనీసం మాతృకలోని భావస్ఫురణ కూడ కలుగజేయలేకపోయినవి. ఈ సందర్భములో ఎన్నో ప్రత్యేక సంచికలు కూడ వచ్చాయి. వానిలో—ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రకటించిన రవీంద్ర సంచిక ఒకటి. ఇది చక్కని ఆర్టు పేపరుమీద ఎంతో వ్యయప్రయాసలతో వేసిన ఉద్గ్రంథమయినా, ఇందులో ప్రకటించిన వ్యాసావళి, విషయ సేకరణలోకాని, పద్య రచనల సంకలనములో కాని ఏవిధమైన శ్రద్ధ కనబరచినట్లు తోచదు. ఉదాహరణకు, ఒక ప్రముఖ సాహిత్యవేత్త రచించిన వ్యాసములో, రవీంద్రుని తల్లి మూడవయేటనే మరణించిందనీ, అందుచేత అతనికి మాతృప్రేమ అంతగా తెలియదనీ, ఆ కారణంగా అతని స్త్రీ పాత్రల సృష్టి అద్భుతంగా ఉంటుందనీ తెలియజేశారు. శాశ్వతంగా ఉంచుకోదగిన యిట్టి ఉత్తమ సంచికలో రవీంద్రుని

గురించి ఇటువంటి "అబద్ధాలు" వ్రాస్తే, అది యెవరికి గౌరవం? సాహిత్య అకాడమీలు తలపెట్టిన కార్యాలే ఇంత శోభాయమానంగా సాగితే, ఇతర ప్రకాశకుల సంగతి వేరే చెప్పాలా ? మంచి సమయము మించిన దొరకదు అని ఎన్నో పుస్తకాలు సీసెలకొద్దీ కట్టలుకట్టి చింతపండు అమ్మినట్టు అమ్ముతున్నారు. రవీంద్రుని మూలంలో "నీలకంఠుడు" తెలుగులో నీలకాంతుడవుతాడు. "సేఫాలిక" మల్లిపూవుగాను, "రజనీ గంధము" చీకటి తావిగాను మారుతుంది. చేసిన అనువాదాలు బెంగాలీనుండి ఇంగ్లీషులోకి, ఇంగ్లీషునుండి హిందీ, హిందీనుండి తెలుగు, తెలుగునుండి మారు తెలుగు—ఇన్ని భాషాంతరాలు పొందినమీద మూలంలోని అర్థం లీలగా కూడ నిలువలేదు. ఈ సమయంలో వచ్చిన అనేకగ్రంథములలో ఆంగ్లభాషలో వచ్చిన రవీంద్రుని జీవితంగూర్చి కృష్ణకృపలానీ రచన, పిల్లల కోసం రేణుకారాయ్ రచించిన చిన్నిపుస్తకం కొంత మేలుగా ఉన్నవి. తెలుగులో 'అమరేంద్ర' రచించిన గ్రంథం విశ్వకవి రవీంద్రుని బహుముఖ ప్రతిభను పరిచయం చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ అకాడమీవారు ఒక పోటీపెట్టారు. దానిలో- కోటికిరణుడయిన రవీంద్రుని, "కవి చంద్రుని"గా చూపిన ఒకరచయిత్రి గ్రంథానికి బహుమతి యిచ్చారంటే, మన తెలుగువారి ఉచితజ్ఞత గ్రహించవచ్చును. కాళిదాసు, షేక్స్పియరు వంటి మహాకవులకు జరుగని పెద్ద స్థాయిలో రవీంద్ర శత జయంతి మహోత్సవాలు జరుగుచున్నవి. కాని ఈ పేరున ప్రభుత్వములు, మంత్రులు, విద్యాశాఖవారు, రివెన్యూ డిపార్టుమెంటువారు కలుగచేసికొని, యిది అధికార సమారాధనలాగ జరిపేటప్పటికి—ఈ సభలలో తాశీల్దారులూ, రెవెన్యూ ఇనస్పెక్టర్లూ, జిల్లా విద్యాధికారులూ, బడిపంతుళ్ళ పూనుకోవలసివచ్చి, సాహిత్య సభలకు బదులు, జమాబందీ సమావేశాలు, సెంట్రల్ క్లాసులు చూస్తున్నట్టు అనిపిస్తున్నది. నిజంగానే రవీంద్రుడు బహుముఖ ప్రతిభావంతుడు. సర్కారువారి పాటలలోకిదిగి వేలంవెర్రియెత్తించవలసిన అవసరం ఏమీ చేయులేదు. భారతదేశానికి, వంగ దేశానికేకాక, ప్రపంచ దేశాలకే క్రొత్త సందేశం వినిపించిన యుగ ప్రవక్త. ఈ శత జయంతి సంతర్పణలు, సమారాధనలు ముగిసిన తర్వాతనయినా స్థిమితంగా కూర్చుండి చదివి ఆనందించవలసిన ద్రష్ట, స్రష్ట, కవి, కళామూర్తి, తత్త్వవేత్త, ధర్మప్రవక్త.

రవీంద్ర ఛాయలలోపడి—మాయమైన గురజాడ వర్ధంతి ఈ సంవత్సరం వచ్చిందికాని, అన్ని విషయాలలోలాగే ఆయన పుట్టిన తేదీని కూడ తెలుగువారు వివాదగ్రస్తం చేశారు. ఆయన జాతకం దొరికినాకాని అది నమ్మే స్థితిలో లేరు. 1961 ఎలాగ గతించింది కాబట్టి—ఆ సంవత్సరం ఏమీ జరగకుండానే గడచిపోయింది—పోనీ 1962 లో నైనా వారి సరియైన పుట్టిన తేదీ సెప్టెంబరు 21 వాడు, శత వార్షిక జయంతి జరిపి వారి గ్రంథావళి ప్రచురించి అధ్యయనంచేస్తే సముచితంగా ఉంటుందేమో! వారి గ్రంథాలు జీవితచరిత్ర రష్యాలో ప్రకటించబోతున్నారు. ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలలో వారి నాటకం 'కన్యాశుల్కం' వెలువడబోతున్నది. ఆంధ్ర సాహిత్య అకాడమీవారు, "కన్యాశుల్కం" సంపూర్ణప్రతిని సవ్యాఖ్యానంగా ప్రకటించపూనుకోవడం మెచ్చుకోతగిన అంశం.

వార్షికోత్సవాలు, శత వార్షికోత్సవాలూ ఆటుంచి యించుమించు ప్రతిరోజూ, ప్రతి వారం ఎక్కడో ఒకచోట ఏదో ఒక గ్రంథం ఆవిష్కరణ మహోత్సవం జరుగుతున్నది. ఒక అమాత్యశేఖరుడో, ఒక అధికారప్రవరుడో ఆధ్వర్యం వహించి గ్రంథాన్నికాని, గ్రంథకర్తనుకాని ఎంతమాత్రము తెలుసుకోకుండానే ఆవిష్కరణం చేస్తున్నారు. అక్షతలు వేస్తున్నారు. ఆరంభోపన్యాసా లిస్తున్నారు. అప్రస్తుతాలు చెప్తున్నారు. రాజులు రాజపోషకులులేని ఈ ప్రజాయుగంలో ప్రజలే సాహిత్య పోషకులు. ప్రజాప్రతినిధులుగా, మంత్రులు నిలువబడి కవులను, గ్రంథకర్తలను, ఖద్దరు దండలతో, ఖాదీ శాలువాలతో సత్కరిస్తున్నారు. ప్రచురణ వస్తున్నది కాని—దీనివలన ప్రయోజనము వెలువడిన గ్రంథాలకుగాని, అవి కష్టపడి రచించిన గ్రంథకర్తలకుగాని వ్యర్థమైపోతున్నది. ఆవిష్కరణల పటాటోపం ఆటుంచి, గ్రంథములలో అంతరార్థం తెలిసికోవాలీ అంటే అవి చక్కగా పరిశీలించాలి. సమగ్రంగా సమీక్ష చెయ్యాలి. అట్టి సమీక్షలు పూర్వం పత్రికలలో వెలువడేవి. ఈనాడు పత్రికలలో చాల భాగం సమీక్షలు, గ్రంథాలు చదువకుండా వ్రాసినవే. దానివలన కూడ గ్రంథములలోని విషయములు తెలిసికొనే సావకాశం సన్నగిల్లిపోతున్నది. శతాధికగ్రంథాలు వస్తున్నవి. పోతున్నవి. వీనిని పరిశీలించగల్గిన ఓర్పు, ఓపిక ఈ కాలంలో ఎవరికి ఉంటుంది? అందుచేత సాహిత్యరంగంలో విలువలు కట్టడం కష్టమే. విపణివీథిలోలాగ ఇవి దినదినం మారేవికావు. కొన్ని ప్రమాణాలకు, కొన్ని లక్ష్యాలకు లోబడి నిలకడగా ఉండేవి. అవి అందులో లేని రచనలకు సాహిత్య పీఠిలో తావేలేదు. ఈ దృష్టితోచూస్తే, ఈ కాలంలో వస్తున్న సారస్వతం ఏ విలువలూ పాటించలేకపోతున్నదేమో అనిపిస్తుంది. భావశబలత, రససిద్ధి, విశ్వశ్రేయస్సువంటి మహోన్నత లక్ష్యాలను అందుకోలేకపోయినా, భాషలోని శక్తి, జీవత్ పరిణామము, పరిశుద్ధత, అర్థపుష్టి, యుక్తి చమత్కృతి, జాతీయభావన కూడ నిలుపుకొన్న రచనలు నేడు అరుదైపోయినవి. అవి గ్రాంథికము కానక్కరలేదు. జీవత్‌భాష అయిన వ్యావహారిక భాష అయినాసరే కదిలేదీ, కదిలించేదీ అయిఉండాలి. పలుకుబడులతోను, నుడికారాలతో, నిండుతనంతో పసందులు చూపే భాషే నేటి రచనలలో కఱవైపోయింది. లేనిదానికి విచారించి ప్రయోజనంలేదు—ఉన్న దానిలోనే గ్రుడ్డిలో మెల్లను ఎంచుకోవాలి. ఈ దృష్టితో చూస్తే—1961 సాహిత్యం కొంచెం మెరుగేమో అనిపిస్తుంది.

గద్య రచనలకున్న ప్రచారము పద్యరచనలకు లేకపోయినప్పటికీ, నేటికీ పద్య వాఙ్మయమునకే హెచ్చు గౌరవము లభిస్తున్నది. కవితాగ్రంథములు కూడ ప్రచారములోనికి రాగలవనడానికి ఒక మంచి తార్కాణము కరుణశ్రీ రచించిన ఉదయశ్రీ. ఈ కవితా సంకలనం 25 ముద్రణలుపొంది ఈ సంవత్సరం 26 వ ముద్రణం వెలువడినది! ఇరవై అయిదు వేల ప్రతులు చెల్లిపోయినది. దీనికి కారణము ఈ పద్యముల

మృదు మధురశైలి, పదలాలిత్యము, భావముల నిరాడంబరత. దానికంటె హెచ్చు, ఈ గ్రంథములోని పద్యములన్నీ యించుమించు—గ్రామఫోను రికార్డులుగా మధుర కంఠముతో ఘంటసాల వేంకటేశ్వరరావుగారు పరిచయంచేసియుండుట. అది గాక హరికథాగాయకులయిన కీ. శే. ముట్నూరి సూర్యనారాయణగారు, గాయకులయిన మహావాది వేంకటప్పయ్యగారు గానం చేసి ఆంధ్ర దేశమంతా ప్రచారం చేశారు. ఏ కారణంచేతనయినా ఒక కవితా గ్రంథము ఇన్ని ప్రతులు చెల్లడం పుస్తక ప్రకాశనలోనే చరిత్ర సృష్టి చేసినట్లే! ఇంతగాను కవితా గ్రంథములు ప్రచారములోనున్న మహాకవి గుర్రం జాషువా కవి. వీరి స్వీయ చరిత్ర పద్యరూపములో వెలువడుచున్న నూతన కావ్యము. స్వీయ చరిత్ర గద్య పద్యాత్మకముగా రచించినవారు కీ. శే. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు. వారు ద్విశతాధిక గ్రంథకర్తలు. అంత పెద్ద యెత్తున—గ్రంథ రచన చేస్తున్నవారు—మన సమకాలికులు విశ్వనాథ సత్యనారాయణగారు. వారి రామాయణకల్పవృక్షం యింకా చిగురులు తొడుగుతూనే ఉన్నది. ఈలోపున-పది పుణ్య క్షేత్రాలకు చెందిన ఇష్ట దైవములను ఎన్నుకొని వారివిగూర్చి పది శతకములు మధ్యాక్కరలతో చెప్పి, వెయ్యి పద్యాలతో కూడిన విశ్వనాథ దశ శతి ప్రకటించారు. ఇందులో వారు పాటించిన ద్వియతి నియమము పాఠకులను ఆశ్చర్య చకితులనుచేసి, రసానందములో ముంచివేసినది. విశ్వనాథవారు రామాయణము రచించినా, రమ్య రచనలు చేసినా, చాటువులు చెప్పినా, శతకములు చెప్పినా ఒక నిగూఢమైన శైలితో నారికేళపాకంతో పాఠకులకు శ్రమకల్పిస్తారు. వారి కావ్యాలలో దోషాలు లేవనికాదు. అట్టివి కాళిదాసాది కవులలోనే ఉన్నవని వారి మతము. వాటిని యెత్తి చూడడానికి సామాన్య పండితులు చాలరు. రసధునులయిన సహృదయులే సమర్థులయిన వారని వారి వాదము. రామాయణ కల్పవృక్షములోని దోష ప్రకరణముపైన రేగిన గాలిదుమారమునకు ఇదే సమాధానము. రెండు నెలలపాటు ఆంధ్ర పత్రికలో సాగిన ఈ సాహిత్య చర్చలోను, భాషాపరామర్శలోను కులములు, శాఖలు, రాగ ద్వేషములు ప్రవేశించి శాఖాచంక్రమణమునకు దారితీసినదని కొందరి అభిప్రాయము. కాని ఈ విమర్శ ప్రతి విమర్శల వలన, స్తబ్దుగాఉన్న సాహిత్యలోకంలో చైతన్యం కలిగిన మాట నిజం. నేటి కవితా రీతులు చూచిన మూడు ముఖ్యమైన పంథాలు కానవచ్చును. విశ్వనాథవారివలె రామాయణాది కథల తిరిగి వ్రాయుట. ఈ పద్ధతిలోనే—చరిత్రగాథలు రచించువారున్నారు. ఉదాహరణకు జ్ఞానానందకవి రచించిన "గోలకొండ" కమ్మని పద్యాలతో అలరారుచున్నది. సర్వోదయ సిద్ధాంతములు మననము చేసికొని, జీవితములో ఆచరణలోకితెచ్చిన తుమ్మల సీతారామమూర్తిగారి "సర్వోదయగానము" ఒక మంచి కావ్యము. ఉద్యోగ విరమణం చేసిన తరువాత తీరికగా కూర్చుండి కొండొకచో ఒక ఉడుత ఎగిరి గంతులువేస్తే చూచి వ్రాసిన "చిక్రోడ పంచదశి"వారి కవితా హృదయమునకు మంచితార్కాణము. మహాత్ముడు, బుద్ధుడు, వేమన వీరిపైన మూడుశతకములు రచించి నెహ్రూ పండితునికి అంకితమిచ్చి గౌరవాదరములు చూరగొన్న పల్నాడుకవి కొండవీటి వేంకటకవి "త్రిశతి" చాల చక్కని సంపుటము. శతక శైలిని వచ్చిన మరికొన్ని చాటు పద్యములు—ఆధునిక కవి దాశరథి రచించిన దాశరథీశతకములో నున్నవి. ఇందు దాశరథి ఆధునిక కవి శ్రేష్ఠులను, రాజకీయవినాయకులను వ్యంగ్యముగా పరిచయముచేసి హాస్యరసముపోషించినారు. ఇట్లే ఆధునిక జీవితముపై వ్యాఖ్యలవంటి పద్యములను వీరి జంటకవి సి. నారాయణరెడ్డి "సమదర్శనం" లో ప్రకటించారు. "చదువులతోనే వ్యక్తికి సంపూర్ణత్వమ్మురాదు. సంస్కారములేని చదువు సౌరభమ్ములేని పూవు." ఇట్టి సత్యములు సహృదయతతో నారాయణరెడ్డిగారు చాటియున్నారు.

నేటి కవిత్వంలో ద్వితీయ పంథా ప్రణయ కవిత్వము. భావ కవిత్వమునకు కాలదోషము పట్టినప్పటికీ, నేటికీ ప్రణయ కవిత్వమువంటిది రచించువారు లేకపోలేదు. అయితే ఏదో ఒక కథను, ఒక శృంగార సన్నివేశాన్ని ఆధారంగా పెట్టుకుని రచిస్తున్నారు. ఇట్టివానిలో స్మార్తిశ్రీ రచన "వియోగిని" ముద్దులు మూటకట్టుచున్న ముచ్చటయిన కావ్యం. ఈ కావ్యమంతా "వియోగినీ" వృత్తములలోనే నడచి వీనుల విందుగా విప్రలంభశృంగారమును గానము చేసినది. యాతనామయమైన లోక జీవితమునుండి మానవ చేతన ద్వంద్వాతీతమగు నానందస్థితినందుట ఇందున్నది. శృంగారంలోని అన్ని అవస్థలను చూపుచు గానం చేసిన కావ్యము సి. నారాయణరెడ్డిగారి "ఋతుచక్రము." పల్లెటూరు దంపతుల జీవితంలో ఒక యేడాది ఋతు చక్రము కలిగించిన శృంగారావస్థలన్నీ చక్కగా ఈకావ్యంలో, చిత్రించినారు. "ఋతు ప్రబంధం" ఋతువులను గూర్చి ఒక చిన్న పుస్తకమును పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు తెచ్చినారు. శృంగారభావాలకు సూఫీతత్త్వానికీ సూచిక అయిన గాలిబ్‌కవి ఘజల్సు — దాశరథి తెనుగు ద్విపదల లోనికి అనువదించి రసస్పందనము కలిగించు వాక్కులలో చెప్పినారు. అంత్యనియమము పాటించి, పాడుకొనుటకు వీలయిన "ఘజలు" అనే పాట పాటగానే ఉంటే ఇంకా రక్తి కట్టేది. అని ఉరుదూ పాటల సొగసు తెలిసిన పెద్దల అభిప్రాయం. అభ్యుదయకవితలో క్రొత్త సంపుటము ఆరుద్ర సంకలనం చేసిన 'సిసివాలి'. దీనిలో యస్. జి. వో. సూర్యుడు, క్లార్కు సూర్యారావు, సీతాకోకచిలుక, మొదలయిన రచనలు రేడియోలో ప్రసారమై, శ్రోతలకు చక్కిలిగింతలు పెట్టినవే వేరే ప్రకటించారు. అన్ని రకాలరచనలు చేయుటలో అందె వేసిన, చేయి తిరిగిన యస్వీ జోగారావుగారి కవితా సంపుటి ఒకటి. ఈ శ్రేణి కవితలోను, అధివాస్తవికకవితలోను క్రొత్త త్రోవలు త్రొక్కి, భావనతో, పాటలతో, పాఠకులను దిగ్భ్రాంతుల్ని చేసిన కవి శ్రీరంగం నారాయణబాబు, పాపం, ఈ సంవత్సరం కీర్తిశేషుడై పోయాడు. అతనిని గూర్చి, ఆరుద్ర రచించిన గేయం చిరకాలం జ్ఞాపకం పెట్టుకోదగినది. ఇటువంటి అశ్రుగీతికలలో—ప్రసిద్ధ కవయిత్రి, నవలా రచయిత్రి అయిన డాక్టర్ శ్రీదేవి ఆకస్మిక మృతికి అశ్రుతర్పణముగా—నాయని కృష్ణకుమారి రచించిన "ఏం చెప్పను నేస్తం?" అనే గేయం కూడ చక్కగా ఉన్నది.

అభ్యుదయఘోరణిలో మాదిరాజు రంగారావుగారి "మేలుకొన్న ఆకాశం", "మనో భూమికలు" "అద్దంలో నీడలు" పేర్కొనదగినవి. తెలంగాణా పోరాటం గురించి వివరించే గీతికాసంపుటి "మిన్నేటి పొంగులు" హిరాలాల్ మోరియా కృతి ఒకటి విశిష్ట లక్షణము కలది. ఈ సంవత్సరము—రెండు కవితా సంకలనములు వచ్చినవి. వైతాళికులు, ఉదయఘంటలు తరువాత ఆ మాత్రము మంచి సంపుటులు చాలకాలంవరకు రాలేదు. ఈ రెండు పుస్తకములు ఆ కొరతను కొంతవరకు తీర్చినవేమో. మొదటిది "మణి మకుటము". విజయనగరము శోభా ప్రచురణలు ప్రకటించిన దానిలో 68 గురు ఆధునిక కవుల ఉత్తమ రచన ఉన్నవి. ఇది ప్రథమ భాగము మాత్రమే. రెండవ సంపుటిలో అత్యంతఆధునికుల రచనలు వెలువడగలవనుచున్నారు. గురజాడ మొదలు కొనకళ్లవరకు ఈ సంపుటములో భావకవితాయుగమువరకు వచ్చిన కవుల రచన లున్నవి.

మరొక సంకలనము — శ్రీ శ్రీ యుగము — దీనిని అని పెట్టి, ఆరుద్ర ప్రభృతులు సంకలనంచేసి యాభైమంది రచనలవరకు చేర్చారు. శ్రీ శ్రీ మార్కు పద్యాలందులో కనిపిస్తున్నా, కొందరిని కవితాప్రజ్ఞలేని వారిని కూడ చేర్చడంతో ఈ సంపుటం విలువ పూర్తిగా దిగజారిపోయింది. ఆధునిక రచన ఈ రీతి సాగిపోతూఉంటే, పూర్వ ప్రబంధములు కొన్నిటిని ప్రకాశకులు తెచ్చుట ముదావహము. అట్టివానిలో వేమన పద్యములు —వేదుమూరు గంగాధరముగారు సేకరించినవి—ఒక బృహత్ గ్రంథముగా ప్రకటించినారు. క్రీడాభిరామము, కాళహస్తి మాహాత్మ్యము, కళాపూర్ణోదయము, భీమేశ్వరపురాణము తిరిగి వ్యాఖ్యానములతో వెలువడినవి. ఇట్టి గ్రంథములలో ఉత్కృష్ట కావ్యము పల్నాటి వీర చరిత్ర సమగ్ర రూపము. పింగళి లక్ష్మీకాంతంగారు సంపాదించిన ఈ గ్రంథము గొప్పకృషిని వ్యక్తపరచుచున్నది. పద్యవాఙ్మయము తరువాత — సహృదయులను మెప్పించు సాహిత్యవిభాగము నాటకము. నాటకాంతే సాహిత్యమ్ అనేనానుడిపోయి నాటకముతోనే తమ వచనకవితను నేటి రచయితలు ప్రారంభిస్తున్నారు. అయినా తెలుగు నాటకరంగంలో ఉత్తమ రచనలంతగా రావడంలేదు. ఎక్కువ భాగము—ఇతర నాటకములను—ఇంగ్లీషు అమెరికన్ రష్యన్ రచయితలవి—సంగ్రహించి స్వంతంగా ప్రకటించుకొంటున్నవే—మరొకరకం నాటకాలలో కొన్ని అవినీతిని, హత్యలను, వ్యభిచారమును ఉగ్గడించు రచనలు. ఒక వ్యక్తి అపచారము చేసినందుకు విచారించడు. పశ్చాత్తాపము చెందడు. పైగా దానిని సమర్థించుకొనును. అందుకే నేటి వాస్తవిక నాటకాలలో లేచిపోవడాలు, కానీన గర్భధారణలు, సోదర సోదరీ ప్రేమకలాపాలవంటి జుగుప్స పుట్టించు సన్నివేశాలు హెచ్చుగా కన్పిస్తున్నవి. దీనికి కొంత కారణం—తమిళదేశంలో ప్రచారం పొందిన నాటకాలప్రభావం కావచ్చు. రక్తకన్నీరు—పరాశక్తివంటి రచనలు తెలుగులోనికి తెచ్చి జాతినీ, సంఘాన్నీ, సంప్రదాయాన్నీ తిట్టుచు ఉపన్యసించుట పరిపాటిఅయినది. దీనివల్ల జనం విరగబడి చూడవచ్చుకాని—ఎటువంటి భావాలు ప్రచారమవుతున్నదీ గుర్తించలేక పోతున్నారు. ఈలాంటి నాటకాలు కొందరు సినీ నటులు కూడ ఆంధ్ర దేశంలో వేస్తున్నారు. వానిలో బికారి రాముడు ఒకటి. దీనికి మాతృక బెంగాలీ నాటకం "ఉల్కా"—దానినెవరూ పైకి చెప్పక మాతృకను చిత్రవధచేసి, ఏదో ఒక వికృత రూపంతో ప్రదర్శిస్తున్నారు. ఇలాగే చరిత్ర గాథల్ని ఇష్టం వచ్చినట్లు మార్చి, 'అల్లూరి సీతారామరాజు' అనే నాటకం కొందరు ప్రదర్శించారు. వర్గభేదాలు, కులభేదాలుచూపితే రంగస్థలంమీద రక్తి కట్టునేమోకాని, వీనివలన కలిగే సాంఘిక ప్రతిఫలాలు దారుణంగా పరిణమించవచ్చును. ఈ అశాంతిలోనుండి కొందరు యువరచయితలు క్రొత్త ప్రయత్నంచేసి—జీవిత వాస్తవ చిత్రాలను చూపించడానికి మంచి నాటకాలు వ్రాస్తున్నారు.

వారిలో ఒకరు—దాసరి గోపాలకృష్ణ. ఈయన చదువుకున్న బడి జీవితం, నేర్చుకున్న పాఠాలు రంగస్థలంచూచి; సేకరించిన భాష పల్లెటూళ్ళలో ప్రజలు మాటలాడుకునేది. దాని నుండి నాటకీయతతెచ్చి రెండు నాటకాలు రచించి ప్రదర్శింపజేశాడు. వానిలో "చిల్లరకొట్టు చిట్టెమ్మ" అనే నాటకానికి తణుకులో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్తులో ప్రథమ బహుమతి వచ్చింది. ఈ సంవత్సరం ఈతడు వ్రాసిన నాటకం 'చిలకా—గోరింక' మన గ్రామ జీవితాన్ని కన్నుకు కట్టినట్లు చిత్రిస్తున్నది. మంచి హాస్యంతోను, చమత్కారంతోను నాటకీయత నెరిగి వినోదం కలిగించే నాటకాలు వ్రాయడంలో తొలిప్రయత్నంలోనే కృతకృత్యుడైన మరొక రచయిత భమిడిపాటి రాధాకృష్ణ. ఈయన రచించిన "ఇదేమిటి?", "కీర్తిశేషులు" పలు తావులలో బహుమతులందుకున్నవి. లంచగొండితనంగురించి వీరు వ్రాసిన క్రొత్త నాటకం "దైవశాసనం" ఎంతో వినోదదాయకంగా ఉన్నది. ఇటీవల చిన్ననాటికలు రచించుటలో ఆరితేరిన సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారి "కట్నంకోరని కల్యాణం" రావికొండలరావుగారి "కథ కంచికి", గొల్లపూడి మారుతిరావుగారి "పతిత", విడియాల చంద్రశేఖరరావుగారి "ఇంటిదీపం", కొండముది శ్రీ రామచంద్రమూర్తిగారి "గడ్డిపూలు" రంగస్థలంమీద రక్తి కట్టిన నాటికలు.

ఈ కాలపు పంచవర్ష ప్రణాళిక, కుటుంబ నియంత్రణ వీనిని గురించి చాల నాటికలు వస్తున్నవి. వానిని ప్రదర్శించడం కొంత కష్టమే. ఇట్టివానిలో కుటుంబ నియంత్రణగూర్చి బుచ్చిబాబు రచించిన "గాలము" కొండప్రాంతాలలో విద్యా శిక్షణగూర్చి శ్రీ వాత్సవ రచించిన "మట్టి మనుషులు" ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము స్వీకరించారు. ఈ నాటకాలన్నీ రంగస్థలప్రయోగమునకు చాల అనువైనవేకాని, సాహిత్యరీత్యా అంత గొప్ప స్థాయినందుకోలేవు. సాహిత్యం దృష్ట్యా చూడదలచుకుంటే కొన్ని ఉత్తమ రచనలు, రేడియోలో ప్రసారితమైనవి. వానిలో అత్యంత నూతనప్రయోగము శ్రీ శ్రీ రచించిన "చతురస్రం". శబ్ద చిక్కులు మాత్రం చూడటానికి వీలయిన ఈ నాటకము—శ్రీ శ్రీ లోని కవితా విపర్యయము పొందుచున్న క్రొత్తత్రోవలను చక్కగా నిరూపించినది. ఇది ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలో ప్రకటితమై, పాఠకు

అను ఆహ్లాదపరచినది. ఆర్థిక సమతను ప్రతిపాదించే సామ్యవాదములో భౌతికసమత మానసికసమానస్థితిని సాధించగలదా? అను ప్రశ్నను శ్రీ శ్రీ అద్వైతముతో పరిష్కరించినాడు. ఇంతకంటె హెచ్చుగా సాహిత్యప్రియులను ఆకర్షించిన రేడియో రూపకమాల ఆంధ్రవాఙ్మయచరిత్రనుగూర్చి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన పది నాటకములు. విజయవాడ—హైదరాబాద్ కేంద్రాలనుండి ప్రసారమైన ఈ నాటకములు శ్రోతలలోను, పాఠకులలోను అనేక వాద ప్రతివాదములు లేపినవి. ఈ కవి చెప్పినట్లు, వీనిలో వారు చేసిన ప్రయత్నము చరిత్రకారునిగా ఆ యా యుగముల చిత్రణము మాత్రమే. అందులో వారి అభిప్రాయములకు విలువలేదు. వారు మిన్న యున్నకవులు మిన్నకారు. సున్న యున్నవారు సున్న కారు. కొందరిని వారు విడిచివేసినారు. మరి కొందరిని ప్రశంస చేసినారు. అది ఆ యుగలక్షణమును చూపుటకు చేసినవికాని వ్యక్తిగతమైన అభిప్రాయ భేదములబట్టి కాదు. ఈరచనలలో నన్నయ, తిక్కన, పోతన, శ్రీనాథుడు, వీరేశలింగం, శ్రీ శ్రీ, కృష్ణశాస్త్రి వంటివారిపైన కవి తన స్వంత అభిప్రాయములను వెల్లడించినాడు. అవి కేవలము వ్యక్తిగతమైనవే. వానితో మనము ఏకీభవించకపోవచ్చును. మొత్తంమీద ఈ రూపకమాల ఆంధ్ర వాఙ్మయచరిత్రను అందముగా సింహావలోకనము చేసినది. పాటలతో, పద్యములతో. వాదప్రతివాదములతో వీనులవిందు చేసినది. ఇవి రేడియోకు—దానికున్న ధ్వనిసీమిత రంగమునకు ఉద్దేశించిన నాటకాలని జ్ఞాపకముంచుకొంటె వానిలోని రస స్ఫూర్తి మరింత చక్కగా ఆస్వాదించుకొనవచ్చు. విశ్వనాథవారి ఇతర రచనలవలెనే యివి కూడ చాల తర్జన భర్జనలకు గురి అయినవి. ఏది ఏమయినను విశ్వనాథవారి ఈ రచనలు శ్రోతలలో పాఠక లోకములో పెద్ద సంచలనము కొనితెచ్చిన మాట నిజము. ఇంక నవలలో పురాణ వైరి గ్రంథమాల పేరున రచించిన ఎనిమిది నవలలు చాలక, సముద్రపు దిబ్బ, మ్రోయు తుమ్మెద, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు—విశ్వనాథవా రిటీవల ప్రకటించారు.

శత సహస్రాధికగ్రంథరచనలో విశ్వనాథవారి కృషి దోషరహితముకాదు. అయితే వారొనరించిన కావ్య దోషములు, వాల్మీకి, కాళిదాసువంటి మహా కవులు చేసిన దోషములవంటివని వారందురు. వానినిపట్టి పరామర్శ చేయుటకు అంతటి కవి పండితులు కావలెనుకాని సామాన్యులకు సాధ్యము కాదని వారి వాదన. ఈ విషయము—శబ్ద, వాక్య సంబంధి దోషములకు వర్తించును. కాని వారి భావతత్త్వమే వాద ప్రతివాదములతో కూడుకొన్నది కదా! ఆధునికవిజ్ఞానము ప్రబలి శాస్త్రీయముగా ప్రతివిషయమును ఋజువు చేయు నేటి హేతు వాదయుగములో వారు ప్రతిపాదించుభావము లెంతవరకు నిలువ గలవు! వారు నిరూపించువిధానము ఎంతవరకు నేటి పరిస్థితులకు అనుకూలించును? సాహిత్యప్రమాణములబట్టి పరీక్షచేసినచో వారి కృషి యెంతవరకు ఉత్తమ స్థాయికి చెందగలదు? ఇట్టివి పరిశీలించవలెను. యుక్తి యుక్తముగా వారి వాదముల నెదురుకొనవలయును. అదీ విమర్శ! ఉదాహరణకు, వారికి పురాతన వ్యవస్థయన్న అభిమానము. అందులోని కులశాఖా విభేదములు ఎంత నవ నాగరికత మీరినను పోవునవి కావని వారి విశ్వాసము! మన సంఘము ఇంతగా చెడిపోవుటకు కారణము ఇంగ్లీషు ప్రభావమని వారి నమ్మకము. మారిపోయిన విలువలు, జారిపోయిన లక్ష్యాలు, విప్లవము చెందుచున్న సమాజ వ్యవస్థ వారికి అధోగతికి త్రోవలుగా కనిపించును. ఈ వాదమును ప్రచారము చేయుటకు వారు చరిత్రను కాదందురు. భాషా శాస్త్రమువంటివి లేవందురు. హేతువాదమును త్రోసి పుత్తురు. విజ్ఞానశాస్త్రమును వెర్రి తలయందురు. దీనిని సమర్థించుటకు నవలలు వ్రాయుదురు. నాటకములు కూర్చెదరు. కవిత్వము చెప్పెదరు. కావ్యము లల్లెదరు. వానిలోవారొక విలక్షణమైన తెలుగుశైలి వాడెదరు. విచిత్రమైన వాక్య రచన చేయుదురు. దానిని—ఏ మారుపేరులో మరుగు పరచినా, ఏ నవలలో గుప్తపరచినా వారిని ఇట్టే పట్టివేయగల సమీక్షకులు తెలుగు పాఠకులలో కలరు. వారిమీద అభిమానముతో ఈ రహస్యము తెలిపి కూడ, వారు వహించిన ప్రచ్ఛన్న రూపములను బయట పెట్టరు. ఏ పేరుతో వ్రాసినను ఆదరింతురు. అంతేకాదు. వారు రచించిన నవలలో పాత్రలు వాస్తవముకాకపోయినను, ఎవరో యథార్థ వ్యక్తులనుచూచి వ్యంగ్యముగా రూపొందించినను, ఆ వ్యక్తులను గుర్తు పట్టగలరు. ఈ వాస్తవ చిత్రణలో కొందరిపైన రచయిత తన వ్యగ్రతను తీర్చుకొన్నట్లు కనిపించును. సామాన్య మానవ స్వభావమునకు విరుద్ధమైన ప్రవర్తనలో ఈ పాత్రలు ప్రవేశించును. నీతియును హద్దుమీరి నడుచుకొనును. అంతటితో ఆగక, ఆ యనీతిని సమర్థించుట యెడ నెడ కనిపించును. కవి, వేత్త అయిన రచయిత—సంఘములోని కుసంస్కృతి చూపవచ్చును. కాని దానిని సమర్థించుట—ఏ సహృదయులు క్షమించరాని అకృత్యము.

నేడు మన సాహిత్యములో "చెడును" ఆకర్షవంతముగా చిత్రించుట బాహాటముగా జరుగుచున్నది. స్త్రీ పాత్ర లన్నియు—పతితలే. లేచిపోయినవారే. భర్తను విడిచి వేరువారలతో విచ్చలవిడిగా అభిసరించినవారే—కొందరు వరుస వావి తప్పి, వయసుమీరి ప్రవర్తించువారు. సమకాలిక జీవనమూ ఇంత నీచముగానున్న కారణముచేత ఇట్టి రచనలు వస్తున్నవని సమర్థింతురేమో! సాహిత్య స్రష్ట మురికి కూపముల చిత్రించవచ్చును. కాని దాని ప్రక్కనే ముముక్షుమార్గము కూడ చూడగలడు. మనుష్యునిలోని పశుప్రవృత్తి చూపినపుడు, వానిలోని దైవశక్తి కూడ వీక్షించగలడు. నేటి పాశ్చాత్యలోకంలో—మానవునిలో దానవత, సెక్సులోని విపరీత వాంఛలు చూడడం పరిపాటి. వానిని, ఉన్న దున్నట్లు మన సంఘంలోకి దిగుమతి చేయడం—మన సంప్రదాయంకాదు. ఇంతకీ మన రచయితలు—ఎదురుగా కనిపిస్తున్న లోకాన్ని చూడలేకపోతున్నారు. ఎక్కడో జీన్‌పాల్‌సార్త్రే, ఆల్బెర్ట్ మొరావియా, డోస్టొవస్కీ—ఇటువంటి యూరపియన్ రచయితల భావాలు ఎరువు తీసికొంటున్నారు. పరకాయప్రవేశం చేస్తున్నారు. దొంగ రచనలు ఎంగిలి మెతుకులు. ఇవి అందకపోతే ఎవరో వ్యక్తిమీద కవి

తీర్చుకొనే రీతిలో వికృతమైన పాత్రలను సృష్టిచేసి వినోదింపడం. ఇట్టి ధోరణి అధమాధమ పద్ధతి. ఇది యెంత త్వరగా ఆపితే అంత మంచిది. తెనుగులో నవలలు లేవని ఒక వాదు ఉండేది. క్రమేపీ అది పోయింది. హెచ్చు నవలలు వస్తున్నవి. 1961 లో కనీసం నూరు క్రొత్త నవల లయినా వచ్చిఉంటాయి. దీనికి కారణం వివిధపత్రికలలో వారం వారం ప్రకటించే సీరియల్స్, వాటి నిమిత్తం పెట్టిన పోటీలు కావచ్చు. ఈ సంవత్సరం యెన్నిక చేసిన పోటీ నవలలు, సీరియల్ నవలలు పరిశీలించిచూస్తే—అన్ని పాత్రలు కాలుజారి బాట తప్పినవే. వారికి నిష్కృతిలేదు. అనుతాపంలేదు. చివరికి ఒకటి రెండు నవలల్లో ఆ పాత్రలు ఏ ఆశ్రమంలోనో ఉపదేశంపొంది, ఏ వెంకటేశ్వరస్వామిముందో మోకరిల్లితే అంతకుముందు చేసిన సర్వ పాపాలు పరిహారమైనట్లు భావిస్తారు. ఇలాంటి చెడు నడతల సీరియల్ కథలు లక్షలకొద్దీ పాఠకులకైన చాల దారుణమైన దుష్ఫలితాలు తేవచ్చు. వీనిని గురించి తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిక చేయవలసియున్నది. ఇట్టికలగూరగంపలో — ఒక్కొక్కసారి మంచిరచనలు లేకపోలేదు. ఉదాహరణకు ఆంధ్ర వార పత్రికలో వచ్చిన "ధ్రువతార" అనే నవల ఒక బడిపంతులు జీవితంలో ప్రవేశించిన అనాథ శిశువును గూర్చి, వివరిస్తూ—యీ చిన్ని సంఘటన వెనుక జరిగిన ఉదంతాలను, ప్రవర్తిల్లిన పాత్రలను ఎంతో ఉదాత్తంగా చిత్రించినది. ఇది రచించిన పెద్దిభొట్ల సుబ్బరామయ్య మంచి రచన చేశారు. ఈ రకం నవలే—"మా ఘంటం"—పుల్లాభొట్ల వేంకటేశ్వర్లుగారు రచించినది—నిజమైన స్నేహానికి కుల, జాతి భేదాలు అడ్డురావని నిరూపించినది. గత శతాబ్దిలో ఒక మారుమూల సముద్రతీరగ్రామంలో జరిగిన కథ, ఎంతో కరుణారసపూరితమై యథార్థమును కన్నులకు కట్టినట్లు చూపినది. చరిత్ర, కథలు, నవలలుగా చేయుటలో కవుల జీవితాలకు కల్పన జోడుచేసి నోరి నరసింహశాస్త్రిగారు కవిత్రయముమీద మూడు నవలలు రచించారు. ఈసారి శ్రీనాథుని మీద కవి సార్వభౌముడు అనే నవల ప్రారంభం చేశారు. దీనిలోనైనా చారిత్రక విషయాల సత్యానికి విరుద్ధమైన సన్నివేశాలు జొప్పించకుండా ఉండగలిగితే వీరి కృషి ప్రశంసాపాత్రమవుతుందేమో! అలాగ చరిత్రకు—కథకు—నాటి జీవితానికీ తేడా లేకుండ రచించిన నవల—"ప్రతాపరుద్రమదేవి". కాకతీయులనాటి ఆచార వ్యవహారములను, తెలుగు దేశ స్థితి గతులను చక్కని శైలిలో చిత్రించిన ఈ నవల 30 యేండ్ల క్రితమే కాళ్లకూరి నారాయణరావుగారు రచించి కీర్తిశేషులయ్యారు. అప్పటినుండి అసంపూర్తిగానే ఉండిపోయింది. దీనిని పూర్తి చేయించి గ్రంథముగా ఒక ప్రకాశక సంస్థ ప్రకటించారు. కథా సంవిధానములో పాత్ర చిత్రణములో, సమకాలీన జీవిత నిర్వచనములో ఈ నవల ఉత్తమస్థాయినందుకొన్నది. ఎంతసేపు ప్రేమకథలు, మధ్య తరగతి కుటుంబాల కథలతో విసిగిపోయిన పాఠకులకు, విశాఖజిల్లాలోని ఒక సన్నకారు కుటుంబాన్ని పరిచయం చేస్తూ, బలివాడ కాంతారావుగారు రచించిన "దగా పడిన తమ్ముడు"—ఆంధ్ర వార పత్రికలో ప్రకటితమైనదే—పుస్తక రూపంలో వచ్చినది. అలాగే—పోతుకూచి సాంబశివరావుగారి 'అన్వేషణ' పుస్తక రూపం దాల్చింది. తెలంగాణా జీవితాన్ని పరిచయంచేస్తూ రచించిన "క్రొత్త పంట", మధ్య తరగతి కుటుంబములో సాంఘిక సూత్రముల మార్పును సూచించే "కత్తుల వంతెన"—శ్రీ మహీధర రామమోహనరావు రచించినది—పాము నిచ్చెన అనుపేరుతో విద్యార్థి జీవితాన్ని చిత్రించే నవల—గంగినేని వేంకటేశ్వరరావు రచించినది—క్రొత్త సమస్యలతో మెదడుకు ఆలోచన కల్పిస్తున్నవి. పత్రికల పోటీలలో నెగ్గిన ఇవి—మరికొన్ని నేటి సంఘంలోని అవ్యవస్థ చిత్రిస్తున్నవి. యువకలోకంలోని అస్థిరతను చూడడానికి యువకులు రచించిన నవలలు, కొన్ని తోడ్పడుచున్నవి. ఇట్టివానిలో-నాగరాజు రచించిన రజనీప్రియ, గోపీచంద్ మెఱుపుల మరకలు, కొంకలూరి ఈనక్ అనాథ, గొల్లపూడి మారుతిరావు 'చీకటిలో చీలికలు' పేర్కొనవచ్చును. గోపీచంద్ ఇంకా చాలా నవలలు వ్రాసి—విషయములో పాత్రలలో వైవిధ్యము చూపినారు. కాని భావవైఖరిలో పరిణతబుద్ధి లేదనడానికి వారి 'గడియపడని తలుపులు', 'పిల్ల తెమ్మెర', 'పరమేశ్వర శాస్త్రి వీలునామా', 'చీకటి గదులు' చదివిన విచక్షణశీలురందురు. మానవ సహజమైన దుర్బలతలు చిత్రిస్తూ, దానితో అరవిందుని వేదాంత తత్త్వము వంటివి కలుపుట, భావనలోని అస్పష్టతకు, అనిశ్చలతకు తార్కాణమనిపించును. నవలలు రచించుట నల్లేరు మీద బండిగా సాగించే కొడవటిగంటి కుటుంబరావుగారు మూడు నాలుగు పెద్ద కథలు వ్రాశారు. వీనిలో "గడ్డురోజులు", "క్రొత్త కోడలు" నవలలో వారు చేసిన పాత్ర సృష్టి, నడిపిన సంభాషణల చమత్కృతి, సాంసారికముగా స్వాభావికముగాఉండి పాఠకుల దృష్టి నాకర్షించినవి. నేటి—సమాజంలో అరాజకత గుర్తించి దానిని చూచి పలాయనము చిత్తగించకుండా, ఆ నడతలు పరిస్థితుల ప్రభావంచేత వచ్చినవని చెప్పే రచనలు భాస్కరభట్ల కృష్ణారావుగారి "వెల్లువలో పూచిక పుల్లలు" రంధి సోమరాజుగారి "సౌందర్యమూ—సౌశీల్యము". రాజమహేంద్రవరములోని వాస్తవదృశ్యాలు చిత్రించడంలో సోమరాజుగారు అద్భుత శైలి ప్రదర్శించారు. నేటి నవలా కర్తలు కాని, కథకులు కాని, తెనుగుదేశంలో నగరాలు, భారత దేశంలో దృశ్యాల వర్ణించేటప్పుడు యథార్థాన్ని చూడరు. రాజమహేంద్రవరంలో-మెడికల్ కాలేజీ పెట్టించిన ప్రబుద్ధులు, బెజవాడలో బీచీ షికార్లు చేయించిన రచయితలు, మద్రాసులో పర్వతములు మొలిపించిన మే ధా వు లు లేకపోలేదు. కాని యివన్నీ అచ్చయిపోతున్నవి. కొన్నింటిలో 'సెక్సు' వర్ణనలు, అవినీతి ప్రవర్తనలు ఎక్కువ ఉండటంచేత అపరిణత బుద్ధుల్ని ఆకర్షించి వేలకొలది పాఠకుల్ని భ్రమింప జేస్తున్నవి. అట్టి వాని ప్రసక్తి ఈ సాహిత్య సమీక్షలో అప్రస్తుతము. కథానికా రచనలో పలువురు క్రొత్తరచయితలువచ్చి క్రొత్త రచనలు గావించి పాఠకులను ఆహ్లాద పరుస్తున్నారు. కారణం—కథలకు నేడు పత్రికలలోగల గిరాకీయే. వచ్చినవి చాలక, పలు పత్రికలు పోటీలు పెట్టి బహుమతులిచ్చి కథకులను ప్రోత్సహిస్తున్నవి.

వీనిలో ఈ సంవత్సరము స్త్రీల రచనలు వెలుగులోనికి వచ్చినవి. శ్రీమతి జె. సుబ్బులక్ష్మి రచించిన కథలకు రెండు పోటీలలో ప్రథమబహుమతులు లభించినవి. ఈ రెండు కథలలోను ఆమె స్త్రీ మనః ప్రవృత్తిని అతి సుకుమారంగా చిత్రించినది. "మాతృప్రేమ" అను కథలో—ఒక పేదకుటుంబములో అయిదుగురు పిల్లల తల్లి, బిడ్డలను పోషించలేక, ఒక బిడ్డను పెంపకం ఇవ్వాలని తలచి—ఆ పిల్లలనే అడుగుతుంది. అపుడా పిల్లలిచ్చిన జవాబులు ఎటువంటివారి మనస్సునైనా ఇట్టే కరగిస్తాయి. ఇలాంటికథ లెన్నో వస్తున్నవి. "కృష్ణవేణి" నవల రచించి, ప్రసిద్ధురాలయిన ముప్పాళ్ల రంగనాయకమ్మగారి 'అండాలమ్మ' కథ, ఒక విచిత్ర పాత్రను పరిచయం చేయడంలో ఎంతో సొగసుగా కుదిరింది. స్త్రీలలో యద్దనపూడి సులోచనాదేవి "వాచస్పత్రి", కె. వి. యస్. అచ్యుతవల్లి, మునిపల్లె సరోజినీదేవి, తురగా జానకిరాణి కొన్ని మంచి కథలు ప్రకటించారు. వీరుగాక ఆచంట శారదాదేవి కథలు "పగడాలు" అను పేరున సంపుటిగా వెలువడినవి. రమాదేవి కథలు, "ఆ తండ్రికి తగిన కొడుకు కాదు" మొదలయినవి ఏదోఒక సందేశాన్ని చెప్తున్నవి. యస్. సుబ్బలక్ష్మి కథలు "కాపురం" మొదలయినవి నేటి సాంఘిక జీవనాన్ని స్త్రీ దృక్పథంతో చూపిస్తున్నవి. కథానికలు పత్రికలలో వెలువడటమే కాక—ప్రత్యేక సంకలనములుగా కూడ వస్తున్నవి. వీనిలో దక్షిణ భాషా పుస్తక సంస్థవారు ప్రకటించిన రెండు సంపుటములు, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్‌వారి ఒక సంపుటి, ప్రత్యూష ప్రచురణలవారి సంకలనము పేర్కొనదగినవి. కొన్ని తెలుగుకథలు ఆంగ్లంలో అనువాదంచేసి ప్రసిద్ధ సచిత్ర వార పత్రికలలో ప్రకటించడంచేత—మంచి ప్రచారం పొందినవి. వీనిలో—యస్. యమ్. వై. శాస్త్రి, బుచ్చిబాబు, కుటుంబరావు ప్రభృతుల కథలు ఆంధ్రేతరపాఠకుల్ని సైతం ఆకర్షించాయి. తెనుగుకథల సంపుటులు "ఆటకే ఆనూ" "తెలుగుకే ఉత్కృష్ట కహానియా" అను పేరులతో హిందీలో బాలశౌరిరెడ్డిగారు ప్రకటించినవి—మంచి ప్రచారముపొందినవి. తెలుగు సంకలనగ్రంథాలలో—సి. రామచంద్రరావు, ముళ్లపూడి వేంకట రమణ, పూసపాటి కృష్ణంరాజు మొదలయిన వారి కథలు క్రొత్త పాత్రలను, క్రొత్త జీవితాలను పరిచయం చేస్తున్నవి. ఇటీవల రచనలు చేస్తున్న కథకులలో మధురాంతకం రాజారాం, వాణీకుమార్, కలువకొలను సదానంద, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, కొండముది హనుమంతరావు, ఆకొండి నారాయణమూర్తి, సింగరాజు రామచంద్రమూర్తి మొదలైనవారు క్రొత్త ప్రయోగాలుచేసి శైలిలో, భావనలో, కథా సరళిలో క్రొత్త పంథాలు త్రొక్కుతున్నారు. హాస్యానికి ఏన్యం అయిపోయిన తెనుగు సాహిత్యవీధిలో ముళ్లపూడి వేంకట రమణ తర్వాత— కలువకొలను సదానంద, పూసపాటి కృష్ణంరాజు నూతన చమత్కృతులతో చదువరులకు గిలిగింతలు పెడుతున్నారు. కథానికాక్షేత్రంలోమాత్రం—తెనుగు రచయితలు ఫలవంతమైన సస్యములు ప్రోది చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ అను పేరున ప్రకటించు ప్రచార పత్రికను—సాహిత్య సంచికగా చేయదలచి పద్యములు, గద్యములు, వ్యాసములే గాక, పుస్తక సమీక్షలు, విమర్శలు గూడా ప్రకటిస్తున్నారు. కాని పాడిపంటలతోపాటు బ్లాక్ డెవలప్‌మెంటు వార్తలు, వ్యవసాయవిశేషాలు, మంత్రుల కార్యకలాపాల ఛాయాచిత్రాలతో నిండిన యీ పత్రిక, ఎంత ఆర్టుపేపరు మీద వేసి, ఎంత ఉదారంగా ప్రకటించినా, సాహిత్యస్థాయిని అందుకొనగలదనుకొనడం మృగతృష్ణలో తృష్ణతీర్చుకోవడం వంటిదేమో! ఈ పత్రిక అటు ప్రచార లక్ష్యమూ సాధించలేక, ఇటు సాహిత్యస్థాయినీ పొందలేక రెంటికి చెడినరేవడయ్యె 'త్రిశంకుస్వర్గంలో' ఉన్నది. ఆంధ్రప్రభుత్వము అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను గూడా వ్రాయించి ప్రకటించారు. అది సాహిత్య దృష్టితోచూస్తే విలువను పొందలేదు. విజ్ఞానవ్యాసరచన అంత విశేషంగా వికాసం పొందని తెనుగు సాహిత్యంలో—వ్యక్తుల జీవితాలను గూర్చిన రేఖా చిత్రాలు రావడం అపూర్వమే. తెలుగు వెలుగులు అను పేరున ఆంధ్ర వారపత్రికలో సంవత్సరంపైగా వెలువడి పాఠకలోకాన్ని విశేషంగా ఆకర్షించాయి. ఈ తెలుగు వెలుగుల వ్యాసావళి వాస్తవ చిత్రణతోపాటు, ఉన్నసత్యాన్ని నిర్మొహమాటంగా చెప్పుతూ, శైలిలో, భాషలో, సాధించిన క్లుప్తీకరణ, వ్యంగ్యధోరణి, వాక్యపటుత్వము, అనన్యసాధ్యమైనవి, అపూర్వమైనవిన్నీ. ఈ తీరున మరొక వ్యాసం వ్రాయవలసిందని ఒక పోటీ పెట్టితే, ఈ రేఖా చిత్రాలతో తులతూగగల్గిన శబ్దచిత్రం ఒక్కటి కూడ ఎవ్వరూ రచించలేకపోయారు. ఈ వ్యాసములన్నీ గ్రంథ రూపంలో ప్రకటిస్తే తెలుగు సాహిత్యానికి అమూల్యాలంకారంగా అలరారగలవు. విజ్ఞానశాస్త్రవిషయములలో చాలినన్ని గ్రంథములు లేవు. వచ్చినవానిలో విస్సా అప్పారావుగారి "ఆకాశం", గాలి బాల సుందరంగారి "మన దేహము—దేహారోగ్యము" ప్రత్యేకముగా పేర్కొనదగినవి. లేఖలు, చలంగారివి,రెండుమూడు పుస్తకములుగా వచ్చినవి. దువ్వూరి రామిరెడ్డిగారి ఉత్తరములు డైరీ కలిపి—కె. వి. రమణారెడ్డిగారు క్రోడీకరించి—"డైరీ—ఉత్తరాలు" అనుపేరున గ్రంథము ప్రకటించినారు.గురజాడ శతవార్షికజయంతిసందర్భంలో వారి డైరీలు తిరిగి వెలువడినవి. తెలుగుభాషలోకాని, సారస్వతములో గాని పరిశోధన అంతగా లేదను వాదు పోవునట్లు, ఇపుడు డాక్టరేట్లు అడిగినదే తడవుగా అధికముగా లభించుచున్నవి. ఈ సంవత్సరము కేతవరపు రామకోటిశాస్త్రిగారికి "తిక్కన కవిత్వము" మీద పరిశోధనకు, నండూరి కృష్ణమాచార్యులుగారికి అదే విషయముమీద పరిశోధనకు, డాక్టర్ పి. యస్. ఆర్. అప్పారావు గారికి—నాటకముల పుట్టుపూర్వోత్తరాలమీద పరిశోధనకు, డాక్టరేట్లు లభించినవి. ఇదివరకే డాక్టరేటుపొంది ఢిల్లీలో ద్రావిడ భాషావాఙ్మయ పీఠములో పని చేసిన డాక్టరు కొత్తపల్లి వీరభద్రరావుగారు అమెరికాలోని ఒక విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా పని చేయడానికి వెళ్లారు. వారి పరిశోధన "ఆంధ్ర సాహిత్యంమీద ఆంగ్ల భాషాప్రభావం" గ్రంథంగా వెలువడింది. అలాగే డాక్టరు దివాకర్ల వేంకటావధానిగారి ప్రాజ్ఞన్నయ్య యుగము గురించిన పరిశోధనల వ్యాసము, యస్వీ జోగారావుగారి యక్షగానములనుగూర్చినది గ్రంథములుగా వెలువడినవి.

భాషా శాస్త్రములో పరిశోధనలు చేసినందుకు డాక్టర్ కె. మహాదేవశాస్త్రిగారికి కలకత్తా విశ్వ విద్యాలయంవారి డిలిట్ లభించినది. 'కొండు' భాష గూర్చి కృషి చేసిన—డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారి పరిశోధనలు ఖండాంతరములలో పండితుల మన్ననలందుకొన్నవి. ఇవి యిట్లుండగా తెలుగు భాషా సమితి, సాహిత్య అకాడమీవంటి సంస్థలు, విజ్ఞాన సర్వస్వములు, సామెతలు, నన్నయ పదకోశము, పదబంధ పారిజాతమువంటి గ్రంథములు ప్రకటించుచున్నవి. ఆయ్యదేవర కాళేశ్వరరావుగారి యాజమాన్యమున పారిభాషిక నిఘంటువు ఒకటి తయారగుచున్నది. వారే స్థాపించిన చరిత్ర-శాస్త్రము గురించిన తెలుగు-ఉరుదూ అకాడమీ తరఫున కొన్ని మంచి పుస్తకములు—చైనా, అమెరికా, ఈజిప్టు గురించినవి-శాస్త్ర విషయములు గురించినవి వెలువడినవి. దక్షిణ భాషా ప్రచురణ సంస్థ తరఫున ఆంధ్ర వాఙ్మయ చరిత్ర ఒకటి, దక్షిణ దేశ చరిత్ర ఒకటి వెలువడినవి. ప్రదేశ్ అకాడమీ ఈ సంవత్సరము జరిపిన పోటీలలో—డాక్టరు గిడుగు వేంకట సీతాపతి గారి "ఆంధ్ర ఛందోరీతు"లకు, సుబ్రహ్మణ్యంగారి "వీర రసము" నకు బహుమతులు లభించినవి. సీతాపతిగారు ఛందస్సుగూర్చి గొప్పగా తెలిసినవారై—1920, 1927, 1930, 1936- ఈ సంవత్సరాలలో వ్యాసములుగా, పుస్తక పీఠికలుగా రచించిన వానినే సంగ్రహించి ఈ పుస్తకముగా తెచ్చినారు. అందుచేత ఆంధ్ర ఛందోరీతులు పరిణామము చరిత్రరీత్యా ఎట్లు జరిగినదీ తెలుసుకొన గోరువారికిగాని, తెలుగు ఛందస్సులోని తీరు తెన్నుల సమగ్ర వివరణము తెలియగోరువారికిగాని ఈ గ్రంథము తృప్తినీయదు. పైగా కన్నడము, తమిళము, వీనిలో ఛందోరీతులనుగూర్చి వీరు చేసిన మాత్రీకరణములు ఆ యా భాషల పరిణామము అంతరార్థము తెలిసిన వారామోదించలేరు. 1933-లో గిడుగు రామమూర్తిగారి సప్తతి సంచికలో డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు ప్రాకృత సంస్కృత ఛందస్సుల యందలి అక్షర—మాత్రా విభేదము లను చూపుచు, లెక్కలతో తెలిపిన అంశములు యథాతథముగా ఈ గ్రంథములో స్వీకరించి, కృతజ్ఞత తెలుపకపోవుట ఆశ్చర్యము గొల్పును. ఇంత వ్రాసి—పద్యమునకు, గేయమునకుగల భేదముకాని, తెలుగులోని యతిప్రాసల విశిష్టతగాని సమగ్రముగా ఈ గ్రంథములో చర్చించలేదు. దీనికితోడు ఈ పుస్తకమునకు—సూర్యుని దివిటీతో చూపినట్లు—ఒక యువక ఛందోవేది రచించిన పీఠికలో ఆంధ్ర దేశములో ఛందస్సు తెలిసిన పండితులు తాము మాత్రమే యని చెప్పుకొనుట ఈ గ్రంథ ప్రశస్తిని ఉగ్గడించేది మాత్రంకాదు. సాహిత్యవిమర్శలలో అల్లసాని వారి అల్లికగూర్చి విశ్వనాథవారి వ్యాసావళి, సాహిత్య—మరమరాలని తాపీ ధర్మారావుగారి వ్యాసములు ఆలోచన పురికొల్పు రచనలు.

1961 లో చాల—సాహిత్య చర్చలు భాషా వివాదాలు జరిగాయి. ముఖ్యంగా రామాయణ కల్పవృక్షంలోని భాషా ప్రయోగాలుగూర్చి—వానిని తిరిగి యిచ్చట ప్రసక్తిలోనికి తెచ్చి—చర్విత చర్వణము చేయదలచలేదు. ఇది— భాషా చర్చలోనుండి కుల శాఖావివక్షతలోనికీ, అప్రస్తుత ప్రశంసలోనికి దిగి—వేల విడిచిన సాముగా మారిన మాట నిజము. అందుకే ఇది కొనసాగించిన "ఆంధ్ర పత్రిక"వారు దీనికి అంతటితో స్వస్తి చెప్పారు. సాహిత్య చర్చ ఏ రీతిలో సాగవలసినదీ—నిరూపించిన మరొక చర్చ 'భారతి'లో వచ్చినది. భారతములోని కొన్ని పాఠముల గూర్చి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు ప్రారంభం చేసిన ఆలోచన—"ధనంజయప్రవరకరమ్ము—బలియుడు వీనిన్" అను ప్రయోగములను వారు సమర్థిస్తూ, యుక్తియుక్తముగా తమ వాదాన్ని ప్రతిపాదించారు. దానిపైన—దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు, ధూళిపాళ శ్రీరామమూర్తిగారు తమకు తోచిన ప్రతివాదములు చూపినారు. అవన్నీ పరిశీలించి—శ్రీ అనంతకృష్ణశర్మగారు ఎంతో సౌహార్దముతో చర్చించినారు.సాహితీహితమైన యిట్టి చర్చలలో, వారన్నట్లు మన్నించటకు విషయమేలేదు. "ఇట్టి చర్చలు కేవల విషయ శ్రద్ధచే వ్యక్తిని మరచి—చేయవలసినవి". ఈ స్థాయిలో జరిగిన సాహిత్య చర్చలు అర్థవంతమగును. ప్రయోజనకారులగును. పాశ్చాత్య రచయితలైన జీన్‌పాల్‌సార్త్రే, సోమర్‌సెట్‌మాఘమ్‌వంటి వారిని పరిచయం చేసిన కొండముది శ్రీరామచంద్రమూర్తిగారి వ్యాస పరంపర మంచి విమర్శకు నిదర్శనములు.

1961 సాహిత్య సింహావలోకనములో—తెలుగుసీమలో ప్రవర్తిల్లిన వైఖరులు వైభవములు స్థాలీపులాకముగా స్పృశించుట జరిగినది. దీనివలన—సామాన్య పాఠకులకు నేటి సాహిత్యమును గూర్చిన జిజ్ఞాస—ఉత్తమ గ్రంథములు చదువవలెనను కుతూహలము కలిగిన చాలును. ఈ సమీక్షలో కొన్ని ధోరణుల గూర్చి, కొన్ని తప్పు త్రోవలగూర్చి తీవ్రముగా విమర్శ చేసినచో, అది వ్యక్తిగత రాగ ద్వేషములతో చేసినదిగాకాక, ఉత్తమ ప్రమాణములు ఉన్నత లక్ష్యములు ఉద్ధరించాలనే సంకల్పముతో చేసిన సదసద్ వివేచన గానే సహృదయ పాఠకులు, రచయితలు స్వీకరింతురని మా నమ్మకము. ఆధునికాంధ్ర సాహిత్య స్రవంతి విర్గమించుచున్న వినర్గస్వరూపము అత్యంత స్ఫుటముగా పరిచయము చేయుటయే ఈ సమాలోచనలో మా సంకల్పము. ఆ సంకల్పము నెరవేరినచో ఈ సింహావలోకనము సార్థకమైనట్లే!!

శివానందలహరి

శ్రీ ముదిగొండ నాగవీరయ్యశాస్త్రి

ఘనమీశా! భవదంఘ్రిపద్మమున యుష్మత్సన్నుతిన్ వాక్కు పూ
జనముం దీకరమున్ గథాశ్రవణనిష్ఠన్ వీనులున్ ధ్యానమం
దున చేతస్స్మృతి నేత్రయుగ్మము భవన్మూర్తి శ్రీప్రకాశావలో
కనమం దుండుత మెట్టిసాధనములన్ గాంతున్ బరగ్రంథముల్.

అలశుక్తిన్ రజతాత్మ మవ్విధము కాచాశ్మంబునన్ రత్నపుం
దలఁ పెంతేనియు నెండమావులను బాధఃపేత పైత్యోదకం
బుల దుగ్ధాశయ మెట్టులో యటులె నిన్ బోవీడి దేవభ్రమన్
గొలుచున్ బాలిశుఁ డన్యునిన్ బశుపతీ! గోత్రేశపుత్రీపతీ!

లోకాసీటితటాకమందు మనుజాలోకాతిరిక్తాటవీ
జాతంబందు మహాద్రికందరమునన్ శశ్వత్ప్రసూనార్థమై
బ్రీతిన్ దిర్గుచునుండు నీ చపలుఁ డేవేళన్ భవత్పూజకై
చేతఃపద్మము నొక్కటేఁ దలఁపఁ డేచిత్రంబొ గౌరీశ్వరా!

నరసురగోవిహంగమృగనాగవనాచరకీటకాదివి
స్తరజను లెన్ని యేర్పడిన దాన నొకింత గొరంత లే దికన్
హర! భవదీయపద్మరుహస్మరణామృతసారనిర్ఝరీ
నిరతవిహారతత్పరవినిశ్చితచేత మొసంగితేనియున్

వటువైనన్ గృహియైననున్ యతియునై వర్తించినన్ బ్రస్ఫుర
జ్జటియైనన్ మతివేఱొకండయిననున్ జర్చింపగాఁ నేల? లం
పటమా నెవ్వనిచిత్త మీశ్వర! భవత్పాదారవిందార్చ నీ
వెటులేన్ వానిని మెచ్చి సద్భవధరం బింకింతువో శంకరా!

గుహనో గృహంబునందో యొకగొప్పధరాధరశృంగమందో నే
గహనమునందో యుగ్నలనో కాండమునందో వసింప నేమగున్
రహిని యదంతరంగము విరాజిలునో భవదంఘ్రిసంతతం
బహిధర! యోగ మద్ది యతఁడా ఘనయోగియు సౌఖ్యశాలియున్

ప్రభువై యొప్పిననీవు దీనజనతాబంధుండ వేనో యికన్
విభు! దీనప్రముఖుండ నిర్వర కటుల్ పెంపొందె బాంధవ్య మీ
యుభయంబున్ బరికించి నా యఘచయం బూడించి పాలింపుమా!
యభవా! బాంధవపంథ నారయుము! నీ వత్యంత యత్నంబునన్.

సుకృత ప్రాప్తఫలంబుచేతనో భవచ్ఛుంభత్కృపాంబ్ధినో
యకలంకాత్మక! నన్నిధానమిడినన్ బ్రాప్తించు నే నాకుఁ దా
వక పాదాబ్జసమీక్ష యడ్డమగు నీ వందారు బృందారక
ప్రకరం బాత్మసువర్ణరత్నవిసరభ్రాజత్కిరీటంబులన్

నీ వొకఁడే జగంబులకు నేరిమి భూరిఫలప్రదాత వీ
దేవత లచ్యుతాదు లిఁక దివ్యపదంబుల నొందియున్ భవ
త్సేవనొనర్తు రెంతవరశీలుఁడ వాక్కొ మదాశ మెంతదో
భావనచేసి నీయురుకృపన్ నను బ్రోచుట యెప్పుడో శివా!

దుష్టాశావితతంబు దుర్విభుగృహస్తోమానుయానంబు భూ
యిష్ఠాంహోనిలయంబు దుఃఖకరమౌ నీసంసృతిన్ గుందునా
కష్టంబున్ దొలఁగింపవేమి యజునిన్ గారాబు సేయంగ నీ
కిష్టంబేనియుఁ జెప్పు ధన్యులము మే మిట్లైనియున్ శంకరా!

శివ! లోభాదికదోషసంహతిని నే శ్రీమన్నివేశంబులన్
ద్రవిణంబున్ హరియింపఁగాఁ దిరుగుదున్ దండ్రీ! యెటుల్ సైతు నీ
యవివేకాయత చిత్త తస్కరుని నీ వాయత్తునిన్ జేసి నీ
దువిధేయున్ నను సాకు తస్కరపతీ! దుర్వారకారుణ్యతన్.

విశ్వనాథ-ప్రయోగ వైలక్షణ్య సమీక్ష

శ్రీ రావూరి దొరసామిశర్మ

కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ కల్పవృక్షమును విమర్శించి పండిత శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరిగారు కొన్నివ్యాసములు భారతిలోఁ బ్రకటించిరి. అందు 1961 సెప్టెంబరు సంచికలో 'ప్రయోగ వైలక్షణ్య' మను శీర్షికతో ఛందోవ్యాకరణాది లక్షణదోషములను లెక్కించి చూపిరి.

అక్టోబరు నెలలో విశ్వనాథవారు చెన్నపురి ఆంధ్రమహాసభలోఁ దనకు జరిగిన సన్మానసందర్భమున నీ విమర్శను గూర్చి ప్రస్తావించుటచే నాటినుండి నేటి వఱకుఁ గల్పవృక్ష ప్రయోగ విషయికముగ సాహిత్యచర్చ జరుగుచున్నది. ఇంత వఱకు నేను గల్పవృక్షమును జూచినది లేదు. ఈ చర్చలఁ జూచినతర్వాత ఆ కల్పవృక్షభాగములఁ దెప్పించి పరిశీలించితి. శ్రీ కొత్తవారు చెప్పెడు విశ్వనాథకృతదోషముల తత్త్వ మెట్టిదో పరికించితి.

ఇద్దఱు సత్యనారాయణగార్లు గొప్ప పండితులు, కవులు. వీ రిద్దఱి రచనలఁ జదువకున్నను వీరి పాండిత్యప్రతిభా ప్రాభవములు గూర్చి నాకు విదితచరము. ప్రస్తుతము భారతిలోని ప్రయోగ వైలక్షణ్య వ్యాసమందలి ఛందో లక్షణవిశేషములంగూర్చి నా యెఱింగిన విషయముల విస్పష్టముగఁ దెలుపదలఁచి యీ సమీక్ష వ్రాయుచున్నాను. ఒకరి నాక్షేపించవలెనని కాని, మఱొకరిని సమర్థింపవలెనని కాని యుద్దేశము లేదు. లక్షణతత్త్వము నెఱుకపఱుచుటే నా లక్ష్యము. ఇందలి గుణమును గోవిదులు గ్రహింతురుగాక!

(1) గణభంగము :

గణభంగదోషము గలదని రామాయణకల్పవృక్షము నందలి బాలాయోధ్యా కాండముల నుండి 36 స్థలములు చూపఁబడినవి. అందు 33, 35 అంకెలు గలవి తప్పఁ దక్కిన వన్నియు రేఫ సంయుక్త పూర్వాక్షరములు లఘువుగాఁ బ్రయుక్తమై యుండుట యను దోష మొక్కటే కలవై యున్నవి.

సంయుక్తాక్షరమునకుఁ బూర్వాక్షరము గురువగుట సామాన్య లక్షణము. ఈ విషయమున సంస్కృతాంధ్రములలోఁ గొంత భేదము గానవచ్చెడు. సంస్కృతములోఁ బదములు వ్యస్తములుగా నున్నను సంయుక్తపూర్వవర్ణము నియతముగా గురువే యగును. కాని తెనుఁగున వ్యస్తపదముల యం దట్లు గాదు.

ఉదా:—శుశ్రూషస్వ గురూన్ కురు ప్రియ సఖీవృత్తిం సపత్నీ జనే. (సం)

ఆదిజుఁడైన బ్రహ్మ; లోకాది, త్రిలోకపూజ్యుఁడు (తె)

కల్పవృక్ష ప్రథమపద్యములో రెండవ పాదములో 'ప్రథమ కబళే మక్షికాపాతః' అన్నట్లు గణభంగ మెదురగునని శ్రీ కొత్తవారి యాక్షేపము. ఆ పద్యభాగము :

'శ్రీ మంజూషిక భక్త రక్షణ కళా శ్రీమంచు సానంద వ
ల్లీ మంజు ప్రసవంబుఁ జిద్గగన ప్రాలేయాంశువున్....'

'గగన ప్రాలేయాంశు' వనుచోట సిద్ధ సమాస మగుటచే సామాన్య లక్షణానుసారము 'న' గురువు కావలె, కాని యిందు లఘువుగాఁ బ్రయుక్తము. ఇట్లు ప్రయోగించుట దోషము గాదు. దీనికి శాస్త్రమును బ్రయోగములును గలవు; చూడుడు :

వృత్త రత్నాకరము :

పాదాదా విహ వర్ణస్య సంయోగః క్రమసంజ్ఞకః
పురస్స్థితేన తేనస్యా ల్లఘుతాపి క్వచిద్గురుః
ఇదమత్రోదాహరణమ్—
తరుణం సర్షపశాకం, నవోదనం పిచ్ఛిలాని చ దధీని
అల్పవ్యయేన సుందరి, గ్రామ్య జనో మృష్ట మశ్నాతి.

ఛంద: కౌస్తుభము :

వర్ణో గురుర్మతో హ్రే స్రే పాదాంతే చాపి వాలఘుః

ఛందశ్శేఖరము :

సర్వాస్వపిచ భాషాసు రహాయుక్తే క్షరేపరే
పూర్వ వర్ణలతా దృష్టా క్వాదికేవాపరేక్వచిత్ .

వృత్త ప్రత్యయ కౌముది :

అథవిభాషిత గత్వరణాంతిమో, 'హ్ర—ప్ర' పరో 'గ్ర' పరోఽపిచకేచన.

ఇందులకు మాఘకవి ప్రయోగము—

'ప్రస్తనాభి హ్రదమజ్జన మాసు' (10—60)

కాళిదాస కుమారసంభవమున ;

సామంగళ స్నాన విశుద్ధగాత్రీ, గృహీత ప్రత్యుద్గమనీయ వస్త్రా (7—11)

ఈ లక్షణవిశేషములంబట్టి 'ప్ర. హ్ర. గ్ర' ఇత్యాదిరేఫ సంయుక్తాక్షరములకుఁ బూర్వాక్షరము వికల్పముగ లఘువు గావచ్చునని తెలియవచ్చెడు.

ఈ యంశము ఛందోగ్రంథములందుఁ బ్రఖ్యాతమైన యప్పకవీయమం దెందును జెప్పఁబడలేదు. అందుచేతనే మన తెనుఁగు పండితుల కిట్టి ప్రయోగములందు దోషభ్రాంతి జనించినది. అప్పకవి చెప్పకున్న, నితరాంధ్ర లాక్షణికులు కొంద ఱీ విషయమును జెప్పియున్నారు.

కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహములో లక్ష్య సహితముగ దీనిం దెలుపు లక్షణమును వ్రాసియున్నాఁడు.

> "సంస్కృత పదంబు లొగి సమాసములు గూర్చు
> నప్పుడు రకారము గూడిన యక్కరంబు
> లౌాది యుండు నొక్కొక్కచో నూఁదకుండుఁ
> దెనుఁగు కృతులందు సాము జాలిన విచారి." (పుట—91)

అతఁడు చూపిన లక్ష్యములు—

ఉ. కావునఁ గామ క్రోధములఁ గ్రాచుచు (భార—శాంతి)

సీ. గీతవాద్య వినోద క్రియలు దనరు (కాశీఖండము)

చ. వరవరేణ్య ధర్మ ప్రకటీ కృత చిత్తుఁడు (ఉద్యోగ)

చ. కృపకృతవర్మలం గడిమి గిట్టి శిఖండి ప్రభద్రకుల్ (శల్య 1—221)

అధర్వణ కారిక:

> సంయుక్తే సంస్కృతాద్యేస్యా త్పూర్వ మాంధ్రపదంలఘు
> భవేదాద్య సమాసేఽపి రేఫయోగాత్పదం తథా.

పెద్దపాటి వేంకటరమణకవి—లక్షణశిరోమణి

> గీ. సకల భాషా కవిత్వప్రచారములను
> రహల సంయోగ వర్ణపరత్వమైన
> పూర్వవర్ణంబు లఘువగు భువి వికల్ప
> మైన నొకచోట గురువగు నదియె కృష్ణ.

ఇందులకు మహాకవి ప్రయోగములు నన్నయ నాఁటినుండి నేఁటివఱకుఁ గల గ్రంథములలో ధారాళముగాఁ గానవగును. అందునా పరిశీలించినవానిలోఁ గొన్ని :

> అవనిజము వలన నమ్మని, ప్రవరః పృథూత్సంగతలముపై [వడిఁ బడియెన్.
> (నన్నయ—సభా—1—143)

ఈఁదంతా ఇద్పదేవకృత ప్రాప్తి (ఆంధ్రశబ్దచింతామణి)

అతిప్రసిద్ధిఁజేసి యుపదృశలిలమై (నిర్వ—ఉ—రామా1—30)

అధిక ప్రియము సెప్పెదనని యూనతిచ్చి (ఎఱ్ఱన—హరి—ఉ—7—30)

పరస గీర్వాణ గ్రంథంబుఁ జల్ల (నృసింహపురాణ—1—52)

పా, వయుతాత్మం దాతుఁడుభయప్రభప్పుఁడు రుద్రా (శివతత్త్వ—247)

ఘుత బ్రహ్మబలము బలిమిల (భాస్కర—బాల—576)

జగతి నిర్పి, కార బ్రహ్మంబవగు నిమ్ముఁ గడఁగి (భాగవత—4—145)

వివిధామరముఖ్య ప్రతిష్ఠితంబులై (భీమఖండ—4—31)

లాఁబ్రవర్తిల్లు లక్ష గ్రథంబు తోడ (కాశీ—1—72)

ద్వాదశ విజనూరి విరచిత ద్రావిళ గ్రంథాద్యుత (కవికర్ణ—6—219)

ఎందఱు గర్గినస్ బ్రజల కేక ప్రియంబున బుజ్జవంబు (హరి—పూ—1—183)

వివిక్తతలమంచు వసించెఁ దా శతతాళ దఘ్న హ్రదంబులో (కళాపూర్ణ—5—183)

రణ ని, ఖంకిత ప్రాభవమున (రాఘవ పాండవీయ—1—35)

కామశరధి జాను క్రముక కంఠంబు (నన్నిచోడ—కుమార—8—18)

అప్పకవీయములోని అన్నమూర్తి వృత్తమున నిట్టి ప్రయోగము చూపఁబట్టడు. 'సోకం జెప్పుదురు విద్వాంసు లింలో నన్నమూర్తిన్ సుప్రతిభుల్'

ఈ పై లక్ష్య లక్షణ ప్రదర్శనమునే సిద్ధసమాస గతమైనను రేఫసంయుక్తమునకుఁ బూర్వాక్షరము వికల్పముగా లఘువు కావచ్చునని తేటతెల్లమగుచున్నది. కాన విశ్వనాథవారి ప్రథమ పద్య స్థితమగు 'చిద్గగన ప్రాలేయాంశు' ననుచోట 'న' లఘువగుట కెట్టి విప్రతిపత్తియు లేదని విజ్ఞులకన్నైన నెఱుంగుదురుగాక.

మఱి విశ్వనాథవారి ది తెలిసియే వ్రాసియున్నా రనుటలో సందియము లేదు. వారే పై పద్యపాదమునందే 'మంజు ప్రసవంబు' అనుచోట రేఫసంయుక్త పూర్వవర్ణము గురువుగాను బ్రయోగించి యున్నారు. ఇట్టి ప్రాచీన లక్ష్య లక్షణములు కలిమింజేసియే వారు తమ రచనలో ననేక స్థలములలో నిరాఘాటముగా రేఫసంయుక్త పూర్వాక్షర లాఘవమును బాటించి యున్నారనుట స్పష్టము.

ఇందు మఱొక ప్రసక్తి—నరసభూపాలీయమునకు వివరణకర్తలైన సన్నిధానమువారు 'ఆచార్యులవారివలె (చలమచర్లవారు) సంస్కృత పదములలో సంయుక్తాక్షరము నకుఁ బూర్వాక్షరమును లఘువును జేసినవారు గానరారు' అని ఒకచోట వ్రాసినారు—అవి సన్నిధానమువారి వాక్యములు పై వ్యాసమున మద్ధరింపఁబడినవి. ఆ గ్రంథములో నంతకు ముందున్న వాక్యములు రేఫ సంయుక్తపూర్వాక్షర లాఘవ క్వాచిత్కతను బేర్కొనుచున్నవి. వారు పై లఘుత్వమును దోషమనలేదు. వారందుఁ జూపిన దోషము 'వాల్మీకి వ్యాసుల వన్నెలు దఱుఁగవే' అనుచోట 'వ్యా'కుఁ బూర్వస్థమగు

'క్రి' లఘువుగాఁ బ్రయోగించుటను గూర్చినది. కాని యిట్టి ప్రయోగములుగూడ బసవపురాణాది కతిపయగ్రంథములలోఁ జూపట్టెడు.

శునక గార్దభమ్లేచ్ఛ శుకదర్పురాది (బసవపురాణము)
అత్యంతకష్టకృపాపాదులచేత (భాగవత—5—2—141)
ఎల్ల ప్రజల్ తదీయు వ్యథలెంచి (అనిరుద్ధ—3—126)
పద్యతాత్పర్య జ్ఞానంబుఁ బరిహరించి (శశిరేఖ—1—12)
ఇది విషయాంతరము.

గణభంగము గలదని చూపిన 36 చోట్ల 34 ప్రయోగములు లక్షణవంతములని తేలినది. ఇక 33, 35 అంకెల విషయము—33—మోహనమనమాయాఖండము జగదీశ(గీతము)? పై రీతిఁ జూపఁబడినది. ఇది తేటగీతి పాదము. ఇందుఁ గణభంగ మేమియు లేదు; చూడుఁడు.

హ	న గ	త	న	హ
U I	I I I U	U U I	I I I	U I
మోహ	న మ న మా	యా ఖం డ	ము జ గ	దీ శ

ఇది చదువునపుడు దీని నడక గీతమువలెఁ దోఁపదు. అంతేకాని యిందొకింతయు గణభంగము లేదు. ఇది భ్రాంతిమూలకము.
35—సీ॥ సత్యసం, గరుని స్వ, సైన్యనిక, ప్రాజిత.

క్రింది గీత పెట్టియున్న దా వ్యాసములో; ఇందును గణచ్యుతి గానఁబడదు. సంగరుని, 'స్వసైన్యనిక' అని పద విభాగము చేసికోవలెనని తోఁచుచున్నది.

పూర్వ:వ్యాసములో గణభంగము గలదని చూపిన యన్ని చోట్లను గణభంగము లేదనుట నిష్కృష్టార్థము.

2. యతిచ్యుతి : (అంకెలు. 37—79)

విశ్వనాథవారి పద్యములలో యతిభంగము లున్నవని 43 స్థలములు చూపఁబడినవి. మచ్చున కందుఁ గొన్ని :
40— వెనుకన్ వృత్ర వధాఘ మూదికొనదే + వేంద్రున్
42— శ్రీ రఘురామ యై దగు గి + రీంద్రము
51— ముదుత, లంది తెల్లన చిఱుశ్యామ + తల వహించి.

ఇందు అఖండయతి గూర్పఁబడియున్నదనుట పండితైక వేద్యము. కొత్తవారు చూపిన 43 స్థలములలో—37, 39, 40, 41, 42, 46, 47, 49, 50, 51, 55, 56, 57, 60, 61, 63, 64, 66, 67, 71, 72, 76, 77, 78, 79 అను నెంబర్లు గల 25 చోట్ల లోనివి అఖండ యతులే. ఇవి యతిచ్యుతు లెట్లగునో, యీ విమర్శనము క్రొత్తగా నున్నది. ఈ యతి చ్యుతి ప్రయోగములఁ జూపి కడపట "తెలిసియే 'అఖండయతి' వేసితి నన్నచో ఆ వాదములోని పాటవముగాని ఆ కవనములోని విలువ గాని విద్వజ్జనులు గుర్తింపరు" అని వ్రాసినారు కొత్తవారు. అనగా కొత్తవారికి విశ్వనాథవారి పై ప్రయోగములందఖండయతి పాటింపఁబడియుండుట తెలియునని, అఖండయతి గూర్చుట కవితాపాటవమునకు భంగకరమని, మఱియది యతిచ్యుతివంటిదే కాదు—యతిచ్యుతియే యని వారి తుదివ్రాత తెల్లము సేయుచున్నది.

విశ్వనాథవారి ప్రయోగములఁబట్టి వారి కఖండయతి యత్యంత సమ్మతమనుట స్పష్టపడుచున్నది. ఇక అఖండయతి అగ్రాహ్యమా? అది దోషమా? అను శంకా విమర్శలకు సమాధానము చెప్పవలసియున్నది.

అప్పకవి యొక్కఁడు దక్కఁదక్కిన ఛందశ్శాస్త్ర కర్త లందఱు అఖండయతికి వ్యతిరేకులుగారని యాయా లక్షణగ్రంథముల బరిశీలించిన వారికిఁ దెలియఁగలదు. దిక్ప్రదర్శనముగా దాని తత్త్వము నిరూపించెద.

మనయెఱుకకు వచ్చినంతలోఁ బ్రథమచ్ఛందముగు భీమకవి ప్రణీత కవిజనాశ్రయములో అఖండవడి యిట్లు చెప్పఁబడినది.

'మానుగ విశ్రమాక్షరసమంచితమై స్వరమూఁదినన్ దదీ
యాను గుణాక్షరంబె కొనియైనను జెప్పఁగనొప్పు నిక్కియున్
భానుసహప్రభాసివృషభాధిపుఁ డన్నటులర్థయుక్తమై
పూనినచో నఖండయతి పొల్పగు నాదికవి ప్రసిద్ధమై?
వృషభ + అధిప—వృషభాధిక, దేవ + ఇంద్ర—దేవేంద్ర'

ముడుతలు + అంది—ముడుతలంది—ఇటువంటి అచ్చంధు లందలి శబ్దద్వయమును అఖండముగా (ఏకశబ్దముగా) భావించి సంధిస్థలమున నిలిచియున్నవ్యంజనాక్షరమునకే యతిగూర్చుట అఖండవడి యనఁబడును.

ఈ యఖండవడిని జెప్పినవారు భీమకవి, చిత్రకవి పెద్దన, లాతంభట్టు, ముద్దరాజు రామన, లింగముగుంట తిమ్మన, వార్తాకవి రఘునాథయ్య (లక్షణదీపిక), పొత్తపి వేంకట రమణకవి (లక్షణ శిరోమణి), కూచిమంచి తిమ్మకవి, కస్తూరి రంగకవి, ఓరుగంటి రామకవి (కవితా లక్షణసారము), కూచిమంచి వెంకట్రాయకవి (సుకవిజన మనోరంజనము) నైషధము తిమ్మకవి (గరళపురీ ఛందము) మున్నగు లాక్షణికులు పెక్కురు గలరు.

బాలబోధచ్ఛందశ్శాస్త్ర కర్త యఖండవడిని సమ్మతించి యిట్లు రచించెను :

'ఈ యఖండవడి మహితబుద్ధిఁ దెలియని
వారు చెల్లదనుట కారణముగఁ
జతుర బుద్ధిఁ బెక్కుసమ్మతుల్ వ్రాయుదు
విచ్చ సుకవివరుల మెచ్చుగాఁగ ?

అఖండవడిని సమ్మతింపనివాడు అప్పకవి. అతఁడు పూర్వ లాక్షణికులు చూపిన యఖండయతిఘటిత భారతాద్యగ్రంథస్థిత ప్రయోగములలోని పాఠములు దప్పని స్వమతానుసారముగ సవరించి చూపెను. మిఁదుమిక్కిలి భీమకవి యఖండవడికై వ్రాసిన లక్షణములోని 'భాను సహప్రభాసివృష—భాధిప' అను పాదమునందలి యతి యఖండ

పడికి లక్ష్యమై యుండఁగా, నద్దానిని నిత్యసమాస యతి క్రింద ఉపసర్గసంధిలో నుభయయతి చెల్లునని వక్రమార్గ మొకటి కల్పించెను. భీమకవి అఖండవడియని నొక్కి వక్కాణించుచుండఁగా అప్పకవి దానినే నిత్యసమాసోభయయతి యని చెప్పుట వింతగా నున్నది. 'సుకవిసు్తత్యముగా నఖండ వడి నిల్పన్ విశ్రుతంబై' అని ముద్దరాజు రామన కవిజనసంజీవనిలో భారత లక్ష్యములఁ బ్రదర్శించెను. కూచిమంచి వెంకట్రాయఁడు శ్రీనాథాది ప్రయోగములఁ జూపి చిట్టచివర 'ఏ మహాకవి ప్రయోగములు లేవని యప్పకవిగా రఖండవడిని ఖండించిరి? ఈయన ఖండించిన మాత్రమున నఖండవడి ఖండమగునా ?' అని యప్పకవి మతమును నిరసించె. అంతెందులకు ? అఖండవడి నప్రశస్తమని నిరాకరించిన యప్పకవియే తెలిసియో తెలియకయో తన గ్రంథములో వీక్రింది రెండు చోట్ల నఖండ వడిఁగూర్చి యున్నాడు.

గీ. టాదులై దుమ గూడు బృ+ష్మ ముచతుర్థ (2—393)

కనకలతావృత్తము (13—యతి)

. . . . పదుమూఁ'
డవయొడ విరతిఁ బొసఁగిన బె+డఁగడరుఁగనకలతన్.

అప్పకవి మతమునుబట్టి మొదటి పద్యములో 'ట+అది—టాది' అనుచోట 'ఆదీయతే'—ఆదిః' అనువ్యుత్పత్తి బట్టి 'ఆఙ్' ఉపసర్గతోడి సంధిగా గ్రహించి నిత్యసమాస యతిక్రింద సరిపెట్టుకోవచ్చునేమో (ఇది వక్రమార్గము) కాని రెండవపద్యమున 'మూఁడు+అవ—మూఁడవ' అనుచోట అఖండవడి యనివార్య మగునుగదా ? లాక్షణికు లెల్లరు సమ్మతించిన యఖండవడిని ద్రోసిరాజని నిరూపించిన యప్పకవియే ప్రమాదమునకు లోనైనాఁడని తెలుపఁదలఁచి యింత వ్రాయవలసి వచ్చె.

అఖండవడిని బ్రయోగించిన కవులలోకరిద్దఱుగారు, లెక్కలేనివా రున్నారు. నా పరిశీలించిన కొన్ని ప్రయోగములఁ జూపెద :

అతీవసత్త్వఘను, వ్యర్థుఁడగుచున్న వాని దివి+జారిఁగబంధుని (భార—అరణ్య—6—357)

చూపె మనంబునఁ దలంచు+చుండుదు నెపుడున్ (ఆది—5—135)

అమ, లమతీ నీకన్నకొడుకు+ఉత్తరయుఁజనున్ (ఉద్యో—2—74)

వామనమూరదీనిఁగని+నప్పుడు (సౌప్తిక—2—96)

పెడబొబ్బ, లుమ సింహనాదంబు+ఉల్లసిల (విరాట 5-168)

కన్నుల, కఖిలార్థలాభంబు+కలుగుచుండు (భాగవ—10—1702)

ర, క్షైకారంభకు ... కథా+సంరంభకున్ (భాగవ—1—1)

ర,త్నాకర వేష్టితావని వి+నంబడ దాఁతఁడు (శ్రీరంగమహాత్మ్యము)

కవిత శబ్దంబు వా+గమృతమై తనర (పండితారాధ్య—పురా—486)

వే, దోక్తముగ నెఱుంగ వలయుఁ+దుదిని మహేశా (శివతత్త్వ—100)

తస్మాద్గ్రాహ్యం, బనియును గలదని వేద+భక్తి విధిజ్ఞత (శివతత్త్వ—115)

జ్ఞానమునకు యోగ్యమగుట+ననుభావంబై (రసాభరణము6పుట)

బొప్పవారితో, నెనసిన తెప్పలెత్తుటయు+నేర్పు (భోజరా—3—221)

మగపంతంబున దక్కినన్ జనములే+మంత్రి (దశకుమార—12—50)

వాణిత, ర్తను సీతండా . . . మహ త్వ్యాప్తిన్ (ఎఱ్ఱన—హరి—పూ—1—9)

ద, ధ్యన్నాహారము గంధలేపము విరుల్+తాంబూలముల్ (కవిరాజమనో—5—46)

ధనము గోల్పోయిన+దాదిగాఁగ (శశాంక—4—29)

లంక నీఱయ్యెఁ బ్లవగ వా+తానలనము (చం పూరామా. 8—142)

వెనవ సుధాస్థలంబునఁగ+వీంద్రులు (భీమఖండ—1—12)

కాశి యణిమాదిసిద్ధుల+కాటపట్టు (కాశీఖండ—2—50)

బుధుని కథ చెప్పుచుండెన+ఖోంతరమున (కాశీ—4—232)

వి, ర్జరులును మిన్నుదన్నిరి ధ+రామర కోటియు (కాళహస్తిమాహాత్మ్య—2—62)

మునినాథ విన్నపం+బొక్కటి (రాధికా—1—45)

పంక్తి, కంఠానుజ, న్మనిలారించి . . . . ఎం+తోపేక్ష (కంకంటి—ఉ—రామా—5—281)

ద, క్షామలకై రవారి కవి+సారవిసార (ప్రబంధరాజము—25)

వి, మనఁగల దివ్య నీచుఁడగు+మర్కటు (భా—రామా—యుద్ధ—65)

క్రియా, భీలత నొప్పియుద్ధతక+వీంద్ర (భా—రా—యుద్ధ—1956)

తెలుపు, చుండవీ ప్రల్లదంబుల+సొంపుమెరసి (నృసింహపు—5—47)

లతకూన మధుర శీ+తాధర (అనిరుద్ధ—1—106)

పౌక్రమాఁకులును, నెన్నంగ వరఁటుల+నెఱయుపుష్పాళ్ల (రంగ—రామా—బాల—పు44)

సౌఖ్య, కరణకరమగు నావంచి+కార్యపురము (రాజ—శే—చ—1—44)

తలఁచు మనంబులోని వను+ధామర యాజక (పాండు—4—182)

తలఁపక యుట్టి కోర్కి వసు+ధామరు (సుదక్షిణ—2—68)

తప్పకమాని విన్న వను + ధామరమాటికి (వెంకటేశ—4—42)
నేవావిర మేలమానుడుంటె + వంగెద (రుక్మాంగద—5—161)
వడువున యొకమార్గణమున + నవ్రితుంచి (జైమిని—2—66)
తెక్కయిడరాని లొక్కంబు + లీదులేని (రసిక జనమనో 1—42)
మంచిదియ్యైననే + మాయలే (కృష్ణ—విజయః 2—4)
అ, జాదులును బ్రసాదమొవి + శారద (విజయ—2—10)
వ్రదూపక, మేలావరియింపు మనుము + మీరు (సారంగ—2—96)
లోకమునన్ గుణావలము + లున్నతరూప (కవికర్ణ—4—88)
తెలియ లేమాట మీరావ + తిప్పితిరట (శంకర కవి హరిశ్చంద్ర—2—178)
ఉట్టంటితాం, కద్బధేస్తు . . . సం + జ్ఞాస్మత్క్రతా (ఆముక్త—4)
బాలిక . . . స + భాగారమునన్ (వైజయంతి—1—126)
మెఱుం, గొనరు తెఱంగునన్ సిరిని + కుందును (చిత్రభారత—8—101)
చెప్పవయ్య పుణ్యసతీ వ్రతా + వంబుమాకు (భార—అరణ్య—5)
ఊర, కుంట యుక్తమగునె + కువలయేశ (తిరుపతికవుల దేవీభాగవతము—1—300)

ఇంక నిట్టివేని లక్ష్యములు చూపగలను. ఇందఱు మహాకవులు ప్రయోగించియుండగా, అఖండపడి వేసితినను వాదములోని పటుత్వము గాని ఆ కవనములోని విలువ గాని విద్వజ్జనులు గుర్తింపరను విమర్శలో బాటవము లేదుగదా? అట్లు గుర్తింపకుండుట యీ విద్వజ్జనుల పరిశోధనాలోప మనక తప్పదుగదా?

విశ్వనాథవారి రచనలో పైని చెప్పబడిన 25 స్థలములలోని యఖండపర్లలో 41, 47, 56, 57, 60, 61, 64 అను సంకెలు గలవి యుప్పకవీయము ననుసరించి యుభయవర్గసంధిలో విత్యసమాసోభయ యతి క్రిందకు చేరిన ప్రయోగమగును. అందులకు సూచనామాత్ర వివరణము:—

47—కే, ఆనేకలోక్ర గ... వికే + షక్రాంతి (ఆ క్రాంతిలో—ఆక్—ఉపసర్గ)

56—రాని రాను ముక్తాన్యాం ర + రాధిపునకు (రరా—అధిప) ఇది 'నృపనరాధిప' వంటి యుభయవర్గసంధి పడి.

49—వరు పరాక్రమ స్ఫైర్య ర + త్నాకరమువు.

కూచిమంచి తిమ్మన 'ర, త్నాకర వేష్టితావని వి + సంబడ దాతయు' అను భైరవకృత శ్రీరంగమాహాత్మ్య ప్రయోగము ఈ సందర్భమున లక్ష్యముగా నిచ్చియున్నాడు.

ఇక దక్కిన యతిచ్యుతి ప్రయోగముల విషయము—

45. మెడ మలుపు వోర చూపుం—చిలిచి చూచి

(ఇది అప్రాసయతి)

48. లాగికొన్నవి యురితమి + ప్రాపతంగ

(ఇది ర—లయతి—అభేదయతి లోనిది)

52, 53—క్రొత్తవారే పిలిచి నవరలు చూపిరి. ఇవి ప్రాతలోనో, యువ్వాలోనో పడిన సాధారణ ప్రమాదములు.

నీతో వాడితిని నీకు + నాకును (నాకు నీకును—అని యుండును). 62, 65, 59, 70 సంఖ్య గల ప్రయోగముల పరయుదము.

62—65—సమీప శబ్దములోని మధ్యాక్షరమునకు అకార స్వరముతో యతి మైత్రి చేయబడినది.

అప్పప్పాత స + మీపా గేహాత్వాం

ఆయెడ లీవంక్షణ స + మీపత

సమీపశబ్దము ద్వీపాంతరీప శబ్దముల వంటిది. 'ద్వ్యంతరుప సర్గే భ్యోఽప ఈ'త్తను వ్యాకరణసూత్రముం బట్టి 'సమ్ + అప్—సమ్ + ఈప్—సమీప' అగును. (సంగతా ఆపోస్మిన్నితి సమీపః—అని వ్యుత్పత్తి)

సమీపశబ్దమున కుభయయతి చెల్లునని యప్పకవి యాది లక్షణగ్రంథములు చెప్పుచున్నవి.

మొదలు దుష్కరాక్షన స + మీపము (భాస్కర రామా—అర—1—41).

ఇవటికి సార్వయోజన స + మీపమునన్ (భాస్కర—అర—1—37). ఇందికారస్వరమునకే యతి గూర్పబడినది.

"ద్వీపసమీపాది శబ్దములందు గూఢముగా నున్న అకారమున కేల యతి గూర్పరాదో! ఈ విషయమే లాక్షణికుడు స్ప్రశింపలేదు, ప్రయోగము లన్వేషణీయములు" అని వా ఛందోరీతులను గ్రంథములో వ్రాసియుంటి. నేటికి విశ్వనాథవారి ప్రయోగము చిక్కినది.

అంబురక్ష్యాను తన కింక + రోఽహమనగ (అప్పకవి)

అద్వరూపాయ విశ్వక + ర్త్రేఽక్షరాయ (ఉ—హరి—3—219).

పై వ్రాసిన ప్రయోగములలో గూఢస్వరమునకు (అకారమునకు) యతి చెల్లబడియున్నట్లు, ద్వీప సమీపాది శబ్దము లందును గూఢమైన అకార స్వరమునకు యతి మైత్రి సంగతమే యునవలె. కాని, పిరికి బూర్వ కవి ప్రయోగము లన్వేషణీయములు.

59. 'వే, లోఽజాడు వేయుచేం టబు + బుండిన విద్యయ వృత్తి 'వేతః + అజాడు' అని పాదాదిలో చేదము. అన్తవిసర్గక స్వరయతి యుండుక గూర్పవలయు. అనగా అకారమునకు యతి యుంచవలయును. కాని యుందు ఉకారము యతిగా నున్నది. ఇయ్యది ప్రయోగ వైలక్షణ్యమే. అనంతము పైని అత్వపకు ఓకార మాదేశ మగుచున్నది. అట్టి యాదేశమైన ఓకారమునకు విశ్వనాథవారు యతిగూర్పినా రనవలె. వృద్ధియతి యందు 'లోక + ఏక = లోకైక' అనునట్లున ఏకారమునకే కాక యాదేశమైన ఐకారమునకును యతి చెల్లనవచ్చును. ఆ కోరటిలో ఏ యతి గూర్చినారు కాబోలు!

ఇందొక రెండు మూడు ప్రౌఢ ప్రయోగము లనేక తప్పదు. కవిసమ్రాట్టులు వీనినెల్లఁ దెలిసియే నా చెప్పినట్టి కారణములవంటి వేవో పరికించి క్రొత్తగాఁ బైరీతులఁ బ్రయోగించియుందురని నా యూహ.

ఇటువంటిదే 70 సంఖ్య గల ప్రయోగము.
అం, భోరుహ క్లప్త దర్పురవి—భాసి.

ఇందు యతి చ్యుతి స్పష్టముగాఁ దోఁచును. 'అంభస్—రుహ—అంభోరుహ'. ఇందు సంధి గలుగుటకుఁ బూర్వము 'అంభస్' అని యుండును గాన భకారమునకు యతి వేయుటలో న్యాయమున్నదని తలంచి యటు వ్రాసిరేమో ? కస్తూరి రంగకవి ప్రయోగ మిట్టి దొకటి కానవచ్చెడు.

తగుఁ గాని రేఫయు-ధోగతి యగు (2—149) (అధస్ +గతి). ఇందుఁ బ్రస్తావింపక వదలిన యొకటి రెండు సరియైనవే, కాన సమీక్షింపలేదు.

3. ప్రాసభ్రంశము :

80. కవితా .... మైథిలు .... బోలిమేర .... సరణి.
ఇందు ర—ల ప్రాసమని క్రొత్తవారే తెలిపిరి.

అఖండయతివలె 'ర—ల' ప్రాసయు వారికి సమ్మతము గాదు కాఁబోలు. 'ర ల' లకు యతియు ప్రాసములు గూర్చిన పూర్వ ప్రయోగములు క్వాచిత్కములుగాఁ జూపట్టుచున్నవి. పూర్వకవి ప్రయుక్తములై కొందరు లాక్షణికులచేఁ జెప్పబడి యున్నపుడు క్వాచిత్కము లైనంతమాత్రమున ర—ల ప్రాస వంటివి దోషము లెట్లగును ?

ర—ల యతి చెల్లునని రంగకవి అభేదయతి క్రిందఁ జెప్పెను. ర—ల ప్రాస రంగయ ఛందమందే గాక లక్షణ దీపికా లక్షణ శిరోమణులలోఁ జెప్పబడి యున్నది. లడప్రాస నప్పకవియు నభేద ప్రాసక్రిందు జూపియున్నాఁడు. కాన నిందే వియు నసాధువులుగాఁజాలవు.

81. మొగమున—ముకరణి—స్తకముల—నకి

''క—గ ప్రాస, 'మొకమున' అని దిద్దినచో సరిపోవును'' అని క్రొత్తవారే యందు వ్రాసిరి. ఇట్టివి ముద్రా ప్రమాదములు. నేటి యచ్చు పత్త్రములలో నెల్ల నిట్టి పొరపాట్లుండుట పరిపాటి. ఇట్టి వానిని కవికృతదోషములుగా గ్రహింపరాదు. కాని యెందేనిఁ బ్రమాదములు కవికిఁ దెలియకయే తటస్థించుటయు గలదు. ప్రమాదో ధీమతా మపి. విశ్వనాథ వారే ఆంధ్రపత్రికలో (29—10—61) 'నా పుస్తకంలో కొన్ని పొరపాట్లు ఉండవచ్చు. వాటిని నే నంగీకరిస్తాను' అని వ్రాసినారు గదా ?

ఇక మరియొక విషయము—

అఖండయతి ర—ల యతిప్రాసలు మున్నగువానిని దోషములుగా భావించి యాక్షేపించినవారు ఇట్టివే యగు శ స ప్రాసాదులు కల్పవృక్షమున నుండఁగా నేల పై వ్యాసమును జేర్చి నిరసింపలేదో ?

కల్పవృక్షము పుటలు త్రిప్పఁగా నాకుఁ గొన్ని ఛందో విశేషము లట్టివి గానవచ్చినవి. కొందరు వీనిని సైతము దోష ప్రకరణమును జేర్తురేమో ?

మచ్చునకుఁ గొన్ని చూపెద :

1. శ—స ప్రాస :

కౌసల్యా—నీ సుఖమే—ఆశాంత—(బాల—పు 43)

అప్పకవి చెప్పలేదు గాని తరువాతి లాక్షణికులు పెక్కురు దీనికి లక్ష్య లక్షణములు జూపిరి.

2. ర—ఱ యతి :

ఱెప్పలవి యొత్తఁ బడకుండఁ—గ్రేవలందు (బాల—332).

3. ర—ఱ ప్రాస :

ఇరువది—తెఱచి—నిఱిచిన—అఱుత (అయోధ్య—11)
(ఇఱువది—అని ముద్రితము, కాని యిది లఘు రేఫాన్వితము).

4. న—ణ ప్రాస :

గణనాథుఁడు గురునాథుఁడు.
మునికిని .... (బాల—6).

నణ ప్రాస మైత్రి సర్వకసమ్మతమే కదా, ఇందలి వైలక్షణ్య మేమియని కొందరు సందేహింపవచ్చు. నకారము సిద్ధ ణకారముతోఁ బ్రాసము వెంద నేరదు. వ్యాకరణ మాత్రములచే నాదేశమైన ణ కారముతోఁ జెల్లవచ్చు. ఉ :—దానవ—ప్రాణ (ప్ర—అన), ముని—ప్రణుత (ప్ర—నుత).

పై పద్యమున 'గణ' శబ్దములో నిది పదగత ణ కారము, ఆదేశ ణకారము గాదు.

భారత విశేషములను వ్యాసములోఁ దిరుపతి వేంకట కవులు దీనిఁ గూర్చి చర్చించియున్నారు. 'న కారమునకుఁ బ్రాసము కాఁదగు ణ కారము స్థలాంతరమునం దెపుడేని నిరుపాధిక మైనప్పుడు తన స్వ స్వరూపమును బొందియుండవలయు ననునది యిందలి పరమార్థము' అని యందు వ్రాసిరి. వేంకట శాస్త్రిగారే యొక చిన్న పద్యకృతికిఁ బరిచయము వ్రాయుచు నిరుపాధి న ణ ప్రాసదోషము దానఁ గలదని సూచించిరి. ఇది యెందో చూచినట్లు జ్ఞప్తి యున్నది. కాని సాధారణ న ణ ప్రాసగల పూర్వకవి ప్రయోగముల సంఖ్యాతములుగాఁ గలవు. కాన నియ్యది నిషిద్ధముగాదు.

5. బహుయతి నియతి :

భుజంగ విజృంభిత వృత్తము (బాల—63).

త త్ర ధ్యానాబ్జాన్యస్ దామద్గా—తయును సతులస్ బతులు క—రంబు లూనిన యట్లుగా.

దీనికి 9, 19 స్థానములందు రెండు యతులు గలవు. పాదాదిలో సంయుక్తాక్షర మున్నది. (త్ర). దీనిలోని త కారమునకు 9 వ చోటను, రేఫమునకు 19 వ చోటను జై పాదమున యతులు గూర్పబడి యున్నవి. ఇట్టి పద్ధతి బహుయతి నియతికి విరుద్ధము. (చూ. అప్పకవీయము 3—111).

"ఒక్క పదములోనఁ బెక్కు విశ్రమములు
జరుగుచోట మొదల జడ్డలున్న
నడుగు వెడలు దనుక నం దొక్కటియె కాని
యుండదొకటి వదియు నొకట విదియు

కాని యిందుకు విలక్షణముగ నొకట వది యొకట విది గూర్చిన పూర్వప్రయోగములును జూపట్టుచున్నవి.

భాస్కర రామాయణము (యుద్ధ—880).

స్రగ్ధర : బాల వృద్ధా! ర్త స్త్రీ శేషంబుగా సం—దరుఁ బొలిసిన వె—న్కన్ జయంబేం నాకున్.

పాండురంగ మాహాత్మ్యము (2—185).

మ : సౌ న్మా నాధీశుండుగా వై—ష్ణవ సుఖదుఁడుగా— మత్కృపాపాత్ర భూత.

ఇంక నిట్టివి వది పండ్రెండు ప్రయోగము లున్నవి.

6. బాల—275 పుట—253 పద్యము—కందము. ఇందు మూఁడవ పాదము లోపించినది. ఇది ముద్రణ స్ఖాలిత్య మనవలెఁ గాని కవి ప్రమాద మనరాదు.

7. పుట 370—పద్యము 276.

భూతగ్రామ-పితాము-ప్రాతా-స్థానాగ్నేయ.

ఇందుఁ ప్రాసభ్రంశము గలదు. ఇదియు నచ్చు పొరపాటై యుండును.

8. వేగవతీ వృత్తము. (బాల—298 పుట)

మొగి నెచ్చటఁ గ్రమ్ముకొనున్ జ్యా
వల్లి రవంబులు పాదులు గాఁగన్
నిగుడున్ ముసురై వినదంబుల్
వేల్లి తరుద్రుని వింటి రవంబుల్.

(నాల్గవ పాదములో 'సంవేల్లిత' అని ముద్రితము, 'సం' అను వర్ణము ప్రమాదవశమున జేర్పఁబడినదిగా నుండును) వేగవతి యర్థ సమవృత్తము. బేసిపాదములందు 'స—స—స—గ' గణములు, సరులందు 'భ—భ—భ—గగ' గణములుండును. రెండు వృత్తముల సమ్మేళన మున్నను నాల్గు పాదములందును ప్రాసవర్ణ మొక్కటియై యుండవలయును. కాని పై విశ్వనాథవారి పద్యమున సమపాదముల రెంటి కొక ప్రాస, విషమపాదములకు రెంటికొక ప్రాస వేర్వేర ఘటింపఁబడియున్నది. ఛందఃకర్త లెవ్వరు నిట్టి భిన్న ప్రాస ఘటన చెప్పలేదు. వృత్తములు రెండు వేర్వే రగుటచే నిట్టి ప్రాస వైచిత్రిని గూర్చినారు కాఁబోలు! ఇట్టి వైచిత్రు లెన్నో వీరి గ్రంథమునఁ జూపట్టుచున్నవి. ఇవి యన్ని తెలిసి క్రొత్త త్రోవ ద్రొక్కుటే కాని తెలియక వారు చేసినది గాదని నా భావము. విశ్వేశ్వరీయములోఁ గొక్కొండవారి విశ్వామిత్ర సృష్టి (ఛందో విషయమున) విజ్ఞులెఱిఁగియే యుందురు.

మధ్యాక్కరలో లాక్షణిక మతమును, నన్నయ మతమును రెంటిని బాటించి మూఁడవ, నాల్గవ గణములపై రెండు యతులు సర్వత్ర తవగ్రంథములో దుర్ఘట నియతితో నిర్వహించిరి కవిసమ్రాట్టులు.

(బాల—92)—ఉగ : దశరథ ధాత్రీశ గర్భ—ధాత్రినం—దనుఁడవై పుట్టి దశకంధరుని కంఠనాళ—దళన కృ—త్యంబునన్ బేర్చి (ముద్రణలో 'కృత్యంబునన్ బెర్చి' అని యున్నది.)

ఈ సమీక్షవలన, రేఫసంయుక్త పూర్వాక్షరము సంస్కృతాంధ్రములందు వైకల్పికముగ లఘువు కావచ్చునని, అఖండయతి మున్నగునవి మహాకవి సమ్మతములే యని, యీ కారణముచే రామాయణ కల్పవృక్షములోఁ గొత్తవారు చూపిన గణభంగ, యతిచ్యుతి, ప్రాసభ్రంశములన్నియు దోషములు గావని, మరియందుఁ గొన్ని కవిగారు తెలిసియే ప్రయోగించిరని, యందుచే విశ్వనాథప్రయోగములు విగత లక్షణములు విరుద్ధములు గాక విశిష్ట విచిత్ర లక్షణములు (విలక్షణములు) గలవని విద్వత్కవు లెఱుంగుదురు గాక. ఛందో వైలక్షణ్య సమీక్షకే యింత గ్రంథము పెరిగినదని యీ వ్యాస మింతతో విరమించుట యైనది.

గాలిబ్ గీతాలు

శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

'సంచిన్త్య సంచిన్త్య జగత్ సమస్తం
త్రయః పదార్థాః హృదయం ప్రవిష్టాః,
ఇక్షోర్వికారా, మతయః కవీనాం,
ముగ్ధాంగనాపాంగతరంగితాని.'

అన్నాడు పూర్వ మొకప్పుడు భోజరాజు. అట్టి రచనలోని చమత్కారమునకు, వివేకమునకు, వ్యంగ్య వైభవమునకు, సంస్కృత సాహిత్య మువలెనే, పారసీ ఉర్దూ భాషా సాహిత్యములు కూడ పుష్కల తీర్థముల వంటివి. సామాన్యముగ భారతీయ భాషలకు సంస్కృత మెట్టిదో ఉర్దూ భాషకు పారసీభాష అట్టిది. ఉత్తర భారతమున పుట్టిన ఉర్దూ భాష ముఖ్యముగా లక్నో, ఢిల్లీ, హైదరాబాదు ప్రాంతములలో వర్ధిల్లినది. లక్నో ఉర్దూ కంటె దక్కని ఉర్దూను శ్రేష్ఠముగ భావించుట గూడ కద్దు.

ఉర్దూ సాహిత్యప్రపంచమున 'గాలిబ్' కిరీటములేని చక్రవర్తి. ఈయన అసలు పేరు మిర్జా అసదుల్లా ఖాన్. క్రీ. శ. 1797 — 1869 మధ్య కాలమున వెలసిన ఈమహాకవి క్రీ. శ. 1857 కు పూర్వము కొంత కాలము మొగలాయి చక్రవర్తులలో కడపటి వాడైన బహదూర్‌షా జఫర్ ఆస్థానమున నుండిన వాడు; 1857 నాటి సంక్షోభ మణగిన తర్వాత రాంపూర్ నవాబు నెలకొకనూరురూపాయ లిచ్చి పోషించెడి వారు.

గాలిబ్ సహజకవితా ధురంధరుడు. పారసీ ఉర్దూ భాషలలో అఖండ పండితుడు. అయినను ఆయన విద్య 'గురుముఖ శూన్యము' గా జరుపుకొని 'గురు కృపాశీర్యూపాలోద్భవము'గా చెప్పదగిన గాదు. విస్మృతమున కొన్నాళ్ళు మాత్రము అబ్దుస్సమద్ అని ప్రసిద్ధి గాంచిన ఒక పారసీభాషాపండితు డాయనకు నామమాత్రపు గురువు; పాండిత్య మంతయు స్వయం కృషియే.

బహదూర్ షా దర్బారులో నున్నప్పు డాయన గాలిబ్ చేత తైమూరు రాజుల సంతతిచరిత్ర వ్రాయించినారు. గాలిబ్ తన ఉర్దూరచనలను ప్రకటన సార్థము మిత్రులు కష్టించగా వారు క్లిష్టము లైనవి తీసివేసి 1849 లో దీవాన్ (పద్య సంపుటము) ప్రకటించినారు. ఇందున్న 1800 చరణములలో 1500 దాక 'గజల్' కవిత్వము; తక్కినవి కసీదా, మస్నవీ, రుబాయీలు. ఇవికాక 'బుర్హాన్ ఖాతే' అనే నిఘంటువును విమర్శించుచు 'ఖాతే బుర్హాన్' వ్రాసినారు. గాలిబ్ తన జీవిత కాలమున వ్రాసిన లేఖలన్నియు 'ఉర్దూ—యి—ముఅల్లా' అను పేరున ప్రకటింప బడినవి. గాలిబ్ 'గజల్'(Lyric) రచనలోను సరస రచనలోను కృతహస్తు డగుటయే ఆయన యశస్సునకు కారణము. అందువలన గాలిబ్‌నకు తావన్యాయ్యుడు వ్రాసిన ఉత్తరములలోని సరస రచన వంటిదే గద్య వాఙ్మయమున అనవద్యమైన స్థానము లభించినది గాని వేరుగా వచనమేమియు వ్రాసిన వాడు కాదు.

గాలిబ్ కవిత్వమున చక్రవర్తి యనిపించు కొనెనే గాని జీవితమున దారిద్ర్యము ననుభవించెను; రకరకములైన కష్టము లనుభవించెను. చివరకు జూదమాడిన నేరమునకు కారాగారవాసము కూడ చేసెను. జీవితమున నెంత నలిగి నలిగెనో అంతయు వెలిగెను. ఐహికః దీనివలన ఆయనకు జీవితముపై నొక సమగ్రమైన దృష్టి, వివేకము కుదిరినవి. కవి, పండితుడు, స్నేహశీలి, దయాళువు అయిన గాలిబ్ స్వాతంత్ర్య ప్రియుడు. ధీరుడు. ఈగుణములన్నియు ఆయన కవితలో గానవచ్చును. జీవితమున నెన్ని పాట్లు పడినను కవితలో మాత్రము మద్యస్నపంతుడు. 'కమ్మారి ఘనసార సారభ ముత్పాద్య ప్రవృత్తి మాధుర్యయో, ర్యోగః కర్పూరసాయునం ముక్తితః కవ్యాని సంపద్యతే' అన్నమాటకు లక్ష్యప్రాయుడై, నాటి ఢిల్లీ కవితా గోష్ఠిం (ముషాయిరా) లో సర్వ యని పించుకొన్నవాడాయన.

సామాన్యముగా కవిత భాషాంతరీకరణము నోర్చు నట్టిది గాదు. ఒకవేళ ఓర్చినను అందలి రసభావ, పదబంధ మహిమా వైభవము దెబ్బతినక మానదు. ఇట్టిచో గాలిబ్ కవిత ననువదించుటలో మరికొన్ని చిక్కులును గలవు. పారసీ ఉర్దూ భాషలు — సంస్కృతమునకంటె గూడ — క్లిష్టతకు పెట్టినదిపేరు. రెండవది గాలిబ్ స్వతంత్ర ప్రవృత్తి. భావముల తీరులో కూర్పులో ఉపమానములలో ఆయన ప్రహతమైన పూర్వకవి మార్గమున నడచిన వాడు కాదు. ఈవ్యవస్థత గజల్ వంటి రచనలో నాలోచన్నమ్ముగా గమనించి తీరుతలు చెప్పెను. మూడవది ఆయనకు పారసీ భాష పాండిత్యముతో పాటు అబ్బిన మార్మిక యోగసిద్ధాంతపద్ధతి. పారసీ ఉర్దూభాషలలో గల ప్రేమకవితలో తరుచుగా సర్వాత్మకమైన సాంకేతిక పద్ధతి యొక్క యెదురగుచుండును. అసలు చిక్కులతోపాటు ఈ మూడింటిని గూడ నెదుర్కొన్నగాని గాలిబ్ కవిత ననువదించుట సాధ్యముకాదు. ఈయన్నింటికి వారి శ్రీ దాశరథిగారు 400 గజల్లకు పైగా ననువదించి గాలిబ్ కవితా మధువు నాంధ్ర సాహిత్యలోకమునకు పంచి పెట్టి కృతార్థులైనారు. తెలుగుకవిగా దాశరథి ఈపరకే ప్రసిద్ధులు. కాని విద్యార్థిదశనుండి ఉర్దూ సాహిత్య పరిచయు

ముతో గాలిబ్ కవిత నాస్వాదింప నేర్పిన దాశరథి ఈయను వాదమునకు పూనుకొనుట సాహిత్య రసికుల కాహ్లాదకరమైన సంగతి. కావ్యము నందరును చదువుదురు. కాని కవియైనవాడు చదువుట వేరు. 'వర్ణ్యతే సర్వసామాన్యే స్వాదువిత్ కేవలం కవిః' రచనలోని స్వాదుతకొరకే శ్రీ కే. కే. ఒల్లూరి రఘువాచార్యులు ఫ్రెంచి భాష నేర్చుకొని విక్టర్ హ్యూగో వ్రాసిన లే మిరాబ్లె (Les Miserable) చదివిరట. ఉమర్ ఖయ్యాం రచనాస్వాదుతకై కే. కే. దువ్వూరి రామిరెడ్డిగారు పారసీ భాషనేర్చి 'పానశాల' రచించిరట ! ఇది మనవారి విద్యావ్యసనిత కొక చిహ్నము. ఉర్దూ భాషతోడి కోట్టదక్షమమైన పరిచయముతో నేడు దాశరథి గారు గాలిబ్ గీతాల ననువదించి మనకిచ్చుట విశేషించి మెచ్చుకొని సంతోషింప దగినసంగతి. వారి అనువాదసామర్థ్యమును సారళ్యమును గూర్చి బహుభాషావేత్తలు పండితులు అయిన మాన్య శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారును, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారును తృప్తిపడుటయే గాక మెచ్చుకొని రన్నచో వేరుగా చెప్పవలసినది లేదు. అయినను గాలిబ్ కవితను పాఠకులకు పరిచయము చేయవలసి యున్నది గనుక ఆపని చేసినచో దాశరథి అనువాద వైశద్యమును మన మించుక గమనింపవచ్చును.

మానవజీవితమును స్వభావమును మనసునకు తెచ్చు కొన్ని గాలిబ్ రచనలు రకరకములుగానుండును. అర్థ గాంభీర్యము లగించి ఒక్కొక్క చోట

'ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము'

అనును. పరహితము స్వార్థత్యాగము కృపాళుత మొదలగు ఉదారగుణములతోడి సాత్త్విక ప్రవృత్తిని నిలుపుకొనుట, పాశవిక జీవనమునకు పాల్పడకుండుట, కష్టమను ఊహను చెప్పెడి ద్వితీయచరణము మొదటిపాదమునకు ప్రాణము పోసి నిలబెట్టుచున్నది. అట్లే ఒక్కొక్కతరి

'ఈ యజాండమ్ములోని నశించునన్ని
గాలిలో దీప మట్లుండె గాదె రవియు !'

నని ప్రాకృత భాష కవులవలె బ్రహ్మాండమగు నూహసేయును. మరియొక సారి చిత్రముగా భావించి —

'పూలు ముక్కపి వారి ముఖాల వోలె
ఎఱ్ఱబడిపోవు, సంతలో కల్తీయగును'

అని ఉపమాన వైచిత్రితో మేళవించి చెప్పును. రసభావముల గూర్చెడుచోట ఊహలోనొక విస్ఫూర్తి విశేషము మెఱయించి

'ఎవతె అధరచక్రమ్ము భావించినావొ
రేయి మదినిండ చుంబన శ్రేణి వెలసె' ననును.

పగలు ప్రియురాలి యధరమును భావించుటవలన రాత్రి స్వప్నమున చుంబన శ్రేణి వెలయుటలో సాహజికత యున్నది. మరి, ఒక్కొకచో సహజ హేతువునే గాక హేత్వాభాసమును మట్టంకించి చమత్కారము చేసి

'ఏల కార్చు నొచ్చె బాలామణికి రాత్రి?
ఎవని స్వప్న సీమ కేగి వచ్చె ?'

ననును. లలిత మైన ఈ చమత్కారము నడుమ ప్రియురాలి సౌకుమార్యమును, ఆమె కలలో రావలసినదే గాని నిజముగా నెవ్వరి కడకును రాని క్రూరురాలనుటయు స్ఫురింప వలెను. ఒక్కొకచో అమాయకమైన దైన్యము భజించి

'ఆమె దారి బోవుచు వాడు క్షేమమరయు
ఏమి చెప్పుదు దారిలో నింక నేను ?'

అని తన విరహాకాతరత్వమును వెల్లడి చేయును.

పూర్వ మొకప్పుడు భోజరాజు కోరికపై కాళిదాసు కుంపటి నిట్లు వర్ణించెనట:

'కవిమతి రివ బహులోహా సుఘటిత చక్రా ప్రభాతవేళేవ
హరమూర్తి రివ హసన్తీ భాతివిధూమానలోపేతా'

గాలిబ్ కవిత ఒక్కొక్కప్పుడు సాసంతి సదృశముగా దుర్భర వేదన వెడల గ్రక్కును.

'ఎంతకని వ్రాతు నా గుండెనంత నింక
ఆమెకే చూపెదను రక్త లాంగుళులను.'
'పత్రమున నగ్ని లిఖ భద్ర పరచ వచ్చు
హృదయమున దుఃఖ వహ్ని భరించ లేము ?
'నా యెడద చీర్చి రక్త మండలము చేసె
నేను వేదనతో మరణించి నాడ;
ఇపుడు గోళ్లకు నెరుపు రంగెట్లు లెక్క
వెలది తాను గోరంటాకు పెట్టుకున్న ?'

ఎంత వేదన వెళ్లబోసి కొన్నను కొన్ని తావుల నర్మ గర్భ మైన హాస్యము చిలికి పలుకును:

'ఆమె తోటకు వాహ్యాళి కరిగె నంట
ఇంక తోటలో పూలు వాంఛించు నెవడు ?'
'అంద కత్తెలతో మాటలాడుకొరకు
చిత్రలేఖన విద్య నేర్చితిని నేను.'

గాలిబ్ గొప్ప ఆశావాది గనుకనే —

' ఈ యెడారి ముండ్లు కెడద ముక్కలు చెక్కి
పూలవోలె విలువజాలివాడ' నన్నాడు.

సమచిత్తుడు సహిష్ణువు గనుకనే —

'అన్న దక్కుల గలవు గాయాలపూలు
వధ్యశిలకేగెదను హాసవదనముననను' అనగలిగినాడు.

గాలిబ్ వ్రాసెడి కొన్ని భావములు సాదృశ్య మహిమచే సంస్కృత కవితను స్మరింప జేయు నట్లుండును.

'కత్తి చేత లేక కదనమ్ము జరిపెడి
ఇంతి కెవ్వ డసువు లీయకుండు' అన్నరచన ఒక విధముగా భర్తృహరి వ్రాసిన

'ముగ్ధే ధానుష్కతా కేయమపూర్వా త్వయి దృశ్యతే
యయా విధ్యసి చేతాంసి గుణైరేవ న సాయకైః'

అను శ్లోకము నాకర్షించుచున్నది. అట్లే —

'పావలెనె దుర్దినములున్న నరుడొకండు
రేయినే పగలను కొన్నదేమి పోయె' అన్నది భర్తృహరిదే అయిన
'సతి ప్రదీపే సత్యగ్నౌ సత్సు తారారవీన్దుషు
వినా మే మృగశాబాక్ష్యా తమోభూత మిదం జగత్'

అన్న శ్లోకమును స్ఫుర్తి కెత్తయించుచున్నది.

పోగా, పారసీక భాషా పాండిత్యమును పుక్కిట బట్టిన గాలిబ్ శృంగార రచనలలో సూఫీ యోగ పంథకు చెందిన ప్రతీకవాద మంతయో యింతయో యుండకపోదు. విప్రలంభశృంగారరసభరితము లైన రచనలకు భగవత్ పరమైన అర్థమును చెప్పుటకు కొందరు ప్రయత్నింతురు గాని ఉర్దూ సాహిత్య విమర్శకులా వాదము నంగీకరించ లేదని దాశరథి గారు వ్రాసినారు. ఏమైనను ఆ సాంకేతిక సంప్రదాయమే మనకు క్రొత్త గనుక దాని నించుక పరిచయము చేయుటకు ముందు గజల్‌ను గురించి రెండు ముక్కలు వ్రాయవలసి యున్నది.

'గజల్ అనునది మొదట (మనగీత ప్రబంధములవంటి) శృంగార పూరిత మైన రచన. అరబ్బీ భాషలో గజల్ అన్నదానికి యువతీ యువకుల పలుకులని అర్థమట. తొట్ట తొలుత ఎక్కువగా గజల్ వ్రాసినవాడు సనాయీ అనే పారసీక కవి. తర్వాత అత్తార్, రూమీ, ఈరాకీ, మగ్రిబీ, అమీర్ ఖుస్రో, సనీ, హాఫిజ్, జామీ, ఉమర్ ఖయ్యాం వంటి వారనేకులు ఈ మార్గమున సూఫీ యోగ పంథలోని ప్రతీకవాదము నిమిడ్చి వ్రాసినారు. ఆధ్యాత్మికమైన శృంగారముగా చెప్పినపుడు ఈరకపు కవితలో కనబడు సంకేతముల ననుసరించి భావ మెరుగ వలసియుండును. గాలిబ్ రచనలు కొన్నిచూపి సంకేత వివరణములు కొన్ని సూచింతును.

గాలిబ్ రచనలో సూఫీ తత్వ పంథకు చెందిన సాంకేతిక మార్గము ముందు సమకొనుటకు ఆయనను 'వలీ' (బ్రహ్మవిత్) గా సూచించెడు ప్రసిద్ధమైన ఈ పద్యము ఒక కారణము:

'యే మసాయిలే తసవ్వుఫ్, యే తెరా బయాన్ గాలిబ్
తుఝే హం వలీ సమఝ్తే, జో న బాదఖ్వార్ హోతా'
(గాలిబా! నీదు తాత్త్విక కలన యుహహా
త్రాగకుండిన నినుమేము యోగియనమె!) అంతేకాదు:
'ఎవరు గాలిబుతో కలహింప వలదు
యోగి యాతడు లోలోన, రాగిపైన'

గాలిబ్ స్వయముగా వ్రాసికొన్న వీనినిబట్టి సూఫీ సాంకేతిక వాదమున్నదని అనుమానించుట సమంజసమనుకొనవలసి యున్నది.

'క్రూరురాలని జగతిలో పేరుబడిన
దానితో నాకు పనిబడె దైవ వశత.'

పారసీక భాషలోని ఆ సాంకేతిక మార్గమున ప్రేయసి క్రూరురాలు. కరుణించనిది. దేవునకు భక్తులనేకు లుండునట్లు ఆమెకు అనేకులు ప్రియు లున్నట్లును సూచింతురు. గాలిబ్ గూడ అట్టి సూచనతో వ్రాసినాడు. పైదానిలోని దైవ వశత అన్నమాట భావము నెటు బట్టిన నటు త్రిప్పగలదు.

'తరుణి దీర్ఘ కేశములు సౌందర్యఘనులు
చెలసినవి నేడు నన్నురిపెట్టుకొరకు.'

ఆ వారి సాంకేతిక కవితలో కేశపాశము సర్వశక్తమైన భగవద్గుణ ప్రతీతికి చిహ్నము.

'భ్రుకుటి క్రిందుగ నయనమ్ము పొక్క గురువ!
అలయము పంచలనె పానశాలవలయు.'

భ్రుకుటి (అబ్రూ) పారతంత్ర్యము నాచ్ఛాదించెడి భగవంతుని గుణములకు గుర్తు. నయనము భగవంతుడు భక్తులను, వారి యోగ్యతను చూచుటకు చిహ్నము. ఈ సంకేతార్థములతో రెండవ పాదము అర్థమే మారిపోవునుగదా. పానశాల పరమాద్వైత స్థితికి ప్రతీక.

'నీదు నిండు చూపునే గోరి నేచితి
కొంతు నేమిటొ అరకంట తుదకు.'

అరకంటి చూపు (గంజా) తపన తర్వాత చిత్తశాంతినిగాని శాంతి తర్వాత తపనముగాని భగవంతుడు కటాక్షించుటకు గురుతు. పై పద్యమున రెండవదే ఉద్దిష్టము గాబోలు.

'మూతిలేని కలశ ముద్గానంగకు గాని
నాల్క లేదె నీకు నన్ను తిట్ట.'

నోరు కాన్పింపనంత చిన్నదనుట మనుష్యుని వ్యక్తిత్వమున కాకరమైన మూలస్థాన మగోచరమనుటకు సంకేతము.

'ఎంత తీయని పెదవులే యుంటి నీవి
తిట్టుచున్నప్పుడున్ గూడ తీపి కురియు.'

పెదవి అమృతత్వసిద్ధికి, తీపి కార్యకారణజ్ఞానమున కతీతముగ నున్న సత్యదర్శనానుభవమునకు చెందిన పారవశ్యమునకు గురుతులు.

'నడుము బిగియించు చుంటివి నన్ను తునుమ
నాకు తెలియులే నీకెంత నడుము కలదొ.'

నడుము (జున్నార్) పట్టా విధేయతాపేక్ష గొనుటకు సంకేతము.

'పానశాలయె లేని దేదైన నేమి!
బడి, మసీదు, సత్తరువు సర్వము నొకటి.'

పానశాల (ఖరాబా) వహదత్ అనబడు ద్వంద్వాతీతమైన పరమాద్వైత స్థితికి ప్రతీక. అట్లే ఖరాబాతీ (పానశాలకు

బోవువాడు) ద్వంద్వావసానమునడిగి సర్వక్రియలు భగవంతునియందు పర్యవసించునని ఎఱిగినవాడు. అనువాదసరణిలో దాశరథిగారు హైందవేతరమైన వాతావరణమున మన సంప్రదాయ సంస్కారముల కనువుగా మార్చి చక్కగాచూపినారు. చూడుడు :

'బ్రతుకుపై నింత విశ్వాస పడెదరేల ?
ఏడి మాంధాత, పురుకుత్సు డేడి నేడు ?'
'చిత్రగుప్తుడు వ్రాసిన మాత్ర మనము
పాపులగుదుము సాక్షి యెవ్వండు కలడు !'
'ఒంటిగా కాశి కేగ లేనోయి గురువ !
యాత్రికులవెంట కష్టాల ననుభవింతు.'

మననక్షమములైన భావములతో నిట్టి పద్యములు వ్రాసినపుడు కేవలము శిథిలబంధముగా గాక ఇంచుక గాఢబంధముగా కూర్చినచో జ్ఞప్తి కెలయించుకొనుట కనువుగా నుపస్థితిలో నుండగలవు. ఈ దృష్టికి వాలుగేసి చరణములు వ్రాసిన భాగములందును, సకృత్తుగా రెండు పాదము లున్నచోటను పదసంవిధానమున మరికొంత జాగ్రత్త వహించి యుండినచో చాల బాగుండెడిది. రెండుమూ డుదాహరణలు చూపి దీర్ఘమైన ఈ సమీక్ష ముగింతును.

'కుసుమములు విచ్చె, మొగ్గలు కూడ విరిసె
తెల్లవారె వాయుమ కన్ను తెరవలేదు.'

దీనిలో రెండవపాద మించుక కుంటుచున్నది. 'తెల్లవారిన దామె కందెరవ లేదు' అన్నచో మరికొంచెము పొందికగా నుండెడిదేమో !

'గుండెలో సఖిపై నున్న కోర్కె చచ్చె
కారు చిచ్చంటి సకలమ్ము కాలిపోయె.'

ఇక్కడ మొదటి పాదమున పొందికలేదు. గుండెలో నున్న సకియపై కోర్కె చచ్చె ననుట మెరుగనుకొందును. సకియపై కోర్కె అనుదాని నొకటిగా గ్రహించి పూర్వార్ధమును కోర్కతో అన్వయించుకొనుట కష్టముగాదు.

'ప్రణయమున చావు, బ్రతుకు సర్వమ్ము నొకటి
ఎవరికై చావగలనొ, జీవించగలను.'

ఈచోట ఎవరికై చావగలనొ వారికై జీవించగలను. అన్న అర్థస్ఫూర్తి రాదు. సంస్కృతములో గాని, తెలుగులోగాని యత్తత్ శబ్దములవంటివి రెండును రాక తప్పదుగదా !

ఏమైనను ఉర్దూ సాహిత్యములోని గాలిబ్ కవితా మధుపూర్ణచషకమొకటి యిట్లందిచ్చిన శ్రీ దాశరథి గారికి తెలుగు సాహిత్య రసలోలుపులు ఋణపడి యున్నారు. ఈ రచనతో కవిగా దాశరథిగారు శుక్తి విడిచిన ముక్తాఫలమైనారని చెప్పవచ్చును. మాన్యశ్రీ బి. గోపాలరెడ్డిగారి ఆంగ్ల పీఠిక, శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారి ఆంధ్రపీఠికలతోపాటు, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి విపులమైన అవతారికలతో పాటు, గాలిబ్ కవితా వైభవమును జీవితగాథను తెలుపు సుదీర్ఘ వ్యాసములు, గ్రంథాంతమున నిచ్చిన కవితా వివరణము, పాఠకులకు చాల సౌకర్యము చేకూర్చగలవు.

పొలము కలిమి

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

ఎసగి తొలకరి నీలి మొయిళ్లు చల్లు
చినుకు జల్లుల నుల్లము చెంగలింప
వసుమతీదేవి గగ్గురపాటు నొందు
శ్యామలస్నిగ్ధముగ్ధ సస్యాంకురముల

ఇవి వార్షికప్రకృతివధూటి కై సేసి
కొన్న సింగారపు వన్నెచిన్నె
లివి క్షుధాక్షుబ్ధమానవ సమాజమునకు
ప్రేయమ్ము చేకూర్చు జీవగఱ్ఱ
లివి కర్షకుల గాఢకృషిఫలితమ్ము దొం
తర పేర్చిపెట్టి బంగరుకొటారు
లివి విశ్వజీవనోత్సవ నిత్యకల్యాణ
కారణమ్ములు పచ్చతోరణములు

దేశమున కివి సౌఖ్యనిర్దేశకములు
లోకమున కివి లక్ష్మీవిలోకనములు
బ్రతికి, బ్రతికించు నొకవింత ప్రాణులివ్వి
మంటికుండెలదీపాలు పంటచేలు

హేమంతహిమకణాంచిత
సీమంతములైన పంటచేలు వసంత
క్షేమాభిరామధాన్య
శ్రీమంతములగుచు ప్రజకు జీవన మొసగున్

విచ్చిన కేతకీకుసుమ వీధులలో విహరించి, వాసనల్
తెచ్చుచు ఈలపాటరవళిన్ వినిపించెడు పైరగాలితో
ముచ్చటలాడుకొంచు శిరముల్ కదలించుచు సొంపుమీఱు ఈ
పచ్చని పంటచేల పయిపై విహరించు రమావిలాసముల్

నీలిమబ్బుల వాలు నీడ పారినచాలు
ఎండిపోయిన భూమి గుండె కరగు
బిఱ్ఱుగా నాగేలు కఱ్ఱు తాకినచాలు
నేలపై ముత్యాలచాలు వెలయు
మోటకాలువజాలు పొరగిల్లిన చాలు
పుడమిపైదలిమేను పులకరించు
కాపు చల్లని మేలు చూపు సోకిన చాలు
వసుధ పైరు పసిమి ముసుగుదాల్చు

తీయతీయముగా కల్పుతీయునపుడు
పల్లెపడుచులు కోమల స్వరముతోడ
పాటపాడినచాలు ఈ పంటచేలు
మెచ్చుకోలుగ తలలూపి, హెచ్చరిల్లు

కోసివోయిన క్షేత్రభూసతీమణి మేన
పసిడిపూవల సరిపణాలు గూర్చి
బారులుదీరిచి, వచ్చిపోయెడు చీమ
పేరటాండ్రను చాల గారవించి
పొలకువల్ తెలిసి, గుంపులు గట్టి కూర్చున్న
పులుగు చుట్టాలకు బువ్వ పెట్టి
నకనకలాడు దీన ప్రజాకోటికి
పరిగ గింజలు కొన్ని తిరిప మొసగి

పేదజీవుల పాలిటి పెన్నిధివలె
రేపుమాపు క్షుధార్తుల తృప్తిపరచు
అన్నసత్రము మాదిరి అలరుచుండు
పంట కళ్ళము కన్నుల పండువగుచు

సింహాచలక్షేత్రచరిత్ర

శ్రీ వి. గోపాలకృష్ణమాచార్యులు

విశాఖపట్టణమునకు మూడు క్రోశములదూరమున విశాఖపట్టణ మండలమున సింహాచల మను నీ ప్రసిద్ధ పుణ్యస్థల మున్నది. విశాఖపట్టణమునుండి దేవాయతనమును జేరుటకేర్పఱుపఁబడిన సోపాన పంక్తివఱకు మోటారులు పోవు త్రోవ యున్నది. నరసింహస్వామి కంకితమగు నీదేవాయతనమునకు నుత్తర సర్కారులలోఁ బ్రసిద్ధి గలదు.

ఈ దేవాయతనము లాంగూల గజపతిచే నిర్మింపఁబడినదను విశ్వాస మాతనికాలమునకుఁ బ్రాచీనములగు దానశాసనము లిక్కడ లభించుచుండుటచే నిరాధార మనక తప్పదు. ఈ యాలయమందలి శాసనములకాలము క్రీ.శ. 1100 నుండి యేడు శతాబ్దముల వఱకు వ్యాప్తము. తూర్పుగాంగులు, రెడ్డిరాజులు, నందపురమును బాలించిన శిలావంశజులు, మత్స్యవంశీయులు, గజపతులు స్వామి కనేకదానములు గావించిరి. శక సంవత్సరములు 1438, 1441 లలోఁ గృష్ణదేవరాయలు స్వామిని సేవించినాఁడు. శక సంవత్సరము 1438 లోఁ గృష్ణదేవరాయలు చిన్నాదేవి తిరుమలదేవి సహితుఁడై సింహాచలమునకేతెంచి స్వామి కనేకాలంకారముల నర్పించెను. కైంకర్యముల నర్పించెను. కైంకర్యములు జరుగునిమిత్తమనేక గ్రామములను శా. శ. 1441 లో ధారపోసినాఁడు.

గజపతుల పతనము తరువాత గోల్కొండ కుతుబ్ షాహి వంశ్యులీ ప్రదేశముపై దండెత్తి దేవాలయ సంపదను దోచుకొనిరి. శా. శ. 1526 (క్రీ 1604) వ సంవత్సరములో బద్మనాయక కులుఁడును విప్పర్ల గోత్రుఁడును నగు సర్వప్ప అశ్వరాయుఁడు స్వామికి నిత్యనైవేద్య రాగభోగములను బునరుద్ధరించి యవి యవిచ్ఛిన్నముగా జరుగు నిమిత్తము వరవయను గ్రామమును సమర్పించెను.

మధ్య యుగమున నీక్షేత్రము విద్యా కేంద్రమని పెక్కుశాసనములవలన నవగతమగుచున్నది. శ. సం. 1275 లో గంగానరసింహ భోగకాలమునఁ బురాణమును బఠించు బ్రాహ్మణునకు జీతమిచ్చు నిమిత్తము శ్రీ భండారమున కేఁబదిరెండు మాడలను గంగాదేవి యొసఁగినది. శా. శ. 1305 లో సింహాచల మందలి బ్రాహ్మణులకు వేదము చెప్పుటకుఁ జంపూ మహాసేనాపతి యొద్ద పెద్దిభట్టును నియమించెను. పురాణ కావ్య నాటక వ్యాకరణ కాండవ తైత్తిరీయశాఖలను బోధించు బ్రాహ్మణుల కదేవిధముగా నారాయణ సేనాపతి నిబంధముల నిచ్చెను.

కూచిమంచి తిమ్మకవి (క్రీ.శ. 1690—1757) కట్టమూరి కామేశ్వరకవి (క్రీ.శ. 1830—90) సింహాచల మాహాత్మ్య శ్రీ లక్ష్మీనృసింహ చరిత్రము లనుపేరఁ గ్రమముగాఁ దాము రచించిన ప్రబంధముల సింహశైల మాహాత్మ్యమును వర్ణించిరి. కూచిమంచి తిమ్మకవి

"నృపులకుఁ గావ్యం బొసఁగిన
నపవర్గంబిడఁగఁ గలరొ యటు గాకున్నన్
ద్విప తురగ భూషణాంబర
తపనీయాదికముచేతఁ దనుసంగలరో
నవిఁబూని తుచ్ఛభోగం
బునకై కొఱగాని జనులఁ బొగడుట యెల్లన్
గనుఁగొని విహపరదూరం"

బనిభావించి సింహాచల మహాత్మ్యము నైదాశ్వాసముల కావ్యముగా దెనుఁగున రచియించి గౌరీ వల్లభున కంకితము గావించినాఁడు.

జైమినిని మునులు జగన్నాథక్షేత్ర మహత్త్వము వాకర్ణించిన తరువాత జగన్నాథుఁడు నృసింహ మంత్రమునఁ బ్రతిష్ఠింపఁబడుట నెఱిఁగి నృహరి ముప్పదిరెండు మూర్తిభేదములలో నేవిముఖ్యములో తెలుపవలసినదిగా నభ్యర్థించిరి. అహోబలక్షేత్ర కోచహరంపాపసింహాచలములు తత్ప్రధానమూర్తిభేదము లధిష్ఠాన దైవములుగాఁ గలవని వచించెను. కృతయుగమున హరికిఁ బ్రతీహారులైన జయ విజయులు సనకాది మునివరేణ్యులను వైకుంఠము చొరనీక నిరోధించి విప్రునిచే శప్తులై హిరణ్యాక్ష హిరణ్య కశిపులుగా జన్మించిరి. హరి హిరణ్యాక్షుని వరాహ రూపమున సంహరించెను. (ఆశ్వాసము 1). హిరణ్యకశిపుఁడు ఘోరతపము గావించి బ్రహ్మచే వరములను బడసి త్రిదివమును సాధించెను. దిక్పాలురఁ బరాభవించెను.

"ప్రమదమున దివ్య వారుణీ రసముగ్రోలి
విహ్వలక్షణుఁడగుచు నవ్వి బుధ వైరి
శక్రపురిలోనఁ గలుగు నచ్చరల నెల్లఁ
దానె గైకొనె నతులితోత్సవము నెలయ
కిన్నరులుగొల్వ గంధర్వగీయ మానుఁ
డగుచు ననిశంబు నచ్చరచిగురుఁబోండ్లఁ
గూడి క్రీడించు నద్దైత్య కుంజరుండు
నందనోద్యాన వీటి కాంతరములందు" ఆ 2.

ఇంద్రాదులు వైకుంఠమునకు హరికి మొఱవెట్టుకొనవేగి సుముఖుఁడను ప్రతీహారిచే నిరోధింపఁబడిరి. తరువాత రమా వల్లభుఁడు వారికి వారి ప్రవేశమును నిరోధించిన సుముఖుఁడే దైత్యుని వధకు హేతువు కాఁగలఁడని తెలిపి సంతృప్తిఁ గొల్పెను. సుముఖుఁడు హరి శాపమునఁ బ్రహ్లాదుఁడుగా జన్మించెను. (ఆ 2).

ప్రహ్లాదుఁడు విష్ణుభక్తివలనఁ దండ్రిచేఁ బెక్కు బాధల నొందెను. తుద కబ్ధిఁ ద్రోయఁబడెను. సముద్రగతుఁడగు నాతనిపై శిలోచ్చయము నిక్షిప్తము. ప్రహ్లాదుఁడు హరిని బ్రార్థింప నాతఁడు సాక్షాత్కరించి

"ఏపుతో బ్రచండ రూపంబు ధరియించి
రేపు నిశ్చల ప్రతాపుఁడయిన
నీదు జనకుఁద్రుంతు నేను నీ వప్పుడు

వాత్మలోన భీతినందవలదు
వినుము డింభక యీ రూపమునని లోక
హితము గోరుము నీ యువ శైలేంద్ర రమ్య
సానువులయందు వసియింతు శాశ్వతముగ
వ్యగ్రత యొకించుకయులేక హర్షమొదవ" (అ 4)

నని వచించి యుక్లీకావించెను. ప్రహ్లాదుఁడు సుతుఁడగు విరోచనుని సింహాసనాసీనుఁ గావించి సింహశైలమునకువచ్చి హరి నారాధించి కొన్ని హాయనము లుపక్రమింప సాయుజ్యము నొందెను. కలి యుగమున వల్మీకాచ్ఛాదితుఁడైన హరిని పురూరవుఁడు ప్రియయగు నూర్వశి వచనము ననుసరించి నిరాహారతఁ గడపి సాక్షాత్కృతుఁజేసికొని ప్రతిష్ఠించెను. (అ 5).

పైని స్థూలముగా వ్రాయఁబడిన కథలో విష్ణు పురాణ భాగవతములలోఁ గనరాని క్రింది విశేషములు కానవచ్చుచున్నవి.

1. జయ విజయులు నర జన్మమును విష్ణుశాపమునఁ బొందిరి.
2. బ్రహ్మాది దేవతల ప్రవేశమును విరోధించుటచే సుముఖుఁడను ప్రతిహారి నరయోని జనించునట్లు హరి శపించెను. అతఁడే ప్రహ్లాదుఁడు.
3. ప్రహ్లాదునితో హరి హిరణ్యకశిపుని సంహరింతునని సింహశైలమున వెలసెదనని చెప్పెను.
4. పురూరవుని వృత్తాంతము.

ఈ విషయములు ప్రకృత కవిచేఁ గల్పితము లనఁజనదు. సంస్కృతభాషలోనున్న శ్లోకరూపమగు మూల ప్రతికి భాషాంతరీకరణమగు శ్రీ విద్వాన్ దేవరకొండ జోగి రామశాస్త్రి రచించిన సింహాచలక్షేత్ర మాహాత్మ్యమను వచన గ్రంథమున నీ విషయములు క్రమముగా 4, 10, 19, 24, 29 అధ్యాయములలోఁ గానవచ్చుచున్నవి. ఈ గ్రంథము వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్‌వారిచేఁ గ్రీ.శ. 1927లోఁ బ్రకటితము. కూచి మంచి తిమ్మకవి యితివృత్తము నందుండి గ్రహించి యుండనోపును.

లక్ష్మీనృసింహ చరిత్ర కర్తయగు కట్టమూరి కామేశ్వరకవి యాపస్తంబ సూత్రుఁడు. కాశ్యపసగోత్రుఁడు. తండ్రి సాంబమూర్తి. తల్లి కొండమాంబ. ఇతఁడు విశాఖపట్టణ మండల వాస్తవ్యుఁడును, విశ్వనాథ శతకాదుల రచించి ప్రసిద్ధిఁ బడసినవాఁడునగు నమలాపురపు సన్యాసికవికి దేశికుఁడని క్రింది సీసమాలిక వలనఁ దెలియనగుచున్నది. ఈ సీసమాలిక సన్యాసి కవి రచించిన పంచముఖేశలింగ స్తుత్యంచిత పద్యద్వాత్రింశతి ప్రాంతప్రతి తుదనాతని శిష్యుఁడగు దేవులపల్లి చంద్రశాస్త్రి రచించినదిగా లేఖకునిచేత నుదాహరింపఁబడినదని శ్రీ వంగూరు సుబ్బారావుగారు తమ శతక కవుల చరిత్రమునందు వ్రాసినారు.

"తన వంశ కర్తయై తనరారు శాలివా
హన మహారాజ శకాబ్దములు క
రగజర్షి విధు సంఖ్యఁదగు రౌద్రి వత్సర
చైత్ర శుద్ధ నవమి మిత్ర పుత్ర
వారత్రియామాది యై రహిన్నమ నము
యంబున నమలా పురాన్వయాప్తు
తాంబోధి రాకాసుధాంశుండు నాగ య
ద్యుపమంది మదిని సద్భక్తి మెరయఁ
గట్టమూరి కులాగ్రగణ్యుఁడై మించు కా
మేశ్వరాఖ్యాక కవీంద్రునివలన
సకలంక వృత్తిని సకలాంధ్ర భాష ని
శేషజ్ఞుఁడై నిజ శిష్యనంద
యమునకు నెల్ల మహోముద మొదవంగఁ
గరతలామలకంబుగాఁ గ వన్ని
విద్యలఁ గరపి వివేకాత్ముఁడగుచుఁ గా
శీ ప్రముఖాఖిల క్షేత్రములను
గ్రమమున సేవించి రామాయణ గ్రంథ
మమరంగ వ్రాసి పట్టాభిషేక
మొనరించి ధరణీసురోత్తము లలర
రుద్రాక్ష మాహాత్మ్య ముఖ్యప్రబంధ
ములు మూఁడు సర్చి విప్రులు సోమవార మ
హోత్సవుండయి యనయంబు నీటులు
సలరు సన్యాసి నామధేయాన్వితుఁడు స
ముత్త్వలంబగు లింగైక్యమొందె నౌర
ఇలఁపఁగా నిట్టి పురుషుండు ధాత్రిఁ గలఁడె
యనుచు జనులెల్ల నొక్కటై యభినుతింప"

ప్రకృత సీసమాలిక యందలి రెండవ పాదముచే సన్యాసి కవి జన్మించిన సంవత్సరము శా. శ. 1782 (క్రీ.శ. 1860) యని స్పష్టము. ఇతనికి దేశికుఁడగు కామేశ్వరకవి కాలమందుచేఁ గ్రీ.శ. 1830-1890 యనిస్థూలముగానిర్దేశించుటనిర్బాధము.

లక్ష్మీనృసింహ చరిత్రమునకు లభించిన ప్రతిలోఁ దొలి మూఁడు పత్రములును నష్టములగుటచేతఁ గవిని గూర్చిన వివరములు తెలియవచ్చుటలేదు. మూఁడవ యాశ్వాసములో గొంతభాగము మాత్రమే, యుపలబ్ధప్రతిలోఁగానవచ్చుటచే, గ్రంథమసమగ్రముగా లభించినదని స్పష్టము. ఈ గ్రంథము మామా వల్లభున కంకితము. ప్రహ్లాదుఁడు సింహశైలస్వామిని సేవించుచుండుటతో నుపలబ్ధ భాగమందలి కథ ముగియుచున్నది. ప్రకృత గ్రంథేతివృత్తము తిమ్మకవి కావ్యమందలి కథలోఁ దుల్యము. ఇతని శైలికి క్రింది పద్యము నుదాహరణముగా గ్రహింపఁబడును.

"కాదంబినీ పంక్తిఁ గముగొని నటియించు
కేకి కాపలిఁ (?) గాంచి కేక లిడునె
రమణీయ వర్ష ధారలు గ్రోలు చాతకి
తతహిమాసార సంతతికిఁ జనునె
పరిపక్వమున చూతఫలపాలి యెప్డు మించు
కీరంబు శాల్మలి చేరఁబునె
బిసకాండ ఖండముల్ గ్రసియించు రాయంచ
కొఱుకనోపునె తోటకూర కాడ
ఇందిరానాథ పాదార వింద యుగళ
సంతత ధ్యాన నిష్ఠ ప్రశస్త మహిమ
జనిత సంతోష పరసుధాజలధిఁదేలి
చెలఁగు మచ్చిత్త మితరులఁజేరు టెట్లు"

తెలుగు కవిత్వం ఎప్పటిది?

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

క్రీ. శ. 848—891, మధ్యకాలములో వేంగిచాళుక్యరాజు గుణగ విజయాదిత్యుని సేనాధిపతి పాండురంగని పద్య శాసనకాలముతో తెనుగు దేశకవిత ప్రారంభమైనదని భాషా వేత్తలు గుర్తించియున్నారు.

దేశి కవితఁ బుట్టించి
తెనుంగువ నిలిపిరి
చాళుక్యరాజు
మొదలుగఁ బలువుర్.

—(కుమార ఆ 1—28)

ఇది చోడరాజకవిశిఖామణి మతానుసారము సరిపోవు చున్నది. కాని, కడపజిల్లా కమలాపురం తాలూకా, రేనాటి చోడరాజుల శిలాశాసనములలో తెనుగువచనము వ్రాయబడి యున్నను, అవి పద్యములను బోలియున్నవని పరిశోధకులు సభ లలో చదివి వినిపించుచున్నారు. ఇవి పద్యములు కానే కావను విమర్శకులు కూడ కలరు.

నెల్లూరులో ఒక పరిశోధకుడు నా దగ్గర ద్విపదకు కుదాహరణముగా తిప్పలూరు శాసన భాగము చదివినప్పు డందలి బార్హస్పత్యమానకాలము నన్నాకర్షించినది. డా॥ తంగిరాల వెంకట నారాయణ శాస్త్రిగారి అనుమతితో తిప్పలూరు శాసన మూలము వ్రాసికొని, కాలనిర్ణయముచేయ వీలున్నదో, లేదో చూతమను జిజ్ఞాసతో చాలకాలము గడచినది. శ్రీ శాస్త్రిగా రా కాలము లెక్కించి, సిద్ధాంతము చేయుదురేమో అని నిరీక్షించితిని.

ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రంథాలయములోని రేనాటి చోడశాసనములను ప్రియమిత్రులు శ్రీ మల్లంపల్లి సోమ శేఖరశర్మగారి సానుభూతితో సంపాదించి, చదివి, మూలము సరి చూచుకొంటిని.

ఇప్పు డా కడపజిల్లా కమలాపురము తాలూకా, తిప్పలూరు శిలాశాసనమూలము వివరణలతోచూపి, ద్విపద లక్షణమును, తద్రచనా బార్హస్పత్యమానకాలమును లెక్కింప సాహసించితిని. ఇందేమేని కాలదోషాదులున్న సవరించుటయో, తిరస్కరించు టయో సిద్ధాంతులు చర్చించి, తేల్పవలసియున్నది.

డాక్టరు తంగిరాల వెంకట నారాయణశాస్త్రిగారు, ఎమ్. ఏ. పి.హెచ్. డి., ప్రసాదించిన మూలములో ద్విపద భాగము.

'పుణ్య కుమారుస్త్రి—గణ్యమానుస్త్రి
మఱిన్న విడుకు—మద ముదితుస్త్రి
త్తమోత్తము డయినవాస్త్రి
చిఱ్ఱలియ వటుకాను రేనాణ్డేలుచు.'

తచ్ఛాయ మూలము—

'పుణ్య కుమారు(న్డు—గణ్యమానున్డు
(మా)ఱు(తు)న విడ్డు(గు)—మదముదితున్డు
(ఉ)త్త మోత్తముడయి—(యుండి)నవాన్డు
(చి పలియవ(ట్టు)కా—రేనా(న్డు)(నే)లు.

ఈ ద్విపదలో యతులు చెల్లినవి. ప్రాసయతి కూడ చెల్లి నది. ఆది ప్రాసలేదు. అంత్యప్రాసమూడు పాదములలో చెల్లినది. నాల్గవపాదములో చెల్లలేదు. చిర్వలియపట్టుకా—నేలురేనాన్డు అని మూలమువూర్చి చదివితే, అంత్య ప్రాసకుదురును. స్వర మైత్రియతి అంగీకరింపనిచో యతిభంగ దోషము.పూరించిన భాగ ములు శాసనలేఖకులదోషములేకాని, కవిదోషములు కావని చెప్పవీలున్నది. చి—చిర్ రూపాంతముగా చెక్కుట సాంప్ర దాయము. అద్రుచు—అదురుచు వంటివి కాబోలు. పూర్వ మందున్న 'న్డు' కారములో పరమందలి 'ఉ' కారము గర్భితమై యున్నది. అయియుండినవాన్డు చెక్కుటలో 'యుండి'లోపించి నందువల్ల యతిభంగ దోష మేర్పడినది.

ఇందు 'స్వస్తి శ్రీ ఎరికల్ల ముతు(రా)జు పుణ్య కుమారున్డు ——————చిర్వల్వియ పట్టుగా రేనాన్డు నేలుచు తక్కార్ పురోం (తక్కారప్రోలు) పారదాయ (బ్రాహ్మణ దాయాది)కి రేవురు (కిరేవూరు) కత్తిశర్మకు తిపర్లూరి(న్)సవాశ (పన్నాస) కొణ్డ (—ఇచ్చుట—కొండుధాతువు) కా(త్తిర్) య చీకువ బిదె (జ?)య సోమవారంబు పుణరు పుష్యంబుగ్ర బ (బృ)హస్పతి హారకానుబిచ్చుదియొచామణ (సావన) కాలభ'

Epi, Ind XXVII Port V. P. 233; Epi coll. No. 283 of 1937-38.

ఈ తిప్పలూరు శాసకాలము అక్షర విన్యాస కాలమును బట్టి చూచినచో క్రీ.శ. 7 శతాబ్ది పూర్వ భాగమునాటిదనియు, ఇందలి కాలము లెక్కించుటకు వీలుపడని*దనియు శ్రీ కే. ఏ.

---

* The astronomical details provided by the inscription are unfortunately not enough for calculatng the corresponding Englisu date.

నీలకంఠశాస్త్రిగారు, (మద్రాసు) శ్రీ ఎమ్. వెంకటరామయ్యగారు (ఉదకమండలము) తీర్మానించినారు.

అయినను, ఇందలి కార్తికమాసము, దీకు—కృష్ణపక్షము, బిదియ—విదియ, సోమవారంబు, పునరుపుష్యమి—పునర్వసు నక్షత్రము—బృహస్పతి హెూరకాలమును వివరించి సూచించినారు. బ. ౨ తిథిలో పునర్వసు నక్షత్ర సంయోగము దుస్సాధ్యమని కూడ సూచించినారు. కాని, ఇది బిదియ—విదియ తిథికాదని విజయ తిథి-జయతిథి కాబోలనుట బ ౨ పునరుపుష్యంబు సమన్వయము.

ఇందలి 'బృహస్పతి హెూర కాను ఏవ్ఫదియె పావన కాలము' ౯-౫౦ నామగతి విక్రమశకము ౫౦౯ వర్షంబులగుచున్నవి. గురు బలము 5 -7—9— కోణ దృష్టిలో కలదు కాబట్టి, ౯ ఉచ్ఛ దృష్టి బృహస్పతి సంఖ్యాహెూరగా లెక్కించడమైనది. లేదా, భావ నిఘంటువులో 'నవమం- గురు* భాగ్యకమ్' అని బృహస్పతికి 'నవ' సంఖ్య సూచింపబడినది.

దీనిలో తెనుగుసంవత్సరము పేరు చెప్పలేదు. చాంద్రమానములో సంవత్సరముపేరు బార్హస్పత్యమానములో వేరు పేరుగా ఉండుట నైజము.

చాంద్రమానములో ఆశ్వయుజ బహుళ అష్టమీ తిథి—బార్హస్పత్య మానములో కార్తిక బహుళ అష్టమీ తిథిగా పేర్కొనుట కాలభేదముకాదు.

పంచాంగప్రకారము వి. శ. 509 వర్షంబులగు నేటి కార్తిక బ ౨ సోమవారము పుష్యమీ నక్షత్ర బార్హస్పత్యమానము 22—9—452 తేదీ ఆశ్వయుజ బ ౨ సోమవారము పుష్యమీ నక్షత్ర చాంద్రమానకాలముగా (14—9—452 తేదీ ఆశ్వయుజ శు ౧౫ చంద్రగ్రహణం-ఆదివార కాలసాధనముతో) లెక్కించడమైనది. పుష్యమి నక్షత్రముసరిపోవుచున్నదికాని, పునర్వసు నక్షత్ర శేషము కూడ సరిపడునేమో సిద్ధాంతులు సరిచూడవలసియున్నది.

క్రీ. శ. 814—877 ప్రాంతమందలి కన్నడకవిరాజమార్గ గ్రంథమ్ము కంటె మూడున్నర శతాబ్దముల ముందు తెనుగు కవిత్వము—ద్విపద శాసనము—కలదనుట రేనాటిచోడ శాసన కాల సిద్ధాంతము.

క్రీ. శ. 452 లో తెనుగులో దేశికవిత పుట్టిన కాలమందు బాదామిచాళుక్యవంశము కూడ ఏర్పడలేదు. గంగ వంశములో అయ్యవర్మ, కృష్ణవర్మల కాలమును—కదంబ వంశములో శాంతివర్మ, కుమారవర్మ, ఒకటవ కృష్ణవర్మల కాలమును, పుణ్యకుమారచోడరాజా తిప్పలూరు తెనుగు శాసనకాలముతో సమకాలముగుచున్నది.

దీనినిబట్టి చూచినచో దేశికవిత బుట్టించి తెనుంగున నిరినిరి—ఆ చోళరాజా మొదలుగా బలువుర్ అను మాతన చరిత్రను మార్చి కూర్చవలసినట్లున్నది. చారిత్రకు లేమందురో తెలియదు.

పల్లవవంశములో రెండవ స్కంధవర్మ కాలము క్రీ. శ. 400—36 ప్రాంతములో రేనాటి చోడరాజులు—తెనుగు ప్రభువులు విలసిల్లినట్లు సమన్వయ మేర్పడుచున్నది.

ఇక తెనుగులిపి కన్నడతెనుగులిపినుండి పుట్టినదో, తెనుగు లిపినుండి కన్నడ లిపి పుట్టినదో మొదలగు జిజ్ఞాసలు చెలరేగుచున్నవి.—అక్షర విన్యాస కాలములో కూడ పరిణామ చరిత్ర మారవలసినట్లు కనబడుచున్నది.

Ep. Ind. Vol. XXVII, part. V, P. 233.
ఆంధ్ర యూనివర్శిటీ ప్రొఫెసర్ శ్రీ సుబ్బారెడ్డిగారు ఈ సంచికను తెచ్చియిచ్చినందున వివరము తెలిసినది—

* నవమంచ త్రికోణంచ సుకృతం గురుభాగ్యకమ్—తొమ్మిదవ యింటికి పేర్లనిఘంటువు.

వీరశైవాచార కౌస్తుభము

శ్రీ గొల్లపిన్ని వాసుదేవశాస్త్రి

నేను చిరకాలముగా లిపి తెలియని తాళపత్ర గ్రంథములను (మా ఇంటి గ్రంథాలయమున నున్నవాటిని) చాలా భద్రముగా దాచియున్నాను. అందులో కేవలం లిపికాఠిన్యమైన వానిని పండితులకు సందర్భమువచ్చినప్పుడు చూపువాడను. కాని ప్రకృతము కొన్ని తాళపత్రగ్రంథములను రసామ్నాయము చరిత్ర వ్రాయుటకై విషయమును తెల్పుకొనుటకు భాగ్యనగరమునకు తెచ్చి శ్రీయుతులు మిత్రులు డాక్టరు డి. వి. సుబ్బారెడ్డిగారి సహాయమున పై గ్రంథములను ఫొటోలు తీయించితినిగాని విషయ మిదమిత్థమని బోధపడలేదు. లిపి చాల ప్రాచీనమైనది. గ్రంథము పోగాపోగా 53 పేజీలు మాత్రము కలవు. అందులో కొంతకొంత చినిగిపోయిన పత్రములును గలవు. శ్రీ తాళముపై ఆనాటి దేవనాగరిలో ప్రక్క నున్నలుంచి వ్రాయబడిన గ్రంథ మిది. నే నీ గ్రంథము నింతవరకు నాకు తెలిసిన అక్షరములను బట్టి ఏదో తంత్రగ్రంథమై యుండునని నిర్ణయించుకొని యుంటిని.

పేరుకార్యముగా మా బస దగ్గరకు శ్రీ ఆల్వారు నరసింహాచార్యులువారు వచ్చియుండగా ఏదో ప్రసక్తివశమున వారికి చూపగా వారీ పురాతన లిపిని చదివి అందలి యంశముల నీ క్రింది వానిని తెల్పిరి. ఇందలి విషయములు నాకు తెలిసినంత చారిత్రదృష్టికి (నేటి) విశేషముగాతోచినందున 'భారతి' కా విషయమును ప్రచురణార్థమై నివేదించుకొను చున్నాను.

ఆ కొలదిలో ఆచార్యులవారీ గ్రంథవిషయములను చదివిరి. క్రియాకాండ 24 వ ప్రకరణము. స్నాన కాండ, ఏకావరా ప్రకరణము ఇత్యాదులు; విషయము లోకాలోక వర్ణన ప్రధానముగా నున్నట్లు గోచరించుచున్నది.

గ్రంథమువందలి గద్య మిట్లున్నది: "ఇది శ్రీమదనాది ప్రమథ పరంపరాగత బ్రహ్మవిద్‌జ్ఞాన సద్భుక్తిసార సుధారససార .... సకలశాస్త్రలబ్ధబుద్ధివికాసేన గురుచరణ

రేఖు సంకలిత మస్తకేన, మౌనభవిదుషావిరచితే వీరశైవా చారకౌస్తుభే ముక్తికాండే శైవప్రాభవః లింగప్రదర్శ వార్థం ప్రపంచిత బ్రహ్మాండ నిరూపణే .... నామ పంచమం ప్రకరణం". ఇట్లున్నది గద్యము.

ఇట్టిగ్రంథ మొకటి యున్నట్లు నే నింతకు మున్ను వినలేదు. కర్త మౌనభుఁడు. ఇతడు నా దృష్టిలో 'మౌనః' అని పేర్కొనబడుచున్న 84 గురు రససిద్ధులలో యొక్కఁడని భావించు చున్నాను. రససిద్ధుల కాలము నిదివరకు నిర్ణయించిన పండిత ప్రకాండులు శ్రీ రాహుల్‌సాంకృత్యాయన్, శ్రీపి. సి. రేప్రభృ తుల సిద్ధాంతము చొప్పున ఈ మౌనభుఁడు బసవేశ్వరుని కన్న చాల పూర్వుడగుచున్నాడు. అప్పుట్టుడే నేటి మన చారి త్రకులు వీరశైవము బసవేశ్వరాద్యుపజ్ఞమని నిర్ధరించినారు. శ్రీ రాహుల్ సాంకృత్యాయన్‌గారు వీరశైవము ఆదిశైవాది షడ్విధ శైవములలో చేరక నవీన మైనదని వాదించుచున్నారు. కేవల లింగధారణమును బసవేశ్వరుఁడే నెలకొల్పెనని యునూ అనుచున్నారు. మౌనభ రససిద్ధుని కాలములో వీరశైవమున్న ట్లీగ్రంథము ప్రబల సాక్ష్య మొసంగుచున్నది. ఇందులో మరొక వింత. కౌస్తుభము, విష్ణువు ధరించు మణివిశేషము. అట్టి పేరును శైవమతప్రవక్త గ్రహించి దానినే భూషణముగా తన గ్రంథమకుటముగా యుంచినాఁడనుటయు మిక్కిలి యాశ్చర్యమును కల్గించు నంశమే యగుచున్నది.

ఇందు ఇంకను నేమున్నదో విచారించుట అవశ్యముతో కూడిన పని. అంతవరకూ లోకములో నీగ్రంథవ్యాప్తి యుండినచో పండితప్రకాండ లీ పై సంశయములను దీర్పగలరని తలంచి ఇప్పటికి తోచిన యంశములను ఇందుమూలముగా తెల్పి యున్నాను.

శ్రీశైల ప్రశస్తి పన ఇందు గలదు. మొత్తము ఎనుబది నలుగురు రససిద్ధులనూ శ్రీశైలమున సిద్ధిగాంచినవారని రసశాస్త్రవేత్తలు (పూర్వులు నిత్యనాథాది సిద్ధులు) స్వగ్రం థములలో వ్రాసియున్నారు. నవనాథ సిద్ధులు శ్రీశైలములో యున్నట్లు అందరును నిదేనే యున్నారు. బసవన్నకు ముందు వీరశైవమున్నచో అది ఎట్లుండెను ? అనుట కీ గ్రంథమే (పోగా మిగిలిన పత్రములే) మన కాధార మగుచున్నవి. ఈ వీరశైవాచార కౌస్తుభము ఎచ్చటనైన యెవరిచేనైన చూడఁ బడిగాని లేదా ముద్రింపఁబడిగాని యున్నదా ? అను సంశ యము కల్గుచున్నది. అట్లు దీనివిషయము తెలిసియున్న విద్వాంసులు పై నా ఈ సంశయమును తీర్చగలందులకు ప్రార్థితులు.

మరియు బ్రహ్మాండ వివరణమున నీకవి లేదా రసి సిద్ధుఁడు లింగపురాణము స్కాందపురాణము ఇత్యాది పురాణముల రీతి కించుక భేదించుచున్నాఁడు. అందులకు గల కారణములు విమర్శింప దగినవై యున్నవి. ఇతని వైకుంఠ లోక వర్ణన ముదాత్తముగా నున్నది. లిపి మరఠమైనది కావం దున దీని రహస్యము లిన్నినాళులు దాగినవని.

ఏకవీర - కాకతమ్మ

శ్రీ టి. రాజేశ్వరరావు

ఏకవీర—కాకతమ్మ మరియు ఏకవీర—ఎల్లమ్మ ఒక్కరే అని శ్రీయుతులు గజపతిరాయవర్మ మరియు శ్రీపాదగోపాల కృష్ణమూర్తిగారలు 1961 భారతిలో కొన్ని సంచికలలో వ్రాసినవి చూచాను. కాని ఈమధ్య 'కాకతీయుల' చరిత్ర పరిశోధనలలో దొరికిన సారాంశాలను బట్టి కాకతమ్మ— ఏకవీర మరియు ఎల్లమ్మ ఒకే దేవత కారని తేలుచున్నది.

చారిత్రికాధారముల ననుసరించి కాకతీయులకు గణప తీశ్వరుడు, వీరభద్రుడు, ఏకవీరాదేవి, కాకతమ్మ ముఖ్య దైవతములు. ఈ దేవాలయాలన్నీ వరంగల్లుకు పదిమైళ్ల దూరంలోఉన్నవి. వీరుగాకమైలారుదేవుడు అయినవోలు గ్రామం లోను కేశవస్వామి హిడింబాశ్రమంలోను ఉన్నారు.

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు కాకతమ్మ ఓరుగల్లు కోటలో నున్నట్లు వ్రాశారుకాని అది సరికాదు. కాకతమ్మ 'హనుమద్గిరి' (హనుమకొండ పూర్వం కోటలో కొండపై నున్నది)లో నున్నది. దీనికి తార్కాణంగా దేవాలయంలో ఒక శాసనం ఉన్నది. ఆ శాసనంప్రకారం కాకతమ్మను కాకతీయరాజులు తమ కులదైవంగా పూజించుచుండే వారని కూడా కలదు. అంతకు ముందు జైనమతమునకు సంబంధించిన శక్తి దైవతం అయి యుండ వచ్చును.

శ్రీ. జి. ఆర్. వర్మగారు కొలిపాక్ లేక కొలనుపాక శాసనం ప్రకారం ఏకవీరాదేవి — ఎల్లమ్మ ఒక్కరే ననటం అసంబద్ధంగా ఉన్నది. అయితే ఏకవీరాదేవి పేరున మండపాక —మాహూర్ మరియు పోలవాసగ్రామాలలో దేవాలయములు

ఉన్నమాట వాస్తవమే అయినా ఏకవీరాదేవి వరంగల్లుకు నాలుగైదు మైళ్ల దూరానగల మొగిలిచర్ల గ్రామంలో యున్నట్లు పెక్కు చారిత్రకాధారములు కలవు. తెలంగాణా చరిత్ర పరిశోధకులలో ముఖ్యులైన శ్రీ ఆదిరాజు వీరభద్రరావు శేషాద్రిరమణ కవులు 'ఏక వీరాదేవి' మొగిలిచర్లలోనే యున్నట్లు పెక్కు శాసనాలను పరిశోధించినతర్వాత నిర్ణయించారు.

ఇందుకు ఉదాహరణగా రుద్రమదేవి మొగిలిచర్లలో త్రిరాత్రోపవాసవ్రతం చేస్తుండగా మహారాష్ట్ర రాజగు మహాదేవరాజు ఓరుగల్లు కోటపై దండెత్తిరావడం జరిగింది. ఆసమయంలో రుద్రమదేవి ఓరుగల్లులో లేదని తెలుసుకొనిన మహాదేవ రాజు మొగిలిచర్లకు తన సైన్యాలను తరలించి రుద్రమ దేవి పై దండెత్తి ఓడి పోవటం జరిగింది. ఇది ఇట్లా జరిగిందని నిరూపించే ఆధారాలు ఇప్పటికి ఆ గ్రామంలో అనేకం ఉన్నవి. శిథిలావస్థలో ఉన్న దేవాలయం, దానికి చేరువలోనే దరిదాపు ఆరు ఏడు అడుగుల ఎత్తు స్త్రీ రూపం పోలియున్న భైరవ విగ్రహం కలవు. అదియును గాక చరిత్ర పరిశోధకులు శ్రీ మారేమండ రామారావు గొట్టిముక్కల రాధాకృష్ణరావు ఇంకా తదితరులు ఏకవీరాదేవి ఆలయం మొగిలిచర్లలోనిదే సరియైనదని నిరూపించారు.

కొంతకాలంక్రితం నేను మొగిలిచర్ల పోవటం తట స్థించింది. నాతో పాటు వరంగల్లుజిల్లా సబ్—కలక్టర్‌గారైన శ్రీ. పి. సీతాపతి కూడా వచ్చారు. మా పరిశోధనలో ఏకవీరాదేవి ఆలయం అందున్న శిలావిగ్రహాలను బట్టి ఏకవీరా దేవికి నాలుగు భుజములు లేవని, వీరత్వం ఉట్టిపడే ఒక విగ్రహం త్రిశూలం ధరించియున్నట్లు, మరియు వాహనం సింహంగా యున్నట్లు కనుగొన్నాము గాని శ్రీ శ్రీ పాదవారు అన్న నక్కగాని శ్రీ గణపతి రాయవర్మ గారన్న పందికొక్కుగాని మాకు కన్పించ లేదు. సింహం పోలికలు మాత్రం ఉన్నాయి.

స్థలపురాణమునుబట్టి మరియు అక్కడి శ్రీ శ్రీరాం వెంకన్న (శతవృద్ధు) చెప్పిన దాన్ని బట్టియు ఏకవీరాదేవి—యల్లమ్మ మరియు కాకతమ్మలు ఒకరు కాదనే తేలుతున్నది. వారుచెప్పిన దాన్నిబట్టి ఆయనకు ఇరువది ఏండ్ల వయస్సు వరకూ అనగా 80 సంవత్సరము క్రితంవరకూ వరంగల్లు జిల్లాలోని ప్రజలు ప్రతి సంవత్సరం ఆశ్వయుజమాసం దసరాసమయంలో ఏకవీరాదేవి ఉత్సవాలు జరుపుకుంటుండే వారని, కొన్ని సంవత్సరాలకు ఏకవీరాదేవి వెళ్లిపోయిందని ఉత్సవాలు ఆపువేయబడినవని మాకు తెల్పినారు.

ప్రతాపరుద్రీయం వ్రాసిన విద్యానాథకవికూడా ఏక వీరాదేవి వరంగల్లుకోట ఉత్తరభాగంలో యున్న మొగిలి చర్లలో యున్నట్లు తెల్పినారు. అదియునుగాక రుద్రమదేవి ప్రతి శుక్రవారం ఏకవీరాదేవిని పూజించుటకు వరంగల్లుకోట నుండి శ్వేతాశ్వంమీద వచ్చుచుండేదట. కాబట్టి నాలుగు భుజములుగలిగిన చాముండేశ్వరిగాని, ఎల్లమ్మ గాని, లేక వరంగల్లుకోటలోని కాకతమ్మగాని ఏకవీరాదేవి కానేకారు.

ఇంకొక వాదం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా మాహూర్ (అపభ్రంశ నామం మాతాపూర్) గ్రామంలో రేణుకాదేవి ఆలయం ఇప్పటికీ కళకళ లాడు తున్నది. దానిని కూడా అక్కడి ప్రజలు ఏకవీరాదేవి ఆలయం అని వాడు కుంటున్నారు. కానిఅదిసరి యైనది కాదేమో. ఎందువల్లనంటే రుద్రమ ప్రతినిత్యం ఏకవీరాదేవిని పూజించటం, ముఖ్యంగా యుద్ధసమయాలలో ఆమె ఏకవీరాదేవి వ్రతం చేయటం ఆచారం. అట్లైనచో వరంగల్లుకు దరిదాపు వందమైళ్లకు పైన గల మాతాపూర్‌కు రోజూ వెళ్లటం ఆమెకు సంభవమా ? అనే అనుమానం కలగక పోదు.

కాబట్టి ఏవిధముగా చూచినా ఏకవీరాదేవి—కాకతమ్మ ఎల్లమ్మలు ఒకటి కానేకారని తోచుచున్నది. ఇక పోతే నాలుగు భుజాలు త్రినేత్రాలు ఒకే సిరస్సు గురించిన వాదాలు గూడా సమంజసమైనట్లు తోచడం లేదు. ఏకవీరాదేవి ఒకే శిరస్సు కలిగి త్రిశూలపాణియై చాలా నిర్మలంగా ఉన్నట్లు గోచరిస్తున్నది. అయితే వరంగల్లు—హన్మకొండల మధ్యన భద్రకాళి పేరుతో మరొక పురాతన దేవాలయం ఉంది. ఆ కాళి విగ్రహమునకు మాత్రం నాలుగు భుజములు కలవు గాని దానిని గురించి అటు ప్రతాపరుద్రీయంలో గాని ఇటు చరిత్రకారులు కాని తమ అభిప్రాయాలను ఇదమిద్ధంగా చెప్పలేదు. అది రెండవ పులకేశికాలంలో నిర్మాణమైనట్లు తెల్పబడుతున్నది. కాబట్టి అది ఏకవీరాదేవి కాదనేది స్పష్టమైన విషయం.

ఎన్నివాదాలు ఉన్నా ఇంతవరకు దొరికిన చరిత్రాధార ముల ననుసరించి 'ఏకవీరాదేవికి రెండేభుజము లున్నవని త్రిశూల పాణియై యున్నదని' ఒప్పుకోక తప్పదు. మొగిలిచర్లలోనిదే ఏకవీరాదేవి ఆలయమనికూడా గమనించవలసి యున్నది. కొంత మంది తమ ప్రాంతంయొక్క ప్రాముఖ్యతను చాటుటకు చరిత్రాత్మక ప్రాంతాలను తారుమారు చేయటం గమనార్హమైనదేకాక ఆశ్చర్యకరమైనవిషయం కూడా. కాబట్టి చరిత్ర పరిశోధకులు ఈవిషయంలో సరియైన సమాచారమును అందించ గలందులకు కోరుతున్నాము.

ఫారసీ సుభాషితములు

శ్రీ సదాశివ

1. ఆకాశము భూమిపై అమృతధార కురిపించును. భూమి ఆకాశముపై ధూళి ఎగజిమ్మును. జాతికి తగిన రీతి.

2. సర్వజ్ఞుడును సర్వద్రష్టయునగు ఈశ్వరుడు అన్నిటిని చూచియు దాచును. ప్రక్కయింటివాడు ఏదియు చూడక చెడు ప్రచారము చేయును. మానవులు సర్వద్రష్టలైనచో జీవితము దుర్భరమగును.

3. మానవుడు పవిత్రమైనవాడు. కుక్క అపవిత్రమైనది. ఐనను విశ్వాసములేని మానవునికంటె విశ్వాసముగల కుక్కయే మేలు.

కుక్కకు ఒక రొట్టెముక్కవేసిన నూరుసార్లు కొట్టినను అది నిన్ను విడువదు. నీచునకు జీవితాంతము మేలు చేసినను ఒక చిన్న విషయమున నీతో పోట్లాడును.

4. ఆచరణలేని విద్వాంసుడు తేనె త్రాగిన తేనెటీగవంటివాడు. తేనె ఈయకున్నను అది కఱచి బాధించును.

5. అజ్ఞానియగు భక్తుడు కాలినడక పయనించువాడు. జ్ఞానియగు భక్తిలేనివాడు నిదురించునట్టి రౌతు.

6. పాపము ఎవరు చేసినను చెడ్డది. కాని పండితుడు చేసిన పాపము మరియు చెడ్డది. విద్య 'సైతాను'తో యుద్ధము చేయదగిన ఆయుధము. ఆయుధము కలిగి ఓడిపోవుట సిగ్గుచేటు. ఆచరణలేని విద్వాంసునికంటె అజ్ఞాని మేలు. వాడు కనులులేక త్రోవ తప్పును. వీడు కనులుండియు నూతిలో బడును.

7. బురదలో పడినను రత్నము విలువైనది. ఆకసమునంట లేచినను ధూళి వెల లేనిది. బూడిద అగ్నివలన కలిగినను అందులో అగ్నిలేదు కనుక ధూళితో సమానము. చక్కెర కఱ్ఱ (చెఱకు)వలన కలిగినది. కాని అందులో తీపిఉండుటవలన అందరకు ప్రియమైనది.

8. విద్వాంసులమాట తెలియదేని వినుర్నించకు — నీ తెలియమి యని మిన్నకుండుము.

9. మూఢుడు మాటలాడకుండుట మంచిది. కాని ఈ సంగతి తెలిసినవాడు మూఢుడుకాడు.

10. దుర్మార్గులపై దయదలచుట సజ్జనులను బాధించుటయే. దుష్టునకు అధికారమిచ్చుట ప్రజలను నష్టపెట్టుటయే.

11. రాజుల సన్మానము బాలకుల మధురగానము విలువ నవికావు. ఒక చిన్న భావమున అది తారుమారగును. యౌవనము ఎచ్చినకొలది ఇది తారుమారగును—

12. ఆచరణలేని విద్వాంసుడు కాగడా పట్టుకొనిన గ్రుడ్డివాడు. వాడు ఇతరులకు త్రోవచూపును. కాని తాను చూడలేడు.

13. జమ్షీదురాజు తన ఎడమచేత ఉంగరమును ధరించెను. ఆక్షేపించినందుకని ప్రజలడుగ 'కుడిచేతికి ఈ వరకుగల గౌరవము చాలు'ననెను.

14. నిండు యౌవనమున విషయవాంఛలు విరమించినవాడే పురుషపుంగవుడు. వార్ధకమున అవి తమంత తామే విడిపోవును.

15. ఇద్దరు మరణకాలమున చాల విచారించువారు. ఒకడు కూడబెట్టి అనుభవించలేనివాడు. ఇంకొకడు విద్య గడించి ఆచరించలేనివాడు.

16. నమాజు చేయనివాడు ఉపవాసమున్నను అప్పు పెట్టకుము—భగవంతుని ఋణము తీర్చలేనివాడు నీ ఋణమెట్లు తీర్చును ?

గ్రంథవిమర్శనము

అష్టదిగ్గజములు

(ఉపన్యాస సంపుటము. ప్రకాశకులు : అష్టదిగ్గజ వర్ధంత్యుత్సవసమితి, బషీర్‌బాగ్, హైదరాబాద్—1. ప్రతులకు : అష్టదిగ్గజ వర్ధంత్యుత్సవ సమితి C/o బి. మిశ్ర, 3—6—96 బషీర్‌బాగ్, హైదరాబాద్—1. 262 పుటలు. వెల. రు. 5.)

పూర్వము భగవద్రామానుజుల వద్దను, అటుపిమ్మట శ్రీవైష్ణవ పూర్వాచార్యులలో నొకరగు మణవాళ మహాముని (క్రీ. శ. 1370—1443) శిష్యులలోను 'అష్టదిగ్గజముల'ను పేరున పండితు లున్నట్లు తెలియుచున్నది. శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానమున అష్టదిగ్గజ కవు లున్నట్లు సాంప్రదాయిక కథనమే కాక 'యస్యాస్తే కవిదిగ్గజాః పృథుయశోభారా జగత్క్షోభవాః' అను ప్రశంసతో కూడిన రాయల మైసూరు రాష్ట్ర నందిదుర్గశాసన శ్లోకము, 26—8—1527 నాటి కడప మండలములోని తిప్పలూరి శాసనము విశ్వాసయోగ్యములుగా నున్నవి. తిప్పలూరు శాసనమున 'శ్రీ కృష్ణదేవరాయల మహారాయలవారు అష్టదిగ్గజ కవీశ్వరులకు ధారవోసి యిచ్చిన తిప్పలూరి అగ్రహారమునందు ....' అని స్పష్టముగా నుండుటచే నా యష్టదిగ్గజములు కవు లనియు, వారందరు తెలుగు కవు లనియు నిశ్చయించుటలో కష్టము లేదు. కాని ఆ ఎనిమిదిమంది కవు లెవ రనునదే యీనాటికిని తీరని చిక్కు. ఈ సంపుటమున గల పది ఉపన్యాసములలో చారిత్రక నిశిత పరిశీలనాచంచువై గ్రంథమునకు మకుటాయమానముగ నున్నది డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్యగారి 'అష్టదిగ్గజముల' ను ఉపన్యాసము. సాంప్రదాయిక కథనమును పురస్కరించుకొని బాటోలు ఆర్కియాలజికల్ డిపార్టుమెంట్ వారు 1938 లో భారత శాసన సాంవత్సరిక నివేదిక యందిచ్చిన అష్టదిగ్గజ కవుల పట్టికను శ్రీ వెంకటరమణయ్యగారీ యుపన్యాసమున పరిశీలించి తమ అభిప్రాయములు చెప్పినారు. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు ఆంధ్రపత్రిక మన్మథ సంవత్సరపు ఉగాది సంచికలోని 'అష్టదిగ్గజములు' ను తమ వ్యాసమున చూపిన శ్రీ వెంకటరమణయ్యగారి 1935 నాటి అష్టదిగ్గజ కవుల పట్టిక నేడు వా రంగీకరింపగల పట్టికతో సహజముగ—సంవదించుటలేదు. నా డంగీకరింపని రామభద్రకవిని నే డంగీకరించుటయు, నా డంగీకరించిన పింగళి సూరనార్యుని నే డంగీకరింపజాలక పోవుటయు వారి యభిప్రాయమున వచ్చిన ముఖ్యమగు మార్పు.

అష్టదిగ్గజ కవులుగా చెప్పబడు వారిలో అల్లసాని పెద్దన్న, ముక్కు (నంది) తిమ్మన్న, మాదయ్యగారి మల్లన్న అను ముగ్గురును క్రీ. శ. 1600 నాటి రాయవాచకము, క్రీ. శ. 1625 కుమార ధూర్జటి రచనలతో సువ్యవస్థితు లగుచున్నారు. కృష్ణరాయ విజయమే ధూర్జటి కవి విషయమున గూడ విశ్వాసయోగ్యము కాగలదు.

1935 నాటి తమ పట్టికలో లేని అయ్యలరాజు రామభద్రుని అష్టదిగ్గజ కవులలో నే డంగీకరించుచున్న శ్రీ వేంకటరమణయ్యగా రా కవిని గూర్చి విశేషముగా తడవక సకల కథాసార సంగ్రహ గద్య నాధారముగా గొని 'ఇందువలన నయ్యలరాజు, రాయల యాస్థానము నలంకరించిన కవి కుంజరులలో నొక్కడని తెల్లమగు చున్న' దని విశ్వాసాభిప్రాయమునే సూచించినారు. ఈ రామభద్రుని గూర్చి నాలుగు మాటలు చెప్పవలసి యున్నది. సకల కథాసారసంగ్రహ కర్తయు, రామాభ్యుదయ కర్తయు వేర్వేరు వ్యక్తులని యొక వాద మున్నది. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు సకల కథాసార సంగ్రహ కర్తను పుత్తేటి రామభద్రుడని తొలిసారిగా వ్యవహరించినారు. శ్రీ నిడుదవోలు వేంకటరావు పంతులుగారు గూడ ఆ రామభద్రుడు వేరు ఈ రామభద్రుడు వేరు అనియే 'అష్టదిగ్గజముల' ను తమ వ్యాసమున స్పష్టముగా వ్రాసినారు. కాని పూరిని బట్టి వచ్చిన పుత్తేటి యుపనామమును పూర్వికునిబట్టి వచ్చిన అయ్యలరాజోపనామమును ఒకరికే చెందవచ్చుననియు, ఉద్దేశపూర్వముగా ననుకరణ జుష్టమైన సకల కథా సారసంగ్రహము ఛాయలు వదలని రామాభ్యుదయము ఒకరిదే యనియు, రెంటను చమత్కృతి ప్రధానమని చెప్పబడుట గమనింపదగిన విశేష మనియు సమీక్షకుని తలంపు. లక్షణ గ్రంథములు రామాభ్యుదయ కర్తను పుత్తేటి రామభద్రుడనుట ఈ యద్వయ వాదమునకే ఉపష్కారము. గోత్రభేదము కావచ్చుట కాది పదహేతుత్వముచే నైన లేఖక ప్రమాదమనుట లెస్స. తొలిదాని గద్యలోని 'ఎలకూచి' పదమును వీరేశలింగముగారిదని కురుగంటివా రిచ్చిన 'నమకూర్చి' అను పాఠముతో చూడగా అసలు పదము—తర్వాతి ద్రాక్షాపాక ప్రసక్తినిబట్టి—'ఎలకూర్చి' అని యుండవలసినట్లు తోచుచున్నది. ఇది వ్యక్తి నామమగుట పొసగదు. ఈ రామభద్రుడు బహుశః తెనాలి రామకృష్ణుని మిత్రమై 'శారద సత్కవి' మిత్రుడ నని చెప్పకొని తర్వాతి కాలమున నాతని వలెనే శ్రీవైష్ణవము స్వీకరించి రామాభ్యుదయ రచన చేసెనని సమీక్షకుని విశ్వాసము. అద్వైతి సహజముగా నున్న రామాభ్యుదయ కర్త తండ్రి తాతల పేళ్లను, పరిశీలిత రామానుజ సిద్ధాంతధర్ముడని

చెప్పుకొనుట, గురునామము నుట్టంకించుట—రామభద్రుని సన్నిహిత వైష్ణవమును సూచించుటయే పై యభిప్రాయమున కాధారము.

ఇక మిగిలినవారు తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన్న, రామరాజ భూషణుడు. అప్పటికి రామలింగముగా నుండి లింగపురాణము వ్రాసియో, వ్రాయుచునో ఉద్భట చరిత్రము చేసి బహుశః క్రీ. శ. 1517—20 ప్రాంతమున కొండవీటి పాదెండ్ల గోపన వ్రాయసగాడైన ఊరదేవ మంత్రి కంకితముచేసి వారి యాశ్రయముతో పలుకుబడితో విజయనగరమున కెక్కివచ్చి, పెద్దన హరకథాసారముంబోని హరలీలా విలాసమును, మల్లన రాజశేఖర చరిత్రము వంటి శృంగార ప్రధానమైన కల్పిత ప్రబంధమును వ్రాసియుండుననియు, కుమారతాతాచార్యులతోడి హాస్యఘట్టములు జరిగియుండుననియు, క్రీ. శ. 1535—50 మధ్యకాలమున కందాళ అప్పలాచార్యుల శిష్యుడై వైష్ణవము స్వీకరించి పాండురంగ మాహాత్మ్యము చెప్పి క్రీ. శ. 1560 ప్రాంతమున విరూరి వేదాద్రి మంత్రి కంకితము చేసెననియు, అటుపిమ్మట లింగముగుంట రామయకవి జామాత యగుటచే నా బాంధవ్యమున కాళహస్తి చంద్రగిరి ప్రాంతములం దుండి ఘటికాచల మాహాత్మ్యము చెప్పియుండు ననియు రామకృష్ణుని కవిపదవదవీ సముద్యోగము నూహింపవచ్చును.

శ్రీ వేంకటరమణయ్యగారు అప్పయ దీక్షిత, కుమార తాతాచార్య, కందాళ అప్పలాచార్యుల తోడి రామకృష్ణుని సమకాలీనతను సుష్టుగా సాధించి చూపినారు.

కాని పింగళి సూరన్నను మాత్రము శ్రీ వేంకటరమణయ్యగా రష్టదిగ్గజములలో నొకడుగా నంగీకరింపజాలక పోయినారు. మునుపే కారణముచే నంగీకరింపిరో యిప్పుడా కారణముల కేమి యాపత్తు కలిగినదో చెప్పియుండిన బాగుండెడిది. సూరన్న రాయల యాస్థానమున నుండియుండుట సాధ్యము కాదని సమీక్షకున కనిపించుటలేదు. సాధారణముగా కావ్యరచన ముందు జరిగి కృతిపతి దొరికినపుడు పీఠికాదులు నంతరింపబడి కృతిప్రదానము జరుగును. ఈ చిన్న అంశమును గమనించుచు, రాచరికముతో భోగియై బ్రదికి యుద్ధమున నిహతుడైన అళియరామరాయలకు తొంబదియేండ్ల ఆయుఃప్రమాణము నంగీకరించినట్లే, ఆ కాలమున సామాన్యముగు జీవితము గడపిన కవులకును అంగీకరించినచో సూరన్న రాయల యాస్థానమున నుండియుండు ననుట కష్టముగా తోపదు. క్రీ. శ. 1500 ప్రాంతమున పుట్టి ఇరువదేండ్ల వయసున గరుడపురాణరచనతో రాయల ఆస్థానమున ప్రవేశము సంపాదించి, ముప్పదేండ్ల పై వయసుననే రాఘవ పాండవీయము వ్రాసి, క్రీ. శ. 1560 ప్రాంతమున అకువీటి పెద వేంకటాద్రి రాజ ప్రేరణచే విరూపాక్షస్వామి కంకితమిచ్చి, అటుపై కళాపూర్ణోదయము చెప్పి, క్రీ. శ. 1580—82 ప్రాంతమున నంద్యాల కృష్ణమరాజునకు కృతి యిచ్చి, చివరకు తనకు తృప్తిగా తండ్రిపేర ప్రభావతీప్రద్యుమ్నము వ్రాసికొని యుండుట అసాధ్యమని తోపదు. క్రీ. శ. 1580 ముందే కళాపూర్ణోదయ రచన ముగిసియుండు ననుట స్పష్టము. తర్వాత చిన్నదగు ప్రభావతీ ప్రద్యుమ్నమున కెక్కువ కాలము పట్టియుండదు. అంతేకాదు. 1560 నాటి సూరన్న రాఘవపాండవీయమును జూచియే రామరాజ భూషణుడు దానికి ప్రతిస్పర్ధిగా హరిశ్చంద్రనలోపాఖ్యానము వ్రాసి రామాంకితము చేసినాడు, ఇది స్పష్టమైన సంగతి. కాని క్రీ.శ. 1570—71 నాటికిగాని వసుచరిత్ర మారవీటి తిరుమల రాజున కంకితము కాలేదు. హరిశ్చంద్రనలోపాఖ్యానము వసుచరిత్రమునకు తర్వాతి రచనయే గనుక, రామరాజ భూషణుడు ద్వ్యర్థినవరవయున్న వ్రాసె ననవలెను. ఇట్టిచో రామరాజ భూషణుడు రాయల అస్థానమున నుండె ననుటయు, సూరన్న ఉండజాల డనుటయు నంత సమంజసముగా తోపవు. బహుశః మరికొంత పరిశోధన జరిగిన గాని ఈ కవి విషయము స్పష్టముగా తేలదు.

శ్రీ వేంకటరమణయ్యగారు కందుకూరి రుద్రకవిని గూర్చి అంతయు తోడండి వెలిదండిగానే చెప్పినారు. రుద్రకవి, వంశ్యులకడ లభించిన వారి వంశ వృత్తాంతము చారిత్రక పరిశోధనకు నిలువలేదు. 'సాటీరగంధ ప్రాద్యోట' త్యాది చాటువున రాయ లిచ్చినట్లు చెప్పబడిన 'శుభగ్రామ వారము' లకో నొక్కటైనను తెలియరాదు. శ్రీ నిడుదవోలు వేంకటరావు పంతులుగారు రుద్రకవితోపాటు రాధామాధవకవి రాయల ఆస్థానమున నున్నట్లు భావించినారు కాని ఇది యదార్థముగా దోచదు. చింతలపూడి యెల్లనార్యుడు తాను రాధామాధవ కృతిచెప్పి పెద్దనాదుల సమక్షమున సమ్మానింపబడితినని చెప్పుకొనుట నిజమే కాని అంతమాత్రమున అతడు రాయల ఆస్థానమున నున్నా డన వీలులేదు. ధూర్జటి కవి గూడ శ్రీ కాళహస్తి మహాత్మ్యమున రాజవింద చేయక జాగ్రత్తగా పరమేశ్వరుని కృతిస్వామిగా జెప్పుకొని దాటవేగా, పోతనవలె చాల స్వతంత్ర ప్రవృత్తిగలవాడై, భగవత్పరతంత్రుడై, 'నాయకరత్నము, లక్ష్మీనాయకు, హరిమ్మాదాత నా కృతికి బతిం జేయుదు, భూపుల కగు భూనాయకులను బరులు గైకొనక పటుబుద్ధిన్' అన్నవాడును, 'పరములు చిత్తగింపుడని చాటను' సొమ్మన్నవాడును నగు రాధా మాధవకవి రాయల ఆస్థానమున నుండె ననలేము. ఈత డచ్యుతరాయల కాలమునకు కొంత మనసు మార్చుకొనినట్లు కనబడినను, తారక బ్రహ్మరాజీయము భగవదంకిత మగుట కాక్లిష్టుడైనవాడనియే తలపవలెను. ప్రసక్తానుప్రసక్తముగా నిది యిట స్పృశింపబడినది.

ఈ సంపుటమున గల కావ్యోపన్యాసములలో రాయల ఆముక్తమాల్యదను గూర్చిన శ్రీ దివాకర్ల వేంకటావధానిగారి యుపన్యాసము సమకూర్చబడుట బాగున్నది గాని, పెద్దనను గూర్చి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు చేసిన ప్రసంగ సారాంశము నిచ్చుట, 'రామకృష్ణకవి గోష్ఠి' యన్న శ్రీ వేదాంతం తిరువేంగళాచార్యుల వారి వ్యాసమున నొక భాగము మాత్రమే ప్రచురణ భాగ్యమునకు నోచుకొనుట సౌష్ఠవ భంగమునకు కారణమైనది. పెద్దన మనుచరిత్రలోని 'శ్రీ వక్షోజ కురంగ నాభ' మన్న పద్యమున, 'అంకముజేరి' యన్న విఘ్నేశ్వర ప్రా

మున, 'ఉల్లమునందు నెక్కొటిక మూనుట' అను ఈశ్వర స్తుతియందును భ్రాంతి, కావ్యార్థ సూచన లున్నవని విశ్వనాథ వారు చెప్పుట శ్రీ తిరువెంగళాచార్యులుగారు తమ ఉపన్యాసమున ఆ మొదటి రెండు పద్యములలో భ్రాంతి లేదనుట విశేషము. శ్రీ బి. రామరాజుగారు పారిజాతాపహరణమును గూర్చి మాట్లాడుచు 'భువన విజయాఖ్య సంసన్నవరత్న విభా ప్రభాత నలినాప్త' (5—108) అన్న పద్య మాధారముగా రాయల ఆస్థానమున నవరత్న కవులుండి యుండిరని యొక యూహ చేసినారు! శ్రీ శ్రీకాళహస్తి మహాత్మ్యమును గూర్చి యుపన్యసించిన శ్రీమాన్ చలమచర్ల రంగాచార్యులుగారు ఆ గ్రంథమునందలి 'దాసి—మిండజంగము' కథలోనిది 'శృంగార రసాభాసమే యనవలసి యుండునని' సెలవిచ్చినారు. దాసి మిండ జంగముల శృంగారము రూపాశ్రిత మైనది. సాధారణముగ శృంగార రసాభాసము సంభోగ పర్యవసాయి కాదు. బలవద్గమ నాదులు గల చోట సకృత్తుగ రంభారావణ విషయమునందు వలె కావచ్చును. ఈ కథలో రతిభావ మిద్దర యందును చెప్ప బడినది. దాసి యంగీకారమున భక్తి యెంత యున్నదో రక్తియు నంత యున్నది. సంభోగ పర్యంత మది విశృంఖలము గానే సాగినది. కాగా వచ్చినవాడు పరమేశ్వరుడు దాసి భక్తురాలు అను సన్నిహిత జ్ఞానముచే పాఠకునకు శృంగారానుభవము కలుగదనుట న్యాయముకాదు. ఆ సన్నిహిత పరిజ్ఞానమెంత రూఢమో లౌకికముగా బసివిరాండ్ర వ్యవస్థయు నంతే రూఢము. పైగా నిది రసాభాస మనుకొన్నచో మధుర భక్తిలోని శృంగారమును సమన్వయించి చెప్పుకొనుట కష్టమగును. రామాభ్యుదయములోని చమత్కృతిని శ్రీ కురుగంటివారు చక్కగా వెలార్చినారు. మాదయ్యగారి మల్లన వ్రాసిన రాజశేఖర చరిత్రమును శ్రీ పోణంకి శ్రీరామ అప్పారావుగారు సరసముగా పరామర్శించినారు. కాని, అఘోర శివాచార్యుని శిష్యుడైన మల్లన కృష్ణామండలమునుండి విద్యాభ్యాసమునకు కడప మండలమునకు వచ్చియుండునని యూహించుటలో నసంగతి యున్నది. 'శ్రీ మదఘోర శివాచార్య గురు కరుణా విశేషలబ్ధ సారస్వత' అని యున్నను గురువు బహుశః సరస్వతీమంత్రోపదేష్టయో, అథవా పంచాక్షరియో, దక్షిణామూర్తి మంత్రము చెప్పినవాడో అనవచ్చునే గాని, అంతకంటె విశేషము లేదు. ఉపాసనా బలమున సాధించిన విద్య గురుకటాక్షమున వచ్చినదని చెప్పుటలో తప్పు లేదుగదా! పింగళి సూరన్నను గూర్చి ఆచార్య లక్ష్మీరంజనంగారును, రామరాజభూషణుని గూర్చి శ్రీ సన్నిధానంవారును ఉపన్యసించినారు. మొత్తముమీదనుపన్యాసములన్నియు సామాన్య పాఠకుల నాయా గ్రంథములను జదువజేయునట్లుగా నించుక అలంకారిక దృష్టితో నడచినవి గాని ఆయా కవుల యాంతర స్వరూపములను సర్వసమగ్రముగ నిర్మించి చూపు ప్రయత్నము జరిగినది కాదు. అసలి కిది తొలిమెట్టనుకొనుట బాగు. విద్యార్థులు పూనుకొని యీ ప్రయత్నము నిట్లు నిర్వహించుట, ఈ వచ్చు డబ్బుతో ఎం. ఏ, బి. ఏ—లలో తెలుగు ప్రత్యేకముగా నభ్యసించి ప్రథములుగా సుత్తీర్ణులగు వారికి అష్టదిగ్గజముల పేరుతో బంగారు పతకము లొసగవలయునని సంకల్పించుట ముదావహమైన సంగతి. ఆ ప్రయోజనము సాధించి సమితివారు కృతార్థు లగుదురు గాక.

సాహిత్యాభిమానము గలవా రెల్లరు చదువదగిన చక్కని గ్రంథము.

ఎస్. కె.

పూర్వభారత కార్మికులు

రచయిత : డాక్టర్ కె. ఎం. శరణ్, అనువాదకులు : శ్రీ వె. విశ్వనాథశాస్త్రి, ప్రాప్తిస్థానం : దేశోద్ధారక గ్రంథమాల, సికింద్రాబాదు. మూల్యం రెండు రూపాయలు.

ప్రాచీన భారతదేశ సంస్కృతి సంపదల విపులీకరణకు ఎన్నో గ్రంథాలు ఆధారంగా దొరుకుతాయిగాని, రచయిత శ్రీ కె. ఎం. శరణ్‌గారన్నట్లు కార్మిక రంగాన్ని గురించి తెలిపే గ్రంథాలు లేవంటే సత్యదూరంకాదు. అటువంటి విషయాన్ని చేపట్టి ఆసక్తిలో పరిశోధనలు జరిపి, వాటిఫలితాలని గ్రంథస్థం చేయడం ముదావహం. ఆంగ్లంలోని గ్రంథాన్ని శ్రీ వె. విశ్వనాథశాస్త్రిగారు అనువదించారు. పరిశోధనాత్మకం అయిన గ్రంథం అయినా, 'పాఠకులకు ఆసక్తి కల్గిస్తుంది యీ అనువాదం. ఇందులో వివిధ శీర్షికల క్రింద, సామాజిక వ్యవస్థ వృత్తులు, కార్మిక ఆధారాలు, బానిస వ్యవస్థ, కౌటిల్యుని సంస్కరణలు మొదలైన అనేక అంశాలు పరిశీలింపబడ్డాయి. కార్మిక న్యాయం అంటూ కంట శోషపడే ప్రతి అభ్యుదయవాదీ యీ పుస్తకాన్ని ఒక సారేనా చదవాలి. ఇటువంటి అరుదైన పరిశోధనాత్మక గ్రంథాన్ని అందించిన దేశోద్ధారక గ్రంథమాలవారు అభినందనీయులు.

మహర్షుల చరిత్రలు

రచయిత : బులుసు వెంకటేశ్వర్లు, ఎం. ఏ., ప్రాప్తిస్థానం : బి. వి. అండ్ సన్సు, రామారావుపేట, కాకినాడ. మూల్యం : రు. 2 న. పై. 50.

ప్రాచీన భరత వర్ష వాఙ్మయంలో దీపకళికలుగ వెల్గిన మహర్షుల జీవితచరిత్రలను శ్రీబులుసు వెంకటేశ్వర్లుగారు గ్రంథస్థం చేయబూనడం హర్షదాయకం. ఆధునిక యువజనులకు 'గట్టిగా అడిగితే' పాతికమంది ఋషుల పేర్లు కూడా రావు. శ్రీ బులుసు వెంకటేశ్వర్లుగారు ముద్రించిన ఏడు సంపుటాలలోకీ యీ ప్రస్తుతసంపుటం ఏడవది. దీనిలో ఉపమన్యు, ఋభు, కాత్యాయన, తుండి, వాత్స్యాయన మొదలుగాగల మహర్షుల చరిత్రలు వున్నాయి. ప్రతి మహర్షి జననం లగాయతు, యితర జీవిత విశేషాలన్నీ అందించారు. పుస్తక ముద్రణ బాగుంది. ముఖ్యంగా ముఖపత్రంగా వేసిన రంగుల చిత్రం ముచ్చటగా వుంది. పరదాకేనా అందరూ చదవవలసిన సంపుటం యిది.

శ్రీమతి రామలక్ష్మి.

వార్తలు

గోవా సమస్య

నవంబరు నెలలోనే గోవా సమస్యను గురించి పార్లమెంటులో చర్చ మొదలైంది. పోర్చుగీసులు గోవాలో తమ బలాన్ని పెంచుకుంటున్నట్లు, రోడ్లను మైన్ల మయం చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. డిశంబరు 1 : ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ పోర్చుగల్ చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని అల్హాబాదులో ప్రసంగించారు.

డిశంబరు 3 : శాంతిసేన సమావేశంలో మాట్లాడుతూ చైనాతో, గోవాతో ఉన్న తగాదాలను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకే అన్ని ప్రయత్నాలు చేయవలసిన ఆయన అన్నారు.

డిశంబరు : 4 : గోవాలో పోర్చుగీసు సైనికబలం పెంపొందుతూ ఉన్నందువల్ల సరిహద్దుల్లో భారతదేశం గూడా తగు బందోబస్తు చేయడానికి భారత ప్రభుత్వం నిశ్చయించుకొన్నది.

డిశంబరు 5 : గోవా సరిహద్దుల్లో భారతసైన్యాలు మొహరించబడినాయి.

డిశంబరు 6 : గోవా పరిస్థితిని గూర్చి కేంద్ర మంత్రి మండలి చర్చించింది.

డిశంబరు 7 : పోర్చుగీసు కాల్పులనుండి భారత నౌకలకు రక్షణ ఇవ్వడానికి కేంద్రం నిశ్చయించింది. పోర్చుగీసులు ఏమిచేసినా ఎదుర్కొనేందుకు భారతదేశం సిద్ధంగా ఉన్నట్లు రక్షణమంత్రి శ్రీ మీనన్ పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు.

డిశంబరు 8 : శ్రీమతి డిసౌజా గోవాలో ప్రవేశించారు. గోవా విముక్తి అనంతరం గూడా ఆ ప్రాంతం విశిష్టతను కాపాడగలమని శ్రీ నెహ్రూ పార్లమెంటులో ప్రకటించారు. భారతదేశంపై పోర్చుగల్ భద్రతామండలికి ఫిర్యాదు అందజేసింది.

డిశంబరు 9 : పోర్చుగీసు సైనికులు భారత భూభాగంలో ప్రవేశించి కాల్పులు సాగించారు. పోర్చుగల్‌ను సమర్థిస్తున్న బ్రిటన్ పట్ల భారత ప్రభుత్వం అసంతృప్తిని ప్రకటించింది. బ్రిటిష్ రాయబారి విదేశశాంగశాఖ కార్యదర్శిని కలుసుకున్నారు.

డిశంబరు 10 : పోర్చుగీసులు భారతగ్రామంపై దాడి చేశారు. గోవాకు విముక్తిని కలిగించక తప్పదని శ్రీ నెహ్రూ వాంగల్‌లో మాట్లాడుతూ అన్నారు.

డిశంబర్ 11 : పోర్చుగల్ గోవాను వదిలిపోవడంకన్నా వేరే పరిష్కారమార్గం లేదని శ్రీ నెహ్రూ రాజ్యసభలో ప్రకటించారు.

డిశంబరు 12 : గోవాలో పోర్చుగీసు దమననీతి తీవ్రం అయిపోయింది.

డిశంబరు 14 : గోవాలో ప్రవేశించడానికి భారత సైన్యం సన్నద్ధం చేయబడింది. బ్రిటిష్ రాయబారి శ్రీ నెహ్రూను కలుసుకున్నారు.

డిశంబరు 15 : గోవా సమస్యను శాంతియుతంగా పరిష్కరం చేసుకోవలసిందిగా కోరుతూ సమితి కార్యదర్శి భారత ప్రధానికి, పోర్చుగీసు ప్రధాని శ్రీ సాలజార్‌కు విజ్ఞప్తి చేశారు.

డిశంబరు 18 : గోవాలో సైనిక చర్య తప్ప ఇంకో మార్గం లేదని భారతప్రభుత్వం ప్రకటించింది. భారత సైన్యం గోవాలో ప్రవేశించింది. భారతదేశంతో పోర్చుగల్ కోసం యుద్ధానికి దిగేదిలేదని బ్రిటన్ స్పష్టం చేసింది.

డిశంబరు 19 : గోవాకు విముక్తి; ఆఫ్రికా, ఆసియా రాజ్యాల సంతృప్తి; భద్రతామండలిలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు టర్కీలు తెచ్చిన తీర్మానంపై రష్యా వీటో; అమెరికా మొదలైన రాజ్యాల విమర్శకు భారతప్రతినిధి ప్రత్యుత్తరం.

డిశంబరు 20 : గోవాలో మామూలు పరిస్థితి; గోవాలో భారతదేశం జరిపింది దురాక్రమణ కాదని న్యూయార్కులో శ్రీ మీనన్ ప్రకటన.

డిశంబరు 23 : గోవా విషయంలో పాశ్చాత్య వైఖరి పట్ల శ్రీ నెహ్రూ విచారం.

డిశంబరు 27 : గోవాపై చర్య జరపటం సమితి ప్రణాళికను భంగపరచడం కాదని శ్రీ నెహ్రూ ప్రకటన.

డిశంబరు 1 : దేశంలో రాజకీయ పక్షాలకు ఆకాశవాణి ద్వారా తమ ప్రణాళికలను ప్రసారం చేసుకునే వీలును కల్పించ డానికి భారత ప్రభుత్వం నిశ్చయించింది.

వివిధ సంఘటనలు

డిశంబరు 3 : కాంగోలో బ్రిటన్, ఫ్రాన్సుల వైఖరిని గురించి డా. వో బ్రియాన్ ఒక ప్రకటన చేశారు. అక్కడ తమ పదవికి రాజీనామా యిచ్చారు.

డిశంబరు 4 : లోకసభలో చైనా దురాక్రమణను గురించి చర్చ.

డిశంబరు 6 : చైనా చర్చకు పార్లమెంటులో శ్రీ నెహ్రూ ప్రత్యుత్తరం.

డిశంబరు 9 : కటాంగాలో సమితి గట్టి చర్యలు అవలంబిస్తుందని కార్యదర్శి థాంట్ ప్రకటన.

డిశంబరు 10 : రష్యాతో అల్బేనియా తెగతెంపులు.

డిశంబరు 13 : సమితిమీద షొంబే యుద్ధ ప్రకటన.

డిశంబరు 15 : కాంగోలో యుద్ధ విరమణకు ప్రయత్నాలు; షొంబే, అడౌలా మంతనాలకు సన్నాహం.

సమితిలో చైనా సభ్యత్వాన్ని గురించిన సోవియెట్ తీర్మానం వోటమి.

డిశంబరు 20 : షొంబే అడౌలా సమావేశం.

ఇరియన్ విముక్తికై ఇండొనేషియాలో సన్నాహాలు మొదలు.

డిశంబరు 21 : కటాంగా ప్రత్యేకతను అంతంచేస్తూ షొంబే—అడౌలాల ఒప్పందం.

డిశంబరు 22 : రైల్వే ప్రమాదాలను గురించి పరిశీలన చేయడానికి డా॥ కుంజ్రూ అధ్యక్షతను సంఘం ఏర్పాటు.

బెర్మ్యూడాలో అమెరికా అధ్యక్షుడు, బ్రిటిష్ ప్రధాన మంత్రుల సమావేశం. అణ్వస్త్రపరీక్షలనుగురించి, బెర్లిన్ సమస్యను గురించి ప్రకటన.

డిశంబరు 23 : అడౌలాతో ఒప్పందాన్ని తిరస్కరిస్తూ షొంబే ప్రకటన.

డిశంబరు 25 : బెర్లిన్ స్వతంత్రతను రక్షించగలమని అమెరికా అధ్యక్షుని ప్రకటన.

సంయుక్త అరబ్ రిపబ్లిక్, యేమెన్‌ల సమాఖ్య రద్దు. శ్రీ నాసర్ ప్రకటన.

డిశంబరు 26 : జాతీయ ఐక్యతా సాధనను గురించి డాక్టర్ సంపూర్ణానంద్ సంఘం ప్రాథమిక నివేదిక. భాషా అల్పసంఖ్యాకుల రక్షణను గూర్చి సూచనలు.

భారతదేశం సహజ సంపదలను సర్వే చేయడానికి శ్రీ జి. ఎల్. నందా అధ్యక్షతను ఒక సంఘం ఏర్పాటు చేయబడినది.

డిశంబరు 27 : పశ్చిమ ఆసియాకు బ్రిటిష్ సేనల పయనం; కువైట్ విషయంలో ఇరాక్ బెదిరింపులను పురస్కరించుకొని బ్రిటన్ నిర్ణయం.

భారతదేశంలో బ్యాంకింగు వ్యవస్థను బలపరచడానికి రిజర్వుబ్యాంకు గవర్నర్ కొన్ని సూచనలు చేశారు. అందులో ఒకటి లాభాలలో 20 శాతం రిజర్వులకు ట్రాన్స్‌ఫర్ చేయవచ్చునన్నది.

డిశంబరు 28 : చైనా దురాక్రమణ రద్దయితేనే టిబెట్టునుగురించి తిరిగి ఒప్పందం వ్రాసుకోవడం జరుగుతుందని ప్రధానమంత్రి ప్రకటించారు.

కాంగో పార్లమెంటు సమావేశానికి షొంబే ప్రతినిధులు హాజరైనారు.

పశ్చిమ ఇరియన్‌లో ఇండొనేషియా హక్కును శ్రీ నెహ్రూ సమర్థించారు.

కాశ్మీర్ సమస్యను గురించి ఒక ప్రకటన చేస్తూ శ్రీ నెహ్రూ ఇట్లా అన్నారు: "ప్రస్తుతం కాశ్మీర్ పరిస్థితి ఎట్లా ఉన్నదో, అట్లా—స్వల్పమైన సర్దుబాట్లతో—గుర్తిస్తేనే పాకిస్తాన్‌తో మంతనాలు సాధ్యం. ఇక్కడ పాకిస్తాన్ ఎటువంటి షరతులు పెట్టినా అంగీకరించేది లేదు."

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.

మ న వి మా ట

కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ కల్పవృక్షముపై పండిత శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారి విమర్శనలను 1961 భారతి జూన్, జులై, ఆగస్టు సెప్టెంబరు, అక్టోబరు సంచికలలో ప్రకటించియున్నాము. ఆ తరువాత శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి చెన్నపురి ఆంధ్ర మహాసభ వారు సన్మానము జరిపించారు. ఆ సన్మానము 1961 అక్టోబరు 15 విజయదశమినాడు జరిగినది. ఆ సభలో మాట్లాడుతూ వారు భారతిస్థాయి పడిపోయినదన్నారు. ఆ తర్వాత దానిపై జరిగిన చర్చ అంతటినీ ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములో ప్రకటించివున్నాము. రాష్ట్రములోని పలుమంది పండితులు తదితరులు ఆ చర్చలో తమతమ అభిప్రాయములను ప్రకటించివున్నారు. ఒక సందర్భంలో చర్చ సరసతను కోల్పోయి గీడనబారిపోయినది. భారతిస్థాయి తగ్గినదో, తగ్గలేదో అది వేరు విషయము. కాని, ఈ చర్చలో పాల్గొన్న కొందరి విమర్శకుల రచనలవల్ల వారివారి స్థాయి ఎట్టిదో మాత్రము వ్యక్తమైనది.

ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములో జరిగిన ఆ చర్చను భారతిపాఠకులకు కూడా పరిచయం చేయడం మా విధి అని భావిస్తున్నాము. అందువల్ల జరిగిన చర్చను యథాతథంగా ఈ అనుబంధరూపంలో వెలయించి భారతి పాఠకులకు అందజేస్తున్నాము.

1962 భారతి జనవరి సంచికతోపాటు ఈ చర్చానుబంధమునుకూడా ఉచితంగా భారతి పాఠకలోకానికి ఇస్తున్నాము.

మా ఈ ప్రయత్నంలోని సరసతను పాఠకులు గ్రహింపగలరనే ఆశిస్తున్నాము.

5-1-62 సంపాదకుడు.

సాహితీరంగంలో

కవులు; విమర్శకులు

[1961 అక్టోబరు 15 వ తేదీన చెన్నపురి ఆంధ్రమహాసభవారు ఏర్పాటుచేసిన సన్మాన సమావేశంలో రామాయణ కల్పవృక్షం గ్రంథకర్త కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి ప్రసంగం వివరాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము.-సం]

ఈ సభకు శ్రీ డి. ఎస్. శాస్త్రి అధ్యక్షత వహించారు. శ్రీ జి.ఎస్. శంకరం పెద్దలకు స్వాగతం చెప్పారు. ముందుగా శ్రీమతి గాదేపల్లి సుందరీ శంకరం దేవీస్తుతి చేశారు. కోట సోదర కవులు ఆశువుగా పద్యాలు చెప్పారు. పిఠాపురం యువరాజా శ్రీ సత్యనారాయణ గారిమీద పద్యాలు చదివారు. రైల్వే నవ్య కళానికేతన్‌వారు పుష్పమాల సమర్పించారు. శ్రీ జి. ఎస్. శంకరం సన్మానపత్రం చదివిన తర్వాత మహాసభ అధ్యక్షులు శ్రీ జె. వి. సోమయాజులు పట్టుశాలువను, 116 రూ. లు చందన తాంబూలాలతో మహాకవికి బహూకరించారు.

ఈ సభకు ఉయ్యూరు రాజా, వెంకటగిరి యువరాజా, శ్రీ బి. ఎస్. రెడ్డి, శ్రీ జలగం సుబ్రహ్మణ్యంనాయుడు, పట్టణంలోని పెక్కుమంది కవులు, పండితులు వచ్చారు.

సభాధ్యక్షులు శ్రీ డి. ఎస్. శాస్త్రి ప్రసంగిస్తూ, కవులు జీవితంలో పరిపక్వస్థితిని పొందుతూ, తమ ఆత్మానుభూతిని కవితారూపంలో వెల్లడిస్తూ ఉంటారని, పెక్కు రకాల రచనలు చేసిన శ్రీ విశ్వనాథవారు చివరకు రామాయణ కల్పవృక్షం ద్వారా తమ పరిపక్వ స్థితిని నిరూపించుకున్నా రన్నారు. ఆత్మానుభూతితో వారు కొనసాగించిన రచనను చదువుకొని, వారు పొందిన అనుభూతినే చదువరులు కూడా పొందడానికి ప్రయత్నించా లన్నారు. రామాయణం వాల్మీకి రచించినట్టు మనకు తెలుసునని, దానిని ఆయన ద్వారా మనం వినలేదనీ, కాని శ్రీ విశ్వనాథవారి ముఖతహా దానిని వినే భాగ్యం, ఆయనకు సమకాలీనులమైన అదృష్టం, మనకు కలిగిం దన్నారు.

శ్రీ అఖండం సీతారామశాస్త్రి ప్రసంగిస్తూ, మహాకవి రచనలు అర్థమైనవారికేగాని, అందరికీ కాదన్నారు. రచనలు అర్థం కాలేదనే వాదనకు అర్థంలేదన్నారు. భాషా ప్రవేశం, పరిచయం కలవారికి, రచనలోని ప్రత్యేకతలు విస్పష్టత తప్పక కనిపించగలవన్నారు. విశ్వనాథవారి రచనలలో చిత్తశుద్ధి హెచ్చుగా కానవస్తున్నదని, అది వారి రచనలకు ప్రత్యేకతగా చెప్పారు. వాక్కులో పౌరుష్యంఉన్నా, హృదయం మెత్తన అని, పాశ్చాత్యగ్రంథ ప్రలోభాలకు, ధన సంపాదనకు పైపొగడ్తలకు ఆశపడనందునే వారి కవిత్వానికి ప్రత్యేకత అబ్బిందని, వారిని మహా కవిగా దేశానికి అందజేసిందన్నారు. వారిని విమర్శించేవారు ఈ విషయాలను విస్మరించి, కువిమర్శలు చేయడంవల్ల వారిలోని అజ్ఞానం వెల్లడి కాగలదే కాని, మహాకవికి రాగల లోపం, నష్టం ఉండదన్నారు.

శ్రీ యామిజాల పద్మనాభస్వామి ప్రసంగిస్తూ, మా అన్నగారిని గురించి విమర్శలు భారతి వగైరా పత్రికలలో వస్తున్నాయని, ఆ విమర్శలకు సమాధానాలు లేకపోలేదని తాము వ్రాయగలమని ఈ సభావేదికమీద శపథం చేస్తున్నా మన్నారు. భారతిలో వచ్చే విమర్శలన్నీ పూర్తి అయిన తరువాతనే వ్రాద్దామనే తలంపుతో ఇంతవరకూ ఊరుకున్నామని, అవి వ్రాసి భారతి వారికి పంపగలమని, వారు ప్రచురించకపోతే, ప్రచురించగల పత్రికలు తమకూ లేకపోలేదన్నారు.

తర్వాత శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ప్రసంగిస్తూ, తాను రెండు ప్రయోజనాలు కోరి యిప్పుడు మద్రాసు నగరానికి వచ్చానన్నారు. ఒకటి సన్మానం స్వీకరించి, శాలువలు సేకరించి, అవి ఇస్తానని వాగ్దానం చేసినవారికి ఇచ్చిన మాట నిలబెట్టు కొనడంలో ఒక ప్రయోజనం ఇప్పుడు తీరిపోయిందన్నారు. రెండవ ప్రయోజనం తనకు ముందు మాట్లాడిన వ్యక్తులు చెప్పిన విషయాలతో సరిపోయిందంటూ ఇలా అన్నారు :—

"నామీద ఒక ప్రఖ్యాత పత్రికలో విమర్శలు వస్తున్నాయి. వీనికి సమాధానమివ్వగలమని ఇప్పుడు ప్రతి సవాలు జరిగింది. ఈ విమర్శలు వ్రాస్తున్నవారు పండితులే. ప్రచురిస్తున్నవారు పండితులే. అయితే ఈ విమర్శలు ఎంతవరకు సమంజసం, ఎంతవరకు నిలుస్తాయి అని వారు ఆలోచించడం లేదు. విద్వాంసులైనవారే ఇలా ఎందుకు చేస్తున్నారో బోధపడకుండా ఉంది. అసలు ఇలా చేయడం భావ్యమా? న్యాయమా? ఇది భాషాద్రోహంకాదా? సాహిత్యానికి తీరని అపచారం కాదా? ఈపని భారతి పత్రిక మర్యాదకు తగునా? అనేదే నా బాధ.

"నేను పెద్దవాణ్ణి అయ్యాను. బహుశా ఎంతోకాలం జీవించను. నామీద కోపంవుంటే పిస్తోలుతో కాల్చవచ్చునే. మేడ మీద ఒంటరిగా పడుకొని ఉంటాను. చిన్న సల్ఫ్యూరిక్ యాసిడ్‌బుడ్డి విసిరితే చాలునే కోపం తీర్చుకొనడానికి. అలా చేయక ఇలా చేయడం ఎందుకనే నేను అడుగుతున్నా.

"నాకు భగవత్సాక్షిగా కులభేదంలేదు. నేను సరస్వతీపూజ చేసుకున్నాను. ఆ సరస్వతి సాక్షిగా ఇది చెబుతున్నాను. నా బిడ్డల సాక్షిగా చెబుతున్నాను. ఈ విమర్శ వ్రాస్తున్న ఆయన కులానికి చెందినవారిలో నాకు పెక్కుమంది ప్రాణ స్నేహితులున్నారు. నన్ను బి. ఏ. వరకు చదివించింది వారే. నా రామాయణ కల్పవృక్షాన్ని అచ్చు వేయించింది వారే. వ్రాస్తున్నవారు తక్కువవారు అనను. పండితులు. సంస్కృతం చదువుకున్నవారు. భాషలో తప్పుల సంగతి పండితులకు తెలియనిదికాదు. ప్రతి దానికి సమర్థన ఉండితీరుతుంది. ప్రయోగ నిదర్శనం, వ్యాకరణ సూత్రం లభిస్తుంది. తప్పు లేకుండా బ్రహ్మదేవుడు కూడా వ్రాయలేడు. నేనూ తప్పులు వ్రాశాను. మహా కవులంతా తమ కావ్యాలలో తప్పులు వ్రాశారని చూపే గ్రంథాలు ఉన్నాయి. మహాకవి భారవిలోను, మహా పండితుడు కాళిదాసులోను తప్పులు ఉన్నాయి. అందుకు సంబంధించిన సిద్ధాంత గ్రంథాలు ఉన్నాయి. తప్పులు వ్రాసినా సమర్థించుకొనడానికి, శతకోటి దరిద్రులకు అనంతకోటి ఉపాయాలన్నట్లు, సంస్కృత భాషలో అనేక అవకాశాలు ఉన్నాయి. సమర్థించుకోవచ్చు. నేను తప్పులు వ్రాయలేదని అనను. కాని, పత్రికలో చూపించినవి మాత్రం, దోషాలు కావని సంస్కృతంలో ఎ. బి. సి. డీలు వచ్చిన వాడైనా చెప్పగలడు. అయినా భారతి వీనిని ప్రచురిస్తూ ఉంది. భారతి ప్రసిద్ధి, స్థాయి ఇదివరకే పోయింది. ఇప్పటి దాని స్థితి వీనినిబట్టి తెలుస్తున్నది. ఇక నైనా వీనిని వ్రాయవలదని ఆ రచయితకు, ప్రచురించవలదని ఆ పత్రికవారికి ఈ సభాముఖాన విజ్ఞప్తి చేస్తున్నాను.

"పోతే నేను వైదిక ధర్మ ప్రచారంకోసం వ్రాస్తున్నాననే విమర్శ ఒకటి ఉంది. ఇది కూడా భావ్యమైన విమర్శకాదు. అయినా విజయవాడలో ఒక మిత్రుడు నన్ను ఈ విషయం నిలబెట్టి అడిగాడు. నా గ్రంథాలు చదివిన మీదట సుహృద్భావంతోనే ఈ ప్రశ్న అడుగుతున్నట్టు చెప్పాడు. దానికి నేను చెప్పాను. అయ్యా, షేక్స్‌పియర్ నాటకాల్లో మర్చంట్ ఆఫ్ వెనిస్‌లో ఒక యూదు పాత్రను ప్రవేశపెట్టి క్రైస్తవ ప్రచారం చేశాడు. మిల్టన్ వ్రాసిన పారడైజ్ లాస్ట్‌నిండా క్రైస్తవమతం మినహా మరొకటిలేదు. అయినా మీరు మెచ్చుకున్నారు. ఇలాంటి ప్రశ్న అడగలేదు. మహా మహులంతా తమ దేశాల మతాన్ని, ధర్మాన్ని ఏదో ఒక విధంగా ప్రచారం చేశారు. రామకృష్ణ పరమహంస చేసిన దేమిటి? రమణమహర్షి చేసిన దేమిటి? భవాన్సు జర్నల్ చేస్తున్న దేమిటి? వాటిని ఈ ప్రశ్న అడగరే. నన్నే అడుగుతారే. లోకువగా దొరికినానని. నేను నా దేశాన్ని, మతాన్ని, సంప్రదాయాన్ని, పరిసరాలను, పుట్టు పూర్వోత్తరాలను, సంస్కృతిని ఎలా మర్చిపోను? వానిని గురించి వ్రాయక వేనిని గురించి వ్రాయను. అన్ని దేశాలలో అందరు కవులూ ఏది ఎలా చేశారో నేను అలాగే చేశాను. ఇందులో నేను చేసిన తప్పు ఏమిటి? ఉన్నమాట ముఖంమీద అనేవాడు ఈ రోజుల్లో దోషి. సహపంక్తిని భోజనం చేసి, సాగిడి, అవతలకువెళ్ళి నా డొక్కే లంజకొడుకు అని తిట్టేవాడు మంచివాడు. ఇలా ఉంది లోకం. మన స్థితి. ఇక్కడితో ఈ సంగతి వదిలేస్తాను."

తర్వాత తాము చిన్నప్పుడు రచించిన కొన్ని పద్యాలను శ్రీ విశ్వనాథవారు చదివి వినిపించారు. శ్రీ జె. వి. సోమయాజులు వందన సమర్పణతో సభ ముగిసింది.

"ఆ వే ద న కు అ తీ తు లు కా వా లి"

మద్రాస్, అక్టోబర్ 16 : "తెలియటం అంటే ఏమిటి? దీనికి ఇది అర్థం అని చెప్పలేల్లేదు. అవునా కాదా అంటే అది పరమేశ్వరుడికే తెలియాలి......కవిమీద ప్రేమ మాట విశ్వసించం. వీళ్లంతా మావాళ్లే. తిట్టినా యిష్టమే......అభిప్రాయాలు ఎవరివి వారివే. ఒకరివి ఒకరిని బాధించవు. సమాధానం చెప్పి, ఎందరిని మెప్పిస్తాం?" అని కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు తిరువల్లిక్కేణి తెలుగు మహాజన సమాజంవారు నిన్న సాయంత్రం మరాఠీ సమాజం హాలులో ఏర్పాటు చేసిన సన్మానానికి జవాబిస్తూ వివరించారు.

శ్రీ జలగం సుబ్రహ్మణ్యంనాయుడు అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి శ్రీ జె. వి. సోమయాజులు శ్రీ శ్రీ లతో సహా పలువురు తెలుగువారు వచ్చారు. వేద పఠనంతో సభ ప్రారంభమైంది. అధ్యక్షుని స్వాగతోపన్యాసానంతరం సమాజం కార్యదర్శి శ్రీ యు. కాశీశంకర్ పట్టువస్త్రాలు, చందన తాంబూలాలతో శ్రీ విశ్వనాథ వారిని సత్కరించారు. స్వాగతపత్రం చదివి సమర్పించారు.

ముందుగా సభాధ్యక్షులు శ్రీ జలగం సుబ్రహ్మణ్యంనాయుడు ప్రసంగిస్తూ, నిన్న నేడు సభలలో మహాకవి ప్రసంగాలు వింటూఉంటే, తనమీద వస్తున్న విమర్శలకు ఒక రకమైన ఆవేదన మహాకవిలో ఉన్నట్టు తనకు తోచిందన్నారు. తాము వ్యాపారులమని, వ్యాపారపు అనుభవంతో ఈ సంగతులు చెబుతున్నామంటూ, కొత్త నవరసు తెచ్చినా, దానిని తాము పరిపిడి రాయిమీద రాసి వాణ్యం చూస్తామని, వెండి వస్తే నిప్పులో పుటంవేసి తెలుసుకుంటామని, వజ్రాలువస్తే అద్దంలో చూచి, మచ్చలు వగైరాలు కనుగొంటామని, అది వ్యాపారధర్మమని అన్నారు. అలాగే విమర్శ అనేది మహా కవుల గ్రంథాలకు తప్పదని, దానిని చూచి, ఆవేదన పడరాదనీ అన్నారు. ఆవేదనపడడ మనేది సామాన్యుల లక్షణమేనని, మహాకవులు సామాన్యులకు, అతీతులుగా ఉండాలన్నారు. అదీకాక, విమర్శలవల్ల గ్రంథ కర్తకు ప్రసిద్ధి వస్తుందని, దానితో గ్రంథాలు, పత్రికలు ఎక్కువగా అమ్ముడు పోగలవని, ఇది కూడా వ్యాపార దృష్టితో మంచిదేనని విమర్శకులు అనేవారు కూడా ఉండాలని, అటు కవులు, ఇటు విమర్శకులు కూడా సామాన్య పాఠకులకు కావలసినవారే నన్నారు.

శ్రీ జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి మాట్లాడుతూ, కవిత్వం కల్వంలోవేసి నూరి కుప్పె కట్టే మాత్రలాంటిది కాదనీ, అర్థం చేసుకోవాలన్న ఉత్కంఠ ఉన్నప్పుడే మహా కవి అర్థం అవుతాడనీ, పైగా ప్రతివాడికి అర్థం అయ్యేటట్లు చెప్పటం కూడా సాధ్యం కాదనీ అన్నారు.

పిమ్మట శ్రీ శ్రీ, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిపట్ల వ్యక్తిగతంగాగల గౌరవాన్ని తెలుపుకోటానికి వచ్చానంటూ, రామాయణం అంటే నిజం కథ అని నమ్మకం లేదనీ, మళ్ళీ భారతాన్ని నిజమని విశ్వసిస్తాననీ చెప్పారు. శ్రీ సత్యనారాయణగారిమీద ముఖ్యంగా

ఒక ఫిర్యాదు చేస్తున్నానని చెప్పి, వారి గురువుగారైన స్వర్గీయ శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రులవారు ద్రాక్షాపాకంలో రచనలు సాగించగా, శ్రీ సత్యనారాయణగారు పాషాణపాకంలో వ్రాస్తారన్నారు. తమకు సంస్కృతం రాకపోయినా, వాల్మీకి రామాయణం చదువుతుంటే అర్థమవుతున్నట్టే ఉంటుందని, కాని విశ్వనాథవారు వ్రాసిన రామాయణం చదువుతుంటే తనకు తెలుగు బాగా వచ్చినా, ఏమీ అర్థం కాదనీ, అలా ఎందుకు వ్రాయాలని ప్రశ్నించారు. అయినా వాల్మీకాదులు వందమంది వ్రాస్తే శ్రీ సత్యనారాయణగారొక్కరే రామాయణాన్ని రచించారనీ చెప్పారు.

శ్రీయుతులు యామిజాల పద్మనాభస్వామి, శ్రీనివాసాచారిగార్లు ప్రసంగించిన తరువాత శ్రీ కోట సోదరకవులు శ్రీ విశ్వనాథ వారిపై ఆశువుగా పద్యాలు చెప్పారు.

తమకు జరిగిన సన్మానానికి సమాధానం యిస్తూ శ్రీ సత్యనారాయణగారు యింకా యీవిధంగా చెప్పారు. "తెలుగుదేశం లక్షణం ఈ కాసేపట్లోనే తెలిసింది. ఇంకోటి గూడా తెలిసింది. ఉదయం ఆంధ్ర మహాసభ సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ శాస్త్రిగారు, ప్రస్తుత అధ్యక్షులు శ్రీ నాయుడుగారు 'తెలియదు', 'తెలియ' దంటూనే అమిత విజ్ఞానం చూపించారు. రాముడు కొందరికి భగవంతుడు, అలాగే కొందరికి ఏసు, కొందరికి అల్లా భగవంతులు. భిన్న మతస్థులకు భిన్న విశ్వాసాలుంటాయి. రాముడు దేవుడుకాడని క్రైస్తవుడంటే బాధలేదు. కాని, మనలోనే కొందరు ఆ విధంగా అంటే బాధ కలుగుతుంది. శ్రీ శ్రీ అంటే నాకు అంత ప్రేమ. ఆయనకు సమాధానం చెప్పను. కాని చెబుతేమాత్రం నష్టం ఏమిటి? భారతం ఎందుకు యథార్థం, రామాయణం ఎందుకు అభూతకల్పన? భారతమూ, కాల్పనికమే నన్నారు పాశ్చాత్యులు. దీనిని తిరువణ్ణామలై వాళ్లు ఒప్పుకోవచ్చు". తరువాత భారత యుద్ధం ఏ సంవత్సరం, ఏ రోజున, ఏ లిప్తలో ప్రారంభమైందీ, భీష్ముడు ఎప్పుడు శరతల్పగతుడైనదీ, ధర్మరాజు ఎప్పుడు కైలాసానికి పోయిందీ, మొదలైన అంశాలు లెఖ్ఖకట్టి చెప్పవచ్చునంటూ, దృష్టాంతరపూర్వకంగా వివరించి చెప్పారు.

ఇలాంటి ఋజువులు రామాయణంలో గూడా చూపవచ్చునని అన్నారు.

"పాశ్చాత్యులు మన సంప్రదాయసిద్ధమైన విద్యా బోధనకు స్వస్తిచెప్పి, వారి చదువులను, విశ్వాసాలను ప్రవేశపెట్టారు. మన ధర్మాలు శాస్త్రాలు, సంస్కృతం పట్ల విశ్వాసం ముఖ్యం. నేనొకసారి పూనా సమావేశంలో ప్రసంగించినప్పుడు అక్కడి కళాశాలలో లెక్చరర్‌గానున్న ఒక ఆంధ్రుడు, ఆంధ్రులది సంకుచిత తత్వమనీ, ప్రపంచ దృక్పథం అవసరమనీ అన్నాడు. మనం ముందుఆంధ్రులం తర్వాతభారతీయులం, అటుతర్వాత అంతర్జాతీయులం. పాశ్చాత్యుల సంస్కృతి ప్రమాణమని ఎక్కడ ఎవరైనా వాదానికిపూనుకుంటే పూర్వపక్షం చేయగలనని సవాలు చేస్తున్నాను. ఐతే దీనికితగిన మధ్యవర్తి ఏడి? ఇలాంటి ప్రశ్నలు 20—30 శాస్త్రాల సంయోజనం వల్లగాని పరిష్కారం కావు. పుట్టటంలోనే పూర్వజన్మసంస్కారాలు ఉంటాయి. అట్లాగే విభిన్న రుచులు గూడా. మతం అన్నతరువాత విశ్వాసముండాలి. మతమే అక్కర్లేదంటే చేసేదిలేదు. మన ప్రాచీనులు 'ద్వ్యణుకము' 'త్ర్యణుకము' చెప్పారు. 'ఈ అణు సమాగమానికి దోహదకారి అయిన వస్తువునే చైతన్యమన్నారు. ఆ చైతన్యమే భగవంతుడు' అన్నారు.

తరువాత మనుచరిత్రలోని "అటజని గాంచె భూమిసురు" డన్న పద్యాన్ని ఉదహరించి అల్లసాని పెద్దన్న అందులో ఎంతో శిల్పాన్ని యిమిడ్చాడనీ, తెలిసిన వారికి అది శిల్పమనీ, తెలియనివారికి జల్పమనీ శ్రీ సత్యనారాయణగారు చెప్పారు.

శ్రీ బి. వి. సింగరాచారి వందన సమర్పణ చేస్తూ, ఆంధ్రనుంచి ఏటా ఒక మహాకవిని ఆహ్వానించి సన్మానించదలచామనీ, ప్రప్రథమంగా కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారివంటి మహాకవిని సన్మానించటం తమ భాగ్యమనీ తెలియజేశారు.

శ్రీ టి. ఆర్. జయదేవ్ బృందంవారి లలిత సంగీతంతో కార్యక్రమం ఆఖరైంది.

విమర్శ లేకపోవడం

భాషకు ద్రోహం

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

[ఆంధ్రపత్రిక అక్టోబరు 22 వ తేదీ సారస్వతానుబంధంలో శ్రీ విశ్వనాథవారి ప్రసంగానికి శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి సమాధానంగా వ్రాసిన వ్యాసమిది]

చెన్నపురి ఆంధ్ర మహాసభవారు కావించిన సన్మాన సభలో రామాయణ కల్పవృక్ష విమర్శలను గూర్చి విశ్వనాథవారు కొన్ని మాటలు చెప్పినట్లు 18—10—61 ఆంధ్రపత్రికలో చదివితిమి.

ఈ ప్రసంగములో నాకును గొంత సంబంధ మున్నది కావున ఈ నాలుగు ముక్కలు వ్రాయవలసి వచ్చినది.

'ఈ రామాయణ విమర్శలు వ్రాస్తున్నవారు పండితులే. ప్రచురిస్తున్నవారు పండితులే. అయితే ఈ విమర్శలు ఎంత వరకు నిలుస్తాయి అవి వారు ఆలోచించడంలేదు. ఇలా చేయడం భావ్యమా! న్యాయమా! ఇది భాషాద్రోహం కాదా! సాహిత్యానికి తీరని అపచారం కాదా! ఈ పని భారతి పత్రిక మర్యాదకు తగునా! అని ఈ తీరుగ విశ్వనాథవారు పెద్ద ఆవేదన చూపినారు. ఈ విమర్శనము తెలుగు సాహిత్యమున కత్యావశ్యక మనియు పండితులైనవారు ఈ పనిని ఎన్నడో చేసియుండవలసిన దనియు ఇన్నేండ్లుగ ఈ కల్పవృక్ష విమర్శనలో ఉపేక్ష వహించుటయే ఒక విధమగు భాషాద్రోహ మనియు, నేటికైన ఈ కల్పవృక్షములోని 'వాస్తవికత' లోకమునకు తెలియజేయుటచే మీకు ధన్యవాదము లనియు ఉత్కళమునుండి మద్రాసు వరకు ఎందరో అపరిచితులు ఇప్పటికే ఎన్నో ఉత్తరాలు వ్రాసిరి, వ్రాయుచున్నారు. ఇది భాషకు ద్రోహమో! భాషకు శ్రేయమో! చెప్పవలసినది కావ్యకర్త కాదు, ఆ భారము లోకమునకే వదలి తన పని తాను జేసికొనుటయే కావ్యకర్తకు ముఖ్యము.

ఈ ఘట్టములో విశ్వనాథవారు సెలవిచ్చిన అంశము లివి :—

1. ఈ విమర్శించువారు తక్కువవారు కాదు, పండితులు.

2. భాషలో తప్పుల సంగతి పండితులకు తెలియనిది కాదు.

3. ప్రతిదానికి సమర్థన ఉండితీరుతుంది.

4. ప్రయోగ నిదర్శనము—వ్యాకరణ సూత్రము లభిస్తుంది.

5. తప్పులేకుండా బ్రహ్మదేవుడు కూడా వ్రాయలేడు.

6. నేనూ తప్పులు వ్రాశాను.

7. కాని, పత్రికలో (భారతిలో) చూపించినవి మాత్రం దోషాలు కావని సంస్కృతంలో ఎ. బి. సి. డీ లు వచ్చిన వాడైనా చెప్పగలడు.

8. అయినా 'భారతి' ప్రచురిస్తూ ఉంది.

9. 'భారతి' ప్రసిద్ధి—స్థాయి, ఇదివరకే పోయింది.

10. ఇప్పటి దాని స్థితి వీనినిబట్టి తెలుస్తున్నది.

11. ఇకనైనా వీనిని వ్రాయవలదని ఆ రచయితకు, ప్రచురించవలదని ఆ పత్రికవారికి ఈ సభాముఖాన విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ వాదనలో—ఈ యావేదనలో అర్థము లేదనవలెను. సంస్కృత సారస్వతములోని అప్పయ్య దీక్షిత—జగన్నాథ పండితుల వాదోపవాదములు గాని, పూండ్ల రామకృష్ణయ్యగారి ...... చింతామణి సంచికలు గాని, వేదము, కొక్కొండవారి భాషా చర్చలు గాని, గిడుగువారి 'తెలుగు' పత్రికల సంచికలు గాని, కల్లూరి—వజ్ఝలవారి విమర్శనములుగాని, తిరుపతి కవులు, రామకృష్ణ కవులు, కొప్పరపు కవులు, వీరి అవధాన ఘట్టములు గాని పరిశీలించి యున్నచో—ఈ రామాయణ కల్పవృక్ష విమర్శనము భాషకు అపచారము కలిగించునది కాక, భాషకు గావలసిన ఉపచారమే కలిగించి తీరునని సప్రమాణముగ చెప్పవచ్చును. అక్కడనే, తిరువళ్లిక్కేణి తెలుగు మహాజన సమాజమువారు జరిపిన సభలో అధ్యక్షులైన 'జలగము' వారు ఈ విషయములో చెప్పిన ముక్కలు బంగారు ముక్కలు. మహాకవికి యిట్టి ఆవేదన ఉండరాదని, ఆవేదన పడుట సామాన్యుల లక్షణమని, మహాకవులు సామాన్యులకు అతీతులుగా వుండవలెనని, విమర్శనము వలన వస్తువు వెల హెచ్చునని, వ్యాపారరీత్యా ఆయనకున్న అనుభవమును ఈ సాహిత్య ప్రక్రియలో సైతము చక్కగా చూపగలిగిరి. ఈ యావేదన విశ్వనాథవారిని ఎంత క్రిందికి లాగి వైచినదో పాఠకులు పరిశీలింపవలె.

'నేను పెద్దవాణ్ణి అయ్యాను. బహుశా ఎంతోకాలం జీవించను. నాపైన కోపం ఉంటే పిస్తోలుతో కాల్చవచ్చునే! మేడమీద ఒంటరిగా పడుకొని ఉంటాను. చిన్న సల్ఫ్యూరిక్ ఆసిడ్ బుడ్డి విసిరితే చాలునే కోపం తీర్చుకొనడానికి. అలా చేయక ఇలా చేయడం ఎందుకనే నేను అడుగుతున్నా'—

ఈ యడిగినది యీ విమర్శనము వ్రాయువారిని గూర్చియు వానిని ప్రకటించు పత్రికల వారిని గూర్చియు—కాబోలు! ఈ యంశములో యీ మహాకవీశ్వరుల స్వభావమే వెల్లడి యగుచున్నది. అభిప్రాయ భేదము ఉన్నంతమాత్రాన ఒకానొక వ్యక్తి మరొక వ్యక్తిని చంపుటయే ముఖ్యమన్న 'ధర్మమును' వీరు బోధించునట్లు తేలుచున్నది. గాంధీజీ యుగములో బ్రతికిన మనము 'గాడ్సే' గాని దుశ్చేష్టలు గమనించిన మనము, ఈ విశ్వనాథవారి యీ భావములను గూర్చి ఏమనుకొనవలెనో యూహింపవచ్చును. ఇట్టి 'సనాతనధర్మములే' వీరి రచనలలో హెచ్చుగా ఉన్నవని సప్రమాణముగా నిరూపింపవచ్చును.

ఈ సభలోనే, 'అయ్యా! మీ గురువర్యులు ద్రాక్షాపాకములో వ్రాయగా మీరు పాషాణపాకములో వ్రాయుట అది యొక దోషముగానే భావించుచున్నా' మని ముఖాముఖిగా ప్రశ్న వేసిన శ్రీశ్రీకి సమాధానమే రాలేదు. 'తనకు సంస్కృతము రాకపోయినా వాల్మీకి రామాయణం చదువుతుంటే అర్థమవుతున్నట్టే ఉంటుందనియు, విశ్వనాథవారు వ్రాసిన రామాయణం చదువుతుంటే తనకు తెలుగు బాగా వచ్చినా ఏమీ అర్థం కాదనియు అలా ఎందుకు వ్రాయాలని ఆ సభలోనే శ్రీశ్రీ ప్రశ్నించిరి గదా! 'ఉన్నమాట ముఖంమీద అనేవాడు ఈ రోజుల్లో దోషి' అని ఆ సభలోనే సెలవిచ్చిన విశ్వనాథవారు శ్రీశ్రీని గూర్చి ఏమని భావింపవలెను! అక్షరాల శ్రీశ్రీ ప్రభృతుల కున్న ఆ భావములోనే అస్మదాదులము సైతము ఈ కల్పవృక్ష

విమర్శనమునకు సిద్ధమైతిమి. అంతేగాని, ఈ 'మహాత్ములను' పిస్తోలుతో కాల్చి పొట్టను పెట్టుకొను అపర పరశురాము డైన 'గాడ్సే' వంటి సనాతన వంశములో మేము పుట్టలేదు. 'ధర్మచింత—పాపభీతి' ఉగ్గుబాలతో నేర్పిన జాతి—మా జాతి.

ఈ ప్రసంగములకు మొగమాటపడి 'భారతి' వారు ఇకమీదట ఈ విమర్శనములు వేయకపోవచ్చుగాక! ఇప్పటికే వ్రాతలో 2, 3 వందల పేజీలుగా ఈ విమర్శనము పెరిగినది. ప్రతి పుటలో ప్రతి పద్యములో ప్రతి గద్యములో కావలసినన్ని దోషాలు ఎదురగుచున్నవి. 'భారతి' వ్యాసము లన్నియు ముగిసిన పిదప 'ప్రతి విమర్శనము' చేసెద ననియు ఆ సభలో ఒకానొకరు శపథము చేసినట్లు చదివితిమి. ఆ శపథము ప్రకారము ఆయన వ్రాసిన అంశములు సైతము పరిశీలించి ఈ గ్రంథములో సమన్వయింపవలసి యున్నది. ఇక్కడ ఒక్క మనవి :—

ఇప్పటికి 'భారతి' లో చూపిన దోషాలు ఒక దోషాలు కావని విశ్వనాథవారు అన్నారు. తెలుగు కవిత్వములో ఏ. బి. సి నేర్చినవాడయినను సంస్కృతములో ఓనమాలు వచ్చినవాడయినను చప్పున చెప్పగల బండెడు దోషములు ఈ కల్పవృక్షములో దండిగా ఉన్నవని లాక్షణిక ధోరణిలో నిరూపించగలను. విజయవాడలోనో మరొక చోటనో సంస్కృతాంధ్రములలో ప్రసిద్ధులను ఇద్దరను ఎన్నుకొని వారి ఆధ్వర్యములో సభ తీర్చి వాదోపవాదములకు అవకాశ మిత్తురేని నేనే వచ్చి సప్రమాణముగ 'కల్పము' లోని దోషాలను పదులు గాదు, వందలు గాదు, వేల తరబడి సంఖ్యలో నిరూపింపగలను. ఆ దోషాలను ఏ రూపముగ సమర్థింప గలరో, ఆ వ్యాకరణము లేవో, అపూర్వ ప్రయోగము లేవో, వాని నిలువ ఎట్టిదో సాంగోపాంగముగ మధ్యవర్తులకే వదిలి న్యాయము పరిశీలింపవలసి యుండును.

ఇంకొక్క ముక్క: కులభేద మున్నదే నాకు లేదని బిడ్డల సాక్షిగా, సరస్వతి సాక్షిగా చెప్పుచున్నానని సభలో విశ్వనాథ వారు ఒట్టు పెట్టుకొన్నారు. నేడు ఆ భేదము నాకు లేదని సభలో అన్నంతమాత్రాన ఆయన రచనలలో 'రికార్డు' అయిన అంశములు మాయమై పోవునా! ఎక్కడ ఈ రచనలలో ఈ దోషము కేంద్రీకృతమై ఉన్నదో దానిని సైతము సప్రమాణముగ నిరూపింపగల ననియే నా ధైర్యము. ఇట్టి చర్చకు వీలైన సమావేశమునకై నిరీక్షింతును. భారతి వ్యాసము లకు ఖండనము వ్రాయువారు, దయచేసి ఆ పత్రికల పైనము రవ్వంత నాకు తెలియజేసిరేని అవి తెప్పించుకొని నా గ్రంథమ్ము నేను సాగించుకొందును.

సాహిత్యానికే లోపం

[శ్రీ విశ్వనాథవారి ప్రసంగానికి జవాబుగా శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి ఆంధ్ర పత్రిక అక్టోబరు 29 వ తేదీ సారస్వతానుబంధంలో వ్రాసిన మరొక వ్యాసమిది.]

విజయదశమి "ఆంధ్రపత్రిక" ప్రత్యేక సంచికలో సాహిత్య విమర్శనట్లు కొన్ని ముఖ్య ప్రసంగాలు కనబడినవి. వక్తలు యామిజాల పద్మనాభస్వామి, విశ్వనాథ సత్యనారాయణగారలు. ఇతర పెద్దలుం గలరు.

ఈమధ్య పండిత కొత్త సత్యనారాయణగారు "తెలుగు విద్యార్థి" పత్రిక (బందరు) లో కొన్నాళ్ళగాను, ప్రస్తుతం 'భారతి' లోను విశ్వనాథ సత్యనారాయణగారి "రామాయణ కల్పవృక్ష కావ్య పరామర్శ" చేయుచున్నారు. ఆ విమర్శమీద "సవ్వాళ్ళ" చేశారు యామిజాలవారు. ప్రతి విమర్శ చేస్తామని "పందెం" వేశారు. ప్రతి విమర్శ చేయవచ్చు. కొత్త సత్యనారాయణగారి విమర్శలో లోపము గాని, తప్పుగాని యున్నచో ఎత్తి చూపవచ్చు. యామిజాల వారికి ఆ హక్కు కలదు. కాని, "పందెం" దేనికి ? "సవ్వాళ్ళ" దేనికి ? కారణం! వారి కాగ్రహము వచ్చినది. కొత్త సత్యనారాయణ, విశ్వనాథ సత్యనారాయణగారి మీద విమర్శ చేసెదా అని. ఆగ్రహ మెందులకు గలిగినది ? విమర్శకుని సహృదయంతో చూడలేకపోవుట చేతనే కలుగుచున్నది. వారి ప్రతి విమర్శ కూడ వచ్చినచో పాఠకలోకము మరికొన్ని విశేషాలను తెలిసికొనవచ్చు. దానికీ పూర్వ వాదము రావచ్చు. దానివలన సాహిత్య జిజ్ఞాస విస్తరింపగలదు.

ఎవరి కావ్యము నయితే "కొత్త" వారు పరామర్శించుచున్నారో, ఆ విశ్వనాథవారు మాట్లాడుచు కొన్ని భావాలను వ్యక్తము చేసినారు. ఆ వాక్యా లివి :

1. ఈ విమర్శ వ్రాస్తున్న ఆయన కులానికి చెందినవారిలో నాకు పెక్కుమంది ప్రాణస్నేహితు లున్నారు.

2. "భారతి" ప్రసిద్ధి, స్థాయి యిదివరకే పోయినది. ఇప్పటి దాని స్థితి వీనినిబట్టి తెలియుచున్నది. ఇకనైనా వీనిని వ్రాయవలదని ఆ రచయితకు ప్రచురించవలదని ఆ పత్రిక వారికి ఈ సభాముఖమున విజ్ఞప్తి చేయుచున్నాను.

ఇంకా ఇతర వాక్యములు కూడా నున్నవి. ఇతరముల నట్లుంచి యీ వాక్యార్థ మేమిటి ? విమర్శకుని కుల గోత్రము లతో కావ్య నిర్మాతకు అవసర మేమి ? విమర్శకునకు—కావ్యానికి ఉన్న సంబంధములో కులగోత్ర మీమాంస యెందులకు రావలసి వచ్చినది ? ఇది శోచనీయము. సాహిత్యా న్నిట్లు కలుషితం చేయకుండ నుండుట అవసరము.

అసలు విషయము. "కొత్త" వారి రచనలు వేసిన కారణముగా "భారతి" పత్రిక స్థాయి తగ్గినదని గాని, లేక అసలు "భారతి" పత్రిక స్థాయి తగ్గిన దశలో "కొత్త" వారి రచనల ప్రచురణకు చోటు దొరికినదని గాని, విశ్వనాథవారు భావించి

యుందురు. అందువల్ల కొత్త సత్యనారాయణగారిని భారతి పత్రికలో నిట్టి రచనలు వేయవద్దని సత్యనారాయణగారు సభా ముఖముగా విజ్ఞప్తి చేసినారు. ఇది బహుశా అనుశాసనంగా గ్రహించిరేమో! ఏ దెట్లున్న ఈ భావుకతకు—ఇట్టి సలహాకు కారణ మేమిటి? ఎవరైన ఒకరు బయలుదేరి "విశ్వనాథవారు పెద్దవారైనారు! ఇక రచన మానండి! అన్న నెట్లుండును. కాదు అసలు రామాయణ కల్పవృక్ష కావ్య నిర్మాణమే విశ్వనాథవారు చేయకున్న నెంత బాగుండునో" యని ఎవరైన అన్న యెట్లుండును? అసంజసముగా నుండును. మరి విశ్వనాథవారి సలహా?? దాని తాతగా నున్నది.

కాని కావ్య నిర్మాత, విమర్శకుణ్ణి విమర్శ మానుమనుటలోని ఔచితి ఏమిటి? కాళిదాస, భారవులు తప్పులు చేయ వచ్చు. శ్రీనాథునకు సీస రచన తెలియకపోవచ్చు. తిక్కన కవిత పాడిపాడి మాటలు కావచ్చు. తమ రామాయణ కల్పవృక్ష కావ్యాన్ని అర్థము చేసుకొనగలవా రరుదు కావచ్చు. (అసలు పుట్టలేదని హైదరాబాద్ ప్రసంగంలో లోగడ విశ్వనాథవా రన్నట్లు ప్రచురిత మైనది.) ఎంతైనా పత్రిక స్థాయిని దూషించి, విమర్శ చేయవలదను సలహా నివ్వడంలో ఇది విమర్శ కాదని గాని, స్థాయిలేని విమర్శ యని గాని విశ్వనాథ సత్యనారాయణగా రన్నట్లు అర్థమగుచున్నది. మాటలకు అర్థము లుండును గదా! అంటే సమకాలికుల కావ్య విమర్శ వలదని గాని, పనికిరాదని గాని విశ్వనాథ సత్యనారాయణగారు భావిస్తున్నారా? అయితే పెద్ద వారిని విమర్శించి కాల్చివేయమంటారా? ఇదేమి యాక్రందన? ఇంత అక్కసు, విమర్శ పట్ల నెందుకుండాలి. కవికి—విమర్శకునకు నుండవలసిన సంబంధమును, కవి ఇట్లేనా నిర్వచించవలసినది? ఇట్టి సన్నివేశముల నూహించియే కాబోలు జయంతి రామయ్య గారు "విమర్శకుల చెల్మియె కావ్యకర్తకు న్నేరువుగాక వేరె యొక నేరువు గల్గుట చెప్ప నొప్పునె" అన్నారు.

కవి సలహాను పాటిస్తే కవియనంతరం విమర్శలు రావలెను గాని కవికాలంలో పొగడ్త మాత్రమే కాని విమర్శ రాకూడ దని యర్థ మగునేమో! ఇట్టి కవి—విమర్శక సంబంధా లవాంఛనీయములు.

పోతే తమ సన్మానంలో విమర్శలకు సమాధానము చెప్పకనే విమర్శకుని నోరు కట్టివేయాలన్న ప్రయత్నం చేయబూనటం హాస్యాస్పదముగాను ఉన్నది. విమర్శ యన ఇంత భయము దేనికి?

సజీవ సాహిత్యానికి విమర్శ గీటురాయి. విమర్శలో మంచి చెడ్డల పరామర్శ ఉంటుంది. శబ్ద విమర్శలో వ్యాకరణ ఔచితియే గాక, శబ్ద స్వారస్య పరిశీలన ఉంటుంది. తెనుగులో ఇంకా మంచి విమర్శ గ్రంథాలు రావలసియున్నవి. ఈ ధోరణి పెద్దలే ప్రదర్శించి, వాటికి తాళాల విధానాన్ని ప్రచారము చేయజూచిన అసలు కుంటుపడుతుంది విమర్శ కదా!

విమర్శ చేయుటము చాల యవసరము. విన్న మొన్ననే అమెరికా రాయబారి "గాల్ బ్రేత్" అన్నారు: విమర్శ పరిణా మానికి "ఇంజను" వంటిదని: నిజమే. విమర్శ లేక స్తుతి మాత్రమే మిగిలితే నిమ్నోన్నతులు తెలియవు. తెలియవలసిన యవ సర మెంతైన నున్నది. అందువల్ల విమర్శ చేయుట తప్పుకాదు. అవసర చర్య. విమర్శ అంతా మన మంగీకరించ నవసరము లేదు. కాని మార్గాన్వేషణ కానబడుచున్నది. నూతన పుంతలు దొరుకును.

కాని సమకాలీన కవుల కృతుల విమర్శలో వాత్మాశ్రయ నిబద్ధత యుండి, విమర్శ తిన్న వ్యక్తి లోలో గుంది, పదరుట సహజము. ప్రతి విమర్శ తాము చేయుటకన్నా చేయించుట గూడ సహజమే. కానీయండి! విమర్శ సాగనీయండి! విమర్శ కుడు అభిరుచుల తత్పరి. తీర్పులమీద తీర్పులు రానీయండి! విమర్శను ఆవేశాలకు నాక్రందనలకు ఆకరాలు కానివ్వకండి! విజ్ఞ తను ప్రదర్శించండి. కేవల విజ్ఞప్తులు మానండి. స్థాయి పడిపోవునచో నా స్థాయిని పెంచండి. మరీ దిగజారనీకండి. కవి— విమర్శకుడు సహజీవనము చేయనివ్వండి.

'నాది పాషాణపాకమనే వారి బుద్ధిలోనే లోపముంది'

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

[కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు విమర్శలకు సమాధానంగా అక్టోబరు 29 వ తేదీ ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో వ్రాసిన వ్యాసం.]

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారు నేను ఆంధ్ర మహాసభ చెన్నపురిలో చేసిన ఉపన్యాసమునకు బదులుగా అక్టోబరు 22 ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధంలో ఒక సమాధానం వ్రాశారు. ఎవరో తీసికొనివచ్చి చూపించారు. నా ఆవేదన, శ్రీ జలగం సుబ్రహ్మణ్యాం నాయుడుగారు చెప్పిన మాటలు, శ్రీ శ్రీ అన్న పాషాణపాకం ఇవన్నీ ఇట్లా ఉంచుదాం. నేను 'గాడ్సేకులం' వాణ్ణి. ఆయన 'గాంధీకులం' వాడు. అది కూడా అట్లా ఉంచుదాం. 'ధర్మచింత', పాపభీతి' ఉగ్గుపాలతో పెట్టిన జాతి వారిది. నేను ఆ సభలో త్రికరణశుద్ధిగా

వర్ణాది భేదాలు లేవన్నది వారు నా రామాయణం ప్రకారం ఋజువుచేస్తారట. వారికే 'ధర్మచింత', 'పాపభీతి' ఉన్నవని వ్రాస్తున్నారు. నేను సభలో అన్న, నాకు వర్ణద్వేషం లేకపోవడం అబద్ధం! వీరు ధర్మచింత మొదలైనవి తమకు కలవని వ్రాయడం నిజం! అవి రెండూ వారికి ఉండడానికి వీలులేదని వారి విమర్శ వ్యాసాలే సాక్ష్యం. ఇందులో ఒక భేదం ఉన్నది. వ్యక్తిగతంగా నాకు ఆ గుణాలు లేవన్నాను. ఆ ధర్మబుద్ధి, పాపభీతి వారి జాతి గుణాలు అని చెబుతున్నా డాయన. నన్ను గురించి నేను చెప్పుకోవచ్చు. తన జాతిని గురించి తాను పూచీ పడడం కష్టం. వారి జాతి యేమిటి? భారతీయ జాతియా? ఆంధ్ర జాతియా? ఒక జాతికి ప్రధానమైన లక్షణాలు కొన్ని ఉంటవి. జాతి మొత్తముమీద ఆ లక్షణాలు చెప్పవచ్చు తప్ప, జాతిలో పుట్టిన ప్రతివాడికీ ఆ లక్షణాలు ఉండవనడం చాల కష్టం.

ఇవట్లాఉంచి, శ్రీ శ్రీ నా కవిత్వాన్ని పాషాణ పాకమన్నాడు. నేను సమాధానం చెప్పలేదని ఆక్షేపణ. శ్రీ శ్రీ కి ఎందుకు సమాధానం చెప్పలేదో మనవి చేస్తాను. శ్రీ శ్రీ ఆ సభలో దిగాలుపడి కూర్చోవలసి వచ్చింది. నేను సమాధానం కూడా చెబితే ఆయన ఇంకా దిగజారిపోతాడని చెప్పలేదు. శ్రీశ్రీ ని నేను నలబది యేండ్లనుండి యెరుగుదును. ఆయన అంటే నాకొక విధమైన ప్రేమ ఉన్నది. ఓ చౌదరిగారూ! నేను వ్రాస్తే మీ రంగీకరించరు. ఒప్పుకోరు. లౌక్యంకోసం వ్రాస్తున్నానని అనుకున్నా అనుకోవచ్చు. యథార్థంగా మీరన్నా కూడా నాకొక విధమైన అనురాగంవంటి భావం ఉన్నది. ముప్ఫై యేళ్ళక్రిందట–ఇంకా ఎక్కువ ఏండ్ల క్రిందనో మీరూ, నేనూ, శ్రీ తుమ్మల సీతా రామమూర్తిచౌదరిగారూ కలిసికొన్నాము. ఆనాడు చాలా స్నేహంగా మాట్లాడాము. తరువాత మనము కలిసికొన్నదీ తక్కువే. స్నేహంగా మాట్లాడుకొన్నదీ తక్కువే. మిమ్మల్ని గురించి నాటినుండి నేటివరకూ, ఆ ఆర్ద్రమైన భావమే ఉన్నది. అల్లా అందరికీ ఉంటుంది లోకంలో. అల్లాగా, మీరు ఇన్నాళ్ళు విమర్శన వ్రాస్తే మీమీద నాకు కోపం రానట్లే శ్రీ శ్రీ పాషాణపాకంఅన్నా కోపం రాలేదు. సాగదీస్తే శ్రీ శ్రీ కాదు, ఆరు శ్రీలున్నా నిలువదు.

ఆరోజున శ్రీ శ్రీ ఎందుకు దిగాలుపడి ఉన్నాడంటే చెబుతాను. ఆ సన్నివేశం ఆంధ్ర పత్రికా విలేఖరి వ్రాయలేదు. వెయ్యలేదు. అది ఇది. శ్రీ శ్రీ "భారతం (Fact) రామాయణం (Myth)" అన్నాడు. "వాల్మీకులు చాలమంది ఉన్నారు. వాళ్ళందరూ వాల్మీకులుకారు. విశ్వనాథ ఒక్కడే వాల్మీకి" అన్నాడు. ఈ సందర్భంలో శ్రీ జలగం సుబ్రహ్మణ్యంనాయుడుగారు—ఆయన సంస్కృతాంధ్రాలల్లో చక్కని పరిచయం కలవారు సుమండీ. చాలా గడుసువారు కూడాను—ఆయన శ్రీ శ్రీ ని నిగ్గదీశారు. "ఏమండీ! భారతం (Fact) ఏ కదా? రామాయణం (Myth) ఏ కదా? భారతాన్ని ఒప్పుకుంటారు కదా! రామాయణం (Myth) ఏ కదా?" ఇల్లా నాలుగుసార్లు శ్రీ శ్రీ చేత ఆ మాట అనిపించి, సభవంక చూచి, "ఏమండీ! వింటున్నారుకదా!" అని మళ్ళీ శ్రీ శ్రీ చేత ఒప్పించి, "అయ్యా! భారతము (Fact) ఐతే భారతంలో రామాయణ కథ చెప్పబడి ఉన్నది. రామాయణం (Myth) అనడం ఎలాగా? భారతంలో ఉన్నదంతా (Fact) అని మీరే అన్నారుకదా! అని బాంబు ప్రేల్చారు. శ్రీ శ్రీ జీలాపోయినాడు. తెల్లమొహం వేశాడు. "అయినా (Myth) ఏ" అన్నాడు. నాయుడుగారు "మళ్ళీ అలా మాట్లాడుతారేం?" అన్నారు.

నాకు స్నేహితుడైన శ్రీ శ్రీ సభలో అట్లా కాగా నాది పాషాణపాకం అన్నాడని సమాధానం చెప్పి, ఇంకా దిగులుపర్చమంటారా? నాది పాషాణపాకమన్నవాడి ఆంధ్ర సారస్వత విజ్ఞానం పాషాణ ప్రాయమంతే! అని నే ననడం బాగుండదుకదా! ఈ అహంకారాన్ని చూచి ఇతరులు వ్రాసే వ్రాతలు, వాళ్ల మాట్లాడే మాటలు—నాటి పేరు "ధర్మచింత—పాపభీతి" ఎన్నే! వారి కసలు అహంకారమేలేదు. అయ్యో బాబూ! అనవసరమైన అహంకారాన్ని మనం చంపుకోలేమే. మాత్సర్యాదులవల్ల పుట్టిన అహంకారాన్ని మనం చంపుకోలేమే? ఎవడో ఒక పనిచేసి, అది గొప్ప పని అనుకుని— చాలామంది గొప్పపని అనడం మూలంగా కూడా, అనుకున్నాడేమో పాపం—వాడు నేను చేసిన పనిలోని గొప్పతనం ఇది ఇది అని ఇతరులకు చెబితే అది గొప్పతనంకాకపోతే కాదను. అంతేకాని, అది వాడి అహంకారమనడమేలా? వాడు చెప్పిన గొప్పతనం కాకపోతే వాడు వ్యర్థుడు. అహంకారమైనా గొప్పతనమేగా? ఒకడు తన గొప్పతనాన్ని గురించి అహంకార పడడంచూచి అవతలివాడు పడేదానికి పేరేమిటి? పెద్దలకు తెలియాలి.

మీరు చాలా నెలలబట్టి ఈ వ్యాసాలు వ్రాస్తున్నారు. నే నా ఒక్కవ్యాసం కూడ చదువలేదు. నాకు వర్ణశాఖాది ద్వేషాలు లేవంటే నమ్మనివారు ఈ విషయాన్ని నమ్ముతారని నే ననుకోవడంలేదు. నా పాకం పాషాణపాకం అన్న శ్రీ శ్రీ ని అట్లాంటి మరికొందరితో కలిపి అడుగుతున్నాను. అయ్యా! నా గ్రంథాల్ని తమరు ఏవేవి చదివారు? మీరు చదివిన ఒక గ్రంథంలో ఎన్ని పద్యాలు ఉన్నవి? మీకు అర్థంకాకపోవడమేకదా, పాషాణ పాకమంటే? అందులోవన్నీ అర్థం కాలేదా? కొన్నేకాలేదా? అర్థం ఐనవెక్కువా? కానివెక్కువా? పాషాణపాకమంటే అర్థమేమిటి? పగులగొట్టడానికి వీలులేదనియేకదా? మణులు ఉన్నవి. వజ్రాలు ఉన్నవి. వెలగల రాళ్ళు ఉన్నవి. అవి కాంతిని విరజిమ్ముతూ ఉంటవి. వాటి కాంతిని చూచి ఆనందించాలి తప్ప పగులగొట్టరు. పగులగొట్టి చిన్న చిన్న రాళ్ళుగా వర్తకులమ్ముతారు. ఆ పగులగొట్టే నేర్పు వాళ్ళకు తెలుసు. అలాగే మీరన్నట్లు నేను వ్రాసిన వంద పద్యాల్లో రెండు మూడు పద్యాలు మీకు పాషాణ పాకమనిపిస్తే, వాటికాంతి మీకు తెలిస్తే ఆనందించండి. తక్కినవి మీ ద్రాక్షాపాకాలే, మీ కదళీ పాకాలే వందలాది పద్యాలుంటవి. అవి చూచి ఆనందించండి. మేము మీ గ్రంథాన్ని తిట్టడానికే పుట్టాము. మేము చదువము అని మీరంటే మీకు నమస్కారము.

ఎవరో కొందరు మాత్సర్య గ్రస్తులు ఒక మాటను దేశంమీద పారవేయడం "గతానుగతికో లోకః నలోకః పారమార్థికః" అన్నట్లుగా తక్కినవాళ్ళ దాన్ని పట్టుకొని ప్రాకులాడడం అలవాటైంది. నేను రామాయణంకాని, ఇతర కవిత్వంకాని వందలాది సభల్లో చదివాను. విన్నవాళ్లెవరూ పాషాణపాకమనలేదు. అనలేదు సరికదా ఆనందించారు. ఈ పాషాణపాకం, అనేవాడి బుద్ధిలో ఉంది. హృదయంలోవుంది. నేను ఆవేదన పొందానని అనుకోవడం శ్రీ జలగం సుబ్రహ్మణ్యనాయుడుగారు పొరపాటు పడ్డారు. నేను నా జాతి లక్షణం చెప్పుకోలేనుగాని, నా వ్యక్తి లక్షణం ఏమంటే "గాఢంగా నేను నా చేత నైనంతలో వూహించడం, త్రికరణశుద్ధిగా మాట్లాడటం." త్రికరణశుద్ధిగా మాట్లాడుతుంటే చాలామంది ఆవేదనే అనుకుంటారు. నేను ఆవేదనపడితే శ్రీ చౌదరిగారి విమర్శనలకు, ఆ విమర్శలువేసే పత్రికలు, వేయకపోయినా, ఇతర పత్రికలలో సమాధానాలు ఇంతకంటే శర పరంపరలుగా వ్రాసేవాణ్ణి.

వ్రాయడం—మాట్లాడడం రెండు విధాలు. వ్రాయడంలో ఆవేదన ఉన్నదో లేదో తెలుసుకోవడం కష్టం. మాట్లాడడంలోనూ తెలుసుకోవడం కష్టంకాని, ఇంచాక మనని చేశాను కదూ—వాడు ఆవేదన పడ్డాడని అనుకోవచ్చు. ధర్మం చెప్పేవాడిమాట ఆవేశంతో చెప్పినట్లు ఉంటుంది. ఆ ఆవేశంఆవేశమో కాదో మరుక్షణమందు తెలుస్తుంది. అది నిజంగా ఆవేశమైతే తరువాత చాలాసేపు ఉంటుంది. మరుక్షణమందు ఉండని ఆవేశము ధర్మం చెప్పడంలోఉన్న తీవ్రతకాని ఆవేశంకాదు. ఆ శ్రీ శ్రీ వ్రాసింది పాషాణపాకం. అనగా పగులగొట్టితే ఏమి ఉండదో, అది పాషాణపాకం. నా కవిత్వం పాషాణపాకమన్నది ఎవడో ఒక తెంకాయ పిచ్చికొండ. కాలం దానికి యోగ్యం కనుక బాగా ఉన్నదన్నమాట.

అదంతా అట్లాఉంచి శ్రీ చౌదరీగారూ ! పండితుల్ని పిలువడం, సభ చేయించడం చాల పెద్ద ఎత్తు ఎత్తారు! ఇలా పూర్వం శ్రీ వెల్లపిళ్ళ వేంకటశాస్త్రిగారు వ్రాస్తుండేవారు. ఆ రాశిలో చేరుదామనా ? ఈ కల్పవృక్షంమీది విమర్శతో ఒక రాశిలోనికి వచ్చారనుకోండి. పై రాశికి వెళ్ళడం కూడ మంచిదే. అయ్యా "విద్గగనప్రాలేయాంశువున్"అని ఉన్నది. ఇక్కడ 'న' కారం గురువవుతుందని మీరు వ్రాశారు. అది తప్పని, ఇటువంటివి ఇంకా పాతిక కూడా చూపించారట. తక్కినవన్నీ అట్లాఉంచి, ఈ నకారం గురువవుతుందా? గురువవుతుంది. ఇది తప్పేను అని మీ ఇష్టము వచ్చిన పదిమంది పండితులతో దస్కతులు చేయించి పత్రికలలో వేయించండి. ఆ పదిమంది పండితుల పేర్లు దేశానికి తెలుస్తవికదా? రంగయ్య, పుల్లయ్య పేర్లు పెట్టి వ్రాయించకండి.

అప్పయ్య దీక్షితులు, జగన్నాథ పండితుల వాదం మీరు తెచ్చారు. ఆ ప్రసక్తి ఎందుకు? నక్క ఎక్కడ దేవలోక మెక్కడ? అముద్రిత గ్రంథ చింతామణి పేరు ఎత్తారు. ఆ విమర్శకీ, మనకు కొన్ని మైళ్ళ దూరం ఉంది. పెద్ద పేర్లు చెప్పడమెందుకు ఫూరుకోండి. తక్కినవి చెప్పారు. కొంత బాగా ఉంటే బాగా ఉండవచ్చు. ఇందులో శ్రీ గిడుగు రామమూర్తిగారిపేరు కూడా ఎత్తారు. ఓ అయ్యా! రామమూర్తిపంతులుగారు వ్రాసిన వ్రాతలు కూడా చదివారా యేమి మీరు? అందుకనేనా 'చేటురు, కోటురు' తప్పన్నారట! గడచిన నలుబది యేండ్లుగా ఆంధ్ర భాషా పత్రికలలో జరిగేటువంటి శబ్ద స్వరూపములయొక్కయు, అర్థములయొక్కయు విచారణ లక్షణము మీకు తెలియదని, మీరు చూపించిన దోషాలు మా మిత్రులు చెప్పగా విని నే ననుకొన్నాను. రెండే పద్ధతులు. మీ కివన్నీ తప్పులు కావని తెలిస్తేనే వ్రాయాలె. అలా వ్రాస్తే మీకు ధర్మచింతలేదు. పాపభీతిలేదు. తెలియకండా వ్రాస్తే దాని పేరు పాండిత్యం లేకపోవడం. అదట్లాఉంచి, మీ ఇష్టం వచ్చిన పండితుల్ని నలుగుర్ని పిలువండి. వారు ప్రసిద్ధులైన పండితులు కావలె సుమండీ. 'విద్గగనప్రాలేయాంశువున్' తప్పనే పండితులు కాకూడదు. అటువంటి పండితులను మీరు తీసుకవస్తే నేను సభకురాను. ఇప్పటికివలెనే అప్పుడు కూడ దూరంనుంచే నమస్కారం చేస్తాను. నేను పండితుల్ని తీసుకరాను. పుస్తకాలు తీసుక వస్తాను. మీరు తప్పన్నవాటికి ప్రయోగాలు చూపిస్తాను. "భూమిపుండు" ఇందులో అశ్లీలమని వ్రాసినారట. మీరు నలుబది యేండ్లనుండి జరుగుతున్న పత్రికలలోని పారస్పత విమర్శలు చక్కగా అనుసరించామన్నట్లు వ్రాశారే. శ్రీ తిరుపతి వేంకటకవులలో ఇలాంటి అశ్లీలాలుఉన్నవని వారి ప్రతిపక్షులు వ్రాయడం వారు సమాధానాలు వ్రాయడం చదివేవుంటారుకదా? ఇలాంటి అశ్లీలం వ్రాయనివాడుంటాడా? అంతదాకా ఎందుకు? తమరు కూడా ఏవో పుస్తకాలు వ్రాశారని వినికిడి. మీరు ఏవి దోషాలన్నారో అవి మీ గ్రంథాల్లోనే చూపించవచ్చు. మీ సవాలు అట్లాఉంచి ఇది నా సవాలు. ఆ సభ పెట్టించండి. మీ పటంపెట్టి మీ నెత్తినే పొడుచుకున్నట్లవుతుంది. నాకేమీ అభ్యంతరంలేదు.

నే నొకమాట వ్రాస్తున్నాను. వ్రాయబోయేమాటకు నేను సభకు రాననిమాత్రం అర్థం చేసుకోకండి. ఆ సభలో కొంచెం పోలీసు బందోబస్తుతో రావాల్సిన అవసరం నాకు లేకుండా చేయండి. ఇంతదూరం వచ్చింది కనుక మీరు వ్రాసిన వ్యాసాలు తీరికలేకపోయినా, చదువుతాను. మీరు చూపించిన తప్పులు తప్పులుకావని సప్రమాణంగా నిరూపిస్తాను. కాని నేను నా పుస్తకంలో కొన్ని పొరపాట్లు ఉండవచ్చు. వాటిని నే నంగీకరిస్తాను. "రఘుపేశ్వరు గృహముల్" యతిభంగమున్నదని మీరు చూపించారట. నిజమే. ఉన్నది. రతీదేవి తప్పన్నారట. అది తప్పనడంలో కూడ కొంత న్యాయమున్నది. బాగా పరిశీలించలేనివాడికి తప్పనిపించవచ్చు. కాని వాచస్పత్యంలో ఈ కారాంత స్త్రీలింగం కూడా ఉదహరించబడింది. అయినా ఇవన్నీ సభలో చెప్పవలసిన సమాధానాలుకదా? ఈ రెండైనా ఇప్పుడెందుకు వ్రాస్తున్నానంటే ఆసభ పెట్టేదిలేదు. జరిగేదిలేదు. మీరు పిలిచేదిలేదు. వారు వచ్చేదీలేదు. బ్రహ్మశ్రీ వెల్లపిళ్ళ వేంకటశాస్త్రులుగారు తమ ప్రత్యర్థులకు ఇటువంటి సవాళ్ళు నాలుగైదుసార్లు చేశారు. ఇప్పుడు వారి స్థానంలో నే నున్నాను. వారి ప్రత్యర్థుల స్థానంలో మీరున్నారు. ప్రత్యర్థి స్థానీయులైన తమరు ఈ సవాలు చేయడం క్రొత్త తప్ప వేరే క్రొత్త లేదు. అసలు మీ ఇంటిపేరే క్రొత్తాయె. ఇంతకూ మీబలమేమంటే ప్రజాస్వామ్యంకావడం. ఇంకా ఉన్నవనుకోండి కొన్ని. అలా ఉంచండి. ముఖ్యంగా ఇంకొకటి కూడ చెప్పాలి. మన దేశంలో చాలమంది పత్రికాధిపతులకు విశ్వనాథ సత్యనారాయణమీద విమర్శ ఏదైనాసరే అచ్చువేద్దామన్న ఉత్సాహమో, ఉబలాటమో, మాత్సర్యమో లాభచింతో ఉండడం. విశ్వనాథ సత్యనారాయణను ఎవడైనా మెచ్చుకుంటే, దానిపేరు చెక్క భజనట. తిడితే వారికి బాగుంటుంది. పోనీయండి నష్టమేమి? శ్రీ చౌదరిగారూ ! శ్రీ శ్రీ అన్నట్లుగా నా కవిత్వము పాషాణపాకమనీ, నేను కూడ అనుకునేవాన్నేమోకాని, పందలాది సభల్లో నేను చదివితే ఆనందించేవాళ్ళనిచూచి నేను అనుకోలేకుండా ఉన్నాను. మీరు వ్రాసిన వన్నీ దోషాలనుకున్నా, ఇదే బాధ వచ్చింది. పలుమంది పండితులు విన్నారు. మా ఇంటికి వచ్చి విన్నారు. కొందరి ఇండ్లకువెళ్ళి వినిపించాను. సభలలో శ్రద్ధగా కూర్చుని విన్నారు. వారు తప్పనలేదు. అందుచేత తప్పులు కావని ఒక అభిప్రాయం నా కేర్పడ్డదేమో!

ఈ గోలంతా ఎందుకు? "విద్గగనప్రాలేయాంశువున్"లో నకారం గురువవుతుంది. ఇది తప్పేను అని—నేను నలుగురి పేర్లు చెబుతాను. ఆ నలుగురిచేత దస్కతులు చేయించి వారి ఉత్తరాలను 'భారతి' పత్రికాధిపతి చేతిలోపెట్టి అవి ప్రకటించవలసినదని ప్రార్థన. శ్రీ తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారు, శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు, శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు ఈ పాయాలోఉన్న మీ ఇష్టం వచ్చిన మరో పండితుడు. ఈపని మీరు చేస్తే అయినాసరే, కాకపోయినాసరే మీరు చూపించినవన్నీ తప్పు అనుకుంటాను. ఇంకొక్కటే మనవి. మీరు వ్రాసిన వ్యాసాలకు తిరిగి సమాధానాలు వ్రాస్తే మీ విమర్శలు ప్రకటించే పత్రికాధిపతు

ఱలో మా సమాధానాలు ప్రకటించేదిగా సిఫార్సు చేసి పెట్టండి. మీరు దీనికి కూడా యథేచ్ఛగా మళ్ళీ వ్రాస్తే "నమోవాకం ప్రశాస్మహే". "మాటకి మాట తెగులు, నీటికి నాచు తెగులు". మీరు ప్రధానంగా చేయవలసింది "చిద్గగనాంతమందు" గురువుని చూపించడం. మీరు ధర్మచింత, పాపభీతి కలవారు కనుక గురు దర్శనం మీకు తప్పకుండా జరుగుతుంది. లఘుదర్శనం కలుగుతుందా? అబ్బే! ఇలాంటి వ్యాసాలు మీరు వ్రాసినా, నేను వ్రాసినా ఇల్లాగే ఉంటవి. మీరు ఆ పండితుల ఉత్తరాలు ప్రకటించిన తరువాత మీరు దోషాలన్నవాటికి మాత్రమే సమాధానాలు వ్రాస్తాను. ఇంక ఒక అక్షరం వ్రాయను.

అందుచేత ఇప్పుడింకొక మాట కూడా చెబుతున్నాను. నా రామాయణం నిలువదేమోనన్న భయం మీ కెందుకు? నిలువదు. ఏం నిలువకపోతే? మీరు కవుల జీవితాలు చదివేవుంటారు. ఒక్కొక్కడు పాతిక గ్రంథాలు వ్రాస్తే వాడివి రెండు మూడు గ్రంథాలే నిలువడం చదువుతూనే ఉన్నాంగా. రామాయణం నిలువకపోతుందనుకోండి. వేయి పడగలు నిలుస్తుంది. అది మత గ్రంథం కదూ! ఆ మతానుయాయులలో నిలుస్తుంది. తమవంటివారి విమర్శలవలె మతానుయాయులలో నిలువవచ్చు.

ఒకటే చివరిమాట. వ్రాసిందే చివరకు గట్టిగా చెబుతున్నాను. ఆక్షేపణలు, ఎత్తిపొడుపులు, గడుసుతనం మాటలు మీరు వ్రాయవద్దు. నేనూ వ్రాయవద్దు. మీరు వ్రాసినా మళ్ళీ నేను వ్రాయనని మనవి చేస్తున్నాను. ఆ నలుగురు పండితులచేత పూర్వ నకార గురుత్వం నిరూపించండి. అప్పుడే వ్రాస్తా. లేకపోతే ఇన్ని నెలలుగా పూరుకున్నట్లే నెలలుకాదు సంవత్సరాలైనా పూరుకుంటా.

తప్పును తప్పుగా చూపేందుకు

పండితులు అవసరమా?

శ్రీ సి. కనకాంబరరాజు

[శ్రీయుతులు సి. కనకాంబరరాజు, శ్రీరంగం శ్రీనివాసరావు. ఆంధ్రపత్రిక నవంబరు 5 వ తేదీ సారస్వతానుబంధంలో వ్రాసిన వ్యాసాలను; అదేరోజు వెలువడిన మరికొన్ని సంక్షిప్త వ్యాసాలనుకూడ ఇక్కడ పొందుపరుస్తున్నాము.]

చెన్నపురి తెలుగు మహాజన సమాజంలో శ్రీ శ్రీ గారు విశ్వనాథ సత్యనారాయణగారి శైలి పాషాణపాకమన్నారు. దానికపుడు విశ్వనాథవారు శ్రీ శ్రీ వాదనకు మాట్లాడకుండా 'గప్ చిప్'గా పూరుకున్నారు. సభలో పూరుకుని పత్రికా ముఖంగా శ్రీ శ్రీ బుద్ధి పాషాణమని, శ్రీ శ్రీ హృదయమే పాషాణమని వారిని దూషించడం న్యాయంకాదు. సుమారు ఒక ఐదువందల మంది (మనకు తెలియదు గనుక మహాసభకు వచ్చినవారు అంతమందేననుకుందాం) ఉన్న సభలో శ్రీ శ్రీ గారికి సమాధానం చెప్పలేకపోవడం, తరువాత ముక్కోటి ఆంధ్రులు చదివే పత్రికలో ఆయన్ను దుమ్మెత్తిపోయడం విశ్వనాథలాటివారికి భావ్యంకాదు. సభలో విమర్శకు సమాధానమిస్తే 'దిగాలుపడి కూర్చున్నవారు' మరీ దిగాలుపడి కూర్చుంటారని సమన్వయించ లేదంటారు. మరి ఇప్పుడు పత్రికా ముఖాన తిడితే శ్రీ శ్రీ గారి కెలా ఉంటుందో? సభలో శ్రీ శ్రీ గార్ని 'పొగడడం బయటికి వచ్చిన తర్వాత దూషించడం' విశ్వనాథవారి చెన్నపురి ఉపన్యాసంలోనే దీనికి సమాధానం ఉంది.

పూర్వం ఒకడు తాబేలును చంపేందుకు నానా అవస్థ పడుతున్నాట్ట. దారినిపోయే ఒక సాధువు చూచి, "మేము సాధువులం చెప్పకూడదుగాని, తిరగేసికోస్తే అదే చస్తుంది" అన్నాట్ట. అలా ఉంది విశ్వనాథవారి వైఖరి.

నాకు విశ్వనాథవారిమీద ద్వేషంలేదు. శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారిమీద, శ్రీ శ్రీ గారిమీద అభిమానంలేదు. ముఖతః నా కెవరూ తెలియనే తెలియదు. అయినా ఇదెందుకు వ్రాస్తున్నానంటే పేరు ప్రఖ్యాతులున్న విశ్వనాథలాటి వారే తమ తప్పును కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నారంటే చాల విచారమవుతుంది. "పొగడిస్తే శ్రీ శ్రీ కాదు, ఆరు శ్రీ శ్రీ లున్నా నిలువరు.' ఏదీ? పొగడిసిందెక్కడ? సమయందాటి సవాలు చేయడం—'సత్యవాక్కుల' లక్షణంకాదు.

'భారతి'లో ప్రచురిస్తున్న కొత్త సత్యనారాయణచౌదరిగారు వ్రాస్తున్న విశ్వనాథవారి 'రామాయణ కల్పవృక్షం' మీది విమర్శ చదువుతూనే ఉన్నాము.

చౌదరిగారు చూపించిన విమర్శలో కూడా అంత ముఖ్యత్వం కనిపించదు. కొన్ని తప్పులు నిజమేనని విశ్వనాథవారు ఒప్పుకోనే ఒప్పుకున్నారు. 'చిద్గగన ప్రాలేయాంశువున్' లో 'న' ఎప్పుడూ గురువుకాదు లఘువేనని 'ఏ. బి. సి. డి. లు నేర్చుకునే' (ప్రయోగ చాపల్యానికి క్షమించవలసింది) హైస్కూలుకొన్ని ప్రతి తెలుగు విద్యార్థి చెప్పగలడు. పై పాదంలోని తప్పును రూపించేందుకు 'పండితులు కావాలి. సభలు చేయించాలి' అని ఉదహరించారు. కొత్తవారి వాక్యాన్ని విశ్వనాథవారు. ఇంకొకటి, ఆ పండితు లెలా ఉండాలంటే 'చిద్గగన ప్రాలేయాంశువున్'ను తప్పనే పండితులు కాకూడదట. "అటువంటి పండితులను తీసుకవస్తే నేను సభకు రాను" అంటూ

వ్రాసుకొచ్చారు. ఇదెంత హాస్యాస్పదంగా ఉందో చూడండి. తప్పును తప్పుగా రూపొందించే పండితులు కావాల్ట. అటువంటి సభకే విశ్వనాథ వస్తారు. పై చెప్పిన దానిలో కొత్తవారు చూపించినది దోషం కాకుండానే ఉండొచ్చు. కాని తప్పును తప్పుగా చూపించేం దుకు పండితులెందుకు? మరి సభ లెందుకు మహాశయా?

విశ్వనాథవారు ఎంతసేపూ యిది గురువుకాదు అంటూ ఒకే తప్పును పలుమార్లు ప్రతి విమర్శించి చూపించడమే కాని వేరొక దాన్ని ఉదహరించలేదు. దానికి కారణ మేమై ఉంటుందో—'ఇందు భావమేమొ యిందిరేశు డెరుగు!'

తర్వాత 'ఏనుగుల పోరాటంలో లేళ్ళు ఏదో అయినట్లు మధ్యలో పత్రికల నాడి పోసుకోవడం. ఒకరిమీద విమర్శ ప్రచురించి నందువల్ల ఆ 'పత్రిక స్థితి దిగజారిపోయింద'నడం ఏమి సబబు. విశ్వనాథవారిమీద యీనాడు తప్పుల్ని చూపిస్తుందనేనా ఎన్నో ఏండ్ల నుంచి సాహిత్య సేవ చేస్తున్న 'భారతి'ని దూషించడం?

యామిజాలవారు సవాలు చేశారు. సవాలు చేయుడానికి వారి కా అధికార ముండొచ్చు. కాని సభాముఖాన సవాలు చేయుడమే కాని, చేసే క్రియ ఏదన్నా ఉందో లేదో తెలియుదు. కార్యసాఫల్యా న్నభిలషించేవారు సవాళ్ళు చేయరు. ప్రతిసవాలనడ మనేది వేరేమాట. నేనిలా చేస్తానని చేసేవాళ్ళు చెప్పరు. చడీ చప్పుడు లేకుండా చేసేస్తారు. విశ్వనాథవారికి అండగా సభలో వారి గౌరవం నిలబెట్టడానికే ఆ సవాలు చేసినట్టు అర్థమవుతూంది.

"శ్రీ చౌదరిగారి విమర్శలకు, ఆ విమర్శలు చేసే పత్రికలు వేయకపోయినా, ఇతర పత్రికలలో సమాధానాలు ఇంతకంటే తర పరంపరలుగా వ్రాసేవాణ్ణి" అన్నారు విశ్వనాథవారు.

వ్రాసేవాణ్ణి, చేసేవాణ్ణి ఇవన్నీ వాగ్వాదంకోసం ఉపయోగించే మాటలు.

విశ్వనాథవారు తమ 'రామాయణ కల్పవృక్షం'పై వచ్చే విమర్శలకు తట్టుకొని యికనైనా 'ఇప్పటివరకూ నేను 'భారతి'ని చదువలేదు. నా మిత్రులు చెప్పగా విన్నాను. అనకుండా త్వరపడి వాటికి సరైన సమాధానా లివ్వడమే మంచిది. అంతేగాని వారిని వీరిని వ్రేలెత్తి చూపించడం విశ్వనాథలాటి 'ధర్మచింత', 'పాపభీతి' కల మహాకవులకు భావ్యంకాదని తోస్తోంది.

"పాషాణపాకి"

శ్రీ శ్రీ

శ్రీ కొత్త వారికీ, శ్రీ విశ్వనాథ వారికీ ఈమధ్య వేడిగా వాడిగా వాదోపవాదాలు సాగుతున్నాయి. ఆ మధ్యలో సత్యనారాయణగారు నన్ను కూడా ఇరికించి రెండు శ్రీ లను మూడుపెట్టి హెచ్చరించారు. కృతజ్ఞుణ్ణి! వారిలో తొలినుంచీ ద్యోతక మవుతున్న "హింస్రాత్మ కత" ఈ నాటికీ మూడు మొగ్గలూ, ఆరు పిందెలుగా వర్ధిల్లుతూనే ఉంది. అయితే వారిలో ఇటీవల ఇంకో సద్గుణం కూడా వెల్లి విరు స్తోంది. అదే "విమర్శా వైమనస్యం!"-చంపనైనా చంపండి కాని విమర్శించకండి నన్ను—అనడం విశ్వనాథవారి కొక్కరికే చేతనవును! అవును వారు (తమ దృష్టిలో) విమర్శాతీతులు!

పాషాణపాక ప్రభూ! అని మొట్ట మొదటిసారి విశ్వనాథవారిని జనసూత్రం సంబోధించాడు. చెళ్లపిళ్లకంటె గొప్ప కవినని ప్రారంభించిన విశ్వనాథవారు ఇప్పుడు వాల్మీకికన్నా మిన్నని చెప్పుకునేదాకా పెరిగారు. ద్రాక్ష కంటె వజ్రం గొప్పదని వీరి వాదం! కాని వీరు వజ్రాలని మనముందు పోసిన రాళ్ళగుట్టల్లో రక రకాల దోషాలు చాలా ఉన్నాయి. ఆమాట అన్నందుకే కొత్తవారిమీద కవిగారి కోపం!

"చిద్గగన ప్రాలేయాంశువున్"మీద చిన్న గలాటా లేవదీశా రీయన! నకారం గురువో లఘువో—దానికేం గాని, చిద్గగనందాకా వెళ్ళిన సత్యనారాయణగారి నింకా ప్రాలేయాంశు వెలా వెంటబెట్టిందో నాకు బోధపడలేదు. విశ్వనాథవారి పాషాణపాకాని కిదో చిన్న ఉదా హరణ మాత్రమే.

నేనేదో-సభలో దిగాలుపడి కూచున్నానట! 'వేడుక చూడవచ్చినవాణ్ణి'. Enjoyed every minute of the show. జలగంవారు నాకు తిరుగులేని జవాబు చెప్పారట! ఏమని? భారతం ఒప్పుకుంటే అందులోనేఉన్న రామాయణాన్ని ఒప్పుకోవలసిందేనట! సెబాస్! భారతంలో వందలకొద్దీ పుక్కిటి పురాణాలున్నాయి! అన్నిటినీ ఒప్పుకోవలసిందేనా?

ఇంతకూ విశ్వనాథవారి మనోవేదనకు కారణం నాకు తెలుసు! వారి వయస్సులో పొగడికలకు పొంగిపోవడమూ, తెగడికలకు కుంగిపోవడమూ ఉండదు. తాము చేసింది తప్పు అనే సంగతి తమ అంతరాత్మలోనే మారు మ్రోగినప్పుడు, నిజమైన వేదన కలుగుతుంది. ఇదే విశ్వనాథవారిని వీడకుండా పీడిస్తున్న వేదన.

ఏమైనా విశ్వనాథవారికి నామీద సవ్యాజానురాగం ఉందని నాకు తెలుసు. సవ్యాజం ఎందుకంటే—ఇదుగో ఇలాంటి పితూ రీలు లేవదీస్తూ ఉంటానని! అల్లసాని పెద్దన్నగారికి తెనాలి రామకృష్ణునిమీద బహుశా యిలాంటి అనురాగమే ఉండవచ్చు. తొలినుంచీ విశ్వనాథవారిని గొప్ప కవిగా గుర్తించిన వారి జాబితాలో నన్ను నేను సగర్వంగా కలుపుకుంటున్నాను. అయితే అంతమాత్రంచేత వారు చేసిన, చేస్తున్న, చేయబోతున్న అవక తవక లన్నింటికీ హారతి పట్టనక్కరలేదు.

భారతి స్థాయి తగ్గలేదు

శ్రీ కె. లక్ష్మీనారాయణ

[ఆంధ్రపత్రిక నవంబరు 5 వ తేదీ సారస్వతానుబంధంలో వచ్చిన కొన్ని విమర్శలు : ప్రతివిమర్శలు.]

శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు మద్రాసులో మాట్లాడుచూ, భారతిస్థాయి దీనినిబట్టి ఎంతగా దిగజారిపోయినదో చెప్పలేకున్నాము అని చెప్పినముక్క చెవులకింపుగాలేదు. భారతిలోజరుగుచున్న విమర్శ ప్రతి దేశములోను అవసరమైనదే. ఒకప్పుడు "మాచ్యూ ఆర్నాల్డు" యూరోపులో ఎచ్చటనూ లేనట్టి విమర్శనము, ఆంగ్ల సారస్వతములో కలదని, చివరకు దీనికొరకు ఆంగ్ల సారస్వతమునకు ప్రతివారు రాక తప్పదని వ్రాకుచ్చెను. ఆంగ్లేయ భాషలో ఇట్టి విమర్శనములు లెక్కకు మిక్కుటముగా నున్నవి. జాన్‌సన్, షేక్స్‌పియర్‌వంటి మహాకవిని పలు విధముల విమర్శించినారు. పండిన చెట్టుకే రాతి దెబ్బలు గదా!

ఆంధ్రదేశములో చారిత్రక దృష్టికోణము, విమర్శనా జ్ఞానము, కుంటుబడిఉన్నవి. ఈ విషయమును నేనునూ, చిలుకూరి వీరభద్రరావుగారునూ, 1935 లో కొవ్వూరులో మాట్లాడుకొనినాము. ఈదృక్పథముతోనే నేను 'రామాయణ మహా భారత విమర్శనము' అను' పది హేను సంవత్సరములు కష్టించి, మద్రాసు, కలకత్తా, కాశీ గ్రంథాలయములలోని బహుళ గ్రంథ పరిశోధనముచేసి వ్రాసితిని. నేను రామాయణ విమర్శనము చేసి వ్రాసినపుడు 'లంకా నగరము ఎచ్చట నున్నది' అను విషయమును సమగ్రముగా చర్చించలేదు. ఈ వ్యాసమును తరువాత 1958 మార్చి భారతిలో ఆ పత్రికాధిపతులు ప్రచురించిరి. తరువాత కొంత పరిశోధన చేసికొనుచూ భారతి పత్రికలు స్థాపించిన లగాయితు ఆ పత్రికలను పఠించసాగితిని. అంతకుపూర్వమే విభవ సంవత్సర మాఘ భారతిలో కొచ్చెర్లకోట వెంకటరామయ్యగారు కిష్కింధ, పంచవటి నిర్ణయము అను వ్యాసమును వ్రాసిరి. శుక్ల సంవత్సర చైత్ర భారతిలో గో. రామాదాసుగారు రామాయణమునంతను పరిశోధించి యిట్లు వ్రాసిరి. "కిష్కింధ వింధ్యకు ఉత్తరముగా నున్నది. నర్మద ఉత్తర తీరమున వింధ్య నడుమ ప్రదేశమే కిష్కింధయని సులభముగా నిర్ణయింపవలెనని వ్రాసిరి." ఇట్టి విషయములను జూచినపుడు నాకు పరమానందము కలిగినది. తత్పూర్వము కిష్కింధ, లంకల గూర్చిన ఛాందస భావములు పోయినవి.

ఇటులనే 'వాసిరెడ్డి వెంకటాద్రినాయుని చరిత్ర' వ్రాయుటకు నేను మదరాసు వెళ్ళి, నిడదవోలు వెంకటరావుగారి సహాయంతో ప్రాతకాలపు ఆంధ్ర సంచికలను భారతీ పత్రికలను చదువుచుండ అమరవాది హనుమచ్ఛాస్త్రిగారు రచించిన "వాసిరెడ్డీయము, అమరవాది రామసుకవి" అను వ్యాసము లభ్యమైనది. 1816 లో వచ్చిన పిండారీల దండును గూర్చి వ్రాసిన ఒక సీసమాలిక భారతిలో లభ్యమైనది. 'భారతి' ఒక కల్పవృక్షమని తలంచినాను. ఇందలి విజ్ఞానశాస్త్ర చారిత్రక విమర్శన వ్యాసములు నన్నెంతయో ఆకర్షించినవి.

సంఘసేవాపరాయణులైన శ్రీ నాగేశ్వరరావుగారు ఈవిధముగా భాషా సేవను ఆంధ్రపత్రిక, పంచిక, భారతుల ద్వారా గణనీయమైన సేవ చేసిరి. వారి అడుగుజాడలలోనే ఈ పత్రికలు నడచుచున్నవి. అట్టి పత్రికా రాజమైన భారతిని గూర్చి శ్రీ విశ్వనాథవారు అట్టి అభిప్రాయము విచ్చుట సబబుగా లేదు. పత్రికలయొక్క ధర్మము సమస్త రంగములలోని వ్యాసములను ప్రచురించటమే. నవీనయుగ లక్షణములలో ముఖ్యమైనదగు విమర్శనమునకు పత్రికాధిపతులు తావొసంగనిచో ఆ పత్రికలు గూడ అలద్దాల పుట్టలగును.

రచన పండితులకా పామరులకా?

శ్రీ కాదంబరి వెంకటరత్నం

శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారికి చెన్నపురి ఆంధ్ర మహాసభవారి సన్మానము జరిగిన నాటినుంచి నేటివరకు "పత్రికలో" ప్రచురించుచున్న విమర్శలు, ప్రతి విమర్శలు చదువుచున్నాను. ఈ సందర్భములో మూడు విషయములు వ్రాయవలెనని తోచి వ్రాయుచున్నాను.

(1) శ్రీ విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షము పండితుల కొరకే వ్రాసినారా, లేక పామరులకొరకు కూడా వ్రాసినారా? 'శ్రీ శ్రీ' అంతటి వారికే అది 'పాషాణపాక' మైనచో మాబోటి పామరులకు అది ఎట్టి పాక మగునో! ఆయన సమాధానములో ఆయన వ్రాసే పద్యములు 'మణు' లని అన్నారు. మణులైనచో మహారాజుల కిరీటములలో ఉండువేగాని, సామాన్యులకు అందుబాటులో నుండవు గదా !

(2) విమర్శ విషయంలో, శ్రీ సత్యనారాయణగారు, తాము, కాళిదాసు, శ్రీనాథులవంటి మహా కవుల మొదలు నేటి ఆధునిక కవుల వరకు విమర్శించుచున్నారుగదా! వారి కవిత్వమును మరొకరు విమర్శించినపుడు వారికంత ఆవేశాగ్రహము లెందలకో! సాన బట్టనిదే కత్తికి పదును రానట్లు విమర్శతోగాని వారి విలువ పెరుగదు గదా!

(3) కవి సామ్రాట్ సంస్కృతాంధ్ర పండితులనుట నిర్వివాదము. అంతటి మహా పండితులు చెన్నపురి సభలో "నేను పెద్దవాణ్నయ్యాను. బహుశా ఎంతోకాలం జీవించను. నాపై కోపం ఉంటే పిస్తోలుతో కాల్చవచ్చునే. మేడమీద (వారుంటున్నది మేడ కాబోలు) ఒంటరిగా పండుకుని ఉంటాను. చిన్న సల్ఫ్యూరిక్ ఏసిడ్ బుడ్డి విసిరితే చాలునే కోపం తీర్చుకోడానికి" అన్నారు. ఈ మాటలు క్రూరవాళ్ళనవలసినవి కాని కవి సామ్రాట్లు అనవలసినవి కావు.

శ్రీనాథునికి సీస పద్యములు రావనుట, కాళిదాసు కావ్యములలో వ్యాకరణ దోషము లున్నవనుట, వారి రామాయణ కల్పవృక్ష కావ్యాన్ని అర్థం చేసుకొనగలవారు అసలు పుట్టనే లేదనుట, ఐదారు సంవత్సరముల క్రితము విజయవాడ రేడియో కేంద్రమునుంచి ప్రసారము చేసిన వారి ప్రసంగములో మన తెలుగు దిన పత్రికల సంపాదకులకు తెలుగు సాహిత్యమే తెలియదనుట—ఈ విధమైన మాటలు వారి అహంభావమును సూచించుచున్నవే కాని వారి ఘనతను చాటవు గదా!

అక్కసు అనుచితం

శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు

విశ్వనాథవారి జవాబులో, వారు వ్రాసిన కొన్ని వాక్యాలకే తేడా కలుగుతోంది. మధ్యలో పత్రికాధిపతుల ప్రసక్తి, పత్రికాధిపతులను గూర్చి సందేహము, అక్కసు, తేటతెల్లమవుతున్నాయి. కొన్ని వాక్యాలు చూడండి. క్రొత్తవారు "కల్పవృక్షము"పై వ్రాసిన వ్యాసాలు చదువలేదనినారు విశ్వనాథవారు. మరి యీ క్రింది వాక్యాలు వారి మాటను ధ్రువపరుస్తాయా?

"అవి రెండూ వారికి ఉండడానికి వీలు లేదని వారి విమర్శ వ్యాసాలే సాక్ష్యం."

"చిద్గగన ప్రాలేయాంశువున్" అని యున్నది. ఇక్కడ స కారం గురువవుతుందని మీరు వ్రాశారు" ఇవి కొత్తవారి వ్యాసాలను చూచినారనుటకు తార్కాణాలు. "మీరు చాలా వెలబట్టి ఈ వ్యాసాలు వ్రాస్తున్నారు. నేనా—ఒక్క వ్యాసం కూడా చదువలేదు." ఈ మాటల కర్థమేమి?

"నా వ్యక్తి లక్షణం ఏమంటే గాఢంగా నాచేత నైనంతలో వూహించడం. త్రికరణశుద్ధిగా మాట్లాడడం" ఈ వాక్యార్థము ఎంతవరకు సమంజసమో వారి వ్రాతలోనే తెలియుచున్నది.

"మన దేశంలో చాలమంది పత్రికాధిపతులకు విశ్వనాథ సత్యనారాయణమీద విమర్శ ఏదైనాసరే అచ్చు వేద్దామన్న ఉత్సాహమో, ఉబలాటమో, మాత్సర్యమో, లాభచింతో ఉండడం."

"మీరు వ్రాసిన వ్యాసాలకు తిరిగి సమాధానాలు వ్రాస్తే మీ విమర్శలు ప్రకటించే పత్రికాధిపతులతో మా సమాధానాలు ప్రకటించేదిగా సిఫార్సు చేసి పెట్టండి."

"నేను ఆవేదనే పడితే శ్రీ చౌదరిగారి విమర్శనలకు, ఆ విమర్శలు వేసే పత్రికలు వేయకపోయినా, ఇతర పత్రికలలో శర పరంపరలుగా వ్రాసేవాణ్నే."

ఈ వాక్యాలు పరిశీలిస్తే విశ్వనాథవారికేలనో పత్రికాధిపతులపై సందేహం, అక్కసు కలిగినట్లు తేటతెల్లమవుతుంది. కారణం కూడా తెలియకుండా ఉంది. 58, 59 సంవత్సరాల వరకు విశ్వనాథవారి రచనలను ప్రకటించిన "భారతి" కొత్తవారి వ్యాసాలకు జవాబులు వ్రాసిన విశ్వనాథ వారి వ్యాసాలను ప్రకటించదని పత్రికాధిపతులన్నారా? అనుమానమా? అనుమాన మెందుకు కలుగవలె? ప్రకటించరను నుద్దేశ్యమే యున్న విశ్వనాథవారి జవాబేల ప్రకటింపబడినది? పై వాక్యాలనుబట్టి పాఠకులు గ్రహింపవలసిన దేమిటి? కొత్తవారి విమర్శలను పత్రికాధిపతి ప్రకటించుట తమ కిష్టం లేదనా? ప్రసిద్ధ కవుల గ్రంథాలపై విమర్శలను, ప్రతి విమర్శలను ప్రకటిస్తూ వచ్చుచున్న "భారతి" స్థాయి ఎప్పటినుండి తగ్గినది? 1959 నుండి తగ్గినదా? విశ్వనాథవారి రచనలు ప్రకటింపబడనందున తగ్గినదా? ఈవిధంగా వారి గ్రంథముపై వచ్చిన విమర్శలను ప్రకటించుట వలన తగ్గినదా? "చాలమంది పత్రికాధిపతులు" అని విశ్వనాథరవా రన్నారు. ఆ చాలమంది "తెలుగు విద్యార్థి" యను పత్రికాధినేతలు, "భారతి" పత్రికాధిపతులు కాబోలు! మాత్సర్యానికి పత్రికా సంపాదకులకు కారణమేమో? ఇదివరలో ప్రచురించిన విమర్శ ప్రతి విమర్శా కర్తలమీద మాత్సర్య ముండెనా? మాత్సర్యమున్న నౌకరిమీదే యుండునుగదా! "లాభచింతో" అంటే ఈ విమర్శలను ప్రకటించుటవలన వారికి ప్రతినెలా చాల లాభం వస్తుందనా? "ఇతర పత్రికలకి శరపరంపరగా వ్యాసాలు వ్రాయగలనని" చెప్పుకున్న విశ్వనాథవారు పై విధముగా పత్రికాధిపతులను దుయ్యబట్టుటయు, సిఫార్సు చేయమనుటయు, వ్రాయుట మిక్కిలియనుచితము. అసమంజసము. వారి మాటలు పెద్దతనంతో భయపెడుతున్నట్లున్నాయి. ప్రతి విమర్శ చేయగల ధైర్య మున్నపుడు సమాధానాలు వ్రాయుటయుత్తమం.

పెద్దవారిని, మధ్యవర్తులుగా కొందరను సూచించారు విశ్వనాథవారు. "చిద్గగన ప్రాలేయాంశువు" అన్నచోట మాత్రమే నిర్ణయాన్ని సూచిస్తూ, దాని తర్వాత వ్రాసామన్నారు. అదొక్కటేనా మధ్యవర్తుల నిర్ణయమునకు సరిపడినది? ఇతర దోషములపై విరూపణ చేయ నవసరము లేదా? విశ్వనాథవా రిట్లా వ్రాయుట, "సమాధానం వ్రాయలేక డంబాలు పలుకుటయే" అన్నట్లుంది. కృష్ణా పత్రికలో కొత్తవారి విమర్శకు "రామకృష్ణరావుగారు" పరామర్శ వ్రాయలేదా! అట్లే తా మెందుకు వ్రాయరాదు? వ్రాయలేక పోవుటను దలంచియే విశ్వనాథ వారిట్లా వ్రాశారని తలంపవలసివస్తోంది. అందువలన విశ్వనాథవారు తప్పక ప్రతి విమర్శ చేయాలని నా మనవి. పత్రికాధిపతులపై లేనిపోని అనుమానాలను, ఆక్కసును ప్రకటించు టసంగతము. అనుచితము. ధైర్యహీనతకు తార్కాణము. విమర్శకు ప్రతి విమర్శ వ్రాయుట గడసరితనము. గ్రంథములోని లోటుపాటులను దెలిసికొనుట పాఠకునికి ముఖ్యము. అందు వలన "ప్రతి విమర్శ" వ్రాయుట ముఖ్యమని మనవి.

ఇదేనా రసజ్ఞత?

శ్రీ వక్కలంక రామారావు

తిరువల్లిక్కేణి తెలుగు మహాజన సమాజం వారి సభలో 'శ్రీ శ్రీ' విశ్వనాథవారి కవిత్వం 'పాషాణపాకం' అనటంలో కొంతవరకూ సత్యం లేకపోలేదు. శ్రీ విశ్వనాథవారు—వ్రాస్తూ—పండిత పామరులను సమాన స్థాయిలో రంజింపజేయవలసిన తమ రామాయణం, కేవలం పండితులకే అని కేటాయిస్తున్నట్లు వ్యక్తపరచటం సముచితంకాదు. శ్రీ విశ్వనాథవారు 29 వ తేదీ పత్రికలో వ్రాస్తూ తమకు ఏమాత్రం ఆవేశం లేదంటూనే ఆవేశపడటం ఆశ్చర్యం కలిగించింది. పెద్దలు, పంపక్రాంతాంధ్ర పండితులు, కవిసామ్రాట్ బిరుదాంకితులు, ఇంత చిన్న విషయానికి అంత ఆవేశపడటం కేవలం హాస్యాస్పదంగా ఉంది. పైగా వీరు 'తమ కవిత్వాన్ని కావ్య పఠనాన్ని చూసి (సభలో) పలువురు 'ఓహో' అన్నా' రన్నారు. శ్రీ విశ్వనాథవారు రసజ్ఞుల అభిప్రాయాలు ప్రత్యక్షంగా తీసుకుని సరిపెట్టుకునే కుంటే పరోక్షంగా వారి వారి అభిప్రాయాలు తెల్సుకుందుకు ప్రయత్నిస్తే చాలావరకు సమంజసంగా ఉండేది. నేటి తెలుగు సాహితీ రంగంలో మొదటి దనదగిన 'భారతి' పత్రికను బహిరంగ వేదికపై విమర్శించి కించపరచిన శ్రీ విశ్వనాథవారు 'శాంత స్వభావులు, సాహిత్య రంగాన్ని మెచ్చే రసజ్ఞులు' అని నాలాగ ఎవరేనా అనుకుంటే అది పొరబాటే అని బుజువవుతుంది. ఇందు విషయమై శ్రీ 'ఆపుల గోపాలకృష్ణమూర్తి'గారు వ్రాసిన విమర్శ అతి సమంజసంగా ఉంది. ఇకముందు శ్రీ విశ్వనాథవారు తామ యిల్లాంటి విమర్శలకు జవాబుగా వ్యాసాలు వ్రాయనని వ్రాయటం కూడా ఒక గడుసుదనంగా కనుపిస్తోంది. తిరిగి వారు కూడా తమ సమాధాన వ్యాసాలు వ్రాసి పాఠకుల్లో పై అభిప్రాయాలు పోగొడతారని ఆశిస్తున్నాను.

అపహాస్యన సమాధానం కాదు

[ఆంధ్రపత్రిక నవంబరు 12 వ తేదీ సంచిక సారస్వతానుబంధంలో శ్రీ కొత్త సత్య నారాయణచౌదరిగారు వ్రాసిన వ్యాసం.]

అక్టోబరు 22 ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములో విశ్వనాథవారికి నా యిచ్చిన సమాధానమును జూచి, వ్రాయవలసిన దంతయు నేను వ్రాయలేదని కొందరు, వ్రాసిన దానికి ఎంతో సంతోషపడితిమనియు చర్చల కవకాశముగల ఆ 'సభ'యే జరుగవలెగాని, రెక్కలు కట్టుకొనివచ్చి మేమును మరికొన్ని విశ్వనాథవారి అవక తవకలు చూపగలవారమని పెక్కుమంది అపరిచిత మిత్రులు పై తమ ఉత్తరాలు వ్రాసిరి. వ్రాయుచున్నారు. ఆ పండితులలోను, బ్రాహ్మణ పండిత మిత్రులే హెచ్చుమంది ఉండుటచేత, అది నా భాగ్యమనియు, నా వాదనలో విలువున్నదనియు నమ్ముచున్నాను. అయినను—ఆ 'బాధ్యత' విద్వల్లోకమునకే వదలెదను.

ఈ కల్ప వృక్షమునకు విమర్శనము అవశ్యకమా! కాదా! అన్న చర్చలో నేను జోక్యము తీసికొను.

శ్లో. "కవిః కరోతి కావ్యాని రసం జానన్తి పండితాః

కన్యాసురత చాతుర్యం జామాతా వేత్తి నో పితా"

ఈ మాట విద్వల్లోకమునకు క్రొత్తగాదు. పైగా, విమర్శనము అవశ్యకమన్న మాట సర్వ సాహిత్యము అంగీకరించిన బాట.

నా మాటలకు విశ్వనాథవారు అక్టోబరు 29 ఆంధ్ర పత్రికలో సమాధానమిచ్చిరి. అందరి అవక తవక లన్నింటికి సమాధాన మీయవలెనన్న దిన పత్రిక అంగీకరింపదన్న భయము నాకు లేకపోలేదు. విశ్వనాథవారి వ్యాసము సాంతము చూడగా దాని సారముగా నాకు తోచిన ముక్కలివి :

1. ఆ సభలో ఆవేదన పడ్డది విశ్వనాథవారు కాదట. దిగులుపడి దిగజారిపోయినది శ్రీ శ్రీ యట.
2. ఆ సన్నివేశము ఆంధ్రపత్రిక విలేఖరి వ్రాయలేదు. వెయ్యలేదు—అట.
3. వారి కవిత్వము పాషాణపాకమన్న వారిబుద్ధిలోనే లోపమున్నదట. పాషాణపాకమన్నది ఎవడో ఒక వెంకాయ పిచ్చికొండ అట.
4. 'విద్గగన ప్రాలేయ' అన్న మాటలో నకారము గురువో లఘువో నలుగురు పండితులచేత వ్రాయించి సంతకములు చేయించి, విమర్శనము చేయునతడే పత్రికలకు పంపవలెనట. ఆ పండితులను, 'విద్గన ప్రాలేయ' అన్నది తప్పు అనే పండితులు కాకూడదట. అటువంటి పండితులను సభకు తీసికొని వచ్చినచో విశ్వనాథవారు సభకు రారట.
5. వెల్లపిల్లవారి స్థానములో విశ్వనాథవారు ఇప్పుడున్నారట (శాంతం పాపమ్)
6. ఆక్షేపణలు—ఎత్తిపొడుపులు—గడుసుతనం మాటలు మీరు వ్రాయవద్దు. నేనూ వ్రాయవద్దా. మీరు వ్రాసినా మళ్ళీ నేను వ్రాయనని మనవి చేస్తున్నాను—అట!!
7. మన దేశంలో చాలమంది పత్రికాధిపతులకు వి. సత్యనారాయణమీద విమర్శ ఏదైనాసరే అచ్చువేద్దామన్న ఉత్సాహమో ఉబలాటమో మాత్సర్యమో లాభచింతో ఉండడమట!!

విశ్వనాథవారి వ్రాతలలో, మాటలలో పూర్వాపర విరోధములు కావలసినన్ని కన్పించుచుండును. 'జలగం సుబ్రహ్మణ్యము నాయుడుగారు సంస్కృతాంధ్రాలలో చక్కని పరిచయం కలవారు సుమండీ! చాలా గడుసువారు కూడాను. ఆయన శ్రీ శ్రీ ని సిగ్గు దీశారు. శ్రీ శ్రీ మీద బాంబు ప్రేల్చారు. శ్రీ శ్రీ పాలిపోయినాడు. తెల్లమొహం వేశాడు' ఇది ఇక్కడి ధోరణి. అంతలావు నాయుడుగారే తన విషయములో మాత్రము (విశ్వనాథవారి) పొరపాటు పడ్డారట. అదేమిటి! విశ్వనాథవారు ఆవేదన పొందరని నాయుడుగారు సభలో అంతమాట వెల్లడించుట. శ్రీ శ్రీ విషయములో నాయుడుగారి తీర్పులో నేర్పు ఉన్నదట. తన విషయమై తీర్పు చెప్పుటలో నాయుడుగారు 'పప్పులో కాలు వేసి'నట్లు విశ్వనాథవారి తీర్పు.

అసలీ కావ్యకర్త ఆ మహాసభలో ఆవేదనపడెనో, లేదో నాయుడుగారే చెప్పనక్కరలేదు. ఆంధ్ర పత్రికలో ఆ వార్త చూచిన వారెందరో విశ్వనాథవారి 'దైన్యాన్ని'గూర్చి వింతలు వింతలుగా నాకు వ్రాసిన ఉత్తరాలుఉన్నవి. అనగా ఆనాటి కార్యక్రమములో ఆ కావ్యకర్త 'భావ చిత్రము' స్పష్టముగా గుర్తించుటకు ఆధారములు చాల గలవన్నమాట నిజము.

తన కూతురు బిడ్డను కనలేకపోగా, అత్త, అల్లునిమీద పడి కోపగించినట్లున్నదే! అయ్యా! విశ్వనాథవారూ! మహా కావ్యమని మీరును, మీ అనుయాయులును అనుకొను ఈ రామాయణములో మహా కవులు ప్రయోగింపనివని సకృత్తుగ; సామాన్యులు నాడు కొన్నని—కోశములలో ఏ మూలనో ఉన్నవి, ఏవేవో ప్రయోగములు వేల కొలదిగా ఉన్నవి స్వామీ! అని శాస్త్రీయముగా ఒకానొకడు ప్రశ్న వేయగా—ఆ ప్రశ్న అచ్చువేసినంతమాత్రాన 'భారతి' వారి 'స్థాయి' దిగజారిపోయినదని మీరు అనగా లోకమంగీకరించునా! శ్రీశైలం మల్లికార్జునమహాలింగ! వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి! మున్నగు మధురాక్కరలు ప్రకటించునందాక 'భారతి' స్థాయి విలువ సరిగా ఉన్నది కాబోలు! అప్పటికే భారతిస్థాయి జారిపోయియున్నచో మధురాతి మధురములైన ఆ మధురాక్కరలు ఆ భారతిలో మేము చూచియుండము కాబోలు! ఈ నడుమ అట్టి రచనలు భారతిలో లేవు కావునను—భారతీ సంపాదకులు కల్పవృక్ష విమర్శనము వేయుచున్నారు కావునను, తప్పనిసరిగా భారతిస్థాయి తగ్గిపోయినదని విశ్వనాథవారి భాష్యము కావచ్చును. తాను వలచినది రంభ. తాను మునిగినది గంగ. తన దుఃఖమే నరకము. తన సౌఖ్యమే స్వర్గము. కాగా—ఇంతకు నేను చెప్పవలసిన సమాధాన మొక్కటే ఒక్కటి ఉన్నది. అది—'విద్గగన ప్రాలేయాంశువు'—

ఈ మాటలో మెలిక ఉన్నదని నాకు తోచినది; లేదని కావ్యకర్త. నలుగురు పండితులవద్దకు నేను వెళ్ళి ఇది మంచిదిగాదని వ్రాయించి సంతకములు చేయించి భారతి లో వేయించి తమకు చూపించిన పిదప—తక్కిన దోషాలు నిజముగా దోషాలు కాకున్నను దోషములనియే విశ్వనాథవారు అంగీకరింతురట. దీనిలో అర్థమున్నదా! అహంకారముతప్ప! నేను తప్పులని చెప్పినవి తప్పులని ప్రమాణముతో (బిడ్డలసాక్షిగా—సరస్వతి సాక్షిగా కాదుసుమా!) అనగా శాస్త్రగ్రంథములతో ఇతరు లెవ్వరు లేకుండ మన మిద్దరము మీరు ఉదాహరించిన వారిలోఉన్న ఆ 'వెంపరాల' వారి నొక్కరినే చాలు మధ్యవర్తిగా పిలిపి, తేల్చుకోవచ్చును. అంతేగాని, ఈ సభను గూర్చి ఈ ప్రస్తావము గూర్చి పేరాకోళము చేసినంతమాత్రాన మీ వాదము నెగ్గినట్లు కాదు. కల్పవృక్షము నిర్దుష్టమైనట్లుకాదు. ప్రకృతము మాత్రము మీరు ఎన్నుకొన్న పండితుల శ్రేణిలో రాదగిన ఒక లాక్షణిక శిరోమణి—బహు గ్రంథకర్త—విద్వత్కవి అయిన శ్రీ సన్నిధానము సూర్య నారాయణశాస్త్రిగారి మాటలను మాత్రము ఉదాహరించి విద్వల్లోకమునకే విడిచి పెట్టెదము.

"సంస్కృత భాషలో వ్యస్త పదములలో రేఫ సంయోగమునకు పూర్వాక్షరము క్వాచిత్కముగా, లఘువుగా కనబడుచున్నది. ఏక పదము మాత్రముగాదు. ఎట్లన్న, 'అను వ్రజ్య 'చక్రము' మొదలగు చోట్ల ను—చ వర్ణములు గురువులే. అల్పవ్యయేన సుందరి గ్రామ్యజనో మృష్టమశ్నాతి ' అనుచో 'గ్రాకు' పూర్వాక్షరమగు 'రి' వర్ణము లఘువు. ఇట్టి లఘుత్వము క్వాచిత్కము. అంతేకాని, సంస్కృత పదములలో సంయుక్తాక్షరమునకు పూర్వాక్షరమును లఘువును జేసినవారు గానరారు."

(కావ్యాలంకార సంగ్రహము—వివరణము 471 పుట.)

కానరాకేమి! విశ్వనాథవారు ఉన్నారుగా! 'శతకోటి దరిద్రులకు అనంతకోటి ఉపాయా' లన్నట్లు వారికి దగ్గ కారిక వారి కుండనే యున్నది. ఏమని!

'భవేదాద్య సమాసే పి రేఫయోగాత్పరం తథా'—అథర్వణకారిక సంస్కృత సమాసమందును రేఫయోగము కంటె పూర్వ వర్ణము లఘువగును. ఉదా :—'లోకాది త్రిలోక పూజ్యాలు' 'అల్పన్యయేన సుందరి గ్రామ్య'. ఆ కారికకు ఈ యుదాహరణములని ఆ గ్రంథములో ఉన్నను, "లోకాది, త్రిలోక" సమస్తపదము కాదనియు, సుందరి—సంబుద్ధి యనియు, స్పష్టమగుటచే ఈ కారికకు ఇవి సరియైన ఉదాహరణములు కావు. అపద్ధర్మముగా ఇట్టి కారికలు పుట్టియున్నను, ఈ కారికను వాడుకొని సంస్కృత పదములలో బాహాటముగ సంయుక్తాక్షరమునకు పూర్వాక్షరమును లఘువును జేసినవారు కానరారని 'సన్నిధానము' వారు భావించియుందురు. ఆ ధోరణిలోనే నాకును సంస్కృతాంధ్రములలో నా యెరిగినంతలో ప్రసిద్ధ కవుల ప్రయోగములు 2, 3 తప్ప కన్పింపకుండుట జేసి, ఇట్టివి మహా కావ్యములలో ఉండరాదనియు, ఇట్టి 'కక్కుర్తి' పదములతో సాగెడి కవనము లెక్కకు వచ్చునది కాదనియు భావించి, ఈ దోషములు చూపితి. దీనికి ఏ 'నలువురు పండితుల' యు తీర్పు లక్కరలేదు. కావలసిన దేమనగా—కాళిదాసాదులయు, తిక్కనాదులయు రెండు మూడు ప్రయోగము లున్నంత మాత్రాన, ఇట్టి పట్టులలో రేఫ సంయుక్త పరకత్వమున లఘుత్వము చేయకుండుటయే ప్రామాణిక పద్ధతి.

ఆ యుపన్యాస మందేకాక, ఈ వ్యాసముతో సైతము విశ్వనాథవారు 'జాతి ప్రస్తావము' తెచ్చిరి. నా వ్యాసములో 'గాడ్సే' ప్రస్తావము వచ్చుటచే, 'నీది ఆంధ్రజాతియా! భారత జాతియా!' అని వెటకారముగా నన్ను ప్రశ్నించిరి. ఆయన హృదయములో నెలవుగా నిలచియున్నట్లు, ఆ ధోరణిలో, ఆ వ్యాసము ప్రారంభించినట్లు 'కమ్మ—కాపు' కుల గోత్రములు మనస్సులో మెదలి, ఆ ప్రశ్న వైచిరి. నా తాత్పర్య మదికాదు. 'కోపము తీర్చుకొనుటకు నన్ను కాల్చివేయరాదా' అన్న ప్రశ్న, కల్పవృక్షము విమర్శించినందులకు నన్ను—అని ప్రకటించినందులకు పత్రికలవారిని గూర్చి కాబోలు! అని మొన్న వ్రాసితిని. మహాత్ములను పిస్తోలుతో పొట్టను పెట్టుకొను 'జాతి' మాది కాదన్నానే గాని, మా కుల మనలేదు. ఆంధ్రజాతి అని కాదు. భారతజాతి యని కాదు. అహింసాపరాయణుడైన గాంధీజీ ఉదయించిన యుగములో పుట్టిన, మావంటి వ్యక్తులము గాని, 'భారతి' సంపాదకుల వంటి పెద్దలు గాని, అట్టి ఘాతుక కృత్యములను కలలోననైన, నవ్వులకైన స్మరింపలేమనియు, కాగా—ఈ కావ్యకర్తయే 'గాడ్సే' ధోరణిలో రచనలు సైతము చేయ నేర్చిరనియు, ఆ ధోరణిలోనే ఈ వ్యాసములో సైతము 'ఆ సభలో పోలీసు బందోబస్తుతో రావలసిన అవసరము నాకు లేకుండ చేయండి' అని అనగలిగిరనియు చెప్పక తప్పదు. ఈ తత్త్వమునకు తగినది వీరి రచనలో దిక్సూచిగ ఒక్క ఉదాహరణ మిచ్చెదను—చిత్తగింపుడు—

వనవాసమునకు సిద్ధమైన శ్రీరామునితో మైథిలి ఇట్లన్నదట !!

శా. ఈ యన్యాయము నింత చేసినను భూమీశుండు మీరేల యి
ట్లే యున్నారలు లక్ష్మణుం డయినసున్ లేడా ! భవచ్చాపశి
క్షా యోగ్యంబుగ నెల్ల ధాత్రి గెలువంగా లేరా ! యూహింప లే
దా యారీతిగ ? నెట్లు లోర్వ గలరో ! యాశ్చర్య మేపారెడిన్' (అయోధ్య 72 పు)

భూమీశుడైన దశరథుడు ఇంత అన్యాయము చేసియుండగా రామయ్యా! ఎందులకు ఉపేక్షించితివయ్యా! ఒకవేళ నీవు కాకపోయినను, లక్ష్మణుడు లేడా! ఎందులకో! దశరథుని బుర్ర 'రామకీర్తన' పాడుటకు. మీరు నేర్చిన ధనుర్విద్య వలన రాజ్యమును గెలుచుకొనలేరా! అసలు ఈ వూహయే మీకు తట్టలేదా స్వామీ! ఎట్లు లోర్చుకొందురయ్యా మీరు! ఇవి సీతమ్మ మాటలని విశ్వనాథవారు మనకు చెప్పిరి. వాల్మీకి మైథిలికి ఈ యూహయే స్ఫురింపలేదు. అసలు యిట్టి యూహలుగల ఈ కవీశ్వరులు యోగ్యమైన పాత్రలను గూడ అపాత్రులను గాజేసిన ఘట్టము లున్నవని చూపుటకే ఈ విమర్శనము ప్రారంభము కాగా—నడుమ 'పేడుకలవేట' ఈ తీరుగ సిద్ధమైనది.. అనగా—'ఒకరిని జంపుటలు——పోలీసులు' ఈ తత్త్వములో జీర్ణించినవారు విశ్వనాథవా రనియే నా భావము. అస్మదాదులకు ఆ భావము లేదనియే మా మనవి.

ముప్పదియేండ్ల క్రిందట, 'వారు—నేను—శ్రీ తుమ్మల' కలసితిమట. నామీద వారికి ఆర్ద్రమైన భావమే ఉన్నదట. ఉన్న దన్నందులకు కృతజ్ఞుడను. ఆ 'హస్తదీప' మైన సౌజన్యమే ఇప్పుడును స్మరించి, ఈ విమర్శము సామరస్యముతో చిత్తగించినవాడు ఆయన హృదయము నా కర్థమగును. ఆయన చెప్పిన సన్నివేశము నాకు జ్ఞప్తిలేదు గాని, అవల మరి కొన్నేండ్లకు 'చీరాల—జగ్గయ్యపేట' లలో విశ్వనాథవారు నేనును గలసి కారులలో వూరేగి, కవితాగోష్ఠి జరిపినది నిజమే. మరికొన్ని సమావేశములలో మే మిద్దరము మాటాడినదియు సత్యమే. కాని, అంతమాత్రాన నేను గాని, శ్రీ తుమ్మల గాని ఈ కల్పవృక్షములో ఉన్న బండ్ల కొలది దోషాలు దోషాలు కావని ఏ మొగముతో చెప్పగలము? ఈ వ్యాసములు సాగిన పిదప శ్రీ తుమ్మల వారు, నేను గలియలేదు. ఆయన ఈ వ్యాసములు చదివి తనకు నచ్చిన నన్నట్లు ఇరువురు పెద్దల 'ద్వారా' కబురు పంపిరి. అనగా ఆయన భావమును వా రిద్దరు నాకు తెలియజేసిరి. విశ్వనాథవారు ప్రమాణముగా ఉదహరించినవారిలో ఒకరి అభిప్రాయము నాకు ఈ తీరుగ తెలియుటచే ఈ మాట ఎత్తితిని. అంతమాత్రాన ఆయనను ఈ వాదనలోనికి దించి, వారివారి కున్న పూర్వ స్నేహములు మొగమాటములు భంగపరచుట నా పద్ధతి కాదు.

ఈ ఘట్టములో విశ్వనాథవారి విసురులు చిత్తగించవలె :—

1. వీరు చాలా నెలలబట్టి ఈ వ్యాసాలు వ్రాస్తున్నారు. నేనా ఒక్క వ్యాసం కూడా చదవలేదు. (ఇది వీరి ప్రజ్ఞ కాబోలు !!)

2. వెళ్లపిళ్లవారి రాశిలో చేరుదామని ఈ వ్యాసకర్త కున్నదట. ఈ కల్పవృక్షంమీది విమర్శతో ఒక రాశిలోనికి వచ్చా రనుకోండి. పై రాశికి వెళ్లడం కూడ మంచిదే.

3. రంగయ్య, పుల్లయ్య పేరులు పెట్టి వ్రాయించకండి.

4. ఓ అయ్యా! రామమూర్తి పంతులుగారు వ్రాసిన వ్రాతలు కూడా చదివారా ఏమి మీరు!

5. తమరు కూడ ఏవో పుస్తకాలు వ్రాశారని వినికిడి. మీరు ఏవి దోషా లన్నారో అవి మీ గ్రంథాల్లోనే చూపించవచ్చు. మీ సవాలు అట్లా ఉంచి ఇది నా సవాలు. ఆ సభ పెట్టించండి. మీ పటం పెట్టి మీ నెత్తినే పాడుచు కొన్నట్లవుతుంది.

ఇట్టి ఎత్తిపొడుపులకు ఈ వ్యాసములో ప్రత్యేకముగా సమాధానము లిచ్చుటకు వీలులేదు. విజయవాడ వెంకటరామ అండ్ కో వారి షాపులో మే మిర్వురము ఒకనాడు కలసినపుడు, నేను వ్రాసిన పుస్తకాలు వారి కిచ్చిన ఘట్టము మరిచి పోయిరో మరేమో గాని పుస్తకాలు వ్రాశారని వినికిడి యని చమత్కరించిరి. ఆ వినికిడిలో ఉన్న ఈ నా గ్రంథములలో ఈ దోషలన్నియు ఎందుల కుండవు? తప్పక ఉండునని వీరి జోస్యమా? ముందే వానిని జూచి ఉన్న దోషాలు గుర్తించి అనవలసిన మాట అనక, తప్పక నీ పుస్తకాలలో ఈ దోషాలు లేవా? అని ధీమాతో వీరు చేసిన 'సవాలు' మెచ్చుకోవలసి యున్నది. వీరు చెప్పిన ఈ మాటలలో నిజము లేదన్నమాట నాకు తెలియకపోదు. 'ఇంతకూ మీ బల మేమంటే ప్రజా స్వామ్యం కావడం' అని వీరి వ్యాసములో ఉన్న ముక్కకు నా వ్రాసిన ఒకానొక పుస్తకములోని 'ప్రజాస్వామ్య' మన్న శీర్షికకు సంబంధ మున్నదని వారికిని నాకును మాత్రమే తెలియును. ఈ రహస్యము తెలిసిన ఈ కావ్యకర్తకు నా పుస్తకాల వినికిడిలో నిజము లేదు.

రంగయ్య పుల్లయ్యల పేరులు పెట్టి, పత్రికలకు పంపుట నాకు తెలియని విద్య. ఓ అయ్యా! విశ్వనాథవారూ! ఈవిద్యలో మీరు ఆరితేరినవా రనియు, మరొకరి పేరుతో మీరు వ్రాసినవే అచ్చువేసిన గ్రంథాలు కలవనియు, దేశములో వదంతి లేకపోలేదు. ఇట్టి చక్కని అనుభవమున్న పెద్దలు గనుక తద్వారా లాభములు పొందిన దిట్టలు గనుక తమకున్న ఈ అనుభవమును అస్మదాదులమీద ఆరోపింపవలదని మనవి.

చెక్కపిళ్ల రాశిలో మేము చేరవలెనన్నను 'హంకార సంభార దోహల బ్రాహ్మీమయ మూర్తులు'' అస్మదాదులను జేరనీయ రని మాకు తెలియును. పైగా వారి స్థానములో నే నున్నానని మీరే మీ వ్యాసములో సెలవిచ్చితిరాయె. మరియు, 'పెద్ద వాణ్ణి అయ్యాను. బహుశా ఎంతో కాలం జీవించను' అని మొన్న మీరే అన్నారు గదా! ఆ పక్షములో, ఆ రాశిలో మీరే చేరి, మీరు వ్రాసిన తీరుగా వారి స్థానమును మీరే అందుకొందురు గాక!

ఇట్టి ఆక్షేపణలు ఎత్తిపొడుపులు గడుసుతనపు మాటలు వారే చక్కగా వ్యాసములో వెదజల్లి, 'ఇకమీదట ఇట్టివి మీరు వ్రాయవద్దు. నేనూ వ్రాయవద్దు. మీరు వ్రాసినా మళ్లీ నేను వ్రాయనని మనవి చేస్తున్నాను' అనుటలో ఉన్న గడుసుతనము, టక్కరితనము సహృదయులు గమనింపకపోరు.

విశ్వనాథవారి మాటలనుబట్టి చూడగా, ఇంతవరకు నా వ్యాసాలు వారు చూడనట్లును, తీరికచేసుకుని చూచెద రన్నట్లును తేలినది. కాగా, ఇప్పుడు వ్రాసినది చెప్పుడు మాటలనుబట్టి కాబోలు! ఇంతవరకు నా వ్రాసిన పంద్రెండు వ్యాసములు సమగ్రముగా చదివి, ఆయనమాటలలో స్వయముగా ఆయనయే సమాధానమిచ్చినచో సంతోషింతును. మొత్తము ఇప్పటి ఈ సమాధానమువలన చర్చించిన విషయమే లేదు. కాగా—ఒకపాలు అహంకారము, మూడు పాళ్ళు అవహేళనము కలిపి నాలుగు పాళ్ళు కలబోసి రాశి చేసిన విశ్వనాథవారి వ్యాసమునకు పత్రికలలో నేనుగా సమాధానమిచ్చుట పాడిగాదు. అచ్చు కానున్న 'కల్పవృక్ష ఖండనము' లో కల్పవృక్షవిషయముతోపాటు పత్రికలలో ఈ వచ్చిన అవహేళనము పైతము ప్రత్యక్షరము పరిశీలించి సమగ్రముగా సమాధానమిచ్చి తెలుగు వచ్చిన ప్రతి వ్యక్తికి 'కల్పవృక్ష ఖండనము' తేటతెల్ల మగునట్లు చేయ గలనని మనవి.

విమర్శలో ఆవేశం తగదు

శ్రీ వావిలాల రామమూర్తి

[ఆంధ్రపత్రిక నవంబరు 12 వ తేదీ సారస్వతానుబంధంలో కొత్త వారి విమర్శలను పరిశీలిస్తూ శ్రీ రామమూర్తిగారు వ్రాసిన వ్యాసం.]

సహాస్యాంధ్రకవి బ్రహ్మ ఛర్వోక్తి చమత్కృతి విలసన్నిజకా
వ్యార్థాపీహోక్తి శ్రీ సర్వస్వో విజయతే హి కవిసమ్రాట్—

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ కల్పవృక్షముపై శ్రీ చౌదరిగారు 'తెలుగు విద్యార్థి'లోను, 'భారతి' లోను గొంత వేదనాపూరితమైన విమర్శనము చేసినారు. ఒక కొందరు విజ్ఞులుకూడా అట్టి విమర్శనము కావ్యమునకువలసినదే యనియు,

శ్రీ సత్యనారాయణగారు ఆవేశపూరితులు కానక్కరలేదనియు వ్రాసినారు. మరి శ్రీ చౌదరిగారుచేసిన విమర్శనమెట్టిదో దిఙ్మాత్రముగా పరిశీలింతము. దానికి ముందొక విషయము మనము సహృదయతతో జూడవలెను. శ్రీ విశ్వనాథవారి రామాయణ మహాకావ్య దుగ్ధాబ్ధిలో—అమృత మున్నది. అమూల్య రత్నము లున్నవి. ఓషధులున్నవి. శుక్తి ముక్తాఫల వరాటకము లున్నవి. ఆ యా బుద్ధికుశలు రాయా పదార్థముల సేకరించి విమర్శింప వచ్చును. కేవలము గవ్వలను జూచి రత్నాకరత నిరూపించుట సువిమర్శన మగునా? గవ్వలేల? అన్నియు రత్నములే ఉండరాదా? అనరాదు. అట్లుండుట సహజము. భవతు. లోకము భిన్నరుచి గలది—కొందరు ప్రసన్నకథా కలితార్థ యుక్తిలో వారసి మేలనగా, మరికొందరు అక్షర రమ్యత నాదరింతురు. ఇంకొకరు మరియొక పదార్థమును గ్రహించి పొగడుటయో, తెగడుటయోచేయుదురు. ఏది ఎట్లున్నను గవ్వలుండుటయు సముద్రునకు శోభాకరమే—అనంత రత్న ప్రభవస్య యస్య హిమం న సౌభాగ్య విలోపిజాతం—అని కదా మహాకవి వాక్కు.

సువిమర్శన మెంతయైనను అవసరము. ఎవ్వరు కాదందురు? శ్రీ చౌదరిగారి సొము అంతయు కువిమర్శతో నిండియున్నది. వారు అటనట వాడిన భాష కూడ కర్ణకఠోరముగ నున్నది. అదేదియో వ్యక్తిగత దూషణముగా నున్నది. ధార్మికత, పాపభీతి కలవారి నోట ఆ పల్కులు వచ్చుట బాధాకరముగ నున్నది. అట్టి పరుషవాక్పరంపరలను 'విమర్శన'మను పేర బిల్చుట అనుచితము. మచ్చునకు ఈ మాటలు వినండి—'ఆ తప్పుడు పదములను ఏమని సాధింతుము......ఈ గోముఖవ్యాఘ్ర రచనలు.....ఈ తేనె పూసిన కత్తుల వ్రాతలు'—(తెలుగు విద్యార్థి జనవరి 61), 'ఇది రామాయణకర్త ధీమా!!— ఈ విశ్వనాథవారు పేరువడసిన శిష్యులని పేల్కొనవలెనా? రోత కూతలు—(తె. వి. ఏప్రిల్ 61), ఈ కల్పము జోలికి పోవుటే మహాపాతకము (తె. వి. జులై 61)—ఇవియేనా సద్విమర్శకుని నోట రావలసిన మాటలు? ఈ మాటలలో ఏదో వ్యక్తిద్వేషము—ఈర్ష్య—ఆవేదన ధ్వనించుటలేదా? ఇట్టి మాటలు విమర్శకులు ప్రయోగించుట హర్షింపదగినది కాదు—

2

కవి కహంకార ముండితీరును. అహంకారము లేనిదే కావ్యసృష్టి జరుగదు. 'నేను బలికిమాలినవాడను. నాకంటె గొప్పవారుండగా నేను రచన కుద్యమించుట యేమి? నే నసమర్థుని గా పూరకొందుమగాక—నాకేమి వచ్చును'—అనుకొనువా డసలు వ్రాయలేడేమో! రచనా కాలములో వాడే కవిబ్రహ్మ. వాని సృష్టి వాని లీల. ఆ రసానుభవమహానందములో వానిని మించువా డుండడు—అప్పుడు వెలువడు పల్కులలో తనకు పూత నిచ్చునది, అదృశ్యముగా వ్రాయించునది అహంకారమే. ఆ అహంకార చోదిత రసానంద బాహ్య స్వరూపమే 'అహమన్నాదోఽన్నాదః'—'శివోఽహం'—'శివోఽహం' అన్నట్టి శబ్దపరంపర. ఈ విషయము కవుల కనుభవైకవేద్యము.

'శివోఽహ' మన్న ఆంధ్రులు ఆచార్యస్వామి పల్కులు అహంకారపూరితములు గూడ. కాని ఆ అహంకారమున కర్థము నిఘంటు వీయజాలదు. విమర్శకులమగు మనము ఆ అహంకార శబ్దార్థము కలుషితభూయిష్టము చేయరాదేమో !

తెలుగుకవులలో ఈ 'అహంకారము' ప్రకటింపనివారు లేరు. ఒక్కొక్క రాజు ఒక్కొక్క కవిని 'నీవంతవాడవు—ఇంతవాడవు'—కృతి వ్రాయ నీకంటె సమర్థు లెవరు గలరు?' అట్లు వ్రాసికొను కవుల ధోరణి 'అహంకార' పూరితము గాదా? ఆ కోవలోని కవు లందరు మహా ప్రసిద్ధులైన కవిసార్వభౌములుగా మనము ఎరుగుదుముగదా! మన కన్నుల ఎదుట 'అద్యత నాంధ్ర కవి ప్రపంచ నిర్మాతలు' శ్రీ తిరుపతి వేంకట కవులు 'దోసమటం చెరింగియును దుందుడుకొప్పగ బెంచినార మీ, మీసము రెండు బాసలకు మేమె కవీంద్రుల మంచు దెల్పగా రోసము కల్గినే న్గవివరుల్ మము గెల్వుడు, గెల్చిరేని ఈ మీసముదీసి మీ పద సమీపమునం దిడి మ్రొక్కమే'— అన్న పల్కులు అహంకార పూరితములు గదా! వారి శిష్యులు గురువు ననుసరించుటలో దోషమేమి? సమర్థులా సమర్థతల మాట అందురా? దానిని గూడ మున్ముందు పరిశీలింతము. మనకు గావలసినది కావ్య విమర్శనముకాని, 'కవి అహంకార వాక్కులకు బాధపడుట' కాదు గదా!

3

“శ్రీ మంజూషిక భక్త రక్షణకళా శ్రీచుంచు వాఙ్మందవల్లీ మంజు ప్రసవంబు చిద్గగన ప్రాలేయాంశువున్.....” ఈ పద్యము రామాయణ కల్పవృక్షములోని ప్రథమ పద్యము. ఇందు రెండవ పాదములోని 'స' అన్న అక్షరము గురువనియు (లఘువు కాదు) అందుచే గణభంగమైనదనియు శ్రీ చౌదరిగా రభిప్రాయ పడినారు. దీనిని శ్రీ చౌదరిగారు 'ప్రథమ కలశే మక్షికా పాతము'గా వర్ణించినారు. ఈ సందర్భమున శ్రీ చౌదరిగారు తమ దృష్టి నీ క్రింది మహా కవుల పద్యముల వైపు ప్రసరింప జేయ గోరెద.

(1) సాత్యకి అప్పుడేని శరజాలము..........సొమదత్తి 'యా హాత్యభిరామ వహ్ని క్రియ' మజ్జ్వలుడై......)ఇది సిద్ధ సమాసము కాదనుట సాహసము.)
భారతము, భీష్మపర్వము, ద్వితీయాశ్వాసము—324 ప.

(2) తడవులబట్టి యేము సతతంబును బోదుము వాని పీటికిన్.....వెంబడి నిది చెల్లెఁగాకరివు ప్రాంతము చేరెదు వార లాప్తులే—ప్రభావతీ ప్రద్యుమ్నము, ప్రథమ 118 ప.

(3) అతివ మందస్మిత ద్యుతి ప్రసాదంబున, విరుల పొందిమ అభివృద్ధిగాంచె, సతి కటాక్ష శ్రీల సాహాయ్యకమున ....
తృతీయ—34 పద్యము.

(4) పట్టపుదేవియైన రతి భ్రాంతిని బల్కెదవేమొ నాథ.......పంచమాశ్వాసము—125 ప.

(5) నిరుపమ గ్రంథజాలము లనేకములన్ రచియించి పక్షపాదరముగ......

ఇది శ్రవణానందములోనిది. ఇది ప్రథమాశ్వాసే—అష్టమ పద్యే మక్షికాపాతము!

శ్రీ విశ్వనాథవారు పై గురు ఫక్కిని అనుసరించిరేమో! (ముమ్ముందు ఇంకను ఉదాహరణముల నీయగలము—)

4

ద్రుత స్వభావముగల పదార్థమును నిలబెట్టి నీళ్లు దీసి పరామర్శించుటలో ఏమి సొంపుగలదో నా కర్థమగుటలేదు. శ్రీ చౌదరి గారు రామాయణ కల్పవృక్షమునందలి ద్రుతప్రకృతికముల ఎన్నియో పుటల నింపి వాని అసాధుతను గర్హించిరి. వారి ద్రుత విషయమునః బడిన శ్రమ ఎంతయు అనవసరమనిపించుచున్నది. వారు పఠనయోగ్యము కాదని ఎంత నిరసించుకొన్నను మనసుపెట్టి రామాయణ పారాయణము చేయుంచుటకీ ద్రుతము తోడ్పడుటలో నేమైన దాని గొప్పతనమున్నదేమో!

ప్రౌఢ వ్యాకరణమున శబ్దపరిచ్ఛేదములోని 116 వ దగు "నామ సర్వ నామంబులకును, గళలగు అవ్యయంబులకును, గడపల సముచ్చయార్థ విశేష, పాద పూరణములయందు శబ్దంబు తరచుగ నగు—కళలలగు అనుదంత శబ్దములమీద నయ్యాదియు వర్ణ పూర్వకంబుగ విభాష నగు......." అను సూత్రము వివరించు పట్టున వ్యాకర్త చూపిన పూర్వ మహా కవుల ఉదాహరణములు సత్య నారాయణగారి ద్రుతమునకు వజ్రకవచములు. అర్థ విశేషమునః గానిండు, పాదపూరణమునః గానిండు—అవి రామకృష్ణుని చేతను (వెండిన్ విపులః బొడమనీ—వెండియును) వాచన సోమన్న చేతను (పెద్ద తడవుల నుండిన్ బూని) తిక్కన చేతను (తన మిట్టిదిం గలదె) ప్రయుక్తములైనవి. ఆ ద్రుతములకు బట్టిన గతియే కల్పవృక్షద్రుతములకు బట్టు గాక!

5

"సవతి యుడిన గరళ సహితుండు—'ఇడిన' పదమును కేవలము గరళములోః గలుపుట రచనలో గరళమును గల్పినట్లే"—

అని శ్రీ చౌదరిగారు ఒక విసరు విసరినారు. ప్రౌఢ—సమాస పరిచ్ఛేదములోని 35వ సూత్రములో నీయఃబడిన 'కొన్నియెడల సిద్ధ సమాస మధ్యగత పదంబులతోః దద్భిన్న పదంబుల కన్వయము చూపబ్బెడి' అన్న సూత్రములో—'బహు వేదఘోషముల జేసి నిరస్త సమస్త కిల్బిషోత్కరులగుచున్న ధన్యులు'— అన్న భారతారణ్య పర్వోదాహరణమును, 'అందొకటి చే జనితాధార పీడయై' అన్న కళా పూర్ణోదయోదాహరణమును జాలవా?—ఈః అధరపీడలో అమృతము కల్పదమా?—శ్రీ చౌదరిగారిచే విచిత్ర సంధులుగాః జెప్పఃబడినవి ఈః క్రిందివి. (1) అతఃడు నేర్చినస్త్రములు (నేర్చిన+అస్త్రములు), (2) సురల ధీనమయ్యె (సురల+అధీనము,) (3) రాపి డేపాటిదో— (రాపిడి+ఏపాటిదో.)

(1) చదివి నతనికన్న చాకలి మేలురా—(చదివిన+అతని) అన్న వేమన్న సూక్తి మనకు మేల్బంతియై యున్నది. ఈః తిరు మంత్రములోని సంధి బంధముల సడలించి చూడుడు.

(2) సురల ధీనమయ్యె—మిధిలేశు లొద్దకు—ఇత్యాదుల విషయమున—ఆంధ్ర కవితా పితామహుని ఈః పద్యము తిల కింపుడు :

ఇనుప, కచ్చడాల్ కట్టుకొను మునిముచ్చులెల్ల, తామరస నేత్ర లిండ్ల బందాలు గారె—(తామరస నేత్రల+ఇండ్ల)

(3) 'రాపిడి+ఏపాటిదో—రాపి డేపాటిదో" హాతం రొనర్చి మోహితల నల్లనయో ముఖి నావులన్న్య భూసుతను విరూప శౌట నమహో మునలిన్ బెద నిట్టి తాడువంటతివ రమించెదా మునరి యయ్యు—(ఆముక్త, పంచమ 53 ప.)

'తాడువంటి+అతివ—తాడువంటతివ'—ఆ రాపిడి దీనిముందు ఏపాటిదో? ఇది చిత్ర సంధిగదా మరి! చిరుతొండని+ఇంటికిన్—చిరుతొండనింటికిన్—హార విలాసము—శ్రీనాథకృతము—ఇది యో?

'పట్టుకొని' అన్నదానికి బదులుగా 'పట్టుక' అనుట దోషమని శ్రీ చౌదరిగారు తలచిరి.

ఈః క్రింది ప్రయోగములు చిత్తగింపుడు :

(1) సీ. కొంగ వాల్నరకు లంగుళులః బట్టుక గబ్బలంట.......ఆముక్త, షష్ఠము— 85 పద్యము.

(2) ఎత్తుక పోవగా, నృపతి యేగగ నిమ్మెట కేగెనని నీ జిత్తరువేగె.......' భాస్కర—అరణ్య, ప్రథమాశ్వాసము—30 ప.

శ్రీ కాళహస్తి మహాత్మ్యములో ఇట్టి ప్రయోగములు కొల్లలు.

ఇక ఉత్తర హరివంశము, ఆముక్త మాల్యద, పాండురంగ మహాత్మ్యమువంటి గ్రంథముల చదివినవారు—శ్రీ సత్యనారా యణగారి కల్పవృక్షములోని కఠిన పదములని శ్రీ చౌదరిగారు చెప్పిన వానిపట్ల పెదవి విరువకుందురా? నేను మాత్రము కఠినపద ప్రయోగ గౌరవము విశ్వనాథవారికి అంటగట్ట నిష్టపడను సుమా!

శ్రీ చౌదరిగారు అనౌచిత్యములుగా—అశ్లీలములుగా, రసభంగ కారణముగా జూపిన ఉదాహరణ పదములు చాలవరకు నిర్దుష్టములు. అవి వ్రాయుటలో శ్రీ చౌదరిగారి పురోభాగిత్వము మాత్రము ప్రకట మగుచున్నది.

(1) 'గల్ల' శబ్దమును ప్రాచీన లాక్షణికులు నిరసించిన నిరసింపనిండు—ఈః క్రింది ప్రయోగములు దాని సాధుతకు గీటురాళ్ళు—

ఆకర్ణాయత నేత్రమై మణి మయోద్యత్కుండల ద్వంద్వశోభా కీర్ణాంచితగల్లమై సురదనంబై, సుందర భ్రూయుతంబై, క్రమస్మిత చంద్రికా విలసితంబై యొప్పు శ్రీరాముమో మీకాయంబున జూచు భాగ్య మికలేదేమో సుమిత్రాత్మజా. (ఇది కంకంటి పాప రాజకృతోత్తర రామాయణమునుండి)

(2) శ్రీ విష్ణు రూపస్తుతి విషయికమగు ఈ పద్యమును గనుడు:

'అతి క్రమ గల్లభాగభోగఫాలాద్య
మకరాంకరత్న కర్ణికలవాని— ఆముక్త, తృతీయ—58 ప.

ఈ గల్ల శబ్దము శ్రీ రాయకృష్ణులనే ఆశ్రయించినదే!! శ్రీ విశ్వనాథవారు 'నా మునికూనలన్ గనుదునా'—అని వ్రాయగా శ్రీ చౌదరిగారు 'మునికూనలేమి స్వామీ! పిల్లి కూనలవలె—'కూన' ఎచ్చట ఉండవలెనో ఔచిత్య మక్కరలేదా?' అని మిక్కిలిగా వాపోయినారు పాపము!! దీనినిబట్టి వారికిగల ఆంధ్ర కావ్య పరిచయమే గోచరించుచున్నది. కవి సార్వభౌములు శ్రీనాథుని హర విలాసములో చతుర్థాశ్వాసమున 6 వ పద్య మిది. శ్రీవారు చిత్తగింతురా?

'ఇక్కడ లేరె వేల్పులు సమీప్సిత దాతలు ముద్దుగూన! నీ వెక్కడ ఘోర వృత్తి తప మెక్కడ.......'

ఈ ముద్దుగూన హిమవత్పర్వతమందలి పిల్లికూనల జాతిలోనిది కాదుగదా! మన పిల్లికూనలు మన కొంపలోనే ఉండనిండు.

'ధరణీవుండు'—'సకలావని చిల్లిపడున్'—'రాజా! నీవును బొందజాడు'—అని అనిష్ట స్ఫూర్తిని గల్పించుచో—శ్రీనాథుని హర విలాసములో, పార్వతి, జయా విజయులతో.....'ఈ బ్రహ్మచారి.....వంకర కొంకర మాటలాడ నుంకించుచున్నవా డితని మెడపట్టి నూకుండు' అన్న పల్కుల మాట? ఔచిత్య పోషణకీ, 'నూకుట' ఏ మాత్రపు కొలబద్ద అగునో! ఇది మన ఆంధ్ర కవిత సుమీ! అందులోనే శివయోగి చిరుతొండనంబితో 'ఒక్క నియమంబు కలదు. పిన్నవాడు బంతిలో భోజనంబు చేయక నాకు కడి నోరికింబోదు' అన్నాడు. ఆముక్తమాల్యదలోని ''ఏ రాజ్యంబు నరుండు నోరికడి నో నీ బోధ మాలించు' అన్న పద్యములో 'కడి' యున్నది. ఈ కడి అశ్లీలమగునా? ఇది 'పేడ కడి' స్ఫూర్తిని గల్పించుట లేదు గదా!

కాలములు మారుచుండును. అభిరుచులు మారుచుండును. దేశకాల పాత్రముల ననుసరించి పదాలు పలుకుబళ్ళు మారుచుండును. భాషా విషయికముగా పూర్వ సంప్రదాయములకే అంటిపెట్టుకొని ఉండరాదుగదా! అది గడరికా ప్రవాహము వంటిది. దానికి బూర్తిగా దూరమును గారాదు. 'ప్రస్తుతమును' మిక్కిలిగా గమనించవలెను. జీవద్భాషమనది. ఎన్నో మార్గములు త్రొక్కుచున్నది. అందరి మేల్పలుకులను మేల్కొలుపులుగా స్వీకరింపవలె—వ్యాకరణావధులు విస్తృతి చేయవలె. వెనుకటి కొలబద్దతోనే నేటి భాషను గొలువరాదు. (ఛందో మార్గముల సడలింపవలె) నిన్నటి మాటకు నేడున్న అర్థము వేఱు—నేటి మాటకుగల అర్థము రేపే మగునో! నిన్నటి అర్థములో అనౌచిత్య మగునది నేడౌచితిని బోషింపవచ్చును. నేటి మాటలను బూర్వ లాక్షణిక దృక్పథముతో బరీక్షించిన కొంచితికి లొగ్గినట్లుండవచ్చును. అసలు కావ్యమువలన ప్రధానముగా బొందవలసినది (పొందవలసినది—బొందగా దిది) ఆనందముగదా! శ్రీ చౌదరిగారు 'కవి ప్రమాట్టులు వ్యవహారములోని మాటలు గ్రాంథికముగా సర్దుబాటు చేసుకొనరాద'న్న మాట పాణినీయ సూత్రము గాదుగదా? తెలుగు పదములు రూఢి కెక్కినవి గ్రంథమునందుండకుండుట యెట్లు? నైఘంటిక పదములకు సంచలనము లేకుండు టెట్లు? అట్టి పదము లుండుట దోష మనుట హాస్యాస్పదముగదా! జన్మ కర్మలలోని మువర్ణము లోపించుటకు గారణమేమో తత్పర వ్యవహర్తలగు ఆంధ్రుల నడుగవలసినది. ఆధునిక కవి ప్రపంచమును మాటిగా ప్రశ్నింపవలసినది. ఇట్టి మాటలు తప్పయిన ఆధునిక కావ్యములు నిలువవేమో!—బుద్ధిమంతులగు వ్యాకర్తలు 'చరిత్రాదుల మువర్ణంబునకు లోపంబు బహుళంబుగా నగు'నని తప్పుకొన్నారు. జన్మ, కర్మ, ఊహ మొదలైనవి త దాకృతి గుణములోనివి. ప్రయోగములు కావలయునా మరి?

'వారము'న కర్థమును శ్రమపడి నిఘంటువును ఉటంకించినారు శ్రీ చౌదరిగారు. 'బడిమూసి వారమైనది'—'పథ్యము పెట్టి వారమైనది' అన్న చోట్ల నిఘంటువును త్రిప్పరుగదా!

'విస్తరిమీద వంగబడుట'—అన్నది ఒక చక్కని పలుకుబడి. 'వంగబడుట'లోని 'పడుజ్' కర్మార్థమున వచ్చునట్టిది మాత్రము గాదు—స్వార్థమున వచ్చునట్టిది. పై ప్రయోగ నిర్దుష్టత—క్రతుభోజనముల బాల్గొనువారికే సువిదితము. అది ప్రయోగించుట దోషమేమో!!

'మీరు వంగడమున జేటు లేదు -' ఇందలి దుగాగమము విద్వజ్జనము సహింపనేరదని శ్రీ చౌదరిగా రనుచున్నారు. 'తాతల నాటినుండి కృతినాథులు మాదు—కులీను లందరున్' అని శ్రవణానంద ప్రయోగము. శ్రీ చౌదరిగారు చూపిన 'యతిభంగము'ములు ముప్పాతిక మువ్వీసము 'అఖండ యతి' నిరూపకములు

కం. ''ప్రస్తుత ఫణిస్రతభయ, త్రస్తాత్ములమైన అస్మదాదుల కెల్లన్'—(ఇచ్చట దాదులు మాత్రము స్ఫురింపకుందురు గాక!)—అది, ద్వితీయ–219 పద్యము.–అన్న ప్రయోగమొకటి చాలును. అఖండయతికి ఉదాహరణములు కావలెనా? శ్రీ చౌదరిగారు చూపిన దోషములు చాలవరకు పస లేనివి. ఇక ఒక్క మాటతో ఈ వ్యాసమును ముగింతు—(పునర్దర్శనాయ) విశ్వనాథవారు 'బావి కాడికి—గేహంబుకాడ'—మొదలగు ప్రయోగములు చేయుట దోషమని నేమను నొక్కి చెప్పగలను. ఏల యన 'కాడికి' అను మాట వారి నోట వెల్వడవలసినది కానేకాదు!

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి పద్యములలో తాలుండదని ఎవరనగలరు? శ్రీ చౌదరిగారు ఆ 'తాలు' తూర్పార పట్టవలసినదే! 'బండ్ల కెత్త' వలసినదే!—కృషి చేయవలసినదే—ఏమందురు? నా మతమున ఆ తాలుండకతప్పదనియు, అదియు శోభాజనకమే యగునవియు—'నా నృషిః కురుతే కావ్యమ్మ'ను సూక్తి ననుసరించి విశ్వనాథవారు ఋషితుల్యులనియు, భారత సంప్రదాయము ననుసరించి వారు ''మొన్న చెన్నపురిలో'' మాటాడినది శ్రీ చౌదరిగారు వేసిన రాళ్లకు 'ఛీత్కార మాత్ర' మనియు దలచెద.

'సరసిజ మనువిద్ధం శైవలేనాపి రమ్యం మలిన మపి హిమాంశోః లక్ష్మ లక్ష్మీం తనోతి'

శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారి తాటస్థ్యం

ఆంధ్రపత్రిక సంపాదకులకు,

అర్యా, 12—11—61 వ తేదీ ఆంధ్రపత్రికలో శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారి "అవహేళన, విమర్శకు సమాధానము కాదు" అను వ్యాసము చదివితిని. ఇందు శ్రీ చౌదరిగారు—

1. "ఈ వ్యాసములు సాగిన పిదప శ్రీ తుమ్మలవారు- నేను గలియలేదు.

2. ఆయన ఈ వ్యాసములు చదివి తనకు నచ్చిన వన్నట్లు ఇరువురు పెద్దల 'ద్వారా' కబురుపంపిరి.

3. అనగా ఆయన భావమును వా రిరువురు నాకు తెలియజేసిరి." అని వ్రాసిరి.

ఈ సందర్భమున నన్ను శ్రీ కొత్తవారి విమర్శ యెట్లున్నదని సాహిత్య జిజ్ఞాసగల మిత్రులు కొందరు అడుగగా వారికి నేను తటస్థ పద్ధతిలో సమాధాన మిచ్చితిని గాని యెట్టి కబురు పంపలేదని మనవి.

తుమ్మల సీతారామమూర్తి.

పాత్రచిత్రణలు

గత రెండు వారాలనుంచి కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ రచనమీద విపరీతంగా వాదోపవాదాల ధూళి చెలరేగుతూంది. ఈ గొడవలలో పాల్గొంటూన్నవారు అతి ముఖ్యమైన అసలు సంగతులు కొన్ని మరిచిపోతున్నారు.

వార్తా పత్రికలు, సారస్వత పత్రికలు మన ప్రజాసామాన్యం చర్చావేదిక లన్నమాట ఎవరూ కాదనలేరు. వీటివల్ల క్రమ క్రమంగా నిగ్గు తేలుతుంది. యథార్థం వెల్లడి అవుతుంది. నేటి దిన పత్రికలలో మన రాజకీయ నాయకుల విధానాలు, చర్యలు నిశితంగా విమర్శిస్తున్నారు. వారు వాటికి తగిన సమాధానా లిస్తున్నారు. ఈమధ్య నెహ్రూ, రాజాజీలవంటి మహా నాయకు లొకరి నొకరిని గట్టిగా విమర్శిస్తున్నారు. వీటి మూలమున ప్రజలకు వారి విధానాలు, ధోరణులు విస్పష్టంగా వెల్లడి అవుతున్నాయి.

సారస్వత విషయాలమీద కూడ ఇటువంటి విమర్శనలు రావాలి. కాని వట్టి ఆవేశాలు, పరస్పర ద్వేషాలు దూషణలు మాత్రమే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అసలు విమర్శనలే కూడవన్న ధోరణి కూడా బయలుదేరుతూంది! ఇది న్యాయంకాదు! పూర్వం గిడుగు రామమూర్తిపంతులు, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి మొదలైన విద్వాంసుల వాదోప వాదాలు మావంటి సామాన్య విద్యార్థుల కెంతో విజ్ఞానదాయకాలుగా ఉన్నాయి. ఇప్పు డలాగ లేవని చెప్పడాని కెంతో విచారపడుతున్నాను. కవిసమ్రాట్ తమ రామాయణంలో కొన్ని తప్పులు దొర్లినవని, పత్రిక ముఖతః అంగీకరించారు. మరి ఇంకా ఈ ఎదురు సవాళ్ళెందుకో బోధపడడంలేదు! ఇలాగే శ్రీ కొత్తవారి విమర్శలలో కూడా కొన్ని చిన్న దొసగులు దొర్లివుండవచ్చును. ప్రతి విమర్శకులు వాటిని సప్రమాణంగా నిరూపించాలి. అంతేగాని ఈ వీరావేశాలు దేనికి? శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారు ఇటీవల భారతిలో ప్రచురించిన అయిదు వ్యాసాలలోను, చిట్ట చివరి రెండిటిలోనే కల్పవృక్షంలో వ్యాకరణాది దోషాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయని విమర్శించారు. ప్రసిద్ధ పండిత మధ్య వర్తుల ద్వారా త్వరలోనే వీటి నిజా నిజాలు బయటపడగలవని నా వంటి విద్యార్థు లందరు ఎదురు చూస్తున్నారు.

అయితే శ్రీ చౌదరిగారు తాము ప్రచురించిన మొదటి మూడు వ్యాసాలలోను, కల్పవృక్షంలో విశ్వామిత్రుడు, కైకేయి, సీత మొదలయిన పాత్రల చిత్రణాలు మూలంతో సరిపోల్చి చూచినప్పుడు పూర్తిగా తీసికట్టుగా ఉన్నాయని సప్రమాణంగా విమర్శించారు. కాని ఈ విషయం శ్రీ విశ్వనాథవారుగాని, మిగిలిన విమర్శకులుగాని కొంచెమయినా పట్టించుకొన్నట్లే కనబడడంలేదు! పదవిభాగాల గొడవలలోపడి అత్యంత ముఖ్యమయిన పాత్ర పోషణం మాటే మరిచిపోతున్నారు! ప్రతివిమర్శకులెవరయినా వీటి విషయం విపులంగా చర్చించి సమర్థించి మావంటి విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడగలరని ఆశిస్తున్నాను.

ఒక సారస్వత విద్యార్థి, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు.

పండితత్రయమునకు విజ్ఞప్తి

శ్రీ విశ్వనాథవారిని గురించి భారతిలోను, ఆంధ్ర దిన పత్రికలోను ప్రకటితమవుచున్న వ్యాసములు, లేఖలు చాల విచారమును కలిగించుచున్న

శ్రీ సత్యనారాయణగారి అనేక రచనలు మీ పత్రికలలో వెలువడి అశేషాంధ్ర జనాదరణమును పొందియున్నవి.

రామాయణ కల్పవృక్షము వెలువడిన రోజులలో శ్రీపాదవారు ఆక్షేపణలను చేయుటయు, శ్రీ చెళ్ళపిళ్ళవారు తమ పత్రికా ముఖముననే వాటిని ఖండించుటయు జగద్విదితము.

శ్రీ సత్యనారాయణగారు తమ అమూల్య రచనల ద్వారా నేడు ప్రజా హృదయమున గౌరవ స్థానమును పొందియున్నారు. కనుక వారిపైన రేగిన దుమారమునకు చాలమంది తీవ్రమైన అసంతృప్తిని పొందియున్నారు.

29 తేదీ పత్రికలో శ్రీ సత్యనారాయణగారు ముగ్గురు పండితులను పేర్కొని, వారి అభిప్రాయమును పత్రికా ముఖమున ప్రకటించినచో తాము అంగీకరింతుమని విమర్శకులకు సూచించియున్నారు. వారి సూచన ఎంతవరకు స్వీకరింపబడినదో తెలియదు.

ఒక ప్రముఖ కవిని గురించి యిట్టి దుమారము చెలరేగుట జాతికే గౌరవప్రదముకాదు. కనుక, తమ అభిప్రాయములను పత్రికా ముఖమున ప్రకటించి ఈ దుమారమును శాంతింపజేయవలసినదిగా శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారిని, శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారిని, శ్రీ తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారిని మీ పత్రికాముఖమున ప్రార్థించుచున్నాను.

జంధ్యాం వెంకటేశ్వర్లు, గొడవర్రు.

ఈర్ష్యాద్వేషాలతో వ్రాసేది విమర్శ కాదు

శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి

[ఆంధ్రపత్రిక నవంబరు 19 వ తేదీ సారస్వతానుబంధంలో ప్రచురించిన వ్యాసం.]

మదరాసులో ఆంధ్ర మహాసభవారి సన్మాన సభలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు చేసిన ప్రసంగాన్ని గురించి కొత్త సత్యనారాయణచౌదరి గారు 22—10—61 ఆంధ్రపత్రికలో ఒక విమర్శ వ్రాశారు. వీరికి మద్దతుగా శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గారు మరునటి ఆదివారం పత్రికలో మరో విమర్శ వ్రాశారు. సరే. కొత్త సత్యనారాయణచౌదరిగారికి సమాధానం చెప్పవలసిన అవసరం కలిగింది గాబట్టి మంచో, చెడో వ్రాశారనుకుందాం. శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గారికి వ్యక్తిగతమైన అవసరం ఏమీ లేదుగదా? కేవలము సాహిత్యం మీదనున్న ప్రేమతోనే వారు విమర్శ ఉండవలసిన అవసరాన్ని గూర్చి వ్రాసియుండాలి. వారు శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరిగారి వ్యాసముల నన్నింటిని విద్యార్థి పత్రికలో లబ్ధ వాటితో సహా సమగ్రంగా చూచే యున్నారని వారి వ్యాసంలో కనబడుతుంది. సత్యనారాయణగారి మద్రాసు ఉపన్యాసం పత్రికలో 'రిపోర్టు' ఐనది తప్ప ఆయనంతట ఆయన కలం పుచ్చుకొని వ్రాసింది కాదు. దానిలో ఏవో సాహిత్యాని కపచారం చేసే అంశాలు నిజంగా లేకపోయినా తమకున్నట్లు తోచినందువల్ల సదరు ఉపన్యాసాన్ని విమర్శింప బూనుకున్న ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గార్ని మన మొక ప్రశ్న, వారు చాలా నిష్పక్షపాతమైన సాహిత్యప్రియు లనుకొని, అడుగవలసి ఉంది. "అయ్యా! తమకు ఈ కొత్త సత్యనారాయణచౌదరిగారు వ్రాయు విమర్శలో కేవల సాహిత్యసేవే కన్పించిందా? ఇంకా ఏమైనా కన్పించిందా లేదా? అని. ఒకవేళ సాహిత్యసేవకంటె ఇతరమైన అంశాలు తమబోటి నిష్పక్షపాత సాహిత్యప్రియులకు వెగటుగా తోచేవి ఏమైనా ఉన్నట్లు మీకు కన్పిస్తే వెంటనే వాటిని గురించి సదరు పత్రికల్లో తెగేసి రాయకుండా మీ రెందు కూరుకున్నారూ" అని. నా యిష్ట మంటారా. అపుడు నమోవాకం ప్రశాస్మహే. శ్రీ కృష్ణమూర్తి ఎం. ఏ. గారు సత్యనారాయణగారి ఉపన్యాసం రిపోర్టులో ముఖ్యంగా రెండు పాయింట్లనెత్తుకు విమర్శించారు. ఒకటి. ఈ విమర్శ వ్రాస్తున్నాయన కులానికి చెందినవారిలో నాకు పెక్కుమంది ప్రాణ స్నేహితులున్నారని. ఈ మాటలో కుల గోత్ర మీమాంస తెచ్చి సాహిత్యాన్ని కలుషితం చేసినట్లు వారికి కన్పించింది. ఈ మాటలో సాహిత్యాన్ని కలుషితం చేసే స్వభావం ఉంటే బ్రాహ్మణ కులాన్ని ఎత్తుకుని, కులాచారముల నెత్తుకుని విద్యార్థి పత్రికలో ముఖ్యంగా శ్రీ కొత్త సత్యనారాయణగారు చేసిన ప్రసంగ మంతా ఎంతగా సాహిత్యాన్ని కలుషితం చేసిఉండాలో మరి. ఆ కాలుష్యమంతా శ్రీ గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గారి కిష్టమై ఈ ఒక్కమాట విమర్శనీయమైందా!!? ఆయన బ్రాహ్మణకులంమీద చేసిందంతా సాహిత్య విమర్శానున్నా, సత్యనారాయణగారు ఆ కులంలో నాకు ప్రాణస్నేహితు లున్నారంటే అక్కసా మన్నా.

రెండవది. "భారతి ప్రసిద్ధి స్థాయి, ఇదివరకే పోయినది. ఇప్పటి దాని స్థితి దీనినిబట్టే తెలియుచున్నది. ఇకనైనా వీనిని వ్రాయవలదని ఆ రచయితకు ప్రచురింపవలదని ఆ పత్రిక వారికి ఈ సభాముఖమున విజ్ఞప్తి చేయుచున్నా నన్నది." దీన్నెత్తుకుని కొత్తవారి రచనలు వేసిన మూలంగా భారతి స్థాయి తగ్గిందని, లేక దాని స్థాయి తగ్గినపుడు కొత్తవారి రచనలకు చోటు దొరికినదని భావించియుందు రన్నారు. భారతి పత్రిక స్థాయి మాట అట్లా ఉంచండి. కొత్త సత్యనారాయణగారు రాసిన వ్యాసములో హుందాతన మనేది మచ్చుకైనా ఉందా అనేది ప్రశ్న. అది విమర్శ అని అనడానికి నూటికొక పాలైనా యోగ్యత కలిగివుందా అని. ఈ ప్రశ్న నేను కొత్త సత్యనారాయణ చౌదరిగారికి వేయటం లేదు. ఆయనతో వాదానికి దిగితే ఏమీ ప్రయోజనం లేదని నాకు తెలుసు. అందుకనే 'వయం మౌనవ్రతాలంబిన:' అన్న ధోరణిలో నాబోటివాళ్ళ కొంద రూరుకొనవలసి వచ్చింది. మరి ఇప్పు డెందుకు వ్రాస్తున్నావయ్యా! అంటే, ఒకటి: శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గారి వంటి నిష్పక్షపాత సాహిత్యప్రియులు కొంతమంది ఎలాగూ రంగంలోకి దూకారు కదా, వారికైనా చెప్పిచూద్దామని. రెండవది: ఆ కొత్తవారు పండితుల తీర్పు నంగీకరిస్తామని సెలవిచ్చారు కాబట్టిన్నీ. ఆమాత్రం తీర్పు చెబుతామని పండితులు ముందుకు రావాలే కానీ అంతకంటె కావలసిం దేమైనా ఉంటుందా! శేష్! సత్యనారాయణ చౌదరిగారూ! శేష్. ఇన్నాళ్లకు రత్నంలాంటి మాట ఎల్లాగో అన్నారు. దానిమీద నుంచోండి. మాటంటే లాభంలేదు. నుంచోవాలి. తక్కిన పండితులు చెబితే మీ రొప్పుకుంటా రొప్పుకోరు. మీ గురువుగారే ఉన్నారుకదా. వారు దేశానికి చాలిన పండితులు. వారియందు మాకూ గురుభావ ముంది. ఆ దువ్వూరి వెంకటరమణ శాస్త్రుల్లుగారు 'చీఫ్ జస్టిస్సు' స్థానంలో కూర్చోవాలి. దీనికి మీ కభ్యంతరం ఉండదనుకుంటాను. ఇంకొకాయన్ని మేము చెబుతాము. ఆయన తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు. ఆయన చాలా సరసుడు. పండితుడు. దురభిమానాదులు లేనివాడు. అవటమే కాకుండా ప్రసిద్ధుడైన సత్కవి కూడాను. ఇంకా ముగ్గుర్ని శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రుల్లుగారే జడ్జీలుగా నియమించాలి. ఆ సభలో మీరు చేసినది దుర్విమర్శయనీ, విమర్శ కాదనీ, కేవలం ఈర్ష్యాద్వేష ప్రయుక్తమని మేము నిరూపించలేకపోయినట్లయితే అప్పుడు మీరు రామాయణ కల్పవృక్షాని కేమి శిక్ష వేస్తారో—ఇన్నాళ్లుగా మేము నిత్యం మడిగట్టుకొని పారాయణం చేసుకొనే— (దాదాపు ఐదారు వందల మందున్నాము సుమండీ) మేము తమరి భాషలో "చెక్క భజనగాళ్ళం".—

మా చేతుల్లోనే ఆ శిక్షను నిర్వర్తించి సత్యనారాయణగారికి మానేసి ఆ చెక్కభజన మీకు చేయగలమని—చెక్కభజన—కూటమి తలంచిన లేక—ఒక రన్నట్లు రామాయణ కల్పవృక్షం పరివార మందరి తరఫున—పూచీ పడుతున్నాము. సభ పెట్టించాలి మరి. శ్రీ విశ్వనాథవా రన్నట్లు చేసేరు మరి. అట్లాంటి సందర్భంలో మళ్లా "వయం మౌనవ్రతాలంబినః". ఆ సభకి నిష్పక్ష సాహిత్యప్రియులైన శ్రీ కృష్ణమూర్తి ఎం. ఏ. గారు ఇంకా మొదలైనవారు వచ్చి నిష్పక్షపాతంగా సదరు "జడ్జి" లిచ్చే తీర్పు శిరసావహించవలసి ఉంటుంది.

పోతే ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గారు పందెం వేయటం దేనికీ అని ప్రశ్నించారు. ఆ చేసినవారు సమాధానం వ్రాస్తామని శపథం చేశారు గాని పందెం వేయలేదు. పందెం వేయటానికి డబ్బాయన దగ్గరా లేదు. నా దగ్గరా లేదు. సమాధానం వ్రాస్తామనడం కూడా తప్పేనా ? ఒక రకంగా తప్పేలెండి. దుర్విమర్శకు సమాధాన మేమిటి. శ్రీ ఆవుల వారు మరొక అంశం సెలవిచ్చారు. "విమర్శలో మంచి—చెడ్డల పరామర్శ ఉంటుం" దని. సరే బాగానే ఉంది. ఈ నిర్వచనం "పండిత కొత్త సత్యనారాయణ చౌదరిగారి పరామర్శ" అని శ్రీ గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ. గా రుదహరించిన "విమర్శకు" పట్టుతుందా అని. మీరే చెప్పండి కృష్ణమూర్తిగారూ ! శ్రీ సత్యనారాయణచౌదరిగారు వ్రాసిన ఇన్ని వ్యాసాల్లో ఎక్కడైనా ఒక్క గుణాన్ని గూర్చి చెప్పడం జరిగిందా. శ్రీ సత్యనారాయణగారు 6 కాండల రామాయణం వ్రాస్తే ఎక్కడా తప్పులేని పద్యం గాని, వాక్యంగాని, ఒక సొగసైన వూహ గాని, కల్పన గాని—ఏమీ లేకుండానే వ్రాసివుంటారని మీరు కూడా అనుకుంటున్నారా ? దోషైక దృక్పథము విమర్శ అనిపించుకుంటుందా ! అట్లాంటి సందర్భంలో విమర్శ శబ్దాని కున్న దురర్థమే దానికి సంక్రమిస్తుంది గాని మరొకటి కాదుగదా. కేవలం గుణాలు చెప్తే పొగడిక మీ దృష్టిలో. అంతేనా ? పోనీ దోషైక దృక్పథము మీ నిర్వచనం ప్రకారం పాక్షికంగా నైనా విమర్శ యని ఒప్పుకుందాం. అట్టి దోషైక దృష్టియగు విమర్శలో కూడా ఇది చింత్యమనీ, ఇది దోషమనీ, ఇది బాగులేదని మాత్రమే అనవలసి ఉంటుందిగదా. శ్రీ సత్యనారాయణ చౌదరిగారు అంతటితో వాగినారా !? వారు విద్యార్థి పత్రికలలో వ్రాసిన వ్యాసములలో వ్యక్తిని నిందించుటయే గాక, వ్యక్తి కులమును, మతమును, వారి మత గ్రంథములను, ఆ కులము యొక్క పూర్వీకులను పూర్వాచారములను బ్రహ్మ దగ్గరనుండి ఎత్తుకుని తిట్టిన తిట్లు జాబితా వ్రాసి మీకు పంపించమంటే పంపిస్తాను. ఆయన వెళ్లగక్కిన ఈర్ష్యాద్వేషములు మదింపు కట్టడానికి మీరే తగినవారు. ఈ అన్నీ దృష్టిలో పెట్టుకొనే శ్రీ విశ్వనాథవారు "ఇట్టి" విమర్శలు వ్రాయవలదని, ప్రచురించవలదనీ విజ్ఞప్తి చేసింది.

"ఇట్టి" విశేషణాన్ని చూడకుండా ఆయన విమర్శ అక్కరలేదన్నారన్న అర్థం లాగారు మీరు. ఇట్టి విమర్శ యనగా ఈర్ష్యాద్వేషములు వెళ్లగక్కుటకు వ్రాయబడిన దుర్విమర్శ యని యర్థము. పైగా ఇట్టి దుర్విమర్శ చేసినవారిని సహృదయంతో చూడలేకపోయినా రన్నారు మీరు. సహృదయం కాదనుకోండి. సహృదయత్వం అనే వ్రాసి ఉంటారు మీరు. పేపర్లో అట్లా పడింది మరి. తప్పులు చూపిస్తున్నా ననుకోబోకండి. తప్పులు వెదికే దురవస్థ నాకు ఘటించ జేయవద్దని మా కులదేవతలను ప్రార్థిస్తూ ఉంటాను నేను.

దాని దుంపతెగ, ఆ సహృదయత్వం మీ దగ్గర తప్ప, భువనభాంతరాళాల్లో ఎక్కడా లేదనే అనుకుందాం. కాస్త అది ఉపయోగించి శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారు వ్రాసిన వ్యాసములు మీరు సెలవిచ్చిన విమర్శన శబ్ద నిర్వచనానికి కొన్ని మైళ్ల దూరంగా నైనా ఉదాహార్యము లగునేమో చిత్తగించండని మనవి చేస్తున్నాను.

మరి మీరు శ్రీశ్రీ మొదలైనవారి విమర్శలకు శ్రీ సత్యనారాయణగారు సమాధానం చెప్పలే దన్నారు. చెప్పారో చెప్ప లేదో ఆంధ్రపత్రిక రిపోర్టు వల్ల ఏం తెలుస్తుంది. ఆ సభ పెట్టిస్తే వస్తారుగా కొత్తవారు. అక్కడికి తమరు దయచేసి మీ యిష్టము వచ్చినన్ని సమాధానములు పొందుదురు గాని. లేకపోతే మాకు తప్పులు దిద్దుదురు గాని. ఏదైనా జడ్జిం చెప్పింది ఒప్పుకోవలసి ఉంటుంది సుమండి. 'అథాతు' వాదానికి తమరు దిగరనుకుంటాను. శ్రీ శ్రీ ఆ సభలోనే పాషాణపాక మన్నారు. ఆ నోటితోనే సత్యనారాయణగారు వాల్మీకి అన్నారు. పూర్వం స్వతంత్ర పత్రికలో కాబోలు చలంగారితో రవీంద్రనాథ టాగూరు కవే కాదని వాదానికి దిగి, తాటితో దబ్బనంగా సందర్భం కల్పించి నేటి రేడియో ప్రోగ్రాముల్లో విశ్వనాథ సత్యనారాయణ ప్రక్కన ఎన్ని సీలికలు కూర్చోటం లేదన్నారు శ్రీ శ్రీ గారు. ఆయన మాటల్లో ఒకదాని కొకటి పొందిక కల్పించుకోవలసిన బాధ్యత మీది. ఆయన అన్న మాటలు మాత్ర మవి. ఆయ నన్న మాటల్లో ఒక పాషాణ పాకమే మీకు రుచిస్తే అప్పుడు మీ సాహిత్య ప్రియత్వంలోని యథార్థాన్ని శంకించవలసివస్తుంది.

అహంకారం కావ్యసృష్టికి ముఖ్యమా?

శాంతిశ్రీ

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ బహుముఖీనమైన ప్రజ్ఞ గలవారు. వారిని ఎరుగని తెలుగువా రెవరూ లేరు. సత్యనారాయణగారు ఎన్నో సాహిత్య ప్రక్రియలు సృష్టించారు. వారి మిగిలిన రచనలన్నీ యొక ఎత్తూ, వారు రచించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షం మరొక ఎత్తూ-అని వా రంటారు. ఈ రామాయణ కల్పవృక్షాన్నిగూర్చి, దానిలోని అందచందాలను గూర్చి వారు తెలుగుమాగాణంలో వాడవాడలా ఉపన్యసించారు. ఈ వృక్షానికి ఉత్సవాలు గూడ జరిగాయి.

ఏనాడు వాల్మీకి మహర్షి రామాయణం వ్రాయటానికి శ్రీకారం చుట్టాడో గాని ఆ అమరగాథ భారతీయుల నర నరాల్లోకి ప్రాకిపోయింది. దేశభాషల్లోకి—వివిధ ఛందోరూపంలో—వ్యాపించింది. ప్రబంధాలు, యక్షగానాలు, కీర్తనలు, నాటకాలు, ఇంకా అనేక ప్రక్రియలూ రామాయణ కథాకలితములై ఆవిర్భవించాయి. నన్నయ నుండి నారాయణరెడ్డి వరకూ విస్తరించిన ఆంధ్ర సాహిత్యాన్ని అవలోకిస్తే మనకే తెలుస్తుంది యీ రామాయణ ప్రాశస్త్యమూ, ప్రాగల్భ్యమూ. "ప్రాగ్వి పశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది నవ కథాధృతిని మించి" అన్న సూత్రాన్ని అనుసరించిన సత్యనారాయణగారు శ్రీమద్రామాయణ కల్పవృక్షాన్ని సృష్టించారు. ఆ వాల్మీకి ఎట్టివాడో విశ్వనాథవారే చెప్పారు.

"సర్వకావ్యవాక్కు జనియించెనే మౌని వదనసీమనుండి వానిదెలతు
సర్వ శిల్ప భూమి సర్వ లక్షణ లక్ష్య నవ విధాతృ భూతు నాకుజాతు." (అవతారిక. పుట. 9)

"ఒక్క వాల్మీకి కాక వేరొక్క డెవడు సుకవి శబ్ద వాచ్యు" డని ప్రశంసించారు. అట్టి వాల్మీకి కృత రామాయణానికి భాష్యంగా విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షాన్ని రచించారు. వారి గ్రంథం వాల్మీకి రామాయణానికి భాష్యం అనే నన్నమాటగాదు. విశ్వనాథవారే అనేక సభల్లో అట్లా చెప్పుకున్నారు.

వాల్మీకి రామాయణానికి భాష్యప్రాయంగా మహాకావ్యం రచించటానికి శక్తి తనకు గలదని విశ్వనాథవారు కల్పవృక్షావతారికలో స్పష్టంగా చెప్పారు.

నన్నయ్యయు దిక్కన్నయు న న్నావేశించిరి పరిణాహ మనస్వం
ధోన్నత వారలు పోయిన తెన్నున మెరుగులను దీర్చి దిద్దుచు బోదున్. (అవతారిక. పుట. 8)

నన్నయ్యకు తిక్కన్నకూ ఆంధ్రకవితా ప్రపంచంలో ఏ స్థాన మున్నదో అందరకూ తెలుసు. అట్టి మహాకవుల అంశ కలవారు కాబట్టే వారి మార్గంలో ప్రయాణించి విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షాన్ని వ్రాశా మన్నారు. ఇది పరమ పవిత్రమయిన కార్యమని చెప్పక తప్పదు.

ఈవిధమయిన సంస్కార పరిపాకంతో రచింపబడిన రామాయణాన్ని కొత్త సత్యనారాయణ చౌదరిగారు విమర్శించారు. సత్యనారాయణ చౌదరిగారి విమర్శలు చదివినవారికి వారి లక్ష్య మేమిటో తప్పక తెలుస్తుంది. "ఈ రామాయణం వాల్మీకి రామాయణానికి భాష్యం అగునా ? కాదా ? ఈ రామాయణం మహాకావ్య లక్షణాలతో కూడియుందా ? లేదా ?" అను రెండు ప్రశ్నలకూ చౌదరిగారు సమాధానం చెప్పటానికి ప్రయత్నించారు. వ్రాసినవారా ! "నన్నయ్యయు దిక్కనయు నన్నావేశించి" రని చెప్పుకున్నవారు. నన్నయ, తిక్కన్నలు వ్యాసభారతానికి భాష్యంగా, మహాకావ్య లక్షణాలతో ఆంధ్ర భారతాన్ని రచించారు. "వారలు పోయిన తెన్నున మెరుగులను దీర్చి దిద్దుచు బోదు'న్' అని అన్నారు గదా విశ్వనాథవారు. ఆ నన్నయ తిక్కనలకు ఒక మార్గ మున్నది. వారి కవితాశక్తి అసాధారణము. వారు చిత్రించిన పాత్రల నడవడికను గూర్చి వేరే చెప్ప బనిలేదు. వారి భాష కొక ప్రత్యేకమయిన సంప్రదాయ మున్నది. అట్టి నన్నయ తిక్కన్నల ఫక్కికి ఎంతవరకీ రామాయణంలో—కాలానురూపములైన—మార్పులతో సాక్షాత్కరించిందో కొలవటానికి కొత్తవారు ప్రయత్నించారు. పది పన్రెండు వ్యాసాలు రచించారు. చౌదరిగారు అనేక కోణాలనుండి రామాయణ కల్పవృక్షాన్ని పరిశీలించారు. పాత్ర పోషణము, శబ్దశుద్ధి శబ్దార్థగత దోషములు మున్నగు వానిని దీసికొని సప్రమాణంగా రామాయణ కల్పవృక్షాని కన్వయించారు. తేలిన సార మేమి టనుకున్నారూ ! రామాయణ కల్పవృక్షం వాల్మీకి రామాయణానికి భాష్యమూ కాదు. దీనిలో మహాకావ్య లక్షణాలూ లేవు.

దీనినిబట్టి చూస్తే కొత్తవారి విమర్శకు ఒక మహా ప్రణాళిక ఉన్నట్లు తేలుతుంది. పాత్రపోషణము, శబ్దశుద్ధి, శబ్దార్థ గత దోషములు—వీని చర్చ ఆ మహా ప్రణాళికలోని అంశాలు. ఈ అంశాలను—మహా కావ్యాన్ని దృష్టిలో ఉంచుకొని—కొత్తవారు పరిశీలించారు. అయితే ఈ మహాకావ్య లక్షణాలను ఎవరు నిర్ణయించా రంటారా ? తెనుగులో మహాకావ్యా లెన్నో ఉన్నాయి. అందులోనూ భారతం వంటి ఇతిహాసాన్ని మన అదృష్టం కొద్దీ—మనకు యోగ్యత లేకపోయినా—నన్నయ—తిక్కనలు చదువుకోండని వ్రాసియిచ్చి పోయారు. తదితర మహాకవులు ఎన్నో మహా కావ్యాలు అందిచ్చారు. భరతుని నుండి జగన్నాథ పండితుని వరకూ ఉన్న ఆలంకారికులు మహాకావ్య లక్షణా లేమిటో, వాని రూపరేఖ లెట్లా ఉంటాయో గ్రంథస్థం చేసి వెళ్ళారు. ఆ కావ్యాలను ఈ లక్షణ గ్రంథాలనూ ప్రమాణంగా దీసికొని కొత్తవారు విమర్శించారు. ఈ సంగతి మర్చిపోయి, కొత్తవారి లక్ష్యాన్ని విస్మరించి, ఆ విమర్శలో ఏదో యొక భాగానికి తమ కనుకూలమైన పద్ధతుల్లో సమాధానం వ్రాయటానికి కొందరు ప్రయత్నించారు. అట్లా ప్రయత్నించినవారిలో వావిలాల రామమూర్తిగారొకరు. (ఆంధ్రపత్రిక. 12—11—61).

2

రామమూర్తిగారి వ్యాసాన్ని సమీక్షించేముందు ఒక్కమాట చెప్పాలి. కొత్తవారు ప్రయోగించిన "పరుష వాక్పరంపర" నీసడించుకుంటూ, "ఇవియేనా సద్విమర్శకుని నోట రావలసిన మాటలు? ఈ మాటలలో ఏదో వ్యక్తి ద్వేషము—ఈర్ష్య—ఆవేదన—ధ్వనించుటలేదా? ఇట్టి మాటలు విమర్శకులు ప్రయోగించుట హర్షింపదగినదికాదు." అంటూ ప్రశ్నించారు. తీర్మానించారు. కాని రామమూర్తిగా రీ ప్రశ్నలు అడుగవలసింది పాఠకులను గాదు. మరి విశ్వనాథవారిని. ఏల యందురో? ఈ ఆంధ్ర భాషా ప్రపంచమందు జరిగే విమర్శలలో—వ్యక్తి ద్వేషము,(శోద్ర) మతద్వేషము, ఈర్ష్య ఆవేదన మొదలగు గుణముల నన్నిటిని దూర్చుట ప్రారంభించినది నాకు తెలిసినంతవరకూ విశ్వనాథవారే. సి. ఆర్. రెడ్డి మరణించిన తర్వాత, శ్రీమాన్ అనంతకృష్ణ శర్మ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం,

శ్రీ నండూరి బంగారయ్య మున్నగువారు విమర్శలు వ్రాయటం మానిన తర్వాత తెలుగువారు చేసే విమర్శలలో రామమూర్తిగారు చెప్పిన ఈర్ష్యాదులు చోటు చేసుకోటానికి త్రోవ చూపించినది విశ్వనాథవారని ఆత్మసాక్షిగా చెబుతున్నాను. విశ్వనాథవారు—వారేకాదు ఇంకా కొందరు—తమకున్న రాగ ద్వేషాల్ని పురస్కరించుకొని, ప్రాచీన సమకాలీన కవులపై, వారి గ్రంథాలపై—ఏనాడో నిర్వాణం పొందిన బుద్ధభగవానునిపై—ఎట్టి విమర్శలు చేశారో, ఎంతగా విరుచుకు పడ్డారో, ఎట్టి గేయాలు(బుద్ధునిగూర్చి) రచించారో లోకం యింకా మరచిపోలేదు. కావాలంటే ఎంత సాక్ష్యాన్నయినా చూపిస్తాను. అందాక ఎందుకూ! రామమూర్తిగారి వ్యాసంలో ఎంత అవహేళనం గూడు కట్టుకొని ఉన్నదో వారే మరొకమారు తమ వ్యాసాన్ని చదువుకుంటే తెలుస్తుంది.

అంతే గాక కొత్తవారికీ, విశ్వనాథవారికి పొత్తు ఉన్నట్లు వారిరువురి వ్రాతల వలన మనకు తెలుస్తుంది. వా రిరువురి హృదయాలలోని "ఆర్ద్రత" ఆరిపోలేదని అనుకోవాల్సి ఉంది. అట్లాంటప్పుడు కొత్తవారు చేసే విమర్శలో—ఈర్ష్యాదులుగాక— సమ్యగ్దర్శిత్వము ఉన్నదని ఎందు కనుకో గూడదూ!

3

"కవి కహంకార ముండితీరును. అహంకారము లేనిదే కావ్య సృష్టి జరుగ" దన్నారు రామమూర్తిగారు. ప్రాచీనుల అహంకారాన్ని గూర్చి కూడా వారు వ్రాశారు. నిజమే. "అమలోదాత్త మనీష నే నుభయకావ్య ప్రౌఢి బాటించు శిల్పమునం బారగుడన్" అని ఎలుగెత్తి చాటి నిర్వచనోత్తర రామాయణాన్ని రచించిన తిక్కన ఒరగబెట్టిందేమిటి? "నా పుట్టు కృతార్థతం బొరసె బుణ్య చరిత్రుడనైతి" నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తి కోటికిన్" అన్న తిక్కన ఒరగబెట్టిం దేమిటి? కవికి కావలసింది అహంకారంగాదు. ఋష్యంశలలో ఒక అంశమయిన శాంత గుణం. "హరిహరనాథ! సర్వ భువనార్చిత నన్ దయజూడు మెప్పుడున్" అని అన్న తిక్కనలోని ఈ శాంతగుణం ఆయనచేత ఎటువంటి గ్రంథాన్ని వ్రాయించిందో రామమూర్తిగారికి తెలిసినట్లయితే ఇట్లా వ్రాయరను కుంటాను. ఈ శాంతగుణంలేని "వానియందు ఉదాత్తత యుండదు. నైర్మల్యములేని స్త్రీ విష కన్యగా పరిణమించినట్లు ఉదాత్తత లేని కవిత విషవాక్కుగా ఏర్పడును. మునసాలికి మనుష్య జాతిలో సౌహార్దము, భక్తి, త్యాగము, సత్యప్రీతి, ధర్మదృష్టి, ఆత్మ సంయమము, సౌందర్య పారవశ్యము—ఇత్యాది మహా గుణము లిప్పటికి నిలిచి యోగక్షేమ సాధనములై యుండుటకు గంభీర భావములు, విశాల దృష్టియు గల మహాకవుల కావ్యములే మూలాధారములు. వీరి కవచములు. కవి ప్రశాంతుడై, దాంతుడై ఋషితుల్యుడై నప్పుడు తప్ప, అట్టి మహా కావ్యము రచింపలేడు. ఆ సంస్కారము లేనివాడు తలలోని కుళ్ళంతయు వెడల గ్రక్కి, తన్ను, ఇతరులను మైల పరచు నంతే" అని అన్నారు శ్రీమాన్ అనంతకృష్ణశర్మగారు.

4

"ద్రుత స్వభావము గల పదార్థమును నిలబెట్టి వీల్గదీసి పరామర్శించుటలో ఏమి సొంపు కలదో నా కర్థ మగుటలేదు" అని రామమూర్తిగారు సొగదీసి తప్పుకొన్నారు. వారి వాదానికి మూదలగా ప్రౌఢ వ్యాకరణ శబ్ద పరిచ్ఛేదములోని 116 వ సూత్రాన్ని ఉదాహరించి, "ఆ ద్రుతములకు బట్టిన గతియే కల్పవృక్ష ద్రుతములకు బట్టుగాక" అని శపించారు.

ఆ 116 వ సూత్రానికి శ్రీ బులుసు వేంకటరమణయ్య ఇట్లా వ్యాఖ్యానం వ్రాశారు.

(1) "నామముల యొక్కయు, సర్వ నామముల యొక్కయు, కళలగు నవ్యయముల యొక్కయు గడపట—సముచ్చయార్థమునందుగాని, లేదా ఏదే ఒక విశేషార్థమును జెప్పునప్పుడుగాని, లేదా—ఏ యర్థములేక కేవలము పాద పూర్తి చేయుట కుప యోగించునపుడుగాని సామాన్యముగా "ను" అను శబ్దము చేరుచుండును. (2) ఉకారాంతములు కాని కళలపయి "ను" గాని, "యును' అనునదిగాని చేరుచుండును....." (త్రిలింగ లక్షణ శేషము. పుట 141)

ప్రౌఢ వ్యాకర్త అర్థ విశేషాదుల్లో ఎట్లా "ను" చేరుతుందో ప్రయోగా లిచ్చారు. విశ్వనాథవారు ప్రయోగించిన ఈ ద్రుత సమూహం సముచ్చయార్థంలో చేరిందా? అర్థ విశేష స్ఫూరకమైందా? లేక పాదపూర్తికొరకు దిగుమతిఅయిందా? తార్కాణాలు చూపలేదు రామమూర్తిగారు. ఎందుకు చూపుతారు? విశ్వనాథవారు ప్రయోగించిన ద్రుతసమూహం నూటికి తొంబదియైదు పాళ్ళు పాదపూరణం కొరకే. ప్రాచీన కవులను ఉదాహరణలుగా చూపినంత మాత్రాన ఈ ద్రుతాలు జారిపోవు. ఆ మహా కవుల కావ్యాలలో ఉన్న లక్షణాలు ఎన్ని రామాయణ కల్పవృక్షంలో ఉన్నాయని ద్రుతాల విషయంలో వారిని తార్కాణించి వీరిని సమర్థించడానికి! విశ్వనాథవారి రామాయణ కల్ప వృక్షంలో నూటికి తొంబదిపాళ్ళ పద్యాలు అనవసరమైన ద్రుతాలతో మాత్రమేకాదు, అన్వయ క్లిష్టతతో కూడిఉన్నాయి. దీనికి వారి గ్రంథమంతా సాక్ష్యమిస్తుంది.

రామాయణ కల్ప వృక్షాన్ని దుగ్ధాబ్ధిగా పోల్చిన రామమూర్తిగారు "కేవలము గవ్వలను జూచి రత్నకరత నిరూపించుట సువిమర్శన మగునా?" యని గడగట్టి గంట వాయించారు. అట్లే అధికంగా ఉన్న గవ్వలను జూచి త్రోసివైచి, ఎడనెడ అల్పంగా కానవచ్చే రత్నాలకే మురిసిపోయి రత్నాకరతాభావం నిరూపించటం కూడ సువిమర్శనం కాదు. మతి కువిమర్శ.

ఈవిధంగా ద్రుతాల్ని అధికంగా వాడటంవలన రచనలోనున్న బిగింపుపోయి, సడలింపు వచ్చి, రోయింపు పుట్టుతుంది. ఇట్లా వ్రాయటం మహా కవుల లక్షణంగాదు. పూర్వ మహాకవుల వ్రాతల్లో ఈ విధంగా కుప్పతిప్పలుగా ద్రుతాలు సాక్షాత్కరించినా యా వ్యాకరణం ప్రకారం గతి కల్పించుకోవచ్చు. కాని మహాకావ్యలక్షణం ఎట్లా కల్పించుకొంటాము. ద్రుతాల్ని వాడటంలో విశ్వనాథవారు "మంచి పవిహంద్రే గాని యూహ శాలలు కారువలె మున్నది."

"తెలుగు కావ్యములలో పౌరాణిక ధోరణిలో ఆదియునుగాక, దివంబునంబోలె వంటి చెవి కింపైన ప్రయోగము లుండుట వలన నవి సకృత్తు గానవచ్చు నన్నట్లు వ్యాకర్తలు చూపెట్టిరి. "వినుడును గానడున్ బిదప నీకును నాకు మరల్ప వచ్చునే" వంటి ప్రయోగముల పారస్యమును గూడ మనము గుర్తింపవచ్చును" అని కొత్తవారు—రామమూర్తిగారు జవాబు వ్రాసిన వ్యాసంలో—వ్రాసిరి. మరి ఈ వ్రాతను రామమూర్తిగారు చూడలేదా?

5

"మునికూన"లను సమర్థించటానికి "ముద్దుగూన" ను ఉదహరించిన రామమూర్తిగారు "పడిన శ్రమ యంతయు అనవసర మనిపించుచున్నది." దశరథునితో జటాయువు పుత్రకామేష్టి సమయంలో ఈ విధంగా పలుకుతుంది :

ఉ: ఈ మిష పెట్టి వచ్చితివి యెంతటి కెంతటి కెంత దూరమీ
భూమి వినున్ గమంగొనుగ బుత్త్రులు కల్గెదరయ్య నీకు నే
నా మునికూనలన్ గనుదునా? కనుగొన్నను గుర్తుపట్టు వా
రే? మరి నీ కుమారులని యించుక చంచువు వాల్చి నవ్వుచున్.

జటాయువు "నే నా మునికూనలన్ గనుదునా?" యని ఎవరిని గూర్చి చెప్పుచున్నట్లు? పుత్రులు నీకు తప్పకుండా పుట్టారు. అన్న జటాయువు జన్మింపబోయే శ్రీరామచంద్రాదులను గూర్చి చెప్పుతున్నదా? ఇదే నిజమయితే "మునికూన" లను దానికి మనం ఏమని అర్థం చెప్పుకోవాలి?" "ముని శిశువుల"ని అర్థం చెప్పుకోటం ప్రకరణ భంగం కదా?

సూర్యరాయాంధ్ర నిఘంటువులో "ముని" అను పదములు రెండున్నవి. ఒకటి తత్సమపదం. రెండవది "మును శబ్దమునకు వృత్తియం దుత్తర పదము పరమగునపుడు వికల్పముగా నగు రూపము." ఇది మునివాపుమున్నగు వానిలోనిది. శబ్ద రత్నాకరంలో కూడా ఈ విధంగానే ఉంది.

"కూన" పదమునకు సూర్య రాయాంధ్రనిఘంటువులో విశేష్యమైతే "పశు పక్ష్యాదుల శిశువు—శిశువు". విశేషణమైతే "చిన్నది లేతది రత్న' అను అర్థా లున్నాయి. నెలకూన లతకూన, అనునవి కూడ ఉదహరింపబడ్డాయి. "లతకూన—లేదీగ, తీగ, కన్నె పడుచు—నెలకూన—బాలచంద్రుడు" అని అర్థాలు వ్రాయబడినవి. శబ్ద రత్నాకరం "కూన" పదానికి పిల్ల—బిడ్డ అను అర్థాల నిచ్చింది.

"మునికూన" లనుదానికి మనం ఏమని అర్థం చెప్పుకోవాలి? పసిపాపలనియా? లేక ముందు పుట్టిన బిడ్డలనియా? ఈ అర్థాల్లో ఉపయోగించటం భాషా ప్రపంచమందున్నదా? రామమూర్తిగారు పరిశోధించి చూడాలి. ప్రమాణా లేమయినా ఉంటే చూపాలి.

"ముని కూనలను" సమర్థించటానికి, రామమూర్తిగారు "ముద్దుగూన" యని యుదహరించారు. ఈ రెంటికీ అర్థంలో భేదం లేదా? "కూన" యను పద ప్రయోగం చూపటానికి రామమూర్తిగారు "ముద్దుగూన" యని చూపారా? కూన పద ప్రయోగం తప్పని కొత్తవా రనలేదే. వారన్నది "కూన ఎచ్చట ఉండవలెనో ఔచిత్య మక్కరలేదా" అని. "ముద్దుగూన" యని అన్నది మేనకాదేవి. ప్రియపుత్రీ! అని తాత్పర్యం మనం అక్కడ చెప్పుకోవచ్చు. మరి "ముని కూనలను" దానికి అర్థం చెప్పుకోటానికి వీలు లేకుండ కూన పద ప్రయోగం జరిగిందని కొత్తవారి తలంపేమో! ఈ "మునికూన"లను దాని సారస్యాన్ని రామమూర్తిగారే వివరింతురు గాక!

6

"విచిత్ర సంధులు", "వింత ప్రయోగాలు" అని కొత్తవారు చూపినవి మహాకవి సమ్మతములే యని రామమూర్తిగారు సాముచేసి అనేక ప్రయోగాలు చూపించారు. వాటిని సమర్థించిన రామమూర్తిగారే "కాడ" అను ప్రయోగాన్ని మాత్రమ సహింపలేకపోయారు. "విశ్వనాథవారు బావికాడికి—గేహంబుకాడ— మొదలగు ప్రయోగములు చేయుట దోషమని నేనును నొక్కి చెప్పగలను. ఏలయన "కాడికి" అనుమాట వారి నోట వెల్వడవలసినది కా" దన్నారు. "కాడికి" అను దానిని విశ్వనాథవా రుపయోగించటం బాగుండలేదని, అది దోషమని రామమూర్తిగారు చెప్పటంలో వారి అభిప్రాయం ఏమిటి? దేనిని ప్రమాణంగా దీసికొని వారిట్లా వ్రాశారు? "ఋషితుల్యు" డయిన కవినోట ఈమాట రాగూడదనే కదా? మహాకావ్యంలో ఇట్లాంటి ప్రయోగాలు ఉండకూడదనే గదా!

"కాడికి" అని ప్రయోగించటానికి రామమూర్తిగారు ఎందుకు అభ్యంతరం చెపుతున్నారో, అందుకే అనేక పద ప్రయోగాల విషయంలో కొత్తవారు కూడా అభ్యంతరం చెబుతున్నారు. కొత్తవారు దోషములని చూపిన వానిని కవులు సకృత్తుగా వాడారు. వానిని అపవాదములుగా పేర్కొని వైయాకరణులు వాటికి గతి కల్పించారు. ఈ విధంగా గతి కల్పించినవారిని రామాయణ కల్పవృక్షంలాంటి—"నన్నయయు, తిక్కన్నయు నన్నావేశించి"రని చెప్పికొన్న కవి వ్రాసిన—మహా కావ్యంలో బహుళంగా వాడితే బాగుంటుందా? "మహాఅకవులు" వ్రాసే సామాన్య కావ్యాలలో మాదిరిగా వాల్మీకి రామాయణానికి భాష్య మయిన గ్రంథంలో అప్రశస్త ప్రయోగాలు విచ్చలవిడిగా పెచ్చు పెరిగిపోతే కలిగే పరిణామం ఏమిటి? అని రామమూర్తిగా రెందుకు ఆలోచించలేదు?

మహా కావ్యంగా కవి భావించే గ్రంథంలో మహాకవి కృత మహాకావ్య లక్షణాలు ఎట్లా మటుమాయం అయ్యాయో చూపటమే కొత్తవారి విమర్శకు లక్ష్యమనుకొంటున్నాను. ఇది గమనింపకుండా సంహితలు వెదకి అక్కడ ఒక ప్రయోగం, ఇక్కడ ఒక

ప్రయోగం ఎవరైనా చూపించితే సరిపోదు. మహా కవుల కావ్యాల్లోని భాష ఎలా ఉంటుంది? వ్యాకరణ సమ్మతములుగాని ప్రయోగాలు మహా కవులు చేసినా అవి ఎన్ని ఉంటాయి? భాషా విషయంలో మహా కవుల సక్రమ సంప్రదాయం మార్గం ఏమిటి? అన్న విషయాలు రామమూర్తిగారు మరచిపోయారేమో తెలియదు. విశ్వనాథవారు వాడిన పదాల కన్నింటికీ ఎక్కడో ఒకచోట ప్రయోగం కన్పడుతుందన్న విషయం కొత్తవారికి తెలుసని వారి వ్రాతలే తెల్పుచున్నాయి. వారు విమర్శ చేసింది మహా కావ్యాన్ని దృష్టిలో ఉంచుకొని.

పూర్వాంధ్ర మహాకవుల మాదిరిగా విశ్వనాథవారు కూడ ప్రయోగాలు చేశారని రామమూర్తిగారి వాదం. కావచ్చుగాక! ఆ మహాకవుల రసపోషణ శక్తిలో ఏమాత్రం పాలు ఈ కల్పవృక్షంలోఉంది? జీవద్భాషయయిన ఆంధ్ర భాషా సంప్రదాయం, కారక వైచిత్రి ఎంతవరకు రామాయణ కల్పవృక్షంలో ఆ మహా కావ్యాల్లో మాదిరిగా ప్రతిబింబితమైనవి? ప్రాచీనాంధ్ర కావ్యాల గొప్పతనం కంటె ఏ యే రీతులలో ఈ కల్పవృక్షం ఎక్కువ గొప్పతనం పొందింది? ముఖ్యంగా వాల్మీకి రామాయణంకంటె యిది ఎట్లా గొప్పది? ఏవిధంగా మాతృక కిది భాష్యం ఐంది? అని ప్రశ్నలు వేసుకుని రామమూర్తిగారు చర్చ చేస్తే కొత్తవారిని విమర్శింపవలసిన అగత్యం వారికుండ దనుకుంటాను. "ఈ సంసార మిదెన్ని జన్మలకు నే నీ మౌని వాల్మీకి భాషా సంక్రాంత ఋణంబు దీర్పగలదా?" "ముని ఋణము దీర్ప నీ కావ్యమును రచింతు"నన్నారు విశ్వనాథవారు. ఋణం దీర్చటానికి నిశ్చయించిన విశ్వనాదవారు మరీ యింకా ఎక్కువగా అప్పు పడ్డారేమో!—పునర్దర్శనాయ.

తప్పులు దిద్దకపోతే కావ్యం కల్పనావృక్షం అవుతుంది

శ్రీ కనగపల్లి సుబ్బారావు

[నవంబరు 26 వ తేదీ సారస్వతానుబంధంలో ప్రచురించినవి]

శ్రీ శ్రీ పాషాణపాకం అన్నప్పుడు విశ్వనాథవారు మెదలకుండా పూరుకొని, తరువాత పత్రికలలో శ్రీ శ్రీ ని దుయ్యబట్టడం మహాకవిలాంటివారికి పొసగదేమో? శ్రీ శ్రీ కి పాషాణపాకమైనది వేరొకరికి పాయసాన్నముకావచ్చు. శ్రీ శ్రీ కి పాయసాన్నమైన (రారా రష్యా! లాంటిది) అనేక మందికి పాషాణపాకం కావచ్చు. అంతేకాని కావ్యంపై విమర్శలు వ్యక్తిగత దూషణలకు దారితీయరాదు. శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరిగారు చేసే విమర్శలు పఠితలలో విజ్ఞానాన్ని, యదార్థాన్ని రేకెత్తించేవి లాగా యుండాలికాని కువిమర్శలుగా ఉండరాదు. విమర్శ సువిమర్శ అయినప్పుడే సహృదయం స్వీకరిస్తుంది.

..........చిద్గగన ప్రాలేయాంశువున్.........లో 'స' అన్న అక్షరము లాంటివి శ్రీ విశ్వనాథవారి కవితలోనే గాక, అనేక మంది ప్రముఖులు వ్రాసిన కావ్యాలలో కూడా యున్నవి. వీనికి ఉదాహరణము శ్రీ వావిలాల రామమూర్తిగారు 12—11—61 వ ఆంధ్ర పత్రికలో వ్రాసియే యున్నారు. అలాగే ఇంకా ఉదాహరణలు వున్నాయ్. కాబట్టి ఎవరైనను శ్రమపడి సభ జరిపించి చర్చించదగ్గ విషయం మాత్రం కాదది. రామాయణ కల్పవృక్షంలో శా. ఈ యన్యాయము నింత చేసినను......(అయోధ్య. 72 వ పుట) అను పద్యములను కవిసామ్రాట్‌లాంటివారు సీతా మహాదేవిలాంటి పాత్రచే పలికించి తమ కావ్య కన్యకంత సీమన ఎలా అలంకరించారో తెలియకున్నది. రావణాసురుడు శ్రీరామునితో యుద్ధము చేయుదానికి సీతను అపహరించాడని కొంతమంది కవులు మూల కావ్యమునకే అర్థము మార్పు చేయుచున్నారు. అలా అయిన యెడల మండోదరి, కుంభకర్ణ, విభీషణాదులు రావణాసురునకు ఏల సుబోధ చేయవలసి వచ్చినదో?

శ్రీ చౌదరిగారు 12—11—61 ఆంధ్ర పత్రికలో వ్రాసిన వ్యాసములో విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంలో శా. ఈ యన్యాయము నింత చేసినను.....అను పద్యము తప్పని ఉదాహరణముగా చూపించారు. వారు ఇలాంటివి వెలికి తీసి చూపించవచ్చు. వాటిని ప్రజానీకం హర్షిస్తుంది కూడా. మూల కావ్యమునకు విరుద్ధముగా వ్రాసినవి కవిసామ్రాట్ దిద్దుకొనవలసి యుండును. లేని యెడల రామాయణమంతా విని 'రాముడికి సీత ఏమి కావలయు నన్నట్లు' రామాయణం నిత్య పారాయణంగా తెలిసిన ఆంధ్రులకు కల్పవృక్షం (తప్పులు సవరించని యెడల) కల్పనావృక్షమై ప్రజలకు దూరమై పోగలదు. కావున కావ్యకర్తలు ప్రజలలో సన్నిహిత తత్త్వముతో మన్నికగా విలువగలిగిన రచనలు చేయుడం అవసరం. విమర్శలు కూడా సరియైన విమర్శలనే చేయుడం అవసరం......చిద్గగన ప్రాలేయాంశువున్.........లోని విమర్శకు శ్రీ వావిలాల రామమూర్తిగారు చూపించిన ఉదాహరణలు లాగా శ్రీ విశ్వనాథవారు తమ (కావ్యం) పై విమర్శకు ఉదాహరణలతో సమాధానము చెప్పిన యెడల ఇంత రభస జరిగేదికాదేమో. శ్రీ సత్యనారాయణ గారు తమపై విమర్శలకు ప్రతి విమర్శలు గాక, సాధ్యమైనంతవరకు ఉదాహరణలతోనే సమాధానము చెప్పగలరని నమ్ముచున్నాను. దాని వలన విమర్శకులు, కావ్యకర్తలు సన్నిహితముగా మెలగవచ్చు. పఠితలకు విజ్ఞానము చేకూర్చవచ్చు.

సారంలేని విమర్శలు

పి. శ్రీనివాసరావు

నేను ప్రతివారము 'ఆంధ్ర పత్రిక' సారస్వతానుబంధం చదువుచున్నాను. ఈమధ్య రామాయణకల్పవృక్షాన్ని గూర్చి రేగిన తుఫాను, సాహిత్యమందొక దెబ్బవంటిదని అందరికీ తెలిసినదే. దానియందున్న మంచి చెడులను గ్రంథకర్తకు, విమర్శకులకు వదిలి వేయుదము. కాని కొందరు శ్రీ సత్య నారాయణ చౌదరిగారి ఖండనలో కొంతవరకైనా నిజము వుండకపోదా యని గుర్తించినవారు గుర్తించనివారు బహిరంగముగా (పత్రికల ద్వారా) ప్రకటనా స్వాతంత్ర్యమును దుర్వినియోగం చేసుకొని ఉద్రేకులై, సాహిత్యరంగాన్ని యుద్ధరంగంగా మార్చడము శోచనీయమైన విషయము. శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తిగారివ్యాసము శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి వ్యాసము (చదవడానికి ఇంపుగా నున్నట్టి ప్రతి విమర్శ) చదివితిని. వీరి సాహిత్యాభిమానము వీటి ద్వారా స్పష్టమవుతున్నది. సత్యనారాయణ లిద్దరు ఎక్కడనున్నారోగాని, మధ్య వచ్చిన మహానుభావుల విమర్శలలో నిజాయితీ, సభ్యత లోపించినవనే చెప్పవలసి వస్తున్నది. ఈనాడు శ్రీ కొత్తవారిని బలపరచినవారు కల్పవృక్షమును కళ్ళకద్దుకొన్నవారే! ఐనా అంతమాత్రముచేత దానిలో ఎవరూ తప్పులు లేవ అనలేరు. కల్పవృక్ష బరువు భారములు వారికి వదిలి వేసినా, ఈమధ్య రేగిన విమర్శలలో బరువు, భారము ఏ మాత్రము కనబడక పోవుచున్నది. "కొత్తవారితో వాదానికిదిగితే ఏమీ ప్రయోజనము లేదని నాకుతెలుసు" అన్న శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి అదే వ్యాసములో 'సభ పెట్టించండి' అని సవాలుచేసి చౌదరిగారిని వాదనలోకి దింపడము, 'సహృదయంతో' అన్న పదానికి 'సహృదయత్వము' అని మార్చి ఉద్రేకముతో వ్రాయడము పండితుల లక్షణము కాదనుకొంటాను. అలాగే శ్రీ కృష్ణమూర్తిగారి వ్యాసమును గురించి కూడ విమర్శించిరి. తమను తాము సమర్థించుకో జాలనప్పుడు ఎందుకీ ప్రతి విమర్శలు చేస్తారో అర్థం కావడములేదు. కృష్ణమూర్తి గారి వ్యాసములో సరుకులేదంటూనే తామూ సరుకు లేకుండానే వాదనలోకి దిగారు శ్రీ రామమూర్తిగారు. ఇంతకు నేను సంపాదకులను కోరేదేమంటే, అర్థ రహితములైన ప్రతి విమర్శలను ప్రకటించవద్దని. కల్పవృక్షమును సమర్థించునవి, ఖండించునవి (కారణములలో నుదహరించునవే) విమర్శలుగా గుర్తించి ప్రకటించవలెనని కోరుచున్నాను.

మహావిష్ణువు అవతారానికి అపచారం

శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు

[ఆంధ్రపత్రిక నవంబరు 26 వ తేదీ సారస్వతానుబంధం నుంచి]

"గచ్ఛత స్ఖలనం క్వాపి భవ త్యేవ ప్రమాదతః
హసన్తి దుర్జనాః తత్ర ప్రమాదదతి సజ్జనాః"

గడచిన నెలలో దసరా ఉత్సవముల సందర్భంగా మద్రాసులో చెన్నపురి ఆంధ్ర మహాసభలోను, తిరువళ్ళిక్కేణి తెలుగు మహాసభలోను శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు చేసిన ఉపన్యాసములపై ఆంధ్రపత్రికలో జరుగుచున్న రగడ మిక్కిలి అనుచితంగా వున్నది.

'కల్పవృక్ష' విమర్శకున్నూ, పరశురామావతారమునకూ, గాడ్సేకు ఏమి సంబంధము? గోకులాష్టమికి, పీరుసాహెబుకి ఉన్న సంబంధము తప్ప! అనవసరముగా శ్రీ మహావిష్ణువు అవతారమైన పరశురామ భగవానులకు సనాతన మతమును దూషించుటకు ఉపక్రమించిన శ్రీ క్రొత్త సత్యనారాయణ చౌదరిగారి అపరిపక్వమనస్విత, మాత్సర్యగ్రస్త మానసికస్థితి, అపాండితి తేటతెల్లము లైనవి. శ్రీ చౌదరిగారు తప్పునిన్క్రమించి చిద్గగన నకారంలో దర్శించిన గురువును, ఏ వ్యాకరణ సాహాయ్యముతోగాని, కారికల సాహాయ్యముతో గాని చూపింపలేదు. అస్త వ్యస్తంగా ఏవైనా 'కారిక'లను ఉదహరించినా—ఆ కారికలు ఆయనకు అర్థం కాలేదని చూపవచ్చును. ఇక క్రొత్తగా క్రొత్త కారికలను సృష్టించి, తన వాదములను బలము చేసుకోవలెను. తనకులేని ప్రామాణ్యత తన కారికలకు, యెట్లు సంప్రాప్తించును? నిజమైన వైయ్యాకరణు లెవ్వరున్నూ ఇంతవరకు శ్రీ క్రొత్తవారి గురుదర్శనాన్ని సమర్థించలేదు. దీని భావము సహృదయులకు వేద్యము.

ఆంధ్ర దేశములో పండిత జనులకు కొరత యెప్పటికిన్నీ వాటిల్లదు. (ఆంధ్ర పాండిత్యం జీయాతు ఆచంద్రతారార్కమ్). కేవలము దూషణములతోను, సనాతన సంప్రదాయ విరుద్ధముగను, ఆలంకారిక శాస్త్ర నిర్దేశములకు అనుగుణంగాను, మరిన్నీ విమర్శకుండవలసిన నిష్పాక్షిక దృష్టి లోపించుటవల్లను, శ్రీ కొత్త చౌదరిగారి రచనల స్థాయిని యిదమిత్థమని పండితులు, సాహిత్య భావుకులు నిర్ణయించుకొని—మౌనముద్ర వహించియుండిరేకాని—శ్రీ చౌదరిగారి వాదములను పరాస్తము చేయజాలక కాదు.

మరిన్నీ—శ్రీమన్నారాయణ పరశురామావతారాన్ని దూషించుట, సనాతన మతాన్ని అపహాస్యము చేయుట (కవి శ్రీ కొత్త చౌదరిగారిగారు చేసినవే) మన రాజ్యాంగ చట్ట విరుద్ధములు. ఏ మతాన్నిగాని నిందించుట, అపహాస్యము చేయుట, శిక్షాస్మృతిలో గుర్తింపబడిన నేరములు. ప్రకటించుట కూడా అట్టిదే. నైతిక విషయంగా అగ్రశ్రేణికి చెందిన ఆంధ్రపత్రిక యీ తక్కువ రకపు దుర్భాషలకు తావిచ్చుట చింత్యము. సనాతన మతాన్ని, పరశురామ భగవానుని, దూషించినందుకు ఆదూషణలు ప్రకటించినందుకు, వారి వారి క్షమాపణ పత్రికా ముఖంగా రాగలదని ఆంధ్ర మహాజనులు (మద్రాసు, ఆంధ్ర ప్రభుత్వములు కూడా!) వేచియున్నారు.

సంపాదకుని విజ్ఞప్తి

[సారస్వతానుబంధం : నవంబరు 26]

కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి పండిత శ్రీ కొత్త సత్యనారాయణచౌదరిగారికి నడుస్తున్న వివాదంలో అనేక మంది సాహిత్యాభిమానులు కూడా కలుగజేసికొని, తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. అయితే, కొంతమంది అటు విశ్వనాథవారినీకాక, ఇటు కొత్తవారినీకాక మధ్య అభిప్రాయములను తెలిపిన వారిని విమర్శిస్తున్నారు. దీనితో విశ్వనాథవారు ఆంధ్ర మహాసభ సన్మాన సందర్భంలో చెప్పిన అంశాలు, వాటికి కొత్తవా రిచ్చిన సమాధానంలోని అంశాలు మరుగున పడిపోయి, మధ్యవారి అభిప్రాయాలను గురించి వివాదాలు పెరిగే ప్రమాదం వచ్చింది. అది రాకుండా చూడవలెనని రచయితలకు మనవి. అంతే కాకుండా పూర్వ విషయాలను తేవద్దని మనవి.

కొందరు బహిరంగలేఖలను, అలాటి ధోరణిలో రచనలను 70, 80 పేజీల వరకు ఉన్న వ్యాసాలను పంపుతున్నారు.

ఇలాంటివి ప్రకటింపసాధ్యముకాదు. మరొక విషయం. భారతిస్థాయి పడి పోయినదని కవి సమ్రాట్‌గా రన్నారు. వానికి తమ తమ వ్యాసాలలో నిరసన తెలుపుతూ చాలామంది వ్రాస్తున్నారు. కవిసమ్రాట్‌గారు బహిరంగ సభలో అన్నారు. అనేక మంది తమకు రుచింపకపోని రచనలు ప్రకటించినపుడూ తమవి ప్రకటింపనపుడూ ఉచ్చరింపరాని మాటలలో ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. ఈ సందర్భంలోనూ చాలామంది అలా వ్రాశారు.

ఇది పత్రికలవారికి నిత్యానుభవం కాబట్టి ఈ విషయాన్ని గురించి చర్చించకుండా ఉంటే స్థలం కలిసి వస్తుంది.

భారతిస్థాయి ఒకరనటం మూలాన తగ్గదు, హెచ్చదు. దాని స్థాయి దాని కుంటూనే ఉంటుంది. తిట్టేవారిస్థాయి మాత్రం వెల్లడి అవుతుంది.

వ్యాసాలు వ్రాసిపంపేవారు తమ పూరు, పేరు కూడా తెలియబరిస్తే మంచిది. కొందరు అనామకులుగా వ్రాస్తున్నారు

—ఆ॥ సం.

కావ్య విమర్శకు రసజ్ఞత ప్రధానం

శ్రీ వావిలాల రామమూర్తి

[డిసెంబరు 3వ తేదీ సారస్వతానుబంధం నుంచి]

“ఋతువులు” సాగి యాంధ్రధర కింత ‘ప్రశస్తి’యుగల్గి ‘పాటలున్’ రతులు చెలంగి, ‘దౌత్యము’ విరాళివిద్రోలి నుతింప ‘సాములన్’ వెతలరి పొంగి ‘కల్పకము’ నీడ నభీష్ట రసార్థ ‘విశ్వనాథు’తతకళాభివృష్టి పరితోషము నిచ్చుట మాకు గూర్పెడున్.

—శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన రామాయణ కల్పవృక్షములోని శబ్దార్థ పాత్రపోషణ గత దోషములగూర్చి శ్రీ చౌదరిగారు భారతులలో చర్చించియున్నారు. శ్రీ చౌదరిగారి దృక్కోణమును గొలుచుటకు ముందు, శ్రీ విశ్వనాథవారి విశ్వామిత్రుని బల్కరించుటకు ముందు, కొన్ని విషయముల ప్రస్తావింపవలసి యున్నది. ఆంధ్ర మహాకవుల విషయమున (పూర్వులు) వారి భావనాధోరణి, రసికత, కాలపరిస్థితులు, వారి రచనలలో దేశకాల పరిస్థితుల ప్రభావము, మొదలగునవి కొంత తెలిసియుండినగాని—సంస్కృత కథామాతృకల చికిలి చేయుటలో వారు పోయిన తీరుతెన్నుల పరిశీలించి యుండినగాని—ఆధునిక మహా కావ్యములోని ఒక పాత్రయొక్క ‘సమగ్ర చిత్రణము’నకు బూనుకోరాదు. అట్లు చేసినచో ఆ విమర్శనము విమర్శమనిపించుకొనదుగదా! ప్రస్తుతము—అనల్ప కల్పనా చాతుర్యములో అవధులు ముట్టిన రచనా విశేషముల వాసింపజేసిన శ్రీ విశ్వనాథవారి రామాయణ కల్ప వృక్షమును శ్రీ చౌదరిగారు విమర్శింపబూనినారు. సంతోషము.

మా వూరిలో సుబ్బలక్ష్మమ్మ, సీతాయి అను అత్తా కోడండ్రు (వ్యాకరణ శాస్త్రము వారి పేర్ల జోలికి పోకుండుగాక)—ఒకనాడు ఒక నగ విషయమున తగవులాడుకొన్నారు. (లౌకికార్థము) 'నీ వెవతవే అడగడానికి'—నీ వెవతవే అడగడానికి'—'ఒసేయ్ పోవే' 'నీవే పోవే'—ఇట్లే నడచినది వారి వాగ్యుద్ధము........నేను గొన్నాళ్ళ క్రిందట తొలిసారిగా కళా పూర్ణోదయము చదువుచుండగా, మాయారంభా నిజరంభల వివాద ఘట్టము వచ్చినది—'ఒట్టుసుమీ యన్న ఒట్టుసుమీ యంచు, నేనేమి యన నేనేమి యనుచు, కానీగదే యన్న గానీగదేయంచు, నింకేల యనిన నింకేలయనుచు, పోసి పోవే యన్న పోసి పోవే అంచు, నీ వెంత అనిన, నీ వెంత అనుచు.....' అన్న పద్యము చదువగా మిక్కిలి ఆనందము కల్గినది. ఎంత బాగుగా చిత్రించినాడు కవి ఆ సన్నివేశము! అది అప్యాయముగా జదివితిని. మహాకవి శ్రీ పింగళి సూరన్న కల్పనా చాతుర్యమునకు ఆంధ్రకవిప్రపంచము, విమర్శకలోకము నివాళించినది—అంజలించినది కూడ.

శ్రీ చౌదరిగారి మొన్నటి విమర్శనలను జదివిన తర్వాత నాకు బ్రహ్మాండమైన సందేహములు కల్గినవి. రంభ స్వర్లోక వేశ్య—దానికి తెలుగు వచ్చునా? ఒకవేళ తెలుగు వచ్చినను వారి వివాదము ఇట్లే ఉండునా? వారి వివాద పద్ధతి ఏ జాతి సంప్రదాయమునకు జెందినది—ఇత్యాది. బహుశః మన తెల్గువారి వాగ్యుద్ధవ్యూహమును ఆ యిరువురి రంభలపై కవి రంజించినాడని తృప్తిపడితిని. ఏ ప్రబంధము తిరుగవేసినను ఏ కొమ్మలు తిరిగిన కవి వ్రాసినదైనను—ఇట్టివే గొడవలు. ఏమి చేయుదుము? తిక్కన నడపిన భారతము లోని వివిధ ఘట్టములు ఆంధ్ర జాతీయాముద్రతో గూడినవి. ఆ యుద్ధవ్యూహములు, మంత్రాంగము తెలుగువారివి. ఎక్కడి నిషధ దేశపురాజు—ఎక్కడి తెలుగువారు? నలదమయంతుల (క్షమించవలె—నన్నయగారి ప్రయోగమిది) వివాహమునాటి బువ్వపు బంతుల లోని పిండివంటలు, వియ్యపువారి విడ్డూరపు సరసములు, అచ్చము తెలుగువారివి. కర్త శ్రీనాథకవి సార్వభౌముడు. నిగమశర్మకు అక్క గావించిన బోధ, నడపిన తీరు నట్టిది. వీనిని జూచినచో—కవి హృదయము తత్ సంబంధి కాలాభిరుచులతో నిండినది—ఆ యా పాత్రల హృదయ దర్పణముల ప్రతిఫలించునది—అని తేలుచున్నది గదా!

2

మహా కావ్యాలు వ్రాసిన పూర్వ కవులెందరో కలరు. వారి రచనలలో అద్భుత భావముల పోహళింపులు ఎన్నియో కలవు. మన బుద్ధి కుశలతనుబట్టి ఆ యా భావములు మనకు దర్శనమిచ్చును. భాషాజ్ఞానము లేనివాడేమి అర్థము చేసికొనగలడు? ఆనందింపగలడు? భాషా జ్ఞానముండియు గ్రహణశీలత ఉండియు ఆనందింపలేని వారుందురా? అను ఎదురు ప్రశ్న రావచ్చును. ఆ తరగతివారును ఉండ వచ్చును—'తెలిసియు దెలియని నరుదెల్ప బ్రహ్మదేవుని వశమే'—అన్న సూక్తి కలదుగదా! (నరు—దెల్ప నరునకు దెల్పగా అని అర్థము. ఇది ఒక జాతి కారకము సుమా!) నిజమునకు ఏ కావ్యము అందరకు రస గ్రహణ విషయమున అందుబాటులో ఉండదు. అనగా ఏ కావ్య మును అందరిని ఆనందింపజేయజాలదని మనవి. మన రసజ్ఞత ఒక స్థితిని బొందినప్పుడే కావ్యగత నిగూఢార్థములు బోధపడునేమో! ఒకవేళ రసజ్ఞత కుంటుపడిన వానిచేతిలో కావ్య విమర్శనము జరిగినచో గొంప మునిగినట్లే—విమర్శకునిలో సహృదయత లోపించినను అంతే—కవి యొక్క భావ తీవ్రత—రూపము గొనుపట్టున దాని కనువగు శబ్దజాలము స్ఫురించి రచన సాగునేకాని—కవి 'ఈ తర గతి' వారికిని అర్థమగునట్లు వ్రాయుదునని అనుకొనడు—అనుకొనలేడు—అట్టివాడు వ్రాయలేడేమో కూడా.

భారత రామాయణము లున్నవి. అవి అర్థము చేసికొనలేకపోవుట మన లోపము. మన అర్థజ్ఞానము పెంపొందించుకొని వాని జదివి ఆనందించవలసినదేకాని, అవి ఒక మెట్టుదిగి మన గ్రహణ శక్తికి అందుబాటులోనికి రావు. సాహితీప్రియులు పూర్వ మహాకవి ప్రబంధముల నర్థము చేసికొని, అట్టి రచనలు చేయబూనుటే ప్రగతి మార్గము. అంతేకాని, భాషా స్థాయిని కుంచపరచరాదు. పూర్వ కవి మార్గముల ప్రయోగ వైచిత్రుల ననుకరింపవలెను. ఆధునిక ఫక్కికలలో మేల్మిని గ్రహింపవలెను. పూర్వ కవులలో అన్వయ క్లిష్ట తగల పద్యములు మిక్కిలిగా గలవు. (నాబోటి వానికి). అట్లని ప్రతి పద్యమును గ్లిష్టముగా నుండదుగదా! పూర్వ కావ్యములన్నియు ద్రాక్షాపాకములో నున్నవికావు........శ్రీ లన్నియు ద్రాక్షాపాకములో నున్నవికావు. శ్రీ విశ్వనాథవారి రామాయణ కల్ప వృక్షము—పూర్వ కవి మార్గదృష్ట—శబ్దార్థగత కల్పనా వైచిత్రులకు—ఆధునిక ప్రపంచ హృద్యయుంగము రచనా విశేషములకు—మూదలయ్యె నట్టిది. ఇందును అర్థముకాని పద్యము లుండినను ఉండవచ్చును. అవి లేకపోవు టెట్లు? అట్లుండుట సహజమేమో! కాని తొంబదిపాళ్ళ మృదు మధుర భావస్ఫోరకములని నా మనవి.

3

శ్రీ విశ్వనాథవారు రసనిష్యంది భావములతో పదలాలిత్యముతో బూర్వ కవితా సంప్రదాయ బద్ధముగ రచన కల్పవృక్షమున జేసినట్లని సుస్పష్టము. ఆ దివ్య భావ విలసిత రసమూర్తిని దర్శించు పట్టున విమర్శనమే చేయుచో చాల ఉదాత్తముగ నుండునుకాని ద్రుత ప్రకృతికముల చర్చతో, చిత్ర సంధుల చర్చలతో, శబ్దార్థగత దోషముల వేషములతో, బర్యవసితమగుననుటెట్లు? ఇట్లుండుట నేమనవలె? అసలట్టి దోషము లిందు లేవని తెల్పుటకే ఈ వ్యాసము. విమర్శకుల ఆపోహలను దొలగించుటయే దీని యుద్దేశ్యము. శ్రీ చౌదరిగారి పుల్లభాగితా దృక్కోణమును గొలుచుటయే ప్రస్తుత కార్యము. నన్నయభట్టు భారతాదిని 'ధర్మ శాస్త్రజ్ఞులు ధర్మ శాస్త్రంబని, అధ్యాత్మవిదులు వేదాంతమనియు, నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని, కవి వృషభులు మహా కావ్యమనియు......మహిగొని యాడుచుండ. 'సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థ యుక్తిలో నారసి మేలు'నా....తెల్గు చేసినట్లు చెప్పికొన్నాడు. తిక్కన 'ఆంధ్రావళి మోద మొంబొరయ' రచింతునన్నాడు. శ్రీ విశ్వనాథవారు 'నన్నయ్యయు దిక్కన్నయు నన్నావేశించిరి......వారలు పోయిన తెన్నున మెరుగులను దీర్చిదిద్దుచు బోదున్......అని కల్ప వృక్షమున మెరుగులను దీర్చి దిద్దుచుబోదున్........అని కల్ప వృక్షమున వ్రాసి కొన్నాడు—అత డట్టి రచనయే సేసెనో లేదో వ్యాఖ్యానింపవలసి యుండగా, వాల్మీకమునకు నది భాష్యమగునో కాదో చూడవలసియుండగా బురుష వాక్కు లేల? అట్టి రచన ద్రుత ప్రకృతిక దోష నిరూపణతో దేలిపోవునట్టిదగునా? 'ఈర్ష్య ప్రముక్కిడి కవి గూబలేద్దునేమి సరస పాథోధు లుప్పొంగు సంతతంబు'— అన్న మతము నాది.

శ్రీ మద్వాల్మీకి రామాయణమున సంతాన వాంఛా తప్యమానుడైన దశరథుని స్థితి వర్ణించు ఘట్టమును తిలకింపుడు:

తస్యత్వేవం ప్రభావస్య ధర్మజ్ఞస్య మహాత్మనః సుతార్థం తప్య మానస్య నాసీద్వంశ కరస్సుతః
చింతయానస్య తస్యైవం బుద్ధి రాసీన్మ మహాత్మనః సుతార్థం హయమేధేన కి మర్థం నయజామ్యహం
స నిశ్చితాం మతిం కృత్వా యష్టవ్యమితి బుద్ధిమాన్ మంత్రిభిః సహధర్మాత్మా సర్వైరేవ కృతాత్మభిః
తతో బ్రవీదిదం రాజా సుమంత్రం మంత్రి సత్తమం

'శీఘ్ర మానయమే సర్వాన్ గురూ స్తాన్స పురోహితాన్......'మమ లాలప్య మానస్య పుత్రార్థం నాస్తి వై సుఖం తదర్థం హయమేధేన యక్ష్యా మీతి మతిర్మమ.....

దశరథుడు భార్యలతో—

తతస్స గత్వా తాః పత్నీర్నరేంద్రో హృదయ ప్రియాః ఉవాచ 'దీక్షాం విశత యక్ష్యే హం సుతకారణాత్'

దీనితో ముగిసినది—

ఇక శ్రీ చౌదరిగారు పేర్కొన్న భాస్కర రామాయణములో—

తనకుం గుల వర్ధనులగు తనయులు జనియింపకునికి తలపోసి మనం
బున సంతాపము పొందుచు దనమది నూహించి మరియు దద్దత పొడమన్
సుతులంగానివారికి గతిలేదు ముదంబులేదు గావున నింకన్
సుతులం గనియెడు కొరకును గతివడ హయమేధమేను గావింతుదగన్—

అని యున్నది. 'తప్యమానస్య.......చింతయానస్య తస్య' అన్న ముక్కలతో ముగిసినది పుత్రవాంఛా పరితాప సూచన. శ్రీ విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షములో గధారంభమునుండియు నిరాఘాటముగా, వివిధ ఘట్టయుతముగా బ్రహ్మానంద సబ్రహ్మచారిగా, సకల కవిహంస తత్తదానంద రసస్థానీయమై నిరపాయినిగా, సమస్త మానవ జీవన సంధాయిగా, దేశకాల పాత్రా విచ్ఛిన్నముగా ప్రవహించి నవనవోన్మేషపూత భావామృత రసధునిలోని వీచికలలో ఇంత వోలలాడుచూ ముచ్చటింతము—దశరథ పుత్త్ర వాంఛా మహాత్మ్యంత ఎట్టిదో చూతము. ధరణిని న్యాయమార్గమున దన్పుచు షష్టి సహస్రవర్షముల్ పరమసుఖంబులంది నరపాలుడు ధర్మ గృహీతకామినీ పరమ సుఖంబులంది నరపాలుడు శత్రు నిబర్హణ క్రియా పరమ సుఖంబులంది నరపాలుడు తృప్తిని గాంచడింతయున్—'పరమ సుఖంబులంది' అన్నది మూడుసార్లనుటలో నతడు పొందిన సుఖముల పరిధిని విస్తృతి చేయుచున్నది. అనగా సుఖముల కరాకాష్ఠ అందినట్లు తెల్పుచున్నది. ఆ అనమాపక క్రియవలన ఏదో ఒకటి పొందలేక నిలచినట్లు, తదాకాంక్షను వ్యజ్యమానము చేయుచున్నది. చదువరి హృదయమును గధవైపునకు లాగుకొని పోవుచున్నది.

'సతుల మొగంబులం దొక విషాదపు రేఖను గాంచి ధారుణీ
పతి యిది యేమియం చడుగ బట్టడు తానును దీనవక్త్రుడై

ఆ విషాదరేఖ యెట్టిదో మరి? భార్యల నడుగజాలడు తా నందు భాగము పంచుకొను చున్నాడు.

నాలుగు కంధులన్ నడుమ నాటిన స్వీయ జయ ప్రభావతా
కా లలితంపు జాలమను క్ష్మాపతి గుండియకున్ సుఖంబు తే
జాలదు వేద వీత్యుపనిషత్పక లాగమ సారవేది భూ
పాలుని గుండియున్ నిలువ బట్టదతృప్తి యొకండు దట్టమై—

ఆ అతృప్తి అనిర్వాచ్యము !!

అనివార్లగుచు ధారణీపతి యయోధ్యావీధి నేవర్గపున్
శిశువైనన్ గనిపించినన్ నిలచి వీక్షించున్ హసించున్ గృపా
వశుడై వానిని దీసి యెత్తికొని యే భక్ష్యమ్ములో దెచ్చి యి
చ్చు సమాశ్వాసన సేయు నంతటన పుచ్చున్ దీర్ఘ నిశ్శ్వాసమున్.

అంగళ్ళలోన గ్రయ్యంబులై యుడిన శిశుశ్రేణి యాట వస్తువులు చూచి
ఏదైన గొని యింటికేగుచో దారిలో లోతెంచు నయ్యెల తొట్లుగాంచి
చిత్ర పటంబులన్ జిన్ని పిల్లలు నవ్వు చున్నట్లు వ్రాసిన యొరవు లరసి
ఎందైన బసిపిల్ల లేడ్చుచున్నట్లు వినిపించిన జెవి యొగ్గి విని చలించి
తన మహోవాంఛయెల్ల సంతాన మయముగాగ నజధారణీపతి కొన్నకొడుకు
అవని రాజ్య కార్యముల మధ్యమున గూడ దన్నె విస్మృతిగని పరధ్యానమందు—

బిడ్డలు లేని బ్రదుకు ఎంత లేబరమైనదో ఆ మహారాజ స్థితి పై పద్యముల వర్ణితము.

తనయొద్దకువచ్చి సుమంత్రుడు పల్కిన పల్కులు విని—కపోలమ్ము కేలనూది యున్నరని నేత్రంబుల భాష్పంబులురలి మంత్రీ అని పిలిచి :—

ఇడి పాత్తికల భార్య నడికట్టుతో వచ్చి యందియ బసి పాపనందు కొనగ
చిటికలో బల్కరించిన బొమ్మలో బిడ్డ బోసి నవ్వుం చిట్టి హోసుమరుగ

రా బాబు నీ విట్లు రాయని నవ్వుచు జే సాచ మార్చవ్వ శ్రీల కుబుక
గృహము చేరిన యంతనే కాళ్ళు కడ్గుమ్ము వచ్చి మోకాళ్లల బ్రాకమబ్బ
తత సుకృతమేమి చేయు దంపతులు ధాత్రి నోచుకొందురో నే నింత నోచలేదు
అల్ల కౌసల్య నోచలే దానుమిత్ర నోచలేదు—కైకేయియు నోచలేదు

ఆ దశరథుని చెప్పలేని—వ్యక్తముకాని— ఆ కోరికను ఈ మహాకవి మన హృదయముల కందించి స్పందింప జేయుచున్నాడు. సిద్ధహస్తులైన మహా కవుల కలమున రూపు రేఖలు దిద్దుకొన్నదై, సహజ లలిత భావ పరిపుష్టమై శ్రోతృ పఠితృ హృదయరంగమున దశరథరూపమున లాస్యము చేసిన ఈ కరుణరసము—రచనా పరాకాష్ఠ నందుకొన్నదని వేరే చెప్పవలెనా! ఇంటిలోని పువ్వులు—దిండ్లు, మంచములు, బొమ్మలు, ఇంద్ర నీలాదిమణులు చిలుక కొయ్యలు—ఏమి లాభము! చీకటి ముద్దలు—దివ్వియలేదట!!

ఆత్మజాడన్న తీయందనం బెఱుంగని చిత్తమ్ము తోరూపు చేదుకట్టెయట-ప్రియసుతుడన్న జాబిల్లి జూడని కన్నులు అప్రసన్న తాంధ్యంపుగూళ్ళట!! మహా ప్రతిభ గలవారుకాక, ఎవరిట్టి రచన చేయగలరు? ఇందు దోషములేమి! అన్వయ క్లిష్టతలేమి!!

'క్రయ్య'మను మాట కలదు—

'క్రయ్య స్తదర్థే—క్రేతార: క్రీయు రితి బుద్ధ్యా ఆపణే ప్రసారితం క్రయం—క్రేయ మన్యత్ క్రయణార్హ మిత్యర్థ:' కొంచెము పాటి కౌముది జ్ఞానమున్నవానికి అది సువిదితము. ఆ మాట తెలియకపోయినను బాధలేదుగదా! విమర్శకులకు 'శ, స' ల ప్రాస మేకై కూర్చున్నది. 'ఆశాపాశము తాగడున్నిడువు— అన్న పోతన్న పద్యమును అడ్డముంచి సాగిపోవచ్చును గదా!

'వాల్మీకము'లోని 'తవ్యమానస్య—చింత మానస్య' అన్న రెండు పదములకు శ్రీ విశ్వనాథవారు దాదాపు ముప్పది పద్యముల మంజీరములు గూర్చినారు. ఇట్టి ఘట్ట విశేషములు చాలఁగలవు. ఇవి రస నిష్యందిభావ్యములో మరి యేమో పెద్దలే నిర్ణయింతుర గాక! ఇక్కడ నొక బ్రహ్మాండమైన విమర్శ రావచ్చును. ఇక్ష్వాకుల కాలమునాటి దశరథు డిట్లు వాపోవునా—అనాటి దుఃఖ వర్ణన మెట్లుండునో—అన్నది!! అది శ్రీ విశ్వనాథవారినే అడుగవలసినది—జయంతి తే సుకృతినో రససిద్ధా: కవీశ్వరా: నాస్తితేషాం యశః కాయం జరా మరణజం భయం'—శ్రీ చౌదరిగారు 'మూలకథలో ఏమున్నదో అను వాదములో ఏమి జరిగినదో చూడవలసిన బాధ్యత, అక్కర పాఠకులందరికి బట్టదు' అన్నందున ఈ ఘట్టము పాఠకులకుఁ బట్టించుట య్యైనది.

1. తొలి జన్మంబున నేను బోయెతను. నాతో రాఘవాంత: పురంబులకున్ వచ్చెను పాడుజన్మ—కొడుకుల్ పోవన్ వనీ భూమి తావలె విందుంటివి బీట పెట్టుకొని—

తావలె—వృత్తియందు మాత్రమే రాయి. వర్ణములోని యువర్ణంబు లోపించు—తాపువ్వు ఇత్యాది' అని శ్రీ చౌదరిగారు తెల్పి 'తా వలె' అనుట అసాధువనిరి. వారట్లు తలచుటకు గల ఆధారము—బహువచనంబు పరం బగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు. రాలు. 'ఈ లోపంబు సమాసంబులందు జూపట్టెడు'—అన్న బాల—అచ్ఛిక—21 సూత్రము.
'రావలె' అన్నది సమాసమనియు, అందుచేతనే ఈ వర్ణంబు లోపించిన దనియు మనవి.

ఈ సూత్రమును గమనింపుడు.—

అట్లు పోలె బలె వలె శబ్దంబు లివార్థకంబులు—ఉపమేయము ప్రథమాంతమగునపుడు అట్లగుపరంబగుచో సమ మానంబులగు వానత దన్మద్యుష్మ దాత్మార్థములకు షష్ఠి యు పోలె, బలెలు పరంబులగుచో నామ తచ్ఛబ్దార్థములకు బ్రథమయు నస్మ దర్థ ప్రభృతులకు ద్వితీయయువలె పరంబగుచో నామ తచ్ఛబ్దార్థములకు షష్ఠి యు నస్మదర్థాదులకు షష్ఠి ద్వితీయల యందేదియే నొక్కటియు గ్రమంబుగ నగు........గ్రాహకము లుగక్ర మాసములు—సమాస పరిచ్ఛేదము—ప్రౌఢ 38 సూత్రము. రాతి యొక్కవలె అని విగ్రహము.

2. విందుకు-వెల్గకు—(విందునకు-' వెల్గునకు అనవలె) కువర్ణకంబు పరంబగునపుడు కార ఋకారంబులకు నగాగమం బగు అన్న బాల వ్యాకరణ సూత్ర మిట అడ్డుపడి యుండవచ్చును.
రాముని శుభ చరితంబుగ, రామాయణమున్ రచించి ప్రాచేతసుకున్—భాస్కర రామాయణము—
వంతుకు వచ్చు సత్య గరు వమ్మిక చెల్లదటంచు మానినీ—...... పారిజాతాపహరణము ప్రథమా శ్వాసం.
కమలాసన నిను వా విక్రమముకు వెల పెట్టదేవి......నిర్వచనోత్తర రామాయణము 7 అశ్వా.

3. పాలించవలె—తలంచన్ మొదలగునవి అసాధువులని శ్రీ చౌదరిగారి నిర్ణయము.
కవిత్రయేతర ప్రయోగంబులం గొన్ని యెడల అన్ ప్రత్యయాదులు పరంబులగునపుడు నకారంబు ఇంచుక్రకారంబును కేని గానంబడదు—ప్రౌఢ క్రియా పరిచ్ఛేదము 16 సూత్రముక్రింద నీయబడిన యుదాహరణ మిది.
మించుగ మా గురువులు శిక్షించిన యీ యెక్కిరింత సింగమునకు
'సూహించ నొక వాల్గ గడియల నంచారము వలయు నతని సన్నిధి చేరన్—(కళాపూర్ణోదయము 3 అశ్వాసము)

4. మోమందము—పునర్వసంతమందును—('పునర్వసువు నంతము కావలెను' అని విమర్శ) ఉ.......గోకుల మిల్లులు తప్ప కుండ లక్ష్మీ న్మతి గ్రుమ్మరున్ గడియుసేవున.........హరివంశము 5 అశ్వాసము.

దిన వెన్నెమునకు నై తనమే నగలసొమ్ము కొదుకక లచ్చింట గుదువన్నైచు—పాండురంగ—ఆ.
శిరసందం బరయున్—కళా 7 ఆశ్వా—129 ప.
అలర జేసితి నిషధరాజంతవాని–నైషధము ఇవన్నియు లోళ్లా లోకళ్ల బాడిన ప్రయోగములేగా

5. తారెక్కిన సౌమిత్రియు శ్రీరాముడు తెప్ప యమునిని చెల్లని గడచెన్—ఇది దోషమట! తెప్పయమునా నదిని దాటె ననుట లోపమా?

6. నాయనా వచ్చితివటోయి నా అనుంగ కెమ్మటంచును నుతు గొగలించె రాణి–తొడవంయి జేర్చితా వలక దువ్వి మొగమ్ము న్పృశించి, కన్నులుం గడలు కొనంగ ప్రేమ చిబుకంబును బూనుచు మోము చూచి యెప్పుడు చనుదెంచి నా విచట బుట్టినవన్ని యెరింగినావె.......
ఇది శ్రీ విశ్వనాథవారి పద్యము—'కౌసల్య భరతుని కౌగలించుకొని తొడపై చేర్చు...దట' అని శ్రీ చౌదరిగారి విమర్శ.
ఇందులోని అశ్లీలమేమిటో బోధపడలేదు. వారు తల్లియు గుమారుడును—

7. గణగణ రథనేమి నిస్వనంబులు సెలగన్ 'అనుకరణ శబ్దములను సమాసములో గూర్చుటలో అందమే లేదని' శ్రీచౌదరి గారి వినురు!....సిమ నసిమ చ్చబ్బంబుతో బుట్టునగ్గలంవుంగ్రొంబొగలోయనంగ.....మను చరిత్ర—తృతీయ 22
మిగుల జగంబు బెగ్గడిల మించె తదుద్ధత వృష్టి యుద్భుతం బగుచు ఘవా ఘవౌఘ సముదగ్గ నిరర్గళ ఘర్ఘరార్భటీ లగన ఘనోచ్చ లజ్జల జాళం జాళ నిర్ఝర జర్ఝరిభవ న్నగ
విగళచ్ఛి లాగణ ఘణం ఘణ ఘోషణ భీషణంబుగన్
ఇందలి ఘణంఘణలు, జాళం జాళలు-గ్రుక్క తిరుగని సమాసములోనివి సుమా! ఇందలి ఉద్ధతవృష్టిలోని నగ విగళచ్ఛిలా గణముల ఘణం ఘణలు గంటలు శబ్దములు కావుగదా! (గంట గణ గణ ప్రయోగునని శ్రీ చౌదరిగారి వాక్కు)

8. పదమండలి, శీర్షము చేర్చ, కైక— 'కైక పాదాంమీద భరతుడు తలను ఆనించెనట—ఆమెకున్నవే రెండు పాదాలు గదా! మండలి యతికోసమా వడి'—అని శ్రీ చౌదరి వ్యాఖ్య. నిఘంటువులో సమూహమని మాత్రమే ఉన్నది కాబోలు!! దీనిని జిత్తగింపుడు
వరణా ద్వీపవతీ తటాంచలమునన్ వ్రవ్వారి చుంభితాంబరమై సౌధ సుధాప్రభా ధవళిత ప్రాలేయ రుజ్మండలీ హరి ణంబై.......మను చరిత్రే—ప్రథమాశ్వాసే.........
ఈ మండలి కర్థమేమి?సమూహమనియా? ప్రదేశమనియా?—పై దానికి బద సమీప ప్రదేశమని భావము (పదమండలికి)

9. త్రేచునట్లుగా—ఇది అశ్లీలము అందురు శ్రీ చౌదరిగారు. ఈ పని చేసిన వారికి మనమే తృప్తిగ బెడుదుము. దశరథ మహారాజువంటివాడు భక్ష్యములు మృదురసాన్నములు పెట్టినాడట ! వారు త్రేచునట్లు తిన్నారుట! త్రేచునట్లు వారు తినగా మన కేమి బాధ?—తిన్నది శరీరమునకు బట్టుట కారంభమైనపుడు తత్సూచనగా త్రేపు వచ్చును. ఆ పని పొట్టలో జరుగునపుడు కల్గు వాయువు ఎటో ఒక వైపు పోవలెను గదా! మరి ఏమని వ్రాయుమందుర విమర్శకులు?
—తద్భిన్నముగా వ్రాసిన అశ్లీలమేమో!!

10. ఎంత ఇమిడించినను బొంగులెత్తి దిశలు—ఈ 'బొంగు లెత్తుట' అశ్లీలమట!! ద్రుత ప్రకృతికముమీది పరుషములకు సరళములగు—అన్న చిన్న సూత్రజ్ఞానములేని పతిత బొంగులని బాధ పడుటకంటె రామాయణము జోలికి పోకుండుట యే ఉత్తమముగదా! దీనికి నీ ఒడంబడితి ధర్మజ దంతయు జూచి సత్యముంబూని, వృకోద రార్జునులు బొంగులుగా బెడచేత గన్ను నీ రూనగ ఒత్తికొంచు—తిక్కన ఉద్యోగ—తృతీయ. ఈ బొంగులు కావవి!!

11. తనయుల కంత అజనకు దారి.....చిల్లిపడన్—ఇవి అశ్లీలములని. ఈ కంతులు చిల్లులు విమర్శకుల కంటబడుటలో విశేషమేమో!

12. 'ప్రారంభించిన మార్గము విడిచినచో ప్రక్రమ భంగమన్న కావ్య దోషము కల్గుననియు, చేయి తిరిగిన కవుల రచనలలో ఈ దోషములు రానే రావనియు సీ. దేవాలయములు......అన్న పద్యములో 'అయ్యె' అని మూడు చరణములలో నుపక్రమించిన రచన నాల్గవ పాదములో గానరాదు'గా మారుటచే దోషముగా మారినదని శ్రీ చౌదరిగారు అభిప్రాయపడిరి. ఈ ఉదాహరణముల చిత్తగింపుడు.

సీ. అమల సుధారమ్య హర్మ్యతలంబుల ననకుసుమామోద నందనముల
కృతకాద్రికందర..........వేదికలను కలహంస........తీరములను
రమియించుచును గామరాగాధికాసక్తి జేసి శోషించి విచిత్రవీర్యు—ఆదిపర్వము. చతుర్థ—217.

సీ. అంగనాజనుల ఉత్తుంగ సంగత కుచకుంకుమ చందన పంకములయు
వారిన........దామములయు వారిన..........నిశ్వాసములయు
వారిన పరిధాన చరు ధూపములయు విలసిత సౌరభావలులు దాల్చి.........భారత—ఆది తృతీయా 156.

ఇట్టి ప్రక్రమ భంగదోష భాక్కులు నన్నయ్యవి పెక్కులు. ఈ ప్రత్యేక పద్ధతి—నన్నయ సీసములలో గల దానిని శ్రీ విశ్వనాథవారనుకరించియుందురు. నన్నయ ఇట్టి పద్య రచనా శిల్పపు బాట త్రొక్కియే శ్రీ విశ్వనాథవారు '.......'వారలు పోయిన తెన్నునఁ బోదు' నన్నారేమో!!

13. 'లచ్చి' అని రాముడు సంబోధించుట తప్పైన అగుగాక! ఎప్పుడు తనతో గూడి మసలిన తమ్ముడు లక్ష్మణుని చిన్నప్పుడు పిల్చిన పిల్పు కావచ్చును—అది రామునికి లక్ష్మణునిపై గల వాత్సల్యము సూచించునది మాత్రము!

సీ. వక్ష స్థలిత ల్యాగంక్ష్మీ కరోద్యోగ లక్ష్మ లక్షితమూర్తి
లక్ష్మణుడు—పాండురంగ మహాత్మ్యము
ఈ లక్ష్మణకి మాట యే మందురు? భాషను భేదించుకొని వచ్చినాడే !

14. విదేహా లింద్లకున్—విదేహాలు + ఇంద్లకున్—ఇట సంధి కూర్చుట తప్పని అపశబ్ద దోషముల క్రింద శ్రీ చౌదరిగారు వ్రాసిరి. తన చెలులింద్లయం దదన త్రావుదు త్రావుచు వింటి కెన్నడున్ జనక........పాండురంగ—తృతీయ—19 పద్యము.

సీ. ఫలక గ్రహణముచే పదముల గరిమంబు
బరగె బాలకులకు గురువు లింద్ల—(గురువుః + ఇంద్ల) పాండురంగ చతుర్థ 44 వ. ఇట్టివి పెక్కు ప్రయోగములు గలవు.

ఇక శ్రీ చౌదరిగారు శ్రీ విశ్వనాథవారి కక్కుర్తి పదములుగా నిరూపించినట్టి కక్కుర్తులు పడని ఆంధ్ర మహాకవి లేడు ఇంక వైరి సమాసములన్నవి—దేశములో మిక్కిలి రూఢి కెక్కినవి (ప్రతి మేడ—ప్రతివాడు) వానిని మహా కవుల విస్మరించి వ్రాయ లేరేమో! దివవెచ్చము, కనక క్రోవి—(పాండురంగ) జీవగ్రర ప్రాణ గొడ్డము మొ. (కవిత్రయము) పెల్లుకరికి సోమనవికుప్పలు— తిప్పలు ఉన్నవి. ఆర్య వ్యవహార దృష్యంబులు గ్రాహ్యంబులని సమర్థించుకొందుము. మరి ఏమి చేయుట? శ్రీ చౌదరిగారు ఏ విషయమును ఏ దృష్టిలో దువ్వుచున్నారో గమనించియే నేను దాని సాధుతను నిరూపింపబూనుట కాని త్రోవ తప్పి వ్రాయుట లేదేమో! ఇట్టివో మన్సహము. దానికి వ్యాఖ్యతో బనిలేదేమో! 'కూన' మనుష్యజాతిపై వాడకూడదనియే వారి భాషకు అర్థము. 'పిల్లకూన' అనవలెనన్న శ్రీ చౌదరిగారి అభిప్రాయము శ్రీ చౌదరిగారు తలవని క్రొత్త అర్థములు వారి విమర్శమండి తీయవలదని మనవి. ణార్థము మారుటలేదు. భవతు, సూచ్యార్థ సూచిగా జటాయువు దశరథునికి బుత్రులు గల్గుదురనియు నీ కుమారులు గుర్తు పట్టు వారే? అనియు, ఆ ముని కుమారులను గనుదునా అనియు బల్కినది. జటాయువు యాగమునకు వచ్చినట్లు వాల్మీకములోగాని, శ్రీపాదవారి రామాయణములోగాని లేదు.

వాల్మీకములో—ఆరణ్య కాండములో—పంచవటి చేరిన రాముదులయొద్ద కది చేరగా రాముడు 'కో భవానితి.........' అన్నప్పుడు అది 'మాం విద్ధి వయస్యం పితురాత్మనః' అన్నట్లు గలదు. ('అరణ్య—చతుర్థ సర్గ') దాని నాధారముగా గొని శ్రీ విశ్వనాథ వారు ఈయాగసందర్భమున ప్రవేశపెట్టిరి. అది రసపుష్టికై శ్రీ విశ్వనాథవారు సృష్టించినట్లు భావింపవచ్చును. మిక్కిలి సముచితముగా గూడ గలదు గదా మరి! వాల్మీకమున కిట్టి నే భావ్యప్రాయము లేమో!! శ్రీ విశ్వనాథవారేమందురో, పై నా అభిప్రాయమును.

ఈర్ష్యా ద్వేషాలు...

విద్వాన్ శ్రీ కె. వెంకటరత్నం

వ్యక్తిగతమైన అవసరం మీకు ఏమీలేదుగదా? మీ వాదనలో కేవలం సాహిత్యసేవే కన్పించిందా? కులాల పేరుతో ప్రాచీ కాలమునుండి పడిన బాధ బ్రాహ్మణేతరులు కావ్యకర్తలుకారాదన్న నుడులు తలంపునకు వచ్చినపుడు కొందరు బాధపడవచ్చును. అట్టిది తెలిసియు మీ రింత నొక్కి యడుగనేల?

"భారతి ప్రసిద్ధి స్థాయి యిదివరకే పోయినది. యిప్పటి దానిస్థితి దీనినిబట్టి తెలియుచున్నది" అను మాటలు ఆవేశముతో నిందోక్తులుగా పలుకగా శ్రోతలు, పఠితలు బాధపడగా యిప్పుడు మీ రెంత సమర్థించినను సమర్థనీయములు కావు. ఇట్టి మాటలను అతి జాగరూకతతో మాట్లాడవలయును. పెడదారులు పట్టించు మాటలు నుడువరాదు. ఆ పొరపాటులు, నుడివిన వారివేయగును.

మీవి ఈర్ష్యా ద్వేషములు కావా? అది విమర్శ "అనటానికి నాటికొక పాలైన యోగ్యత కలిగివుందా?" అనియును, అనుట తోడనే తప్పుకొనుటయా! వాదానికి దిగితే ప్రయోజనం లేదని మీకు తెలిసినప్పుడు అసలు ఈ ప్రసే ఎత్తకుండ ఉండిన బాగుండెడి దేమో! యిది మీ ఈర్ష్య కాదా? మేము తమరి భాషలో చెక్క భజనగాళ్లం అనుట రెచ్చగొట్టుటా! లేక పమసిపోవునట్లు చేయుటయా? పరివారమందరి తరఫున పూరిపడు సమర్థులై యుండగా మీరే ఈర్ష్యా ద్వేషాలు లేని తీర్పు నిచ్చుట మంచిదిగదా! "ఒక రకంగా తప్పే లెండి, దుర్విమర్శకు సమాధానమేమిటి!" అంటారే అంటే వారి విమర్శ అంతా తప్పేననిగదా మీ భావము. "ఆయన ఈర్ష్యాద్వేషాలు మదింపు కట్టటానికి మీరే తగిన వారంటారే." ఇపుడు చూడగా మీరే తగినట్లు కన్పించుచున్నారే!

"తప్పులు వెదికే దురవస్థ నాకు ఘటింపజేయవద్దని మా కులదేవతలను ప్రార్థిస్తూ వుంటాను. నేను" అంటారే మీ కులదేవతల సంగతి ఏమి? ఈ ప్రసక్తి యేల? యింత బాధపడు ప్రార్థన యేల? భాషా విషయమున తప్పులు వెదకుట దురవస్థగాదు మంచి యవస్థయే సుమా! "ఆ సహృదయత్వం మీ దగ్గరతప్ప భూ నభోంతరాళాల్లో ఎక్కడా లేదనే అనుకుందాం." అంటారే ఇది మీ సౌజన్యమా!" అడుగు దవ్వులలో నుండగా మైళ్ళ దూరంగానైనా ఉదాహార్యములగునేమో చిత్తగించండని మనవి చేస్తున్నాను" అనుట యేల? అంటే కవులకు కవులకు మైళ్ళ దూరం చేయుటయే మీ భావనయై యుండవోవును.

పాత్ర పోషణము, శబ్దశుద్ధి, శబార్థగత దోషములను పరిశీలించుట యెవరికైనను తగును.

వ్యక్తిద్వేషము (కుకవినింద) మత ద్వేషము ఈర్ష్య ఆవేదనలకు త్రోవ చూపిన మహా కవులు లేరందురా? ఉండినను మనకు విరోధులు కాబోరేమో! కాని వాల్మీకి భావాలు భక్తి ప్రపూరితాలు. రామకథ వాల్మీకి నోటినుండి యుట్టిపడినది. ఆ ఋషి వాక్కులు

మహా కావ్య లక్షణ సమన్వితాలు. భాషాదేవి వాక్కులు ఆ తాపసోత్తముని నోట ముత్యములై ముద్దు లొలికినవి. రామాయణం భారతీయ గృహస్థ ధర్మాలకు ఆలవాలమైనది. ఆంధ్ర భాషా యోషకు అమూల్యాలంకరణమైనది. అట్టి రామాయణమును విశ్వనాథవారు కల్ప వృక్షము గావించిరి. ఎవరి చేతిలో బడినను మహా కావ్య లక్షణములకు లోటుఁ రాదు.

కవులకు పాక్షికబుద్ధి పరమహేయము' నా పక్షము, నీ పక్షము అనుకొనుట నిండు తనమునకు లోటు. మహాకవులలక్ష్యము విశ్వశ్రేయము.

విమర్శనములకు కోపతాపములు పనికిరావు. రామాయణ కల్పవృక్షము భూలోక కల్పవృక్షము కావలయుగదా! "ప్రమాదో ధీమతామపి" అను నుడివి పాటింపనగును. కాని బహువద లోపభూయిష్టములు మహాకవుల తీరుగాదు. "నిరంకుశాః కవయః" అనుట ననుసరించి యున్నంత నిరంకుశత్వము నిందనీయము.

సర్వ విద్యలకు వ్యాకరణమే మూల మన్నంతదాక శాసించిరి. "ప్రవాహినీదేశ్య" అవి భాషలో అవ్యవస్థ చూపరాదుగదా! నా కావ్యములో కొన్ని పొరపాట్లుండవచ్చు. వానిని నే నంగీకరించెదననుట యెంతయు సముచితము.

నేను రామాయణమును కాని, నా యితర కవిత్వముకాని వందలాది సభలలో చదివితిని. వినినవార లెవ్వరు పాషాణపాక మవ లేదు, అనలేదు సరికదా! ఆనందించినారనిరి విశ్వనాథవారు.

ఇటులనే విమర్శనములు చదివియు అనేకు లానందించుచున్నారు.

మహాకవులు వాదోప వాదముల నోడినను, గెలిచినను కీర్తిమంతులే. విమర్శకులు, కవులు సరస్వతికి ముద్దుబిడ్డలై మనుట మంచిది.

"తాటస్థ్యం చేతకానితనం"

వాఙ్మయ మహాధ్యక్ష శ్రీ ఎడ్లమూడి గోపాలకృష్ణయ్య

"శ్రీ శ్రీ మద్రామాయణ కల్పవృక్షమనదగి గోముఖవ్యాఘ్రంగా అవతరించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షంమీద శ్రీ కొత్తవారు వ్రాసిన విమర్శల విషయంలో శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు తాటస్థ్యం వహించినట్లు ప్రకటించడం, వారి సమర్థతను వెల్ల డించడంలేదు. తెలిసిన వారెవరైనా చేతకానితనంగా భావిస్తారు. తాను తప్పులు వ్రాసినట్లు శ్రీ విశ్వనాథవారే స్వయంగా అంగీకరిం చారు. కాబట్టి కొత్తవారి విమర్శలలోకి ఎక్కని దోషాలు కల్పవృక్షంలో ఇంకా ఉన్నాయని విశ్వనాథవారే అంగీకరించిన విషయం స్పష్టం. అయితే శ్రీ కొత్తవారు తప్పులంటూ చూపినవన్నీ తప్పులుకావు. ఒప్పులేనని నిరూపించుకొనడానికి అవకాశాలున్నవి కూడా. కొన్ని ఉన్నాయి. అంతమాత్రంచేత కొత్తవారు తప్పులంటూ చూపినవి అన్నీ తప్పులు కానే కావని విశ్వనాథవారూ, వారి అనుయాయులూ అన డంలో సత్యంలేదు. తప్పనిసరిగా తప్పులే అని అంగీకరించక తప్పని తప్పులు కూడా కొత్తవారు చూపించారు. "రఘువేశ్వరు గృహముల్" అన్నప్పుడు యతిభంగం జరిగిందని (కొత్తవారి సూచన ప్రకారం) విశ్వనాథవారు అంగీకరించిన విధంగానే తక్కిన తప్పులను కూడా అనోదించి ఉంటే బాగుండేది. సమర్థించుకొనడానికి అవకాశాలున్నాయిగదా అని "చిద్గగన ప్రాలేయ"ను పట్టుకొని విశ్వనాథవారు సవాలు చెయ్యడంలో గొప్పతనంలేదు. కొత్తవారు తప్పులంటూ చూపిన వాటిల్లో కొన్ని తప్పులులేనవి, కొన్ని తప్పులు కావనీ విశ్వనాథ వారు వ్రాసిఉంటే సిప్పాదాన్ని ప్రదర్శించి సత్యావిష్కరణ చేసినట్లయ్యేది. కొత్తవారు తప్పులంటూ చూపినవి అన్నీ తప్పులు కావే కావు. ఒప్పులేనని నిరూపిస్తామని ప్రతిజ్ఞలు పట్టడం ఉత్తర కుమార ప్రతిజ్ఞలు పట్టడమేగాని వేరుకాదు. తుమ్మలవారైనా, చౌదరి గారు వ్రాసిన వాటిల్లో విశ్వనాథవారు తప్పనిసరిగా సవరించుకోవలసిన దోషాలు కొన్ని ఉన్నాయని కొన్ని తప్పులు కావు ఒప్పులేనని సమ ర్థించుకొనడానికి అవకాశాలున్నాయని చెప్పివుంటే బాగుండేది. బాల వ్యాకరణాన్నిమించి భాషా విపర్యయాన్ని సైపజాలనన్న తుమ్మల వారు బాల ప్రౌఢ వ్యాకరణాలను త్రోసిపుచ్చి నన్నయ తిక్కనలనేకాదు, ప్రబంధ కవులనేకాదు, తుదకు తంజావూరు కవులను కూడా త్రోసిపుచ్చి అప ప్రయోగాలు చేసిన విశ్వనాథవారి భాషా ప్రయోగాల విషయంలోనైనా స్నేహాన్ని మరచి నిష్పక్షపాతంగా తమ అభి ప్రాయాన్ని వెల్లడించి ఉంటే సమంజసంగా ఉండేది.

సభ పెట్టిస్తే పండి అందం

శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి

[డిసెంబరు 10 సారస్వతానుబంధం నుంచి]

విమర్శకు మాత్రం ఈర్ష్యా ద్వేషాలు లేవా అని నమ్ము కొందరు ఆంధ్రపత్రికలో అడుగుతున్నారు. నాకు లేవని నేను చెబు తున్నాను. ఉండవలసిన అవసరం లేదంటున్నాను. వారిమీదే కాదు నాకు ఎవ్వరిమీదా ఈర్ష్యా ద్వేషాలు లేవు. విమర్శకుడు గారు వ్యక్తి

నింద, బ్రాహ్మణనింద, దైవనింద, మతనింద మొదలయినవి చేశారు. చేస్తే మాత్రం వారి వూసు నీకెందుకు అని అడుగుతారు. సభ పెట్టిస్తానన్నారు గాబట్టి ఆ వూసు ఎత్తవలసి వచ్చింది. సభ పెట్టిస్తే వారు చేసిన నిందలన్నీ నిరూపిస్తానని అప్పుడుగాదు ఎప్పుడూ అంటున్నాను. ఆ సభ పెట్టిస్తాను అనే మాట అనకుండా ఉంటే సంవత్సరముల తరబడి ఆయన తిట్టడమే కాకుండా, డబ్బు యిచ్చి కూడా తిట్టించినా నోరు ఎత్తేది లేదు. మరి కొత్తవారుగాని, వారి మిత్రులుగాని ఈ సభ సంగతి మళ్ళా ఎత్తరేమని?

మీకు మాత్రం ఈర్ష్యా ద్వేషాలు లేవా అని అడిగారు సరే. ఆ అడగటంలో విమర్శకుడుగారికి ఆ రెండు గుణాలు ఉన్నట్లు ఈ అడిగినవారే ఒప్పుకున్నట్లైందా లేదా? విమర్శకుడుగారి మిత్రులు ఎవరు వ్రాసినా ఈర్ష్యా ద్వేషాలు విమర్శకుడిగారికున్నాయని అంగీకరించినట్లు స్పష్టంగా కన్పడుతున్నది. సరే ఈర్ష్యా ద్వేషాలుంటే ఉన్నై. వాటిసంగతి నీ కెందుకు. ఆయన తప్పులు చూపించారు గదా వాటి మాటేమిటి అని. దానికి వారి మిత్రులే సమాధానించారు. ప్రయోగాలు చూపిస్తే మీరు కష్టపడి చూపించక్కర లేదు. పూర్వ కవులలో ఉంటేమాత్రం ఇన్ని ఉన్నాయా అని ఒక రన్నారు. మరి ఒకరు అన్నీ తప్పులు కాకపోయినా కొన్నైనా ఉన్నాయా లేదా అని అన్నారు. కాబట్టి విమర్శకుడిగారి మిత్రులు రెండంశాలు చక్కగా తేల్చి పెట్టారు. 1. విమర్శకుడిగారికి ఈర్ష్యా ద్వేషాలు ఉన్నాయి. 2. విమర్శకుడుగారు చూపించినవన్నీ తప్పులుకావు. పూర్వ కవుల్లో వీటికి ప్రయోగాలు ఉన్నమాట వాస్తవమే. ఇప్పటికి వీరు విమర్శకుడిగారి విషయంలో సమర్థించడానికి మిగిల్చుకొన్న అంశం ఏమిటంటే అంత విమర్శలోనూ కొంతైనా నిజంలేక పోతుందా అని. విమర్శయొక్క ప్రాబల్యాన్ని చూస్తే దూరాన్నించి చూచే వాళ్ళకి బలుపనిపించినా నాడి పట్టుకొని చూచిన వారికి వాపనిపించి తీరుతుందనీనే. సభ పెట్టిస్తానన్నారుగా? పెట్టించండి. పెట్టించక పోయినా మీకు మిగిలిన అంశం ఆ కొంతే కదా. పెట్టిస్తే దాని పస కూడా బయట పడుతుంది.

ఒకరు విమర్శకుడుగారు చూపించినవి అన్నీ తప్పులు కాకపోయినా కొన్నైనా ఉంటాయని ఒప్పుకుంటూనే 'కింకో పేన పూరయే'త్తన్న పద్ధతిలో ఎనిమిదో అంకంలోదిగారు. దోషయుత కల్ప వృక్షము, గోముఖ వ్యాఘ్రము, ఉత్తర కుమార ప్రజ్ఞలు ఇత్యాదిగా. ఆంధ్రపత్రిక సంపాదకుడుగారు వకటి సెలవిచ్చారు. ఒకరు తిట్టినంత మాత్రంచేత పత్రికస్థాయి పడిపోదు. పై పెచ్చు తిట్టే వారిస్థాయి తెలుస్తుందని. ఈ సూత్రం ప్రకృతానికి బాగా ఉపకరిస్తుంది. వీరు వదలి పెట్టిన మరి వక సూత్రం ఉంది. కొందరు తమకే చక్కగా అన్వయించే విశేషణాల్ని ఇతరులమీద ప్రయోగిస్తూ ఉంటారనేది. ఎవరు తిట్టినా పత్రిక స్థాయి పడిపోదనేది మాటికి నూరు పాళ్ళు నిజం. అంతేకాదు. ఎవరైనా ఎవర్నైనా తిట్టినా ఆ తిట్లు అచ్చువేసినా పత్రిక స్థాయి పడిపోదు. సరే వీరు తిట్టితే తిట్టారు. వీరికి కూడా విమర్శకుడిగారి కున్నట్టి వైయక్తిక కారణాలే ఏవో కొన్ని ఉండే ఉండవచ్చు. కొత్తే కొట్టాడు కొత్తకో కొట్టాడని ఆయన రాసిన వాటిల్లో కొన్నే తప్పులు అన్నీ కావని ఒప్పుకున్నారు. కాని ఆ కొన్ని యేమిటో సెలవియ్యలేదు. సెలవిస్తే మాత్రం నీవుచేసే దేమిటంటే సభ పెట్టిస్తానన్నారుగా. ఆ సభలో జడ్జిలకు విన్నవించుకో తగిందేమున్నా ఉంటే విన్నవించుకుందా మనీనే. అరే నా అంతవాడు చూపించిన తప్పులకు కూడా సభ గిభ ఏమిటి అని సెలవిస్తే విమర్శకుడిగారికి మళ్ళే వీరికి కూడా వక నమస్కారం చేసి వూరుకుందామని. వర్రాజ పెళ్ళిలో గుర్రాజకొక పోచన్నట్టు వూరికే కూర్చున్న ఆ సీతా రామమూర్తి చౌదరి గారికి కూడా వీరు అసమర్థత చాతకాని తనం వగైరా పదాలలో సన్మానం చేయటం చూస్తే అబ్బో! వీరికలం ఎంత ఉత్సాహంలో నడుస్తోందో వూహించటానికి కూడా వశం కాకుండా ఉంది. పాండిత్య విషయంలో ఉన్న అవస్థాత్రయంలో మూడో దశలోకి చేరుకుని ఆ సీతా రామమూర్తి చౌదరిగారివలె తపస్సు చేసుకుంటూ కూర్చున్న వారికి ప్రథమావస్థలోనే భీష్మించుకొని కూర్చున్న వీరి వాగ్వైఖరి చూస్తే విస్తుపోవసిన అవసరం ఉండదు.

విమర్శకుడుగారు బ్రాహ్మణ మిత్రులు కూడా కొంతమంది తమను మెచ్చుకున్నట్లు వ్రాశారు. వా రెంతసేపు వెనకాలే వుండి హంగు చేస్తున్నారా? కొంచెమైనా ముందుకు రావటానికి సంసిద్ధమవుతున్నారా? కనీసం విమర్శకుడుగారు వారిపేర్లైనా ప్రకటిస్తే విని సంతోషిద్దామని వుంది. ప్రకటిస్తే తుమ్మల సీతా రామమూర్తి చౌదరిగారిలాగా వారు కూడా పత్రికలో విమర్శకుడిగారి సత్య సంధతను శ్లాఘించి తీరారుగదా. విమర్శకుడిగారికి విమర్శవల్ల వచ్చిన లాభాల్లో అది మకుటా యమానంగా ఉండి తీరుతుంది. ఏమైనా సభ పెట్టించండి. పెట్టిస్తే ఉంది అందం.

సాహిత్యం: సమకాలీన పరిస్థితులు

[ఆంధ్రపత్రిక డిసెంబరు 10 సారస్వతానుబంధం నుంచి]

ఆర్యా, కవి సమ్రాట్ సత్యనారాయణ, పండిత సత్యనారాయణగార్ల సమరం ఆరంభమై ఇప్పటికి రెండునెలలు పూర్తికావస్తున్నవి. వా రిద్దరు రంగంలోంచి తప్పుకొన్నా, ఇతరులు ఈ యుద్ధాన్ని కొన సాగిస్తూనే ఉన్నారు. వారం వారం కొత్తవారు రంగంలోకి దూకుతున్నారు. ఇంకా ఇంకా దూకుతారేమో కూడాను.

అయితే మీ రెంతకాలం ఈ చర్చ సాగించదలిచారో తెలియదు. ఇలా సాగించటం వల్ల వచ్చే ప్రయోజనమేమీ ఉండదని మనవి చేస్తున్నాను. ఎందువల్లనంటే విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంమీద భారతిలో చేసిన (భారతిలో చేసిన విమర్శలు మాత్రమే సుమండీ.) విమర్శన పరిశీలన అడుగున పడిపోయి చర్చలు అడ్డ దిడ్డంగా తయారయినాయి. చర్చలలో కులవైషమ్యాలు తలెత్తుతున్నాయని చెప్పడానికి విచారిస్తున్నాను. ఇప్పటికి బ్రాహ్మణ బ్రాహ్మణేతర పూత మాత్రమేకనబడుతోంది. ముందు నియోగి వైదికీ, వెలనాటి—పాకనాటి తెంగళ, వెంగళ విభేదాలు కూడా పొడ చూపవచ్చును. ఈమాట ఎందుకన్నానంటే, నన్నయ వైదీకి శాస్త్రులని,

తిక్కన నియోగివంశులని ప్రచారంచేసే సాహిత్య సమ్రాట్టులు, చతుర్ముఖులు లేక పోలేదు. లోలోపల తిక్కన్నగారంటే అభిమానం వున్నా తాను వైదికి కాబట్టి తిక్కన్నకంటే నన్నయ గొప్పవాడని, ఇదేవిధంగా తాను నియోగివంశులుకాబట్టి తిక్కన, నన్నయ కంటే గొప్పవాడని ప్రచారం చేసిన వా రున్నారు.

పండిత సత్యనారాయణ చౌదరిగారు రామాయణ కల్పవృక్షము మీద భారతిలో వ్రాసిన విమర్శలు కొన్ని అసమంజసము అనటానికి సందేహములేదు. కొన్ని అతి కుంటిగాను, పరుషంగాను కూడా ఉన్నాయి. అయితే కొన్నింటిని మాత్రము కాదనటానికి వీలులేదు. వారు తప్పులని చూపెట్టిన ప్రయోగాలు పూర్వ కవులు చేసియుండవచ్చు. కాని వారు కూడా తప్పు చేశారనే అన్నారు కదా! అయినా ఆ మహా మహులు ఏం చేసినా తప్పుకాదు. అది వారికి చెల్లుతుందని సరి పుచ్చుకున్నారు. ఇప్పుడు అందరూ అలా చేయ వచ్చంటారా? విశ్వనాథవారు కవి సమ్రాట్టు కాబట్టి ఆయనకు ఆ స్వాతంత్ర్యము ఉందనవచ్చు. కాని తప్పు చేశారని అంగీకరించి, ఆవేదనతో గాని, ఆవేశంతోగాని అలా తప్పులు చేసారనడం వేరు. అలా తప్పులు చేయడానికి వారికి హక్కు ఉన్నదనడం వేరు.

విశ్వనాథవారు నిజంగా కవి సమ్రాట్టని, నన్నయ తిక్కనలంత మహాకవి అని అంగీకరించి అలా ప్రచారం చేసేవా రున్నారు. వారు విశ్వనాథ వారికి ఆ హక్కు ఉన్నదని అంగీకరిస్తారు. అంగీకరించవచ్చు. అలా అంగీకరించనివారు అంగీకరించరు. విశ్వనాథవారిని తప్పు పడతారు. పట్టడానికి వారికి హక్కు ఉన్నది. పండిత సత్యనారాయణగారే అలాంటి ప్రయోగం చేశారనుకోండి! అప్పుడు వూరుకుంటారా? వూరుకోరు.

........అవిరళ జపహోమతత్పరు, విపుల శబ్ద శాసను సంహితా భ్యాసు బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాన నిరతు
........సద్వినుత దాన చరితు..........నిత్య సత్యవచను మత్యమరాధిపాచార్యు సుజను........అని
సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థ యుక్తిలో నారసి మేలునా నితరు
లక్షర రమ్యత నాదరింప నానారుచిరార్థ సూక్తి నిధి నన్నయ్య భట్టు తెనుంగునన్
మహా భారత సంహితా రచనబంధురుడయ్యె జగద్ధితంబుగన్

అని నన్నయగారు భారతంలో వ్రాసుకున్నా, "అమలోదాత్త మనీష నే నుభయ కావ్య ప్రౌఢి పాటించు కబ్బమునన్ బారగు డన్" అని తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణంలో వ్రాసుకున్నా, వెనుక ఎప్పుడో చెప్పుకున్నారు కాబట్టి సరిపోయింది. అయినా అప్పుడు వారి సమకాలికులు వారిని విమర్శించలేదని ఏముంది. అప్పుడే కనుక పత్రికలుంటే, పాతపత్రికల ఫైళ్ళు తిరగేస్తే ఇప్పుడు కనబడేవి. ఈనాడైతే వారూ ఇంత విమర్శకు గురి అయ్యేవారే.

"ఈ ప్రబంధంబున కధినాథులుగానే బురుషుని బేర్కొనువాడనో యను తలంపు గూరిన మదితోన్" తిక్కనగారు "ఇంచుక నిద్రించు సమయంబున" తండ్రి కొమ్మనగారు కనబడి "ప్రస్తుతం నేను ఒక లోకవాసుణ్ణి, హరిహరనాథుని మనసు నాకు తెలుసు. ఆయన నీ భారతాన్ని కృతినందుకోవాలని మనసు పడుతున్నాడు. ఆ సంగతి నాకు తెలియజేశాడు. కాస్సేపట్లో ఆయనే స్వయంగావచ్చి నిన్ను అడుగుతాడు" అని చెప్తాడు. అలా ఇవాళ ఎవరన్నా వ్రాసుకుంటే ఎలా ఉంటుంది?

"రాజకులైక భూషణుడు, రాజమనోహరు డన్యరాజ తేజోజయశాలి శౌర్యుడు, విశుద్ధ యశశ్శరదిందు చంద్రికారాజిత సర్వలోకు డపరాజిత భూరిభుజాకృపాణ ధారాజలశాంత శాత్రవ పరాగుడు రాజమహేంద్రుడున్నతిన్" అని ఆంధ్ర మహా భారత కృతిభర్త రాజరాజనరేంద్రుని నన్నయ వర్ణించాడు. చారిత్రకంగా రాజరాజు అంతవాడు కాదని తేలినా, ఏదో వెనుక చెప్పాడు కాబట్టి సరిపోయింది. అలా ఈనాడు మన కళ్ళఎదుట కనపడే ఒక జమీందారుని గురించి చెప్పి, ఆయన కీర్తి ధర్మరాజు కీర్తి మోస్తరు "ఆ సేతు శీతనగ మధ్య ప్రదేశమున వ్యాపించిందని" వర్ణిస్తే ఎలా ఉంటుంది?

వ్యాసుడికి గణనాథుడు, తిక్కనకు గురునాథుడు వ్రాసిపెట్టినట్లు, తన తమ్ముడో, బావమరిదో, తన భార్యకు వేలు విడిచిన మేనమామకొడుకో వ్రాతప్రతి వ్రాసాడని ఎవరైనా కవిత్వం చెబితే ఏమనుకుంటారు? నట్టి "తిక్కశర్మ" అనుకుంటారు. కొందరు అనుకున్నది పైకి అంటారు. కొందరు అనరు. ఆ ఇద్దరు అనుకునేది ఒకటే.

రామాయణ కల్పవృక్షములో "అస్మద్గురుండలఘుస్వాదు.......బ్రాహ్మీమయమూర్తి"యని గురుస్తుతి చేసే సందర్భము లోనే కాకుండా, నా పోటీవాడు లేడు, ఇంకా వేయి సంవత్సరాల దాకా పుట్టడు అని వేదికలమీదకెక్కి సవ్వాళ్ళుచేస్తే మిగతావారు వారిని గూర్చి ఏమనుకోవాలి? ఏమనుకుంటారు? ఇంతకుముందు పుట్టలేదనలేదు. అంతవరకు నయమే అంటారు. ఇప్పుడున్న వారెవరూ నాకు పోలరు, నాతో సరితూగలేరు అని అందరి మొహానాకొట్టి చెప్పడమేకదా! "నా తరవాత అవధాన సామ్రాజ్య భారం స్వీకరించవలసిన వాడ"ని తిరుపతి వెంకట కవులు చెప్పిన, వేలూరి శివరామశాస్త్రిగారు, తుమ్మల సీతారామమూర్తిగారు, కాటూరి వారు, కృష్ణశాస్త్రిగారు, చెళ్లపిళ్లవారు (గురువుగారు శిష్యుని రామాయణమును చూచేపోయారు) తమకంటే తక్కువ వారనేగా చెప్పడం? అప్పుడు పెద్దలు వూరుకున్నారంటే ఇదేదో వ్యాధనో, పిచ్చిగోలనో అనుకుని ఉంటారు. అందుకనే నేడు సాగుతున్న ఈ తగాదాలో వారి తీర్పు అంగీకరిస్తామని చెప్పినా, వారు తాటస్థ్యం, మౌనంవహించారు. అది తెలిసే కవి సమ్రాట్టుగారు వారి పేర్లు సూచించిఉంటారు. పైగా వారి పక్షాన యుద్ధానికి దూకే దండు వారికి లేదాయె. కాని కుర్రాళ్ళు అలా వూరుకుంటారా? రాళ్ళు వేస్తారు. అది తప్పే కావచ్చు. కాని తప్పదు. వారిని సరైన మార్గంలో ఎదుర్కోవచ్చు. అంతేకాని, వారికి కవిత్వం రాదనీ, కవిత్వంఅంటే ఏమిటో తెలియదని అనడం తప్పు. శ్రీ చౌదరిగారి విమర్శ తక్కువ రకం దనుకుంటే, ఆయనను విమర్శించడం తక్కువ రకంగా ఉండ నక్కరలేదు. అలా ఉంటే ఉభయుల తక్కువతనం వెల్లడవుతుంది.

అసలు చర్చ ఇంత రభసగాను, రగడగాను తయారవడానికి రామాయణ కల్ప వృక్ష విమర్శ నిమిత్తం మాత్రముయుందికాని, అసలు ఈ కచ్చకు మూలకందము వేరే ఉన్నది. అది విశ్వనాథవారుచేసే ప్రసంగాలు, వారి శిష్యులుచేసేప్రచారము, సాహిత్యరంగంలో వారంటే ఉన్న ప్రాతికూల్యం, దాలిగుంటలో నిప్పులాగ ఇన్నాళ్ళు రాజుకుంటూ, రాజుకుంటూ ఉంది. అది ఇవ్వాళ భగ్గుమని లేచింది.

విశ్వనాథవారు నన్నయ, తిక్కనలతో సమానులేకాక, వారికంటె కూడా ఘనులని వారి శిష్యకోటిలో కొందరు ప్రచారం సాగిస్తూ వచ్చారు. ఎవరన్నా కాదంటే కొట్టడానికి వస్తారు. విశ్వనాథవారు కూడా స్వయంగా అది నమ్ముతారు. "కల్పవృక్ష" అవతారిక చదివితే ఇది ద్యోతకమవుతుంది. దానిని వ్రాయడానికి కూడా మూలం ఈ భావనే అని నా నమ్మకం. కవిత్రయంవారు భారతాన్ని స్వతంత్రంగా అనువదించారు. వారెందుకో రామాయణాన్ని అనువదించలేదు. ఎర్రనగారు వ్రాసినా, అది ఇంతవరకూ కనపడలేదు. ఇతరుల రామాయణాలు భారతంతో సమానమైన ప్రసిద్ధికి రాలేదు. అందుకని విశ్వనాథవారు రామాయణ కల్పవృక్ష రచన చేసారు. కల్పవృక్షం మహాభారతంతోటి సమానంగా పక్కపీటమీద కూర్చోవాలనుకున్నారు. అనుకోవటమేకాదు. కూర్చొనబడని త్రికరణశుద్ధిగా నమ్మారు. ఆ భావనలో మునిగిపోయారు. ఆ భావన జీవుని వేదనగా తయారయింది. కాబట్టి రామాయణాన్ని ఎవరైనా విమర్శిస్తే, వారి కంఠాఇంతా కాని ఉద్రేకము వస్తుంది.

రాజరాజనరేంద్రుడు తన కుల బ్రాహ్మణుడైన నన్నయ్యను భారతం వ్రాయమన్నాడు. దాని కృతిభర్త అయినాడు. విశ్వనాథ వారు బాలకాండము పూర్తిచేసి, అయోధ్య మొదలుపెట్టి, "గ్రంథప్రకటన గత విషణ్ణచేతమ్కుండనై, యలసుండనై యుండ" ముక్త్యాల యువరాజాగారు తమ తండ్రికి అంకితమిస్తే అచ్చు ఖర్చులు ఇస్తారని చెప్పారు. వీరు, తమ తండ్రి శోభనాద్రిగారు ఇదివరకే ఈశ్వరున కంకితమిచ్చారు. కాబట్టి వీలు లేదన్నారు. తిక్కనగారు హరిహరనాథునికి అంకితమిచ్చినట్లు, విశ్వనాథవారు నందమూరు నివాసుడైన విశ్వేశ్వరునికి ఇచ్చారు. అయితే వైశంపాయనుడు జనమేజయునకు భారతముచెప్పినట్లు తన తండ్రికి రామాయణము చెప్పి వచ్చును. వారి కోర్కెయు తీరునని సరే నన్నారు. విశ్వనాథవారు నన్నయ, తిక్కనలు నన్నావేశించారు. వారలు పోయిన తెన్నున మెరుగులు దిద్దుచు బోదున్ అన్నారు. మరి ఎర్రన గారెందుకు ఆవేశించలేదో! బహుశా ఆయన రామాయణం వ్రాయడం మూలానేమో!

నన్నయ, తిక్కనల కాలంలోవలె నేడు వ్రాసి, మాట్లాడి ఏమి లాభం? దాన్ని హర్షించమంటే ఎవరు హర్షిస్తారు? వెనక్కు వెళ్ళి వారి ప్రక్కన కూర్చోవాలన్న తాపత్రయం లేకపోతే నేడు తన పీట అందరి పీటకన్నా పెద్దది అయిఉండేది. కేవలం కవిగా నన్నయ తిక్కనలతో సరితూగాలన్న వాంఛ ఉన్నా ఇబ్బందిలేదు. కాని వారు (నన్నయ, తిక్కనలు) ఉద్ధరించదలచిన వైదిక ధర్మాన్ని ఉద్ధరించాలన్న ఆయన ప్రయత్నం, ఆయన కవితా ప్రతిభను రాణింపుకు రాకుండా దెబ్బ కొడుతున్నది. వారి వైదిక ధర్మ పునరుద్ధరణ ప్రయత్న భారం వహించకపోతే, వారి కవిత్వస్థాయి, స్థానము రాదనుకున్నారేమో? అప్పటికీ, ఇప్పటికీ ప్రపంచంలో జరిగిన Events, అవి తీసుకొచ్చిన మార్పుల ప్రభావాన్ని ఆయన గమనించక, గ్రహించక తిరస్కరిస్తున్నారు. నన్నయ, తిక్కనల ప్రతిభ ఉన్నా, వారికి వారి స్థానమురాదు. వారి స్థానం సాహిత్య చరిత్ర క్రమంలో వచ్చిందని కూడా గమనించాలి. ఈ సందర్భంలో జాన్ స్ట్రాచీ అన్న ఈ క్రింది మాటలు గమనించడం మంచిది.

"When one criticises the theories of great men in the light of history, one is not pretending that one is more important person than they are; after all one has the inestimable advantage of hindsight. It was Bernard Shaw who said about Shakespeare "Shakespeare is taller than I am, but I am standing on his shoulders." In a sense we are all standing on the shoulders of the social theorists of fifty years ago, because we know what happened since and we can compare what they said was going to happen with what actually happened.

అలాగే విశ్వనాథవారు నన్నయ, తిక్కనల భుజాలమీదఉన్నా ప్రయోజనం లేకపోయింది. ఈ నన్నయ, తిక్కనలే ఈనాడుంటే విశ్వనాథవారి పంథా అవలంబించేవారా?

తాము, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి చెప్పేవి ఒకటేనని, తాము చెప్పిన వాటికి కోపం దేనికని అన్నారు. వారిద్దరు తాము చెప్పినట్లు చెప్పారా? అంతేకాదు. వారిద్దరిలో ఒకరు పరమహంస, రెండవవారు మహర్షి. ఆ రెంటిలో ఏదో ఒకటి అయితేనే వారు చెప్పే మాటలకు విలువ ఉంటుంది. పైగా తాము బ్రహ్మమయమూర్తుల మనుకొన్నప్పుడు, మనుష్యులను అయినపుడు సమకాలీములపై కాలు దువ్వనక్కరలేదు. వారి రచనలను దుయ్యబట్టనక్కరలేదు. వారి విమర్శలను లెక్కచేయ నక్కరలేదు.

అంతేకాదు. సాంప్రదాయాన్ని సాంప్రదాయమని కొలువ కూడదు. నేను సాంప్రదాయ రక్షకుడనని, ఉద్ధారకుడనని కేకలు వేస్తే ఏం లాభం? వెనుకటి వారిమీదనున్న భక్తి గౌరవాలు చూపించడమంటే నేటి సిద్ధాంతాలనుగాని, శాస్త్రజ్ఞులనుగాని, తత్వజ్ఞులనుగాని, తెగడటమేననే మతానికి దోహదీయకూడదు. ఇక్కడ స్వామి వివేకానంద వ్రాసిన మాటలు మననం చేసికొనడం మంచిది:

"Among Hindu scholars there is a particularly tenacious notion, pleasant to the traditionalist no doubt, but distressing to the analytical intellect, that a philosophy gathers merit with age, that what is old is also better. Thus Aristotle is better than our contemporary philosophers because he is older. I suspect that excessive patriarchalism is in part to blame for this insidious nonsence. The Hindu philosopher teaching occidental philosophy inevitably feels as a Hindu until he makes an effort not to do so at least in the pursuit of his job. But as a person he cannot reconcile himself to the possibility that a Russell may be more intelligent logician than Sankaracharya or that C. J. Jung may know more about human mind than Patanjali".

విశ్వనాథవారు ఈ తెగకు చెందినవారు. రూపాయిఇస్తే సంతోషపడివెళ్లే ఘనాపాటి, పట్టభద్రులందరికంటె ఘనుడంటారు. ఆ ఘనపాటి వేదార్థం చెప్పేవాడయితే అలా మెచ్చుకున్నా అర్థం వుంటుంది. కాని వట్టి ఘనాపాటి, పావలాకు మూర్‌మార్కెట్‌లో దొరికే Second hand గ్రామఫోను రికార్డుకన్నా ప్రయోజనకారికాడు.

అన్య దేశీయులలో కూడా కవులూ, మహామహులైన మేధావులు ఉన్నారనే సంగతిని(చదువుకుండానే) మన సనాతన ధర్మ పరాయణులు గుర్తించరు. ఏదో ఒక సందర్భంలో శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు చెళ్లపిళ్లకవికి షెల్లీ ఎపిసైకాడియన్ వినిపించి అర్థం చెప్పారట. అంతా విని వాళ్ళలో కూడా బాగా కవిత్వం వ్రాసేవారున్నారే అన్నారట కవిసామ్రాట్ గురువు.

అన్ని దేశాలు కలసి ఒక సమాఖ్యగా ఏర్పడక తప్పదన్న భావం మానవకోటి మనస్సులో గట్టిగా నాటుకుంటోంది. సాంకేతిక శాస్త్రము అభివృద్ధి అలా ఏకీభవించడం తప్పనిసరి అని వప్పిస్తోంది. అలాంటప్పుడు అన్ని జాతుల, అన్ని సంస్కృతుల జ్ఞాన సంపదను తరచి అందరిని దగ్గరకు తెచ్చే విశ్వ సంస్కృతిని ప్రపంచాని కివ్వటానికి పెద్దలందరూ ప్రయత్నించాలి. ఇతర దేశాల వేదాంతాలలో ఏమీలేదని ఈసడించడం తప్పు. కాశీలో సంస్కృత విశ్వ విద్యాలయాలలో వేదాంతశాఖ అధ్యక్షుడు పండిత రామచంద్ర దీక్షితులు కాంట్ సిద్ధాంతాలు తెలిసికోవాలని ఇంగ్లీషు నేర్చుకున్నారట. పండిత లక్ష్మణశాస్త్రి తారక తీర్థగారు భారతదేశంలో మహా పండితుల్లో ఒకరు. హెగెల్, మార్క్సు సిద్ధాంతాలని తెలిసికోవాలని ఇంగ్లీషు నేర్చుకున్నారు. విశ్వనాథవారి సిద్ధాంతాలని గురించి ప్రస్తుతం చెప్పడం అప్రస్తుతం కావచ్చు. అందుకు క్షంతవ్యుణ్ణి.

శ్రీ చౌదరిగారు పండితులు, కవులు. విశ్వనాథవారు కొంతకాలం పనిచేసినట్టే వీరూ ఇప్పుడు కళాశాలలో పండితులుగా పని చేస్తున్నారు. కాబట్టి ఆయన విమర్శలు దురుసుగాను, పౌరుషంగాను ఉంటే ఆయన విమర్శ విలువ, ఆయన ప్రతిష్ఠ ఎవ్వరేమీ అనకుండానే దిగజారిపోతాయి. పాఠకలోకం దృష్టిలో పడిపోతారు. విమర్శ ఎలా ఉండాలి అని చెప్పబోవటం కవిత్వం ఎలా ఉండాలీ అని చెప్పబోయినట్లే ఉంటుంది.

ఇలా వ్రాయడంవల్ల విశ్వనాథవారి ప్రతిపక్షంవాడినని, చౌదరిగారిని సమర్థిస్తున్నానని అనుకోనక్కరలేదు. నిజానికి నేను చెక్క భజనగాళ్ళలో ఒకడిని కాకపోయినా, ధూళిపాళవారు చెప్పిన 500 మంది దండులో ఒకణ్ణి కాకపోయినా, విశ్వనాథవారంటే నేడు తెలుగునాటిలో సాటిలేని కవి అని మనసారా నమ్మేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు ఆయన పద్యాలు అత్యద్భుతంగా ఉంటాయి. సాహిత్యమున్నంతకాలం శాశ్వతంగా ఉంటాయి. కాని సాంఘికంగాను, చారిత్రకంగాను, ఆయన ప్రతిపాదించే ప్రచారంచేసే సిద్ధాంతాలు వట్టి చెత్త అని నా అభిప్రాయం.

ఈ అదను చూచుకొని ఎవరిష్టం వచ్చినట్లు వారు వ్రాస్తున్నారు. నేనూ అలా చేసి యుండవచ్చు. క్షమించండి. ఇది ఇంకా హద్దుమీరిపోయే ప్రమాదం కనిపిస్తోంది. సాహిత్య రంగంలో సామరస్యం కలిగే అవకాశం కనుచూపు మేరలో కన్పించటంలేదు. ఇంతవరకు జరిగిన రభస, సంఘర్షణ చాలు. ఈ చర్చను ఇంతటితో ఆపండి మహాశయా! ఆపండి. మీరూ, మీ పూర్వులు తరిస్తారు. ఈ సత్యనారాయణల యుద్ధంలో 'భారతి'కి కూడా నాలుగు చకారగుళ్ళు తగిలాయనుకోండి. (పత్రికల వారికిది నిత్యానుభవం) అందుకని మన కెందుకురా ఈ తద్దినం అని ముందు ముందు కవి సామ్రాట్టుగారి రచనలుగాని, పండిత సత్యనారాయణచౌదరిగారి రచనలుగాని "భారతి"లో వేయడం మానుకుంటారేమో. అలా మానకండి.

స. ధర్మారావు.

కొన్ని లేఖలు

[అక్టోబరు 28 వ తేదీ ఆంధ్రపత్రికలో ప్రచురించిన కొన్ని లేఖలు]

'భారతి'పై విమర్శ సకుచితం

ఆర్యా, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు మద్రాసులో తమ సన్మాన సందర్భములో చెప్పిన మాటలు సమంజసముగా లేవు. తమ గ్రంథములమీద విమర్శను "భారతి" పత్రిక ప్రచురించిన మాత్రమున "భారతి" స్థాయి దిగజారిపోయినదని బహిరంగముగా మాట్లాడడము భావ్యముకాదు. 30 సంవత్సరాలకు పైబడి అనేక వ్యయ ప్రయాసలకు లోబడి ఈనాటివరకూ సాహిత్యసేవ చేస్తున్న "భారతి"ని, విశ్వనాథవారు తన పుస్తకములపై విమర్శను ప్రచురించినందువల్ల ఆపత్రిక స్థాయి దిగజారిపోయిందని సాహిత్యసేవచేస్తున్న 'భారతి'ని, విశ్వనాథవారు తన పుస్తకములపై విమర్శను ప్రచురించినందువల్ల ఆపత్రికస్థాయి దిగజారిపోయిందని అనడము వారి సంకుచిత స్వభావమును తెలియపరుస్తున్నది. చాతనైతే విమర్శకు ప్రతి విమర్శచేసి తన గొప్పతనము నిరూపించుకుంటే వారికి గౌరవము. కాని సరస్వతిమీద, కన్న బిడ్డలమీద ప్రమాణాలు చేయడం ఎవరూ కూడ క్షమించరాని నేరము.

మోచర్ల కౌస్తుభమణి.

భారతిపై విసుర్లు

ఆర్యా, మద్రాసులో తమ సన్మాన సభలో కవి సామ్రాట్‌లు "భారతి" పై విసరిన విసుర్లు వారిహోదాకూ, సాండిత్యానికీ దగ్గావైశ్యానికి తగినవి కాకపోగా కళంకదాయకముగా వున్నవి. తమపై గౌరవాభిమానము లున్నవారు తమను సన్మానించిన సందర్భము

కాబట్టి తామేమి మాట్లాడినా సభలోనివారు చప్పట్లు చరిచియుందురేమో? కాని అంత మాత్రమున వారి ప్రవచనములు సకల సాధుజన సమ్మతములు కాజాలవు. ఎంత పెద్దవారైనా అవాలోచితంగా జీవితంలో మాట్లాడడం ప్రకృతి సహజమేమో? ఈసందర్భంలో ఈ క్రింది పద్యము కవిసామ్రాట్టులవట్ల కూడా ముమ్మాటికి వర్తించును, అని భావించుచున్నాము.

"తమకు సహించునట్టిది, యదార్థము, ధర్మము సత్యమంచుమున్
దమకు సహించనట్టి దయదార్థ, మధర్మ మసత్య మంచు న
త్తమ పదవుల్ లభించగ, సదంబడి గర్వించెక్కి, వెక్కి నిత్యము
ప్రలపింతు రేరలను, దారికి తెమ్మికన్నైన—భారతీ"

జి. వి కె. యస్. మూర్తి.

శ్రీ కొత్తా వారి మరపు

ఆర్యా, విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షము విమర్శలకు కూడ కల్పవృక్షమైనది. విశ్వనాథవారికి సమాధానము వ్రాయుచు కొత్త సత్యనారాయణచౌదరిగారు (ఆ. ప. 23—10—61) "అపర పరశురాముడైన 'గాడ్సే' వంటి సహాసవంశములో మేము పుట్టలేద"ని సెలవిచ్చినారు. గాడ్సేకు వీ రిచ్చిన 'అపర పరశురాముడను' బిరుదము సమంజసముగాలేదు. జగత్కళ్యాణ సంధాయకుడైన శ్రీ మహావిష్ణువుయొక్క ఆరవ అవతారమూర్తియయిన పరశురాము డెక్కడ? గాడ్సే యెక్కడ? పరశురాము 'దాని పురుష మూర్తి' 'జయరేఖ రాముడ' రాముడు. జగత్కంటకులై దుష్కృత్యాలు చేయుచున్న దుర్మార్గులను సంహరించి ధర్మ సంస్థాపనము చేయుట కవతరించిన శ్రీ మహావిష్ణువునకును 'మహాత్ముని పిస్తోలుతో కాల్చి పొట్టన పెట్టుకొన్న గాడ్సే'కు పోలిక యెక్కడిది? 'ప్రమాదో ధీమతామపి' యని ప్రమాదవశమున మరచినారు కాబోలు చౌదరిగారు!

వి. శాస్త్రి.

సవాలు సముచితం

ఆర్యా, శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరిగారు ఆంధ్ర పత్రికా ముఖమున ధైర్య సాహసోపేతమైన సవాలును 22—10—61 న ప్రకటించి పండిత, పండితాభిమానుల సంభ్రమాశ్చర్య సంతోషాన్వితులనుగా జేసినారు. సహేతుకమును, సమంజసమునునైన చౌదరిగారి సవాలును శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు సంతోష పూర్వకముగా స్వీకరించి, సభాస్థల, కాల నిర్ణయాదుల సత్వరమే ప్రకటించి భాషాభిలాషులకు సదవకాశమును కలిగింపగలరని ఆశించుచున్నాను.

నాడిప్రవీణ అలపాటి వరదయ్య.

ఇంతటితో సమాప్తి

విశ్వనాథరామాయణ కల్పవృక్షంపై సాగుతున్న చర్చ ఆరంభమై దాదాపు రెండునెలలు కావస్తోంది. చర్చ చప్పబడటమే కాకుండా గిడసబారింది. ఇక దాన్ని నిల్పండి అని పాఠకులు అనేక మంది సూచించారు. దీని నింకా సాగించడంవల్ల ప్రయోజనం సున్న అన్నారు. మాకూ అలానే అనిపించింది. అందుకని ఈ చర్చ ఇంతటితో ముగిస్తున్నాము.

ఇటీవల ఈమధ్య సాహిత్య వర్గాలలో ఎప్పుడూ దేనిమీనా ఇంత తీవ్రమైన చర్చ జరగలేదు. చర్చలో అప్పుడప్పుడు సాహిత్య విషయానికి దూరమైన విషయాలు దొర్లినాయి.

ఈ చర్చ సందర్భంలో స్వాభావికంగా వచ్చే ఆవేశంవల్ల తెలియకుండా దొర్లినవని మా విశ్వాసం. అవి ఎవరూ మనస్సులో ఉంచుకోరనీ, తక్షణం మరచిపోతారనే మా నమ్మకం.

అనేక మంది చర్చాంశముపై వ్యాసాలు పంపారు. కాని వాటన్నిటినీ ప్రచురించలేకపోయినందుకు విచారిస్తున్నాము. వారి వాదన పార్శ్యం కూడా కాదు. రెండు పక్షాల వాదాలకు సమాన స్థానమిచ్చామని మా నమ్మకం.

10-12-61 —సంపాదకుడు

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor: S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	150/-	125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	125/-	100/-
అర్ధ పేజి	...	65/-	55/-
పావు పేజి	...	40/-	35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సంIIనకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-0-0
6 మాసముల చందా	...	రు. 6-0-0
విడి ప్రతి	...	రు. 1-0-0

మేనేజరు, భారతి,

మద్రాసు-1.